
శ్రీ మాలోల గ్రంథమాల

పందొమ్మిదవ పుష్పము

శ్రీ వేదాంత దేశికులు అనుగ్రహించిన

దయా శతకము

(అమృతా స్వాదినీ వ్యాఖ్యా సహితము)



వ్యాఖ్యాత

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు



శ్రీ స్వామి దేశికన్



శ్రీ అహోబిల మఠం 44వ పీఠాధిపతులు
శ్రీ వణ్ శఠకోప శ్రీ వేదాంత దేశిక యతీన్ద్ర మహాదేశికుల వారు



శ్రీ మదహోబిల మఠం 45వ పీఠాధిపతులు
శ్రీ లక్ష్మీనృసింహ దివ్యపాదుకా సేవా
శ్రీవణ్ శఠకోప శ్రీ నారాయణ యతీన్ద్ర మహాదేశికుల వారు



Srimate Sri Lakshminrisimha Parabrahmane Nama://
Srimate Sri Lakshminrisimha Divyapadhukasevaka Srivan Satakopa
Sri Narayana Yatheendhra Mahadesikaya Nama: //



Srimukham

What constitutes the central theme of Srivaishnavism is the doctrine of Vishnu as *Paratatatva* (the Supreme Being).Variously known as Isvara, Vishnu, Vasudava, Narayana – all point to the same Brahman – ie the Supreme Being. This ultimate Reality is Jagarkarana, Satyam, Jnanam and Anantam. Blissful in nature and free from all defects, this Reality is endowed with numerous attributes of unsurpassable excellence. Now Bhagavan is another term used to denote this Brahman.The word "Bhagavan according to Ahirbhudhynya Samhita explains how this term Bhagavan implies the essential characteristics of the Supreme Being. One who has Dhanam (wealth) is known as Dhanavan. One who has virtues is known as Gunavan. Likewise one who has Bhaga is Bhagavan. This word Bhaga has several connotations and one among them significantly is that this Parabrahma is endowed with six attributes, viz., Jnana (Knowledge), Sakhti (power), Bala (strength), Aiswarya (Lordship), Virya (virility), and Tejas (splendour) and He is also free from all defects. This Supreme Reality has also several other secondary auspicious attributes Yet Bhagavan is also the impelling force for undertaking the cosmic functions of creation, for His incarnations as the human and other living beings and for showering His grace on the devotees. Now Daya, Krupa, or Karunya – all meaning the same word - compassion is

defined by Vedanta Desika as the desire to remove the sorrows of others. It is the unbearability of the suffering of others without any selfish interest. Daya has special significance on the concept of grace (anugraha) because it is out of compassion that the Lord showers His grace on the devotees.

Vedanta Desika - verily the Gantavathara of the Lord of Tirumala, therefore, rightly chose this quality of Daya to extol Srinivasa. Calling Balaji as the personification of compassion, he composed one and hundred and eight beautiful verses on the karunya of Venkateshwara. He glorifies it to such an extent that all other qualities without Daya are regarded as defective. Perhaps Vedanta Desika took the cue from Nammazhwr who speaking of Tirumala said, "That Benevolent Lord who saved the cows and cowherds from torrential rain by uplifting the Goverdhana Hill, who in the past measured the entire universe by His three steps, has come down from His eternal abode to reside in Tiruvengadam Hill." It is the view of Swami Desika that Tirumala is the place where Srinivasa resides for the purpose of offering His grace to the devotees. It is the centre where the glory of God is exhibited and by worshipping Him one can overcome the mundane and the bondage.

Srimad Azgagiyasingar, the 45th Jeeyar is pleased to know that Sri Ub.ve. K.V.Raghavacharyulu Swami has written a Telugu commentary on this famous Dayasatakam of Vendanta Desika. Sri Raghavacharyulu Swami is an ardent sishya of our Muth and has to his credit several books on our religion and philosophy. His works have been avidly read and the present book adds to his scholarly eminence. His son Sriman Ramana Chari IAS is an outstanding administrator apart from being a man great spiritual outlook. Srimad Azhagiyasingar is glad to know that our Hyderabad Muth has undertaken this publication. May Lord Lakshminarasimha and Lord Venkateshwara shower their grace on them all and may they continue to do more and more for the benefit of the society.

Pazhaveri Chakravarthy Sathakopachariar
Ghananpaati - Nyaya Vedanta Siromani
Sri Sannadi - Sri Karyam



శ్రీ మదహోబిల మఠం 46వ పీఠాధిపతులు
శ్రీవణ్ శఠకోప శ్రీ రంగనాథ యతీన్ద్ర మహాదేశికుల వారు



Srimate Lakshmi Nrsimha Parabrahmane Nama:

Srimate Sreee Lakshmi Nrsimha Divya Paduka Sevaka Sreevan Satakopa Sree Narayana Yatindra Maha Desikaya Nama:



Srimukham

According to Visishtadvaita philosophy, Sriman Narayanan is the ultimate Reality, known as Purushottama, the Supreme Personal Being. He possesses countless auspicious attributes of unique excellence and He is totally free from imperfections. His essential attributes exhibit the supremacy of God as also His other attributes are the natural qualities (kalyana gunas) of the Lord useful for the devotees seeking protection from Him. Upanishadic texts and other scriptures elaborate these traits. Puranas and Pancharatra texts are there to elucidate the Upanishadic thoughts. Azhwars who delved deep into the mystic devotion, have glorified these attributes of God through their own blissful experience.

Based on the above authorities, Bhagawad Ramanuja listed some of the super qualities of the ultimate Reality in beautiful slokas and as his great follower, Vedanta Desika too has enumerated the Lord's auspicious attributes. Like Azhwars, Swami Desikan too had the privilege of getting Lord Venkateshwara's grace in abundance and we are, therefore, fortunate to have Dayasatakam that highlights Daya - the compassion of the Lord that attracts numerous devotees to seek His grace. We are pleased to know that Sri Ub.ve. K.V.Raghavacharyulu Swami of Hyderabad has given a good vyakyanam in Telugu to this Dayastakam of Vedanta Desikan. He is a scholar of great merit and his presentation of the interpretations, we have no doubt, will immensely benefit the readers. We pray to Sri Malolan to bestow on him sound health and prosperity. May he continue to delight us with many more publications.

Srivan Satagopa Sri Ranganatha Yateendra Mahadesikan
H.H.the 46th Jeeyar of Sri Ahobila Muth

||श्रीः||

Srimathe Rangaramanuja Mahadesikaya Namaha
Srimathe Srinivasa Ramanuja Mahadesikaya Namaha
Srimathe Vedantha Ramanuja Mahadesikaya Namaha
Srimathe Ranganatha Mahadesikaya Namaha

Srimathe Srinivasa Mahadesikaya Namaha
Srimathe Nigamantha Mahadesikaya Namaha
Srimathe Bhghawathe Bashyakaraya Mahadesikaya Namaha
Srimathe Ranganatha Divyamani Padukabyam Namaha

Srirangam Srimad Andavan Ashramam

భాగ్యనగరము
2/3/2010



HH Srimushnam Srimad Andavan
Ranga Ramanuja Maha Desikan

శ్రీ.ఉ.వే. రాఘవాచార్యులు గారు గొప్ప వైభవము గల్గిన పండిత ప్రకాండులు. వీరియొక్క వ్యాఖ్యాన శైలి ఆహ్లాదకరంబై ఉన్నది విశేషమే. తమంతటతాము రసికులు కనుక తమ కృతిచేత అందరిని రసికులుగా చేయుట యందు రాజిల్లువారే. శ్రీ పాదుకా సహస్రమనంబడు గొప్ప గ్రంథాన్ని తమ వ్యాఖ్యానము చేత తెనుగు వారి తలంపులో ఉండేటట్టు చేసిన అలంకర్మీణులు. ఇప్పుడు దయా శతక వ్యాఖ్యోదయం చేత అందరికి ఆనందము అందునట్లు తగిన కృషిని చేసి యున్నారు. వీరియొక్క వ్యాఖ్యానమందు వెలిగే విశేషము ఏమనగా శాస్త్రీయ పద్ధతిని సరసముగా పొందియుండుటయే. అందువలన సాహిత్య రసాన్ని రసించడానికి ఆశించేవారు ఈ పుస్తకాన్ని చేకొని చదివి రసభరిత చిత్తులు కావలయునని ఆశాసించి నారాయణ స్మృతి చేయుచున్నారము.

ఇట్లు
శ్రీ రంగరామానుజ యతి:

Phone : 0821-2422536



ಶ್ರೀ ಬ್ರಹ್ಮತಂತ್ರ ಸ್ವತಂತ್ರ ಪರಕಾಲಸ್ವಾಮಿ ಮಠ
ಕೃಷ್ಣವಿಲಾಸ ರಸ್ತೆ (ಜಗನ್ಮೋಹನ ಅರಮನೆ ಸಮೀಪ),ದೇವರಾಜ ಮೊಹಲ್ಲಾ,
ಮೈಸೂರು - 570 024.

SRI BRAHMATANTRA SWATANTRA PARAKALA SWAMY MUTT

Krishnavilasa Road (Near J. M .Palace), Devaraja Mohalla, Mysore - 570 024. Karnataka State, INDIA

ಶ್ರೀ ಲಕ್ಷ್ಮೀಹಯವದನ ಲಕ್ಷ್ಮೀ ನಾರಾಯಣಾಭ್ಯಾಂ ನಮಃ
ಶ್ರೀಮತೇ ರಾಮಾನುಜಾಯ ನಮಃ
ಶ್ರೀಮತೇ ನಿಗಮಾಂತ ಮಹಾದೇಶಿಕಾಯ ನಮಃ
ಶ್ರೀ ಬ್ರಹ್ಮತಂತ್ರ ಸ್ವತಂತ್ರ ಪರಕಾಲ ಗುರು ಪರಂಪರಾಯೈ ನಮಃ

Sree Lakshmi Hayavadana Lakshmi Narayanabhyam Namaha
Sreemathe Ramanujaya Namaha
Srimathe Nigamantha Maha Desikaya Namaha
Sri Brahmatantra Swatantra Parakala Guruparamparayai Namaha

దయాయాః శతకం హృద్యం జీవ జీవన సంగమం
పరం రూపం సమాస్వాద్యచేతనా: పర్యుపాసతే ॥

నవ్య వాగీశ యమినాం సందేశం
తన్మహే వరం । దయానువాద ముద్దిశ్య స్వరూపస్య ప్రకాశకం ॥
ప్రణిపత్య సదారామం వేద సామ్రాజ్య శాసకం
హయాస్యం కృతమాద్యస్వం పరంజ్యోతిరుపాస్మహే ॥

ఆత్మ లక్ష్మ పరాక్రాంతా దయాభాతి సనాతనీ ।
జీవనే విక్రమ స్వాంతా స్వాధారారం ప్రకాశయేత్ ॥

దయాస్వం సర్వ ముద్ధృత్వ స్వాత్మాస్వాంతం ప్రకాశయేత్ ।
వినాదయాం నర: కోపీ నశాన్తిం ఉపగచ్ఛతి ॥

ఈదృశీం విక్రమాధారాం దయాం భాస్వర సత్వగాం
దేశికాః అనుభూయాధ్యాం విశ్వస్మిన్ తన్వతే ముదా॥

అహె భాగ్యమిదం నిత్యం దయా స్వాంతం సమాశ్రితా ।
ఇమాం ధర్మ్యాంసమాస్వాద్య సర్వే శాసతి సర్వదా ॥

సర్వ సారాం ఇమాం భుక్త్వా రాఘవార్యాః విపశ్చిత:
ఆంధ్ర భాషాను వాదేన భాసయంత్యమరామ జాం ॥

సానువాదాం దయాం దివ్యాం అనుభూయ పరస్థితాం।
ఆస్వాద్య విధురా: సర్వే స్వాత్మ వృత్తం వితన్వతే ॥

ఆచార్యా దేశ విశ్రాంత: శ్రీకార్య: హయ పూజక: ।
వ్యలిఖత్ వేంకటోనాథ: ఉన్మదం దేశమున్ముదా ॥

ఇత్థం శ్రీ చరణాదేశాశ్రవ:
మహా మహోపాధ్యాయ:
3-7-2010
డా॥ ఎ.ఎస్. వెంకట్‌నాథన్
శ్రీ కార్యకర్త, పరకాలమఠ: మైసూర్

మధురానుభవం

మహా మహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, శాస్త్ర రత్నాకర
ఉ.వే. శ్రీమాన్ శ్రీ.న.చ. రఘునాథాచార్య స్వామివారు
వరంగల్.

అద్భుత ప్రతిభకు ఏకైకోదాహరణం శ్రీవేదాన్తదేశికులు. బహుముఖముగా విస్తృత్వరమైన వారి ప్రతిభకు నిదర్శనాలు వారి వివిధ రచనలు. సర్వశాస్త్రాలలో వారికిగల అఖండ పాండిత్యానికి ప్రతీకలు న్యాయపరిశుద్ధి న్యాయసిద్ధాంజనం సర్వార్థసిద్ధిసహితతత్వముక్తాకలాపం శతదూషణి వంటి ఉచ్చకోటికి చెందిన మహాగ్రన్థాలు. సాహిత్యరంగంలో యాదవాభ్యుదయం సంకల్ప సూర్యోదయం వంటి దృశ్యశ్రవ్యకావ్యాలు, పాదుకాసహస్రం వంటి వివిధ స్తోత్రాలు విరబూసిన వారి కవితాకల్పలతో ద్యానంలో ఆవిర్భవించిన సుగంధి పుష్పగుచ్ఛాలు.

జటిలమైన దేశికులవారి శాస్త్రవాఙ్మయం జోలికి పోకుండా, వారి మధురాతి మధురమైన సాహిత్య వాఙ్మయంలోను, సాంప్రదాయక ద్రవిడ ప్రబన్ధాలలోను, అనర్ఘములైన స్తోత్రాలలోను గాధావగాహనంచేసి అనేక రహస్యార్థాలను రత్నాకరం నుండి అనర్ఘరత్నాలనువలె ఉద్ధరించి లోకానికి అందించే ఆన్ధ్ర భాషామయవ్యాఖ్యానాలను ప్రకటించుటలో దృఢ దీక్షితులైనవారు శ్రీమాన్ ఎ.జ. రాఘవాచార్యస్వామివారు. వాటిని ఆవిష్కరించటానికి తగిన విషయ పరిజ్ఞానము, వివరణానుకూలమైన వాగ్వైఖరి తగినంతగా కలిగినవారు ఈ విద్వద్వరులు కావటంచేత వీరిగ్రన్థాలు దోషైకదృక్కులైన పురోభాగులకుకూడ అప్రధృష్యములు అనాక్షేప్యములు అయినవి. గద్యత్రయ, స్తోత్రరత్నాదులపైన భాష్యాలను ప్రసాదిస్తూ ప్రతి అంశములోను ప్రమాణాలను ధారాపాతంగా కురిపించే శ్రీదేశికులవారివలెనే వీరున్నూ తమ వ్యాఖ్యానాల్లో పుంఖానుపుంఖంగా ప్రమాణ వర్షాన్ని కురిపించి పాఠకలోకాన్ని ఆశ్చర్య చకితులను చేస్తారు. శ్రీవైష్ణవ సంప్రదాయ సరస్వతి వీరిని సానుగ్రహంగా కటాక్షించింది. ఈ కారణంచేత వీరు అనేక విద్వజ్జనులకు అభిమానపాత్రులైనారు. వీరి యతిరాజసప్తతి వ్యాఖ్యను పర్యవేక్షించిన నాకు కేవలం

సాహిత్య సంప్రదాయాలలోనే కాక సూక్ష్మమైన శాస్త్రమర్మాలలో గూడ అప్రతిహతప్రవేశం కలవారు వీరని అవగతమైనది. ఇప్పుడు ప్రకటింపబడుతున్న శ్రీదేశికులవారి దయాశతకంపై వ్రాయబడిన అమృతాస్వాదినీ వ్యాఖ్య సహృదయులు శ్రవణపుటాలతో తృప్తిగా ఆస్వాదింపదగిన అమృతరస పారణయే సందేహం లేదు. ఈ స్తోత్రంలోని ప్రతి శ్లోకమున్నూ ఒక అద్భుత చమత్కృతికి నిధానమే. ఆ చమత్కృతిని ఆవిష్కరించటానికి తత్సంబంధి వివిధ విషయాలపై నిష్కృష్ట పరిజ్ఞానం కావాలి. వాటిని గూర్చి పూర్వపరిచయం లేకపోతే, ఆవిషయాలెక్కడనున్నవో అన్వేషించి గ్రహించి సప్రమాణంగా వివరించాలి. అందుకు తగిన ఉత్సాహము, ఓపికకూడ వ్యక్తిలో ఉండాలి. శ్రీమాన్ రాఘవాచార్యులవారి వయస్సు 75 దాటింది. అయినా వారిలో ఉత్సాహం ఓపిక ఉరకలేస్తున్నవి. ఈ శక్తి భగవద్దత్తమేగాని శారీరకం ఏమాత్రం కాదు.

"శ్లో. నిషాదానాం నేతా కపికులపతిః కాపిశబరీ
కుచేలః కుబ్జాసా వ్రజయువతయో మాల్యకృదితి।
అమీషాం నిమ్నత్వం వృషగిరిపతేరున్నతిమపి
ప్రభూతైః స్రోతోభిః ప్రసభ మనుకంపే! సమయసి"

అనే శ్లోకంపైన ధారాళంగా సాగిన వీరి వ్యాఖ్యానం ఇందుకు సాక్షి. పరమనైచ్యానికి నిదర్శనంగా ఆ శ్లోకంలో చెప్పబడిన వ్యక్తులందరూ భిన్నభిన్న విషయాలనుబట్టి అట్టడుగుస్థాయికి చెందినవారే. జాతినిబట్టి, మతి చాంచల్యాన్నిబట్టి, వార్ధక్యంతోకూడిన స్త్రీత్వాన్నిబట్టి, దుర్భరదారిద్ర్యాన్నిబట్టి మడ్డితనాన్నిబట్టి అసహ్యించుకొనవలసిన వికృతరూపాన్నిబట్టి వారికి సాటి మరొకరు చరిత్రలో లేరు. ఏకరాశిగా ప్రకాశిస్తున్న స్వరూపరూపగుణ వైభవైశ్వర్యాలనుబట్టి ఔన్నత్యంలో శ్రీనివాసునికిన్నీ సాటి మరెవరున్నూ లేరు. వీరిలోని ఈ నిమ్నోన్నతస్థితులను పూర్తిగా చెరిపివేసి పరమసామ్యాన్ని ఆపాదించగలిగిన మహాశక్తి ఒక్క దయాగుణానికి మాత్రమే కలదట. ఈ మర్మాన్ని ఆవిష్కరించగలిగిన శక్తిగూడా ఒక శ్రీదేశికులవారి ప్రతిభకే ఉన్నది. "ప్రజ్ఞానవనవోన్మేషశాలినీ ప్రతిభామతా" అనే నిర్వచనానికి లక్ష్యం శ్రీదేశికుల ప్రతిభయే.

"సమయసి" అనే క్రియా పదంతో సూచితమైన పరమసామ్యం ఉభయనిష్ఠం కదా! అది ఎట్టిదనిన పరిశీలించినపుడు ఆయనలోని పరత్వాన్ని దిగజార్చి వీరి నిమ్నస్థాయికి ఆయనను చేర్చటమనో లేక వీరిలోని నిమ్నత్వమును తొలగించి ఆయనయొక్క ఉన్నతస్థాయికి వీరిని చేర్చటమనో అర్థంకాదు. వీరిలోని నిమ్నత ఏ ధర్మాన్నిబట్టి యున్నదో, దాన్ని తొలగించి దానికి ప్రతికోటియైన ఆయనలోని ఉన్నతస్థాయికి వీరిని చేర్చటమేనని ఆ సామ్యాన్ని నిర్వహించాలి. అంతేకాని అపహతపాప్మత్వాదిగుణాష్టకావిర్భావంతో పరమసామ్యాపత్తి అనబడే మోక్షదశగూడ ఇక్కడ వివక్షితం గాదు. అది శబరివంటి ఏ ఒకరిద్దరికో రామానుగ్రహంతో లభ్యమైయుండవచ్చునుగాని, గుహసుగ్రీవాదులకు అది లభ్యమైనదని చెప్పలేము. గుహసుగ్రీవాదులకో కుబ్జాకుచేలాదులకో జాత్యాదికృతమైన నిహీనత ఉన్నా, అది అదృశ్యమై భగవద్గతమైన వివిధమగు ఔన్నత్యమే భగవంతుని కరుణచేత వారికి సంప్రాప్తమయినదని చెప్పుకోవాలి. వికృతరూపంగల కుబ్జకు దివ్యసౌందర్యం, పరమదరిద్రుడైన కుచేలునికి కుబేరునంతటి (విత్తేశత)ఐశ్వర్యం లభ్యమైనట్లు వారివారి కథలనుబట్టి సువ్యక్తమేగదా! తత్తద్ధర్మాలనుబట్టి మాత్రమే ఉభయులకున్నూ దయాదేవిచేత సామ్యం సంపాదితమైనట్లు సారాంశాన్ని గ్రహించాలి.

ఇక్కడ వ్యాఖ్యానకర్తయైన శ్రీ ఎ.బి. రాఘవాచార్యులవారు రామాయణభారత భాగవతాదులలోని తత్తద్వ్యక్తులకు చెందిన శ్లోకాలను సమగ్రంగా ఓపికగా ఉదాహరిస్తూ, విశేషాలను ఆవిష్కరిస్తూ కథాదృశ్యాలను పాఠకుల హృదయదర్పణాలలో ప్రస్ఫుటంగా ప్రవేశపెట్టినారు. సంస్కృత ప్రమాణాలనేగాక, గుహాదులనైచ్యాన్ని ప్రస్తావించిన తిరుమంగై ఆళ్వారుల "ఏఫైఏదలన్" వంటి ద్రవిడప్రబంధపాశురాలనుగూడా విడిచిపెట్టకుండా, ఉదాహరించి తమ ఉభయవేదాన్త వైదుష్యాన్ని ప్రకటించుకున్నారు. ఇదే ఉత్తమవ్యాఖ్యానపద్ధతి.

శాస్త్రవిషయాలూ అందరికీ తెలియువుగదా! అని ఊరుకోలేదు. ప్రసంగంవచ్చింది గనుక శాస్త్రీయాంశాలను గూడా వదలకుండా వివరించారు. నిహీనుడైన నిషాదుని పేరు రావటంతోటే పూర్వమీమాంసలోని నిషాదస్థపతి న్యాయం జ్ఞప్తికి వచ్చింది.

శ్రీభాష్యంలో భగవద్రామానుజులు దీనినొకచోట ఉదాహరించిన విషయాన్ని ప్రస్తావించి, అచటి సమాసచర్చను నిరూపించి, నిషాదునికి యజ్ఞాది వైదికకర్మయోగంలో అవకాశం లేకపోయినా ఆత్మార్పణమనే శరణాగతిలో అవకాశం కలదుకదా అని సమర్థించారు. దయాగుణప్రసారం వెనుక యవనికాన్తర్నిగూఢమైన దృశ్యంవంటి నదీ ప్రవాహం మిట్ట పల్లాలను సమానం చేసేస్తుందనే వృత్తాంతాన్ని సమాసోక్త్యలంకార పద్ధతిలో ఆవిష్కరించారు. ప్రతి శ్లోకంలోనూ ఇదేమాదిరి వ్యాఖ్యానవైఖరి వీరి అమృతాస్వాదినిలో ప్రదర్శితమైనది.

దేశికుల సూక్తులన్నీ ధ్వనిప్రధానమైన ఉత్తమకావ్యాలు. ఈ విషయాన్ని దిఙ్మాత్రంగా నేను "పాషాణకల్పమన్తే పరిచితగౌతమపరిగ్రహన్యాయాత్ పతిపదపరిచణార్థ్వమ్। పరిణమయ ముకుందపాదరక్షిణి! మామ్" అనే పాదుకాసహస్రశ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ పూర్వం తెలిపి యున్నాను. కంచుగంటయొక్క అనురణనధ్వనిపరంపరవలె ఘంటావతారమైన దేశికులవారి శ్రీసూక్తులలో గూడా ఈ అనురణనధ్వనిపరంపర సహృదయులకు తప్పకుండా గోచరిస్తుంది. అయితే, ఆ సహృదయులు బహుశ్రుతులైతే సావధానంగా ఈ మర్మాన్ని గ్రహించగలుగుతారు. ఇందుకు ఉదాహరణంగా ఈ దయాశతకంలోని 91వ శ్లోకాన్ని తీసుకుందాం.

శ్లో. విశ్వోపకారమితినామ సదాదుహానాం అద్యాపిదేవి! భవతీమవధీరయంతం।

నాథే నివేశయ వృషాద్రిపతౌ దయే! త్వం న్యస్తస్వరక్షణభరం త్వయి మాంత్వయైవ॥

ఇచట ఓదయామతల్లీ! తల్లీ! నాప్రయత్నం లేకపోయినా నీవే నన్ను స్వయంగా నీపై నా రక్షణ భారాన్ని ఉంచేటట్లుగా చేసుకొని నీ దగ్గరకు తీసుకున్నావు. అట్టి నన్ను నీవే ఇప్పుడు (వృషాద్రిపతౌ నాథే నివేశయ) స్వామియొక్క శ్రీపాదసన్నిధికి గూడా చేర్చుము అనేది వాచ్యార్థం. ఇది అధిష్ఠిక. దీనిపైన స్ఫురించే అనురణనధ్వని ఏమంటే - శ్రీనివాసుని హృదయంలో ఉన్న ఈ దయామతల్లి స్వామియొక్క వక్షస్థలంలో సామానాధికరణ్యంచే లక్ష్మీదేవికి సహచరియైనదిగదా! "శ్రీన్

లోకాన్ సంపరిక్రమ్య.." అన్నట్లు రామబాణంచేత దిమ్మదిరిగి తిరిగి ఆ సీతారాములపాదాలచెంతనే వచ్చి పడిన కాకాసురుడు అమ్మపాదాలపై తలనువాల్చి స్వామిప్రక్కకు తన పాదాలు సాచి స్పృహతప్పి పడియున్న సమయంలో ఆ జగన్మాత జానకీ గూడా "తచ్ఛిరః పాదయోస్తస్య యోజయామాస జానకీ" అన్నట్లు వాని తలను స్వామి పాదాల ప్రక్కకు జరిపి, వీనిని రక్షించుమని కోరినదటగదా! ఆ కాకాసురునివలె పూర్ణాపరాధినైన నన్నుగూడా నీవు ఆ జగన్మాతవలె స్వామిపాదాలచెంతను చేర్చుమని దేశికులవారి ఈ దీనాలాపనతో అభివ్యక్తమైన మధురభావం. ఈ శ్లోకంలోని పదవిన్యాసచ్ఛాయ "తచ్ఛిరః పాదయోస్తస్య యోజయామాస జానకీ" అనే శ్లోకాన్ని స్మరింపజేస్తున్నదిగదా! ఆ వృత్తాంతసాదృశ్యమే ఇచట ధ్వనిసిద్ధం.

ఆళ్వారులదివ్యప్రబన్ధాలకు ఎన్ని వ్యాఖ్యానాలు ఆవిర్భవించినా, నంబిళ్ళగారి ఈడు వ్యాఖ్యానమే సమగ్రముగా సంప్రదాయజ్ఞులకు ఉపాదేయమైనట్లు శ్రీదేశికులస్తోత్రాలకుకూడా ఈ ఎ.జ. రాఘవాచార్యులవారి విపులవ్యాఖ్యానాలే ప్రామాణికమైనవిగా పరిగ్రాహ్యమైనవని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

సత్సంప్రదాయపరిరక్షణ సభ
16-4-523, శివనగర్,
వరంగల్-2, ఆం.ప్ర.

ఇట్లు భాగవతవిధేయుడు
మహామహోపాధ్యాయ
శ్రీ.న.చ. రఘునాథాచార్య.

న్యాయవేదాన్త విద్వాన్
ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్యస్వామివారు
భారద్వాజభవనం, నరసాపురం

అమృత చషకం

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కికకేసరీ।
వేదాంతాచార్యవర్యోమే సన్నిధత్తాం సదా హృది॥

పరమవైదికమైన విశిష్టాద్వైతసిద్ధాంతంలో తత్త్వాలు మూడు. ఇవి చిదచిదీశ్వర తత్త్వాలు. వీటిలో ఈశ్వరుడు అఖిల హేయ ప్రత్యనీకుడు, అనంతజ్ఞానానందస్వరూపుడు, జ్ఞానశక్త్యాది కల్యాణగుణ భూషితుడు, సకల జగత్తుల సృష్టి స్థితి సంహారకర్త, చతుర్విధపురుషార్థప్రదాత, విలక్షణ దివ్యమంగళ విగ్రహుడు, లక్ష్మీభూమీనీళానాయకుడుగా నిరూపింపబడ్డాడు.

భగవానుడైన శ్రీమన్నారాయణుని కల్యాణ గుణాలు సంఖ్యలో లెక్కలేనివి అయినా, "తవానంతగుణస్యాపిషడేవ ప్రథమే గుణాః" అనేరీతిలో శాస్త్రాలలో ఆఱు గుణాలకు పెద్దపీటవేయబడింది. అవి భగవచ్ఛబ్దవాచ్యాలైనజ్ఞాన-శక్తి-బల-ఐశ్వర్య-వీర్య-తేజస్సులు. ఈ విషయాన్ని గూర్చి కూరేశులు వరదరాజస్తవంలోని- "ప్రకృష్టం విజ్ఞానం బలమతులమైశ్వర్యమఖిలం విమర్యాదం వీర్యం వరద! పరమాశక్తిరపిచ, పరంతేజశ్చేతి ప్రవరగుణషట్కం ప్రథమజమ్" అనే శ్లోకంలో పలికారు. అంతేకాక, ఈ ఆఱు గుణాలు మిగిలిన కల్యాణ గుణాలకు ప్రసవ భూములు అని అన్నారు- " గుణానాం నిస్సీమ్నాం గణనవిగుణానాం ప్రసవభూః"- అనిఅంటూ, అందువల్ల దయాక్షాంత్యౌదార్యాది నిస్సీమ నిస్సంఖ్యాలైన కల్యాణ గుణాలు షడ్గుణ ప్రభవాలు. ప్రణతజన భోగ్యా లు.

వీటిలో దయ, క్షాంతి (క్షమ), వాత్సల్యగుణాలు ప్రకృతంలో గమనించదగినవి. జ్ఞానం యొక్క అవస్థాంతరంగా దయను గ్రహించవచ్చు. క్షమా, వాత్సల్యాలను ఈ దయాగుణం యొక్క కాష్ఠాభేదాలు చెప్పవచ్చునని ఆచార్యుల నిర్వాహం.

శ్రీపరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవం ఉత్తరశతకంలో దయాగుణాన్ని "దయా పరవ్యసనహరా" అనినిర్వచించారు. ఇతరుల దుఃఖాలను తీర్చేగుణమేదయ. ఇతరుల దోషాలను క్షమించే, సహించే గుణం క్షమ. ఇతరులలోనిదోషాలను చూడకపోవడం, వాటిని "కుత్తమ్ శెయినుమ్ కుణమ్ కొళ్ళుమ్" అనే రీతిలో గుణాలుగా స్వీకరించడం వాత్సల్యం. ఈ మూడు తల్లిలో విశేషంగా వ్యక్తమయ్యేగుణాలు. వీటిలో, లక్ష్మీదేవి దయాగుణానికి ప్రతినిధి, క్షమాగుణానికి భూదేవి ప్రతినిధి. వాత్సల్యానికి నీళాదేవి ప్రతీక. శ్రీదేశికులు దయాశతక ప్రారంభంలో లక్ష్మీదేవిని " కరుణా మివరూపిణీమ్" అని, భూదేవిని "తత్కృపా ప్రతి ఘాతానాం క్షమయా వారణం యయా" అని, "నీళా యద్భోగ పటలైః ధ్రువమ్, భావితం శ్రీనివాసస్య భక్త దోషేష్వదర్శనమ్" అని నీళాదేవిని స్తుతించడం గమనార్హం. ఇక్కడ ఒక చమత్కారమైన అర్థ నిర్వాహం కూడా ఉన్నది. క్షమ, వాత్సల్యాలు దయాగుణ ప్రకారాలు అయినట్లే, దయాగుణ ప్రతినిధి అయిన లక్ష్మీదేవికి క్షమా వాత్సల్యాలకు ప్రతీకలైన భూదేవి నీళాదేవులు ఛాయాస్థానీయలు. "తిరువుమ్ నిషల్పోల్వనర్" అని తిరు విరుత్తంలో నమ్మాళ్వార్లు, "ఛాయా మివాభ్యుదయినీ మవనీంచతస్యాః" అని శ్రీరంగ రాజస్తవంలో, "దేవి! త్వామనునీళయా సహమహీ దేవ్యః సహస్రంతథా యాభిస్త్వం స్తనబాహు దృష్టిభిరివ స్వాభిః ప్రియం శ్లాఘసే" అని శ్రీగుణ రత్నకోశంలో భట్టర్ పల్కడం అనుసంధేయాలు.

శరణాగతరక్షణలో ప్రధానాలైన భగవద్గుణాలు మూడు. అవి జ్ఞానం, శక్తి, కరుణ. కూరేశులు అతిమానుషస్తవంలో "త్వద్ జ్ఞాన శక్తి కరుణాసు సతీషు నేహ పాషం పరాక్రమితు మర్హతి మామ కీనమ్" అని అన్నారు. ఈ మూడు గుణాలలోను కరుణకు ప్రాధాన్యం. మిగిలిన రెండు తదంగాలు. అందువల్లనే అది ఈ సూక్తిలో చివరగా నిర్దేశింపబడింది. కూరేశులు అతిమానుషస్తవంచివరలో భగవత్సన్నిధిలో శరణాగతిని చేస్తూ "ఏతాదృశోహ మగతిః భవతో దయాయాః పాత్రం త్వదీయచరణౌ శరణం ప్రపద్యే" అని "వాచం త్వివమాంసకృదథాప్యసకృన్మయోక్తాం సత్యాం కురుష్వదయయైవ దయైకసింధో" అని, శరణాగత రక్షణలోని దయాగుణ ప్రాధాన్యాన్ని ఆమ్రేడనం చేశారు.

పైన ఉట్టంకింపబడ్డ "త్వద్ జ్ఞాన శక్తి కరుణాసు" ఇత్యాది కూరేశ సూక్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీనివాసాచార్యులవారు "దయాయాః పాత్రం, దయయేవైతి ప్రకరణాను

గుణ్యేన దయాయాః ప్రధాన సాధనత్వం, జ్ఞాన శక్త్యోః తదంగత్వమితి సంప్రదాయః ” అని అన్నారు. వేద పురుషుడు “యోబ్రహ్మాణం విదధాతి పూర్వం యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై” అని అంటూ భగవానుని దయాగుణ కార్యాలైన సృష్టిని, జ్ఞాన ప్రదానాన్ని ప్రస్తావించి, అటువంటి దయాగుణ విశిష్టుడైన పరమాత్మను “తం దేవ మాత్మబుద్ధి ప్రసాదం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే” అని శరణాగతిని చేశాడు. శ్రీరామాయణంలో వాల్మీకి మహర్షి “కృపయాపర్యపాలయత్” అని అన్నాడు. ఆళ్వార్లు “నిన్నరుళే పురిన్దిరున్దేన్” అని భగవానునిదయను విశ్వసించానని అన్నారు. ఇటువంటి శరణాగతరక్షణలో విలక్షణమైన దయను పలువురు కీర్తించడంలో ఏమి ఆశ్చర్యం ఉన్నది!

ప్రసంగ వశాత్తు ఇక్కడ ఒక మధురమైన, సాంప్రదాయికమైన అర్థనిర్వాహం ప్రస్తావనార్హం. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళి ప్రబంధ ప్రారంభంలో “తుయరఱు శుడరడితొళుదు ఎన్ మననే” భక్తుల దుఃఖాలను తొలగించే స్వభావాన్ని కల భగవానుని ప్రకాశమానాలైన శ్రీపాదాలను ఓ మనసా! ఆశ్రయించు అని అన్నారు. ఈ ఆళ్వార్ల స్ఫూర్తి ఆఱాయిరప్పడి అనే వ్యాఖ్యలో “ఆశ్రిత జనసమస్త దుఃఖాపనోదన స్వభావమాన తిరువడి మలర్ కళిలే” అని వివరింపబడింది. ఆశ్రితుల సమస్త దుఃఖాలను పోగొట్టే స్వభావం అంటే అది దయయే కదా! ఆదయాగుణంతో కూడిన భగవత్పాదాలను ఆశ్రయించుమని ఆళ్వార్లు తమ మనస్సుకు ఉపదేశించారు. తిరువాయ్‌మొళి ప్రబంధం అంతా భగవానుని పాదాలను ఉద్దేశించి చెప్పబడిందని ఆళ్వార్లే స్వయంగా “ముకిల్‌వణ్ణన డిమేల్ శొన్నశొల్‌మాలై ఆయిరత్తుళ్” అనే సూక్తి ద్వారా తెలిపారు. అంటే-దయాగుణ విశిష్టాలైన భగవచ్చరణాలను ఉద్దేశించి చెప్పబడ్డ ప్రబంధమే కదా తిరువాయ్‌మొళి కనుక, ఈ ప్రబంధం సమగ్రంగా సర్వేశ్వరుని శ్రీచరణాల దయాగుణ ప్రఖ్యాపకం అంటే ఇది ఒక దయా సహస్రం.

భగవానుని దయను కీర్తించే పూర్వాచార్య కృతస్తోత్రాలలో వేదవ్యాస భట్టారకుల క్షమాషోడశి, శ్రీ వేదాంత దేశికుల దయా శతకం ప్రముఖంగా కన్పిస్తున్నవి. పండిత రాయకృతమైన కరుణాలహరి కూడా ఈ కోవలోకి చేరుతుంది.

భగవానుని పరత్వాది పంచరూపాలలో అన్నిటిలో కల్యాణగుణాలు అన్నీ పుష్కలాలు అయినా, “అర్చావతారంలో సౌలభ్య సౌశీల్య వాత్సల్యాదిగుణాలు మిక్కిలి ప్రస్ఫుటాలు.

ఈ గుణాలలో కూడాఅర్చావతారస్సర్వేషాం బాంధవో భక్తవత్సలః" అని, "అర్చ్యః సర్వసహిష్ణుః" అని చెప్పబడ్డ రీతిలో దయ, క్షమ, వాత్సల్యగుణాలు మిక్కిలిగా ప్రకాశిస్తాయి. దివ్యదేశాలలో నెలకొని ఉండే అర్చామూర్తులలో ఈ గుణాలు ప్రకాశిస్తున్నా, తిరుమలలోని శ్రీవేంకటేశ్వరునిలో దయా పరాకాష్ఠ అయిన వాత్సల్యగుణం ఉజ్జ్వలమని దివ్యసూరుల హృదయం. నమ్మాళ్వార్లు శ్రీవేంకటేశ్వరుని శ్రీచరణాలలో శరణాగతిని చేసే సందర్భంలో "నికరిల్ పుకళాయ్!" అనే సంబోధన ద్వారా శ్రీనివాసుని వాత్సల్యగుణం అసాధారణమని అన్నారు. మఱి ఒక చోట "ఎన్కణ్ పాశమ్వైత్తపరమ్ శుడర్ శోది" అని అన్నారు. ఇక్కడ "పాశ" శబ్దం చేత వాత్సల్యగుణం నిర్దేశింపబడిందని వ్యాఖ్యాతల అభిప్రాయం. (ఈ గుణం తల్లిలో కన్పించే అసాధారణ గుణమని పూర్వోక్తం కదా! ఆళ్వార్లు కూడా శ్రీనివాసుని "తాయ్తన్దై ఉయిరాకిన్డాయ్..... తణ్వేఙ్గడ మేకిన్డాయ్" తల్లిగా సంభావించడం ప్రకృతంలో భావ్యం) ఆ చార్య హృదయ మనే అద్భుతమైన రహస్య గ్రంథంలో నాయనార్ అనే పూర్వాచార్యులు కూడా ఈ విషయాన్ని "మణ్ణోర్ విణ్ణోర్ వైప్పిల్... నికరిల్ వాత్సల్యముజ్జ్వలమ్" అని తెలియజేశారు.

ఇటువంటి విశిష్టమైన శ్రీనివాసుని దయాగుణాన్ని శ్రీవేదాంత దేశికులు దయాశతకమనే స్తుతి గ్రంథంలో సహృదయమనోహరంగా కీర్తించారు.

దయాశతకంలో శ్రీ వేంకటేశ్వరుని దయతత్ప్రకారాలైన క్షమ, వాత్సల్యం స్తుతింపబడడాన్ని మాత్రం ప్రస్తావించవచ్చు. వాత్సల్యగుణాన్ని మార్చి ప్రస్తావించే ఒక శ్లోకరత్నాన్ని ఆ శ్లోకంలో స్ఫురించే మధురాలైన అర్థవిశేషాలను విన్నవిస్తాను. ఇది దయా శతకంలోని 97వ శ్లోకం.

"ఔత్సుక్య పూర్వముప హృత్యమహాపరాధాన్ మాతః! ప్రసాదయితుమిచ్ఛతిమే మనస్త్వామ్ ఆలిహ్యతాన్నిరవశేషమలబ్ధతృప్తిః తామస్యహోవృషగిరీశధృతాదయే! త్వమ్ "అనే శ్లోకంలో శ్రీనివాసుని" వాత్సల్యగుణ వైభవం వ్యాజస్తుత్యలంకారం ద్వారా భూషితమైనది. ఇందులోని అర్థవిశేషాలు విస్తరభీతిచేతసంగ్రహంగా విన్నపింపబడుతున్నాయి.

(మాతః) ప్రకృత సందర్భానికి తగిన సాభి ప్రాయకమైన సంబోధన ఇది. వాత్సల్యగుణంలో తల్లిది ప్రత్యేక స్థానం కదా! అంతేకాక, తల్లికి కుమారుడు ఆమెకు ఇష్టమైన వస్తువును సమర్పించి సంతోషపెట్టడం కర్తవ్యమని ఈ సంబోధన తెలుపుతున్నది. (ఔత్సుక్య పూర్వమ్) సుతవత్సల అయిన తల్లి తన పుత్రునిలోని దోషాలను గమనించకపోవడమే కాక, వాటిని భోగ్యాలుగా (గుణాలుగా) స్వీకరిస్తుంది కదా! అటువంటి తల్లికి భోగ్యాలైన, అపరాధరూపాలైన ఉపహారాలతో ఎపుడు సంతోషపెడతాను? ఎపుడు సంతోషపెడతాను? అనే ఔత్సుక్యంతో అని భావం. (మహాపరాధాన్) పెద్ద పెద్ద అపచారాలను. అంటే–భగవదపచార–భాగవతాపచార–అసహ్యాపచారాలను మహచ్ఛబ్దంచేత వాటిలో ఒక్క అపచారమే చాలు దయాదేవి కడుపును నింపడానికి–అని అనిపించే అపచారాలు అనిస్ఫురిస్తుంది. (ఉప హృత్య) తల్లికి భోగ్యాలైన వానినే కదా ఉపహారాలుగా సమర్పించాలి. అందువల్ల మహాపరాధాలను ఉపహారాలుగా (కానుకలుగా) సమర్పించి.

(త్వాం ప్రసాదయితుమ్) తల్లివైన నిన్ను సంతోషపెట్టడం కోసం. "మాతృదేవోభవ", "నమాతుః పరదైవతమ్" అని కీర్తింపబడే తల్లివి అయిన నిన్ను సంతోషపెట్టాలని కన్నతల్లిని ఆనందింపజేయడమే కదా పుత్రకర్తవ్యం. (మేమనః ఇచ్ఛతి) అసాధ్యమని తెలిసినా, నా మనస్సు కోరుతున్నది. "మనోరథానా మగతిర్న విద్యతే కదా". నీ మనస్సు కోరుకునేది అంత దుర్లభమా! అసాధ్యమా! అనే ప్రశ్నను శ్లోకంలోని ఉత్తరార్ధం సమాధానిస్తున్నది.

(త్వమ్) సర్వనామశబ్దాలు వక్తృ బుద్ధి స్థభావ ప్రకాశకాలు. ప్రకృతంలో ఈ పదం వల్ల దయాదేవి తల్లి కనుక పోషణీయ అని, నిండించడానికి సాధ్యం కాని పెద్ద బానకడుపును కల్గినది అని ప్రకృత సందర్భానుగుణంగా స్ఫురిస్తున్నది. (తాన్) ఈ సర్వనామ శబ్దం, దయాదేవి ఆకలిని తీర్చగలవని, ఆమె కుక్షిని నిండించి తృప్తి కల్గించగలవని తలచి చేర్చి పేర్చి పెట్టుకొన్న పాపాలను అనే అర్థాన్ని ఇస్తుంది. (నిరవశేషమ్) అనాది సంచితాలైన పలుపాపాలను వేటినీ మిగల్చ కుండా పూర్తిగా ఆకాశమంత పరిమాణాన్ని కల దయాదేవి కుక్షికి ఈ పాపాలు ఆవగింజతో సమానమయ్యాయి. అందువల్ల వేటినీ మిగల్చ కుండా (అలిహ్యా) ఈ క్రియా

పదంలోని "ఆజ్" సాభిప్రాయకం. ఇంత కాలంగా ఇంతగా చేర్చిపెట్టిన మహాపరాధాలు అన్నీ కలిసినా ఒక ముద్దగా కూడా కాలేక పోయాయి. అందువల్ల చిన్న పిల్లలు తమ చేతి వేళ్ళను కొంచెంగా అంటుకొన్న తేనె వంటి పదార్థాలను నాలుకతో నాకినట్లుగా, దయాదేవి తమకుక్షికి ఆకలికి ఏమాత్రం సరిపోని అపరాధాలను అవలీలగా నిరవశేషంగా జిహ్వాతో నాకి, (అలబ్ధతృప్తిః) తన కడుపుకు తగిన ఆహారం లభించనందువల్ల ఆమెకు ఏమాత్రం తృప్తికలుగలేదు. అనాదిగా మనో వాక్కాయాల నిరంతరం నాచేత, నాకు చెందిన వారిచేత చేయబడుతున్నా అకృత్యకరణ కృత్యాకరణాది రూపాలైన అపచారాలను సమీకరించి చేర్చి, ఈమె ఉదరపూరణకు సరిపోతాయని భావించి ఉపహారంగా సమర్పించినా, ఈమెకు తృప్తిలేశం కూడా కలుగలేదే! అయ్యో! ఇక ఈమె ఆకలిని ఏ విధంగా తీర్చడం! ఈ తల్లిని ఏ విధంగా పోషించడం! (తామ్యసి) ఇంతవరకు నా కుమారుడు వస్తాడు, నా కడుపును నిండించి తృప్తిపరుస్తాడని భావించావు, ధైర్యంగా ఉన్నావు. కాని, తృప్తి లేశం కూడా కల్గనందువల్ల నీవు చాలా గ్లానిని పొందుతున్నావు. ఇటువంటి స్థితిలో క్లేశపడే నిన్ను చూచి, (వృషగిరీశ ధృతా) వృషగిరినాథుడు "అయ్యో! ఈమె నిరాధారగా ఉన్నదే! అని నిన్ను ధరించాడు. (ఆహో) అమ్మా! దయాదేవి! నీ కడుపు ఎంత పెద్దది! ఏ విధంగా నీ ఆకలిని తీర్చగలను! నీకు తృప్తి కల్గించగలను! అయ్యో! కష్టం! అని ఈ విధంగా ఈ శ్లోకాన్ని పైపైన చూచినపుడు దయాదేవి నిందాపరంగా అర్థం తోస్తుంది.

కాని, వ్యాజస్తుత్యలంకార ప్రక్రియలో సాగిన ఈ శ్లోక రచనలోని అర్థాన్ని జాగ్రత్తగా గమనిస్తే దయాదేవి యొక్క వాత్సల్యం అపరిమితం అనేస్తుతి ధ్వనిస్తుంది, ఆస్తుతికి అనుగుణంగానే శ్లోకంలోని పదాలు ప్రయోగింపబడ్డాయని తెలుస్తుంది.

"మహాపరాధాన్ ఉపహృత్య" అనే ప్రయోగం ద్వారా మహాపరాధాలు ఉపహారాలుగా రూపింపబడడం వల్ల ఆశ్రితాపరాధాలు క్షోభను కల్గించకపోవడమే కాదు, ప్రీతిహేతువులు కూడా అని ధ్వనిస్తున్నది. "దోషోయ ద్యపి తస్యస్యాత్" అని కదాసర్వలోక శరణ్యుని సూక్తి. "ప్రసాదయితు మిచ్ఛతి" అనే ప్రయోగం ద్వారా ఆశ్రితుల అసంఖ్యేయాలైన అపరాధాలను సుప్రసన్నమైన మనస్సుతో స్వీకరిస్తుందని

ధ్వనిస్తున్నది. "ఆలిహ్యాతాన్ నిరవశేషమ్" అనే ప్రయోగంలో గల "ఆలిహ్యా" అనే పదం ద్వారా ఆశ్రితులకు చెందిన వారి అపరాధాలను కూడా పరిపూర్ణంగా తన క్షమకు విషయంగా చేస్తుందని స్ఫురిస్తున్నది. "ఆలిహ్యా" అనే క్రియ ద్వారా వాటి అత్యాదరణ స్వీకరణం వ్యక్తమవుతున్నది. ఈ విధంగా ఆశ్రితుల యొక్క, వారికి చెందిన వారియొక్క మహాపరాధాలను అత్యాదరంగా స్వీకరించి, ఇంకెవ్వరూ చేయలేని పరిపూర్ణమైన అనుగ్రహాన్ని వారి విషయంలో చూపినా, "ఎన్ అడియార్క్కు ఎన్ శెయ్‌వన్? ఎన్నే ఇరుత్తినీ" అనేరీతిలో, "అస్మైనకించిదు చితం కృతమ్" అనే రీతిలో "నన్ను ఇంత గట్టిగా నమ్మిన వీనికి ఏమి చేయలేకపోయానే! అయ్యో! "అని భావిస్తూ ఏమి ఉపకారాన్ని చేయని దానివలె భగవానునిదయ తృప్తిని పొందలేకపోతున్నది అనే అర్థస్వారస్యం "అలబ్ధ తృప్తిః" అనే పద ప్రయోగం ద్వారా ధ్వనిస్తున్నది. ఈ రీతిలో అతృప్తిని పొందే దయాదేవి ఆశ్రిత వ్యామోహ విజృంభణచేత ఒకవేళ పరబ్రహ్మత్వాన్ని కూడా ఆశ్రితునకు ఇచ్చివేస్తుందో! ఏమో! అనే భీతితో భగవానుడు ఈమెను నిరోధించాడనే అర్థస్వారస్యం (నహినిందాన్యాయానుసారం) "వృషగిరీశధృతా" అనే ప్రయోగంలో స్ఫురిస్తుంది. (ధృతా-అవష్టబ్ధా-అని అర్థం) మనస్సుతో భావించడానికి కూడా సాధ్యం కాని రీతిలో అతిదుష్కరాలైన మహాపచారాలను కూడా క్షమించి అనుగ్రహించినా, తగిన ప్రత్యుపకృతి ఏమి చేయలేదనే అతృప్తిచేత, భగవానుని నిరోధం చేత క్లేశపడుతున్నది అనే అర్థస్వారస్యం "తామ్యసి" అనే పదం ద్వారా ధ్వనిస్తున్నది. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" ఇత్యాదిగా భగవానుని స్వరూపాన్ని పరిచ్ఛేదించి పలుకగల్గినా, దయాదేవీ! నీ ఆశ్రిత వాత్సల్యం ఆహా! "అపరిచ్ఛిన్నం", అనే భావం అహో! అనే ఆశ్చర్యార్థక పదం ద్వారా స్ఫురిస్తున్నది. ఈ విధంగా మొదట దయాదేవి నిందాపరంగా అన్వయించిన ప్రయోగించిన అనితరసాధారణ పద ప్రయోగ కౌశలం శ్రీ దేశికులకే చెల్లు. ఈ ఒక్క శ్లోకం మాత్రమే కాదు, దయా శతకంలోని శ్లోకాలన్ని గంభీరార్థ ప్రతిపాదకాలు, రస్యరహస్యార్థగుంఫితాలు, సహృదయ హృదయా వర్జకాలు.

ఇటువంటి విలక్షణమైన, లోతైన అర్థాలను, రహస్యాలను ఇముడ్చుకొన్న దయాశతకాన్ని వ్యాఖ్యానించడం కత్తిమీద సామువంటిదే. సంస్కృతంలో శ్రీ

వాత్స్యరామానుజా చార్యులవారు, శ్రీమాన్ ఎ.వి. గోపాలా చార్య స్వామివారు మొదలైన పలువురు ఈ స్తుతిని వ్యాఖ్యానించారు.

తెలుగులో కీర్తిమూర్తులు శ్రీమాన్ కోళియాళం శఠకోపాచార్య స్వామివారు వివరంగా, సుమధురంగా సంతరించిన వ్యాఖ్యను టిటిడి రెండు మార్లు ముద్రించింది. శ్రీ సేవా స్వామివారి వ్యాఖ్యానం కూడా విస్తృతమైనది. ఇంకా ఎంతోమంది ఈ కృతిని తమదైన శైలిలో వ్యాఖ్యానించారు.

ఇవన్నీ ఒక ఎత్తు కాగా ఇపుడు వెలువడుతున్న వాచస్పతి, వ్యాఖ్యాతృ శిరోమణి డా. ఉ.వే. శ్రీమాన్ కె.వి. రాఘవాచార్య స్వామి అమృతాస్వాదినీ వ్యాఖ్య ఒక ఎత్తు. ఇతః పూర్వమ్ ఈ ఆచార్యవర్యుల అనితర సాధారణమైన వ్యాఖ్యాన కౌశలం పాదుకాసహస్రం, నారాయణ శతక, యతిరాజసప్తతి, అభీతిస్తవ, శ్రీస్తవ, రుక్మిణీ కల్యాణాది కృతులకు వీరు సంతరించిన అపూర్వ అద్భుత వ్యాఖ్యల ద్వారా లోకానికి సుపరిచితం. 450 పుటలకు మించిన, అతి విస్తృతమైన ఈ అమృతాస్వాదినీ వ్యాఖ్య అస్మాదృశ ప్రపన్నకోటికి ఒక జీవాతువు: సాహిత్య రసికులకు షడ్రసోపేతమైన విందు. ఎనభై ఏండ్లు నిండిన వార్ధక్య దశలో సైతం శ్రీమాన్ స్వామివారు కొనసాగిస్తున్న సంప్రదాయ సాహిత్య సేవ మహామహోపాధ్యాయ శ్రీమాన్ రఘునాథాచార్య స్వామివారి ప్రశంసకు పాత్రమైనది. అంటే, ఇంతకంటే ఇంకొక ప్రశస్తి పత్రం వీరి వైదుష్యానికి పనిలేదు. అమృతాస్వాదినీ వ్యాఖ్యను గూర్చి విన్నపించుకోమని దాసుని శ్రీమాన్ స్వామివారు ఆజ్ఞాపించడం వారి సౌమనస్యాన్ని సౌహార్ద్రాన్ని చాటుతున్నది.

ఇంతకు ముందు శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారు వెలయించిన వ్యాఖ్యలవలెనే ఈ అమృతాస్వాదినీ వ్యాఖ్య కూడా "నా మూలం లిఖ్యతే కించిన్నా నపే క్షితముచ్యతే "అనే మల్లినా థసూరి వ్యాఖ్యాన ప్రక్రియలో సాగింది. పలు గ్రంథాల నుండి పలు ప్రమాణాలను సందర్భోచితంగా ఉదాహరించే వీరి వ్యాఖ్యాన శైలి విలక్షణమైనది. "ప్రత్యేకించి" నిషాదానాం నేతా "యస్మిన్ దృష్టే" ఇత్యాది శ్లోకాలను వ్యాఖ్యానించిన సందర్భాలలో శ్రీమాన్ స్వామివారి సర్వతో ముఖాలైన ప్రతిభాపాండిత్యాలు, విషయ విశ్లేషణలోని నైశిత్యం వ్యక్తమవుతున్నది. ఆలంకారిక

విశేషాలనే కాక, వేదాంతాది వివిధ శాస్త్రరహస్యాలను కూడా వివరించడం విశేషం. ద్రావిడ ప్రబంధాలలోని పలు ప్రమాణాలను, ఆప్రబంధాల వ్యాఖ్యలలోని సందర్భానుగుణాలైన వివరణలను శ్రీమాన్ స్వామివారు అడుగడుగునా ఉట్టంకించిన తీరు వారి ఉభయవేదాంతవైశారద్యాన్ని ప్రస్ఫుటచేస్తున్నది. ఆంధ్ర ప్రపన్న సాహితీ ప్రియుల భాగ్య ఫలంగా వెలసిన అమృతాస్వాదినీ వ్యాఖ్య ఒక అమృత చషకం. శ్రీవైష్ణవసంప్రదాయజ్ఞులు, సాహిత్యరసికులు అందఱు శ్రీమాన్ స్వామివారికి అధమర్ణులు అనడంలో అతిశయోక్తిలేదు. మధుర వ్యాఖ్యను గూర్చి యత్కించిత్ విన్నపించే గొప్ప అవకాశాన్ని నాకు ఇచ్చిన శ్రీమాన్ రాఘవాచార్య స్వామివారి సన్నిధిలో కృతజ్ఞతాపూర్వకంగా ప్రణామాలను అర్పించుకుంటున్నాను. సాహితీ ప్రియులు, సంప్రదాయజ్ఞులు అందఱు ఈ వ్యాఖ్యానంలోనిమధురిమను అనుభవించి ఆనందించాలని కోరుతున్నాను. ఇదే విధంగా శ్రీమాన్ స్వామివారు అరోగదృఢ గాత్రులై, చిరకాలం పల్లాండు పల్లాండుగా వేంచేసి ఉండి, ఇంకా పలు సద్గ్రంథాలను విస్తృత వ్యాఖ్యలను వెలయించడం ద్వారా అస్మాదృశులను అనుగ్రహించాలని ఆశిస్తూ, ఆ విధంగా వారికి ఆవశ్యకాలైన ఆయురారోగ్య సంపదను ప్రసాదించవలసినదిగా శ్రీనివాస ప్రభువును వేడుతూ, స్వస్తి.

అమృతాస్వాదినీ వ్యాఖ్యాం రాఘవార్య వినిర్మితామ్।
సేవంతాం విబుధాః! రస్య రహ స్యార్థమనోహరామ్॥

నరసాపురం — ఇట్లు నివేదించు
11-5-2010 — భాగవత విధేయుడు
ఈ. రంగాచార్యులు

న్యాయవేదాంతవిద్వాన్,
ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్య స్వామివారు
భరద్వాజ భవనం, కోవెల వీధి, నరసాపురం-534275
ఫోన్: 08814-277566

Thought of fulfillment

It was one of the Brahmotsavam days in Tirumala. The Presiding Deity Sri Malayappaswami with His Consorts was being taken in a grand procession along the four Mada Veedhis. The Lord's smile, as I witnessed, seemed to indicate His benign approval of the sincere devotion and love with which every one, be it the Nagaswaram party, the band, The Divya Prabhanda Goshti in the front or the Veda Parayanam at the rear, or the dedicated officials and board members of TTD walking along, or the priests meeting the mangala harathi demands of the pilgrims, the volunteers, the cultural troupes; last but not least the great throng of the devotees that had all gathered there from every walk of life. This panorama set me on a mood of contemplation and I marveled at the countless auspicious attributes of Lord Venkateshwara that attract the almost unmanageable crowd of people from everywhere and yet ensures a smooth conduct of the daily procession on time and with precision.

It is God Srinivasa's *kalyana gunas* , without doubt, that allure the visiting public to visually feast on Him; for does He not fulfill their wishes and vows in this Kaliyuga? The chief among his numerous qualities is Daya – also known as krupa, karunya, mercy or compassion. The Azhwars coined the apt word *Arul* to this term Daya. And what a stroke of luck to humanity that Sri Vedanta Desika, recognizing this fact, has composed a hundred stanzas on this particular quality and himself gave it the name DAYASATHAKAM. As I was thinking in this vein who but the Executive Officer of TTD Sri K.V.Ramana Chari Garu IAS passed by me. I took it as a God-given chance and requested that a book on Swami Desika's Dayasatakam on Lord Venkateshwara be published. I also suggested that Sri K.V.Raghavacharyulu Garu would be the ideal scholar to do the vyakhyana in Telugu. I was overwhelmed when Sri Ramana Chari Garu readily agreed to my proposal and I was further overwhelmed when his father Sri K.V.Raghavacharyulu Garu consented to undertake the task. I am glad that this small thought of mine has fructified and that this publication is now coming out through Malola Grandhamala, the publishing wing of Sri Ahobila Muth, Hyderabad.

I am blessed to have the willing sanction of Srimad Azhagiyasingar, the holy Peetathipathi of Sri Ahobila Muth in such good ventures that ennoble the souls of humanity. I am ever indebted to him. I also express my gratitude to Sri K.V.Ramana Chari Garu for his encouragement and to his illustrious father Sri K.V.Raghavacharyulu Garu who wrote this commentary in spite of his old age affliction. I am sure the devoted public will immensely benefit from a reading of this book.

K.Devanathan
Chairman
Sri Ahobila Math

Hyderabad.
26th May 2010

శ్రీనివాస పరబ్రహ్మణే నమః

కృతజ్ఞతా నివేదనము

శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో టి.టి.డి ఆస్థాన మంటపమందు జరిగిన సమావేశంలో పరమపూజ్యులైన పలువురు త్రిదండి జీయర్ స్వాములు, పరమభాగవతోత్తములు దయాశతకానికి ఆంధ్రభాషలో వ్యాఖ్యానరచనకై ఆజ్ఞాపించి, మంగళాశాసనంచేసిన ఫలితంగా, 'అమృతాస్వాదినీ' వ్యాఖ్య ఆరంభింపబడింది.

శ్రీ వేదాన్త దేశికులవారు సంస్కృత, ప్రాకృత, ద్రవిడ, మణిప్రవాళ భాషలలో అనుగ్రహించిన శతాధిక గ్రంథాలలో స్తోత్రవాఙ్మయం ప్రసిద్ధం. అందులోనూ 'శ్రీరంగనాథపాదుకా సహస్రం' రూపోపాసనకు సంబంధించినది కాగా 'శ్రీనివాస దయాశతకం' గుణోపాసనకు సంబంధించినది. ఈ రెండు స్తోత్రాలు దేశికుల అపూర్వకవితాశిల్ప కల్పనా ఛమత్కృతికి నిదర్శనాలు.

నమ్మాళ్వార్ల 'తిరువాయ్‌మొళి' పదినూర్ల దివ్యప్రబంధమైతే, 'దయాశతకం' పదిపదుల ప్రబంధం. ఆ 'సహస్రగీతి' లోని ఒక్కొక్క శతకసారం 'దయాశతకం' లోని ఒక్కొక్క దశకంలో ఆవిష్కృతమయింది. పరహితప్రావణ్యమే 'దయ' అని తత్స్వరూప ప్రభావం నిరూపితం.

1. మొదటి దశకంలో 'సేవాయోగ్యత' నిబద్ధమయింది.
2. గుణసార్వభౌమి 'అతిభోగ్యం' గా స్తుతింపబడింది.
3. శ్రీనివాసుని 'శుభసుభగతనువు' దయాకార్యంగా వర్ణితం.
4. దయాదేవి దోషులను రక్షించే వాదనలో 'సర్వభోగ్యాతిశాయిత్వం' వివృతం.
5. శాస్త్రప్రదానం 'శ్రేయస్తద్ధేతుదాతృత్వంగా ప్రదర్శితం.
6. 'ప్రపదన సులభత్వం' విశదీకృతం.
7. 'అనిష్ట విధ్వంస శీలం' నిరూపితం.

8. భక్తచ్ఛందానువర్తిత్వం' ప్రశంసితం.

9. 'నిరు పధిక సుహృత్త్వం' ప్రభావితం.

10. 'సత్పదవియందు సహాయం' ప్రార్థితం. ముగింపు 'అష్టకం' లో సాత్త్విక త్యాగం, ఫలశ్రుతి ప్రస్ఫుటీకృతం.

ఇతః పూర్వం ఎందరో మహానుభావులు దయాశతకానికి సంస్కృతాంధ్రాంగ్లభాషలలో రచించిన వ్యాఖ్యానాలున్ననూ, వాటిని అనుశీలించి, అల్పజ్ఞుడనై 'అమృతాస్వాదినీ, వ్యాఖ్యను రచింపసాహసించిన దాసుణ్ని పండితులు క్షమించగలరని వేడుకొంటున్నాను.

శ్రీమదహోబిలమఠం 45వ పీఠాధిపతులు శ్రీవణ్ శఠకోప శ్రీ నారాయణ యతీంద్ర మహాదేశికులవారు, 46వ పీఠ స్థులైన శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికులవారును ఈ 'దయాశతకానికి శ్రీముఖ పత్రమును కృపజేసినారు. వారి దివ్యచరణారవింద సన్నిధిలో సాష్టాంగప్రణామము లర్పిస్తున్నాను.

శ్రీమదాండవన్ మఠ పీఠాధి పతులు శ్రీ రంగరాజ యతీంద్ర స్వాములవారు అవ్యాజ కృపతో మంగళాశాసనములను అనుగ్రహించారు. వారి తిరుత్తామరచరణ సన్నిధిలో దండవత్ప్రణా మములర్పిస్తున్నాను.

దయా తరంగితాంతరంగులై 'అమృతాస్వాదినీ వ్యాఖ్య' ను పరిష్కరించి, తమ 'మధురానుభవము' ను ఆవిష్కరించి, మంగళాశాసనమును కృపజేసిన మహా మహోపాధ్యాయులు, కవిశాబ్దిక కేసరి, శాస్త్రరత్నాకర ఉ.వే. శ్రీమాన్ శ్రీ.న.చ. రఘునాథాచార్యస్వామి వారి పాదపద్మ సన్నిధిలో నప్రశ్రయ ప్రణామములర్పిస్తున్నాను.

ప.గో. జిల్లా – నరసాపుర వాస్తవ్యులు, న్యాయవేదాన్త విద్వాంసులు ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ని రంగాచార్యస్వామి వారు దాసుని యందు వాత్సల్యా తిశయంతో ఈ వ్యాఖ్యను కటాక్షించి 'అమృత చషక' మందించి మంగళా శాసనం చేశారు. వారి యంఘ్రి సరోజయుగ్మ సన్నిధిలో సవినయంగా ప్రణతులర్పిస్తున్నాను.

ఆస్మచ్ఛ్రేయోభిలాషులు పండితరత్న శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్య స్వామివారికి కృతజ్ఞతా పూర్వకాభివందనములు.

సకల విధాలా సహాయపడినవారు, శాస్త్రసుధీమణులు, విద్వత్సోదరులు, (తిరుపతి) ఉ.వే. శ్రీమాన్ డా॥ చక్రవర్తి రాఘవన్ & రంగనాథన్ స్వాములకు కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు.

అనుక్షణం దాసుణ్ని ప్రోత్సహిస్తున్న సహృదయులు, (హైదరాబాదు - అహోబిలమఠం ఛైర్మన్) ఉ.వే. శ్రీమాన్ కె. దేవనాథన్ గారికి, శ్రీమాన్ వింజమూరి రాఘవన్ గారికి హార్ధిక కృతజ్ఞతాంజలులు.

ఈ గ్రంథాన్ని ప్రకాశింపజేసిన 'శ్రీమాలోలగ్రంథమాల' అహోబిలమఠ (హైదరాబాదు) కార్య నిర్వాహకులు శ్రీమాన్ పి. శ్రీనివాసాచార్య ప్రభృతి సభ్యులందరికి కృతజ్ఞతతో నమోవాకములు.

ఈ 'దయాశతక'మును అందంగా అచ్చు వేసిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేతలు మరియు శ్రీ నీలమేఘమ్ స్వామివారికి, వారి కార్యకర్తలకు ధన్యవాదములు.

వికృతి జ్యేష్ఠ పూర్ణిమ
26 జూన్ 2010

ఇట్లు
బుధజన విధేయుడు
కె.వి. రాఘవాచార్యులు
కేరాఫ్ కె.వి. రమణచారి ఐఏఎస్
ప్రిన్సిపాల్ సెక్రటరి ఎండోమెంట్స్ (ఎ.పి)
16-11-511/డి/43
శాలివాహన నగర్
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500 060.

శ్రీ మతే రామానుజాయ నమః
శ్రీ వేదాన్త దేశిక గురవే నమః
శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః
శ్రీ వేదాన్త దేశిక విరచిత

దయా శతకము

(అమృతా స్వాదినీ వ్యాఖ్యా సహితము)

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ।
వేదాన్తాచార్య వర్యోమే సన్నిధత్తాం సదాహృది ॥
రామానుజ దయాపాత్రం జ్ఞాన వైరాగ్య భూషణమ్।
శ్రీ మద్వేంకట నాథార్యం వందే వేదాన్త దేశికమ్ ॥

1. ప్రపద్యేతంగిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా।
ఇక్షుసార స్రవంత్యేవ యన్మూర్త్యా శర్కరాయితమ్॥
2. విగాహే తీర్థ బహూలాం శీతలాంగురు సంతతిమ్।
శ్రీనివాస దయాంభోధి పరీవాహ పరం పరామ్॥

3. కృతినః కమలావాస కారుణ్యై కాన్తినోభజే।
ధత్తే యత్సూక్తి రూపేణత్రివేదీ సర్వయోగ్యతామ్ ॥
4. పరాశరముఖాన్ వందే భగీరథనయే స్థితాన్।
కమలాకాన్త కారుణ్య గంగా ప్లావిత మద్విధాన్॥
5. అశేష విఘ్నశమన మనీకేశ్వర మాశ్రయే।
శ్రీమతః కరుణాంభోధౌ శిక్షాస్రోత ఇవోత్థితమ్॥
6. సమస్త జననీం వందే చైతన్యస్తన్య దాయినీం।
శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీమ్॥

7. వందే వృషగిరీశస్య మహిషీం విశ్వధారిణీమ్।
తత్కృపా ప్రతిఘాతానాం క్షమయా వారణం యయా॥

8. నిశామయతుమాం నీళా యద్భోగపటలైర్ధ్రువమ్।
భావితం శ్రీనివాసస్య భక్తదోషేష్వ దర్శనమ్॥

9. కమప్యనవధిం వందే కరుణా వరుణాలయమ్।
వృష శైల తటస్థానాం స్వయం వ్యక్తిముపాగతమ్॥

10. అకించన నిధిం సూతిమప వర్గ త్రివర్గయోః।
అంజనాద్రీశ్వర దయా మభిష్టౌమి నిరంజనామ్॥

11. అనుచర శక్త్యాది గుణా మగ్రేసర బోధ విరచితా లోకామ్।
స్వాధీన వృషగిరీశాం స్వయం ప్రభూతాం ప్రమాణ యామిదయామ్॥

12. అపి నిఖిల లోక సుచరిత ముష్టింధయ దురిత మూర్ఛనాజుష్టమ్।
సంజీవయతు దయే మా మంజనగిరినాథరంజనీ భవతీ॥

13. భగవతి దయే! భవత్యా వృషగిరి నాథే సమాప్లుతే తుంగే।
అప్రతిఘ మజ్జనానాం హస్తాలంబో మదాగసాం మృగ్యః॥

14. కృపణ జన కల్పలతికాం కృతాపరాధస్య నిష్క్రియా మాద్యామ్।
వృషగిరి నాథ దయే త్వాం విదంతి సంసార తారిణీం విబుధాః॥

15. వృషగిరి గృహమేధి గుణాః బోధ బలైశ్వర్య వీర్యశక్తి ముఖాః।
దోషాభవేయురేతే యదినామ దయే! త్వయావినాభూతాః॥

16. ఆ సృష్టి సంతతానా మపరాధానాం నిరోధినీం జగతః।
పద్మాసహాయ కరుణే! ప్రతి సంచరకేళి మాచరసి॥

17. అచిద విశిష్టాన్ ప్రళయే జంతూనవలోక్య జాతనిర్వేదా।
కరణకళేబర యోగం వితరసి వృషశైలనాథ కరుణే! త్వమ్॥

18. అనుగుణ దశార్పితేన శ్రీధర కరుణే! సమాహిత స్నేహా।
శమయసి తమః ప్రజానాం శాస్త్రమయేన స్థిర ప్రదీపేన॥

19. రూఢా వృషాచలపతేః పాదే ముఖకాంతి పత్రలచ్ఛాయా।
కరుణే! సుఖయసి వినతాన్ కటాక్ష విక్షేపైః కరాప చేయ ఫలైః॥

20. నయనే వృషాచలేందోః తారా మైత్రీం దధానయా కరుణే!
దృష్టస్త్వయైవ జనిమా నపవర్గ మకృష్టపచ్య మనుభవతి॥

21. సమయోపనతైస్తవ ప్రవాహై రనుకంపే! కృతసంప్లవా ధరిత్రీ।
శరణాగత సస్యమాలినీయం వృషశైలేశ కృషీవలం ధినోతి॥

22. కలశోదధి సంపదో భవత్యాః కరుణే! సన్మతిమంథ సంస్కృతాయాః।
అమృతాంశమవైమి దివ్యదేహం మృతసంజీవన మంజనాచలేందోః॥

23. జలధేరివ శీతతా దయే! త్వం వృషశైలాధిపతేః స్వభావ భూతా।
ప్రళయారభటీ నటీం తదీక్షాం ప్రసభం గ్రాహయసి ప్రసత్తి లాస్యమ్॥

24. ప్రణత ప్రతికూల మూలఘాతీ ప్రతిఘః కోపి వృషాచలేశ్వరస్య।
కలమే యవసాపచాయ నీత్యా కరుణే! కింకరతాం తవో పయాతి॥

25. అబహిష్కృత నిగ్రహాన్ విదంతః
కమలాకాన్త గుణాన్ స్వతంత్రతాదీన్।
అవికల్పమనుగ్రహం దుహానాం
భవతీమేవదయే! భజన్తి సంతః॥

26. కమలానిలయస్త్వయా దయాళుః
కరుణే! నిష్కరుణా నిరూపణే త్వం।
అత ఏవహి తావకాశ్రితానాం
దురితానాం భవతి త్వదేవ భీతిః॥

27. అతిలంఘిత శాసనేష్వ భీక్ష్ణం
వృష శైలాధిపతిర్విజృంభితోష్మా।
పునరేవదయే! క్షమానిదానై
ర్భవతీ మాద్రియతే భవత్యధీనైః॥

28. కరుణే! దురితేషు మామకేషు
ప్రతికారాంతర దుర్జయేషు ఖిన్నః।
కవచాయితయా త్వయైవ శార్ఙ్గీ
విజయస్థాన ముపాశ్రితో వృషాద్రిమ్॥

29. మయితిష్ఠతి దుష్కృతాంప్రధానే
మితదోషానితరాన్వి చిన్వతీత్వమ్।
అపరాధగణై రపూర్ణ కుక్షిః
కమలాకాంతదయే! కథంభవిత్రీ॥

30. అహమస్మ్యపరాధచక్రవర్తీ
కరుణే! త్వంచ గుణేషు సార్వభౌమీ।
విదుషీస్థితి మీదృశీం స్వయంమాం
వృషశైలేశ్వర పాదసాత్కురుత్వమ్॥

31. అశిథిలకరణే ఽ స్మి న్నక్షత శ్వాస వృత్తౌ
వపుషి గమనయోగ్యే వాసమాసా దయేయమ్।
వృషగిరి కటకేషు వ్యంజయత్సు ప్రతీతై
ర్మధు మథన దయే! త్వాం వారిధారా విశేషైః॥

32. అవిదిత నిజయోగక్షేమ మాత్మానభిజ్ఞం
గుణలవరహితం మాంగోప్తు కామాదయే! త్వామ్।
పరవతి చతురై స్తే విభ్ర మైః శ్రీనివాసే
బహుమతి మనపాయాం విందసి శ్రీధరణ్యోః॥

33. ఫలవితరణ దక్షం పక్షపాతానభిజ్ఞం
ప్రగుణ మను విధేయం ప్రాప్య పద్మాసహాయమ్।
మహతి గుణసమాజే మానపూర్వం దయే! త్వం
ప్రతివదసి యథార్థం పాప్మనాం మామ కానామ్॥

34. అనుభవితు మఘౌ ఘం నాలమాగామికాలః
ప్రశమయిత మశేషం నిష్క్రియాభిర్నశక్యమ్ ।
స్వయ మితి హి దయే! త్వం స్వీకృత శ్రీనివాసా
శిథిలిత భవభీతిః శ్రేయసే జాయసే నః ॥

35. అవతరణ విశేషై రాత్మలీలా పదేశై
రవమతి మనుకంపే! మందచిత్తేషు విందన్ ।
వృషభశిఖరినాథ స్త్వన్ని దేశేన నూనం
భజతి శరణభాజాం భావినో జన్మ భేదాన్ ॥

36. పరహిత మనుకంపే! భావయంత్యాం భవత్యాం
స్థిర మనుపధి హార్దం శ్రీనివాసో దధానః ।
లలిత రుచిషు లక్ష్మీ భూమినీళాసు నూనం
ప్రథయతి బహుమానం త్వత్ప్రతి చ్ఛంద బుద్ధ్యా ॥

37. వృషగిరి సవిధేషు వ్యాజతో వాసభాజాం
దురిత కలుషితానాం దూయమానాదయే! త్వమ్ ।
కరణ విలయకాలే కాందిశీక స్మృతీనాం
స్మరయసి బహులీలం మాధవం సావధానా ॥

38. దిశి దిశి గతివిద్భిర్దేశికై ర్నీయమానా
స్థిర తరమనుకంపే! స్త్వాన లగ్నా గుణైస్త్వమ్ ।
పరిగత వృషశైలం పార మారోపయన్తీ
భవ జలధి గతానాం పోత పాత్రీ భవిత్రీ ॥

39. పరిమిత ఫలసంగాత్ ప్రాణినః కింపచానాః
నిగమ విపణి మధ్యే నిత్య ముక్తానుషక్తమ్ ।
ప్రసదన మనుకంపే! ప్రాప్త వత్యా భవత్యా
వృషగిరి హరినీలం వ్యంజితం నిర్విశంతి ॥

40. త్వయి బహుమతిహీనః శ్రీనివాసానుకంపే
జగతి గతి మిహాన్యాం దేవి! సంమన్యతేయః।
సఖలు విబుధ సింధౌ సన్నికర్షే వహంత్యాం
శమయతి మృగ తృష్ణా వీచికాభిః పిపాసామ్॥

41. ఆజ్ఞాం ఖ్యాతిం ధనమనుచరా నాధిరాజ్యాదికం వా
కాలే దృష్ట్వా కమలవసతే రప్యకించిత్కరాణి ।
పద్మాకాంతం ప్రణిహితవతీం పాలనేఽ నన్య సాధ్యే
సారా భిజ్ఞా జగతి కృతినః సంశ్రయంతే దయే! త్వామ్॥

42. ప్రాజాపత్య ప్రభృతి విభవం ప్రేక్ష్య పర్యాయ దుఃఖం
జన్మాకాంక్షన్ వృషగిరి వనే జగ్ముషాం తస్థుషాంవా।
ఆశాసానాః కతిచన విభోః త్వ త్పరిష్వంగ ధన్యైః
అంగీకారం క్షణమపిదయే! హార్ద తుంగై రపాంగైః॥

43. నాభీ పద్మ స్ఫురణ సుభగా నవ్యనీలోత్పలాభా
క్రీడాశైలం కమపి కరుణే! వృణ్వతీ వేంకటా ఖ్యమ్।
శీతానిత్యం ప్రసద నవతీ శ్రద్ధ ధానావగాహ్యా
దివ్యాకాచిత్ జయతి మహతీ దీర్ఘికా తావకీనా॥

44. యస్మిన్ దృష్టే తదితర సుఖైర్గమ్యతే గోష్పదత్వం
సత్యం జ్ఞానం త్రిభిరవధిభిర్ముక్త మానంద సింధుమ్।
త్వత్ స్వీకారా త్తమిహ కృతినః సూరిబృందాను భావ్యం
నిత్యాపూర్వం నిధిమివదయే! నిర్విశం త్యంజనాద్రౌ॥

45. సారంలబ్ధ్వా కమపిమహతః శ్రీనివాసాంబురాశేః
కాలేకాలే ఘనరసవతీ కాళికే వానుకంపే।
వ్యక్తో న్మేషా మృగపతి గిరౌ విశ్వమాప్యాయ యంతీ
శీలో పజ్ఞం క్షరతి భవతీ శీతలం సద్గుణౌ ఘమ్॥

46. భీమే నిత్యం భవజలనిధౌ మజ్జతాం మానవానాం
ఆలంబార్థం వృషగిరి పతి స్త్వన్నియోగాత్ ప్రయుంక్తే।
ప్రజ్ఞాసారం ప్రకృతి మహతా మూలభాగేన జుష్టం
శాఖాభేదై స్సుభగ మనఘం శాశ్వతం శాస్త్ర పాణిమ్ ॥

47. విద్వత్సేవాకతక నికషై ర్వీత పంకాశయానాం
పద్మాకాంతః ప్రణయతి దయే! దర్పణం తేస్వశాస్త్రమ్ ।
లీలాదక్షాం త్వదన వసరే లాలయన్ విప్రలిప్సాం
మాయాశాస్త్రాణ్య పిదమయితుం త్వత్ప్రపన్నప్రతీపాన్ ॥

48. దైవాత్ప్రాప్తే వృషగిరితటం దేహిని త్వన్నిదానాత్
స్వామిన్! పాహీ త్యవశ వచనే విందతి స్వాపమంత్యమ్ ।
దేవః శ్రీమాన్ దిశతి కరుణే! దృష్టిమిచ్ఛంస్త్వదీయాం
ఉద్ఘాతేన శ్రుతి పరిషదా ముత్తరేణాభి ముఖ్యమ్॥

49. శ్రేయః సూతిం సకృదపిదయే! సమ్మతాం యః సఖీంతే
శీతోదారా మలభత జనః శ్రీనివాసస్య దృష్టిమ్ ।
దేవాదీనా మయ మనృణతాం దేహవత్త్వేఽపివిందన్
బంధాన్ముక్తో బలిభి రనఘైః పూర్యతే తత్ప్రయుక్తైః ॥

50. దివ్యాపాంగం దిశసికరుణే। యేషుసద్దేశికాత్మా
క్షిప్రం ప్రాప్తా వృషగిరిపతిం క్షత్రబంధ్వాదయస్తే।
విశ్వాచార్యాః విధిశివముఖాః స్వాధికారోపరుద్ధాః
మన్యేమాతా జడ ఇవ సుతే వత్సలామాదృశేత్వమ్ ॥

51. అతికృపణోఽపి జన్తు రధిగమ్య దయే! భవతీం
ఆశిథిల ధర్మ సేతు పదవీం రుచిరామచిరాత్ ।
అమిత మహోర్మిజాల మతిలంఘ్య భవాంబునిధిం
భవతి వృషాచలేశ పదపత్తన నిత్యధనీ ॥

52. అభిముఖ భావ సంపదభి సంభవినాం భవినాం
క్వచిదుపలక్షితా క్వచిద భంగుర గూఢగతిః।
విమల రసావహా వృషగిరీశ దయే! భవతీ
సపది సరస్వతీవ శమయత్యఘమ ప్రతిఘమ్ ॥

53. అపికరుణే! జనస్య తరుణేందు విభూషణతా
మపి కమలాసనత్వ మపి ధామవృషాద్రిపతేః।
తరతమతావశేన తనుతే ననుతేవితతిః
పరహితవర్ష్మణా పరిపచేళిమకేళిమతీ ॥

54. ధృత భువనా దయే! త్రివిధ గత్యనుకూల తరా
వృషగిరినాథ పాద పరిరంభవతీ భవతీ।
అవిదిత వైభవాఽపిసురసింధురివా తనుతే
సకృదవగాహ మాన మ పతాప మపాపమపి ॥

55. నిగమ సమాశ్రితా నిఖిల లోక సమృద్ధికరీ
భజదఘకూల ముద్రుజ గతిః పరితప్త హితా।
ప్రకటిత హంసమత్స్య కమఠా ద్యవతారశతా
విబుధ సరిత్త్రియం వృషగిరీశదయే! వహసి ॥

56. జగతి మితంపచా త్వదితరా తు దయే! తరళా
ఫలనియమోజితా భవతి సంతపనాయపునః।
త్వమిహ నిరంకుశ ప్రశకనాది విభూతిమతీ
వితరసి దేహినాం నిరవధిం వృషశైలనిధిమ్ ॥

57. సకరుణ లౌకిక ప్రభు పరిగ్రహ నిగ్రహయోః
నియతి ముపాధిచక్ర పరివృత్తి పరంపరయా।
వృషభ మహీధరేశ కరుణే! వితరంగ యతాం
శ్రుతి మిత సంపది త్వయి కథం భవితా విశయః ॥

58. వృషగిరి కృష్ణమేఘ జనితాం జనితాపహరాం
త్వదభిమతిం సువృష్టి ముపజీవ్య నివృత్త తృషః
బహుషు జడాశయేషు బహుమానమపోహ్య దయే !
నజహాతి సత్పథం జగతి చాతకవత్ కృతినః ॥

59. త్వదుదయ తూలికాభిరమునా వృషశైలజుషా
స్థిర చరశిల్పినైవ పరికల్పిత చిత్ర ధియః ।
యతిపతి యామున ప్రభృతయః ప్రథయన్తి దయే!
జగతిహితం న నస్త్వయి భరన్యసనాదధికమ్ ॥

60. మృదుహృదయే దయే మృదిత కామహితే మహితే
ధృతవిబుధే బుధేషు వితతాత్మధురే మధురే ।
వృషగిరి సార్వభౌమ దయితే మయితే మహతీం
భవుకనిధే నిధేహి భవమూలహరాం లహరీమ్ ॥

61. అకూపారై రేకోదక సమయ వైతం డికజవై
రనిర్వాప్యాం క్షిప్రం క్షపయితు మవిద్యాఖ్య బడబామ్।
కృపే! త్వం తత్తా దృక్ ప్రథిమ వృషపృథ్వీధరపతి
స్వరూప ద్వైగుణ్య ద్విగుణ నిజబిందుః ప్ర(భవ) వహసి ॥

62. వివిత్సావేతాళీ విగమపరిశుద్ధేఽపి హృదయే
పటు ప్రత్యాహార ప్రభృతి పుటపాక ప్రచకితాః ।
నమంత స్త్వాం నారాయణ శిఖరి కూటస్థ కరుణే ।
నిరుద్ధ త్వద్ద్రోహో నృపతిసుత నీతిం నజహాతి ॥

63. అనన్యాధీనస్సన్ భవతి పరతంత్రః ప్రణమతాం
కృపే! సర్వద్రష్టా నగణయతి తేషా మపకృతిమ్ ।
పతి స్స్వత్వాపార్ధ్యం ప్రథయతి వృషక్ష్మాధరపతిః
వ్యవస్థాం వైయాత్యాదితి విఘటయంతీ విహరసి ॥

64. అపాంపత్యుఃశత్రూ నసహనమునేర్ధర్మ నిగళం
కృపే! కాక స్త్వేకం హితమితి హినస్తిస్మ నయనమ్ ।
విలీన స్వాతంత్ర్యో వృషగిరి పతిస్త్వద్విహృతి భి
ర్దిశత్యేవం దేవో జనితసుగతిం దండన విధిమ్ ॥

65. నిషాదానాం నేతా కపికుల పతిః కాఽపి శబరీ
కుచేలః కుబ్జాసా వ్రజయువతయో మాల్యకృదితి ।
అమీషాం నిమ్నత్వం వృషగిరిపతేరున్నత మపి
ప్రభూతైః స్రోతోభిః ప్రసభ మనుకం పే! సమయసి ॥

66. త్వయా దృష్ట స్తుష్టిం భజతి పరమేష్ఠీ నిజపదే
వహన్మూర్తీ రష్టౌ విహరతి మృడానీ పరిబృఢః ।
బిభర్తి స్వారా జ్యం వృషశిఖరి శృంగారి కరుణే ।
శునాసీరో దేవాసుర సమరనా సీర సుభటః ॥

67. దయే! దుగ్ధో దన్వ ద్వ్యతియుత సుధాసింధు నయతః
త్వదాశ్లే షా న్నిత్యం జనిత మృత సంజీవన దశాః ।
స్వదంతే దాంతే భ్యః శ్రుతి వదన కర్పూర గుళికాః
విషణ్వంతశ్చిత్తం వృషశిఖరి విశ్వంభర గుణాః ॥

68. జగజ్జన్మ స్థేమ ప్రళయ రచనాకేళి రసికో
విముక్త్యేక ద్వారం విఘటిత కవాటం ప్రణయినామ్ ।
ఇతిత్వయ్యా యత్తం ద్వితయ ముపధీ కృత్య కరుణే !
విశుద్ధానాం వాచాం వృషశిఖరినాథః స్తుతి పదమ్ ॥

69. కలిక్షోభోన్మీలత్ క్షితి కలుషకూలంకషజవై
రనుచ్ఛే దైరేతైరవట తట వైషమ్యరహితైః ।
ప్రవాహైస్తే పద్మా సహచర పరిష్కారిణి! కృపే !
వికల్పంతేఽ నల్పా వృషశిఖరిణో నిర్ఝర గణాః ॥

70. ఖిలంచేతో వృత్తేః కిమిదమితి విస్మేరభువనమ్
కృపే! సింహక్ష్మాభృత్ కృతముఖ చమత్కార కరణమ్।
భరన్యాస చ్ఛన్న ప్రబల వృజిన ప్రాభృత భృతామ్
ప్రతి ప్రస్థానం తే శ్రుతినగరశృంగాటక జుషః॥

71. త్రివిధచిదచిత్సత్తా స్థేమ ప్రవృత్తినియామికా
వృషగిరి విభోరిచ్ఛా సాత్వం పరైర పరాహతా।
కృపణ భరభృత్కిం కుర్వాణ ప్రభూత గుణాంతరా
వహసి కరుణే! వైచక్షణ్యం మదీక్షణ సాహసే॥

72. వృషగిరి పతేర్హృద్యా విశ్వావతార సహాయినీ
క్షపిత నిఖిలావద్యా దేవి! క్షమాది నిషేవితా।
భువన జననీ పుంసాం భోగాపవర్గ విధాయినీ
వితమసి పదే వ్యక్తిం నిత్యాం బిభర్షిదయే! స్వయమ్॥

73. స్వయముదయిన స్సిద్ధాద్యావిష్కృతాశ్చ శుభాలయాః
వివిధ విభవ వ్యూహావాసాః పరంచ పదం విభోః।
వృషగిరి ముఖేష్వే తేష్విచ్ఛావధి ప్రతి లబ్ధయే
దృఢవినిహితా నిశ్శ్రేణిస్త్వందయే! నిజ పర్వభిః॥

74. హితమితి జగద్దృష్ట్వా క్లుప్తైరక్లుప్త ఫలాంతరై
రమతి విహితైరన్యై ర్ధర్మాయిత్తైశ్చ యదృచ్ఛయా।
పరిణత బహుచ్ఛద్మా పద్మాసహాయ దయే! స్వయం
ప్రదిశసి నిజాభి ప్రేతం నః ప్రశామ్యద పత్రపా॥

75. అతివిధిశివై రైశ్వర్యాత్మానుభూతి రసైర్జనాన్
అహృదయ మిహోపచ్ఛం ద్వైషా మసంగదశార్థినీ!
తృషిత జనతా తీర్థస్నాన క్రమక్షపితైనసాం
వితరసి దయే! వీతాతంకా వృషాద్రి పతేః పదమ్॥

76. వృషగిరి సుధాసింధౌ జన్తుర్దయే! నిహితస్త్వయా
భవ భయ పరీతాపచ్ఛిత్త్యై భజ న్నఘమర్షణమ్ ।
ముషిత కలుషో ముక్తే రగ్రేసరై రభిపూర్యతే
స్వయ ముపనతైః స్వాత్మానంద ప్రభృత్యనుబంధిభిః ॥

77. అనితరజుషా మంతర్మూలే ౽ ప్యపాయపరిప్లవే
కృతవిదనఘా విచ్ఛిద్త్యైషాం కృపే! యమవశ్యతామ్ ।
ప్రపదన ఫలప్రత్యాదేశ ప్రసంగ వివర్జితం
ప్రతి విధిముపాధత్సే సార్ధం వృషాద్రిహితైషిణా ॥

78. క్షణవిలయినాం శాస్త్రార్థానాం ఫలాయనివేశితే
సురపితృగణే నిర్వేశాత్ ప్రాగపి ప్రళయంగతే ।
అధిగత వృషక్ష్మాభృన్నాథా మకాల వశం వదాం
ప్రతిభువ మిహ వ్యాచఖ్యుస్త్వాం కృపే! నిరుపప్లవామ్ ॥

79. త్వదుప సదనాదద్య శ్వోవా మహాప్రళయే౽ పివా
వితరతి నిజం పాదాంభోజం వృషాచలశేఖరః ।
తదిహకరుణే! తత్తత్క్రీడా తరంగ పరంపరా
తరతమ తయా జుష్టాయాస్తే దురత్యయతాం విదుః ॥

80. ప్రణిహిత ధియాం త్వత్సంపృక్తే వృషాద్రి శిఖామణౌ
ప్రసృమర సుధాధారాకారా ప్రసీదతి భావనా ।
దృఢమితి దయే! దత్తాస్వాదం విముక్తి వలాహకం
ని భృత గరుతో నిధ్యాయంతి స్థిరాశయ చాతకాః ॥

81. కృపే! విగత వేల యా కృతసమగ్రపోషైస్త్వయా
కలి జ్వలన దుర్గతే జగతి కాలమేఘాయితమ్ ।
వృషక్షితి ధరాదిషు స్థితిపదేషు సానుప్లవైః
వృషాద్రి పతి విగ్రహై ర్వ్యపగతాఖిలావగ్రహైః ॥

82. ప్రసూయ వివిధం జగత్తదభివృద్ధయే త్వందయే।
సమీక్షణ విచింతన ప్రభృతిభిః స్వయం తాదృశైః।
విచిత్ర గుణచిత్రితాం వివిధ దోషవై దేశికీం
వృషాచల పతే స్తనుం విశసి మత్స్య కూర్మాదికామ్॥

83. యుగాంత సమయోచితం భజతి యోగనిద్రారసం
వృషక్షితి భృదీశ్వరే విహరణక్రమాజ్జాగ్రతి।
ఉదీర్ణ చతురర్ణవీ కదన వేదినీం మేదినీం
సముద్ధృతవతీ దయే! త్వదభిజుష్టయా దంష్ట్రయా॥

84. సటాపటలభీషణే సరభసాట్ట హాసోద్భటే
స్ఫుర త్క్రుధి పరిస్ఫుటత్భ్రుకుటికే ఽ పి వక్త్రేకృతే।
దయే! వృషగిరీశితుర్దనుజడింభదత్త స్తనా
సరోజసదృశా దృశా సముదితా కృతిర్దృశ్యసే॥

85. ప్రసక్త మధునా విధిప్రణిహితైస్సపర్యోదకైః
సమస్త దురితచ్ఛిదా నిగమగంధినాత్వందయే !
అశేష మవిశేషతస్త్రి జగదంజనాద్రీశితుః
చరాచర మచీకరశ్చరణ పంకజేనాంకితమ్॥

86. పరశ్వథ తపోధన ప్రధన సత్క్రతూ పాకృత -
క్షితీశ్వర పశుక్షరత్ క్షతజ కుంకుమస్థాసకైః।
వృషాచల దయాలునా నను విహర్తు మాలిప్యథాః
నిధాయ హృదయే దయే! నిహత రక్షితానాం హితమ్॥

87. కృపే! కృతజగద్ధితే! కృపణజన్తు చిన్తామణే!
రమా సహచరం తదా రఘుధురీణయంత్యా త్వయా।
వ్యభజ్యత సరిత్పతిః సకృదవేక్షణాత్తత్క్షణాత్
ప్రకృష్ట బహుపాతక ప్రశమ హేతునా సేతునా॥

88. కృపే! పరవతస్త్వయా వృషగిరీశితుః క్రీడితం
జగద్ధిత మశేషత స్తదిద మిత్థ మర్థాప్యతే।
మదచ్ఛల పరిచ్యుత ప్రణత దుష్కృత ప్రేక్షితై
ర్వత ప్రబల దానవైర్వల ధరస్య హేలాశతైః ॥

89. ప్రభూత విబుధద్విషద్భరణ ఖిన్న విశ్వంభరా
భరాపనయన చ్ఛలాత్త్వ మవతార్య లక్ష్మీధరమ్।
నిరాకృత వతీ దయే! నిగమసాధ దీపశ్రియా
విపశ్చిదవిగీతయా జగతి గీతయాఽ ంధం తమః ॥

90. వృషాద్రి హయసాదినః ప్రబల దోర్మరుత్ప్రేంఖిత
స్త్విషా స్ఫుటతటిద్గుణ స్త్వదవసేక సంస్కారవాన్।
కరిష్యతి దయే! కలి ప్రబల ఘర్మ నిర్మూలనః
పునః కృతయుగాం కురం భువి కృపాణధారాధరః ॥

91. విశ్వోపకారమితినామ సదా దుహానా
మద్యాపిదేవి! భవతీ మవధీరయంతమ్।
నాథే నివేశయ వృషాద్రి పతేర్దయే! త్వం
న్యస్త స్వరక్షణభరం త్వయి మాంత్వయైవ ॥

92. నైసర్గికేణ తరసా కరుణే! నియుక్తా
నిమ్నేతరేఽ పి మయితే వితతిర్యది స్యాత్।
విస్మాపయే ద్వృషగిరీశ్వర మప్యవార్యా
వేలాతిలంఘున దశేవ మహాంబురాశేః ॥

93. విజ్ఞాత శాసన గతిర్విపరీత వృత్త్యా
వృత్రాదిభిః పరిచితాం పదవీం భజామి।
ఏవం విధే వృషగిరీశ దయే! మయిత్వం
దీనే విభోశ్శమయ దండధరత్వ లీలామ్ ॥

94. మాసాహసోక్తి ఘనకంచుక వంచితాన్యః
పశ్యత్సు తేషు విదధా మ్యతిసాహసాని।
పద్మాసహాయ కరుణే! నరుణత్సికిం త్వం
ఘోరం కుళింగశకు నేరివ చేష్టితం మే॥

95. విక్షేప మర్హసిదయే! విపలాయితేఽపి
వ్యాజం విభావ్య వృషశైలపతే ర్వి హారమ్।
స్వాధీన సత్వ సరణిః స్వయ మత్ర జంతౌ
ద్రాఘీయసీ దృఢతరా గుణవాగురా త్వమ్॥

96. సంతన్యమాన మపరాధగణం విచింత్య
త్రస్యామి హంత భవతీం చ విభావయామి।
అహ్నాయ మే వృషగిరీశ దయే। జహీమా
మాశీవిషగ్రహణ కేళి నిభా మవస్థాం॥

97. ఔత్సుక్యపూర్వముపహృత్య మహాపరాధాన్
మాతః ప్రసాదయితు మిచ్ఛతి మే మన స్త్వామ్।
ఆలిహ్యా తాన్నిరవశేష మలబ్ధ తృప్తి
స్తామ్యస్య హో! వృషగిరీశధృతా దయే! త్వమ్॥

98. జహ్యాద్వృషాచలపతిః ప్రతిఘే ఽపి నత్వాం
ఘర్మోపతప్త ఇవ శీతలతా ముదన్వన్।
సా మా మరుంతుద భర వ్యసనానువృత్తి
స్త ద్వీక్షణైః స్పృశదయే! తవకేళి పద్మైః॥

99. దృష్టేఽపి దుర్బలధియం దమనేఽపి దృప్తం
స్నాత్వాఽపి ధూళిరసికం భజనేఽపి భీమమ్।
బద్ధ్వా గృహాణ వృషశైలపతేర్దయే! మాం
త్వద్వారణం స్వయమనుగ్రహ శృంఖలాభిః॥

100. నాతఃపరం కిమపి మే త్వయి నాథనీయం
మాతర్దయే! మయి కురుష్వ తథా ప్రసాదమ్ ।
బద్ధాదరో వృషగిరి ప్రణయీ యథాఽసౌ
ముక్తానుభూతి మిహ దాస్యతిమే ముకుందః ॥

101. నిస్సీమ వైభవజుషాం మిషతాం గుణానాం
స్తోతు ర్దయే! వృషగిరీశ గుణేశ్వరీం త్వామ్ ।
తైరేవ నూనమవశై రభినందితం మే
సత్యా పితం తవ బలాదకుతో భయత్వమ్ ॥

102. అద్యాపి తద్వృషగిరీశదయే! భవత్యా
మారంభ మాత్ర మనిదం ప్రథమస్తు తీనామ్ ।
సందర్శిత స్వపర నిర్వహణా సహేథాః
మందస్య సాహసమిదం త్వయి వందినో మే ॥

103. ప్రాయోదయే! త్వదనుభావ మహాంబురాశౌ
ప్రాచేతస ప్రభృత యోఽపి పరం తటస్థాః ।
తత్రావతీర్ణ మతలస్పృశమాప్లుతం మాం
పద్మాపతేః ప్రహసనోచిత మాద్రియేథాః ॥

104. "వేదాన్త దేశిక" పదే విని వేశ్య బాలం
దేవో "దయా శతక" మేతదవాదయన్మామ్ ।
వైహారికేణ విధినా సమయే గృహీతం
వీణా విశేషమివ వేంకటశైల నాథః ॥

105. అనవధి మధికృత్య శ్రీనివాసానుకంపా
మవితథ విషయత్వా ద్విశ్వమవ్రీడయంతీ ।
వివిధ కుశల నీవీ వేంకటేశ ప్రసూతా
స్తుతిరియ మనవద్యా శోభతే సత్త్వభాజామ్ ॥

106. శతక మిద ముదారం సమ్యగభ్య స్యమానాన్
వృషగిరి మధిరుహ్యా వ్యక్తమాలోకయంతీ ।
అనితరశరణానా మాధిరాజ్యేఽ భిషించేత్
శమిత విమత పక్షా శార్‌ఙ్గ ధన్వాఽ నుకంపా ॥

107. విశ్వానుగ్రహ మాతరం వ్యతిషజత్స్వర్గాపవర్గాం సుధా
సధ్రీచీ మితి వేంకటేశ్వర కవిర్భక్త్యా దయా మస్తుత ।
పద్యానా మిహ యద్విధేయ భగవత్సంకల్ప కల్పద్రుమాత్
ఝుంఝా మారుత ధూత చూత నయతః సాంపాతి కోఽ యంక్రమః॥

108. కామంసన్తు మిథః కరమ్బిత గుణా వద్యాని పద్యాని నః
కస్యాస్మిన్ శతకే సదమ్బుకతకే దోష శ్రుతిం క్షామ్యతి ।
నిష్ప్రత్యూహ వృషాద్రినిర్‌ఝర ఝరత్కారచ్ఛలే నోచ్ఛలన్
దీనాలంబన దివ్యదమ్పతి దయాకల్లోల కోలాహలః ॥

శ్రీ మతే రామానుజాయ నమః
శ్రీ వేదాన్త దేశిక గురవే నమః
శ్రీ శ్రీనివాస పరబ్రహ్మణే నమః
శ్రీ వేదాన్త దేశిక విరచిత

దయా శతకము

(అమృతా స్వాదినీ వ్యాఖ్యా సహితము)

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ ।
వేదాన్తాచార్య వర్యోమే సన్నిధత్తాం సదాహృది ॥
రామానుజ దయాపాత్రం జ్ఞాన వైరాగ్య భూషణమ్ ।
శ్రీ మద్వేంకట నాథార్యం వందే వేదాన్త దేశికమ్ ॥

1. ప్రపద్యేతంగిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా।
ఇక్షుసార స్రవంత్యేవ యన్మూర్త్యా శర్కరాయితమ్॥

అర్థం: ఇక్షుసార స్రవంత్యా+ఇవ = చెఱుకు రసమయమైన నది వలె ఉన్నట్టి; శ్రీనివాస+అనుకంపయా = శ్రీనివాసుని యొక్క దయ (చేత) ప్రాయః = తరచుగా; యత్+మూర్త్యా = ఏ వేంకటగిరి యొక్క ఆకృతిచే; శర్కరాయితం = చక్కెరగా / గులకరాళ్ళుగా ఆచరింప బడినదో; తం = ఆ; గిరిం = వేంకటాద్రి(ని)కి; ప్రపద్యే = (శరణు పొందుతున్నాను) నమస్కరిస్తున్నాను.

తా: శ్రీనివాసుని దయ చెఱుకు రస ప్రవాహం వంటిది. చెఱకు రస ప్రవాహం గడ్డ కట్టితే చక్కెరగా మారుతుంది. అట్లే, శ్రీనివాసుని దయా ప్రవాహం ఘనీభవించి అద్రిగా పరిణమించింది. అట్టి వేంకట గిరికి నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య: అమృతాస్వాదినీ శ్రీనివాస భగవానుని దయారూపమైన వేంకటాద్రిని గూర్చి ప్రపత్తి చేశారు దేశికులు.

కరుణవేదియైన ఆదికవి వాల్మీకి 'మానిషాద' అంటే శ్రీనివాసా! అని సంబోధిస్తూ అతని దయను ప్రకాశింప జేసే 'దీర్ఘ శరణాగతి శాస్త్రం' అనే శ్రీమద్రామాయణ మహాకావ్యాన్ని లోకానికి ప్రసాదించాడు. శ్రీ వేంకటేశ ఘంటాపతారులైన, వేదాంత దేశికులు సప్తద్వీపయైన పృథ్విలో సప్త పర్వాలు గల 'తిరుమల' గా మూర్తీభవించిన భగవతి దయాదేవికి 'ప్రపద్యే' అని శరణాగతి జేస్తూ ప్రపత్తి ప్రాధాన్యం గల దయా శతకాన్ని మనకు కృపజేశారు.

ప్రపద్యే: దయా శతకం 'ప్రపద్యే' అనే క్రియా పదం తో ఆరంభింవబడింది. క్రియా ప్రధానమైనది జగత్తు. కాబట్టి దయా పరిణామమైన పర్వతానికి దేశికులు స్వయంగా ప్రపదనమనుష్ఠించారు.

ప్రపత్తి, శరణాగతి, న్యాసం అనేవి పర్యాయ పదాలు.

"తస్మాన్న్యాసమే షాంతపసా మతిరిక్త మాహుః"

ఋతం, సత్యం, ధర్మం, దానం, దమం, యజ్ఞం మొదలైన తపస్సులలో కెల్ల, న్యాసం - భగవంతుని యందు తన ఆత్మ రక్షా భారాన్ని సమర్పించడం - మోక్షానందాన్ని పొందడానికి శ్రేష్ఠమైన పద్ధతి అని ఉపనిషద్వాణి. 'భగవన్! నేను నీ వాడను. నీవు స్వామివి. నేను నీ సొత్తును. కాబట్టి నన్ను రక్షించే భారం నీదే' అని మహా విశ్వాసంతో ప్రార్థించడమే ప్రపత్తి, శరణాగతి.

ప్రపదనం దయోత్తంభకం. దయనుతల యెత్తునట్లు చేసేది ప్రపత్తి. 'పెద్దవారి అనుగ్రహాన్ని పొందడానికి వారి పాదాలకు ప్రణమిల్లి ఆశ్రయించడం లోకమర్యాద కదా! ఆశ్రయించిన వారిని రక్షించడం దయాగుణం యొక్క కార్యం.

తంగిరిం: ఆ పర్వతమని అర్థం. పరోక్షంగా / దూరంగా ఉండే వస్తువును నిర్దేశించేది తచ్ఛబ్దం. ప్రత్యక్షంగా కనబడేదానికీ 'తత్' శబ్దాన్ని ప్రయోగించడం వల్ల, అది ప్రసిద్ధమైనదని అర్థం. "గృ-నిగరణే" అనే ధాతువు నుంచి నిష్పన్న

మైనది 'గిరి' శబ్దం. ఆశ్రయించిన వ్యక్తి యొక్క కష్టాలను తాను దిగమింగి అతనిని రక్షించేది 'గిరి' అని అర్థం.

"దివాకరాద్రక్షతి యోగుహాసు, లీనం దివాభీత మివాంధ కారమ్।
క్షుద్రేఽపినూనం శరణం ప్రపన్నే, మమత్వ ముచ్చైః శిరసాం సతీవ॥
(కుమార సంభవం 1-12)

హిమవత్పర్వతం, పగటి యందు భయపడినట్లు, గుడ్లగూబ వలె, తన గుహలలో దాగియున్న చీకటిని సూర్యుని నుంచి కాపాడుతున్నది. 'క్షుద్రుణ్ని రక్షించడం తగదు' అనే శంకను పరిహరిస్తూ, అర్థాంతర న్యాసవాక్యమైన ఉత్తరార్థం చేత రక్షణను సమర్థించాడు మహాకవి కాళిదాసు. ఉన్నతులైన వ్యక్తులకు శరణాగతుడైన క్షుద్రుని యందు కూడా సజ్జనుని యందున్నట్లే 'మమత్వం' అంటే 'ఇతడు నావాడు' అనే అభిమానం ఉంటుంది అన్నాడు.

"శరణాగతమివాధో నిలీనం తిమిరసంఘ మవత్సు ప్రదీపేషు". శరణాగతుని లాగా తమ అడుగున ప్రాకులాడుతున్న అంధకార సముదాయాన్ని దీపాలు రక్షిస్తున్నాయి. అని 'వాసవదత్త' లోనూ, కాళిదాసు కంటె పూర్వుడైన భాస మహాకవి కూడా అమిత్రమూ అయోగ్యమూ అయిన తమస్సు కూడా కాళ్ళు పట్టుకున్నందు వల్ల కాపాడబడుతుందన్నాడు.

మరి, అది శ్రుతి స్మృతులూ పొగడుతున్న పర్వతం కదా!

"అరాయికాణే వికటే గిరింగచ్ఛ సదాన్వే। శిరింబిఠస్య సత్త్వభిః తేభిస్త్వాచాత యామసి॥"

పేదతికం చేత రక్తి లేకున్నా, మానసికంగా గానీ శారీరకంగానీ, వైకల్యమున్నా, సంకటంలో చిక్కుకొన్నా, దానవుల చేత పీడింపబడినా, వేంకట గిరికి పొమ్ము. శ్రీనివాసుని అప్రమేయగా తేజః పుంజం చేత నిన్ను తృప్తిపరుచు కొంటావు. (అని శ్రుతి ప్రసిద్ధం).

"వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తికించన".

"వేంకటాచలంతో సమానమైన ప్రదేశం బ్రహ్మాండమందు మరేదీ లేదు. (అని పురాణ ప్రసిద్ధం)

"కణ్ణనడియిణై యెమక్కు క్కాట్టుమ్ వెఱ్ప్పు" (అధికార సంగ్రహమ్ - 43 పా)

శ్రీకృష్ణ భగవానుడు ద్వాపరయుగంలో 'మామేకం శరణం వ్రజ' అని ఉపదేశించాడు. 'కలౌ వేంకటనాయకః' కలియుగంలో ఆ గీతాచార్యుడే వేంకటాద్రియందు అర్చా రూపంతో ఇదిగో నా పాదాలను ఆశ్రయించండి. సర్వ పాపాల నుంచి విముక్తులవుతారు, అన్నట్లు వెలసియున్న శ్రీ వేంకటేశ్వరుని దివ్యపాద పద్మాలను ప్రదర్శిస్తున్న పర్వతమే 'తిరుమల' -

మిన్నుమ్ శుడర్ మలైక్కుమ్ - ఉజ్జ్వల తేజో రూప పర్వతం లాంటివాడు, 'మరదగక్కున్ఱ మొక్కుమ్" - మరతక పర్వతం లాంటివాడు. (తి.వా.మొ. 2-5-3)

"విష్ణుః పర్వతానా మధిపతిః" అని శ్రుతి పల్కినట్లు, "విణ్ణవరుమ్ మణ్ణవరుమ్ విరుంబుమ్ వెఱ్ప్పు" వైకుంఠంలో ఉండే నిత్యసూరులూ, ప్రకృతి మండలంలోని జనులూ భగవానుని సేవించడానికి గుంపులు గుంపులుగా వచ్చి ఆదరించే పర్వతమిది.

వేదాత్మయైన గరుడుడే కొండగా నిల్చినందువల్ల గరుడాచలమని ప్రసిద్ధి గాంచిన వేదవెఱ్ప్పు = వేదగిరియిది. ఇలాగా దేశికులు వెఱ్ప్పు, వెఱ్ప్పు అని ఈ పాశురమందు ఏడు సార్లు ప్రయోగించి ఇది 'సప్తగిరి' అని విశదం చేశారు. (వేం = పాపం; కటతి = దహతి, ఇతి = వేంకటః)

"వేంకారోఽమృత బీజం స్యాత్, కట మైశ్వర్య ముచ్యతే।
అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటేతి విదుర్బుధాః॥"

ఐశ్వర్యాన్ని, మోక్షానుభవాన్ని - రెండింటినీ ప్రసాదించేది వేంకటాచలం. (వేంకటాచలమాహాత్మ్యం). సర్వపాపాలకు నిష్కృతి ప్రపత్తి. కాబట్టి గిరిని శరణు పొందడం ఆవశ్యకమే.

అయితే, శిలోచ్చయం కఠినాతి కఠినమైనది కదా!

"కైకేయి! తస్యశయనాని కథంభవేయుః,
త్వచ్చేతసోఽపి కఠినాని శిలాతలాని॥" (రా. అయో)

ఓసి కైకేయీ! నీ గుండె కంటె కఠినమైన బండలు రామునికి పడకలెలా అవుతాయి? అని దశరథుడన్న మాటే ఇది. కాబట్టి, గిరి దయామూర్తి ఎలా అవుతుంది? అంటే, 'గిరి దయామూర్తియే' అని దేశికులు అందంగా సమర్థించారు.

ప్రాయః: తరచుగా, సాధారణంగా అని అర్థం. ఈ పదం 'ఉత్ప్రేక్ష'కు వ్యంజకం.

శ్రీనివాసానుకంపయా:- శ్రీనివాసుని దయచేత, అని అర్థం. శ్రీదేవి తన యందు నిత్యం నివసించి యుండడం వల్ల శ్రీనివాసుడని పేరు. "పరస్మిన్ బ్రహ్మణి శ్రీనివాసే" అని భగవద్రామానుజుల శ్రీసూక్తి. ధ్యేయమైన పరతత్వం, సగుణ సవిగ్రహ బ్రహ్మ స్వరూపం. సామాన్య విశేష న్యాయానుసారంగా (సిరిగల) శ్రీమంతుడైన నారాయణుడే అని నిర్ధారించిన విషయమిది. "శ్రీ సంశ్రయణం నిత్యం స్వరూపవత్ మూర్త్యాఽపి శ్రీవత్స వక్షా నిత్యశ్రీః ఇత్యభిధానాత్" అని దేశికులు ఈ విషయాన్నీ వివరించారు. ఇది 'దివ్యదంపతి దయ' అని అర్థం. 'దైవతం దంపతీనః" (శ్రీస్తుతి) ఈ స్తోత్రారంభంలోనే చెప్పిన విషయాన్ని ఉపసంహారంలోనూ "దీనాలంబన దివ్య దంపతి దయా కల్లోల కోలాహలః" (108) అని చెప్పినారు దేశికులు. దిక్కూ చక్కీలేని దీనజనులకు ఆలంబనమైనది దివ్యదంపతి దయ. 'శ్రీనివాసానుకంపా' అనడం వల్ల భగవానుని యందు దయ యున్నట్లే విష్ణుపత్నియైన శ్రీదేవి యందు కూడా ఎట్టి మార్పు లేకుండా దయ ఉంటుందని నిరూపింపబడింది.

'దయ' అనేది గుణమేకాని 'గుణి' కాదు. 'దేజ్-రక్షణే' అనే ధాతువు నుంచి నిష్పన్నమై "దయంతే - రక్షంతి అనయా ఇతి దయా" (దీని చేత రక్షిస్తారు) అని వ్యుత్పత్త్యర్థం కలది 'దయా' శబ్దం. 'జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్యతేజస్సు' లనే షడ్గుణాల నుంచి ఏర్పడిన అనంత కల్యాణ గుణాలు కలవాడు భగవానుడు.

"తద్గుణ సారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్" అనే బ్రహ్మ సూత్రం 'జ్ఞాధికరణం' లో ఉంది.

గుణాలలో సారమైనది జ్ఞానం. జ్ఞానావస్థా భేదాల యందు సారమైన గుణం 'దయ' అని సూత్ర సారార్థం.

'కారుణ్యం కరుణా ఘృణా, కృపాదయాఽను కంపాస్యాత్ అనుక్రోశః" అని దయకు పేర్లు. (అమరం) 'అనుకంపా' శబ్దంలో ఎంతో స్వారస్యం ఉంది. 'కంప' మంటే చలించడం, భయపడడమని అర్థం.

"భీషాఽస్మాద్వాతఃపవతే" అనే శ్రుతి రీత్యా, లోకాలను కంపింప జేసే వాయువు, సూర్యుడు, అగ్ని మొదలైనవి భగవానుని భయం చేత కంపిస్తూ విధులను నిర్వహిస్తుంటాయి. లోకాలను కంపింప జేసే వారిని కూడా కంపింప జేసే సర్వేశ్వరుణ్ని కూడా కంపింప-చలింపజేసే అర్థం 'అనుకంప' శబ్దమందున్నది. భగవానుడు స్వయంగా కంపించే ప్రసక్తియే లేదు. ప్రాణుల కంపాన్ని - భయం, కష్టం, దుఃఖాన్ని అనుసరించి కలిగిన కంపం - హృదయం చలించడం, ద్రవించడం 'అనుకంప' అనబడుతుంది.

"కపి - కించిత్ చలనే" అను కంపంతే అనయా ఇతి = అనుకంపా. దీనితో కొంచెం స్పందిస్తారు. కాబట్టి 'అనుకంపా' శబ్దానికి 'దయ' అని అర్థం. 'దయ' లేని హృదయాన్ని 'హృదయం' అనతగదు. దేశికులు ఈ 'దయాశతకం' మొదటి శ్లోకంలోనే 'శ్రీనివాసానుకంపయా' అనే పదాన్ని ప్రయోగించారు. కాబట్టి 'దయ' అంటే పరదుఃఖ దుఃఖిత్వమే కాదు, 'పరదుఃఖ నివారణేచ్ఛా సంరంభం' అంటే ఇతరుల దుఃఖాన్ని పోగొట్టగోరే యత్నమని అర్థం.

ఇక్షుసార స్రవంత్యా ఇవ:- చెఱుకు రసప్రవాహం లాంటిది, శ్రీనివాసానుకంప. "రసాల ఇక్షుః" (అమరం), 'రసేన అలత ఇతిరసాలః' అనీ, ఇష్యతే సర్వైః ఇతి ఇక్షుః' రసం చేత భూషింపబడేది (కాబట్టి) అందరిచే కోరబడేది. అని ఆ శబ్దాలకు అర్థం. రసమయమైన చెఱుకు గడకే గౌరవం కాబట్టి అందఱు అపేక్షిస్తారు.

"అపరాశ్చోదకం శీత మిక్షుకాండరసో పమమ్" (రా.అయో. 91 స.15)

భరతుని సైన్యానికి భరద్వాజ మహర్షి విందు చేయడం కోసం ఆయన కోరిన రీతిగా, నదులు చెఱుకురసంతో సమానమైన నీరు కలవియై ప్రవహించాయట. 'స్రవంతి' అంటే సర్వకాలాలలో నీటితో పారే ఏరు 'జీవనది' అని అర్థం.

"ఇక్షుక్షీర గుడా దీనాం మాధుర్య స్యాంతరం మహత్।
తథాఽ పి న తదాఖ్యాతుం సరస్వత్యాఽ పి శక్యతే॥"

చెఱుకు, పాలు, బెల్లం మొదలైన పదార్థాల మధురిమ వేర్వేరుగా ఉంటుంది. చాలా భేదమున్నా వాటి మాధుర్యాన్ని మాటల (వాగ్దేవి)చే ప్రకటింప శక్యం కాదు. ఈ 'దండి' (కవి) వచనాన్ని దేశికులు 'నిక్షేపరక్ష' అనే గ్రంథంలో ఉదాహరించారు.

ఇక్షు క్షీరగుడాదులలో 'ఇక్షు' శబ్దమే మొదట గ్రహింపబడింది. కాబట్టి, దాని మధురిమ అనుభవించిన వారికే తెలుస్తుంది. ఇది బ్రహ్మేక్షువు. దీని సారం అపరిమితం. శ్రీనివాస భగవానుడే ఇక్షుకాండం. దాని సారమే దయారసం. అది స్రోతస్సుగా (స్తోత్రంగా) ప్రవహిస్తున్నది.

యన్మూర్త్యా శర్కరాయితమ్:- శ్రీనివాస దయా రసమే శర్కర (పర్వతం)గా పరిణమించింది. చెఱుకు రసం శర్కరగా మారడం ఒక గొప్ప పని. (Factory work) శర్కరాయితమైన దయా శరీరం దుఃఖగంధరహితమైనది, అతి మధురమైనది. శ్లిష్టపదం 'శర్కర'. 'శీర్యతే' ఇతి శర్కరా (శౄ-విశరణ). కరగిపోయేది. ప్రక్కలయ్యేది. పంచదారకు పేరు.

'శృణాతి ఇతి శర్కరా' (శౄహింసాయాం) హింసించేది. మొరపనేల, గులకరాళ్ళు (Pebbles) గల నేలకు పేరు.

"శర్కరాఖండ వికృతా వుపలా కర్పరాంశయోః।
శర్కరాన్విత దేశేచ రుగ్భేదే శకలేఽ పిచ॥" (విశ్వ నిఘంటువు)

'శర్కరా' శబ్దానికి చక్కెర, రాయి, పెంకు, ఒక రోగం మొదలైన నానార్థాలు న్నాయి.

("శర్కరాం పాద జిహ్వాభ్యామక్షిరోగీవివర్జయేత్" కంటి రోగమున్న వ్యక్తి శిలా శకలాల మీద నడువ కూడదు. పంచదారను తినకూడదు, అనే వాక్యాన్ని 'నిక్షేపరక్ష'లో ఉదాహరించారు దేశికులు.

ఇక్షురసాన్ని బాగా వేడి చేస్తేగాని ఘనీభవించదు. ఉడుకుతున్న రసాన్ని ఆస్వాదించరాదు. అది ఘనీభవించిన కలకండను మాత్రం రుచి చూడవచ్చు కదా. లోకుల, పాపతాపాల చేత శ్రీనివాసుని దయ (ఇక్షుసారం) ఘనీభవించినందు వల్ల కలకండ వలె అనుభవింప యోగ్యమైనది.

"సైంధవఘనః, ప్రజ్ఞానఘనః, ఆనంద ఘనః" అని వేదాంత శాస్త్రమందు బ్రహ్మస్వరూపం వర్ణింపబడింది. రసఘనంగా ఉపమింపబడిన పరబ్రహ్మ శ్రీనివాసుడే – "కరుంబినిన్ శాత్తైక్కట్టియై" చెరకురసం వంటివాడు. పటిక బెల్లం వంటివాడు అన్నారు ఆళ్వార్లు. అలాగే, దయాసారఘన మైన గిరి (తిరుమల) శర్కరా ఘన మని (ప్రాయఃశర్కరాయితం) ఉత్ప్రేక్షింపబడింది. "యన్మూర్త్యా" అని 'యత్' శబ్దం వల్ల శబ్ద శక్తి మూలక మైన ధ్వని అనురణిస్తున్నది. భగవదర్చామూర్తి లాగా గిరి మూర్తి కూడా పూజింపదగినదని వ్యక్తమవుతున్నది. శర్క రామయమైన వేంకటగిరి తన శిఖరమందు వేంచేసియున్న శ్రీనివాస భగవానునికి కూడా రుచి జనకమై ఆదరణీయంగా ఉంది.

ప్రపన్నజనకూటస్థులైన శ్రీ శఠకోప దివ్యసూరులు కూడా 'పరన్‌శెన్రుశేర్ తిరువేంగడమామలై ఒన్రుమే తొజునమ్ వినైయోయుమే" పరమశేషియైన శ్రియః పతి పరమప్రీతితో వచ్చి నివసించియున్న 'తిరుమల' అనే ఒక్క మహా పర్వతానికి నమస్కరిస్తే మనకు సకల ప్రతిబంధకాలుగా ఉన్న నిఖిల పాపాలు తమంత తామే నశిస్తాయన్నారు.

మనకు ప్రాప్యరుచి కలుగడానికే శ్రీనివాసుని దయ అనే ఇక్షుసార స్రవంతి ఘనీభవించి శర్కరాయితమైన గిరివలె చలించకుండా స్థిరంగా ఉన్నది.

శ్రుతి స్మృతి ప్రతిపాదితమైన వేంకటాచల మహిమను బట్టి దాని తల మీద 'నా పాదాలను ఆశ్రయించండి' అని సాక్షాత్తుగా ప్రదర్శిస్తూ నిలిచియున్న శ్రీనివాసునికి వేంకటేశ్వరుడన్న పేరు ప్రఖ్యాతిని పొందింది.

దయాదేవి పాపఘాతకి, వేంకటాచలం పాపదాహకం. పాపరాశిని పటాపంచలు చేసే శక్తి గలది ప్రపత్తి.

"భగవద్వందనం స్వాద్యం గిరి వందన పూర్వకం" అన్నట్లు దయా శతకాన్ని ఆరంభిస్తూ దేశికులు గిరికి నమస్కరించడం మంగళమైన ఆచారం. "ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాఽపి తన్ముఖమ్" అని శాస్త్ర లక్షణమూ ఉంది. శ్లేషతో కూడిన ఉత్ప్రేక్షాలంకార సజ్జితమీ శ్లోకం.పది పదులు కలిగిన ఈ స్తోత్ర కావ్యమందు ప్రథమ దశకాన్ని ఆదికవిని అనుసరించి అనుష్టుబ్ ఛందో భరితం చేయడం కవితార్కిక కేసరికే సరి.

(శ్రీమాన్ నడాదూరు అమ్మాళ్ నరసింహాచార్యుల వారు 'దయాశతకం' లోని ప్రతి శ్లోకానికి తెనుగులో ఒక్కొక్క పద్యాన్ని హృద్యమైన శైలిలో రచించారు. మద్రాసు ప్రభుత్వ విద్యాశాఖలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ పదవి యందు ఉండి, 1936లో వ్రాసిన, మూలాభిప్రాయాన్ని బోధించే వారి పద్యశైలిని పాఠకులు ఆస్వాదించగలరని ఇందు సంకలనం చేయబడినవీ పద్యాలు).

కం॥ శ్రీవాసుని కరుణారస
మా విధమున నిక్షుసార మై స్రవియింపన్
దావెలసె శర్కరాకృతి
నా వసుధను దోచు వేంకటాద్రిన్ గొలుతున్.

2. విగాహే తీర్థ బహూళాం శీతలాంగురు సంతతిమ్।
శ్రీనివాస దయాంభోధి పరీవాహ పరం పరామ్॥

అర్థం: తీర్థ బహూళాం = అనేక గురువర్యుల చేత ఒప్పియున్నట్టి / రేవుల చే నిండియున్నట్టి; శీతలాం = ఆత్మ గుణ సంపన్నమైనట్టి / చల్లనైనట్టి; గురు సంతతిం = ఆచార్య పరంపర అనే / అధిక ప్రవాహం కలిగినట్టి; శ్రీనివాస దయా + అంభోధి

పరీవాహ పరంపరాం = శ్రీనివాస భగవానుని దయా సముద్రం నుంచి (వెడలి) ప్రవహించే ధారా పరంపరను; విగాహే = విశేషంగా అనుభవిస్తున్నాను / మునుగుతున్నాను.

తా: శ్రియః పతి దయాగుణ ప్రధానుడు. అతని సృష్టి స్థితి సంహారాది కృత్యాలూ, అవతారలీలలూ మొదలైనవి దయాకార్యాలే. భగవానుడు లోకోపకారార్థమై వకుళ భూషణ, నాథ, యామున, యతీశ్వరాది గురూత్తములను అవతరింప జేశాడు. ఆచార్య వర్యులందరు భగవంతుని దయా వైభవాన్ని ప్రకటించే వారే కదా! మానవులు సంప్రదాయ సిద్ధులైన గురువర్యుల ద్వారా శ్రియః పతిని శరణమని ఆశ్రయిస్తే అతని దయకు పాత్రులవుతారు. క్రమంగా సంసార బంధ నిర్ముక్తులై భగవచ్చరణారవింద కైంకర్య రూపమైన మహానందాన్ని అనుభవిస్తారు. కాబట్టి శ్రీనివాసుని దయను ఆశ్రయించడం కంటె వేరే పరమ పురుషార్థం లేదు కదా!

గురువందన పూర్వకంగా భగవద్వందన మాచరించడం శాస్త్ర సమ్మతం.

శ్రీనివాస భగవానుని దయ అనే గొప్ప జలాశయం నుంచి, బయటకు అధికంగా ప్రవహించే పరీవాహ పరంపరను పోలియున్నట్టి, తాప హరత్వాది గుణాలచే సుఖాస్పదమైనట్టి, కృపా ప్రసన్నాచార్యులచే నిబిడమైన గురు పరంపరను భక్తితో ధ్యానిస్తున్నానని తాత్పర్యం.

అమృతాస్వాదినీ వ్యాఖ్య:- గురుపరంపరను శ్రీనివాసుని దయ అనే మహా హ్రదమందు ఉద్భవించిన పరీవాహ పరంపరగా వర్ణించే శ్లోకమిది.

చెఱుకు రసప్రవాహమని చెప్పిన ఛోట స్నానం చేయడం సంభవించదు. శ్రీనివాసుని దయా రూపమైన వేంకటాచలానికి ప్రపత్తి చేయబడింది. "తెషికురళ్ అరు విత్తిరు వేంగడత్తు" (తి.వా.మొ. 3.3-1)"గంభీర నాద గిరి నిరర వేంకటాద్రిః " అన్నట్లు గొప్ప సవ్వడితో పారే కొండ వాగులెన్నో తిరుమల యందున్నాయి. శ్రీనివాసుని దయ అనే జలాశయం నుంచి వెడలి ప్రవహించే జలధారల యందు దేశికులు తలమునక స్నానం చేస్తున్నానన్నారు. ప్రాతఃకాలానుష్ఠానం పూర్తి చేసిన

తర్వాత కూడా పుణ్య తీర్థ స్నానం ప్రాప్తమయితే ఉపేక్షించక అవశ్యంగా శిరస్స్నానం చేయవలసిందేకదా!

శ్రీనివాస దయాంభోధి పరీవాహ పరంపరను పోలియున్న గురు పరంపరకు శేషత్వాను సంధాన రూపమైన నమస్కృతి చేయబడింది.

తీర్థబహుళాం:- (1) పలు రేవులు కలది పరీవాహ పరంపర.

(2) శ్రీశఠకోపముని, నాథముని, యామున ముని, రామానుజ ముని మొదలైన ఆచార్య వర్యులచే పూర్ణమైనది గురు పరంపర.

'తీర్థ' శబ్దానికి జలాశయం, రేవు, గురువు మొదలైన నానార్థాలున్నాయి.

"నివాసగమయోస్తీర్థ మృషిజుష్టజలే గురౌ" (అమరం) "తీర్థం శస్త్రాధ్వర క్షేత్రోపాయో పాధ్యాయ మంత్రిషు। అవతారర్షి జుష్టాంభః స్త్రీ రజస్సుచ" (విశ్వ)

"తీర్థం సత్రిణి పాత్రేచ" (స్వామి)

"తౄ-ప్లవన తరణయోః" అని ధాత్వర్థం.

"తరంతి అనేన ఇతి = తీర్థం" దీని చేత తరిస్తారు. అని వ్యుత్పత్త్యర్థం.

శీతలాం:- (1) తాపాన్ని హరించే చల్లదనం కలది పరీవాహ పరంపర.

(2) శమం, దమం, దయ మొదలైన గుణాలతో నిండియున్నది ఆచార్య పరంపర.

తాపశాంతిని పొందాలనుకొనే వ్యక్తి మెట్లు కలిగి యున్న రేవు మార్గాన దిగి ప్రవాహమందు స్నానం చేస్తే అతని తాపం తీరుతుంది.

రేవుల వంటి వారు గురువర్యులు. కాబట్టి శ్రేయస్సును పొందదలచిన సంసారతాపార్తుడు, ఆత్మ గుణపూర్తి కలిగి భగవానుని అనుగ్రహానికి పాత్రులైన ఆచార్యులు చూపిన మార్గాన్ని అనుసరిస్తే ఇహ పర సుఖాలను పొందుతాడు. భగవానుడు దయామయుడైనప్పటికీ మహాజనులు పోయిన దారిలో పోయే వ్యక్తికే ఆయన అనుగ్రహం లభిస్తుంది.

గురుసంతతిం- (1) ఎక్కువ ప్రవాహం - దీర్ఘమైన, విశాలమైన, లోతైన నీటి పారుదల కలది పరీవాహ పరంపర.

(2) భగవంతుని దయాసంతతి గురు పరంపర. దయామూర్తియైన వేంకటగిరి నుంచి పారే సెలయేరుల సముదాయమే గురుసంతతి. సంతతి అనడం వల్ల విస్తరించేదే తప్ప విచ్ఛేదం లేనిదని భావం. రమణీయమైన ప్రసన్నమైన జలధారలున్నట్లే, రమణీయ ప్రసన్న జ్ఞాన సంపన్నులు పలువురు ఆచార్యులు "కృపయా నిస్పృహో వదేత్". "అనా పృష్ట మపిబ్రూయుః గురవో దీన వత్సలాః" అన్నట్లు, అడుగకున్నా శిష్యులకు, ఆశ్రితులకు, భగవానుని దయారహస్యాన్ని చక్కగా బోధిస్తారు ఆచార్యులు. 'గురుసంతతి' జ్ఞాన విద్యా పారంపర్యమే కాని పుత్ర పారంపర్యం కాదని స్పష్టీకృతం.

"సచ ఆచార్య వంశోజ్ఞేయో భవత్యాచార్యా ణామసా వసా విత్యా భగవత్తః" (రహస్యామ్నాయః) అనే శ్రుతి రీతిగా, దేశికులు తమకు ఆచార్యులైన శ్రీ మదాత్రేయ రామానుజాచార్యులు (అప్పుళ్ళార్) మొదల్కొని (గురుభ్యః తద్గురుభ్యశ్చ - వారి ఆచార్యులు అనే క్రమంగా) శ్రీధరాయ నమః - అని ప్రప్రథమాచార్యుడైన శ్రీనివాస భగవానుని పాదాలను ఆశ్రయించు వరకు, అనుసంధించిన క్రమమే గురుసంతతి అని ఇక్కడి భావం.

"ఆచార్యః పూర్వరూపం, అన్తే వాస్యుత్తరరూపమ్, విద్యా సంధిః, ప్రవచనగ్ం సంధానమ్" అని గురుశిష్య సంతతికి గల సంబంధం ఆధ్యాత్మికమని ఉపనిషత్తు ఉద్ఘోషిస్తుంది.

శ్రీనివాస ధయాంభోధి పరీవాహ పరంపరామ్:-

విష్ణుసహస్రనామాలలో భగవానునికి 809వ నామం 'మహా హ్రదః' అని ఉంది. శ్రీ పరాశర భట్టర్ వారి భాష్యం.

"యత్ర పాపకర్మాణః అపునరుత్థానం నిమజ్జంతి - క్షిపామ్యజ స్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు - ఇతి. యత్రచ పుణ్యకృతో గాహంగాహం తృప్యంతి, సః మహాహ్రదః" అని తెల్పుతున్నది.

'గొప్పమడుగు' అని అర్థం గల ఈ పేరు సాదృశ్యాన్ని బట్టి భగవానునికి వర్తించింది.

'పాపకర్మలను చేసిన వారిని ఎల్లప్పుడు అసురజాతికి చెందిన గర్భాలలో - క్షుద్రజాతులలోనే పడవేస్తాను' అని శ్రీకృష్ణుడు (గీతలో) చెప్పినట్లు, పాపాత్ములు పైకి లేవకుండా - సద్గతిని పొందకుండా- అట్టడుగున పడి మునిగిపోవడానికి కారణమైనది ఈ మడుగు. అంతేకాదు; నిత్యం భగవద్గుణాలను నామాలను కీర్తించే పుణ్యాత్ములు కూడా ఈ పెద్ద మడుగులో మునుగుతూ, తేలుతూ సంసార తాప శాంతినీ, బ్రహ్మానందాన్నీ పొందుతారు. కాబట్టి, పెద్ద మడుగు వంటి వాడు పరమాత్ముడు అని ఈ నామానికి అర్థం. ధర్మరాజుకు సహస్ర నామాలను ఉపదేశించిన భీష్మాచార్యులు కూడా అనేక జన్మలనెత్తి తాపత్రయ వశుడనైన నేను ఇక క్షణంలో వేసవి కాలాన చల్లని మడుగులో మునిగే రీతిగా, అమృత సరస్సులాంటి భగవానుని తేజస్సులో లయమవుతున్నానని అర్థమిచ్చే 'ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీతమివ, హ్రదమ్" అనే మాటను తన నిర్యాణ సమయంలో చెప్పాడు.

శీతలానందహ్రదుడు, నిగ్రహోను గ్రహశీలుడు, స్వతంత్రుడు, కాబట్టి 'పరః పరాణాం' - 'పరమం యః పరాయణమ్" అన్నట్లు చేతనా చేతన పదార్థాలన్నిటి కంటె పరమాత్ముడు శ్రేష్ఠుడు. "గ్రీష్మే శీతమివ హ్రదమ్' అన్న మాటలో పరబ్రహ్మకు, కోపతాపాలెరుగని దయాదేవి అన్వయించకుంటే, శీతత్వాను భవమే సంభవించదు కదా! భగవత్కోపతాప నిర్వాపికయైన దయాదేవి మాత్రమే స్వతంత్రుడైన భగవంతుణ్ని ఆశ్రిత పరతంత్రునిగా పరిణమింపజేస్తుంది. కాబట్టి, సర్వస్మాత్పరుడైన పరమాత్ముని కంటెను దయాదేవి శ్రేష్ఠురాలు. తత్ఫలితంగా, శ్రీరామసాగరమన్నట్లు శ్రీనివాస సాగరమనక, శ్రీనివాసుని దయను సముద్రంతో తాదాత్మ్యం చేశారు. 'కవితార్కిక సింహ' పదాంచితులైన నిగమాన్త మహా దేశికులు.

"తత్త్వాన్య వ్యుపదేష్టు ముత్త మగురూన్ దత్త్వాఽను గృహ్ణాతినః" అన్నట్లు దయ మాన మనస్కుడైన భగవానుడు తన యథార్థ స్వరూప రూపగుణ విభూతులను

బోధించే ఉత్తమ గురువులను మనకు కృపజేశాడు. శ్రీనివాస దయాసాగర పరీవాహ రూపులే గురువర్యులు.

"జలోచ్ఛ్వాసాః పరీవాహాః" (అమరం) పరివహతి జలం యైస్తే = పరీవాహాః . నీరుపారే మార్గాలు, అంటే తూములు, కలుజులు లేదా అలుగులు అని అర్థం. ప్రాణులకు బాధలు, కష్టాలు ఎక్కువైనప్పుడు పెరుగుతుండే దయ దరులను పెళ్ళగిస్తుంది కదా!

"పూరోత్పీడే తటాకస్య పరీవాహః ప్రతిక్రియా। శోకక్షోభేచ హృదయం ప్రలాపైరేవధార్యతే॥" (ఉ.రా.చ. 3 అ. 23 శ్లో) చెరువులోకి వెల్లువ ఎక్కువగా చేరినప్పుడు కట్టతెగిపోకుండా ఒక మూల కలుజు తెరచి నీటిని బయటకు పారించి వేస్తే, అది చెరువు నిండ నీటిని నిల్పి కాపాడుతుంది. అలాగే శోకం యొక్క క్షోభ అధికమైనప్పుడు గుండె ప్రయ్యలు కాకుండా నోరు తెరచి బావురుమని ఏడిస్తే, అది శోక వేగాన్ని తగ్గించి గుండెను కాపాడుతుందని భవభూతి రాముని విషయంలో 'పరీవాహం చేతనే హృదయధారణం సంభవ' మన్నాడు.

"ఉపార్జితానాం విత్తానాం త్యాగఏవహిరక్షణమ్।
తటాకోదర సంస్థానాం పరీవాహ ఇవాంభసామ్॥"

చెరువు నిండిన నీళ్ళకు అలుగు శరణమైనట్లు సంపాదించి పెట్టుకున్న ధన ధాన్యాది సంపదలకు దానమే శరణం - అని పెద్దలు అంటారు. దయా పూరోత్పీడమైతే పరీవాహమే శరణం కదా! పరీవాహాలు కూడా - పెద్ద పెద్ద కాలువలుగా పారుతున్న నీరు పొలాలకుచేరితే పంటలు పండుతాయి. అలాగే తీర్థభూతులైన ఆచార్యులు సత్సంప్రదాయమనే నీటిని మానవ హృదయ కేదారాలలోకి ప్రసరింపజేసి ఆధ్యాత్మికమైన పంటను పండిస్తారు.

"భవద్విధా భాగవతా స్తీర్థభూతాః స్వయంవిభో।
తీర్థీకుర్వంతి తీర్థాని స్వాంతస్థేన గదాభృతా॥" (భాగ. 1-13-10)

మీవంటి భాగవతోత్తములు స్వయంగా తీర్థభూతులు. లోకాలను పావనం చేసే పవిత్రమైన పుణ్యతీర్థాలే మీరు. తీర్థయాత్రల వలన కలిగే పవిత్రత మీకు

అవసరం లేదు. అయినా, స్నానాలు చేసినవారి పాపాలు ఆవహించిన గంగాది నదీ జలాలను, మీ హృదయాలలో గదాధారియైన పరమాత్ముడున్నందున, మీరు పవిత్రం చేయడానికి తీర్థయాత్ర జేస్తారు. మీకు అంటిన ఆ పాప రాశిని గదాధారి వెంట వెంట నశింపజేస్తాడు అని ధర్మరాజు విదురుణ్ణి ఆదరించి ప్రశంసిస్తాడు.

అలాగే నవమస్కంధంలో గంగాదేవి భగీరథునితో అంటుంది.

"కించాహంన భువం యాస్యే నరా మయ్యా మృజంత్యఘమ్।
మృజామితదఘం క్వాహం రాజన్! తత్ర విచింత్యతామ్॥" (9-9-5)

ఓ రాజా! నేనైతే భూలోకానికి రాను. ఎందుకు? అంటే, నరులు తమ పాపాన్ని నా యందు కడుగుకొంటారు. మరి నేను నాకు అంటిన పాపరాశిని ఎక్కడ శోధించు కోవాలి? ఈ విషయమై ఉపాయం ఆలోచించుమన్నది. అప్పుడు భగీరథుడు

"సాధవో న్యాసినః శాంతా బ్రహ్మిష్ఠాలోకపావనాః।
హరంత్యఘంతేఽంగ సంగాత్, తేష్వాస్తే హ్యఘభిద్ధరిః॥" (భాగ 9-9-6)

కామ్యకర్మలను విడిచినవారు, జితేంద్రియులు, బ్రహ్మోపాసకులైనందువల్ల సాధువులు లోకాలను పావనం చేస్తారు. వారు స్నానం చేయడం వల్ల నీ పాపాన్ని హరిస్తారు. ఆ సాధువులకు తగుల్కొన్న పాపాన్ని వారి అంతరంగంలో ఉన్న హరి ధ్వంసం చేస్తాడు, అని గంగాదేవి సమాధానపడునట్లు పలికాడు.

విగాహే:- స్నానం చేస్తాను అని అర్థం.

గురుపరంపర శ్రీనివాస దయా ప్రవాహ పరంపరయే కాబట్టి ఆ ప్రవాహంలో నిండుగా మునుగుతాను. ప్రోక్షణ, మార్జన అనే విధానాన్ని అనుసరించక, అంటే నీటిని మీద చల్లుకొనకుండా, శిరస్స్నాన మాచరిస్తాను.

"గురూపదేశశ్చ నామ పురుషాణా మఖిల మల
ప్రక్షాళనక్షమ మజలం స్నానమ్" (కాదంబరి)

గురువు చేసే ఉపదేశం అంటే మానవుల దేహంలోపలా, బయటా ఉండే మురికిని కడిగి వేసే సత్తాగల నీరులేని స్నానం. మంత్రరూపమైన స్నానం. జనన మరణ రహితమైన స్నానం. అని భట్టబాణ కవి సూక్తి.

ఆచార్యుల సరస్వతీ ప్రవాహమందు అవగాహిస్తాను. అంటే, గురు పరంపరయందు, గురువులు బోధించిన శాస్త్రాలయందు, వారి గ్రంథాలయందు, శ్రీ సూక్తుల యందు తలమునుకలిడుతానని అర్థం.

"యామునార్య సుధాంభోధి మవగాహ్యాయథామతి।
ఆదాయ భక్తి యోగాఖ్యం రత్నం సందర్శయామ్యహమ్"

నేను యామునా చార్యులు అనే అమృత సముద్రంలో మునిగి, బుద్ధికి తోచినంత భక్తియోగమనే రత్నాన్ని తీసుకొని చూపిస్తున్నాను; అని భగవద్రామానుజులు శ్రీ వైకుంఠ గద్యారంభంలో ఒక శ్లోకాన్ని రచించారు.

విగాహే యామునం తీర్థం సాధుబృందావనే స్థితమ్।
నిరస్త జిహ్మగ స్పర్శే యత్ర కృష్ణం కృతాదరః॥

అని యతిరాజసప్తతిలో దేశికులు రచించారు.

"విగాహే తీర్థ బహుళాం" అనే ఈ శ్లోకం శ్లేష రూపకాలతో కూడిన ఉత్ప్రేక్షాలంకార సజ్జితం.

తే॥ శీతలంబయి తీర్థ విశిష్టమగుచు
శ్రీనివాసుని కరుణాబ్ధి లోన బొడమి
వెలికి బఱతెంచు జలవాహినులను బోలు
గురు పరంపరలో భక్తి గ్రుంకులిడుదు.

3. కృతినః కమలావాస కారుణ్యైకాన్తినోభజే।
ధత్తే యత్సూక్తి రూపేణత్రివేదీ సర్వయోగ్యతామ్ ॥

అర్థం: యత్+సూక్తి రూపేణ = ఎవరి ద్రావిడ దివ్య ప్రబంధాల పాశురాలచే; త్రివేదీ = మూడు వేదాల సమూహం; సర్వ యోగ్యతాం - అందరు పఠించే యోగ్యతను; ధత్తే = ధరిస్తున్నదో; (అట్టి) కమలా వాస కారుణ్య+ఏకాంతినః = శ్రీనివాసుని దయ ఒక్కటే శరణంగా కలిగినట్టి; కృతినః = సుకృతులైన ఆళ్వార్లను; భజే = సేవిస్తున్నాను.

తా॥ వేదాలను చదివే అధికారం సమాజంలో కొందరికే ఉంది. శ్రీనివాస భగవానుని దయ యందే ప్రవణమతులైన శ్రీ శఠకోప దివ్యసూరి మొదలైన ఆళ్వారులు వేదాల సారాన్ని వెల్లడించే ద్రావిడ దివ్య ప్రబంధాలను సమకూర్చినారు.

ఈ ద్రావిడ వేద ప్రబంధాలు స్త్రీ శూద్రాది జనులందరికీ అనుసంధానం చేసే యోగ్యతను కల్పించి పరమ పురుషార్థాన్ని ప్రసాదిస్తున్నాయి. కాబట్టి దివ్య ప్రబంధాలను అనుగ్రహించి కృతకృత్యులైన ఆళ్వార్లు భగవంతుని దయచేత లోకోపకారులైనారు. వారు భజనీయులు.

వ్యాఖ్య: వేదార్థాలను ప్రకటించే దివ్య ప్రబంధాలను పాడిన పరాంకుశ పరకాలాది దివ్యసూరులు వందనీయులు.

గురు పరంపరకు వందన మాచరింపబడినది. శ్రీనివాస దయాంభోధి యందు మగ్నులైన వారు సర్వజనులను నిమజ్జనులుగా చేసే సమర్థులు. అభినవ దశావతార భూతులు, పరాంకుశ పరకాలాది దివ్యసూరులు. సర్వజనులను అవగాహింప జేసే కౌశలం ఆళ్వార్ల కృతులకూ ఉంది. కాబట్టి సుకృతులైన శ్రీ శఠకోపాది దివ్యసూరులకు గురుపరంపర కంటె ప్రత్యేకంగా నమస్కరింపబడుతున్నది.

త్రివేదీ:- ఋగ్యజుస్సామ లనే మూడు వేదాల సముదాయం. 'త్రివేది' అన బడుతుంది. వేదాలు సృష్టి వైచిత్రినీ, చేతనులు చేయదగిన పనులను చేయరాని పనులను - విధి నిషేధాలను - వివరించడమే కాక సృష్టికర్తయైన భగవానుని స్వరూప రూపగుణ విభూతులను కూడా బోధిస్తాయి. వేదాలు సంస్కృత భాషలో ఉన్నందువల్ల వాటి అర్థాలను విశదతమంగా తెలుసుకోవడం చాలా కష్టం. ఋషులు బాగా పరిశ్రమించి, తపఃశక్తిచే వేద మంత్రాలను దర్శించి, వర్ణించి చెప్పినారు. ఉదాత్తానుదాత్త, స్వరిత, ప్రచయ స్వరాలతో కూడిన వర్ణాలు కలిగిన వేదాలను అధ్యయనం చేయడానికి కాలనియమం, అధికారి నియమం మొదలైన నిబంధనాలెన్నో ఉన్నాయి.

"వేదాః శాస్త్రాణి విజ్ఞానమేతత్సర్వం జనార్దనాత్" అన్నట్లు వేదాది సర్వ శాస్త్రాలు భగవంతుని దయవల్లనే ప్రభవించాయి కదా!

ధత్తే యత్సూక్తి రూపేణ త్రివేదీ సర్వయోగ్యతామ్:- దయకు క్రౌర్యం, పక్షపాతం లేనట్లే వేదమాతకు అవి లేవు.

వైకుంఠనాథుని మహిమను కీర్తించే వేదం ఆయన సంకర్షణాది వ్యూహావతార మెత్తగా అది పాంచరాత్ర శాస్త్రమైనది. భగవానుడు రామావతార మెత్తినప్పుడు వేదం రామాయణమైనది. ఆయన శ్రీకృష్ణునిగా అవతరిస్తే వేదం వెంటనే "నారాయణ కథామిమామ్" అన్నట్లు భారత, భాగవత రూపాన్ని ధరించింది. భగవానుడు దివ్య తిరుపతుల యందు అర్చా రూపంతో నెలకొన్నప్పుడు వేదం నాలాయిర దివ్య ప్రబంధంగా వెలసింది.

నాలాయిర ప్రబంధం పలువురు ఆళ్వార్ల శ్రీ సూక్తులతో వెలసిన ఇరవై నాలుగు ద్రావిడ ప్రబంధాల సంపుటి. ప్రపన్న జనకూటస్థులైన నమ్మాళ్వార్లకు మిగత ఆళ్వారు లందరు అవయవ భూతులని సంప్రదాయజ్ఞుల మాట.

స్వాధ్యాయ యోగాదులచే సంపాదించిన ఋషుల జ్ఞానం లాంటిది కాదు ఆళ్వార్ల జ్ఞానం. "మయర్వఱ మదినల మరుళినన్" అన్న ప్రకారం కేవలం శ్రియః పతియే దయతో ఆళ్వార్లకు అజ్ఞానం నశించునట్లు స్వాభావికమైన భక్తి రూపజ్ఞానాన్ని ప్రసాదించాడు. కాబట్టి ఆళ్వార్ల శ్రీ సూక్తులలో, భగవంతుని కల్యాణ గుణ గణ వైభవమే ప్రకటింపబడి యుంది. సారస్వతాల సారమైన దివ్య ప్రబంధాలు వేదాల యందలి రస్యరహస్యార్థాలను విశద తమంగా తెలియుజేస్తున్నాయి. కాబట్టి ద్రావిడ దివ్య ప్రబంధాలకు ద్రావిడ వేదమని ప్రసిద్ధి కలిగినది. "ద్రావిడీం బ్రహ్మ సంహితాం" అనీ, "వేద రూపమిదం కృతమ్" అని కీర్తింప బడడం సహజమే కదా! శ్రీసూక్తికి "తిరుమొషి, తిరువాయ్‌మొషి" అని పేరు. శ్రీ సూక్తిని దేశికులు "శఠమథన మునేః సంహితాసార్వభౌమీ" అనీ "ఆమ్నాయానాం ప్రకృతి మపరాం సంహితాం దృష్టవంతమ్" అని వేదం యొక్క మరొక రూపమైన ద్రావిడీ సంహితను దర్శించిన వారాళ్వార్లని ప్రస్తుతించారు.

భక్తి ప్రపత్తులచే నిబిడీకృత ప్రబంధాలైనందువల్ల వీటికి "అరుళిచ్చెయల్" దయా కృత్యాలు అని పేరు. కాబట్టి, దివ్య ప్రబంధ పాశురాలు - సూక్తులు - మనుష్యుల

యందు అధికారి వైషమ్యాన్ని సహించజాలవు. "నావేద విన్మనుతే తం బృహంతమ్" వేదం తెలియని వ్యక్తి భగవంతుణ్ని తెలుసుకోలేడు కదా!"

"మనుష్యాధికారం శాస్త్రమ్" శాస్త్రాన్ని అభ్యసించే అధికారం మనుష్యులకుం టుంది. వేల మాతా పితృల కంటె మిక్కిలి వాత్సల్యం కలది శాస్త్రం. "మన్యేమాతా జడ ఇవ సుతే వత్సలా" అన్నట్లు జాడ్యమున్న పుత్రుని మీద తల్లికి అధిక ప్రేమ ఉంటుంది. త్రైవర్ణికులు కాని వారే సమాజంలో అధిక సంఖ్యలో ఉన్నారు. జనులందరు అనుసంధానం చేసే యోగ్యత కలిగి యుండే విధంగా ద్రావిడ వేదం ప్రవర్తించకుంటే, వేదానికి మాతృత్వమే సిద్ధించక పోయేది. ఆళ్వార్లకు అవయవిగా వెలసిన శ్రీ శఠకోప దివ్యసూరి విషయంగా - అధిక వాత్సల్యమున్నందు వల్లనే కదా! "మాతా, పితా" అనే శ్లోకాన్ని నిత్యం పఠిస్తాం.

"తీతిలన్నాది" అన్న రీతిగా ఇతరకథా ప్రస్తావన దోషం లేని ద్రావిడ వేదం - నాలా యిర దివ్య ప్రబంధం - సర్వోత్కృష్టమై, సర్వజనులకు ఉపజీవ్యం గా ఉన్నది.

"అధ్యే తవ్యం ద్విజశ్రేష్ఠై ర్వేద రూపమిదం కృతమ్।
స్త్రీ భిః శూద్రా దిభి శ్చైవ తేషాం ముక్తిః కరే స్థితా॥"

'సర్వ యోగ్యతాం' అనే పదాన్ని వివరించే శ్లోకమిది.

ఉచ్చ, నీచ భేదం లేకుండా, సర్వకాలాల్లోనూ సర్వ వర్ణస్థులు - ఆబాల గోపాలం - ద్రావిడ వేద ప్రబంధాలను పారాయణం చేయవలెను.

దివ్యప్రబంధ పారాయణం చేసిన వారికి మోక్షఫలం కరతలామలక మవుతుంది. ఇంతకంటె పరమప్రయోజన మేముంటుంది?

కమలావాస కారుణ్యైకాంతినః:- ద్రావిడ వేదం ఇంత విలక్షమైన మహిమ కలిగి యుండడానికి కారణాన్ని ఈ పదం వివరిస్తున్నది. కమలాదేవికి వాస స్థలమైన శ్రీనివాస భగవానుని దయకు లక్ష్యభూతులు ఆళ్వారులు.

ఏకః అంతః (నిశ్చయః) యేషాం తే = ఏకాంతినః. ముఖ్యమైన నిశ్చయం కలవారు ఏకాన్తులు. 'అంతః' అంటే బాగా విచారించగా చివరకు పుట్టి, స్థిరంగా

నిల్చిన జ్ఞానమని. అర్థం. "ఏకాంత భక్తిర్గో విందే" అన్నట్లు ఆళ్వార్లు భగవానుని దయచే లబ్ధమైన జ్ఞానం చేత భగవత్స్వరూప రూప గుణ విభూతులనే ఏకాంత భక్తితో గానం చేసినవారు ఆళ్వార్లు.

కమల+ఆవాస:- తామరకమలాలు అంతట నిండియున్న సరస్సు - కమలిని, అని అర్థం. (స భంగశ్లేష) పసిమి, మిసిమి గలపదమిది. నమ్మాళ్వార్లు శ్రియః పతిని తామరస తటాకంగా - "తామరై నీళ్ వాశత్తడంబోల్ వరువానే" (తి.వా.మొ. 8.5.1) వర్ణించారు.

కణ్ కై కాల్ - చూడగానే పరిచయాన్ని పెంచుకొనే ఆ కన్నులు, చూపులకు లోబడిన తోడనే ఆదరంతో దగ్గరకు తీసుకొనే ఆ చేతులు, పరవశించి పడిపోవడానికి స్థానమైన ఆ పాదాలు ఒకటేమిటి? అన్ని పరిశుద్ధమైన సద్యోవికసిత కమలాలే. పడిపోయిన వ్యక్తి పైకి చూడగానే, "శెవ్వాయ్ ముకిష్తా" ఎట్టని తామర మొగ్గలాంటి అధరం కలవాడు. పచ్చని ఆకుల వలె దివ్య దేహకాంతి కలవాడు.

నా ఆర్తి అంతా తీరే విధంగా సుందర, సుకుమార, సుగంధ శీతల భరితమైన తామరస తటాకం లాగా దయతో వచ్చి దర్శనమీయ వయ్యా స్వామీ! అని ఆళ్వార్లు ప్రార్థించారు.

కరచరణసరోజే కాంతి మన్నేత్ర మీనే
శ్రమముషిభుజ వీచి వ్యాకులే ఉ_గాధ మార్గే।
హరి సరసి, విగాహ్యాపీయ తేజో జలౌఘం
భవమరుపరిఖిన్నః ఖేదమద్య త్యజామి (ముకుందమాల 10)

అని శ్రీ కులశేఖరాళ్వార్లు కూడా హరిని సరస్సుతో పోల్చి అనుభవించారు. కాబట్టి ఆళ్వార్లు -

కృతినః- కృతకృత్యులు. ప్రశస్తం కృతం (గ్రంధ కరణం) ఏషాం అస్తి ఇతి = కృతినః. ఉత్తమ దివ్య ప్రబంధాలను మనకు అనుగ్రహించి, కర్తవ్యాన్ని మిగుల కుండా పూర్తిచేసిన వారు ఆళ్వార్లు.

భజే:- సేవిస్తున్నాను. "భజ-సేవాయాం" అనే ధాతువు, లట్-ఆత్మనే పది - ఉత్తమ పురుషైకవచనం.

దేశికులు, ఆళ్వార్లు ఉన్నప్పుడు తాను పుట్టి వారిని సేవించకపోతిని కదా! అనే ఆర్తి తీరునట్లు, నిరతిశయ ప్రీతితో సుకృతాత్ములను - భగవద్ధ యైక శరణులను భజించడం కమనీయం కదా!

కృతకృత్యుల గురువుల శ్రీ
పతి కరుణా శ్రితుల ద్రమిడ పాశురములచే
శ్రుతితతికి, సర్వజన యో
గ్యత నొసగిన వకుళ భూషణాదుల గొలుతున్

4. పరాశరముఖాన్ వందే భగీరథనయే స్థితాన్।
కమలాకాన్త కారుణ్య గంగా ప్లావిత మద్విధాన్॥

అర్థం: కమలాకాన్త - మద్విధాన్। కమలాకాన్త = శ్రీ కాంతుని యొక్క; కారుణ్య = దయ అనే; గంగా = గంగా జలం చేత; ప్లావిత = తడుపబడిన; మద్విధాన్ = నా వంటి వారిని కలిగి యున్నందువల్లనే; భగీరథ నయే = భగీరథుని మార్గమందు; స్థితాన్ = ఉన్నట్టి; పరాశర ముఖాన్ = పరాశరుడు మొదలైన మహర్షులను గూర్చి,; వందే = నమస్కరిస్తున్నాను.

తా: శ్రియః పతి యొక్క దయ అనే గంగోదకం చేత నా లాంటి దుశ్చరితులను తడిపి పవిత్రులుగా చేసిన వారు కనుకనే భగీరథ చక్రవర్తి యొక్క న్యాయమందు నిల్చియున్న పరాశర పారాశర్య వాల్మీకి మహర్షులకు నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య: పరాశరాది మహర్షులకు నమస్కరించే శ్లోకం.

భగవద్దయై కాంతులైన ఆళ్వార్లను సేవించిన తర్వాత పరాశరాది మునులకు ప్రణతి చేయబడింది.

తత్త్వ నిర్ణయం చేసి చిద చిదీశ్వరుల స్వభావాలను తెల్పిన మునివరుడు శ్రీ పరాశర భగవానుడు. పురాణ రత్నమని ప్రసిద్ధిని పొందిన "విష్ణు పురాణం" పరాశరమునిచే రచింపబడింది.

పరాన్ సతర్క శరైః ఆశృణాతి ఇతి = పరాశరః. పరులంటె ఇతరులు - వేదబాహ్యులు; కుదృష్టులు అంటే వేద వాక్యాలకు విపరీతమైన అర్థతాత్పర్యాలను చెప్పినవారు. తర్క సహన ప్రమాణాలనే బాణాల చేత పరులను పోగొట్టిన వాడు - అని పరాశర శబ్దానికి వ్యుత్పత్త్యర్థం.

భగీరథనయే స్థితాన్:- భగీరథుని పద్ధతిని పాటించిన వారని అర్థం. ఇక్ష్వాకు వంశమందు పుట్టిన భగీరథ చక్రవర్తి తన పూర్వులు చేయజాలలేని మహాకార్యాన్ని చేసి పొందిన కీర్తి విశ్వమున్నంత దాకా స్మరింపబడుతుంది.

కపిల మహర్షి యొక్క కోపాగ్నిచేత దగ్ధులైన తన తాతలను - అరువది వేల సగర పుత్రులను - గంగోదకం చేత తడిపి వారికి సద్గతిని కల్పించిన వాడు భగీరథుడు.

త్రివిక్రమావతారమందు భగవానుని వామపాదాంగుష్ఠం నుంచి ఉద్గమించిన గంగానది మొదట చతుర్ముఖుడైన బ్రహ్మ-సత్య-లోకంలో ప్రసరించింది. భగీరథుడు చిరకాలం తపస్సు చేసి గంగాదేవిని మెప్పించి ఒప్పించగా అది త్ర్యంబకుడైన శివుని జటాజూటమందు వచ్చి నిలిచింది. భగీరథుడు మళ్ళీ కొంత కాలం తపస్సు చేసి పరమ శివుని దయకు పాత్రుడయ్యాడు. తత్ఫలితంగా, గంగ జటాజూటం నుంచి ధారగా దిగివస్తుంటే దారిలో జహ్ను మహర్షి గంగను త్రాగేశాడు. భగీరథుడు మళ్ళీ ఎంతో కాలం తపస్సు చేయగా ఆ మహర్షి మెచ్చి, సంతోషంతో తన చెవి నుంచి గంగను బయటకు వదలివేశాడు. అపుడు 'జాహ్నవి' అనే పేరు పొంది, గంగానది భూమికి దిగి భగీరథుడు చూపిన మార్గమందలి సగరపుత్రుల భస్మరాశి మీద ప్రవహించి నందు వల్ల వారికి సద్గతి కలిగింది. గాంగచ్ఛతీతి = గంగా. భువికి చేరిన నది. త్రిపథగా పేరుపొందిన గంగాజలం భగవానుని, తులసీ దళాలచే అర్పించబడిన శ్రీపాదతీర్థమే కదా! పరమ శివుడు శిరస్సున ధరించిన పూలతో కలిసి సుగంధ తీర్థమైనది. భగవద్ధ్యాన మగ్నుడైన జహ్ను మహర్షి గుండెలో సుడులు

తిరిగి, గురూ పదిష్టమైన పవిత్ర దక్షిణ కర్ణకుహరం నుంచి బహిర్గతమై భారతదేశ భూమిలో ప్రవహించింది, ప్రవహిస్తున్నది.

భగీరథుని జలయజ్ఞం ఎంత పవిత్రమైనదో కదా! తత్ఫలితంగా నేటికీ వసుంధర సర్వసస్యాఢ్యయై స్వయం సమృద్ధయై భాసించడం ప్రత్యక్షంగా గోచరిస్తున్నది. పరోక్షమైన సద్గతిని కూడా కల్పిస్తుంది. పావన గంగ – అనే విషయాన్ని శాస్త్రమే తెల్పుతుంది. "పరోక్షార్థ దర్శనం శాస్త్రం" వల్లనే కదా!

"భగవద్విష్ణు పాదాంగుష్ఠ నిర్గతస్యహిజలస్యైతన్మాహాత్మ్యమ్ యన్న కేవల మభిసంధి పూర్వకం స్నానాద్యుపభోగేషూప కారకం, అనభిసంహిత మపి అపేత ప్రాణస్య అస్థి చర్మ స్నాయుకేశాద్యుపస్పృష్టం శరీరజమపి పతితం సద్యః శరీరిణం స్వర్గం నయతి।"... దిలీపస్య భగీరథః యోఽసౌ గంగాం స్వర్గాదిహానీయ భాగీరథీ సంజ్ఞాంచకార" (వి.పు. 4.4 అధ్యా. 30)

విష్ణు భగవానుని కాలిబొటన వ్రేలు నుంచి పొటమరించిన తీర్థానికేకదా ఇంత మహిమ ఉంటుంది. ఫలాన్ని మొదట కోరి చేసే కేవల స్నాన పానాది భోగాలకు ఉపకరించడమే కాదు, ఫలం కోరబడకున్నను, ప్రాణం పోయిన (వ్యక్తి) శరీరమందలి బొక్కకో, చర్మానికో, స్నాయువుకో, వెంట్రుకలకో గంగోదక స్పర్శ అయితే చాలు లేదా శరీరంలోని ఏదో ఒక అవయవం (ఎగిరి) గంగనీళ్ళల్లో పడితే కూడా ఆ శరీరాన్ని ధరించిన జీవాత్మను గంగ పరమపదానికి చేర్చుతుంది.

దిలీప మహారాజకుమారుడైన భగీరథుడు దివి నుంచి గంగను భువికి తెచ్చినందు వల్ల గంగానదికి 'భాగీరథి' అనే పేరు వచ్చింది.

ఇంతటి మహిమగల భగీరథుని న్యాయాన్ని అవలంబించినారనడానికి హేతువేమిటి? అంటే, కమలాకాన్త కారుణ్య గంగా ప్లావితమద్విధాన్:– శ్రీకాంతుని దయ అనే గంగను నావంటి వారిపై ప్రసరింపజేసిన వారు అని అర్థం.

భగవంతుని దయ గంగా నదితో పోల్చబడినది. అందువల్ల గంగా ప్రవాహం లాగా పావనత్వం, శీతలత్వం, మృదుత్వం, స్వాదుత్వం, పాపహరత్వం మొదలైనవి భగవద్దయా ప్రవాహానికి కలవని సూచింపబడింది.

"కామ్యతే ఇతి = కాన్తః. కమల యాకాంతః = కమలా కాన్తః" కమలాదేవి చేత కోరబడినవాడని అర్థం.

(కం=సుఖం-అంతః = నిశ్చయం) కస్య అంతః అస్యాం అస్తి ఇతి = కాంతా. సుఖం యొక్క నిశ్చయం ఈమె యందు కలదు, కాబట్టి 'కాంత' అనబడుతుంది.

కమలా ఏవ కాంతా యస్య సః = కమలాకాంతః. కమలాదేవియే కాంతగా కలవాడు.

కమలాదేవి విష్ణు వక్షఃస్థలవాసిని. దయాదేవి యొక్క స్థానమా హృదయమే కదా! శ్రీశ్రియః పతులిద్దరి దయకు గల ప్రభావం అపరిమితమని ధ్వనించే పదం "కమలాకాన్తకారుణ్యం".

గంగా ప్రవాహం కలుషాత్ములైన సగరపుత్రుల పైన ప్రసరించి వారికి సద్గతిని కల్పించింది కదా!

మద్విధాన్:- విమలాత్ములైన దేశికులు వేరెవ్వరినైనా కలుషాత్ములనడానికి ఇష్టపడక తనను తానే భగవద్భాగవతాచార్యుల యందు అపచార పడినవాడననీ, సాపరాధుడననీ నిందించుకోవడం (నైచ్యాను సంధానం చేయడం) వారి జ్ఞాన వైరాగ్య లక్షణం. దుశ్చరితుల పాపాలనే క్షాళనం చేసే శ్రీనివాస భగవానుని దయా ప్రవాహానికి సుచరితులకు భుక్తినీ, ముక్తినీ ప్రసాదించడం లెక్కించదగిన విషయం కానే కాదు కదా! అనే భావమూ ఈ పదంలో ఉంది.

పరాశరముఖాన్:- పరాశరాది మహర్షులు విశ్వసాహిత్య ద్రష్టలు. ప్రభు సమ్మితాలని పేరుగాంచిన వేదాల సారాన్ని పురాణేతిహాసాలు - మిత్ర సమ్మితాలు - గా విస్తరింప జేసి, కమనీయ కవితా ఝురులను ప్రవహింప జేశారు. పరాశర మహర్షి విష్ణుపురాణాన్ని రచించాడు. పరాశరుని పుత్రుడైన వ్యాసునికి పారాశర్యుడు, కృష్ణ ద్వైపాయనుడు, అపాంతరతముడు అనే పేర్లు ఉన్నాయి. భారత భాగవతాద్యనేక పురాణాలను రచించాడు వ్యాస భగవానుడు.

వాయుగణవేదన ప్రశంసగల మంత్రపాఠంలో -

"సహోవాచ వ్యాసః పారాశర్యః" (తైత్తిరీయారణ్యకం, పా. 2 అను) (పరాశర పుత్రుడైన ఆ వ్యాసమహర్షి ఇలా అన్నాడు) అని ఉంది. తండ్రిని మించిన తనయుడు వేదవ్యాస భగవానుడు. ఈయన మహోజ్ఞానియూ, ఒకచోట స్థిరంగా ఉండ జాలని వాడూ అయిన శ్రీ శుక మహర్షికి తండ్రి. శక్తికి పౌత్రుడు. వసిష్ఠునికి 'నప్త' (మునిమన్మడు).

"తస్మైనమో మునివరాయ పరాశరాయ" అని శ్రీ యామునాదార్యులు తమ (ఆళవందార్) స్తోత్ర రత్నమందు ఒక్క పరాశరునికే నమస్కరించారు. ఇక్కడ దేశికులు "పరాశరముఖాన్" అని పరాశర వ్యాస వాల్మీకులకు కూడా నమస్కరిస్తున్నారు. వాల్మీకి శ్రీమద్రామాయణాన్ని రచించాడు.

విష్ణుపురాణ, భారత, భాగవత, రామాయణాలలోనూ 'గంగావతరణం' కథ శ్రవణసుభగంగా చెప్పబడింది. ఈ మహర్షులందరు భగవద్దయను లీలాకథా రసంగా ప్రసరింప చేయడం వల్ల, ఆ కథలను చిన్న పెద్ద; అజ్ఞ ప్రాజ్ఞ భేదం లేకుండా, మనం చదివి, విని భగవద్దయకు పాత్రులమగునట్లు చేసిన మహోపకారులు.

విశేషమేమి? అంటే, భగీరథుడు తన కంటె పూర్వులను తరింపజేయడానికి వారి పై గంగను ప్రవహింప జేశాడు. పరాశరాది మహర్షులు మాత్రం కాలమున్నంత వరకు భగవల్లీలా కథలను చదివి, విని, భగవత్కారుణ్య గంగలో లోకులందరు (మున్కలు) కుంకులిడి తరించాలనే విశాల హృదయం కలవారని విశదమవుతున్నది.

దేశికులు ఈ దయా శతకంలో 103వ శ్లోకంలో "ప్రాచేతసప్రభృతయః" అని కూడా వాల్మీకి మొదలైన మునివరులనూ ప్రస్తుతించారు. అంతేకాదు. "శ్రీ దేవనాయక పంచాశత్" లోనూ

"దివ్యే దయాజలనిధౌ దివిషన్నియంతు
స్తీర్థం ని దర్శితవత స్త్రిజగ న్నిషేవ్యమ్।
ప్రాచః కవీన్ నిగమసమ్మిత సూనృతోక్తీన్

ప్రాచేతస ప్రభృతికాన్ ప్రణమా మ్యభీక్ష్ణమ్" (3)

దేవ నాయకుడైన శ్రియఃపతియొక్క దివ్యమైన దయా సముద్రమందలి తీర్థాన్ని ముజ్జగాలు సేవించునట్లుగా ప్రదర్శించినారు కాబట్టి వేదోప బృంహితాలైన ఇతిహాస పురాణాలను రచించిన, ప్రాచీన కవులైన వాల్మీకి వ్యాసాది మహర్షులకు ఎల్లప్పుడు నమస్కరిస్తుంటాను అని స్తుతించారు.

ఈ దయా శతకంలో ఆళ్వార్లను స్తుతించిన తర్వాత పరాశరాది మునివరులను స్తుతించారు దేశికులు.

గురుపరంపరలో ఆళ్వార్లు అగ్రేసరులు. భగవద్దయా తరంగితాంతరంగులు. అన్నం, నీరు, తాంబూలం అన్నీ కన్నయ్య యైన భగవానుడే అని మహా విశ్వాసం గల ప్రపన్నులు ఆళ్వారులు. అకించనులైన ఆళ్వార్లు గానంచేసిన దివ్య ప్రబంధాలు బ్రహ్మానందానుభవాన్ని ప్రకటించేవి. ప్రపన్నుల పట్ల దయాదేవి స్వయంగా సాక్షాత్కరించే అపేక్ష కలది. ఆళ్వార్లు భగవద్దయైకాంతులు.

పరాశరాది మునులు ఫల,కంద, మూలాద్యాహారనియ మాలతో గొప్ప తపోయోగాదుల నాచరించడం వల్లవారికి భక్తి చేత సాధ్యమైనది భగవద్దయ. అట్టి దయా ప్రభావం చేత అనుగ్రహింపబడిన ఇతిహాస పురాణాల వాక్యాలు దివ్య ప్రబంధాలకు ఉపోద్బలకంగా నిలిచాయి. భక్తి యోగం చేత సాధింపబడిన భగవద్దయా రసాన్ని లోకులు సేవించి తరించునట్లు ఉపకరించిన ఋష్యాదులకు స్తుతి ప్రణతులాచరించకుంటే అధమర్ణులుగానే ఉంటారు. కాబట్టి, గురు పరంపరా ప్రసంగ వశాన జగద్ధితార్థులైన పరాశరాది మహర్షులకు వందన మాచరించడం సముచితమే కదా! ఈ శ్లోకంలో 'కారుణ్య గంగా' అనే చోట రూపకాలంకార మున్నది. వాక్యార్థ హేతుక కావ్యలింగాలంకృత శ్లోకమిది.

ఆ॥ ఇల భగీరథ ప్రవృత్తులై ననుబోలు
కలు షమతుల విభుని కరుణయనెడు
గంగ నీళ్ళ ముంచి కడుపుణ్యులై యొన
ర్చిన పరాశరాది మునుల గొలుతు॥

5. అశేష విఘ్నశమన మనీకేశ్వర మాశ్రయే।
శ్రీమతః కరుణాంభోధౌ శిక్షాస్రోత ఇవోత్థితమ్॥

అర్థం: శ్రీమతః = లక్ష్మీపతి యొక్క; కరుణాంబోధౌ = దయ అనే సరోవరమందు; ఉత్థితం = ఉదయించినట్టి; శిక్షా స్రోతః ఇవ = శిక్షా ప్రవాహం వలె; (స్థితం = ఉన్నట్టి) అశేష విఘ్న శమనం = సమస్తమైన ఆటంకాలను శాంతింప జేయునట్టి; అనీక+ఈశ్వరం = సేనాధిపతియైన విష్వక్ సేనుణ్ని; ఆశ్రయే = ఆశ్రయిస్తున్నాను.

తా: శ్రియః పతి యొక్క దయా సరోవరమందు ఉదయించిన శిక్షా స్రోతస్సులాగా ఉన్నట్టి; సకల విఘ్నాలను నశింప జేయునట్టి, వైకుంఠ సేనా నాయకుడైన విష్వక్సేనుడనే నిత్యసూరిని ఆశ్రయిస్తున్నాను.

వ్యాఖ్య:- శ్రీమంతుని చమూపతికి వందనం చేసే శ్లోకం.

దివ్య దంపతుల తర్వాత గురు పరంపరలో శ్రీ వైకుంఠ నాథుని సైన్యాధిపతి యైన విష్వక్సేనుడు ఆచార్య పదవిని అధిష్ఠించారు. యోగ దశలో ఉన్న నమ్మాళ్వార్లకు స్వయంగా లక్ష్మీ దేవిచేత ఉపదిష్టులైన విష్వక్సేనులు మంత్రోపదేశం చేసి ఆచార్యులయ్యారు. లోక రక్షణార్థం శ్రీమన్నారాయణుడు కృపతో సృజించిన విష్వక్సేనుడు భగవంతుని సేనకు నాయకులయ్యారు. ఉభయ విభూతి నాయకుడైన లక్ష్మీ పతికి అనంతుని వలె, గరుడుని వలె నిత్య కైంకర్యం చేసే నిత్యసూరిగాను వెలసిన వారు విష్వక్సేనులు. నమ్మాళ్వార్లు స్వయంగా ప్రపత్తిని అనుష్ఠించి, ఆచరింప జేసి, శరణాగతులను వృద్ధి పరచడానికి శ్రీసేన మొదలి యాళ్వారుల ఆచార్యకత్వ మహిమయే కారణం కదా!

శ్రీమతః:- లక్ష్మి కలవాడు. శ్రీః అస్య అస్తి ఇతి శ్రీమాన్. శ్రీమత్ శబ్దం యొక్క షష్ఠీవిభక్త్యే కవచన రూపమిది.

"ఋచః సామానియజూగ్ంషి, సాహిశ్రీః" శ్రీ శబ్దానికి ఇక్కడ వేదమనే అర్థమూ ఉంది. జ్ఞాన లక్ష్మీ సంపన్నుడని శ్రీమచ్ఛబార్థం కాబట్టి శ్రీనివాసుడే శ్రీమంతుడు.

ఇట్టి శ్రీమంతుని దయ యనే జలధియందు ఉదయించినందువల్ల విష్వక్సేనులు 'శిక్షా' అనేది ప్రవాహరూపందాల్చినదో అన్నట్లు ఉత్ప్రేక్షింపబడినారు.

'శిక్ష' అనేది చిత్త సంస్కారాన్ని కలిగించే ప్రక్రియ. "స్వాధ్యాయ ప్రవచనాభ్యాం నప్రమదితవ్యం". స్వాధ్యాయం అంటే తాను చదువడం, ప్రవచనం అంటే ఇతరులకు బోధించడం, ఈ రెండింటిని ప్రమాదపడకుండా నియమంగా పాటించవలెను. "తేషాం త్వయాఽ సనేన ప్రశ్వసితవ్యం". జ్ఞానానుష్ఠాన పరులను నీవు ఆసనాద్యుప చారాలతో సత్కరించి వారి శ్రమను పోగొట్టవలెను.

"సంవిదా దేయం" తన విభవాన్ని అనుసరించి దానం చేయవలెను. "తథా తేషువర్తేథాః" పెద్దలు ప్రవర్తించిన విధంగా వారి పట్ల నీవు అట్లే ప్రవర్తించాలి" ఇది శిక్ష.

ఇది భగవదాజ్ఞ. గుర్వను శాసనం.

"అనాపృష్టమపి బ్రూయాః" దీనులయందు వాత్సల్యం కలిగి యున్న కృపా ప్రసన్నాచార్యులు తమ నాశ్రయించినవారికి, వారు అడగకున్నా, జ్ఞాన బోధ చేస్తూ ఉంటారు కదా! 'శిక్ష' అంటే 'దండనం' (Punishment) అనే అర్థమూ ఉంది.

ఇక్కడ శ్రీమచ్ఛబ్దం వల్ల 'శిక్షా' మహిమ ద్యోతకమవుతుంది. అతని దయా సరస్సు నుంచి ఉద్గమించిన శిక్షా స్రోతస్సు కూడా చాలా చల్లగా ఉంటుంది. ఇతరులకు బాధకలుగకుండా, చేతిలోని సన్నని, మెత్తని బెత్తెంతో, భగవద్దర్శనానికి వచ్చే జనులలో సమ్మర్దం (తొక్కిసలాట) ఏర్పడినప్పుడు బ్రహ్మాది దేవతల ఉత్తమాంగాల (మీద)నూ మృదువుగా స్పృశిస్తూ, వారిని కూడా సక్రమ మార్గంలో నడిపించే నాయకులు విష్వక్సేనులు. "స విష్వక్ సేనాం నయతి" అన్న ప్రాబల్కే ప్రమాణం.

"శ్రీమతి విష్వక్సేనే న్యస్త సమస్త ఆత్మైశ్వర్యం" అని భగవద్రామానుజులు (వైకుంఠగద్యం) స్తుతించారు.

శ్రీమన్నారాయణుడు తన ఉభయ విభూతుల భారాన్ని అప్పుడప్పుడు విష్వక్సేనుల యందే ఉంచి విశ్రాంతి తీసుకొంటాడని ఆ వాక్యానికి అర్థం. "గురుం

ప్రకాశయేద్ధీమాన్” అన్నట్లు భగవద్రామానుజుల శ్రీ సూక్తులను ప్రామాణికంగా గ్రహించి, వాటినెంతో హృద్యంగా స్వీయకృతులలో విశదంగా తేట పరచారు.

శ్రీమంతుని దయా సాగరోత్థిత శిక్షా స్రోతస్సులో కూడా శ్రీ మత్త్వం ఉండక పోదు కదా! పతనమవుతున్న వారినీ, ప్రామాదికంగా అపచార పడిన వారినీ లలితంగా శాసించి తీర్చిదిద్దడం దయా కార్యమే. “దీర్ఘబంధుం దయాళుం, స్థాలిత్యే శాసితారం” (న్యాసవింశతి) అన్నట్లు ఈశ్వరత్వమూ, ఆచార్యత్వమూ రెండు కలిసి యుండడం సదాచార్య లక్షణమనీ ఉత్తరార్థం సుశ్లోకించింది.

అశేష విఘ్న శమనం:- శ్రీ వైష్ణవ సంప్రదాయస్థులు తాము చేసే కార్యాల ఆరంభంలో, నిర్విఘ్నంగా కార్యం సమాప్తియై ఫలం సిద్ధించాలని విష్వక్సేనులను ఆరాధిస్తారు.

“శ్రేయాంసి బహు విఘ్నాని భవంతి మహతామపి”. ఎంత గొప్పవారైనా, శుభకరమైన, లోకహితకరమైన కార్యాన్ని చేయ బూనినప్పుడు (వారికి కూడా) అనేక ఆటంకాలు కలుగుతుంటాయి.

భగవంతుని దయను స్తుతించడం కంటె శ్రేయస్కరమైన కృత్యం లేదు కదా! అట్టి ఉత్తమ శ్రేయస్సైన దయా స్తోత్ర రచన ఎట్టి విఘ్నమూ కలుగకుండా పరిసమాప్తి చెందాలని దేశికులు విష్వక్సేనులను ఆశ్రయించి వేడుకొంటున్నారు.

‘అశేష’ మంటే మిగులకుండా, సంపూర్ణంగా అని అర్థం. మంచి పనులను చేస్తున్నప్పుడు మన పాపాల వల్ల చాలా విఘ్నాలు కలుగుతుంటాయి. నరులు గానీ సురవరులు గానీ ఈర్ష్య, వాత్సల్యం కలవారై లేదా కార్య దక్షతను పరీక్షించ దలచినవారై చాలా అడ్డంకులు (Obstacles) కలిగిస్తారు. కాబట్టి విఘ్నాలు పలు రకాలుగా ఉంటాయి. సమస్త విఘ్నాలను నశింప జేయడమే స్వభావమూ, వృత్తియూ, కలిగియున్న విష్వక్సేనులను పూజించడం విధిగా ఆచరింపబడుతున్నది.

శేషులు-దాసులు-కాని వారు అశేషులు. “అక్షరాణాం అకారోఽస్మి” అన్నట్లు, అకార వాచ్యుడైన భగవంతునికి శేషభూతులూ, శేషవృత్తిని అవలంబించని వారు కూడా విష్వక్సేనులను పూజిస్తే ఆయన వారికి కలుగబోయే సకల విఘ్నాలను

నశింపజేస్తున్నప్పుడు ఇక, శేషభూతులకు కలిగే సర్వవిఘ్నాలను శాంతింప జేయడం కైముత్యన్యాయసిద్ధమే కదా!

అనీకేశ్వరం: 'అనీకం' అంటే సైన్యం. "విభజ్య న నీయతే ఇతి = అనీకం" (వేర్పరచరానిది) అని వ్యుత్పత్త్యర్థం. వీరి సేనలో గజముఖులైన వ్యక్తులెందరో ఉన్నారు. విష్వక్సేనుల ఆధీనంలో ఉన్న పరిజనులందరూ విఘ్న వినాశకులే. అట్టి సేనకు అధిపతి విష్వక్సేనులు.

"యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతం।
విఘ్నం, నిఘ్నంతి సతతం విష్వక్సేనం త మాశ్రయే॥"

అనేది విష్వక్సేనులను పూజించే ప్రసిద్ధ శ్లోకం. విఘ్నేశ్వరుడన్నట్లైతే వినాయకుడు – గణపతి – అనే భావం త్వరగా స్ఫురిస్తుంది. భూమీశుని సేవిస్తే భూమిని ఇస్తాడు. ధనేశుని వేడుకొంటే ధనమిస్తాడు. అట్లే విఘ్నేశ్వరుణ్ని పూజిస్తే, విఘ్నాలనే కలుగజేస్తాడేమో! అని కొందరికి అట్టి సందేహం కలుగకుండా 'అనీకేశ్వర' శబ్దాన్ని ప్రయోగించి, రచనా సౌందర్యాన్ని ప్రదర్శించడం కవితార్కిక కేసరి కే సరి కదా!

విష్వక్సేనులు, తమను ఆశ్రయించిన చతుర్విధ పురుషార్థ పరులకు ఈప్సితార్థ సిద్ధిని కలిగించే నిత్యసూరులు. "ఉత్తమశ్చింతితంకుర్యాత్" అన్నట్లు శ్రియః పతియొక్క సంకల్పాన్ని (చెప్పక ముందే) ఇంగితంగా గ్రహించి, ఉభయ విభూతుల యందలి చిద చిన్నియనాధికారాన్ని నిర్వహిస్తూ, దివ్యదంపతులను విహరింపజేసే సామర్థ్యం కల సేనేశులు విష్వక్సేనులు. గురు పరంపరలో శ్రీశఠకోప దివ్యసూరులకు మంత్రోప దేశంచేసి ఆచార్య పదవిని అలంకరించినవారు విష్వక్సేనులు. ఇది శ్రీమంతుని దయా కార్యమే. ఇంత మహిమను కలిగియున్న వైకుంఠ సేనాపతులు ముఖ్యంగా ఆచార్య పరంపరకు సంబంధించినందువల్ల, దేశికులు వీరిని ఆశ్రయించారు, పాదాలను పట్టుకొన్నారు. రూపకానుప్రాణిత ఉత్ప్రేక్షాలంకృత శ్లోకమిది.

శ్రీమంతుని కరుణాబ్ధిన్
క్షేమార్థము మొదట దాన శిక్షాస్రోతం

బై మెఱ సెనో నాదగు సే
నాముఖ్యుని సకల విఘ్న నాశుని గొలుతున్॥

6. సమస్త జననీం వందే చైతన్యస్తన్య దాయినీం।
శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీమ్॥

అర్థం: శ్రీనివాసస్య = శ్రీనివాస భగవానుని యొక్క; కరుణాం = దయాగుణం; రూపిణీం, ఇవ (స్థితాం) = మూర్తీభవించిన (దో అన్నట్లున్నట్టి); శ్రేయసీం = శ్రేయస్సునిచ్చునట్టి; చైతన్య స్తన్యదాయినీం = జ్ఞానం అనే చనుబాలను ఇచ్చునట్టిది కావున; సమస్త జననీం = చేతనాచేతనాలనన్నిటినీ కన్నతల్లియైన లక్ష్మీదేవిని; వందే = స్తుతిస్తున్నాను.

తా: శ్రీనివాసుని కరుణయే ఆకృతిని దాల్చినట్లున్నట్టి; శ్రేయస్కారిణి యైనట్టి; ప్రాణులకు జ్ఞానమనే స్తన్యమిచ్చునట్టి; సంపూర్ణ జగత్తుకు తల్లియైనట్టి లక్ష్మీదేవికి నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య: శ్రీ వైకుంఠ సేనానికి ఆచార్యయైన శ్రీదేవిని స్తుతించే శ్లోకం.

ఏకాక్షరమైన శ్రీ శబ్దానికి ఆరు వ్యుత్పత్త్యర్థాలున్నాయి.

1. జీవుల చేత ఆశ్రయింపబడుతుంది.
2. తన భర్తను విడువకుండా ఆశ్రయిస్తుంది.
3. ఆశ్రితుల మాటను వింటుంది.
4. ఆర్తుల మొరను పతికి వినిపిస్తుంది.
5. సమస్త దోషాలను పోగొట్టుతుంది.
6. తన గుణాలచే విశ్వమంతా వ్యాపించి ఉంటుంది.

ఇలాగా ఆరర్థాలు గలిగిన శ్రీదేవిని దేశికులు (6) ఆరవ శ్లోకంతోనే స్తుతించారు.

"తిరువుడమే మార్బుమ్" కోరివచ్చిన గొప్ప వైభవం గల లక్ష్మీ దేవికి తన వక్షఃస్థలాన్ని లలిత గృహంగా కల్పించిన భగవానుడు శ్రీనివాసుడు. అద్భుత, అనంత రూపగుణాలచే తనను ప్రకాశింప జేస్తుంది. కాబట్టి 'శ్రీనివాసు' డనే పేరుతోనే భగవానుడు హర్షోత్కర్షంగా వెలసియున్నాడు.

శ్రీనివాసస్య కరుణామివ రూపిణీం:- శ్రీనివాసుని కరుణయే లక్ష్మీ రూపం అని వాక్యార్థం. భగవానునికి ఉన్న దయను వృద్ధి పరచేది "కరోతి ఆత్మానం అధీనం అనయా ఇతి = కరుణా". దీనిచేత వ్యక్తి తనను అధీనం చేసుకోవడం 'కరుణ' లక్షణం. రూపానికి గుణం ఉంటుంది. గుణానికి రూపం ఉండదు. దయాగుణం రూపాన్ని ధరించినట్లు లక్ష్మీదేవి ఉన్నదంటే, దయ ఆత్మయై, లక్ష్మి శరీరంగా ఉన్న భావం స్ఫురిస్తుంది. నైర్ఘృణ్యం (నిర్దయ) లేశమైనా లేని ఘృణయే నిలువెల్ల దీపించే రూపమది. లక్ష్మీదేవి దయా దేవిగా ఉన్నదని తేట తెల్లమవుతున్నది.

శ్రేయసీం:- శ్రియతే ఇతిశ్రేయః. సేవింపబడేది శ్రేయస్సు. ప్రశస్త తరమైనది శ్రేయస్సు. మోక్షమనే అర్థమూ ఉంది. "శ్రేయస్కరత్వాత్ = శ్రేయసీ" శ్రేయస్సును కలిగించేది లక్ష్మీదేవి.

శ్రీదేవి గుణమే శ్రేయస్కరమైనది.

శ్రీనివాసస్య శ్రేయసీం:- ఆశ్రితులకే కాక తన వల్లభుడైన శ్రీనివాసునికి కూడా శ్రేయస్సును కలుగజేస్తుంది. జగద్రక్షణ విషయంలోనూ, శ్రేయోదాన విషయంలోనూ శ్రీదేవి యొక్క సహాయం శ్రియః పతిచే ఆపేక్షితమే. స్వీకార దశయందు "దేవజుష్టాం". విష్ణుదేవుని చేత సేవింపబడినదని శ్రీ సూక్తం.

"బ్రహ్మన్! యమను గృహ్ణామి తద్విత్తం విధునోమ్యహమ్" (భాగ-8స్కం. 22అ. 25 శ్లో) ఓ బ్రహ్మదేవా! నేనెవరినైతే అనుగ్రహిస్తానో అతని ధనాన్ని కొల్లగొడుతాను" అన్నాడు వామన మూర్తి. ధనమదం వ్యక్తులను స్తబ్ధులను చేయడమే కాక భగవంతుణ్ని కూడా గౌరవించకుండా చేస్తుంది. కాబట్టి ప్రపన్నులందరు అకించనులేకదా!

శ్రీదేవి అనుగ్రహం లేకుంటే ప్రాపంచిక సుఖంగానీ, పారమార్థిక సుఖంగానీ కలుగనే కలుగదు. కాబట్టి "శ్రేయో నహ్యరవిందలోచన మనః కాంతా ప్రసాదాత్ ఋతే" అన్నారు శ్రీయామునమునులు.

భగవత్తత్త్వం ప్రమేయం కదా! ప్రమేయమంటే కొలువదగినది. అట్టి భగవంతుణ్ని అప్రమేయ తేజ స్వంతునిగా ప్రకాశింపజేసేది శ్రేయసి, అంటే లక్ష్మీదేవి. ముఖ్యంగా, 'శ్రేయసీ' శబ్దప్రయోగం చేత లక్ష్మీదేవి 'పురుషకారిణి' అని సూచింపబడినది. శ్రీనివాసునికి నిస్సమాభ్యధిక శ్రేయస్సును కలిగించి పురుషోత్తము నిగా చేసింది కదా!

చైతన్యస్తన్యదాయినీం:-ప్రాణులకు జ్ఞానమనే స్తన్యమిచ్చేది లక్ష్మీదేవి. దేహానికీ, ఆత్మకూ ఉపయుక్తమైన సత్తువను కలిగిస్తుందని భావం. స్తన్యమివ్వడం వల్ల జననియైనది. చైతన్యమిచ్చి ఆచార్యయైనది. "స్యాదాచార్యాపిచ స్వతః" (అమరం) 'ఆచార్యాని' అంటే 'ఆచార్యుని పత్ని'గానే కాక, స్వయంగా మంత్రోపదేశం చేసి 'ఆచార్య' గా వ్యవహరించింది లక్ష్మీదేవి. ఈ పదం ఉపాయత్వాన్ని సూచిస్తుంది. చైతన్యాన్ని స్తన్యంగా (తాదాత్మ్యంగా రంజింప జేయడం) నిరూపించడంలో విశేషమేమి? అంటే, "సహి విద్యాతస్తంజనయతి, శరీరమేవ మాతా పితరౌ జనయతః" (ఆపస్తంబ సూత్రం) తల్లిదండ్రులు కేవలం శరీరాన్ని జనింప జేస్తారు. కన్నతల్లికే స్తన్యం ఊరుతుంటుంది. స్తన్యపానం వల్ల శరీరానికి సత్తువ కలుగుతుంది. జ్ఞాన జన్మను ప్రసాదించడం ఆచార్య లక్షణం. జ్ఞానం వల్ల జీవుడు ఉద్ధరింప బడుతాడు. లోకంలో 'బుద్ధిబలం దేహబలం కంటే గొప్పది' అనే మాట వాడుకలో ఉన్నది కదా! స్తన్యం చేత దేహబలం కలిగినట్లే, విద్యచేత బుద్ధిబలం కలుగుతుంది. చైతన్యదాయిని అయినందువల్లనూ లక్ష్మీదేవి జననియే. కాబట్టి ముఖ్యమైన చైతన్యాన్ని స్తన్యంతో తాదాత్మ్యం చేయడం రూపకాలంకార లక్షణం. కావ్య శరీరానికి అలంకారాలు భూషణాలే కదా!

సమస్తజననీం:- సకల జగత్తును కన్నతల్లి లక్ష్మీదేవి. 'త్వంమాతా సర్వలోకానాం" (వి.పు) "అఖిల జగన్మాతరం" అన్నారు భగవద్రామానుజులు. ఇక్కడ జగచ్ఛబ్దాన్ని వాడక పోవడానికి కారణం. జగత్తులో ఉన్న వారికి జనన

మరణాలుంటాయి కాని పరమపదమైన వైకుంఠంలో నివసించే నిత్య సూరులకు అవి ఉండవు కదా! కాబట్టి, లీలా విభూతిలో నివసించేవారికీ, నిత్య విభూతిలో నివసించే నిత్యసూరులకూ, సమస్తానికి కూడా జనని లక్ష్మీదేవియే అని చెప్పబడింది. 'సమస్తజనని' అనడం వల్ల ఉపేయత్వం అనురణిస్తున్నది. ఉత్ప్రేక్షాలంకృత శ్లోకమిది.

ఆ॥ శ్రేయములనొసంగు శ్రీనివాసునిదయా
విగ్రహంబు నాగ వెలిగి సర్వ,
జంతుజాలములకు చైతన్యమయమగు,
స్తన్యమొసగులోక జననిదలతు॥

7. వందే వృషగిరీశస్య మహిషీం విశ్వధారిణీమ్।
తత్కృపా ప్రతిఘాతానాం క్షమయా వారణం యయా॥

అర్థం: క్షమయా = ఓర్పు గలిగియున్న; యయా = 'క్షమ' అనే పేరు కలిగిన ఏ దేవి చేత; తత్, కృపా, ప్రతిఘాతానాం = ఆ శ్రీనివాసుని దయ యొక్క విఘ్నాలకు; వారణం = తొలగింపో; (అట్టి), వృషగిరీశస్య = వేంకటాచలపతి యొక్క; మహిషీం = పట్టపు రాణియైన; విశ్వధారిణీం = విశ్వంభరయైన భూదేవిని; వందే = స్తుతిస్తున్నాను.

తా: అన్నింటిని ఓర్చుకొనే శక్తి కలిగిన భూదేవికి 'క్షమాదేవి' అనే పేరు ప్రసిద్ధిని పొందింది. శ్రీనివాస భగవానుని దయ ప్రవహించకుండా అడ్డగించే చేతనుల పాపాలు క్షమాదేవి చేత నివారింప బడుతాయి. చరాచర పదార్థాలను ధరించునట్టి, వృషగిరీశుడైన భగవానుని పట్టపురాణియైన భూదేవికి నతి నుతుల నర్పిస్తున్నాను.

వ్యాఖ్య: క్షమా గుణ సంపన్నయైన భూదేవిని స్తుతిస్తున్న శ్లోకం.

తిరుమలేశుడు ఏడుకొండల పైన నివసించాడు కదా! భక్తులు తిరుమలనే అనేక నామాలతో అనుసంధిస్తారు.

"శ్రీశేష శైల, గరుడాచల, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి ముఖ్యామ్। ఆఖ్యాం త్వదీయ వసతేరనిశం వదన్తి" అని 'శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం'

లోని (15) శ్లోకం. శ్రీ వేంకటాచలమాహాత్మ్యం అనే గ్రంథంలో ఈ పర్వతం యొక్క మహిమ విశేషంగా వివరింపబడి ఉంది. వృషుడనే పేరుగల మనువు 'తిరుమల' లో తపస్సు చేస్తే వరాహస్వామి ప్రసన్నుడయ్యాడట. "నీవు తపస్సు చేసి ధర్మాన్ని వృద్ధి పరచినందువల్ల ఈ పర్వతం 'వృషాద్రి' అని వ్యవహరింపబడుతుంది" అని వరాహస్వామి ఆయనకు వరమిచ్చినట్లు వామన పురాణ గాథ.

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అని శ్రీకృష్ణ భగవానుని గీతోపదేశం.

'వృషో హిధర్మః' అంటే 'వృష' శబ్దానికి 'ధర్మ' మని అర్థం.

'త్రివర్గం' అనే ధర్మార్థ కామాలలో శీర్షస్థానాన్ని అధిష్ఠించింది ధర్మం. "విష్ణుః పర్వతానామధిపతిః" పర్వతాలకు అధిపతి విష్ణుమూర్తి యని శ్రుతి పల్కుతుంది. "పర్వత స్తనమండలా" అని భూదేవికొక పేరు ఉంది. భూధరాధీశుడై 'మామేకం శరణం వ్రజ' నన్ను మాత్రమే శరణు పొందండి అనే ప్రధాన ధర్మోపదేశాన్ని సంసారులు ఆచరించి తరించడానికి తాను రక్షించడానికి తన పాదాలే ముఖద్వారమని ప్రదర్శిస్తూ అర్చా విగ్రహంగా వెలసిన శ్రీనివాస ప్రభువే వృషగిరీశుడు.

వృషగిరీశస్య మహిషీ:- శ్రీనివాస ప్రభువు యొక్క పట్టపు దేవియైన భూదేవి అని అర్థం.

"కృతాభిషేకా మహిషీ" (అమరం)

"హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ" అని శ్రుతి. సర్వేశ్వరుడైన పురుషోత్తమునికి భూదేవి, లక్ష్మీదేవి ఇద్దఱు పత్నులు. 'పత్ని' అంటే, పతితో కూడి దాన, యజ్ఞ రక్షణాది యోగం కల మహిళ అని అర్థం.

శ్రుతిలోని 'హ్రీ' శబ్దానికి భూదేవి అని అర్థం. భగవంతుని కుడి ప్రక్కన లక్ష్మీదేవి, ఎడమ ప్రక్కన భూదేవి ఉంటుంది.

"రామస్య దక్షిణే పార్శ్వే పద్మాశ్రీః సమవర్తత। సవ్యేతు శ్రీర్విశాలాక్షీ". శ్రీ రాముని కుడి వైపు లక్ష్మి, ఎడమవైపు 'శ్రీ' అంటే భూమి, నీడలా ఉండి భజించేవారు అని వాల్మీకి వాక్కు

"త్వం వ్యాహృతిః ప్రథమతః ప్రణవః ప్రియం తే సంవేద యత్యఖిల మంత్రగణస్తమేవ।" (భూస్తుతి 2).

ఓం భూర్భువస్సువః - వేద మంత్రాలకు మొదట ఉచ్చరింపబడే భగవద్వాచక మైన ఓంకారానికి గల మూడు వ్యాహృతులలో మొదటిది భూవాచక, మైనందువల్ల భూదేవికి భగవానుడు ప్రియుడు - అని స్పష్టమవుతున్నది.

"విష్ణుపత్నీం మహీందేవీం మాధవీం మాధవప్రియామ్' లక్ష్మీప్రియ సఖీం దేవీం నమామ్యచ్యుత వల్లభామ్" (మేదినీ సూక్తం)

శ్రీదేవికి అవయవభూతయై - లక్ష్మీదేవికి చేదోడు వాదోడుగా ఉన్నట్టి, విష్ణు పత్నియైన భూదేవి శ్రియః పతికి చాలా ప్రియురాలనీ, 'అచ్యుత వల్లభ' అని శ్రుతి కాంత కీర్తించింది.

మహార్ణవంలో మునిగియున్న భూదేవిని ఉద్ధరించిన వాడు వరాహ భగవానుడే అని వేదమూర్తి కీర్తించాడు. "ఉద్ధృతాఽసి వరాహేణ కృష్ణేన శతబాహునా" అని (నారా-ఉప). పట్టపుదేవిగా వెలసిన భూదేవి "తన బిడ్డలు సంసారం నుంచి తరించే దారిని చూపండి స్వామీ!" అని ప్రార్థించింది. అప్పుడు వరాహస్వామి మూడు ప్రక్రియలను ఆచరిస్తే బాగుపడతారన్నాడు.

1. భగవంతుని నామాలను కీర్తించడం.

2. ఏమీ లేని దీనుడను అంటూ చేతులు జోడించి, 'గతిలేని వాడను' అంటూ కాళ్ళను జోడించి, 'నీవే రక్షకుడవు స్వామీ!' అని మహా విశ్వాసంతో (ప్రపత్తి) ప్రార్థన చేయడం.

3. ధ్యేయ మూర్తికి సుగంధ పుష్పాలతో అర్చన చేయడం.

ఈ మూడూ వేర్వేరు ప్రక్రియలు కావు. మనోవాక్కాయాలతో సేవ చేసే ఋజు మార్గమిది. ప్రజలు ఈ మార్గంలో ప్రవర్తించడానికి భూదేవి, గోదా దేవిగా అవతరించి, భగవంతుణ్ని సులభంగా పొందదగిన ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి చూపింది.

విశ్వధారిణీ:- భూదేవి స్వరూపం చేత సకల చరాచర వస్తువులను ధరిస్తున్నది. "భూమిర్ధేనుర్ధరణీ లోకధారిణీ" అన్నది వేదవాణి. పాడి పంటలనూ, సకల ప్రాణులనూ ధరిస్తున్నది. భోగ్య పదార్థాలచే జీవులను పోషించే భారాన్నీ వహిస్తున్నది. 'విశ్వం విష్ణుః' అన్నట్లు విశ్వాన్నీ, విష్ణువునూ ధరించే స్వభావమూ కలది, కాబట్టి 'సర్వం సహా' అని భూమికి పేరు. ధరించే స్వరూపం కలిగి యుండడమే కాక సమస్త జీవవర్గాన్ని ఉద్ధరించడానికి అన్నిటినీ సహించే క్షమా గుణం కలది భూమాత. అందువల్ల భూదేవికి 'క్షమ' అన్న పేరు సార్థకమైనది.

"బాహ్యే చాధ్యాత్మికే చైవ దుఃఖేచోత్పాదితే సతి।
నకుప్యతి నవాహంతి సాక్షమా పరికీర్తితా॥"

'క్షమ' అంటే శారీరకంగా గానీ, మానసికంగా గానీ ఎంతో బాధను కలిగించినా, కన్నెఱ్ఱజేసే చిహ్నమెరుగని ఓర్పు గల నేర్పు.

చేతనులను రక్షించడం భగవానుని స్వాభావికమైన దయ పైన ఆధారపడి యుంది. అయినా, స్వతంత్రుడైన భగవానుని అనుగ్రహాన్ని చేతనులు పొందడం చాలా కష్టం. భగవంతుణ్ని ఆశ్రిత పరతంత్రునిగా లక్ష్మీ దేవి చేసే పురుషకారాన్ని క్షమా (భూ) దేవి భగవంతుని చేత సఫలం చేయిస్తుంది. కాబట్టి దయ, క్షమ అనే రెండు గుణాలు రక్షణకృత్యానికి ఆవశ్యకాలు. దయామూర్తి అంగమే క్షమ. క్షమ - ఓర్పు - లేని దయకు గుణపూర్తి ఉండదు కదా!

తత్కృపా ప్రతిఘాతానాం క్షమయావారణం:- శ్రీనివాస భగవానుని దయా ప్రవాహాన్ని నిరోధించేవి జీవులు చేసిన పాపాలే. భగవానుని ఆజ్ఞా రూపాలైన వేద శాస్త్రాలలోని విధి నిషేధాలను తెలుసుకోకపోవడం శాసకుడైన ఆయన ఆజ్ఞను ఉల్లంఘించినట్లే కదా! చేయరాని పనులను చేయడం 'దోషం'. చేయవలసిన కృత్యాలను చేయకపోవడం, 'గుణహాని' అంటారు. విధి నిషేధాలను తెలుసుకొన్న ప్పటికీ, వాటిని పాటించక, విషయ భోగలాలసుడై ఇంకా చేస్తూ ఉండే దోష, గుణహానులను ఆర్ద్రాపరాధాలు - పచ్చి నేరాలు అంటారు.

సంసారులు చేసిన మహాపరాధాలను చూచి సర్వేశ్వరుడు ఆగ్రహంతో "క్షిపామి అజస్రమశుభాన్" ఈ పాపిష్ఠులను నరకంలోకి త్రోసి వేస్తానంటాడు. ఆ సమయంలో

దయామయియైన లక్ష్మీదేవి 'కిమేతత్, నిర్దోషఃక ఇహజగతి?" – ఇదేమిటండీ! తప్పు చేయనివాడు లోకంలో ఎవడున్నాడు? మీరు వీరి తప్పులను లెక్కించి, వీరిని నెట్టి వేసి తలపులు మూసుకొంటే మీ దయ ప్రవహించే దెక్కడ? మీరు వీరిని దగ్గరకు చేర్చుకొని 'దయా సముద్రుడు' అన్న మీ పేరును సార్థకం చేయండి స్వామీ! అని వేడుకొంటుంది. దీన్నే 'పురుషకారం' అంటారు. పురుషుణిగా చేయడమని అర్థం. "పురు, సనోతి ఇతి = పురుషః" చాలా ఇచ్చేవాడనే అర్థం కలది పురుష శబ్దం.

భగవానుడు, తనను ఆశ్రయించిన వారిని అనుగ్రహించే విధంగా – ఆశ్రిత పరతంత్రునిగా చేస్తుంది లక్ష్మీదేవి. "మేరు, మందర పర్వతాల్లాగా పెరిగియున్న వీరి పాపాలే కదా దయా ప్రవాహాన్ని అడ్డగిస్తున్నాయి!" అంటూ భగవానుడు ముఖం ప్రక్కకు త్రిప్పుకొన్నప్పుడు, భగవానునికి ఎడమ ప్రక్కన భూదేవి ఉండకుంటే మనను చూచే నాథుడేడి?

"అలా అంటున్నారేమిటండి. వీరిని 'క్షిపామి' అనకుండా 'క్షమామి' అనండి. "దోషో యద్యపి తస్యస్యాత్ సతా మేతదగర్హితమ్" (రా.యు.) ఆశ్రితులయందు దోషాలు ఉన్నా గర్హించక వారిని కాపాడడం సత్పురుషులకు గొప్పతనం – అని మీరే అన్నారు కదండి – కాబట్టి మీ దయను ప్రవహించకుండా అడ్డగించే పాపపు కొండలను క్షమించండి. అవి అడుగున పడిపోతాయి అని భూదేవి విన్నపిస్తుంది.

భగవంతుని కృపకు కలిగే ప్రతిఘాతాలను క్షమయే తొలగిస్తుంది. 'క్షమ' తో 'దయ' మరింత పెల్లుబికినందు వల్ల చేతనులు ఉజ్జీవించునట్లు చేసేది భూదేవి. 'వృషగిరీశ' శబ్దప్రయోగం వల్ల రౌద్రం ధ్వనిస్తున్నది. కోపాన్ని శాంతింప జేసేది క్షమాగుణం.

"యాబిభ్రతీ స్థిరచరాత్మక మేవ విశ్వం విశ్వంభరా పరమయా క్షమయా క్షమాచ" (వైకుంఠస్తవం) అనే శ్లోకం ఇక్కడ స్మరణీయం కదా!

'క్షమ' అనే పేరుతోనే క్షమారూపిణి అనడం గమనీయం. పరికరాంకురా లంకృత మీ శ్లోకం.

ఆ. వృషభ శిఖరినాథు కృపకు దూరగులైన
వారికే క్షమయ నివారకంబు
వెలయజేయునట్టి విశ్వంభరా దేవి
కతుల భక్తి నేను నతులొనర్తు॥

8. నిశామయతుమాం నీలా యద్భోగపటలైర్ధ్రువమ్।
భావితం శ్రీనివాసస్య భక్తదోషేష్వ దర్శనమ్॥

అర్థం: యత్+భోగపటలైః = ఏ దేవి యొక్క భోగ సమూహాల చేత / భోగాలు అనే నేత్రదోషాల చేత; శ్రీనివాసస్య = శ్రీనివాస భగవానునికి; భక్తదోషేషు = భక్తుల యొక్క దోషాలయందు; అదర్శనం = చూపులేకుండడం; ధ్రువం = నిశ్చయంగా; భావితం = కలిగింపబడినదో; (అట్టి) నీలా = నీళాదేవి; మాం = నన్ను; నిశామయతు = కటాక్షించుగాక!

తా: ఏ దేవి యొక్క భోగ పరంపరల (తెర) చేత శ్రియః పతికి ఆశ్రితుల యొక్క దోషాల యందు దృష్టి లేకుండా చేయబడినదో అట్టి నీళాదేవి నన్ను కనుగొనుగాక!

వ్యాఖ్య: భక్తుల అపరాధాలపై భగవంతుని చూపు ఆనకుండా చేసే నీళాదేవిని స్తుతించే శ్లోకమిది.

విష్ణుభగవానునికి లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి అనబడే ముగ్గురు ముఖ్యపత్నులు. ఇందు శ్రీదేవి, భూదేవి ప్రసిద్ధులు. నీళాదేవి శ్రీ వైష్ణవ సంప్రదాయస్థులకు మాత్రం బాగా తెలుసు. వేదంలో శ్రీసూక్తం, భూసూక్తం, నీళాసూక్తం ఉన్నది. "నీళాందేవీగ్ం శరణ మహంప్రపద్యే" "విష్ణు పత్నీ్యచ విద్మహే, శ్రీ భూసఖ్యైచ ధీమహి, తన్నో నీళా ప్రచోదయాత్" అన్నది వేదవాణి. "దేవో వైకుంఠ నాథస్తు అనంతాసన సంస్థితః। సేవ్యః శ్రీ భూమినీళాభిః" పరమ పదమందు శ్రీ భూనీళలతో సహా శేష పీఠమందాసీనుడైన దేవ దేవుడు నిత్యముక్తాత్మల చేత సేవింప బడుతుంటాడు అని (పౌష్కర సంహిత) పాంచరాత్రాగమ శాస్త్రం తెల్పుతున్నది.

భగవద్రామానుజుల వారు "శ్రీవల్లభ! ఏవం భూత భూమి నీళానాయక!" అని (శరణాగతి గద్యం) స్తుతించారు. "దేవి! త్వామను నీళయా సహ మహీ దేవ్యః సహస్రం తథా, యాభిస్త్వం స్తన బాహుదృష్టి భిరివ స్వాభిః ప్రియంశ్లాఘసే" (శ్రీ గుణ ర.కో. 26) భూనీళా పిరాట్టులు, వేల దేవేరులు కూడా లక్ష్మీదేవికి అవయవ భూతలై ప్రియంగా ఉంటారు. అని శ్రీ పరాశరభట్టరు విశదం చేశారు.

"మూన్ఱుమిన్ కొడిగళోడే తామరైప్పూత్తతు ఒరుకాలమేగం, వెళ్ళి మలైయెక్కినియ ప్పడిన్దిరుక్కు మాపోల్" - వెండి కొండ మీద మూడు మెఱుపు తీగలతో ఒక నీల మేఘంలాగా, ఆదిశేషుని (ఒక్క పీఠం) పైన శ్రీ భూనీళా పిరాట్టులతో శ్యామ సుందరుడైన సర్వేశ్వరుడు ప్రకాశిస్తుంటాడని అందంగా వర్ణించారు పిళ్ళైలోకాచార్యులు. తమిళ భాషలో 'నప్పిన్నపిరాట్టి' అని నీళాదేవికి పేరు. "కందం కమఝుం కుఝలీ" దివ్య పరిమళ భరిత కుటిల కుంతలవైన నప్పిన్నాయ్ (రమణీ మణీ!) అని నీళాదేవిని; (కొత్తలర్ పూఙ్కుఝల్ నప్పిన్నై కొంగైమేల్ వైత్తు క్కిడన్ద మలర్ మార్పా" - గుత్తులు గుత్తులుగా పూచిన పూల మాలికలచే అలంకరింప బడిన కేశపాశం గలనీళా సుందరి యొక్క స్తనగిరితటి పైన పరచబడిన విశాల వక్షఃస్థలం గల స్వామీ!" అని శ్రీకృష్ణ భగవానుణ్ని గోదాదేవి (తిరుప్పావై) సంబోధిస్తుంది. 'నీళాసుందరీ పరిణయం' అనే ప్రబంధం తెలుగు సాహిత్యంలో ఉన్నది కదా! ఇది దయా శతకం. దయా కార్యభారాన్ని శ్రీనివాసుని పత్నీత్రయం తగినట్లు విభజించుకొని నిర్వహిస్తున్నట్లు స్తోత్ర రచన సాగింది.

చైతన్యస్తన్యమిచ్చి పెంచుతున్న శ్రేయసి లక్ష్మీదేవి. ఆశ్రితుల అపరాధాలను మహాశాసకునిచే క్షమింప జేయిస్తున్న మహిషి భూదేవి. భక్తుల దోషాలు భర్తకు కనబడకుండా కంటిపొరను కల్పిస్తున్న భోగరూపిణి నీళాదేవి. చేతనోజ్జీవన విషయంలో ఈ దేవీత్రయం నిరంతరం త్రిపథగ గా పాటుపడుతూ భగవంతుణ్ని దయా సముద్రునిగా నిరూపిస్తున్నది.

యద్భోగపటలైః:- క్షమాదేవికి ఎడమ ప్రక్కన ఉండే పిన్నమ్మ చిన్నది కాదు. నొప్పించక తానొవ్వక దండధరుని దండన నుంచి తప్పించి జీవులను కాపాడే ఘటకురాలు, ఒయ్యారపు నడకలు, ఓరగంటి చూపులు, వెన్నెల వాకలాంటి

తెలినవ్వులు. తేనె పెర నుంచి జాటిన తీయని పలుకులు. ఒకటేమిటి? చుంబన, గాఢాలింగనాది భోగ విలాస విన్యాస పరంపరల చేత శ్రీనివాసుని కంటికి తాను తప్ప మరేదీ కానరాకుండా చేసే మేటిమగువ. 'పటల' శబ్దానికి కప్పు, కంటి రోగం, సమూహం అని అనేకార్థాలున్నాయి. కాబట్టి 'పటలం' శ్లిష్టపదం. "ఛదిర్నేత్రరుజోః క్లీబం, సమూహేపటలం ననా". (అమరం) భోగ సమూహాలు అనడం వల్ల భోగాలు అనేక విధాలుగానూ, విచిత్రంగానూ, ఆసక్తికరంగానూ ఉంటాయి కదా!

భోగాలు అనేవే కంటి రోగాలు అనడం వల్ల ఒకటి, రెండు కాదు, వేల కన్నుల కైనా ఆ రోగం విస్తరిస్తుంది కాబట్టి బహువచనం. భోగాలను (పత్నితో నైనా) అధికంగా అనుభవిస్తే పటలం అంటే (Cataract in the eye) కంటికి పొరకప్పే రోగం వస్తుందని ఆయుర్వేదం తెల్పుతుంది.

పుండరీకాక్షుడు కూడా పటలాక్షుడవుతాడా? అంటే కాలేదు. పటల మనే రోగానికి కారణం కన్నులు కావు, భోగాలే కదా! కాబట్టి భోగాలే పటలాలు.

భక్తదోషేషు అదర్శనం:- నీళాదేవి చేతనుల దోషాలు - అపరాధాలు - శ్రీనివాసుని కంటబడకుండడానికి ఆయనకు మీది మీద భోగాలను విస్తారంగా కల్పిస్తుంది. తత్ఫలితంగా, పురుషోత్తముడై నా బద్ధజీవుని లాగా ముగ్ధుడవుతాడు.

జీవునికి దేవునికి మధ్య తెర ఉంది. ఆ తెరను మాయ అంటారు. అందువల్ల జీవుడు భగవంతుణ్ని చూడలేడు. భగవానుని అధీనమై యుంటుంది మాయ. ఆయన నిరంకుశుడు, స్వతంత్రుడు. కన్నులు లేకున్నా చూస్తాడు, చెవులు లేకున్నా వింటాడు అని ఉపనిషద్వాణి.

నప్పిన్నమ్మ (అతి లావణ్యవతి) అందించే దివ్యభోగ రసానుభవమందు వ్యామోహుడైన శ్రీనివాస భగవానుడు సాధన భక్తి కలవారైనా, సాధ్య భక్తి కలవారు (ప్రపన్నులు) అయినా, ఉభయ విధభక్తుల దోషాలను చూచినా చూడని వాడు (పశ్యన్నపి నపశ్యతి)గా ఉంటాడు.

ధ్రువం, భావితం:- భక్తులను చూచినా, వారి దోషాల మీద భగవంతుని దృష్టి పడదని భావించడం నిశ్చయం. 'ధ్రువం' అనే పదం ఉత్ప్రేక్షను సూచిస్తుంది. అంటే కవి యొక్క ఊహను తెల్పే పదం.

భగవానుడు భక్తుల దోషాలను, వంద ఉన్నా ఒక్కటి నైనా, ఆత్మీయులవడం చేత చూడడు. "ఎన్నడియా రదుశెయ్యార్" 'నా భక్తులు తప్పు చేయరు. వారు మంచి పనులే చేస్తారు' అని భగవంతుడంటాడు అని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి.

భక్తుని యందున్న దోషాన్ని తాను చూడడు. లేని దోషాన్ని ఆరోపించడు. "దీపోనేత్రాతురస్యేవ ప్రతికూలాఽసి మే దృఢమ్" కంటి రోగమున్న వ్యక్తికి దీపం అనుకూలంగా ఉండనట్లు నాకు నీవు ఉన్నావు - అని శ్రీరాముడు సీతను గూర్చి పలికాడు.

స్వయంప్రకాశమైన దీపం వంటి సీత, దృష్టిదోషమున్న తనకు ప్రతికూలంగా కనబడుతున్నదని, దోషమామె యందు లేనే లేదు, తనకే దృగ్దోషమున్నదని తెలియ జేశాడుకదా! 'అవిజ్ఞాత' అని (వి.స.నా) భగవంతునికి పేరు. సర్వజ్ఞుడైనా భక్తుల దోషాలు తెలియని వాడన్నది దోషం కాదు, ఆయనకు గుణంగానే (వేదాన్త శాస్త్రం) పరిగణించింది.

"నస్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా" భక్తుల తప్పులు నూరు ఉన్నా వాటిని భగవంతుడెంచడనేది ఆయనకు స్వాభావిక గుణం. ఇది ప్రకృతం. చెప్పదగిన విషయం. ఈ గుణం నీళాదేవి భోగపటలాలచే సంభవించినట్లు చెప్పబడింది.

ప్రకృత విషయానికి 'అప్రకృత విషయాన్ని హేతువుగా ఊహించడం హేతూత్ప్రేక్షా లక్షణం.

"భావైరుదార మధురై ర్వివిధైర్విలాసైః
భ్రూవిభ్రమస్మిత కటాక్ష నిరీక్షణైశ్చ।
యాత్వన్మయీ త్వమపియన్మయ ఏవసామాం
నీళానితాంతమురరీకురుతాము దారా" (శ్రీ. వై. సవం. 83)

అని శ్రీవత్సాంకమిశ్రులు, నీళాదేవి భోగవిలాసాలను వశీకరణోపాయ పరంపరగానూ చెప్పిన ఈ శ్లోక ప్రభావం ఇక్కడ స్మరణీయం.

నిశామయతు మాం నీళా:- శ్రీ భూదేవతలను 'వందే' అంటూ స్తుతించిన దేశికులు ఇక్కడ 'నీళా' దేవి నన్ను కటాక్షించాలి అంటున్నారు. తన భోగరసానుభవం చేత దోషాలను భగవానుడు దర్శించకుండా చేసే కార్యమందు వ్యగ్రయై చేతనులను వాత్సల్యంతో కాపాడుతున్న తల్లి యొక్క చల్లని చూపు తన మీద ప్రసరించాలని దేశికులు ప్రార్థించడం ఎంతో సరసంగానూ, సముచితంగానూ ఉంది. దోషాల అదర్శనాన్ని చెప్పిన ఈ శ్లోకంలో 'దయా' శబ్దం కూడా అదర్శనమయింది. నప్పిన్నమ్మ చేసేదంతా దయాకృత్యమే కాబట్టి అందులోనే దయ అంతర్భవించింది. కాబట్టి దయాశతకంలోని 107 శ్లోకాలలో 'దయ' లేదా దాని పర్యాయమైన కరుణ, అనుకంప, ఇత్యాది పదమైనా ప్రయుక్త మయింది. కాని దయా శబ్దం కనబడని శ్లోకం ఇదొక్కటే. ఇదొక చమత్కృతిమత్కృతి.

తే॥ హాస్య సంభాషణాలింగనాది భోగ
పటల సంయుక్తి విభునకు భక్తజనుల
నేరములు గప్పి పుచ్చెడు నీళ నన్ను
నేలుగావుత కరుణాలి లోల యగుచు॥

9. కమప్యనవధిం వందే కరుణా వరుణాలయమ్।
వృష శైల తటస్థానాం స్వయం వ్యక్తిముపాగతమ్॥

అర్థం: కం+అపి = మాటలకు, మనస్సుకు కూడా అందనివాడు; అనవధిం = అంతంలేనివాడు; కరుణా, వరుణ+ఆలయం = దయాసముద్రుడు; స్వయం వ్యక్తిం = తనంత తాను (అర్చా రూపంగా) ఆవిర్భవించిన వాడు; (అత ఏవ = కావుననే) వృషశైల తటస్థానాం = శేషాచలం యొక్క చరియల యందు నివసించే వారికి; ఉప+ఆగతం = దగ్గరగా వచ్చినవాడైన, శ్రీ వేంకటేశ్వర స్వామిని; వందే = స్తుతి పూర్వకంగా సేవిస్తున్నాను.

తా: అవాఙ్మానస గోచరుడూ, అనంతుడూ, కృపా సముద్రుడూ, స్వయంగా కల్యాణాద్భుతగాత్రుడై, తిరుమల అనే కొండచరియల యందున్న స్థావర జంగమ పదార్థాల దగ్గర వేంచేసి యున్నవాడైన శ్రీనివాస భగవానునికి దండవత్ప్రణామం చేస్తున్నాను.

వ్యాఖ్య: స్వయం వ్యక్తిగా వెలసిన తిరుమలేశుని గూర్చి స్తుతించే శ్లోకమిది.

సర్వజగత్కారణుడెవ్వడు? అంటే, చెప్పేవాడు గురువు. ఆ మొదటి గురువెవ్వడు? అని అందరిచే అడుగ దగిన పదం 'కః' "లోకపాలఃకః కింకం సత్యం" (శ్రుతి) ఈ పదంతో పాటు అన్ని విశేషణ పదాలు గల ఈ శ్లోకంలో విశేష్యం - సంజ్ఞా వాచకం - లేదు. కొండగుఱుతుగా సుశ్లోకితం.

"కోన్వస్మిన్ సాంప్రతంలోకే" - "చారిత్రేణచకోయుక్తః" గుణపూర్ణుడైన చారిత్రక పురుషుడెవ్వడు? అని వాల్మీకి నారద మహర్షిని 'కః-కః' అడిగాడు. ఆ ప్రశ్నకు దేవర్షి "ఇక్ష్వాకు వంశ ప్రభవః - రామః" అని చెప్పినందు వల్ల 'రామాయణ' రచన సాగింది.

ధర్మరాజు 'కిమేకం దైవతంలోకే, కింవాప్యేకం పరాయణమ్। స్తువంతఃకం, కమర్చంతః ప్రాప్నుయుః మానవాః శుభమ్॥ కోధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః॥" ఇలా కః, కిం, కం - అని ప్రశ్నిస్తే భీష్మాచార్యులు విష్ణు సహస్రనామాలను కీర్తించి, ఇదే ఉత్తమ ధర్మమని బోధించాడు కదా!

కమపి:- మాటలతో చెప్పరానివాడు, ఇట్టివాడని మనస్సుకైనా గోచరించని వాడు. ఇప్పటికీ ప్రశ్నగానే మిగిలిన వాడని సర్వనామ శబ్దార్థం.

కం:- నిత్యం ప్రకాశించేవాడు. ఇది సంజ్ఞావాచకానికి అర్థం. ("కనతీతి = కః" తం). భగవానుడెక్కడ ఉన్నా, అక్కడి దోషాలు ఆయనను అంటవు. ఏ మార్పు చెందని నిత్యోజ్జ్వలుడని భావం.

"ఏకో నైకః సవః కః కిం" (వి.స.నా) ఇవి సర్వనామాలు కావు. సంజ్ఞా వాచకాలు కాబట్టి వీటిని చతుర్థీ విభక్త్యే కవచనంతో - ఏకాయ, నైకాయ, సాయ,

వాయ, కాయ, కిమే నమః అని కీర్తించాలి. (ఏకస్మై, తస్మై, కస్మై నమః అని స్తుతించరాదు).

అనవధిం:- అవధి - అంతం లేనివాడు. అవధి ఉంటే ఇంతటివాడని కొలువడానికి వీలుండేది కదా!

(న+అవధిః = అనవధిః, తం). దేశకాల వస్తువుల చేత పరిచ్ఛేదింప రాని వాడు. ఎక్కడుంటాడు? ఎప్పుడుంటాడు? ఎట్లుంటాడు? అని తెలుసుకొనే ఉత్కంఠ ఉంటుంది. అతడు సర్వదేశ, సర్వకాల, సర్వ వస్తువుల్లో ఉంటాడు, అనంతమైన, స్వరూపం కలవాడు, అని శాస్త్రం చెబుతుంది. "నాంతోఽస్తిమమదివ్యానాం విభూతీనాం పరంతప!" (భ.గీత) అర్జునా! నాకు నా విభూతులకు - దివ్య పదార్థాలకు - అంతం లేదని శ్రీకృష్ణ భగవానుడు బోధించాడు. ఉపనిషత్తు కూడా 'సోఽన్వేష్టవ్యః, సవిజిజ్ఞాసితవ్యః". ఎట్లుండునో వెదుకదగిన వాడు. ఆయన ఎవడో ఇంకా విచారింప దగినవాడే, అని బోధిస్తూనే ఉన్నది.

"అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతామ్" (ఉపనిషత్తు) నాకు ఆయన తెలియును అనుకొనే వారికి ఏమీ తెలియదట, నాకు తెలియదు అనుకొన్న వారికి ఆయన స్వరూపం తెలిసి నట్లవుతుందట. ఇంతకు భగవన్మహిమ ఆ యిద్దటికీ తెలియదని అర్థం.

కరుణా వరుణాలయమ్:- వరుణుడు జలాధిష్ఠాన దేవత. వరుణుడు లయించి యున్న స్థానం - వరుణాలయం. సముద్రమని అర్థం. సముద్రమంతటి కరుణ కలవాడు కరుణావరుణాలయుడు. ఇక్కడ ఆలయ శబ్దప్రయోగ కౌశలం గమనీయం. దయా ప్రాధాన్యం గల ఈ శతకంతో దయాదేవిని ప్రార్థించడం కంటె ముందు దయకు ఆశ్రయుడైన తిరుమలేశుణ్ని దయాసాగరుడని స్తుతించడం కవి యొక్క రచనా సంవిధాన చాతుర్యాన్ని చమకింప చేస్తున్నది.


స్థిరచరాత్మక పదార్థాలకు జీవనాధారమైన సముద్రం ఎంతలోతైనదో అంత విశాలమైనది. చల్లని తన భావ ప్రకంపనాలతో ఉవ్వెత్తుగా లేచి ఎగసి పడుతున్న గుట్టల్లాంటి కెరటాలు అంచెలంచెలుగా నర్తిస్తూ, చకితులై చూస్తున్న తీరస్థులను

సమీపించి స్నపనం చేసి, వారి అంతరంగాలను, ఆనందరసతరంగితం చేస్తుంటాయి. కాబట్టి, రసఘనమైన వృషశైలేశుని దయాప్రభావం అపారమైనది కదా!

వృషశైల తట స్థానాం స్వయం వ్యక్తి ముపాగతమ్:- వృషాద్రి సానువుల యందున్న వారు ధర్మశీలురై తటస్థులుగా ఉంటారు. ధర్మార్థ కామాల సంగమ స్థలం సంసారం. అర్ధకామాలకు ఆశ్రయమై ఉన్నత స్థానమందు మధ్యస్థమైనది ధర్మం. త్రివర్గం త్రికోణాకారంగా ఉంటుంది.

"యథా ధర్మః స్వభార్యాచ పరస్పర వశానుగౌ।
తథా ధర్మార్థ కామానాం త్రయాణా మపిసంగమః"

ధర్మం అనే పురుషుణికి అనుకూలవతియైన (అర్థం) భార్య, విధేయమైన (చకారం - కామం) సంతానం ఉంటే, అక్కడ త్రివర్గ ఫలం ఉంటుంది. ఇది యక్ష ప్రశ్నకు ధర్మరాజు చెప్పిన సమాధానం.



"యత్ర నిర్లిప్త భావేన సంసారే వర్తతే గృహీ।
ధర్మం చరతి నిష్కామః, తత్రైవ రమతే హరిః"

సంసారమందు గృహమేధి విషయాసక్తుడు కాకుండా నిర్లిప్త భావంతో, నిష్కాముడై విధిగా ధర్మాన్ని ఆచరించే చోటనే భగవానుడు ఆనందంగా ఉంటాడని ఈ శ్లోకానికి అర్థం.

"స్యాద్ధర్మ మస్త్రియాం పుణ్యం" (అమరం) ధర్మం అంటే పుణ్యమే.

"సతాంసద్భిః సంగః కథ మపిహి పుణ్యే న భవతి"

అన్నట్లు, లోకంలో ఉన్నవారికి తాము చేసుకొన్న పుణ్యం చేత సత్పురుషులతో సహవాసం ఏ విధంగానైనా, కలుగుతుంది కదా! కాబట్టి ధర్మశీలురు, పుణ్యాత్ము లందరు ఒక్క చోటనే వృషశైల మందు తటస్థులైనారు. వీరందరు కామహతులు కాని శ్రోత్రియులే కదా!

"పుణ్యానామపి పుణ్యోఽసౌ" పుణ్యాలలో కెల్ల పుణ్యమైన భగవానుడు పుణ్యాత్ముల సన్నిధికి చేరడం ఆయనకు స్వాభావికమైన దయాకృత్యమే.

సముద్రుడు శరణాగతి చేసిన శ్రీరామచంద్రస్వామి పట్ల నిర్దయుడుగా ప్రవర్తించిన విషయం ప్రసిద్ధం కదా! అట్టి సముద్రుడు కాడీయన. దయా సముద్రుడు కాబట్టి, సుకృతాత్ములను అన్వేషిస్తూ సమీపిస్తాడు.

ద్వాపరయుగమందు శ్రీకృష్ణ భగవానుడు గోవర్ధన గిరిని ధరించాడు. కలియుగంలో వృషాద్రి చేత శ్రీనివాస భగవానుడు ధరింపబడుతున్నాడు.

సముద్రంలో పర్వతాలున్నాయి కాని పర్వతం మీద సముద్రం ఉండడం అసంభవం. ఇది అభూత పూర్వ కల్పన అనవచ్చు. ఈ శంకను "స్వయం వ్యక్తి ముపాగతం" అనే వాక్యం పరిహరిస్తున్నది. దయాసాగరుడైన శ్రీనివాసుడు స్వయం వ్యక్తమైన ఆవిర్భావాన్ని పొందాడు. "యమే వైషవృణుతే తేన లభ్యః, తస్యైవ ఏష ఆత్మా వివృణుతే తనూంస్వామ్" (ముం.ఉ.) భగవానుడు ఎవరిని ప్రియుడను కొంటాడో అతనిచే పొంద దగినవాడు; అనన్య భక్తునికే తన దివ్యమంగళ విగ్రహాన్ని ప్రదర్శిస్తాడు.

తిరుమల స్వయం వ్యక్తమైన దివ్యక్షేత్రం. సిద్ధులచే గాని, ఋషులచే గాని, మనుష్యులచే గాని ప్రతిష్ఠింపబడిన దేవతామూర్తి కలది కాదు. కేవలం స్వయం వ్యక్త క్షేత్రాలలోనూ శ్రేష్ఠమైనది వేంకటాచల క్షేత్రం. భగవద్దర్శన లాభం కోసం ప్రతీక్షించే పరమ భక్తులైన వృష శైల తటస్థులను అనుగ్రహించడానికి కరుణా వరుణాలయుడైన శ్రియః పతి తనంత తాను దివ్యావయవ సౌందర్య విశిష్టమైన అర్చా రూపంతో వెలిశాడు. ప్రకృతి మండలం నుంచి మానవులు, దేవతలూ, పరమ పదం నుంచి ముక్త పురుషులు, నిత్య సూరులూ ఈ కొండ మీదికి వచ్చి, ధన, విద్యాఽభిజాత్య మదత్రయాన్ని విడిచి, గుంపులు గుంపులుగా కలిసి, ఆనంద నిలయంలో అద్భుతమైన తేజస్సుతో స్వయం ప్రకాశమానుడైన దేవ దేవుని స్పృహ ణీయమైన పాదారవిందాలను గోవింద నామస్మరణ పూర్వకంగా దర్శించి, క్రమంగా పాదాది కిరీట పర్యంతం దివ్య స్వరూపాన్ని భవ్యంగా కన్మ హృదయం లో భద్ర పరచుకొని నమ్ర శిరస్కులవుతుంటారు. వేంకటాద్రితో సమానమైన స్థానం బ్రహ్మాండ మందెక్కడలేదని కీర్తించే భక్తజన కోలాహలం నిత్య శ్రీగా సాగడమే ఈ భగవత్సాన్నిధ్యానికి నిదర్శనం.

తే॥ దివ్యమంగళ విగ్రహ దీప్తులెసగ
స్వయముగా వృషభాద్రిని వ్యక్తుడైన
యవధిరహితుని వాఙ్మానసాతి దూరు
శ్రీనివాసుని హరి గృపా సింధుగొలుతు॥

10. అకించన నిధిం సూతిమప వర్గ త్రివర్గయోః
అంజనాద్రీశ్వర దయా మభిష్టౌమి నిరంజనామ్॥

అర్థం: అకించన నిధిం = నిర్ధనులకు నిధి వంటిది; అపవర్గ, త్రివర్గయోః = మోక్షానికి, ధర్మార్థ కామాలకు; సూతిం = ఉత్పత్తి కారణమైనది; నిరంజనాం = దోషం (కాటుక) లేనిదైన; అంజనా+అద్రి+ఈశ్వర, దయాం = వేంకటేశ్వర స్వామి యొక్క దయను; అభిష్టౌమి = స్తోత్రం చేస్తున్నాను.

తా: పేదవారి పెన్నిధి, ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాలను కలిగించేది, పక్షపాతాది దోషాలు లేనిది యైన, అంజనా చలేశుని దయను స్తోత్రం చేస్తున్నాను.

వ్యాఖ్య: గురు వందన మాచరించి, ప్రతి పాద్యాంశమైన భగవద్దయను స్తోత్రం చేస్తున్నానని కవి ప్రతిజ్ఞ.

దివ్యప్రబంధంలోని సహస్రగాథలలో శతకాలు, శతకంలో దశకాలు ఉన్నట్లే, దయాశతకంలో పది దశకాలున్నాయి. ఈ ప్రథమ దశకంలో మొదట "తిరువేంగడమ్ నంగళ్కు శమంగొళ్, వీడు తరుమ్" = తిరుమల మనకు సాయుజ్యాపత్తి మోక్షమిస్తుంది - అనే నమ్మాళ్వార్ల శ్రీసూక్తి రీతిగా "సర్వరసః" అనబడే స్వయం వ్యక్తియైన శ్రీనివాస భగవానుని దయారస ఘనమైన కొండయే శరణమని ప్రపత్తి చేయబడింది. తర్వాత దయామూర్తులైన ఆచార్యులకు వందనమాచరించి, తొమ్మిదవ శ్లోకమందు ప్రథమాచార్యుడైన భగవానునికి, ప్రణతి చేశారు దేశికులు. ఈ శతకంలోని నవమ దశకమందు కరుణా వరుణాలయుని దశావతారాలు వర్ణింప బడినాయి. ప్రథమ దశకాంతమందలి ఈ శ్లోకమందు అర్చామూర్తిగా అవతరించిన శ్రీనివాస భగవానుని దయాగుణం కూడా స్వపర నిర్వాహికయైన మూర్తిమతిగా దివ్యస్థానం నుంచి అవతరించినట్లు పరిగణింపబడే విధంగా - దయాదేవి యొక్క స్తోత్రం ఆరంభింపబడుతున్నది.

1. అకించన నిధిం:- 'దయాం' అనే విశేష్యానికి గల మూడు విశేషణ పదాలలో మొదటిదైన ఈ పదం విష్ణువాచకమైన అకారంతో ఆరంభమవుతున్నది. భగవానుని అనుగ్రహాన్ని పొందడానికి కర్మ జ్ఞానభక్తి యోగాలు సాధనాలు. ఫలప్రాప్తికి తగిన వస్తువు గానీ, సాధనగానీ, ఉపాయంగానీ ఏవీ లేని వారు అకించనులు. దరిద్రులన్నమాట. 'నిధి' అంటే ఎవరికి తెలియకుండా భూమిలో దాచబడిన ద్రవ్యరాశి. ఆ ద్రవ్యాన్ని పొందడానికైనా అన్వేషించడమూ, త్రవ్వడమూ మొదలైన ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. ఏ ప్రయత్నము చేయలేని వారు అకించనులు. అకించనుల స్థితిని అకించనత్వం లేదా ఆకించన్యం అంటారు. అకించనులే భగవంతుణ్ని శరణు పొందుతారు. ఆకించన్యమే దయనీయం కదా! కాబట్టి ప్రపత్తికి ముఖ్యమైన అంగం ఆకించన్యమని శాస్త్రం బోధిస్తుంది. భగవానుడే రక్షకుడని అకించనుడు శరణు పొందునంత వరకే ఆర్తి, వాంఛలు, ప్రబలంగా ఉంటాయి. శరణాగతి చేయగానే భగవద్దయయే అకించనుణ్ని ఉద్ధరిస్తుంది. అకించనుని అనిష్టాలు తొలగిపోతాయి. ఇష్టమైన వాటిని పొంద గలుగుతాడు. అకించనుల పాలిట దయా దేవియే నిధిగా ఉంటుంది. వారికి తపః ప్రముఖ సాధనానుష్ఠానాలేవీ లేకున్నా, పొందరాని మహానిధి యైన శ్రీనివాస భగవానుని దర్శనం చేయించే ప్రభావం కలది దయాదేవి.

2. అపవర్గత్రివర్గయోఃసూతిం:- చతుర్విధ పురుషార్థాలు దయా దేవి వల్ల ఉత్పత్తి అవుతాయి. దయాదేవి యొక్క దయ లేకుంటే ఎవరికైనా పురుషార్థం లభించదు. త్రివర్గం - ధర్మార్థ కామాలు మూడు ఐహికమైతే, అపవర్గం-మోక్షం, తురీయ పురుషార్థం, పారమార్థికం. దయా దేవి జీవులకు ఆత్యంతిక దుఃఖ రహితమూ, శాశ్వతానంద మైన మోక్ష మీయడానికే ఇష్టపడుతుంది. భక్తుల కోరికను బట్టి త్రివర్గాన్ని ప్రసాదిస్తుంది. మోక్షమిచ్చే అధికారం భగవానునికే ఉంది. దయా ప్రభావం వల్ల ఆమోక్ష ప్రదానాధికారం వినియోగింపబడుతుంది. ఆర్తులకు, అర్థార్థులకు, జిజ్ఞాసువులకు, ఔదార్య బలాత్కారం చేత త్రివర్గ ఫలమూ లభిస్తుంది. మోక్ష ఫల ప్రదానమే దయా దేవికి స్వాభావికం, త్రివర్గ ఫలదానం అనుషంగికం. కాబట్టి అపవర్గానికి ప్రాథమ్యం గ్రహింపబడింది.

3. నిరంజనాం: దోషాలేవీ లేనిది దయాదేవి. జీవులను ఉద్ధరించే శ్రీనివాసుని దయకు పక్షపాతాది దోషాలుండనే ఉండవు. అంజన శబ్దానికి 'కాటుక' అనే అర్థముంది. దయా దృష్టి స్వాభావికంగా స్వచ్ఛంగా ఉంటుంది. కాబట్టి దయామూర్తి నయనాలకు అంజనం – కాటుక పెట్టుకొనే అవసరముండదు. నిరంజనుడు శ్రీనివాస భగవానుడు. ఆయన పత్నియైన దయాదేవీ నిరంజనయే కదా! ఈ విశేషం వల్ల దయాదేవికి హేయప్రత్యనీకత్వం నైసర్గికమని స్పష్టమవుతున్నది. నిరంజనులకు పరమ సామ్యాన్ని కల్పించే భగవంతుని దయను 'నిరంజన' యని స్తుతించడం ఎంతో ఉదాత్తమైనది.

అంజనాద్రీశ్వరదయాం:- ఈ పదం దయాదేవి యొక్క నామాన్ని నిర్దేశిస్తున్నది. అంజనాదేవి తపస్సు చేసి "దాసోఽహం కోసలేంద్రస్య" అనే ఆంజనేయుణ్ని కనడానికి కారణమైన ఈ కొండకు "అంజనాద్రి' యని పేరు కలిగింది. "నయనే రంజయన్నం జనాద్రిః" (హం.సం. 21 శ్లో) అన్నట్లు శ్యామవర్ణం గల వనసమృద్ధి చేత, 'కాటుక కొండ' లాగా నయనానందకరమైన పర్వతమిది. కాటుక కన్నులను రంజింప జేయడం ప్రసిద్ధమే కదా! అంజనాద్రి తనను సేవించిన వారి కన్నులకు తనపైన అధిష్ఠుడైన సర్వేశ్వరుణ్ని అవశ్యంగా దర్శించే రాగాన్ని కల్పిస్తుంది. అట్టి దివ్య క్షేత్రమైన అంజనాద్రికి అధిపతిగా ఉన్నవాడు శ్రీనివాస భగవానుడు. నిధి పర్వతం మీద ఉంటుందనడం లోక పరిపాటి. హిరణ్య నిధియైన భగవంతుణ్ని సేవించగలిగే దివ్య చక్షువును ప్రసాదించే అంజనాద్రి నామంతోనూ, దాని మీద స్వయం వ్యక్తమైన తన పతియొక్క నామంతోనూ, దయాదేవి యొక్క నామాన్ని నిర్దేశించి స్తోత్రం చేయడం వల్ల దయా దేవి మహిమ అపారమని స్ఫురింప చేశారు దేశికులు.

అభిష్టౌమి:- అభితః స్తౌమి. అంజనాద్రీశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క హృదయమందు విహరిస్తూ, అసంఖ్యేయ కల్యాణ గుణాలకు అంతర్యామినిగా, ఉన్న దయాదేవిని స్తుతిస్తున్నాను అని స్తోత్ర రచనకు ఉపక్రమించే ప్రతిజ్ఞ.

దయాదేవి యొక్క విజ్ఞాన వికాస విలాస విన్యాస విశేష వైభవం అగాధ మైనందువల్ల సమగ్రంగా వర్ణించే సామర్థ్యం లేని వాడను కాబట్టి దయకు

ఆ(శయుడైన అంజనా(దీశ్వరుణ్ని కూడా స్తుతిస్తున్నాను, అనే స్తోత యొక్క సవినయ ప్రకటన ఇందు అనురణిస్తున్నది.

ఈ శ్లోకంలో అంజనా(దీశ్వరుని దయ నిరంజన-అంజనం లేశమైనా లేనిది - అనే శబ్ద చమత్కారమున్నది. దయకు నైల్యం, కల్మషం ఏ మా(తముండదని అర్థం. అంజనా(దీశ్వరుడైన భగవానుడు మా(తం నీలవర్ణుడే కదా!

శారీరక మీమాంసా శాస్త్రంలోని నాలుగు అధ్యాయాలలో నాలుగు విషయాలు జగత్కారణుడైన భగవానుణ్ని (ప్రతిపాదించాయి. ఆ (ప్రతిపాద్యార్థాలు (1) "అకించన నిధిం" అనడం వల్ల 'ఫలరూపత్వం (2) "సూతిమప వర్గ (త్రివర్గయోః " అనే మాట చేత 'ఫలసాధనత్వం' (3) అంజనా(దీశ్వర దయాం అనే పదంతో 'స్వరూపం' (4) నిరంజనాం అనడం వల్ల 'అబాధ్యత్వం' అనేవి (శియః పతి నా(శయించిన దయాదేవికే ద్యోతకమవుతున్నాయి. వేదాన్త శా(స్తా(ర్థాన్ని ధ్వనింప జేస్తున్నదని (ప్రాజ్ఞుల చేత (ప్రశంసితమైన శ్లోకమిది. 'అనుష్టుప్' ఛందస్సు తో ఉన్న మొదటి దశకంలో చివరిదైన ఈ శ్లోకంలోని నాలుగు పాదాల యందు కూడా మొదటి అక్షరం అకారమే (ప్రయోగింపబడినది.

"అక్షరాణాం అకారోఽ స్మి" అన్నట్లు అకారవాచ్యుడైన భగవానుణ్ని ఆ(శయించిన దయాదేవిని గూర్చి స్తో(త్రం సాధికారంగా సాగుతున్నది.

తే॥ సకల విధ పురుషార్థంబులకు బ్రసూతి
నిలయమై యకించనులకు నిధియునగుచు।
సర్వజన సేవ్యయును నిరంజనయునైన
యంజనా చలేశ్వరుదయ నభినుతింతు॥

ప్రథమ దశకం సమాప్తం

ద్వితీయ దశకం

11. అనుచర శక్త్యాది గుణా మగ్రేసర బోధ విరచితా లోకామ్।
స్వాధీన వృషగిరీశాం స్వయం ప్రభూతాం ప్రమాణ యామిదయామ్॥

అర్థం: అనుచరశక్తి + ఆది గుణాం = వెంట నడుస్తున్న శక్తి మొదలైన గుణాలను కలిగినట్టి; అగ్రేసర బోధ విరచిత + ఆలోకాం = ముందు నడుస్తున్న జ్ఞానం చేత కల్పించబడిన ప్రకాశం కలిగినట్టి; స్వాధీన వృషగిరీశాం = తన వశం చేసుకోబడిన వేంకటేశ్వరుని కలిగినట్టి; స్వయం ప్రభూతాం = తానే ప్రభ్విగా ఉన్నట్టి; దయాం = దయా దేవిని; ప్రమాణయామి = ప్రామాణికంగా వర్ణిస్తున్నాను. శరణమని విశ్వసిస్తున్నాను.

తా: శక్తి, బల, ఐశ్వర్యాది గుణాలు తన వెంట నడిచే వైభవం కలిగినట్టి, జ్ఞానమనే గుణం తన ముందు నడుస్తూ, వెలుగుతూ దారిని చూపుతున్నట్టి, వృషాద్రీశుణ్ని తన వశమందు ఉంచుకొన్నట్టి, తనంత తానే ఆవిర్భవించే సర్వేశ్వరి యైన దయా దేవిని శరణ్యమని నిశ్చయిస్తూ వేద ప్రమాణం చేత నిరూపిస్తున్నాను.

వ్యాఖ్య: దయాగుణ ప్రాధాన్యాన్నీ, స్వాధీన పతికగా ఆకారాన్నీ, నిరూపించే శ్లోకమిది.

'తిరువాయ్ మొషి' అనే దివ్య ప్రబంధంలో పది శతకాలయందు ప్రతిపాదింప బడిన ప్రధానమైన అర్థాలను ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళిలో "ఇత్థం సేవ్యం, సుభోగ్యం" అనే సంస్కృత శ్లోకంలో సంగ్రహించి ప్రదర్శించారు శ్రీ వేదాన్త దేశికులు. అలాగా, ఈ దయా శతకంలోనూ ప్రతి దశకంలో విషయాన్ని విభజించారు.

ప్రథమ దశకంలో 'సేవా యోగ్యత్వా'న్ని ప్రదర్శించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వెలసి యున్న తిరుమల, ఆళ్వార్లు, ఆచార్యులు, మహర్షులు, క్రమంగా విష్వక్సేనులు,

శ్రీ భూనీళా పిరాట్టులు, కరుణా వరుణాలయుడైన శ్రీనివాసుడు, అకించన నిధియైన అంజనాద్రీశ్వరుని దయ, సేవించడానికి అర్హులని ప్రతిపాదింప బడిన విషయాన్ని అనుభవించాం కదా! విషయానికి అనుగుణంగా 'మొదటి పది'లో 'అనుష్టుప్' ఛందస్సు ప్రయుక్తమైనది.

శ్రీనివాస భగవానుని లాగా సర్వఫల ప్రదాయిని యైన దయాదేవి 'నిరంజన' యని దయాస్తోత్ర ప్రతిజ్ఞ చేయబడినది. అయితే అనంత కల్యాణ గుణాలు గల శ్రీనివాసుణ్ని కాక, ఆయన యొక్క ఇతర గుణాలను వదలి వేసి, కేవలం దయా గుణాన్ని మాత్రమే స్తుతించడమేమిటి? అని ఆక్షేపించే అవకాశం ఉంది. అందువల్ల, ఆక్షేపాలను పరిహరించే విధంగా, భక్తులకు భగవదనుభవం ఎంత మధురమైనదో, అంతకంటే అధికంగా భగవద్దయా గుణాన్ని - దయా దేవి మహిమను భక్తులు అనుభవించే దశను - భోగ్యతను ఈ రెండవ దశకం ప్రదర్శిస్తున్నది.

విశ్వసృష్టి పాలనాది రూపమైన విశ్వోపకారం దయాదేవి చేతనే నిర్వర్తింప బడుతుంది. దయా పరాధీనుడు భగవానుడు. భగవానుడు సృష్టి చేయక ముందే దయ ప్రభవించింది. స్వయం ప్రభూతయైన దయా ప్రభావం వల్ల 'బహు స్యాం ప్రజాయేయ" అనుకొని భగవానుడు జగత్కారణుడయ్యాడు. గుణాలన్నీ దయతో అన్వయించకుండా ప్రకాశించలేవు. కాబట్టి, "కార్యం కరుణ మార్యేణ" అన్నట్లు ఆర్యులు శరణాగత ధర్మనిష్ఠులు.

"వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్" (రా) చంపదగిన వాడైననూ కాకాసురుణ్ని శ్రీరాముడు దయచేతనే కాపాడినాడు కదా!

ఆర్యయైన దయాదేవి ఈ దశకంలో మాత్రాఛందస్సైన ఆర్యావృత్తం తోనేస్తుతింప బడుతున్నది.

అనుచరశక్త్యాదిగుణాం:- గుణ సార్వభౌమి దయాదేవి. భగవానుడు షాడ్గుణ్య పూర్ణుడు.

"జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజాంస్య శేషతః।
భగవచ్ఛబ్ద వాచ్యాని వినాహేయై ర్గుణాదిభిః" (వి.పు)

దోషాలేవీ లేకుండా జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులు అనే ఆరు గుణాలు పూర్ణంగా కలవాడు భగవానుడు అని అర్థం. సర్వజీవులు ఉజ్జీవించడానికి హేతువైన ఈషాడ్గుణ్యం సకలకల్యాణ గుణాలకు ఉపలక్షణం. సద్గుణ పరంపరకు మూలకందం షాడ్గుణ్యం అన్నమాట.

"తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్" అని (57వ) "జ్ఞాధికరణ" మందు బ్రహ్మసూత్రం ఉన్నది. 2-3-29. "విజ్ఞాన గుణసారత్వా దాత్మనో విజ్ఞానమితివ్యపదేశః. విజ్ఞానమేవాస్య సారభూతో గుణః, యథాప్రాజ్ఞస్య ఆనందః సారభూతోగుణః ఇతి ప్రాజ్ఞః ఆనంద శబ్దేన వ్యపదిశ్యతే" (శ్రీభాష్యం) విజ్ఞానం జీవుని యొక్క ప్రధాన గుణమైనందువల్ల జీవుడు 'విజ్ఞానం' అనే వ్యవహరింప బడుతున్నాడు.

ఉదా:- ప్రాజ్ఞునకు అంటే పరమాత్మకు ఆనందం ప్రధాన గుణమైనందువల్ల పరమాత్మ ఆనందం అని శ్రుతి స్మృతులందు చెప్పబడుతున్నది అని సూత్ర భాష్యార్థం.

గుణాలలో సారభూతమైనది జ్ఞానం. జ్ఞానమనే గుణం యొక్క పరిపాక రూపమూ, జ్ఞానకార్యమూ అయిన మొదటి గుణమే దయ. "జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కాప్యుపజాయతే" దుఃఖంచేత క్షోభిస్తున్న జీవుని విషయమై సర్వ వ్యాపకుడైన భగవానుని అనిర్వాచ్యమైన దయ జనిస్తుంది అన్నట్లు సృష్టికి పూర్వమే దయ అంకురించింది కదా! 'పరదుఃఖ దుఃఖిత్వం దయా" అని 'దయ' యొక్క సామాన్య లక్షణం. "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" ప్రజలకు కష్టాలు కలిగినప్పుడు చాలా దుఃఖపడేవాడు శ్రీరాముడు అని వాల్మీకి వాక్యాకం. దుఃఖాన్ని గుణంగానే పరిగణించి, శ్రీరాముడు దయామయుడన్నాడని అర్థం. కాబట్టి, దయాగుణం ఉత్తమోత్తమమైనది.

దయాదేవి సమ్రాజ్ఞియైనా, రక్షింపదగిన దీనులను అన్వేషించుకొంటూ నడచిపోతుందే కాని పల్లకి నెక్కిపోదు, పరిజనులను పంపదు. మహారాణి కాబట్టి దయను వెంబడించేవి శక్తి బలైశ్వర్య వీర్యాది గుణాలు. గుణవంతులు వెంబడించరు. ఎల్లప్పుడు దయవెనుక శక్తి ఉంటుంది, బలం ఉంటుంది. దయా దేవి ఆజ్ఞను

నిర్వర్తిస్తుంది ఈ అనుచర వర్గం. దయా సమ్రాజ్ఞి యొక్క ప్రాభవ వైభవాలకు సంకేతం ఈ పరిజనం.

అగ్రేసర బోధవిరచితా లోకాం:- జ్ఞానానికి జ్యోతీరూపం సహజమైనది కదా! కాబట్టి, సార్వభౌమియైన దయాదేవికి ముందు నడుస్తుంది. ఊరేగింపులో పగలైనను రాజోపచారం కోసం కరదీపికతో ముందు నడిచేరీతిగా జ్ఞానం తన సహజ దీప్తితో వెలుగుతూ "దేవీ! ఇటు చూడండి, ఇటు ఇలాగా రండి" అనే ఉపచారోక్తులతో దారిని చూపుతూ, దేవి యొక్క నడవడిలోని ఠీవిని జనులు గుర్తించి దారి నుంచి తొలగి పక్కకు నమ్ర శిరస్కులై నిలిచే విధంగా హెచ్చరిస్తూ, దయ కంటె ముందు జ్ఞానం ప్రసరిస్తున్నది.

"ఆ లోకౌ దర్శనోద్యోతౌ" (అమరం). ఆలోక శబ్దానికి చూడడం, చూడబడడం; ప్రకాశమని అర్థం.

జ్ఞానానికి అనుచరత్వం కంటే అగ్రేసరత్వమే ప్రశస్తం కదా! దయా దేవికి ముందు, వెనుక నడిచే పరిజనానికి దయా మహిమ వల్ల రాజసేవికలనే గౌరవమూ ఉంటుంది.

స్వాధీన వృషగిరీశాం:- వృషగిరీశుడైన శ్రీనివాస భగవానుడు సర్వ లోకేశ్వరేశ్వరుడు, స్వతంత్రుడే అయినా దయా పరాధీనుడు.

(స్వాధీనః వృషగిరీశఃయస్యాఃసా = స్వాధీన వృషగిరీశా; తాం) భర్తను తన అధీనమందు ఉంచుకొన్న భార్యను స్వాధీన భర్తృక అంటారు. ఇది భార్యకు భయపడి ఆమెకు విధేయుడై ఉంటాడని అర్థం కాదు. ఐకరస్యంతో దంపతులుంటారని భావం. "మూర్ధానం పత్యురారోహ". మగని నెత్తినెక్కుమని శ్రుతి నవోఢకు చెబుతున్న మాట ఇది. పతిని చులకన చేసి పెత్తనం సాగించుమనే అర్థం కాదు. పతి సమ్మానిత వగుమని శ్రుతి వాక్యార్థం. దయాదేవి అగ్రేసరానుచరుల నడుమ పతిని కేలకీలించుకొని ధీరగామినియై దయచేస్తున్నట్లు వర్ణించడం కవి శిల్ప కల్పనా చతురిమకు నిదర్శనం. స్వాధీన పతిక యనడం వల్ల దయాదేవి పట్ల సౌభాగ్యం, భక్తుల పట్ల సౌలభ్యం వ్యక్తమవుతున్నది.

స్వయం ప్రభూతాం:- శ్రీ వేంకటేశ్వర స్వామి స్వయం వ్యక్తమైనట్లే దయాదేవి స్వయం ప్రభూత. స్వయం సిద్ధ కాబట్టి దయ గుణసార్వభౌమి. వృషగిరీశ్వరుని దయిత అందరికీ ప్రభ్వికదా!

ప్రమాణయామి:- స్వయంగా ప్రభ్వియైన దయను ప్రామాణికంగా నిరూపిస్తానన్నారు దేశికులు. అందుకే దయను కొలుస్తున్నాను, సేవిస్తున్నాను, శరణు వేడుతున్నాను, స్తోత్రం చేస్తున్నాను అన్నారు.

జ్ఞాన గుణం యొక్క విశేష దశయైన దయకు జ్ఞానం పురోగామి. జానాతి, ఇచ్ఛతి, యతతే అని జ్ఞానలక్షణం. దయనీయ స్థితిని తెలుసుకొంటుంది. క్రమంగా పరుల దుఃఖాన్ని నివారించాలని కోరుతుంది దయ. దయ యొక్క కోరిక దాని అనుచరులైన శక్త్యాదులచే పూరింపబడుతుంది, తత్త్వ శాస్త్ర ప్రవేశానికి ప్రమాణ ప్రమేయ పరిజ్ఞాన మవసరం.

వస్తుజాతమంతా ప్రమాణం, ప్రమేయం అని రెండు విధాలు. ప్రమేయం అంటే తెలుసుకోదగిన వస్తువు. ప్రమేయం యొక్క స్వరూప స్వభావాలను తెలిపే సాధనం ప్రమాణం. శాస్త్రజ్ఞులు ప్రమాణాలు ఎనిమిది (8) అని ఏర్పరచారు. (1) ప్రత్యక్షం (2) అనుమానం (3) శబ్దం (4) ఉపమానం (5) అనుపలబ్ధి (6) అర్థాపత్తి (7) సంభవం (8) ఐతిహ్యం. విశిష్టాద్వైత సంప్రదాయస్థులు పై మూడింటిని మాత్రం ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలను-అంగీకరించారు. "ప్రమాణాధీనో ప్రమేయ నిశ్చయః" అంటే, ప్రమాణాన్ని బట్టి ప్రమేయాన్ని నిశ్చయించడం అని అర్థం. ప్రమేయ నిర్ణయం ప్రమాణానికి అధీనమై ఉంటుంది.

ఇంద్రియాలకు గోచరించేది ప్రత్యక్ష జ్ఞానం. (వంట యింటి అనుభవాన్ని బట్టి) ప్రత్యక్ష సిద్ధమైన విషయాన్ని బట్టి, కనిపించని చోట కూడా, కొండ మీద పొగను చూడగానే అక్కడ నిప్పు ఉన్నదని ఊహించడం అనుమాన ప్రమాణమన బడుతుంది. శబ్దం శక్తి చేత, లక్షణ చేత, వ్యంజనచేత అర్థ జ్ఞానాన్ని కల్గిస్తుంది. చూచింది చూచినట్లు చెప్పే వ్యక్తిని ఆప్తుడంటారు. ఆప్త వాక్యమే శబ్ద ప్రమాణం. శబ్దాన్ని విని ఉచ్చరించడం వల్ల శబ్దరాశి 'శ్రుతి' అనబడింది. శ్రుతి అంటే వేదమన్న మాట. కాబట్టి, వేదమే శబ్దప్రమాణమని రూఢియైనది.

"పద పదార్థ సంబంధః శక్తిః" శబ్దానికి దాని అర్థానికి గల సంబంధమే శక్తి. అంటే, శబ్దాలకు అర్థాన్ని బోధించే శక్తి ఉన్నదని భావం. ఈ శక్తికి వృత్తి, వ్యాపారం అని కూడా పేర్లు ఉన్నాయి. కాబట్టి ప్రమాణమంటే శ్రుతి అన్న మాటే కదా! శబ్దానికి అర్థాన్ని బోధించే శక్తి అభిధా, లక్షణా, వ్యంజనా' అని మూడు విధాలు. "దయాం ప్రమాణయామి" అంటే ప్రమేయమైన దయను ప్రమాణంగా చెబుతున్నాను అని స్పష్టమవుతున్నది. దయ, శ్రుతి రెండు స్త్రీ వాచకాలే. కాబట్టి ఈ శ్లోకంలోని నాలుగు విశేషణ పదాలు ప్రమేయమైన దయాస్వరూప స్వభావాలను తెల్పుతున్నవైనా, అవి శబ్ద ప్రమాణాన్ని కూడా వివరిస్తున్నాయి.

1. అనుచర శక్త్యాది గుణాం:- (శ్రుతి) శబ్దం తనను అనుసరించే శక్తి లక్షణాది వృత్తులుకలది.

2. అగ్రేసర బోధ విరచితా లోకామ్:- శబ్దానికి అనేకార్థాలు ఉంటాయి. "అర్థంబుద్ధ్వా శబ్దరచనా". కవి తాను తలచిన అర్థాన్ని బోధించే శబ్దాన్ని ప్రయోగిస్తాడు కదా! కాబట్టి, శబ్దం తనకంటె ముందు అర్థజ్ఞాన కల్పితమైన ప్రకాశం కలది.

3. స్వాధీన వృషగిరీశాం:- "వేదైశ్చ సర్వై రహమేవవేద్యః" అన్నట్లు, వేద - శబ్ద ప్రమాణమే భగవంతుణ్ని తెల్పుతుంది. కాని ప్రత్యక్షాను మానాదులేవీ తెల్పజాలవు.

"శాస్త్ర యోనిత్వాత్" అనేది బ్రహ్మసూత్రం. పరబ్రహ్మను తెలుసుకోవడానికి వేదాన్త శాస్త్రమే కారణం. ప్రమాణం అవడం వల్ల, వృషగిరినాథుడైన భగవానుణ్ని శ్రుతికాంత (తన పతిని) వశపరచుకొన్నది.

4. స్వయం ప్రభూతాం:- వేదం ప్రభు సమ్మితంగా పేరు పొందింది. స్వయం ప్రమాణం. విధి నిషేధాలను నిరంకుశంగా శాసిస్తుంది. అపౌరుషేయం కాబట్టి స్వయం ప్రభూత. శ్రుతి ప్రభ్వియేకదా!

తే॥ వీర్యశక్తి బలాదులౌ విభుని గుణము
లనుగమింపంగ మును ప్రసాదార్హ విషయ

మెరుకతెల్ప వశ్య వృషగిరీశ యగుచు
దనకు దా దోచు దయను మూదల యొనర్తు॥

12. అపి నిఖిల లోక సుచరిత ముష్టింధయ దురిత మూర్ఛనాజుష్టమ్।
సంజీవయతు దయే మా మంజనగిరినాథరంజనీ భవతీ॥

అర్థం: అంజన గిరినాథరంజనీ = అంజనా చలేశ్వరుడైన వేంకటేశ్వర స్వామిని రంజింపజేసే; దయే = ఓదయాదేవీ! భవతీ = నీవు; నిఖిల-జుష్టం, అపి; నిఖిలలోక = సమస్త లోకవాసుల యొక్క; సుచరిత = పుణ్యకర్మలను; ముష్టింధయ = పిడికిలితో పట్టి పీల్చివేసే; దురిత = పాప కర్మల చేత; మూర్ఛనా = మూర్ఛావస్థను; జుష్టమపి = పొందినవాడనైనను; మాం = నన్ను; సంజీవయతు = బాగా జీవింపజేయుదువుగాక!

తా: అంజనాద్రీశ్వరుడైన శ్రీనివాస భగవానుణ్ని నీ గుణచేష్టల చేత ఆనందింప జేసే ఓ దయాదేవీ! నీవు ప్రపంచంలోని సర్వజనుల పుణ్యకర్మలను పిడికిట బట్టి పీల్చివేసే శక్తిగల పాపరాశిచేత ప్రజ్ఞలేనివాడనైనప్పటికీ నన్ను ఉజ్జీవింప జేతువుగాక!

వ్యాఖ్య: సర్వశక్తి సమన్వితయైన శ్రీనివాసుని దయను సంబోధిస్తూ ప్రార్థించడం ఆరంభించారు దేశికులు.

అంజనాచలాధీశుడైన శ్రీ వేంకటేశ్వర స్వామిని దయాదేవి తన గుణచేష్టల చేత సంతోషింప జేస్తుంది. అట్టి సామర్థ్యం గల దయాదేవికి పాపాలను ధ్వంసం చేసే శక్తి పుష్కలంగా ఉంటుంది. లోకంలో శుభకర్మలను చేసిన వ్యక్తి, శుభాలను పొందుతాడు. పాపకర్మలను చేసిన వ్యక్తి పాప ఫలాలను పొందుతాడు. "శుభకృచ్ఛుభమాప్నోతి పాపకృత్పాపమశ్నుతే। విభీషణః సుఖం ప్రాప్తః, త్వం ప్రాప్తో దుఃఖమీ దృశమ్". విభీషణుడు మంచి పనులను చేసినందువల్ల సుఖాన్ని పొందినాడు; నీవు చెడ్డ పనులను చేసి పుత్ర మిత్రులతో పాటు నీవు నశించే దుఃఖాన్ని పొందినావని రావణుని దురితాన్ని తలచుకొంటూ ఏడ్చిన మండోదరి మాటలో ఎంతో నైజమున్నది కదా! అందరుచేసిన సత్కర్మల ఫలార్పణం చేత ఒక్కరికి కలిగే ఆటంకం తొలగవచ్చు.

"కించిత్ సుచరితం యత్నః తేనతుష్టస్త్రిలోకకృత్।
అనుగ్రహ్ణాతు, గృహ్ణాతు వైదర్భ్యాః పాణిమచ్యుతః॥"

ఈ శ్లోకానికి బమ్మెరపోతన కవి పద్యం సులభ గ్రాహ్యం కదా!

"తగు నీచ క్రి విదర్భరాజసుతకున్ తథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి నింత మంచి దగునే దాంపత్య మీ యిద్దటిన్
తగులంగట్టిన బ్రహ్మ నేర్పరి గదా! దర్పాహతారాతియై
మగడౌగావుత జక్రి యీరమణికిన్ మాపుణ్యమూలంబునన్॥"

అని విదర్భ రాష్ట్ర పౌరులు రుక్మిణీ కృష్ణులు దంపతులుగా దీపించాలని తాము చేసిన పుణ్యఫలాన్ని మూల్యంగా సమర్పించారు కదా! కాని, పాపం సామాన్యమైనది కాదు.

"ఏకః పాపానికురుతే ఫలం భుంక్తే మహాజనః" - ఒక్కడు ఘోర పాపం చేస్తే ఆ పాప ఫలాన్ని అతడొక్కడే గాక, అతనికి సంబంధించిన వారందఱు కూడా అనుభవించడం తప్పదని పురాణోక్తి. పాపం పుణ్యబలాన్నీ ధిక్కరిస్తుంది.

సూర్యవంశంలో సత్యవ్రతుడనే మహారాజు గుండెలో దిగిన మూడు మేకుల వలె మూడు దోషాలు కలవాడు.

1. పితుశ్చాపరితోషేణ:- పెండ్లి జరుగుతుండగా ఒక, విప్రుని కన్యను అపహరించిన ఈ రాజు తన తండ్రి కోప శాపాలకు గురి అయ్యాడు.

2. గురోర్దోగ్ధ్రీం వధేనచ:- గురువుగారి ధేనువును చంపినాడు.

3. అప్రోక్షణ ప్రయోగాచ్చ:- ప్రోక్షింపని మాంసాన్ని భక్షించాడు. "త్రిశంకు స్తేన సంస్మృతః". ఈ మూడు పాపకార్యాలను చేసిన సత్యవ్రతుడు 'త్రిశంకుడు' అని పేరు పొందినాడు. ఈ త్రిశంకుడు సశరీర స్వర్గప్రాప్తిని కోరి విశ్వామిత్ర మహర్షిని ఆశ్రయించాడు. ఆ మహర్షి తన తపోబలం చేత త్రిశంకువును స్వర్గానికి పంపించాడు. శరీరంతోనే స్వర్గద్వారం వరకు చేరిన త్రిశంకుణ్ని అతని శాప పాపాలు, విశ్వామిత్రుని తపః ఫలాన్నీ తిరస్కరించి, స్వర్గంలోకి ప్రవేశింపనీయక తలక్రిందుగా పడజేశాయి; అనే పౌరాణికగాథ ప్రసిద్ధమే కదా!

"యద్బ్రహ్మకల్ప నియుతా నుభవేఽ ప్యనాశ్యం
తత్కిల్బిషం సృజతి జంతురిహక్షణార్ధే॥" (శ్రీ వై. స్తవం 62)

లక్ష బ్రహ్మకల్పాలకాలం దాకా అనుభవించినప్పటికీ నశించనంత పాపాన్ని ఒక వ్యక్తి అరక్షణంలో చేస్తాడని శ్రీవత్సాంకమిశ్రులు అన్నారు. (1/2 క్షణం=2 నిమిషాలు) కాబట్టి విశ్వామిత్రుని లాంటి ఒక వ్యక్తి యొక్క సుచరితం అన లేదు, నిఖిల లోకసుచరితమన్నారు దేశికులు. "లోకస్తు భువనే జనే" (అమరం) ఈ లోక మాలోక మనక సమస్త లోకాలలో నివసించే జనులు చేసిన పుణ్యకర్మల సాముదాయిక ఫలం కూడా తనయందున్న పాపాన్ని తొలగించ జాలదన్నారు దేశికులు. "ధర్మేణ పాపమపనుదతి" పుణ్యకర్మ చేత పాపం నశిస్తుందని శ్రుతి పలుకుతుంది. అయినా, తనయందున్న పాపం ఎంత బలసి ఉన్నదో స్పష్టపరచారు.

"జ్ఞానక్రియా భజనసీమ విదూరవృత్తేః
వైదేశికస్య తదవాప్తికృతాం గుణానామ్" (పా.స. 983)

జ్ఞానకర్మ భక్తియోగాలను అనుష్ఠించిన వాడనుకాను. ఆ మూడు యోగాలను పొందడానికి కారణాలైన శమదమాదులనే ఆత్మ గుణాలూ నా యందు లేవు అని విన్నవించారు. కాబట్టి బలసియున్న తన పాపం విశ్వజనుల పుణ్యరాశిని, మామిడి పండును వలె, పిడికిట బట్టుకొని ప్రిదిలిపోకుండా పీల్చివేసింది.

సుచరిత ముష్టింధయదురితమూర్ఛనాజుష్టమ్:- పుణ్యరాశిని పానంచేసి ఇంకెంతో మదమెక్కిన పాపం వ్యాధిరూపంగా పీడిస్తుంది కదా! ఆ పాపం చేత మూర్ఛితుడయ్యాడట దేశికులు.

మూర్ఛనాజుష్టమ్:- మూర్ఛా రోగం చేత సేవింపబడిన వాడని అర్థం. ఇంద్రియాలు పనిచేయనందువల్ల స్మృతి లేక పోవడం, సొమ్మసిల్లడం (కోమా) మూర్ఛన అనబడుతుంది. మూర్ఛనావస్థ తర్వాత కలిగేది మరణమే. దురిత భరితుడు భగవంతుని స్మరించలేడు. భగవచ్చింతన లేని వ్యక్తి మృతప్రాయుడే.

మూర్ఛనాజుష్టమపి సంజీవయతు దయే! మామ్:- మూర్ఛను పొందిన వాడనైనప్పటికీ ఓ దయాదేవీ! నీవు నన్ను బాగా బ్రతికించుమని వేడుకొన్నారు

దేశికులు. భగవత్కృప వల్లనే భగవత్సాయుజ్యం లభిస్తుంది. రోగమే లేకపోతే ఔషధంతో పనియేమి? పాపమే లేకుంటే భగవద్దయకు ప్రయోజనమేమి? మూర్ఛను పోగొట్టే ఓషధి సంజీవని, "తస్మాత్ సర్వౌషధముచ్యతే" (శ్రుతి) అనదగినది. అది 'గిరినాథ' శబ్దం వల్ల గొప్ప పర్వతం మీద ఉన్నదని తెలుస్తున్నది. పాపాలను పటాపంచలు చేసే దయాదేవి అంజనగిరినాథుణ్ని రంజింపజేస్తున్నది. భగవద్దయయే సంజీవని అన్నమాట. అంజనాదేవి కడుపు పంట ఆంజనేయుడు కదా!

మాయాయుద్ధ విశారదుడైన ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం యొక్క విజృంభణకు వానరసైన్యమే కాక రామలక్ష్మణులు కూడా గురికాక తప్పలేదు. వానరులందరు మూర్ఛపోయినారు. రామలక్ష్మణులకు స్మారకం తప్పింది. విభీషణుడు, హనుమంతుడు ఆ రాత్రి జాంబవంతుని కోసం కాగడాతో వెదకి అతణ్ని చూచారు. భల్లూకరాజా! నీవు బ్రతికి ఉన్నావా? అని విభీషణుడడిగాడు. కండ్ల నిండా కరుకు ములుకులు నిండి బాధించడం వల్ల కండ్లు తెరువ జాలని జాంబవంతుడు కంఠస్వరాన్ని బట్టి విభీషణుడని గుర్తుపట్టాడు. జాంబవంతుడు "హనుమాన్వానరః శ్రేష్ఠః ప్రాణాన్ ధారయతేక్వచిత్" కపివరుడైన హనుమంతుడు జీవించి ఉన్నాడా? అని ప్రశ్నిస్తే రామలక్ష్మణులను ప్రశ్నించక హనుమంతు నేల ప్రశ్నించావని విభీషణుడడిగాడు.

"అస్మిన్ జీవతి వీరేతు హతమప్య హతంబలమ్।
హనుమత్యుజితప్రాణే జీవన్తోఽ పి మృతావయమ్॥" (రా.యు. 74స)

హనుమంతుడు బ్రతికి ఉంటే మనం బ్రతికినట్లే. ఆయన జీవించి ఉండకపోతే మనం బ్రతికి ఉన్నా చచ్చినవాళ్ళమే సుమా! అని జాంబవంతుడు ఆంజనేయుని ప్రభావాన్ని వర్ణించాడు. వెంటనే ఆంజనేయుడు జాంబవంతునికి నమస్కరించి విషయాన్ని వివరించాడు.

జాంబవంతుడు చెప్పిన ప్రకారంగా ఆంజనేయుడు వేగంగా హిమవత్పర్వతం మీదికి పోయి వృషభగిరిని తిలకించాడు. అక్కడ కాంచన, కైలాసమనే రెండు పర్వత శిఖరాల మధ్యనున్న ఓషధి పర్వత కాంతులు హనుమంతుణ్ని ముగ్ధుణ్ని చేశాయి. హనుమంతుణ్ని చూడగానే అద్భుతశక్తులు గల ఓషధులు వెదకినా కనబడనందు

వల్ల హనుమంతుడు 'ఓషధి పర్వతమా! నీవు రాముని పైన దయను చూపడం లేదు అంటూ పెద్ద కేక పెట్టి ఆ పర్వతాన్ని పెకలించి చేతపట్టుకొని మనోవేగంతో లంకకు చేరాడు. వైద్యశిఖామణి యైన సుషేణుడు ఓషధుల వాసన తగులగానే లేచాడు. రామలక్ష్మణులకు ఆ మహౌషధి గంధాన్ని ఆఘ్రాణింప చేయగా వారు మూర్ఛనుండి లేచారు. వానరులుకూడా క్రమంగా వాసన తగిలి లేచి గర్జించి హనుమంతుణ్ని ప్రశంసించారు. ఇదంతా రాత్రి పూట జరిగింది. పగలు కాదు. యుద్ధంలో చచ్చిన రాక్షసులను రావణుడు వెంటవెంట సముద్రంలోకి తోయించి నందువల్ల బ్రతికే అవకాశం వారికి కలుగలేదు.

ఆ ఓషధి చతుష్టయం ఒక్కొక్కటి ఒక్కొక్క శక్తి కలది (1) సంజీవ కరణి చచ్చిన వారిని బ్రతికించింది. (2) విశల్యకరణి – వ్రణాలను మాన్పింది (3) సౌవర్ణకరణి – గాయాల మచ్చలను మాన్పి చర్మాన్ని కాంతిమంతంగా చేసింది. (4) సంధాన కరణి – తెగిన అవయవాలను అతికించింది.

మళ్ళీ ఆంజనేయుడు ఓషధి పర్వతాన్ని యథాస్థానమందు ఉంచి తిరిగి వచ్చాడు. ఆంజనేయుడు సంజీవి పర్వతాన్ని తెచ్చి తన నాథుణ్నీ, వానరసైన్యాన్నీ సంజీవింప జేశాడు. ఓ దయాదేవీ! పూజనీయవైన నీవు అంజనగిరినాథ రంజనివి కదా! దయనీయ జనరంజనివవడం వల్లనే నీకా పేరు అన్వర్థమవుతుంది. మహా పాపినైన నన్ను సంజీవితుని జేయుమని ప్రార్థించారు. జ్ఞాన వైరాగ్య భూషణులైన శ్రీ వేదాన్త దేశికులు తాపత్రయ పీడితులైన సంసారులు భగవత్కృపకు పాత్రులు కావడం కోసమే తాను 'దురిత మూర్ఛనాజుష్టుడని, దయాదేవిని ప్రార్థిస్తున్నారు. సమాజ శ్రేయస్సును కోరేవారు కదా! పాపిష్ఠులకు కూడా శ్రీనివాసుని దయ వల్లనే భక్తిరూపమైన శేముషి కలిగి, తత్ఫలితంగా భగవత్సాయుజ్యం లభిస్తుందనే ఉపదేశం ప్రతీయమానమవుతున్నది.

ఈ శ్లోకంలో జుష్టమనే చోట 'దుష్ట'మనీ, సంజీవయతు అన్న చోట 'సంజీవయతి' అనే పాఠాంతరాలున్నాయి. 'త్వం' అనే అర్థం కలిగిన 'భవతీ' శబ్దం గౌరవవాచకం. 'శేషేప్రథమః' అన్నట్లు భవచ్ఛబ్దానికి ప్రథమ పురుషయందే క్రియావాచకముంటుంది.

ఆ॥ నిఖిలలోక సుకృత నిచయ ముష్టింధయ
దుష్కృతముల మూర్ఛితుడగు నన్ను
అంజనాద్రి విభుడు రంజిలగా దయ!
నీవ చేయరాదె జీవితునిగ॥

13. భగవతి దయే! భవత్యా వృషగిరి నాథే సమాప్లుతే తుంగే।
అప్రతిఘ మజ్జనానాం హస్తాలంబో మదాగసాం మృగ్యః॥

అర్థం: హే భగవతి, దయే = పూజ్యురాలవైన ఓ దయాదేవీ! తుంగే = ఉన్నతుడైన; వృషగిరి నాథే = శ్రేష్ఠమైన వృషాఖ్య పర్వతమందున్న ప్రభువు - శ్రీనివాసుడు; భవత్యా = నీచేత; సమాప్లుతే (సతి) = మునిగిపోతుండగా; అప్రతిఘ మజ్జనానాం = అడ్డులేకుండా మునుగుతున్న; మత్+ఆగసాం = నా పాపాలకు; హస్త+ఆలంబః = చేయూత; మృగ్యః = వెదుక దగినది - దుర్లభం.

తా: ఓ భగవతీ, దయాదేవీ! నీ చేత మహోన్నతుడైన వృషగిరి నాథుడు నిమగ్నుడవుతుంటే, ఎలాంటి ఆటంకం లేకుండా మునుగుతున్న నా యొక్క పాపాలకు కరాలంబం - సహాయం లభించదు.

వ్యాఖ్య: సర్వ పాప ప్రణాశనం భగవద్దయా ధీనమని వర్ణితం.

పరబ్రహ్మో పాసన చేసే ధ్యాస లేని మహాపాపి కూడా భగవత్కృపచే ఉజ్జీవించాలని గత శ్లోకమందు ప్రార్థింపబడింది. ఇందు, శ్రీ వేంకటేశ్వర స్వామి నాశ్రయించిన వ్యక్తి యొక్క పాపాలు దయా(దేవి) ప్రవాహంలో మునిగిపోయి ఫలమీయ జాలవనీ, "అహం త్వాసర్వ పాపేభ్యో మోక్షయిష్యామి" అన్నట్లు, పాపవిమోచనం భగవానుని దయచేతనే సాధ్యమని దయాదేవి సుశ్లోకింపబడింది.

భగవతి దయే:- జ్ఞాన శక్త్యాది షడ్గుణాలు కల శ్రియః పతికే ముఖ్యంగా భగవచ్ఛబ్దం చెప్పబడుతుంది. దయా గుణం చేతనే ఇతర గుణాలన్నీ కల్యాణ గుణాలుగా భాసిస్తాయి. దయాదేవి కూడా షడ్గుణాలు కలది కాబట్టి 'భగవతి' అనబడుతుంది. "భగవతీం శ్రియందేవీం" శ్రీనివాసుని కరుణామయ రూపిణియైన

లక్ష్మీదేవిని 'భగవతి' అన్నారు భగవద్రామానుజులు. "అన్యత్ర తద్గుణ లేశయో గాదౌపచారికో భగవచ్ఛబ్దవత్" (శ్రీభాష్యం) ఆ కల్యాణ గుణాల అంశ లేశ మాత్రమైనా ఉండడం వల్ల మహా పురుషులకూ 'భగవాన్ బాదరాయణః' అన్నట్లు భగవచ్ఛబ్దం వ్యవహరింప బడుతున్నది.

అసాధారణ ధర్మాలైన పరబ్రహ్మ లక్షణాలు దయామూలకాలే కాబట్టి భగవానునికి భగవత్త్వం నిరూపింపబడుతున్నది. అందువల్ల, దయాదేవి 'భగవతి' అని సంబోధింపబడింది.

భవత్యా వృషగిరి నాథే సమాప్లుతే తుంగే:- పూజనీయయైన దయాదేవి చేత ఉన్నతుడైన వృషగిరినాథుడు నిమగ్నుడవుతున్నాడని అర్థం. 'భవత్యా' అనే పదం గౌరవ వాచకం. ఈ మాటలో దయారసం గొప్ప ప్రవాహంగా ప్రసరిస్తున్నదని సూచితం. 'వృషగిరినాథే' అంటే ఆ పేరుగల పర్వతం చాల పెద్దది అని అర్థం. మహా ప్రవాహం పెద్ద పెద్ద గుట్టలను కూడా గ్రక్కున పెకలించి దొరలించుకొని పోతుంది. ప్రవాహంలో కొట్టుకపోకుండా ఎత్తైన ప్రదేశాల మీద నివసించడం జీవుల స్వభావం కదా!

తుంగే:- వృషాఖ్యగిరియే చాల పెద్దది. అంటే దానిపై వెలసియున్న వాడు అంతకంటె గొప్పవాడు. ఆయన స్వరూప రూపగుణ విభవాదులచే మహోన్నతుడు. స్వయం ప్రభూతయైనదయ మితిమీరి ప్రవహిస్తుంటే, వృషగిరియూ, దాన్ని అధిష్ఠించి యున్న శ్రీనివాసుడూ ఆ ప్రవాహంలో మునిగిపోవడం నైసర్గికం కదా! ఉన్నత స్థితిలో ఉన్న వస్తువులే ప్రవాహంలో మునిగి పోతుంటే నిమ్నస్థితిలో లోయలలో ఉండే వస్తువులు మునుగుతాయని చెప్పనక్కర్లేదు కదా!

సమాప్లుతే:- 'సం' ఉపసర్గ వల్ల మహోన్నతుడైననూ శ్రీనివాసుడు దయాప్రవాహంలో నిండుగా మునిగి పోయాడు అని స్ఫురిస్తుంది.

కవితార్కిక కేసరీ త్యాది బిరుదులు పొందిన దేశికులు గహనమైన శాస్త్ర విషయాలను లౌకికానుభవాలతో పోల్చి బోధిస్తున్నారు.

"దయాసింధో బంధో నిరవధిక వాత్సల్యజలధే" అని సంబోధిస్తూ ప్రార్థించే వాక్యంలో దయను సింధువు (నది లేదా సముద్రం)గా నిరూపించడం చేత ఆ సింధువులో "అతితుంగా నామపి తత్రనిమజ్జనం సూచ్యతే" అత్యున్నత పదార్థాలు కూడా అవశ్యంగా మునిగిపోవడం సూచింపబడుతున్నదని ఆచార్యులు వ్యాఖ్యానించారు.

"పరమతుంగ మాత్మానమ్" - లోకంలో ఉండే ఉన్నత వస్తువులకంటె మహోన్నతుడు పరమాత్ముడని భట్టపాదులు వర్ణించారు.

దయాప్రవాహంలో గిరిశిఖర నివాసియైన శ్రీనివాసుడు మునిగి విలీన స్వాతంత్ర్యుడవుతాడు. నిరంకుశ స్వతంత్రుడు కాబట్టి చేయరాని పనులు చేసిన పాపిష్ఠులను చూచినప్పుడు భగవానుని గుండె మండుతుంది. కోపంతో వారికి దండన విధించాలనుకొంటాడు. ఆ సందర్భంలో పెల్లుబికిన దయాప్రవాహమందు భగవానుడు మునిగిపోవడం వల్ల గుండె మంట చల్లారిపోతుంది. దయాదేవికి అధీనుడవుతాడని భావం.

అప్రతిఘ మజ్జనానాం మదాగసాం:- నా యందే జనించిన నా పాపాలకు మునుగడం దుర్నివారం. మునుగుతున్న పాపాలకు ఏదైనా మధ్యలో అడ్డుపడితే మళ్ళీ పైకి లేచి రోషంతో పీడించే అవకాశముంది.

'ప్రతిఘ' శబ్దానికి రోషం, కోపం అనే అర్థమూ ఉంది. "కోపక్రోధామర్ష రోష ప్రతిఘా రుట్ క్రుధౌస్త్రియామ్" (అమరం) అప్రతిఘంగా - అడ్డు లేకుండా అధోముఖంగా వేగంతో అడుగుకు చేరేదాకా, వాసనకైనా కోపం తలెత్తకుండా, పాపాలు మునుగుతున్నాయి.

హస్తాలంబో మదాగసాం మృగ్యః:- నా పాపాలకు చేయూత దొరకదు. ఎవడైనా సహాయపడతాడని మునుగుతున్న వాళ్ళు వెదుకడం స్వాభావికం. మునుగిపోతున్న ఈ పాపాలకు సహాయం కోసం వెదుకుతుండే శ్రమయే మిగులు తున్నది. మునుగుతున్న పాపాలు ఒండొంటిని కాపాడ జాలవు. తీరాన ఉన్న వాడూ చేయూత నివ్వలేదు.

"కుదృష్టికుహనా ముఖే నిపతతః పరబ్రహ్మణః

కరగ్ర హణవిచక్షణో జయతి లక్ష్మణోఽయం మునిః" (యతిరాజ సప్తతి 38) కుదృష్టుల కుహనాముఖబిలమందు పడుతున్న పరబ్రహ్మ మునిగిపోకుండా చేతిని పట్టుకొని రక్షించిన సమర్థుడు శ్రీరామానుజ ముని అన్నారు దేశికులు.

"హస్తాలంబో భవత్యేకో భక్తిక్రీతో జనార్దనః" భక్తి అనే వెల చేత కొనబడిన భగవానుడొక్కడే సంసార సాగర మందు మునుగుతున్న వ్యక్తిని చేయూతనిచ్చి కాపాడే వాడని ప్రసిద్ధి.

ఆ భగవానుడే దయాప్రవాహమందు మునిగిపోతున్నాడంటే "కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్" (శ్రుతి) ఇంక వేరే వాడెవడు చేయూతనిచ్చి కాపాడుతాడు? ఆశ్రయభూతుడే మునిగిపోతున్నప్పుడు అతని నాశ్రయించిన వ్యక్తి యొక్క పాపాలూ మునిగి పోవడంలో ఆశ్చర్యమేముంది? తనను ఆశ్రయించిన వ్యక్తిని క్షమిస్తాడని తాత్పర్యం.

"యత్త్వత్ప్రియం తదిహపుణ్య మపుణ్యమన్యత్" (అతిమానుష స్తవం-53) సర్వేశ్వరుని యొక్క ప్రీతి కోపాలే పుణ్య పాపాలని మన పూర్వాచార్యులన్నారు. శాస్త్ర విహితమైన సత్కార్యాచరణ చేత భగవానునికి కలుగుతున్న ప్రీతియే పుణ్యమన బడుతుంది. నిషిద్ధ కార్యాలను చేస్తుంటే భగవానునికి కోపం కలిగి దండించడానికి పూనుకొంటాడు. భగవంతుని ఆగ్రహమే ఈ నిషిద్ధ కార్యాన్ని ఆచరించిన వ్యక్తి యొక్క పాపమనబడుతుంది. భగవంతునికి కోపాన్ని కలుగజేసే నిషిద్ధ కార్యాలను కూడా పాపాలంటారు. పాపాలకు పరిహారం - ప్రాయశ్చిత్తం శాస్త్ర విహితమే కదా!

"ఓమ్ నమో వేంకటేశాయ" అపరాధ చక్రవర్తినైన నన్ను క్షమించవయ్యా! స్వామి! అని శరణాగతి చేయడమే చక్కని ప్రాయశ్చిత్తం. అలాగా చేసిన క్షణంలోనే పెల్లుబికిన దయా ప్రవాహంలో భగవానుడు మునిగిపోతాడు. కోపం అణగి పోతుంది. దయా దేవికి వశుడవుతాడన్న మాట. స్వామిని ఆశ్రయించిన వ్యక్తి యొక్క పాపాలూ అప్రతిఘంగా మునిగిపోతాయి. అంటే, దుష్ఫలితాలనిచ్చే

పాపాలు నశిస్తాయన్న వేదాంత శాస్త్రమందలి రహస్యార్థం సదస్యం చేయబడింది. సకల పాపాలను నశింప జేయడం దయా కార్యమని సుశ్లోకితం.

ఆ॥ ఉరగశైలనాథుడుత్తుంగుడయ్యు త్వ
న్మహిత సంప్రవాహ మగ్నుడయ్యె।
అడ్డులేక దోగు నస్మదాగములకు
కరుణ! చేయొసంగ నొరులు గలరె?

14. కృపణ జన కల్పలతికాం కృతాపరాధస్య నిష్క్రియా మాద్యామ్।
వృషగిరి నాథ దయే త్వాం విదంతి సంసార తారిణీం విబుధాః॥

అర్థం:- హే వృషగిరి నాథ దయే = శ్రీ వేంకటేశ్వర దయా దేవీ! త్వాం = నిన్ను; కృపణ జనకల్పలతికాం = దీన జనుల కోరికల నీడేర్చు కల్పలతికగానూ; కృత+అపరాధస్య = చేయబడిన దోషానికి; ఆద్యాం = ముఖ్యమైన; నిష్క్రియాం = ప్రాయశ్చిత్తంగానూ; సంసారతారిణీం = సంసారం నుంచి తరింప జేయు దానివిగానూ; విబుధాః = పండితులు; విదంతి = తెలిసికొంటున్నారు.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! దైన్య జీవితాన్ని గడిపే వ్యక్తుల వాంఛలను దీర్చే కల్పవల్లివనీ, చేసిన పాపాల శక్తిని నశింప జేసే క్రియవనీ; సంసార సాగరాన్ని దాటించే దానివని నిన్ను శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

వ్యాఖ్య: అనిష్ట నివృత్తినీ, ఇష్టప్రాప్తినీ కలిగించి, పునర్జన్మ లేకుండా చేసేది దయాదేవి అని స్తుతించే శ్లోకమిది.

దయాధీనుడైన శ్రీనివాసుడు పాపాలను క్షమిస్తాడని గత శ్లోకం వివరించింది. ఈ శ్లోకమందు దయాదేవి ఐహికాముష్మిక ఫలదాయిని అని వర్ణింపబడుతున్నది.

కృపణ జన కల్పలతికాం:- కుటుంబాన్ని పీడించి యైనా సుఖంగా బ్రతుక నేర్చిన వ్యక్తిని కృపణుడంటారు. కృపణుడు తాను తినడు, ఒకనికి పెట్టడు. ధనమూ, సుఖమూ కావాలనుకొనే వ్యక్తి కృపణుడు. "కదర్యే కృపణ క్షుద్రకింపచాన మితం పచాః" (అమరం) కృపణులకు మంచి చెడులను ఆలోచించే వివేకం గానీ,

ఉపాయంగానీ ఉండదు. ఐహికాముష్మిక భోగాలన్నీ కావాలని ఆశ పడుతుంటారు. కోరిన ఆశలు ఫలించక దురవస్థను పొందుతుంటారు. ఇట్టి కృపణుల పట్ల శ్రీ వేంకటేశ్వరుని దయ అంకురిస్తుంది. 'జన' శబ్దం సాధారణంగా ప్రాణులందరినీ తెలిపే వాచకం. సాధారణ జనంతో కృపణ జనులు కూడా కలిసి శ్రీ వేంకటేశ్వర స్వామిని సేవించినప్పుడు ఆ స్వామి హృదయం కృపణజనుల విషయమై జలధరిస్తుంది. కల్పవృక్షం స్వర్గంలో నందనవనంలో ఉంటుంది. ఆ వృక్షచ్ఛాయలో చేరిన జనం కోరుకున్నవన్నీ క్షణంలో సాక్షాత్కరింప జేస్తుంది. 'లత' అంటే తీగ. భూమి మీద గాలికి దొర్లుతు చెడిపోకుండా ఒక తరువును ఆశ్రయించి, ఏపుగా ఎదిగి ప్రకృతి రంజకంగా ఉండేది లత. దయాదేవి కల్పలతిక కదా! అత్యల్పంగా ఉంటుంది. లత కంటె మిక్కిలి మృదువుగానూ, కోమలంగానూ ఉండే కల్పలతిక, కల్పతరువైన శ్రీ వేంకటేశ్వరుని ఆశ్రయించి కృపణ జనుల కోరికలను నెరవేరుస్తుంది.

వేదాంత దేశికులు స్తోత్రరత్నంలోని 'అర్థికల్పకం' అనే 'విశేషణ' పదాన్ని 'స్తోత్ర భాష్యం'లో మూడు వ్యుత్పత్తులతో వివరించారు.

(1) "అర్థినాం కల్పద్రుమవత్ సర్వాపేక్షిత ప్రదమితి యావత్" యాచకులకు కల్పవృక్షం లాగా కోరికలన్నిటి నీడేర్చేవాడు – అర్థికల్పకం.

(2) "అర్థినః కల్పద్రుమభూతాః యస్యసః – అర్థికల్పకః" – ఎవరికి యాచకులు కల్పతరువుల లాంటి వారో అతడు అర్థికల్పకం. జనులు కోరినవన్నిటిని ఇవ్వాలనే ఆశ కల్గియున్న భగవానుని ఆశను ఫలింపజేసే వారు యాచకులు కాబట్టి యాచకులే భగవానుని దృష్టిలో కల్పతరువులాంటి వారన్న మాట. ఈ భావాన్నే కదా భగవద్గీతలో "ఉదారాః సర్వ ఏవైతే" అని భగవానుడు ప్రకటించాడు.

(3) "స్వయమర్థినః కల్పయతీ త్యర్థః, క్షేత్రజ్ఞానాం తత్తత్ పురుషార్థాధి కారదశాఽపిహి పరమ పురుష కల్పితా" యాచకులను తనంతతానే కల్పిస్తాడు కాబట్టి భగవానుడు అర్థకల్పకం; జీవులు ఆయా పురుషార్థాలను అనుభవించే స్థితిని కల్పిస్తాడు కదా!

ఈ మూడింటిలో రెండవ వ్యుత్పత్తి రీతిగా, భగవద్దయ చేత కృపణజనులు కల్పలతికలుగా చేయబడడమే ఔదార్యం. వరాలను కోరే వ్యక్తులే ఉదారులన బడినారు.

(4) "అర్థినం కల్పవృక్షం కరోతీతి అర్థికల్పకః" అనే వ్యుత్పత్తిని కూడా అభిజ్ఞులు తెలిపారు. తనను యాచించే వ్యక్తినే కల్పవృక్షంగా చేసే భగవానుడు 'అర్థికల్పకం' అనబడుతాడు. దీనికి తగినట్లు దేశికులు మరొక్క చోట అన్నారు.

"అపునః ప్రార్థనీయస్య ప్రార్థితాధిక దాయినః।

అర్థినః ప్రథమే. తస్య చరమాన్ పర్యపూరయన్॥ (యాదవాభ్యుదయం 1,23)

ఒకసారి కోరగానే మళ్ళీ కోరకుండా, కోరిన దానికంటె ఎక్కువగా ఇచ్చే స్వభావం గల యదువుకు మొదట వచ్చిన యాచకులు తరువాత వచ్చిన యాచకులనుగా పరిపూర్ణులను చేశారు. అభీష్టప్రదుడైన దాత వద్దకు యాచకులు రావడం అదే మొదలు, చివర అని అర్థం. వదాన్యుడని కీర్తిని కలిగించే సామర్థ్యం కోరిన ఫలాన్ని పొందినవారికే ఉంటుంది కాబట్టి యాచకులే ఉదారులని అర్థం. ఇలా ఔదార్యం వర్ణితం.

వృషగిరినాథుడైన శ్రీవేంకటేశ్వర స్వామియే కల్పతరువు. ఆ కల్పతరువు నాశ్రయించిన లతికయే దయాదేవి.

కృతాపరాధస్య నిష్క్రియా మాద్యామ్:- అపరాధం చేసిన వ్యక్తికి ముఖ్యమైన ప్రాయశ్చిత్తమైనది దయ. ఆరాధన కంటె భిన్నమైన ప్రక్రియయే అపరాధం. ఆరాధనను సత్కర్మ అంటారు. అపరాధాన్ని దుష్కర్మ అంటారు.

అపరాధం చేసి శిక్షను తప్పించుకొనే వారికి పాప పరిహారం కానే కాదు. "కృతఘ్నే నాస్తి నిష్కృతిః". చేయబడిన మేలును మరచిన వ్యక్తికి ప్రాయశ్చిత్తం లేదు. "యదిక్వచన నిష్కృతిర్భవతి సాఽపిదోషావిలా" ఒకవేళ నిష్కృతి ఉన్నా అది కూడా దోష జుష్టమవుతుందంటారు ఆచార్యులు.

శాస్త్ర విహిత క్రియను ధర్మమంటారు. బోధించే ధర్మాన్ని ఆచరిస్తే కర్మ అవుతుంది. కర్మల నాచరిస్తున్నప్పుడు మంత్ర, స్వర, వర్ణ, కర్మలలో ఎక్కడ లోపం సంభవించినా మళ్ళీ దోషం చుట్టుకొంటుంది.

"ఫలం కతక వృక్షస్య యద్యంబు ప్రసాదకం ।
న నామగ్రహణాదేవ తస్యవారి ప్రసీదతి ॥" (ప్రాయశ్చిత్త కాండ)

కతకమంటే చిల్లగింజ. దాన్ని నూరి పొడిచేసి నీళ్ళల్లో వేస్తే నీళ్ళు స్వచ్ఛమవుతాయి. కాని 'కతక' మనే పేరు చెప్పినంత మాత్రాన నీళ్ళు తేట పడవు కదా! కాబట్టి మంత్ర పఠనంతో పాటు విధ్యుక్త కర్మను ఆచరించాలి. లేకుంటే పాపం అంటుకొంటుంది. ఇలాంటి పాపాలను తొలగించుకోవడానికి ప్రాయశ్చిత్త కర్మల నాచరిస్తారు సజ్జనులు. ప్రాయః" అంటే తపస్సు. చిత్తమంటే నిగ్రహం. ఈ రెండు శబ్దాల కలయికయే ప్రాయశ్చిత్తమని నిర్వచింపబడింది.

"ప్రాయోనామ తపః ప్రోక్తం చిత్తం సంయమ ఉచ్యతే ।
తపస్సంయమ సంయుక్తం ప్రాయశ్చిత్తం విదుర్బుధాః ॥" (ప్రా. కాండ)

తపస్సంటే జ్ఞానం గల వ్యక్తి ఫలాపేక్ష లేకుండా ఏకాగ్రతతో ఆచరించే కర్మ. "తపసాకిల్బిషం హంతి" తపస్సు చేత పాపం నశిస్తుంది– అనే 'మను' వాక్యం, తపశ్శబ్దం కర్మవాచక మనడానికి ప్రమాణం కదా!

జ్ఞాతాజ్ఞాత కర్మ దోషాలకు ప్రాయశ్చిత్తాలు శాస్త్ర విహితాలు. తెలియక చేసిన పాపాల కంటే, తెలిసి చేసిన పాపాలకు దుష్ఫలితాలనిచ్చే సామర్థ్యం మెండుగా ఉంటుంది.

'నిష్క్రియ' అంటే క్రియకానిది. 'దయ' జ్ఞాన సంబంధం కలది. కాని 'క్రియ' కాదు. చేయబడిన అపరాధ కర్మకు నిష్కర్మత్వాన్ని ఆపాదించడం – ఫలమిచ్చే శక్తిని లేకుండా చేయడమే – 'నిష్క్రియ' అనబడుతుంది.

'కర్మ' అచేతన మైనందువల్ల ఫలమిచ్చే శక్తి దానికి ఉండదుకదా! అంటే, అది నిజమే. "పరమ పురుషారాధన, తద్విపర్యయ రూపే కర్మణీ పుణ్యపాపే; తదనుగ్రహ నిగ్రహాయత్తే చతత్ఫలే" (శ్రీభాష్యం).

పుణ్యకర్మ భగవంతునికి ప్రీతికరమైనందువల్ల ఆయన అనుగ్రహిస్తాడు. పాప కర్మ భగవంతుని కోపానికి కారణమవడం వల్ల ఆయన దండన విధిస్తాడు.

"కృతాపరాధస్యహితే నాన్యత్, పశ్యామ్యహంక్షమమ్ ।
అంతరేణాంజలిం బధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్ ॥" (రా. కి.)

సీతను వెదకడమనే రామకార్యాన్ని మరచి, కృతాపరాధుడవైన నీవు చేతులు జోడించి, కోపంతో ఉన్న లక్ష్మణస్వామిని ప్రసన్నుణిగా చేసుకోవడం కంటే మార్గాంతరం లేదు - అని సుగ్రీవునితో ప్రతిభావంతుడైన హనుమంతుడు పలికిన మిత హిత సత్యవాక్యాన్ని స్మరించడం ఇక్కడ సముచితం కదా।

"కృతేపాపేఽ ను తాపోవైయస్య పుంసః ప్రజాయతే ।
ప్రాయశ్చిత్తం తు తస్యైకం హరి సంస్మరణం పరం ॥"

పాపకర్మను చేసినందువల్ల పశ్చాత్తాపం కలిగిన వ్యక్తికి హరినామాన్ని సంస్మరించడమే ఉత్కృష్టమైన ప్రాయశ్చిత్తం.

"ప్రాయశ్చిత్తాన్య శేషాణి తపః కర్మాత్మకానివై ।
యాని తేషా మశేషాణాం కృష్ణాను స్మరణం పరమ్ ॥"

తపోదాన యజ్ఞాది కర్మలెన్నింటినో ప్రాయశ్చిత్తాలుగా శాస్త్రం బోధిస్తున్నది. ప్రాయశ్చిత్తాలలో కెల్ల శ్రీకృష్ణ నామాను సంధానమే ముఖ్యమైనది. దేశికులు, పాదుకాదేవిని మన పాపాలను తొలగించే కర్మలయందు సర్వోత్కృష్టమైన ప్రాయశ్చిత్త క్రియారూప అని ప్రస్తుతించారు.

"చర్యానః శౌరి పాదు! త్వం ప్రాయశ్చిత్తే ష్వనుత్తమా" (పా.స. 918)

మనం చేసిన పాప కర్మవల్ల కలిగిన భగవన్నిగ్రహాన్ని అణచి వేసే సాధనం దయయే. దయనీయ దుఃఖనిరాకరణేచ్ఛయే దయ కాబట్టి దయా రూపమైన అనుగ్రహాన్ని పొందడం కంటె వేరే సాధ్య వస్తువేముంది? యథార్థంగా సాధనమూ, సాధ్యమూ దయయే కదా! అందువల్ల ఇక్కడ క్రియారూపాలైన ప్రాయశ్చిత్తాల కంటె భగవానుని జ్ఞానరూపమైన దయాదేవియే (ఆద్యా) ముఖ్యమైన నిష్క్రియగా స్తుతింపబడింది.

సంసారతారిణీం:- బహుక్లేశ భూయిష్ఠమైన సంసార సముద్రంలో పడి కొట్టుమిట్టాడడానికి కారణం పాపకర్మ రాశియే కదా! కర్మజ్ఞాన భక్తి యోగాలను

అనుష్ఠించని వ్యక్తి ఒక్కసారి ప్రపత్తిని చేస్తే సకల కర్మలను భగవద్దయయే ధ్వంసం చేస్తుంది. సంసార సముద్రాన్ని దాటిస్తుంది అంటే, సదాచార్య సంపత్తిని కలిగించి పునర్జన్మ లేకుండా చేస్తుందని సారాంశం.

వృషగిరి నాథదయే:- "వృషో హి ధర్మః" వృష శబ్దం ధర్మవాచకం. అధర్మాన్ని వినాశపరచేది ధర్మం. పాప నాశనం చేసేది వృషగిరి అనబడే వేంకటాద్రియే. దయాసనాథుడు వృషగిరినాథుడు. పాపనాశన ప్రస్తావమందు వృషగిరిని కీర్తించడం అత్యంత సరసం కదా!

విబుధాఃవిదన్తి:- 'విబుధ' శబ్దానికి పండితులనీ, దేవతలనీ అర్థం. "కోవిదో బుధః, ధీరో మనీషీ". "విబుధాఃస్సురాః" ఉభయత్ర అమరం.

బ్రహ్మాది దేవతలు కూడా సంసారులే కదా! "సంసార సింధు మతి దుస్తర ముత్తి తీర్షోః, నాన్యః ప్లవో భగవతః పురుషోత్తమస్య" (భాగవతం). అతి దుస్తరమైన సంసార పారావారాన్ని దాటడానికి భగవల్లీలాకథారస నిషేవణం కంటె వేరే నావ లేదని దేవతలకు తెలుసు.

"తస్యధీరాః పరిజానంతి యోనిమ్" (శ్రుతి) అన్నట్లు భగవత్కృపా వైభవాన్ని ఎరుగని విద్వాంసులుంటారా? శ్రీమన్నాథయామున యతి పతులూ విబుధ శబ్దవాచ్యులే కదా!

"కిమలభ్యం భగవతి ప్రసన్నే శ్రీనికేతనే". శ్రీనివాస భగవానుడు ప్రసన్నుడై నప్పుడు పొందరానిదే ముంటుంది?

"రత్న పర్వత మారుహ్య యథారత్నాని మానవః।
శక్త్యాను రూపమాదత్తే తథా కృష్ణాన్మనోరథాన్ ॥"

మానవుడు రత్నగిరిని అధిరోహించి తన శక్తికి తగినట్లు రత్నాలను ఎలా తెచ్చుకొంటాడో, అలాగా శ్రీకృష్ణ భగవద్గుణాను సంధానం వల్ల తన కోర్కెలను తీర్చుకొంటాడు.

"మేరు మందర మాత్రోఽపి రాశిః పాపస్య కర్మణః ।
కేశవం వైద్యమాసాద్య దుర్వ్యాధిరివ నశ్యతి ॥

భిషగ్వరుణ్ని ఆశ్రయిస్తే చెడ్డ రోగం నశించునట్లే బ్రహ్మరుద్రులను తన దివ్య తనువు నందు వహించిన కేశవ భగవానుణ్ని ఆశ్రయిస్తే మేరు, మందర పర్వతాలంత ఎత్తైన పాపకర్మ రాశి కూడా ధ్వంసమవుతుంది. "హృదామనీషామనసాఽభిక్లుప్తో య ఏవం విదురమృతా స్తే భవంతి" (నారా. ఉప) భగవానుణ్ని భక్తి చేతనూ, బుద్ధి చేతనూ, మనస్సు చేతనూ ధ్యానిస్తూ తెలుసుకొనే విద్వాంసులు మోక్షాన్ని పొందుతారన్నది వేదవాణి.

తే॥ దీన జనుల కల్పల తిక యటంచు
కృతదురితముల కాది నిష్కృతి యటంచు
భవమహాంభోధి దాటించు ప్లవమటంచు
వృషగిరీశ్వర దయఁ నిన్ను విబుధులంద్రు ॥

15. వృషగిరి గృహమేధి గుణాః బోధ బలైశ్వర్య వీర్యశక్తి ముఖాః।
దోషాభవేయురేతే యదినామ దయే! త్వయావినాభూతాః ॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! బోధ, బల, ఐశ్వర్య, వీర్య శక్తి ముఖాః = జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి మొదలైన; ఏతే = ఈ, వృషగిరి గృహమేధి గుణాః = వృషాద్రి యందున్న గృహస్థుడైన శ్రీనివాసుని గుణాలు; త్వయావినాభూతాః యదినామ = నీ సంబంధం లేకుండా ఉన్నట్లైతే; దోషాః = దోషాలుగా; భవేయుః = అయ్యే అవకాశం కలవి.

తా: ఓ దయాదేవీ! వృషగిరి పైన వెలసియున్న గృహస్థుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క గుణాలు జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, మొదలైనవి అనంతంగా ఉన్నాయి. నీ సాంగత్యాన్ని విడిచి ఉంటే ఆ గుణాలే దోషాలుగా పరిణమించే వీలున్నది.

వ్యాఖ్య: దయాగుణం యొక్క ప్రాశస్త్యం వర్ణితం.

'దయ' పాపాలను ముంచుతుంది, జీవులను సంసార సముద్రం యొక్క ఆవలి దరికి జేర్చుతుంది అని ఇదివరకు చెప్పబడింది. సంసారులకు ఉపకరించడమే కాక సర్వేశ్వరుడైన శ్రియః పతికీ దయాదేవి ఉపకరించే విధానం సుశ్లోకింపబడుతున్నది.

వృషగిరి గృహమేధిగుణాః:- ధర్మం శిఖరిగా వెలసిన దివ్య క్షేత్రమే వృషగిరి. దాని మీద స్వయం వ్యక్తమైన గృహమేధి శ్రీనివాసుడు. ఆ ధార్మిక గృహస్థునికి ఎనలేని, ఎన్నరానన్ని గుణాలున్నాయి.

1) గృహమేధీ:- గృహేషు మేధా (సబంధః) యస్యసః = గృహమేధీ. గృహాః పుంసిచ భూమ్న్యేవ – 'గృహ' శబ్దం పుంలింగమందు నిత్య బహువచనం. "గృహిణీ గృహముచ్యతే" గృహ శబ్దానికి పత్ని అనే అర్థం ఉంది. పత్ని కలవాడని అర్థం.

2) మేధృ- సంగమే-తాచ్ఛీల్యేణినిః గృహైః సహ (పత్న్యాసహ) మేధా (యాగః) యస్యసః – గృహమేధీ – గృహస్థుడని అర్థం.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస అనే నాల్గు ఆశ్రమాలలో గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది. స్వరూప ధర్మ నిర్వహణలో గృహస్థుడే మేటి. అతిథులకు, ఆగంతులకు, యాత్రికులకు తంగేటి జున్ను గృహస్థుడు. గృహస్థ ధర్మం ఉత్తమమైనది. శ్రీనివాస ప్రభువు గృహమేధి. నామ రూపాలలోనూ కారుణ్యరూపయైన శ్రీదేవిని స్థిరంగా నిల్పుకొని వ్యవహరింపబడుతున్నాడు. "ధర్మస్య ప్రభురచ్యుతః" ధర్మానికి రాజు అచ్యుతుడు. అంటే ధర్మాన్ని జారవిడిచేవాడు కాదు.

"రాజ్ఞిధర్మిణి ధర్మిష్ఠాః, పాపే పాపాః సమేసమాః।
లోకాస్తదనువర్తంతే యథారాజా తథా ప్రజాః ॥"

ప్రభువు ధర్మిష్ఠుడైతే ప్రజలూ ధర్మపరులవుతారు. "లోకానాం త్వం పరో ధర్మః" అని శ్రీరాముని పట్ల బ్రహ్మ పల్కిన మాట. "రామవద్వర్తి తవ్యం స ధర్మః, రావణ వన్నవర్తి తవ్యం సోఽ_ధర్మః" – శ్రీరాముని వలె ధర్మంగా ప్రవర్తించాలి. రావణుని వలె అధర్మంగా మెలగరాదని భట్టాచార్యులు బోధించారు.

"ఏకైకా గౌః త్రయః సింహాః, పంచవ్యాఘ్రాః ప్రసూతిభిః ।
అధర్మో నష్టసంతానో, ధర్మః సంతాన వర్ధనః॥"

క్రూరజంతువులైన సింహాలు మూడేసి, పులులు ఐదేసి పిల్లలను కంటాయి. కాని ఆ జాతి నశిస్తున్నది. ఎవరినీ నష్టపరచని, అందరి ప్రాణాలను నిలిపే ఆవు

ఈనేది ఒక్క దూడనే. అయినా, గో జాతి పెరుగుతున్నది. ధర్మపరుల సంతతి వృద్ధి పొందుతుంది.

వృషగిరి గృహమేధియైన శ్రీనివాసుడు జగత్కుటుంబి. "సప్తలోకీ గృహస్థుడు" అని మీమాంసా పాదుకా మంగళ శ్లోకమందు కీర్తింపబడింది. భట్టబాణుడు శ్రీహర్ష వర్ధనుణ్ని చతురుదధి కేదార కుటుంబి" అని ప్రశంసించాడు. గృహమేధి అనడం వల్ల తిరుమలేశుడు పద్మా పరతంత్రుడని ప్రకటింపబడినది.

బోధబలైశ్వర్య వీర్య శక్తి ముఖాః :- ముఖ శబ్దం చేత తేజస్సు అనే గుణం ప్రకటితం. జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులు అనే ఆరు గుణాలు కలిగి, హేయగుణాలు లేని వాడు భగవానుడని నిర్వచనం. "షణ్ణాం భగ ఇతీరణా". 'భగ' శబ్దానికి షడ్గుణాలని అర్థం. షాడ్గుణ్య పూర్ణుడే భగవానుడని స్పష్టమవుతున్నది. ఈ షాడ్గుణ్యం సకల కల్యాణ గుణాలకు ఉపలక్ష కం. శ్రీనివాసుడు గుణసముద్రుడు.

1. బోధ అంటే జ్ఞానం:- సర్వ వస్తు సాక్షాత్కారమైనది.

2. బలం: శ్రమ పడకుండా అవలీలగా సకల వస్తువులను ధరించడం.

3. ఐశ్వర్యం: సర్వలోకాలలో ఉండే చేతనా చేతనాలను నియమించే సామర్థ్యం.

4. వీర్యం: సర్వజగత్కారణమైనప్పటికీ – సర్వ పదార్థాలను ధరించినా, సకల చరాచర వస్తువులను నియమించినా, వాటివలన ఎట్టి వికారం లేకుండడం నిర్వికారత్వం.

5. శక్తి: అఘటిత ఘటనాసామర్థ్యం. ఎవరూ చేయలేని పనిని తాను తలచినంత మాత్రాన చేసి వేయడం.

6. తేజస్సు: పరాభి భవన సామర్థ్యం. ఇతరులు తనను కన్నెత్తి చూడజాల లేని గంభీరమైన ఠీవి కలిగి యుండడం.

ఈ ఆరు గుణాలు పూర్ణంగా ఉన్మిషితాలైనందున శ్రీకృష్ణావతారం భగవంతుని పూర్ణావతారమనబడింది.

1) "నత్వేవాహం జాతునాసం" – నేనెప్పుడైనా లేనివాడను కాను, నీవు గానీ, ఇక్కడ కనబడుతున్న రాజులుగానీ లేని వారు కారు. ఎప్పుడూ జీవాత్మలు శాశ్వతంగా ఉంటాయి. ఈ సంగతి నాకే తెలుసు, నీకు తెలియదు అనీ ప్రబోధించడం వల్ల 'జ్ఞానం' ప్రకాశితం.

2) గోవర్ధన గిరి నెత్తడం వల్ల 'బలం' వెల్లడి అయింది.

3) లెక్కపెట్టలేనంత యాదవాది జన సముదాయాన్ని తన అదుపులో ఆజ్ఞలో ఉంచడం వల్ల 'ఐశ్వర్యం' ప్రకటితం.

4) గోవులుగా, గోపరక్షకులుగా అయినప్పటికీ తాను నిర్వికారుడుగా ఉండడం వల్ల 'వీర్యం' ప్రదర్శితం.

5) గురువైన సాందీపని పుత్రుణ్ణి తేవడం, మృతి చెందిన విప్రుని కుమారులను తెచ్చి ఇవ్వడం, ఉత్తరాగర్భాన్ని రక్షించడం వల్ల 'శక్తి' కనబడింది.

6) రాజాధిరాజులూ, ఇంద్రాది దేవతలూ తన యెదుట నిల్వలేక (ఓడి) పోవడం వల్ల 'తేజస్సు' గోచరించింది.

భూదేవి శరణవరణమే శ్రీకృష్ణావతారానికి కారణం కదా! శ్రీ వేంకటేశ్వరుని హృదయమందు దయా గుణమే లేక పోతే ఆ స్వామి యొక్క జ్ఞాన బలైశ్వర్యాది గుణాలన్నీ గుణాలనిపించుకోవు. అవి దోషాల క్రిందనే లెక్కింప బడుతాయి. 'దోషా' అంటే రాత్రి – దయా సాన్నిధ్యం లేకుంటే గుణాలు ప్రకాశించవు.

దోషాభవేయురేతే యదినామత్వయావినా భూతాః:– ప్రధానమైన దయా సాంగత్యం లేనప్పుడు ఆ స్వామిలో ఎన్ని గుణాలు ఉన్నా ఏమి ప్రయోజనం? ఆ గుణాలన్నీ దోషాలుగా పరిణమిస్తాయి. మేలు చేసేవి గుణాలు, కీడు చేసేవి దోషాలు. భగవానుడు అభిరామ గుణాకరుడు కదా! దయా గుణ సహకారం చేతనే గుణాలకు గుణత్వం. ఆ దయయే వీడిపోతే గుణాలు దోషాలుగా మారి భగవానుడు గుణ శూన్యుడయ్యే ప్రమాదం ఉంది. భగవానుడు నిర్గుణుడన్న మాటకు భగవద్రామానుజులు హేయ గుణాలు లేని వాడని సిద్ధాంత పరచినారు. జ్ఞాన

బలైశ్వర్యాదులు దోషాలుగా మారితే భగవానుడు చేసే ధర్మ సంస్థాపనకు ఏ మాత్రం ఉపకరించవు. 'భగ' శబ్దార్థమైన షాడ్గుణ్యం పరత్వ లక్షణం. అవాప్త సమస్త కామునికి న్యూనతను ఆపాదించడమే కాక, జీవులకూ దోషాలుగా మారిన షడ్గుణాలు హానిని కలిగిస్తాయి. ఐశ్వర్య వీర్యాద్యసంఖ్యేయ కల్యాణ గుణాలు కలవాడైనా దేవేరియైన దయాదేవి లేకుంటే గృహమేధికి సుఖముండదు. సరికదా! అపరాధులను స్వీకరించక నిగ్రహించే భగవానునికి ఉపకరిస్తూ దయా సాహచర్యం లేని గుణాంతరాలు జీవాత్మలకు కీడు చేస్తాయి. నరకం అనుభవింప జేస్తాయి. కాబట్టి గుణ సార్వభౌమియైన దయా సంపర్కం వల్లనే భగవద్గుణాలన్నీ నిత్య కల్యాణ మహిమతో ప్రకాశిస్తుంటాయి. గుణాలూ, గుణవంతుడూ అందరు దయా ధీనులని భగవద్దయా వైభవాన్ని దేశికులు మహోన్నతంగా కీర్తిస్తున్నారు.

తే॥ వృషభగిరి నున్న గృహమేధి వీర్యశక్తి
బోధ తేజో బలైశ్వర్య ముఖ గుణములు
నీదు సాంగత్య మెడలిన నింద్యములగు
గాదె యనుకంప! సుగుణాగ్రగణ్యవీవ ॥

16. ఆ సృష్టి సంతతానా మపరాధానాం నిరోధినీం జగతః।
పద్మాసహాయ కరుణే! ప్రతి సంచరకేళి మాచరసి ॥

అర్థం: హే పద్మా సహాయ కరుణే = ఓ శ్రీనివాస దయాదేవీ! ఆ సృష్టి సంత తానాం = సృష్టి మొదల్కొని నిరంతరం విస్తరించిన; అపరాధానాం = అపరాధాలను; నిరోధినీం = అడ్డగించునట్టి; జగతః = ప్రపంచం యొక్క; ప్రతి సంచర కేళిం = ప్రళయ రూపమైన లీలను; ఆచరసి = చేస్తున్నావు.

తా: పద్మాదేవిని సహాయంగా కలిగిన శ్రీ వేంకటేశ్వరుని దయాదేవీ! నీవు సృష్ట్యాది నుంచి ఎడతెగక వృద్ధి చెందిన పాపాలను ఆచరించే సాధనాలైన కరణ కళేబరాలను తొలగించే ప్రపంచం యొక్క సంహార రూపమైన లీల నాచరిస్తున్నావు.

వ్యాఖ్య: దయాదేవి జగత్ప్రళయ మనే లీలచేత పరమోపకారం చేయడం వర్ణితం.

దయాసంబంధం చేత అనంత గుణాలు కల్యాణ గుణాలై భాసిస్తున్నాయన్నారు. అందుకు దృష్టాంతంగా భగవద్దయ వల్ల అఖిల భువన జన్మస్థేమ భంగాది లీలలు ఏర్పడుతున్నాయని ఐదు శ్లోకాలచే దేశికులు తెల్పుతున్నారు. మొదట ప్రళయ వ్యాపారం చేత కలిగే జగదుపకృతి సుశ్లోకితం.

పద్మాసహాయ కరుణే:- ఇది దయాదేవిని సంబోధించే పదం. "లక్ష్మీః పద్మాలయా పద్మా" (అమరం) 'పద్మ' అంటే లక్ష్మియే. "తస్యాః శ్రియస్త్రి జగతో జనకో జనన్యా వక్షో నివాస మకరోత్ పరమం విభూతేః । శ్రీః స్వాః ప్రజాస్స కరుణేన నిరీక్షణేన యత్ర స్థితై ధయత సాధి పతీం స్త్రి లోకాన్" (భాగ 8-8-25) మూడు లోకాలకు తండ్రియైన భగవానుడు తన వక్షఃస్థలాన్నే ముజ్జగాలకు జననియైన లక్ష్మీదేవికి నివాస స్థానంగా చేశాడు. హరి వక్షః స్థలాన ఉన్న లక్ష్మి దేవి, తన ప్రజలను దయతో చూడడం వల్ల, లోకాధిపతులతో పాటు మూడు లోకాలను వృద్ధి బొందించింది అని శ్లోకార్థం. ఈ పారాశర్య వచః సుధ నాస్వాదించడం చేత, అఖిల విభూతుల కాశ్రయ భూతయైన లక్ష్మి దేవి యొక్క కరుణా కటాక్ష వీక్షణం వల్ల లోకాలన్నీ సర్వ సంపత్సమృద్ధిగా వర్ధిల్లుతున్నవని విశదమవుతున్నది కదా! పద్మాదేవి యొక్క సహాయం భగవానుని జగద్వ్యాపారానికి ఎంత బాగా ఉపకరిస్తున్నదో స్పష్టమవుతున్నది.

"సహధర్మచరీం శౌరేః సంమంత్రిత జగద్ధితాం।

అనుగ్రహ మయం వందే నిత్యమజ్ఞాత నిగ్రహామ్ ॥" (యతిరాజసప్తతి 2)

నిగ్రహమెట్టిదో తెలియనిది, అనుగ్రహ స్వరూపయైనది, జగద్రక్షణ కోసం భర్తతో మంత్రాలోచన చేసేది, శౌరికి సహధర్మచారిణియైన లక్ష్మీదేవి. కాబట్టి, భక్తులను అనుగ్రహించడానికి దీక్షతో ప్రవర్తించే పద్మా దేవిని సహాయంగా కలిగిన ఓ శ్రీనివాస దయాదేవీ! అనడం వల్ల ఈ శ్లోక తాత్పర్యాన్ని సమగ్రంగా సంగ్రహించిన సంబోధన యని స్పష్టమవుతున్నది.

ఆ సృష్టి సంతతానాం అపరాధానాం:- ప్రళయ పూర్వికమైనది సృష్టి. సృష్టి ఆరంభమైన నాటి నుంచి చేతనులు చేస్తున్న అపచారాలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే

ఉన్నాయి. భగవదాజ్ఞారూపాలైన శ్రుతి స్మృతులు విధించిన వాటిని ఉల్లంఘించడం సామాన్య దోషం కాదు. అకృత్య కరణం అంటే, చేయతగని పనులను చేయడమూ, కృత్యాకరణం అంటే, చేయవలసిన పనులను చేయకపోవడం అపరాధాలే కదా! భగవంతునికి చేసే అపచారం భగవదపచారమనీ, భగవద్భక్తులకు చేసే అపచారం భాగవతాపచారమనీ, పెద్దలకు, గురువులకు, ఆచార్యులకు చేసే అపచారం అసహ్యాపచారమనీ పలురకాల పాతకాలు లోతుగా పాతుక పోయినవిగా ఉన్నాయి.

జగతః అపరాధానాం నిరోధినీం:- చరాచర రూపమైనది జగత్తు. క్షణికోద్రేకాలకు లోనైన జీవులు స్వయంగా కల్ప కోటి కాలం దాకా అనుభవించినా తీరని పాపాలను చేస్తున్నారు. ఇతరుల ప్రేరణ వల్లనూ చేసే బహు విధ అపరాధాలు కూడా రాశులుగా పెరిగి పోయి యున్నాయి. అహల్య లాగా శిలగా మారడమూ, నలకూబర మణి గ్రీవుల లాగా చెట్లుగా పరిణమించడమూ దుష్కర్మ ఫలమే కదా! కాబట్టి, జగచ్ఛబ్దం వల్ల స్థావర జంగమాత్మకమైన ప్రాపంచిక పాపరాశులు పర్వతాల్లాగా పెరిగినప్పుడు పాపాచరణకు సాధనాలైన కరణ కళేబరాలను, ఇంద్రియాలతో కూడిన శరీరాలను తొలగించడమే నిరోధం. బాగా తినిపించిన తల్లి, జీర్ణించడానికి ఔషధాన్ని కూడా ఇచ్చి పిల్లల బాగోగులకు పాటుపడుతుంది.

అల్లరి చేసే పిల్లలు దినదినం తమ దౌష్ట్యం చేత దురవస్థలను పొందుతారు. రోగిష్ఠులు గానూ, వికలాంగులుగానూ తాము దుఃఖపడడమే గాక వారిని కన్న తల్లిని కూడా దుఃఖపెడ్తారు. దుఃఖ నివారణేచ్ఛయే దయ కదా! ఈ దౌష్ట్యాన్ని, తత్ఫలితంగా కలిగే బాధను మరచిపోతారని తల్లి దయతో పిల్లలను జోలపాడుతూ లేదా చేదు మాత్రలను తేనెలో ముంచి, మ్రింగజేస్తూ నిద్ర పుచ్చుతుంది కదా! దయ దీర్ఘనిద్రను కల్పిస్తుంది. పాప పురోగతికి అడ్డుకట్ట వేయడానికీ, తద్ద్వారా జీవులు సాంసారిక దుఃఖాన్ని అనుభవించకుండా ప్రశాంతంగా ఉండడానికే భగవద్దయ జగత్సంహారమనే లీల చేయడం, జగదుపకారమే అని నిరూపించబడినది. ఇది నిర్దయ అనబడదు. ఈ భావమే

"అనవరత సుఖదుఃఖోప భోగాయాస పరిశ్రాంతానాం విశ్రమార్థం అశ్రాంతాపథ ప్రవృత్తి వాసనా విచ్ఛే దార్థం చో ప సంహారః, అతః న సంహారే నైర్ఘృణ్య దోషః"

అని 'తాత్పర్య చంద్రిక'లో తెల్పబడింది.

ఒక దయాళుడు ఏరుదాటడానికి పడవనిస్తే ఏటిలో దాటుతూ పడవ బోర్లపడే రీతిగా నడిపి, పడవతో పాటు తాను కూడా ప్రవాహంలో కొట్టుకపోయి నాశనమైతే ఆ దయాళుడు 'అయ్యో! పడవ నీయకపోవడమే బాగుండేది కదా! అనుకొంటాడు. అట్లే భగవానుడు తనను ఆరాధించడానికి జీవునికి శరీరాన్ని దయతో ఘటింపజేస్తే ఆరాధనకు వ్యతిరేకంగా అపరాధానికి పాటుపడి నశిస్తుంటే, శరీరాన్ని విఘటింప జేయడమే మేలనుకోవడం సమంజసమే కదా!

ఒక్కడైనా అపరాధం చేయనివాడు లేడు. కాబట్టి సకల జగదపరాధ నిరోధమే ప్రళయం. దుష్ట స్వభావ నిరోధమే ప్రళయమని అర్థం.

ప్రతి సంచరకేళి మాచరసి:- ప్రతి సంచరమనే ఆట ఆడుతున్నావని దయను స్తుతించారు దేశికులు. ఇక్కడ ప్రతి సంచరమంటే ప్రళయమని అర్థం. ఉపసంచర పదానికి వ్యతిరేక పదం ప్రతిసంచరం.

"దైత్యాన్ గృహీత కలశః వంచయన్ ఉపసంచరైః
దూరస్థాన్ పాయయామాస జరామృత్యుహరాం సుధామ్" (భాగ. 8.9-21)

మోహినీ వేషాన్ని దాల్చి అమృతాన్ని గ్రహించిన భగవానుడు ఉపసంచర గతులతో రాక్షసులను మోసగించి, కొంత దూరంలో పంక్తిగా కూర్చున్న దేవతలకే ముసలితనాన్నీ చావునూ లేకుండా చేసే అమృతాన్ని త్రాగబోశాడు అని శ్లోకార్థం. 'ఉపసంచరైః' అంటే **'సమీప గమన బహుమాన ప్రియ వాక్యాదిభిః'** అని చంద్రిక (వీర రాఘవీయం) వ్యాఖ్యానించింది. ఎంతో ప్రేమతో ఇచ్చకాల మాటలాడుతూ, ఒయ్యారంగా అడుగులిడుతూ దగ్గరగా పోవడమని అర్థం. ఇక్కడ, భగవానుని స్త్రీ రూపాన్ని చూచి దైత్యులు మోహితులయ్యారన్న చోట **"తాం శ్రీ సఖీం కనకకుండల చారుకర్ణ నాసా కపోలవదనాం పరదేవ తాఖ్యాం"** అని వ్యాసుని మాట. 'శ్రీ సఖీ' అంటే 'శ్రీ సహాయిని' అన్న మాటే కదా! 'ప్రతిసంచర' పదమున్న ఈ శ్లోకంలో 'పద్మా సహాయ కరుణే' అని దేశికులు కమనీయంగా ప్రయోగించారు. దయాదేవికి ప్రళయమనేది ఒక ఆట. నర్తనం. రంగస్థలమందు నర్తకి పురః సంచరం (ముందుకు

అడుగులు వేయడం) ప్రతి సంచరం (వెనుకకు అడుగులు వేయడం) లలితంగా చేస్తుంది. 'ప్రతిసంచరకేళి' అంటె నర్తకి రంగస్థలాన నాట్యం చేయడం.

'సంతతానాం' - బాగా విస్తరించడమనే అర్థమే కాక, వీణాదివాద్య మనే అర్థమూ ఉంది.

"విసృతం విస్తృతం తతమ్"-"తతం వీణాదికంవాద్యం" - ఉభయత్ర అమరం.

నర్తకి అభినయిస్తూ బాగా నటిస్తున్నప్పుడు ప్రక్క వాద్యాలు పదగతులకు తగినట్లు వాయించడం వల్ల ప్రేక్షకులకు చిత్తరంజకం గా ఉంటుంది. పదం, తాళం, లయ మొదలైన సంగీతానికి సంబంధించిన పరికరాల సహాయం సముచితంగా ఉంటే నర్తకి ఉల్లాసంతో నాట్యం చేసి యశః శ్రీని పొందుతుంది.

పాటకు తాళం తప్పితే, ప్రక్క వాద్యాలు చక్కగా నటనతో ఏకీభవించకపోతే, నర్తకి తనకు సహకరించని వాద్య కళాకారులపై కినియక ప్రతిభతో ప్రేక్షకులకు వైమనస్యం కలుగకుండా క్రమంగా వెనుకకు అడుగులు వేస్తూ - ప్రతి సంచర కేళితో గౌరవంగా రంగం నుంచి నిష్క్రమిస్తుంది. దయాదేవి యొక్క ప్రతిసంచర కేళి - ప్రళయాఖ్యలీల అలాగా ఉందని నాట్య శాస్త్ర పదాల ప్రయోగం వల్ల వెల్లడి అవుతున్నది. జగదపరాధాలను నిరోధించే ప్రతి సంచరకేళి నాచరించే శ్రీనివాసుని దయకు పద్మా సహాయం ప్రస్ఫుటీకరింపబడినది.

తే॥ సృష్టి మొదలుగ జనములు సేయునట్టి
భగవదాజ్ఞాతిలంఘున పాపవృత్తు
లడగ హితవృత్తి భువన సంహారకేళి
యాచరింపుదు పద్మా సహాయ కరుణ!

17. అచిద విశిష్టాన్ ప్రళయే జంతూనవలోక్య జాతనిర్వేదా ।
కరణకళేబర యోగం వితరసి వృషశైలనాథ కరుణే! త్వమ్ ॥

అర్థం: వృషశైలనాథ కరుణే = శ్రీనివాసుని దయాదేవీ! అచిత్+అవిశిష్టాన్ = అచిత్తు అనే జ్ఞాన శూన్యమైన వస్తువుతో సమానమై యున్న; జంతూన్ =

జీవులను; అవలోక్య = చూచి; జాతనిర్వేదా = ఉదయించిన తాపంకలదానవైన; త్వం = నీవు; కరణ, కళేబర, యోగం = ఇంద్రియాలకూ, శరీరానికీ సంబంధాన్ని; వితరసి = ఇస్తున్నావు.

తా: వృషాద్రీశుని దయాదేవీ! ప్రళయ కాలమందు జడవస్తువు రీతిగా పడియున్న జీవులను చూచి అనుతాపం కలిగిన నీవు ఇంద్రియాలతో కూడిన శరీరాన్ని జీవులకు కలుగ జేస్తున్నావు.

వ్యాఖ్య: సృష్టి కూడా దయా కృత్యమని స్తుతి.

ఒక నర్తకి నృత్యం చేస్తుంటే వాద్య కళాకారులు శ్రుతి లయలు తప్పినట్లు చేసిన అపరాధాలను అడ్డగింప దలచి వారికి కళంకం రాకుండా, నృత్య ప్రదర్శన రసాభాస కాకుండా నైపుణ్యంతో అభినయిస్తూ వెనుకకు మెల్లగా కదలుతూ నృత్యాన్ని చాలించినట్లే దయాదేవి యొక్క ప్రళయ లీల జరుగడం వర్ణింపబడింది. కొంత కాలానికి ఆ వాద్యకళాకారులు అపశ్రుతులను సవరించుకొని, మళ్ళీ పొరపాటు చేయరని వారిపై జాలి కలిగినందు వల్ల నర్తకి తిరిగి నృత్య ప్రదర్శనను ప్రారంభించి రసజ్ఞ లోకాన్ని ఆనంద పరచే రీతిగా దయాదేవి సృష్టి నాటక ప్రదర్శనను సాగిస్తుందని వివరింపబడుతున్నది.

బిడ్డలను నిద్రింప జేసిన తల్లి, ఎంత సేపటికీ మేల్కోనట్టి వారి స్థితికి జాలిపడి, ఇక సన్మార్గ ప్రవర్తనులవుతారని తలచి, బిడ్డలను లేపి, దేహేంద్రియాలకు పుష్టినిచ్చే ఆహార పానీయాలనిచ్చి ఆనందింప జేసే విధంగా దయాదేవి ప్రవర్తించడమే సృష్టి కార్యం.

సృష్టి ప్రళయాలనడం క్రమ పద్ధతి అయినా, దయాదేవి ప్రళయ దశలోని జీవుల స్థితికి నిర్వేదాన్ని పొందడమే సృజ్య ప్రక్రియకు హేతువు అని నిరూపించడాన్ని బట్టే ప్రళయాన్ని మొదట చెప్పి, తర్వాత సృష్టి చెప్పబడుతున్నది.

అచిద విశిష్టాన్ ప్రళయే:- ప్రళయ కాలమందు, కంసాలి మైనపు ముద్దతో నగలు చేస్తున్నప్పుడు తరిగి రాలిపోయిన బంగారు కణాలను అద్దుతుంటే ఆ కణాలు (బంగారు పిసర్లు) మైనపు ముద్దకు అతుక్కొని ఉంటాయి. అట్లే ప్రకృతి అనే

అచిద్వస్తువు నందు తగుల్కొన్న జీవులు శరీరేంద్రియాలు లేనందు వల్ల జ్ఞాన సంకోచం కలిగి చేష్టలుడిగి ఉండడమన్న మాట. అచిద్వస్తువు అంటే జడ పదార్థం కంటే వేరుకానివిగా జీవాత్మలున్నాయని అర్థం. ఈ శ్లోక భావాన్ని గీతా భాష్యంలో ఒక పంక్తి ఇలా చెప్పింది.

"పురాసర్గకాలే స భగవాన్ ప్రజాపతిః అనాదికాల ప్రవృత్తా చిత్సంస్గర వివశయా ఉప సంహృత నామరూప విభాగాః స్వస్మిన్ ప్రలీనాః సకల పురుషార్థానర్హా శ్చేతనేతర కల్పాః ప్రజాః సమీక్ష్య పరమకారుణికః తదుజ్జి జీవయిషయా స్వారాధన భూత యజ్ఞ నివృత్తయే యజ్ఞైః సహతాః సృష్ట్వా ఏవమువాచ".

పూర్వం సృష్టి కాలమందు ప్రజాపతి యైన నారాయణుడు అనాది కాలం నుంచి ప్రవర్తిస్తున్న ప్రకృతి సంసర్గం వల్ల స్వాధీనత తప్పి నామరూప విభాగం లేకుండా తనయందే లీనులై, సకల పురుషార్థాలకు తగని వారై అచేతన ప్రాయులై పడియున్న ప్రజలను జూచి, పరమ కారుణికుడైనందు వల్ల వారిని ఉజ్జీవింప జేసే కోరిక చేత తనకు పూజారూప మైన యజ్ఞాలను నిర్వర్తించడం కోసం యజ్ఞాలతో కూడా ఆ ప్రజలను సృష్టించి, ఇట్లు చెప్పినాడు - అని ఈ పంక్తి యొక్క భావం.

"సహోయజ్ఞైః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః" అనే (భగవద్గీత 3-10) శ్లోకానికి ఉన్న భాష్యపంక్తి ఇది.

ఇక్కడ 'సహయజ్ఞాః' అనే పాఠం ప్రసిద్ధం కాదని భాష్యకారులు "సహో యజ్ఞైః" అనే పాఠాన్ని ఆదరించారని దేశికులన్నారు. 'అచిదవిశిష్టాన్' అంటే, అచిత్కల్పమైనవని అర్థం.

గీతాభాష్యంలో "చేతనేతర కల్పాః" అని ఉంది కదా! జడవస్తు సదృశమైన వని అర్థం.

"తేన త్రివర్గేఽ ప్యనర్హాః, కింపునః అపవర్గే. స్వప్రకాశత్వేఽ పి అత్యంత జ్ఞాన సంకోచాత్ తత్కల్పత్వం, నతుజ్ఞాన వినాశాత్" - జీవాత్మలు స్వయంగా ప్రకాశం కలవి. అయినా ధర్మార్థ కామాలనబడే త్రివర్గం పట్ల కూడా తగనివై యున్నాయి. ఇక మోక్ష పురుషార్థ విషయమై చెప్పేదేమి? కాబట్టి, జీవాత్మలకు జ్ఞానం చాలా

తరిగిపోయిందే కాని జ్ఞానం మాత్రం నశించ లేదు అని గ్రహించడం కోసం 'కల్ప' శబ్దం ప్రయోగింపబడిన దన్నారు దేశికులు 'తాత్పర్య చంద్రిక'లో.

ప్రళయే జంతూ నవలోక్య:- ప్రళయ కాలమందు దయాదేవి దీన దశలో ఉన్న జంతువులను బాగా వంగి చూచిందని అర్థం. ప్రళయకాలాన హిరణ్యగర్భాది దేవతలు మనుష్యులు పశు పక్ష్యాదులన్ని లీనమై ఉన్నాయి. ఈ జీవులందరు నారాయణునికి ప్రజలేగదా! సృష్టికి ఉన్ముఖమైన కాలాన ఆ ప్రజలను జంతువులనే మాటను ఉపయోగించడం స్వారస్యం.

'సమీక్ష్య' అనే గీతాభాష్య పదానికి 'తాత్పర్య చంద్రిక' 'సమ్యక్ అవలోక్య' అని వ్యాఖ్యానించింది. నామరూపాలు ఉపసంహరింపబడి అచేతన ప్రాయులైయున్న బ్రహ్మాది జంతువులను దయాదేవి పైపైన చూడలేదు, బాగా చల్లని చూపుతో కనుగొన్నది.

అచిదవిశేషితాన్ ప్రళయ సీమని సంసరతః,

కరణ కళేబరైర్ఘటయితుం దయమానమనాః వరద!

నిజేచ్ఛయైవ పరవానకరోః ప్రకృతిం,

మహదభిమాన భూతకరణా విల కోరకిణీమ్॥

జాతనిర్వేదా:- జంతువుల దైన్యాన్ని అవలోకించిన దయా దేవికి వెంటనే తాపం పుట్టింది. అయ్యో! ఈ జీవులెంత కాలం ఇలా దీర్ఘనిద్రలో మునిగి ఉంటారు? మేల్కొల్పినట్టైతే జ్ఞానం చేత సత్కర్మల నాచరించి సద్గతిని పొందదగిన వారే కదా! అని తాపం చేత అంతరంగమంత రసతరంగితమయింది.

భగవత్కృపకు నిర్వేదమావిర్భవించడ మంటే అది జగజ్జన్మకు కారణమన్న మాటే కదా!

త్వం కరణ కళేబర యోగం వితరసి:- నీవు జ్ఞాన కర్మేంద్రియాలతో కూడిన శరీరాన్ని జీవులకు ఘటింపజేస్తున్నావు అని అర్థం.

'కరణం' అంటే చేయడం. యాక్షన్. పనిచేసే సాధనమైన ఇంద్రియ మని అర్థం. త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వాఘ్రాణాలు - చర్మం, కన్నులు,చెవులు, నాలుక, ముక్కు అనేవి ఐదు జ్ఞానేంద్రియాలు.

వాక్ పాణి పాద పాయూపస్థలు - వాక్కు, చేతులు కాళ్ళు, మల మూత్ర విసర్జకా వయవాలు - అనేవి ఐదు కర్మేంద్రియాలు.

'కళేబరం' అంటే శరీరం. 'యోగ'మంటే ఒండొంటితో కూర్చడం. కరణాలకూ కళేబరానికీ సంబంధం కూర్చబడితే కళేబరం ఆదరింపబడుతుంది.

"కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్" (భగీ. 3-15)

'బ్రహ్మ' అంటే ఇక్కడ ప్రకృతి పరిణామరూపమైన శరీరమని అర్థం. 'అక్షరం' అంటె నాశం లేని జీవాత్మ అని అర్థం. ఆత్మాధిష్ఠితమైన శరీరమే కర్మకు సాధన భూతమవుతుందని పిండితార్థం.

"విచిత్రాదేహ సంపత్తిః ఈశ్వరాయ నివేదితుమ్।
పూర్వమేవ కృతా బ్రహ్మన్! హస్త పాదాది సంయుతా॥"

చేతులు కాళ్ళు మొదలైన అవయవాల సౌష్ఠవం కలిగి విచిత్రంగా ఉండే దేహ సంపద సర్వేశ్వరునికి సమర్పించడానికే జీవాత్మకు పూర్వమే కూర్చబడింది.

"జిహ్వేకీర్తయ కేశవం" (ముకుందమాల) అని శ్రీ కులశేఖరాళ్వార్లు అనుసంధానం చేసినట్లు, శ్రియః పతిని నాలుకచే కీర్తించాలి. మనస్సుచే ధ్యానించాలి. చేతులచే అర్చన చేయాలి. చెవులచే భగవత్కథలను వినాలి. కన్నయ్యను కన్నార చూడాలి. దేవాలయానికి నడిచి పోవాలి. పద్మాపతి యొక్క పాదాల యందలి తులసిని ఆఘ్రాణించాలి. శ్రీ వేంకటేశ్వరుని చరణాలకు శిరస్సు వంచి నమస్కరించాలి.

"త్వదీయం వస్తు గోవింద! తుభ్యమేవ సమర్పయే" అన్నట్లు శ్రీనివాస భగవాను డుదయతో నొసగిన ఈ తనువును ఆయన ఆరాధనకే వినియోగించడం శ్రేయస్కరం.

అలాగాక స్వప్రయోజనం కోసం కర్మల నాచరిస్తే కర్మవాసన విడువదు. అది విడువకుంటే ఇంద్రియాల వ్యాకులత ఉడుగదు. దాని ఫలితంగా, జననమరణ చక్రంలో పరిభ్రమించక తప్పదు. దయాదేవి మాతృప్రేమతో పెద్ద నిద్ర నుంచి మేల్కొలిపి, భగవదారాధనా రూపమైన సత్కర్మల నాచరించి శాశ్వత బ్రహ్మానందాన్ని

అనుభవించగలరనే ఆశయంతో వృషశైలనాథుని ఆశ్రయించి జీవులకు కరణ కళేబర యోగదానం చేస్తున్నది. అప్రస్తుత వ్యవహార సమారోపచారుత్వం చేత సమాసోక్త్య లంకార సజ్జితమయినదీ శ్లోకం.

తే॥ ప్రళయమందట్టు లవశతన్ ప్రజ్ఞ యెడలి
ప్రకృతి నొదిగిన జీవుల పాటు సూచి
తాళగాలేక సృష్టించు వేళ, వాని
కొసగుదువు దయ! దేహ సంయోగమెలమి!!

18. అనుగుణ దశార్పితేన శ్రీధర కరుణే! సమాహిత స్నేహా।
శమయసి తమః ప్రజానాం శాస్త్రమయేన స్థిర ప్రదీపేన॥

అర్థం: శ్రీధర కరుణే = ఓ శ్రీనివాస దయాదేవీ! సమాహిత స్నేహా = సమర్పించబడిన ప్రేమగలిగినట్టి; నిండుగా పోయబడిన నూనె కలిగినట్టి; నీవు; అనుగుణ దశా + అర్పితేన = అనుకూలమైన సత్త్వ గుణం గల సమయాన (ప్రజల యందు) నిక్షిప్తమైన; తగిన దారాలు గల వత్తి యందు వెలిగింపబడిన; శాస్త్రమయేన = శాస్త్రరూపమైన; స్థిర ప్రదీపేన = ఆరని దీపం చేత; ప్రజానాం = ప్రజల యొక్క; తమః = అజ్ఞానాన్ని / చీకటిని; శమయసి = తొలగింప జేస్తున్నావు.

తా: శ్రీధరుని దయాదేవీ! నీవు పూర్ణ ప్రేమ గలదానవై స్థిరమైన శాస్త్రమనే దీపాన్ని వెలిగించి చీకటిని పోగొట్టుతున్నావు. దీప ప్రమిదయందు నిండుగా నూనె పోసి వత్తిని వెలిగించిన దీపాన్ని దీనులకు సముచిత సమయాన ప్రజలకు ఇస్తున్నావు.

వ్యాఖ్య: పాలన చేయడమూ దయాకృత్యమని వర్ణితం.

దయాదేవి ప్రళయానంతరం జగత్తును సృష్టించింది. నిర్వేదం కలిగిన దయాదేవి సృజింపబడిన జీవులను పాలన చేయడమూ ఆవశ్యకమే కదా!

శ్రీధర కరుణే:– "నహిపాలన సామర్థ్యమృతే సర్వేశ్వరం హరిమ్" సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణునికి తప్ప ప్రజల యోగ క్షేమాలను వహించి పాలించే సామర్థ్యం

మరొకరికి లేదు. పాపమేదో పుణ్యమేదో తెలియకుండా మనుగడ సాగించే ప్రజలకు మొదట వివేక జ్ఞానం అవసరం కదా!

"నదేవా దండమాదాయ రక్షంతి పశుపాలవత్।
యంహిరక్షితు మిచ్ఛంతి బుద్ధ్యాసంయోజయంతి తమ్॥"

పశుపాలకులు పశువులను కాపాడడానికి ఒక కట్టను చేతబట్టుకొని వాటిని అదలిస్తూ అడవికి తీసుకొని పోయి మేపుతారు. అలాగా కట్టతో పశువులను తోలుతూ కాపాడునట్లు మనుష్యులను కాపాడరాదు. శాసకులు దండధరులే అయినప్పటికీ, దేవతల్లాగా ప్రజలకు మొదట జ్ఞాన దానం చేస్తారు. జ్ఞాన దీప్తులైన ప్రజలు సన్మార్గాను యాయులవుతారు. "ప్రకృతిం వికృతిం విద్యామ్"-"యజ్ఞ విద్యా మహావిద్యా" అన్నట్లు శ్రీదేవి విద్యామూర్తి కదా! చైతన్య స్తన్య దాయినియైన శ్రీదేవిని తన ఉరమున ధరించిన వాడు శ్రీధరుడు. అట్టి శ్రీదేవికి కరుణ సహజయే కదా! కాబట్టి, శాస్త్ర ప్రదానం చేసే యోగ్యత శ్రీధర కరుణకే ఉన్నందు వల్ల సంబోధన సముచితంగా ఉంది.

అనుగుణ దశార్పితేన:- శాస్త్రమనేది ఒక దీపం. దీపం దినాంతమందు అంటే రాత్రి పూట చక్కగా ప్రకాశిస్తుంది. పగటి పూట ఎక్కువ ప్రకాశించదు. సమయ ప్రభావముంటుంది. కాబట్టి, తగిన సమయాన వత్తిని వెలిగించాలి. ఆ వత్తి పత్తి నుంచి తీసిన దారాన్ని మూడు వరుసలు వేసి పేనినదై ఉండాలి. 'గుణ' శబ్దానికి నానార్థాలున్నాయి. అందులో 'దారం' అని ఒక అర్థం. "మౌర్వ్యాంద్రవ్యాశ్రితే సత్త్వ శుక్ల సంధ్యాదికే గుణః" (అమరం.) "దశాప్రదీపవర్త్యా" (శేష నిఘంటువు) 'దశా' అంటే 'వత్తి'. "దశావస్థానేక విధాపి" (అమరం) బాల్యాద్యవస్థలకూ, దీపపు వత్తికి కూడా 'దశా' శబ్దం వర్తిస్తుంది.

దీపం లాంటిది వేదశాస్త్రం. శాస్త్రాభ్యాసానికి కూడా సమయ (కాల) నిర్ణయం ఉంటుంది. 'ఉపనయనం' అయిన వారికి వేదం బోధించాలి. కౌమార దశలో విద్యాభ్యాసం చేయాలి. అనుపనీతులకు వేదమంత్రాలనూ, మంత్రార్థాలను ఉపదేశించ రాదని శాస్త్రం చెబుతుంది. వేదం తప్ప ఇతర శాస్త్రాలు, దివ్య ప్రబంధాలు ఉపనయనం కాని వారు కూడా నేర్వవచ్చును. శాస్త్రాలను

అభ్యసించడానికీ, ఆవర్తి చెప్పడానికీ కౌమారదశ అనుగుణమైనది కదా! బాల్యాద్యవస్థలలో బాలురకు జీర్ణమయ్యే ఆహారమిచ్చునట్లే, కాలానుగుణంగా యోగ్యతను బట్టి జ్ఞానాన్ని బోధిస్తారు గురువులు.

సమాహితస్నేహా:- 'స్నేహం' అంటే ప్రీతి, నూనె అని రెండు అర్థాలున్నాయి. దీప ప్రమిదలో నూనెను నిండుగా పోయాలి. దీప ప్రమిదలో పోసిన నూనెను వత్తి ఆకర్షించుకొంటూ బాగా వెలుగుతుంది.

స్నేహమయుడై ఆచార్యుడు శాస్త్రాన్ని బోధించాలి. "కృపయా నిస్పృహో వదేత్" గురువు వేతనమాశించి విద్యను బోధించకూడదు. అంగడిలో జ్ఞానాన్ని అమ్ముకొనే వ్యాపారి కాదు. కాబట్టి, గురువు చాలా దయాళువై విద్యను బోధించాలి. విద్యార్థి శ్రద్ధతో శాస్త్రాభ్యాసం చేయాలి. "శ్రద్ధయాఽగ్నిః సమింధతే" అని శ్రుతి పలికినట్లు, గురుకృప చేతనూ, విద్యార్థి యొక్క శ్రద్ధ చేతనూ జ్ఞానజ్యోతి బాగా ప్రకాశిస్తుంది.

"అనాపృష్ట మపి బ్రూయుః గురవోదీన వత్సలాః" (భాగ 3 స్కం) విద్యార్థి శాస్త్రంలోని రహస్యం, మర్మం తెలియక అడగలేని విషయాన్ని కూడా దీనవత్సలులై గురువులు శాస్త్రాన్ని, అందులోని రహస్యాలను వివరిస్తూ చక్కగా బోధిస్తారు.

"అనుదిన మనపాయ స్నేహదత్తావసేకైః,
సుమతి భిరను భావ్యః శోభనాయాం దశాయామ్" (2-23)

బుద్ధిమంతులు ప్రతిదినం నూనెపోసి వత్తి వెలుగుతున్నప్పుడు వస్తువును చక్కబరచుకొన్నట్లే, వ్యక్తి యుక్తవయస్సులోనే - శోభన దశలో - శ్రద్ధతో కూడిన సత్త్వగుణం వృద్ధి చెందిన కాలాననే భాష్యదీపాన్ని అనుభవించాలి, అంటే శాస్త్రాభ్యాసం చేయాలి అని దేశికులు 'సంకల్ప సూర్యోదయం'లో చెప్పినారు.

శాస్త్రమయేన స్థిర ప్రదీపేన:- దీపం గాలికి చలించి ఆరిపోవచ్చు. శాస్త్ర రూపమైన దీపం నిశ్చలంగా ఉంటుంది. ఎప్పుడు ఆరిపోనిది కాబట్టి ప్రదీపమన బడింది "అనేక సంశయోచ్ఛేది పరోక్షార్థస్య దర్శనమ్ । సర్వస్యలోచనం శాస్త్రం" - శాస్త్రం పలు సందేహాలను తొలగిస్తుంది. కంటికి కనబడని వస్తువులను చూపిస్తుంది.

ప్రతి వ్యక్తికి శాస్త్రమనేది కన్నులాంటిది. "శాస్త్రాద్వేద్మిజనార్దనమ్" శాస్త్ర జ్ఞానం భగవద్వైభవాన్ని తెలుపుతుంది.

"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మకర్తు మిహార్హసి॥" (భ.గీ.)

ధర్మశాస్త్రేతిహాస పురాణాదులు వేదాలచే ఉపబృంహితాలై శాస్త్రమన బడుతుంది. అదే ప్రమాణం - ఆ శాస్త్రం ద్వారా కృత్యాకృత్యాలను తెలుసుకొని శాస్త్ర విధానంగా కర్మల నాచరించి ఇహ పరసుఖాలను పొందవచ్చును. "తర్కాప్రతిష్ఠానాత్" - శాస్త్రాన్ని అనుసరించని కేవల తర్కానికి స్థిరత్వం ఉండదు. అప్రతిష్ఠిత త్వమైన అస్థైర్యమే కలుగుతుంది. స్థిర మంటే అవిచాల్యత్వం. దయాదేవి, జీవాత్మ అనే ప్రమిదలో భగవానుని అనుగ్రహమనే నూనెను పోసి తగిన కాలమనే వత్తితో శాస్త్రమనే ప్రదీపాన్ని వెలిగించింది.

ప్రజానాం తమః శమయసి:- ప్రజల యొక్క అజ్ఞాన మనే చీకటిని పోగొట్టుతుంది.

"మతిభేద తమస్తి రోహితే గహనేకృత్య విధౌ వివేకినామ్ ।
సుకృతః పరిశుద్ధ ఆగమః, కురుతే దీప ఇవార్థ దర్శనమ్ ॥"

(కిరాతార్జునీయం 2-33) గాలి తగుల కుండా కాపాడబడిన ప్రదీపం చీకటిలో ఉన్న వస్తువును చూపడానికి సమర్థమైనది కదా! అట్లే, వివేకవంతుడైన వ్యక్తికి, కార్యాన్ని ఆచరించే సమయాన దురవగాహమై తికమక పడుతుంటే, బాగా నేర్చిన సువిహితమైన శాస్త్రజ్ఞానం కర్తవ్యాన్ని ప్రదర్శిస్తుందని భారవి రచించిన ఈ శ్లోకానికి అర్థం.

"హర్తుం తమ స్సద సతీచ వివేక్తు మీశః
మానం ప్రదీపమివ కారుణికోదదాతి ॥" (శ్రీరంగ రాజస్తవం 2-1)

కారుణికుడైన భగవానుడు. సత్తును (మేలును) అసత్తును (కీడును) తెలుసు కోవడానికీ, అజ్ఞాన సంశయ విపర్యయాలనే అంధకారాన్ని తొలగించడానికీ శాస్త్ర ప్రమాణమనే ప్రదీపాన్ని ప్రసాదించాడు అని శ్రీ పరాశర భట్టర్ శ్రీరంగరాజస్తవం

చేశారు. ప్రజలందరు దయాదేవి బిడ్డలే కదా! తల్లి చీకట్లో దారి కానరాక బిడ్డలు కష్టాలు పడుతున్నప్పుడు ప్రమిదలో నూనెబోసి, దానిలో దారాలతో పేని, ముంచి పెట్టిన వత్తిని వెలిగించి వారికిచ్చి మంచిదారిలో వారిని గమ్యం చేర్చునట్లు, దయాదేవి శాస్త్రమనే స్థిరదీపాన్ని సంసార తరణం కోసం ప్రజలకిస్తుంది.

"యోబ్రహ్మాణం విదధాతి పూర్వం,
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" (శ్వే. ఉపనిషత్)

పూర్వం సృష్ట్యాదిలో పద్మనాభుడు పద్మభవుడైన చతుర్ముఖ బ్రహ్మకు వేదాలను ఇచ్చి కృతార్థునిగా చేశాడు. అట్లే, దయాదేవి సృష్టి తర్వాత ప్రజల సుఖాన్ని కోరి శాస్త్ర దీపాన్ని ఇచ్చి వారిని కాపాడుతున్నది.

శ్లేషాను ప్రాణితమైన సమాసోక్తి చే చమత్కరింపబడిన శ్లోకమిది.

కం॥ వరగుణ దశా సమర్పిత
పరిపూర్ణ స్నేహయగుచు ప్రజలకు తమమున్
నిరసింపగ శాస్త్రమయ
స్థిర దీపం బొసగి మేలు సేయుదు కరుణా ॥

19. రూఢా వృషాచలపతేః పాదే ముఖకాంతి పత్రలచ్ఛాయా ।
కరుణే! సుఖయసి వినతాన్ కటాక్ష విక్షేపైః కరాప చేయ ఫలైః ॥

అర్థం: కరుణే = ఓ దయాదేవీ! వృషాచలపతేః = శ్రీనివాసుని యొక్క / పర్వత రాజం యొక్క; పాదే = పాదాలయందు / అడుగు భాగమందు; రూఢా = పుట్టినట్టి / మొలచినట్టి; ముఖకాంతి పత్రలచ్ఛాయా = ముఖమండల కాంతి అనే పచ్చని ఆకులచే ఏర్పడిన నీడ కల్గినట్టి, నీవు; వినతాన్ = వంగి నమస్కరించిన వారిని; కర+అప చేయ ఫలైః = చేతులతో కోయదగిన ఫలాలుగల; కటాక్ష విక్షేపైః = కడగంటి చూపులు అనే కొమ్మల చేత; సుఖయసి = సుఖింపజేస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! నీవు వృషాచలపతియైన వేంకటేశ్వరుని పాదాలయందు పుట్టావు అంటే ఎత్తైన పర్వతం యొక్క అడుగు నేలలో జన్మించావని అన్నందు

వల్ల నీవొక కల్పతరువు అని సంభావింప బడుతున్నావు. వేంకటేశ్వరుని ముఖకాంతి అనే హరిత వర్ణశోభితమైన దట్టని ఆకులచే చల్లని నీడ కల్గినదానవయ్యావు. శ్రీ వేంకటేశ్వరుని పాదాల మీద పడి నమస్కరించే వారికి కటాక్షము అనే కోయ దగిన ఫలాలు గల కొమ్మలచేత సుఖాన్ని కలిగిస్తున్నావు.

వ్యాఖ్య: దయాదేవి కల్పతరువై శరణాగతి చేసిన భక్తులకు చేతికందిన ఫలాల నిచ్చి సుఖపెట్టుతున్నదని వర్ణింపబడుతున్నది.

గత శ్లోకంలో శాస్త్ర ప్రదానం చేసినదని దయాదేవి స్తుతింపబడింది. ఆ శాస్త్రం చేత జ్ఞానం కలిగిన చేతనులు తిరుమల వేంకటేశ్వరుని చరణాలను ఆశ్రయించారు. కాళ్ళ మీద బడితే దయ పుట్టడం నైసర్గికం. దయ వృషాచల పతి పాదాలయందు ఆవిర్భవించింది.

రూఢాకృపాచలపతేః పాదే:- వృషాచలపతి పాదమందు దయ పుట్టిందంటే ఆ దయ పెద్ద పర్వతం యొక్క దిగువ నేల మీద వ్రేళ్ళు నాటుకొని కల్పతరువుగా మొలిచిందని విశదమవుతున్నది..

ముఖకాంతి పత్రలచ్ఛాయా:- దయాతరువు పెరిగింది. ఇంద్రనీలమణి కాంతుల వంటి భగవంతుని ముఖమందలి కాంతియే దట్టని పచ్చటి యాకుల చేత ఏర్పడిన నీడకల్గియున్నది.

'ఛాయా' శబ్దానికి నీడ, కాంతి అనే అర్థాలున్నాయి. వినతులైన భక్తులు దయా తరుచ్ఛాయచేత సుఖపడుతున్నారు. పాదాలు పట్టుకొన్న భక్తులు భగవానుని వదనమందలి ప్రసన్నతను తలయెత్తి కళ్ళారా సేవిస్తూ ఆనందపడుతున్నారనే భావమూ ఉంది.

వినత వివిధ భూతవ్రాత రక్షైక దీక్ష కలది దయాదేవి. శ్రీ వేంకటేశ్వర చరణార విందాలను ఆశ్రయించిన ప్రాణులందరిని దయాంతరంగుడై భగవానుడు ప్రసన్న వదనంతో రక్షించే దీక్ష కలవాడవుతాడు. Face is index of the mind.

హృదయమందున్న ఆర్ద్రత ముఖమందు ప్రసన్నతగా కనబడుతుంది. సంసార తప్త హృదయులకు ప్రసన్న వదనచ్ఛాయ సుఖాన్ని అనుభవింపజేస్తుంది.

కటాక్ష విటపైః :- దయ కల్పతరువుగా రూపించబడింది. భగవానుని కడగంటి చూపులు ఆ చెట్టు యొక్క కొమ్మలని భావింపబడినాయి. ఆకులతో కూడిన కొమ్మలు గల చెట్టు నీడనిస్తుంది. కటాక్షం విస్తారంగా ప్రసరిస్తుంది కదా!

"జనిపథ పరివృత్తిశ్రాంత విశ్రాంతి శాఖీ" (యతి-సప్తతి 28) జనన మరణరూపమైన సంసార మార్గమందు గమనాగమనాలచే అలసిపోయిన వారికి నీడనిచ్చే కొమ్మలుగల చెట్టు లాంటివాడు యతిరాజు అన్నారు దేశికులు, ఈ మాటతో యతిరాజు కృపా ప్రసన్నులైన ఆచార్యులని స్పష్టమవుతున్నది.

"విస్తారో విటపోஉస్త్రియామ్" వటతి ఆచ్ఛాదయతీతి, విటపః (అమరం) 'విటప' శబ్దానికి చెట్టుకొమ్మ అని అర్థం. చెట్టుకు కొమ్మలు విస్తరించి పరివేష్టించి ఉన్నట్లే కటాక్ష వీక్షణాలు కూడా పలురకాలుగా పరివేష్టించి ఉండడం వల్ల "కటాక్ష విటపైః" అని బహువచనం ప్రయుక్తమైనది.

కరాప చేయ ఫలైః వినతాన్ సుఖయసి:- చెట్టు కొమ్మలు ఊర్ధ్వ ముఖంగా పెరుగుతాయి. "భవంతి నమ్రాస్తరవః ఫలో ద్గమైః" ఫలాలతో నిండిన చెట్ల కొమ్మలు నేలకు తాకునట్లు వంగి ఉంటాయి. సాష్టాంగ ప్రణామం చేసే వారు కూడా నేలను తాకినట్లు పడి ఉంటారు.

శ్రీనివాసుని దయయే చెట్టు, శ్రీనివాసుని ముఖమండల శోభయే నీడ. దయతో కూడిన శ్రీనివాసుని కడగంటి చూపులే ఫలభరితమైన చెట్టుకొమ్మలు. నేలను తాకునట్లు వినతులైన వారు చేతులతో ఫలాలను తెంపుకొనే రీతిగా కోసుకోదగినట్లు దయా తరుశాఖలు నేలకు వంగి ఉన్నాయి. పొడుగు చేతుల వాళ్ళకు లభ్యమయ్యే ఫలాలు భగవత్పాద ప్రణతులై భూమిని తాకునట్లు పడియున్న వారి చేతులకుకూడా అందునట్లు దయా తరువు నమ్రతరమై యున్నదని భావం. సాష్టాంగ ప్రణామం చేసే వారికే ఫలం లభిస్తుంది. "ఉన్నతానామవనతి ర్నతానాం యత్రచోన్నతిః" (పా.స) భగవత్పాదాల ముందు ఉన్నతులు వంగుతారు. వంగి నమస్కరించిన వారు ఉన్నతిని పొందుతారు. భగవదనుగ్రహాన్ని పొందేవారికి భగవత్పాద పద్మమే ముఖద్వారం. భగవత్పాద సన్నిధిలో సాష్టాంగ ప్రణామం చేస్తే భగవంతునికి దయ కలిగి ధర్మార్థ కామాలనే ఫల పురుషార్థాలను పొంది వినతులు సుఖపడుతారని రూపకాలంకారం చేత వర్ణితమైన శ్లోకమిది.

తే॥ అహిగిరీంద్రుని పద రూఢయగుచు కరుణ!
సప్రసాదాస్య రుచిదళ శ్యామ నిబిడ
కరతలగ్రాహ్యా ఫలధురం ధర కటాక్ష
విటపముల ప్రీతి సల్పుదు వినతులకును ॥

20. నయనే వృషాచలేందోః తారా మైత్రీం దధానయా కరుణే!
దృష్టస్త్వయైవ జనిమా నపవర్గ మకృష్టపచ్య మనుభవతి ॥

అర్థం:- హే కరుణే = ఓ దయాదేవీ! వృషాచల + ఇందోః = వృషగిరి యందు చంద్రుని లాగా ప్రకాశించే శ్రీనివాసుని యొక్క; నయనే = కన్నుల యందు; తారా మైత్రీం = కంటిపాపతో స్నేహాన్ని/ చుక్కలతోటి మైత్రిని; దధానయా = ధరిస్తున్నట్టి; త్వయా + ఏవ = నీ చేతనే; దృష్టః = చూడబడిన; జనిమాన్ = పుట్టిన వ్యక్తి; అకృష్టపచ్యం = దున్నకయే పండిన; అపవర్గం = మోక్ష ఫలాన్ని; అనుభవతి = అనుభవిస్తున్నాడు.

తా: ఓ కరుణాదేవీ! వృషగిరియందున్న చంద్రుని యొక్క తారామైత్రిని కలిగియున్న నీవు చూస్తుండగా పుట్టిన జీవుడు ఏ మాత్రమైనా శ్రమపడకుండా మోక్ష ఫలాన్ని పొందుతుంటాడు.

వ్యాఖ్య: భగవద్దయ ప్రసరిస్తుండగా జన్మించిన వ్యక్తి శ్రమ పడకుండా మోక్ష ఫలాన్ని అనుభవిస్తాడని స్తుతి.

మొదటి దశకమందలి చివరి శ్లోకంలో దయాదేవి చతుర్విధ పురుషార్థాలను ప్రసాదించే మహిమ కలదని వర్ణింపబడింది. ఈ ద్వితీయ దశ కాంత మందు జీవుడు జన్మిస్తుండగా దయాదేవి దృష్టిపడితే చాలు, అనాయాసంగా మోక్షఫలాన్ని అనుభవిస్తాడని సుశ్లోకింపబడింది.

ఈ శ్లోకంలో దయాదేవి మోక్షఫలాన్ని అనుభవింప జేస్తుందని ఉండడం వల్ల 19వ శ్లోకంలో దయా తరువు వినతులకు చేతి కందే ఫలాలను అంటే త్రివర్గ ఫలాలను ఇచ్చి సుఖపెడుతుందని పెద్దలు భావించారు.

వృషా చలేందోః:- వృషగిరి యందు న్న చంద్రుడు శ్రీ వేంకటేశ్వరుడు. చంద్రునిలాగా ఆహ్లాద కరుడని అర్థం. "నక్షత్రాణా మహంశశీ"-చుక్కలలో చంద్రుణ్ని

నేను అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో పార్థునితో చెప్పాడు కదా! అంతేకాదు; "యచ్చంద్ర మసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం"-చంద్రుని లోని మహస్సు, అగ్నియందలి తేజస్సూ నాదే అని తెలుసుకో అన్నాడు. కాబట్టి చంద్రుని కంటె బాగా ప్రకాశించే వాడు శ్రీ వేంకటేశ్వరుడు. ఆకాశంలో ప్రకాశించే చంద్రునికి వృద్ధి క్షయాలున్నవి. శ్రీ వేంకటేశ్వరుడు అచలేందుడు, కాబట్టి పెరుగడు, తరుగడు ఆకాశంలోని చంద్రుడు కళంకుడు. ఈయన నిష్కళంకుడు. ఆ చంద్రుడు ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. ఈ చంద్రుడు నిర్వికారుడు, నిత్యశుద్ధుడు, సదైక రూపుడు.

ఇందోఃనయనే తారామైత్రీందధానయా:- అచలేందుని కంటిపాపతో స్నేహం పొందినట్టిది దయాదేవి అని అర్థం. ఆకాశ చంద్రునికి తారల (చుక్కల)తో స్నేహం నిత్యమైనది. అతడు నక్షత్రేశుడు. చుక్కల దొర. తారాపతి. తారలకు భర్త. తారాచంద్రుల ప్రేమకు ఎల్లలు లేవు. వృషాచలేందునికి "చంద్ర సూర్యౌచనేత్రే" సూర్య చంద్రులే నేత్రాలు. చంద్రకాంతా ననుడు అంటే చంద్రుని కంటె అందమైన మొగం కలవాడు ఈ అచలేందుడు; "శీతత్తోదరుళ్ పెత్తు", హిరణ్య కశిపుణ్ని కోపంతో చూచి నప్పుడే ప్రహ్లాదుణ్ని దయతో చల్లని చూపుతో చూచాడని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి

'తారామైత్రీం' అంటే పత్నీ స్నేహమని అర్థం. సహజమైనది.

"తారోనా మౌక్తికే శుద్ధే గురు సుగ్రీవ భార్యయోః ।
బౌద్ధ దేవ్యాం తారకయో స్తారాదౌరూ ప్యవర్ణనమ్ ।
తారమత్యుచ్చనిధ్వాన తరీ సంబంధయోస్త్రిషు ॥"

(శేష నిఘంటువు) 'తార' శబ్దానికి మూడు లింగాలలోనూ అనేకార్థాలున్నాయి. కనుగ్రుడ్డులో ఎదుట నున్న వస్తువు యొక్క కిరణాలు పడి వెనుకకు మరలినప్పుడు ప్రతిబింబమేర్పడుతుంది. అంటే, కన్ను తాను చూచిన వస్తువును ప్రతిబింబించు కొని, ఎదుటి వస్తువును చూస్తుందన్నమాట. సంస్కారవంతుని కన్ను వస్తువు యొక్క రూపు రేఖలను లోతుగా పరిశీలించగలుగడమే కంటిపాప లక్షణం. దీన్నే 'తారామైత్రి' అంటారు.

'తారామైత్రీ చక్షూరాగః' అని రెండు లోకంలో వేర్వేరుగా వర్ణింపడుతాయి. కాని ఇక్కడ 'నయనే తారామైత్రీం' అని ఐక్యంగా వర్ణితం. "ఇయమమృతవర్తి

ర్నయనయోః" అన్నట్లున్నది దయాదేవి. చంద్రునికి తారల యందు ప్రియపత్నీత్వ మెట్లు సహజమో అట్లే శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క కంటి యందు దయాదేవి 'తారామైత్రి' ని దాల్చి, సహజమైన పత్నిగా నెలకొని యున్నది.

త్వయైవ దృష్టఃజనిమాన్:- దయా దేవి చేతనే చూడబడిన పుట్టుక కలిగిన జీవుడు అని అర్థం.

"జాయమానం హి పురుషం యం పశ్యేన్మధుసూదనః ।
సాత్త్వికః సతు విజ్ఞేయః సవైమోక్షార్థ చింతకః ॥"

జన్మిస్తున్న ఏ జీవునిపైన భగవత్కృపా కటాక్షం ప్రసరిస్తున్నదో ఆ జీవుడు సాత్త్వికుడై, సదాచార్య సంబంధం వల్ల తురీయ పురుషార్థమైన మోక్షం కోసమే చింతిస్తుంటాడు. "సోమవత్ ప్రియదర్శనః" అన్నట్లు చంద్రునిలాగా ప్రియదర్శనుడైన శ్రీ వేంకటేశ్వరుని యొక్క దయాన్విత దృష్టి సాత్త్వికత్వాన్ని, మోక్షార్థచింతకత్వాన్ని కలిగిస్తుందన్న ప్రామాణిక సూక్తి ఇది.

అకృష్టపచ్య మపవర్గమనుభవతి:- దయాదేవి దృష్టిజీవుని పై ప్రసరించిన ఫలితంగా అతడు అయత్న సిద్ధమైన మోక్ష ఫలాన్ని అనుభవిస్తాడు. "స్వేనరూపేణాభినిష్పద్యతే" (ఛాం. ఉప) భగవంతుని స్వరూపంతో సమాన రూపమూ, "అపహతపాప్మా విజరో విమృత్యుః" ఇత్యాది గుణాష్టకా విర్భావమూ కలిగి బ్రహ్మానందాన్ని అనుభవించడమే మోక్ష ఫలానుభవమని ఉపనిషత్తు బోధిస్తుంది. అట్టి మోక్షం కూడా కృషి చేయకుండా ఫలం అనుభవించినట్లుంటుందని అంటున్నారు దేశికులు. ఇది విచిత్రమే. కారణం లేకుండా కార్యం జరుగడం ఎలా సాధ్యమవుతుంది?

"సుఖేనలభ్యా దధతః కృషీవలై రకృష్టపచ్యా ఇవసస్య సంపదః ।
వితన్వతి క్షేమ మదేవ మాతృకా శ్చిరాయతస్మిన్ కురవశ్చకాసతి ॥"

(కిరాతార్జునీయం 1-17) వాననీటితో పంటలుపండే భూములను దేవమాతృకలంటారు. వాన లేకుంటే దేశంలో కరువు ఏర్పడుతుంది. కర్షకులు చాలా శ్రమపడవలసి వస్తుంది. దేశాన్ని పరిపాలించే రాజు ప్రజల అభ్యుదయానికి

పాటుపడి నదులకు ఆనకట్టలు వేసి, కాల్వల ద్వారా చెర్వులను నీటితో నింపితే రైతులు అధికశ్రమ పడకుండా ధాన్యాదులైన పంటలు పండే దేశంగా పరిణమిస్తుంది. నదుల నీటితో పంటలు పండే భూములను నదీ మాతృకలంటారు. ప్రజారంజకుడైన ప్రభువు కురుదేశపు భూములను నదీ మాతృకలుగా మార్చినందువల్ల కృషీవలులు ఎక్కువ కష్టపడకుండా ధాన్యాది సంపదలను సుఖంగా పొందుతూ, ప్రజలు కరువు కాటకాలు లేకుండా జీవిస్తున్నారని శ్లోకార్థం. ఈ శ్లోకంలో సస్య సంపదలకు అకృష్టపచ్యాః అనే విశేషణ పదం ఉంది. "కృష్టేన పచ్యంత ఇతి కృష్టపచ్యాః, తద్విపరీతాః అకృష్టపచ్యాః" - దున్నడం చేత పండే సస్యసంపదలు కృష్టపచ్యాలు. కృష్టపచ్యాలు కానివి అకృష్టపచ్యాలు. దున్నకుండగనే ధాన్యాది సంపదలను కృషీ వలులు అనుభవిస్తున్నారని భారవి రచించిన శ్లోకమిది.

దేశికులు ఈ దయాశతకంలో అపవర్గానికి విశేషణంగా 'అకృష్టపచ్యం' అనే పదాన్ని ప్రయోగించడం గమనీయం. కర్మ జ్ఞాన భక్తి యోగాలు మోక్ష ప్రాప్తికి సాధనాలు. "నోత్తనోన్బిలేన్" అన్నట్లు ఈ జీవుడు ఏ నోమూ నోచలేదు. భక్తి ప్రపత్తులనే సాధనాలను అనుష్ఠించకుండా సాధ్యమైన మోక్షఫలం లభింప శక్యం కాదు కదా! అందువల్ల కర్మజ్ఞాన భక్తియోగాలనే సాధనాలుండే చోట భగవద్దయ నిల్చియున్నది. "అక్షరాణామకారోఽస్మి" (భ.గీత.) 'అకారార్థోవిష్ణుః" అకారం భగవద్వాచకం కదా! శ్రీ వేంకటేశ్వర స్వామి కను పాపలో నిల్చియున్న దయాదేవి చూడడమే కృషి. కాబట్టి అకారం యొక్క కృషిచేతనే పచ్యమైనది అకృష్టపచ్యం.

త్రికాలాలలో మనోవాక్కాయాలనే కరణ త్రయం చేత చేయబడే పాపాలను క్షమించే వాడు భగవానుడే. భగవద్రామానుజులు, తనను ఆశ్రయించిన శిష్యప్రశిష్యుల క్షేమం కోసమే, బద్ధాంజలియై భగవానుణ్ని ప్రార్థించారు. శరణాగతి చేశారు. భగవదనుగ్రహం చేత ఉభయ విభూతులకు నాయకత్వాన్ని పొంది 'ఉడయవరు' లనే పేరుగాంచినారు. మూగవారికీ, అంధులకూ మోక్షఫలాన్ని లభింప జేశారు. జగదాచార్యులు ఎంత శాంత స్వభావం కలవారో కదా!

"మధురై రవశాని లంభయ న్నపి తిర్యంచి శమం నిరీక్షితైః ।
పరితః పటుబిభ్ర దేనసాం దహనం ధామవిలోకన క్షమమ్ ॥" (కిరా 2-55)

వేదవ్యాస మహర్షి యొక్క తేజః పుంజం సమస్త పాపాలను దహింప జేస్తుంది. అయితే, అది చూడరానంత తీక్ష్ణమైనది కాదు, మధురమైన అంటే ప్రసన్నమైన చూపులతోనే ఆ మహర్షి సహజ వైరం గల మృగపశు పక్ష్యాదులలో కూడా ఉద్రేకాన్ని పోగొట్టి శాంత స్వభావాన్ని కలిగించేవాడు; అనే భారవి శ్లోకాన్ని శ్రీ పరాశర భట్ట పాదులు (వి.స.నా) శాన్త (589) నామానికి 'భగవద్గుణ దర్పణం' అనే తమ భాష్యంలో ఉదహరించారు.

"పరిపూర్ణ బ్రహ్మానుభవజనిత ప్రీతికారిత తచ్చరణారవింద నిత్యకైంకర్య రసరూప"మైన మోక్షానందాన్ని శ్రీనివాసుడు ప్రసాదించడానికి ఆయనకు అనపాయిని యైన దయాదేవియే కారణమని రెండవ పత్తు ముగింపబడింది. ఈ శ్లోకమందు తృతీయ దశకాది శ్లోకార్థం సూచింపబడింది.

ఆ॥ శేషశైల చంద్రు శ్రీనాథు నయనతా
రాసఖిత్వ మీవు రమణదాల్చి
యనఘు నొకని జూడ నతడు యత్నము లేక
బంధముక్తి సుఖము బడయు కరుణ!

ద్వితీయ దశకం సమాప్తం

తృతీయ దశకం

21. సమయోపనతైస్తవ ప్రవాహై రనుకంపే! కృతసంప్లవా ధరిత్రీ।
శరణాగత సస్యమాలినీయం వృషశైలేశ కృషీవలం ధినోతి ॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! తవ = నీ యొక్క; సమయ + ఉపనతైః = తగిన వేళలో పొందింపబడిన; ప్రవాహైః = ప్రవాహాల చేత; కృత సంప్లవా = బాగా తడుపబడినట్టిది; (అత ఏవ = కాబట్టి) శరణాగత సస్య మాలినీ = ప్రపన్నులనే పైరుల పరంపరను కలిగిన; ఇయం = ఈ; ధరిత్రీ = భూమి; వృషశైలేశ కృషీవలం = వృషాద్రీశుడైన శ్రీనివాసుడు అనే కర్షకుణ్ని; ధినోతి = సంతోషింప జేస్తున్నది.

తా: ఓ దయాదేవీ! నీవు తగిన సమయాన ప్రవహించడం వల్ల భూమి తడుపబడుతున్నది. అందువల్ల శరణాగతులనే సస్య సమృద్ధిగల ఈ భూమి ధర్మగిరి మీద నిల్చి చూస్తున్న శ్రీ వేంకటేశ్వరుడనే భూనాయకుణ్ని సంతోషింప జేస్తున్నది.

వ్యాఖ్య: దయాదేవి జీవాత్మలకు, పరమాత్మకు చేసే ఉపకారం వర్ణింపబడుతున్నది.

క్రింది శ్లోకంలో అకార వాచ్యుడైన శ్రీనివాసుడే కృషీవలుడనీ, ఆయన దయచేతనే మోక్ష ఫలాన్ని జీవులనుభవిస్తున్నారని వర్ణింపబడింది.

ఈ మూడవ పత్తులో భగవత్కృప వల్ల చేతనులు సమయాన్ని బట్టి ప్రపన్నులవు తారు, వారు మోక్ష ఫలాన్ని అనుభవిస్తున్నప్పుడు సంతోషించేవాడు భగవానుడే అని విశదీకరింపబడుతున్నది. భగవానుడే ప్రాపకుడు, ఉపాయభూతుడు. అంటే జీవులు తనను పొందదానికి కృషి చేసేవాడు శ్రీనివాసుడు అని అర్థం. కృషి ఫలించి జీవాత్మలు పొందే ఫలం కూడా తాను; అంటే ఉపేయమూ, ప్రాప్యుడూ శ్రీనివాసుడే అని అర్థం. ఇందుకు ప్రధాన కారణం దయాదేవియే అని, దయాదేవి యొక్క మహిమను తెల్పుతున్నది ఈ తృతీయ దశకం.

ఈ దశకంలో 'ఔపచ్ఛందసికం' అనే వృత్తం ఉపయోగింపబడింది. ఈ వృత్తం యొక్క మొదటి పాదమందు, మూడవ పాదమందు పదకొండు అక్షరాలుంటాయి. రెండవ, నాల్గవ పాదాలలో పంద్రెండు అక్షరాలుంటాయి. కాబట్టి ఇది మాత్రావృత్తం. ఉపచ్ఛంద మంటే ఆహ్లాదపరచడం. ఆధ్యాత్మిక వ్యవసాయ క్షేత్రంలో కృషీవలుడు జీవులకు ముక్తిఫలాలను పండించడానికి దోహదపడుతున్నందువల్ల జీవులను ఆహ్లాదపరుస్తుంది దయాదేవి. ప్రపన్నులు పొందే ముక్తి ఫల రసాస్వాదనను చూచి తన్మయుడైన కృషీవలునికి ఆనందాన్ని చేకూర్చేది దయా దేవియే. దయాదేవిచే జీవులకు ఉపచ్ఛందనం, దయచేతనే వృషశైలేశుడైన శ్రీనివాసునికీ ఉపచ్ఛందనం. ఈ విధంగా దేశికులు దయాదేవిని కూడా ఉపచ్ఛందనం చేశారు.

అనుకంపే:- కంపమంటే వణుకడం. కష్టాలను భరించలేక వణుకుతున్న ప్రాణులను చూచితాను కూడా వణుకుతూ వారి దుఃఖాన్ని తొలగించే ఉపాయ శాలినియైన దయాదేవిని సంబోధించే పదమిది. ఓ దయాదేవీ! అని అర్థం.

సమయోపనతైః తవప్రవాహైః:- దేవుని దయవల్ల వర్షాలు పడిన నీటిని నిల్వచేయడానికి నదులకు ఆనకట్టలు వేస్తే, ఆ నీటిని రైతులు వర్షాలు లేని కాలాన కాల్వల ద్వారా పారించి భూములలో తగినరీతిగా పంటలు పండించుకొంటారు.

"దేశోనద్యంబు వృష్ట్యంబు సంపన్న వ్రీహిపాలితః ।
స్యాన్నదీమాతృకో దేవమాతృకశ్చ యథాక్రమమ్ ॥" (అమరం)

నదీజలం చేత పండే పైర్లు గల దేశం నదీమాతృకమని, వర్షోదకం వల్ల పంటలు పండే దేశం దేవమాతృకమని నిఘంటువు చెబుతుంది.

పైరు పండించడానికి అనుకూలమైన సమయాన పారేది దయా ప్రవాహం. కాబట్టి, నదీ మాతృక భూముల్లో సముచిత సమయాన పంటలుపండించడానికి నీటిప్రవాహాలు పెద్ద కాలువల ద్వారా పారింపబడుతాయి.

కృతసంప్లవా ధరిత్రీ:- ఎండలకు బీటలు పారిన భూమిలో నీటిని బాగా పారిస్తే దున్నడానికి ఉపయోగపడుతుంది. కాబట్టి దయా ప్రవాహాలచే భూములు బాగా తడుపబడుతాయి. బాగా తడిసిన నేలలోనే రైతు దున్ని, మడులు గట్టి నీటిని నిల్పి ఎరువులు వేసి, విత్తనాలను చల్లుతాడు. విత్తనాలు మొలకెత్తిన తర్వాత వాటిని

పొలాలలో విస్తారంగా నాటుతాడు. మిట్ట పంటలకు అప్పుడప్పుడు నీరు పెట్టడం అవసరం. వరి, చెరుకు మొదలైన పల్లపు పంటలకు నాటువేసిన తర్వాత పైర్లు పెరుగుతుండగానూ ఎప్పుడూ పుష్కళంగా నీరు పెడుతూ, కలుపు దీయడం ఆవశ్యకం రెండు మూడు సార్లు కలుపుదీసి నీటిని తగినట్లు పారిస్తుంటే పైర్లు చూడముచ్చటగా పెరుగుతుంటాయి.

శరణాగత సస్యమాలినీ:- శరణాగతులైన సస్యములను వరుసగా ధరించింది కాబట్టి ధరిత్రి అని భూమికి పేరు. పొట్టకు వచ్చిన పంట అంటే చక్కగా పండిన పైర్లు వరుసగా వెన్నుల బరువుకు వంగినప్పుడు ధరిత్రి (భూమి) శోభ కన్నుల పండుగగా ఉంటుంది.

సస్యాని మలతే ఇతి = సస్యమాలినీ అని విగ్రహ వాక్యం. 'మల-ధారణే' అనే ధాత్వర్థం వల్ల 'పైర్లను ధరించేది' అని అర్థం కలిగిన ఈ పదం 'ధరిత్రి' అనే పదానికి విశేషణం.

వృషశైలేశ కృషీవలం: ఈ కృషీవలుడు ధర్మ స్వభావం గల కొండదొర. ఎంతో సంపద కలవాడైనప్పటికీ ఈ కొండ దొర కృషి చేయడమే ధర్మమని భావిస్తాడు. విశాలమైన భూమిలో పంటలను పండించే ఈ కర్షకుడు, పండిన పైరును కాపాడుకోవడానికి ఎత్తైన మంచె మీద నిలిచి కాపలా కాస్తున్నట్లే, పెద్దకొండ మీద నివసిస్తున్నందు వల్ల కొండదొర అని పేరుపొందాడు. కృషిః అస్య అస్తి ఇతి = కృషీవలః - కృషి కలవాడని అర్థం. 'రజః కృషీ' త్యాది పదాలకు 'వలచ్' ప్రత్యయ మేర్పడినందువల్ల కృషీవలుడనే పదం సిద్ధిస్తున్నది.

ఇయం ధరిత్రీ కృషీవలంధినోతి:- 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని ఆభాణకం. కృషి వల్ల కరువు ఉండదు. భూమి కృషి చేసే వాణ్ని ఎన్నడూ చెరుపదు. ఎంత బాగా కృషి చేస్తే అంత లెస్సగా సస్య సంపదనిచ్చే ధరిత్రి కృషీవలుణ్ని ఆనంద పరుస్తుంది. అతడే భూనాయకుడు అని ప్రజలు ప్రీతితో కీర్తించే విధానానికి హేతువు భగవద్దయా ప్రభావమే.

సమయోపనతైః:- సమయమంటె శపథం, ఆచారం, కాలం, సిద్ధాంతం, జ్ఞానం, సంకేతం, అవసరం, నియమం అని అనేకార్థాలున్నాయి.

"సమయాః శపథాచార కాలసిద్ధాంత సంవిదః" (అమరం)

"సంకేతే సమయః ప్రోక్తోనియమేఽవసరేపిచ" (శేష నిఘంటువు)

సంసార తాపత్రయం చేత గుండెలు ఎండిపోయి బండబారిన చేతనులను ఎపుడు, ఎలా రక్షించాలో దయాదేవికి తెలియనిది కాదు. సమయమంటే సిద్ధాంతమనీ, జ్ఞానమనీ ఇక్కడ సందర్భోచితమైన అర్థం. భగవద్దయా ప్రభావం వల్ల యామునాచార్యులు, భగవద్రామానుజులు మొదలైన ఆచార్యులు, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రవర్తింపజేశారు. వారి సిద్ధాంత ప్రచారం చేత తాపతప్తులైన చేతనులను రక్షించడానికి ఉచిత సమయమని దయాదేవి తన ప్రభావాన్ని అనేక స్థలాలలో పలు రకాలుగా ప్రసరింపజేసింది.

కృతసంప్లవా:– చేతనుల ఎండిపోయిన గుండెలను చూచి దుఃఖ ప్రహాణేచ్ఛ గలది కాబట్టి అనుకంప తన దయారస ప్రవాహాల చేత తడిపి తాపాన్ని చల్లార్చింది. చేతనులపైన దయార్ద్ర భావం కలిగిందన్న మాట.

శరణాగత సస్యమాలినీ:– భగవద్రామానుజ సిద్ధాంతమే భగవద్దయను ఈ ధరిత్రికి తీసుకొని వచ్చినందు వల్లనే చేతనులు శరణవరణులయ్యారు. రామానుజ సిద్ధాంత ప్రచారం చేత భగవానుని యందు రుచి కలిగి అతడే ప్రాప్యుడు – పొందదగినవాడు, ఉపేయం అనుభవించడానికి సిద్ధమైన ఫలం అని తెలిసి శరణాగతులైన–భరన్యాసం చేసిన–ప్రజలు అధికమైనారు. శరణాగతులు అనే సస్యమాలిని అయింది ఈ ధరిత్రి. శరణాగతులైన ప్రజామాలయే సస్యమాలా. సాత్త్వికులైన ప్రజలను ధరించడం వల్ల 'ధరిత్రి' అని అన్వర్థ నామం ఏర్పడింది. శరణాగతి అంటే ప్రపత్తి అని అర్థం కదా!

శరణాగత సస్యమాలినీయం
తవముక్తామణి రశ్మినిర్ఝరౌఘైః ।
నను రంగ ధురీణ పాదరక్షే
జగతీనిత్య మదైవ మాతృ కాభూత్॥ (పా.స. 613)

ఓ రంగధురీణ పాదుకా! ప్రపన్నులు అనే సస్యాన్ని ధరించే ఈ భూమి నీ ముక్తామణుల కిరణాలు అనే జల ప్రవాహ సమూహాలచే ఎల్లప్పుడు 'నదీ మాతృక' అయింది అని భగవత్పాదుకలను దేశికులు స్తుతించారు.

కర్మజ్ఞానభక్తియోగాలను అనుష్ఠించడం చాలా కష్టం. 'సర్వ రక్షకుడు వాసుదేవుడే' (వాసుదేవః సర్వం ఇతి) అని మహా విశ్వాసంతో ప్రపత్తిని అనుష్ఠించే వారికి, సర్వకర్మలను నశింప జేయడానికి భగవద్దయ తప్ప మరొక ఉపాయం లేదు. శ్రీ మద్రామాయణం దీర్ఘ శరణాగతి శాస్త్రమని నొక్కి చెప్పింది విశిష్టాద్వైత సిద్ధాంతమే. శరణాగతి రూపమైన హితాన్ని ప్రదర్శించిన సమయమది. "యతి పతి యామునావతారానంతరం ప్రపన్న బాహుళ్యమ్; తత్పూర్వం విరళాః ప్రపత్తారః " యామున మునులు, భగవద్రామానుజులు అవతరించిన తర్వాత ప్రపన్న జనులు అధికమయ్యారు. అంతకుముందు ప్రపత్తిని అనుష్ఠించిన జనుల సంఖ్య చాలా తక్కువగా ఉండిందని దేశికులు తమ 'నిక్షేపరక్ష' అనే గ్రంథంలో వ్రాశారు.

ఇయంధరిత్రీ:- ప్రపన్న జనులనే మాలలను ఈ భూమి ధరించింది. ఇయం - 'ఈ' అని నిర్దేశ సర్వనామ శబ్ద ప్రయోగం వల్ల శరణాగతుల సంఖ్య పెరిగిందన్న విషయం దేశికులకు ప్రత్యక్షానుభవమని విశదమవుతున్నది.

ధరిత్రీ వృషశైలేశ కృషీవలంధినోతి:- మాలాలంకృతయైన పత్ని భర్తను సంతోషింప జేస్తుంది. వేంకటాచలం పాప నాశకం. వృషశైలం ధర్మగిరియే ఈ కొండల రాయడే కృషీవలుడు. ఈ ఉన్నతమైన, ఉత్తమమైన క్షేత్రంలో నివసించి అఖండమైన భూమిలో కృషిచేస్తున్నందువల్ల ప్రపన్న జనమాలినియైన ఆ భూమి, కృషీవలుడైన తన భర్తకు - భూనాయకుడైన శ్రీనివాసునికి-చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్న విషయం యథార్థంగా దయాదేవి చేస్తున్న ఉపకారమే అని స్పష్టమవుతున్నది.

రూపకాలంకార ప్రాణితమైన హేత్వలంకార సజ్జిత మీ శ్లోకం.

మంజుభాషిణి॥ ఉరగాద్రివర్తి కృషి యొప్ప నీవు మే
దుర సంప్రవాహముల దోడ్పడన్ దయా!
శరణాగతానుపమ సస్యమాలయై
ధర క్రాలజూచి హరి తాల్చుమోదమున్ ॥

22. కలశోదధి సంపదో భవత్యాః కరుణే! సన్మతిమంథ సంస్కృతాయాః।
అమృతాంశమవైమి దివ్యదేహం మృతసంజీవన మంజనాచలేందోః ॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! అంజన + అచల + ఇందోః = అంజనాద్రియందు చంద్రునిగా వెలిగే శ్రీనివాసుని యొక్క; మృత సంజీవనం = మరణించిన వారిని బాగా జీవింప జేయునట్టి; దివ్యదేహం = అప్రాకృతమైన విగ్రహాన్ని; కలశ+ఉదధి సంపదః = పాలకడలి యొక్క సంపత్తిని కలిగినట్టి; సత్+మతి, మంథ సంస్కృతాయాః = భగవంతుని సంకల్పమనే / సజ్జనుల ప్రార్థన అనే కవ్వం చేత చిల్కబడిన; భవత్యాః = నీ యొక్క; అమృత+అంశం = సుధా సారంగా; అవైమి = అనుకొంటున్నాను.

తా: ఓ దయాదేవీ! అంజనాద్రి యందు పూర్ణచంద్రుని లాగా ప్రకాశించే శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క దివ్య రూపం మృతప్రాయులను జీవింప జేయునట్టిది. నీవు క్షీరసాగర సంపద కలదానవు. పాలకడలిని మందరగిరిచే త్రచ్చగా అమృతం జనించిన విధంగా, భగవత్సంకల్పం లేదా సత్పురుషుల బుద్ధి అనే కవ్వం చేత నిన్ను చిల్కగా, నీ యొక్క అమృతాంశమే శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహమని భావిస్తున్నాను.

వ్యాఖ్య: శ్రీ వైకుంఠ నాథుడు దివ్యమంగళ విగ్రహంతో అంజనాద్రి మీద అర్చావతారుడై ఆవిర్భవించడం కేవలం దయాదేవి కృత్యమని వర్ణింపబడుతున్నది.

ఆగమ శాస్త్ర ప్రకారంగా భగవానుడు ఐదు (5) విధాలుగా ఉంటాడు. (1) పరత్వం: 'ఆవరణ జలంబోలే పరత్వమ్' ప్రకృతి మండలానికి ఆవల పదిరెట్లుండే ఆవరణజలం లాంటిది పరత్వం. "వైకుంఠేతు పరేలోకే శ్రియాసార్థం జగత్పతిః। ఆస్తే విష్ణురచింత్యాత్మా భక్తైర్భాగవతైః సహ॥" అన్నట్లు శ్రీ వైకుంఠమనే పరమ పదమందు జగన్నాథుడు లక్ష్మీదేవితో కూడి, నిత్యసూరుల చేతనూ, ముక్తాత్మల చేతను సర్వదా సేవింపబడుతూ ఆనందమయుడై ఉంటాడు. ఈ పరత్వమే శ్రీమన్నారాయణుడు లేదా పరవాసుదేవుడనబడుతాడు. ప్రపన్నులకు శరీర వియోగమైన తర్వాతనే పరత్వం ఉపయోగపడుతుంది. అట్టి పరత్వం ఇక్కడ లభింపదు.

2) వ్యూహం:- "పాఱ్కడల్‌పోలే వ్యూహం" ప్రకృతి మండలమందే ఉన్న క్షీర సముద్రం లాంటిది వ్యూహం. సనకసనందాదుల కు తప్ప బ్రహ్మాది దేవతలకూ సేవింప శక్యం కానిది.

3) విభవం:- "పెరుక్కాఱు పోలేవిభవంగళ్" వర్షాకాలంలో ప్రవహించే నదుల లాంటి రామకృష్ణాద్యవతారాలే విభవాలు. అవి ఎల్లకాలం ఉండేవి కావు.

4) అంతర్యామి:- హృదయంలోనే ఉండి నియమించే పరమాత్మ 'భూగత జలంబోలే అంతర్యామిత్వం'. భూమిలోపల ఉండే నీరు లాగా పైకి కనబడనిది. యోగులకు మాత్రమే ధ్యానగమ్యమై సామాన్యులకు దర్శింప వీలుకానిది అంతర్యామిత్వం.

5) అర్చారూపం:- "అతిలే తేంగిన మడుక్కల్ పోలే అర్చావతారం" వాన నీరు నిల్చి ఉండే సరస్సుల వంటివి అర్చావతారాలు. కాబట్టి పరవ్యూహ విభవాంతర్యాములు దుర్లభాలు.

"అర్చక పరాధీన అఖిలా త్మస్థితిః" అన్నారు శ్రీ పరాశరభట్టర్. ఆరాధించే భక్తులకు అధీనమైన అన్ని విధాలైన స్థితి ప్రవృత్తులు కలవాడు అర్చామూర్తి.

"స్వతంత్రః సజగన్నాథోఽ ప్య స్వతంత్రో యథాతథా।

సర్వశక్తిర్జగద్ధాతాఽ ప్యశక్త ఇవచేష్టతే ॥"

అన్నట్లు సర్వజగత్తును ధరించే సర్వశక్తిమంతుడైనప్పటికీ తన స్వాతంత్ర్యం, శక్తి తగ్గినట్లు కనబడడానికి కారణం సర్వేశ్వరుని సంకల్పమే. అంతేకాదు, తనకేమీ శక్తిలేనట్లు తన ఉనికికీ, తన కదలికలకూ తన భక్తుల సంకల్పమే తప్ప తన సంకల్పం కారణం కాదన్నట్లు అర్చామూర్తి ఉండడం వల్ల ఆ సర్వేశ్వరుని వాత్సల్య, సౌలభ్య, సౌశీల్యాది గుణాలు ప్రకాశిస్తున్నాయి.

ఇట్టి భగవచ్ఛాస్త్రార్థాన్ని దేశికులు నిరుపమానమైన తమ కవితా శిల్ప నైపుణ్యాన్ని ఈ దయా శతకమందు ఆవిష్కరించారు.

గత శ్లోకమందు శరణాగత సస్యమాలిని జూచి కృషీవలుడైన శ్రీనివాసుడు సంతోషించాడని వర్ణితం. సంసారులు శరణాగతి చేయడానికి యోగ్యమైనది అర్చామూర్తియే కదా!

"మూర్తం బ్రహ్మతతోఽపియత్ ప్రియతమం రూపం యదత్యద్భుతమ్" (చతుః శ్లోకి 4) భగవంతుని దివ్యాత్మ స్వరూపం – పరబ్రహ్మమనబడే జ్ఞానానంద స్వరూపం కంటెనూ, ఆ స్వరూపంలో ఉండే అసంఖ్యాక కల్యాణ గుణాలకంటెనూ లోకసంరక్షణార్థమై అవతరించిన సాకారమైన బ్రహ్మ అనబడే (అర్చావతారం యొక్క) దివ్యమంగళ విగ్రహం చాలా ప్రియమైనది, అద్భుతమైనది అని యామునాచార్యులు అన్నారు. అట్టి దివ్యమంగళ విగ్రహం భగవంతునికి లభించడం దయాదేవి యొక్క ఉపకారమని శ్లోకంలో చెప్పబడుతున్నది.

సస్యవృద్ధికి అంటే చెట్లు, చేనులు బాగా పెరిగి ఫలించడానికి దోహదపడేవాడు చంద్రుడు. "విధుః సుధాంశు శుభ్రాంశు రోషధీశో నిశా పతిః" (అమరం) ఇక్కడ అమృత కిరణుడు, ఓషధీశుడు, రజనీనాథుడు అనే అన్వర్థ నామధేయుడైన చంద్రుడు పాలకడలిని చిల్కినప్పుడు అందు పుట్టిన కల్పతరువు, కామధేనువు కౌస్తుభం, అమృత కలశం మొదలైన వాటితోపాటు పుట్టినవాడు అమృతకిరణుడైన చంద్రుడు.

కలశోదధి సంపదో భవత్యాః :– అమృత కలశం పుట్టినందు వల్ల క్షీరాబ్ధికి కలశోదధి అనే పేరు సార్థకమైనది. దయా దేవి పాలకడలిగా నిరూపింప బడింది. కాబట్టి దాని నుంచి జనించిన సంపద దయాదేవి సంపదయే అవుతుంది కదా! పాల వంటి లేదా పాల నుంచి జనించే వెన్నలాంటి హృదయం కలది దయాదేవి. భగవానుడు తన సంకల్పం చేత స్వేచ్ఛ చేత శ్రీదేవి కోసం క్షీరాబ్ధిని మథించాడు. దయాదేవి ఇతరులను మథించదు, తనలో తానే జగద్ధితార్థమై మథన పడుతుంది. తనను తాను త్రచ్చుకోగా జనించిన సంపదంతా దయాసంపదయే అని భావం.

కరుణే! సన్మతి మంథ సంస్కృతాయాః :– పాలకడలి మథనం చేత సంస్కరింప బడింది. మందరగిరి అనే కవ్వం చేత చిల్కబడింది పాలకడలి. సన్మతియే మందరగిరి. సతః మతిః = సన్మతిః. "ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రి విధః స్మృతః" (భ.గీ. 17.23) 'ఓం, తత్ సత్' అనే మూడు పేర్లు పరబ్రహ్మకు చెప్పబడినాయి. "ఏకంసత్ విప్రాః బహుధా వదన్తి". ఒక్క 'సత్' అనే పదానికి విశేష ప్రజ్ఞగల వ్యక్తులు అనేక విధాలుగా చెబుతున్నారని శ్రుతి. కాబట్టి సద్వాచ్యుడైన భగవానుని బుద్ధి లేదా సంకల్పమే సన్మతి అనబడుతుంది.

క్షీరసాగర సంపత్తు లాగా దయాదేవికి శీతలత్వం, గంభీరత్వం, మధురత్వం, మహత్త్వం అనే గుణాలున్నాయి. దయ అనే క్షీర సముద్రం భగవంతుని మతి అంటే సంకల్పం అనే కవ్వం (మందగిరి) చేత చిల్కబడింది.

"సన్మతి సంస్కృతాయాః" అనే చోట సత్+మతి అంటే సత్పురుషుల బుద్ధి - ఋషులు, ఆళ్వారులు అనే వారందరు ప్రసన్నహృదయులై భగవత్సాక్షాత్కారాన్ని పొందడానికి తమ బుద్ధి బలం చేత ప్రార్థన చేశారు.

"అస్తి బ్రహ్మేతి చేద్వేద, సంతమేనం తతోవిదుః" (శ్రుతి) పరబ్రహ్మ ఉన్నాడని తెలిసిన వాడే - బ్రహ్మవిదుడు - సత్పురుషుడు అని వేదవాణి. అట్టి సత్పురుషుల ప్రార్థన అనే (మందరగిరి) కవ్వం చేత చిల్కబడిన (భగవంతుని) దయా సముద్రుడని చెప్పవచ్చు.

జ్ఞానవైరాగ్య భూషణుడైన వేదాంత దేశికులు కూడా సచ్ఛబ్దవాచ్యుడే. కాబట్టి కవియొక్క పదునైన ధీశక్తి అనే మందరగిరిచే మథించబడింది. దయాక్షీరాబ్ధి అని కూడా భావించవచ్చు.

అంజనాచలేందోః:- దయాక్షీరాబ్ధిని మథించగా ఉదయించిన పదార్థాలలో చంద్రుడొకడు. చంద్రుడు సస్యసమృద్ధిని కలిగించే ఓషధీశుడే కాక నిశాపతి అంటే రేరాజు కదా! అంజనాద్రి అంటే కాటుక కొండ. చల్లని నల్లని చీకటి లాగా ఉండే చట్టు మీద వెలిగే చంద్రుడు శ్రీ వేంకటేశ్వరుడే. ప్రాకృతిక చంద్రుని కళలకు పెరుగుడు, తరుగుడు ఉంది కాని, అంజనా చలేందుడు ఎల్లప్పుడు షోడశ కళాపూర్ణుడే. సంసార కాళరాత్రి యందున్న అజ్ఞాన తిమిరాన్ని అణచివేసే పూర్ణ చంద్రుడు శ్రీనివాసుడే కదా!

"పుష్ణామి చౌషధీస్సర్వాః సోమోభూత్వారసాత్మకః" (భ.గీత) రస స్వరూపుడనై అంటే అమృతమయుడైన చంద్రుడనై వనస్పతులన్నిటికి పుష్టి చేకూరుస్తాను అన్న భగవద్వాక్యం ఇక్కడ స్మరింపదగినది.

"నక్షత్రాణా మహం శశీ" (భ.గీత. 10-21) చుక్కల్లో చంద్రుణ్ని నేనే అని భగవానుడే స్పష్టంగా పలికాడు కదా!

అమృతాంశ మవైమిదివ్యదేహం మృత సంజీవనమ్:- మృతులను అంటే మరణించినవారిని బ్రతికించే లక్షణం సంజీవని అనే ఔషధ మూలికకు ఉంది. మృతసంజీవని అనే విద్య కూడా ఉంది. దాని ప్రభావమెట్టిదో 'కచదేవయాని' అనే పురాణ కథవల్ల తెలుస్తుంది. అంజనా పుత్రుడైన హనుమంతుడు మహౌషధియైన సంజీవని స్పష్టంగా కనబడనందువల్ల సంజీవన పర్వతాన్నే పెకలించి తీసుకొని వస్తే, రామలక్ష్మణులతో పాటు అనేక వానరులు కూడా దాని వాసన తగులగానే మూర్ఛనుంచి ఉల్లాసంగా లేచి ఉత్సాహవంతులైనట్లు రామరావణయుద్ధ కాండ తెల్పుతుంది. శ్రీ వేంకటేశ్వరుడే చంద్రుడు. ఆయన దివ్య దేహం అమృతాంశం.

లెక్కలేనన్ని పాతకాలు చేసిన జీవులు మృతప్రాయులే. క్షీరాబ్ధితో సమానమైన దయాసాగరాన్ని సన్మతి అనే మందరగిరిచే సంస్కరించ (మధించ)గా దయా కలశోదధి సంపదలో ముఖ్యమైనది అమృతమయమైన దివ్యదేహం. 'దిహ-ఉపచయే' అనే ధాతువు వృద్ధిని తెలుపుతుంది. కాబట్టి 'దేహ' శబ్దం వల్ల అభ్యుదయం గోచరిస్తుంది. "ఆవిరించా దమంగళం" చతుర్ముఖ బ్రహ్మ దేవుని శరీరం మొదల్కొని సంసారులందరి శరీరాలు అపవిత్రమైనవే కదా! దయా దేవి సంస్కారం వల్ల దివ్యమంగళ విగ్రహం శ్రీ వేంకటేశ్వర స్వామికి లభించింది. ఆ దివ్యమంగళ విగ్రహమే దయాదేవి నుంచి జనించిన అమృతాంశమని కవి భావన. "భక్తానాం త్వం ప్రకాశసే" భక్తులను రక్షించడానికే దివ్యదేహాన్ని భగవానుడు ధరించాడు. అమృతసారమైన శ్రీ వేంకటేశుని దివ్యమంగళ విగ్రహం 'మామేకం శరణం వ్రజ' అని శ్రీకృష్ణ భగవానుడిష్టపడి చెప్పినట్లే తన పాదాలనే శరణు పొందాలి అని స్పష్టంగా బోధిస్తూ ప్రదర్శిస్తున్నది. పాపపు పుట్టలై మృతప్రాయులైన జీవులు (దేవతిర్యఙ్మనుష్యస్థావరాదులన్నీ) శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య మంగళ విగ్రహాన్ని-అర్చామూర్తిని-దర్శించి "శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే" అని త్రికరణ శుద్ధిగా స్మరించిన వెంటనే జీవుల సర్వపాపాలన్ని నశించి పోతాయి; దుఃఖాలు తొలగి పోతాయి. అమృతమయమైన దివ్యమంగళ విగ్రహం, దర్శించినంత మాత్రాన జీవులను ఉజ్జీవింప జేస్తుంది కాబట్టి అది మృతసంజీవనమే. దయా కలశోదధి నుంచి జనించిన వస్తువులన్నిటిలో చంద్రుడైన శ్రీ వేంకటేశ్వరునికి అమృతమయమై మృత సంజీవనంగా ఉన్న దివ్యమంగళ విగ్రహలాభమే దయాదేవి భగవానునికి

చేసిన ఉపకారం. ఆ దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించిన వెంటనే పాపాలన్నీ పంచబంగాళమై జీవులు ఇహపరసౌఖ్యాన్ని పొందడమే జీవుల పట్ల దయాదేవి ఒనరించిన ఉపకారమని శ్లోక సారాంశం.

"అశ్మాణమాఘుణం ప్రపద్యే"

శిలగా వెలసిన దివ్యరూపాన్ని గూర్చి ప్రపత్తి చేస్తున్నానన్నది వేదవాణి.

"అర్చయన్ను భయసంసిద్ధిం మత్తో విందత్య భీప్సితమ్" - నన్ను అర్చిస్తూ ఇహ పరసుఖాలను నా వల్ల పొందుతున్నాడన్నది భాగవతం.

రూపకాలంకారంతో కూడిన ఫలోత్ప్రేక్షగా సుశ్లోకితం.

మం.భా॥ మహి దుగ్ధ సింధు గరిమన్ దనర్చి స
త్స్పృహచే ప్రచాల్యయగు దేవి! నీ కతం
బహిరాడ్గిరీంద్రుడమృతాంశమైన వి
గ్రహమొందె నొక్కొ మృతకల్ప జీవియై ॥

23. జలధేరివ శీతతా దయే! త్వం వృషశైలాధిపతేః స్వభావ భూతా ।
ప్రళయారభటీ నటీం తదీక్షాం ప్రసభం గ్రాహయసి ప్రసత్తి లాస్యమ్ ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! జలధేః = సముద్రానికి, శీతతా, ఇవ = చల్లదనంవలె; వృషశైల + అధిపతేః = వృషాద్రీశునికి; స్వభావభూతా = స్వాభావికమైన; త్వం = నీవు; తత్ + ఈక్షాం = ఆ శ్రీనివాసుని యొక్క (దృష్టి) సంకల్పమైన; ప్రళయ+ఆరభటీ నటీం = ప్రళయం అనే ఉద్ధృతమైన తాండవమాడే నర్తకిని; ప్రసభం = బలాత్కారంగా; ప్రసత్తిలాస్యం = ప్రసాదం అనే సుకుమార నృత్తంగా; గ్రాహయసి = స్వీకరింప జేస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! సముద్రానికి శైత్యంలాగా నీవు శ్రీనివాస భగవానునికి స్వభావ సిద్ధమైన గుణంగా ఉన్నావు. భగవత్సంకల్పమనే నర్తకి ప్రళయం అనే ఉద్దండ తాండవం ఆడుతున్నప్పుడు బలాత్కారంగా సృష్టి అనే సుకుమార లాస్యాన్ని ఆ నర్తకి స్వీకరించునట్లు చేస్తున్నావు.

వ్యాఖ్య: దయాదేవి నిగ్రహపరుడైన భగవంతుణ్ని అనుగ్రహ పరునిగా చేస్తుందని వర్ణన.

పూర్వ శ్లోకమందు భగవద్దివ్యమంగళ విగ్రహం దయాదేవిచే ఏర్పడుతుందనడం వల్ల దయా విధేయుడని తెల్పబడింది. దయా పరాధీనుడైన శ్రీనివాసుడు అప్పుడప్పుడు దయాగుణానికి విరుద్ధంగా క్రోధావేశపరుడవుతుంటాడేమి? అనే శంక రెండు శ్లోకాలచే పరిహరింపబడుతున్నది. ఈ శ్లోకంలో ఆశ్రితుల విషయమై భగవానుడు నిగ్రహ సంకల్ప వర్జితుడని వర్ణింపబుడుతున్నది.

కోపం ప్రళయాన్ని కలిగిస్తుంది. సృష్టి స్థితులకు అనుగ్రహమే కారణం. కోపాన్ని శమింపజేసి సృష్టికి ఉన్ముఖునిగా చేసేది దయాదేవి. దయాగుణం భగవానునికి స్వభావ సిద్ధం.

జలధేరివ శీతతా:- నీటికి చల్లదనం నైసర్గికం. అందుకే "శైత్యం హియత్సా ప్రకృతిర్జలస్య" అని ఆభాణకం. ఇక జలధికి చెప్పేదేమి? "సముద్ర ఇవగాంభీర్యే" అన్నట్లు అగాధమైన సముద్రానికి శీతత్వం ప్రకృతి సిద్ధమే.

"స్వభావో నోపదేశేన శక్యతే కర్తు మన్యథా ।

సుతప్తమపి పానీయం పునర్గచ్ఛతి శీతతామ్ ॥"

ఎంత చెప్పినా స్వభావం మారదు. త్రాగేనీటిని కాగపెట్టితే మళ్ళీ ఆ నీరు చల్లబడుతుంది. కదా! సముద్రం పగలు సూర్యరశ్మికి ఉపరితలం - నీటి పై భాగం వేడి అయినా, రాత్రికి చల్లబడుతుంది. అది దాని స్వభావం.

దయే! త్వం వృషశైలాధిపతేః స్వభావభూతా:- సముద్రజలానికి శైత్యం స్వభావ సిద్ధమైనట్లే, శ్రీనివాస భగవానునికి దయాగుణం స్వాభావికం. భగవదాజ్ఞ లైన శ్రుతిస్మృతులు చెప్పిన విధంగా ప్రవర్తించనందువల్ల భగవానునికి నిగ్రహం - కోపం కలిగినా, అది తాత్కాలికమే. కొద్ది సమయం దాకా ఉండి చల్లారుతుంది. దయాగుణమే నిత్యం శాశ్వతంగా ఉంటుంది. కాబట్టి "స్వాభావికీ తవదయా యదినాంతరీయః" అనబడింది.

ప్రళయారభటీనటీం తదీక్షాం:- మనస్సులో ఏర్పడే కోపంగానీ, దయగానీ చూపు-దృష్టిలో ప్రస్ఫుటమవుతుంది. కాబట్టి, దృష్టిని సంకల్పంగా భావిస్తారు లోకులు. చరాచర ప్రపంచాన్ని సర్వనాశనం చేసే ప్రళయకాలమందలి భగవంతుని సంకల్పం- నిగ్రహ దృష్టి భయంకరంగా నాట్యం చేసే నర్తకి వంటిది. 'ఆరభటీ' వృత్తి ప్రధానమైన నాట్యాన్ని 'తాండవం' అంటారు. చేతులను త్రిప్పుతూ కాళ్ళతో 'ధిం ధిమిత' మంటూ భూమిని తాకుతూ, రౌద్రంగా నర్తించే ప్రక్రియ అన్నమాట.

తాండవం, నటనం, నాట్యం, లాస్యం, నృత్యం, నర్తనం అనే ఆరు ప్రక్రియలు భరత శాస్త్రమందు వేర్వేరుగా చెప్పబడినవి. పాదమెత్తి కోపంతో భూమిని తాడన చేస్తూ, ఉద్ధృతమైన అంగ విక్షేపం చేత ఆర్భాటంగా చేసేనాట్య ప్రక్రియ ఆరభటీవృత్తి.

"తద్భోగ బృందే యుగపన్ముకుంద శ్చారీ విశేషేణ సమైక్షినృత్యం !
పర్యాకులే వీచిగణే పయోధేః సంక్రాంత బింబో బహూధేవచంద్రః ॥"

కాళియుని వేయి పడగల మీద ఒకే సమయాన అంఘ్రి జంఘోరుకటీత్యాది అవయవాలను విచిత్రంగా చలింప జేస్తూ ఒక్కపాదం చేత నటించే శ్రీకృష్ణుడు, అల్లకల్లోలంగా ఉన్న సముద్ర తరంగాల మీద అనేక బింబాలుగా చలిస్తున్న చంద్రుని లాగా కనబడినాడట. 'చారి' అంటే "ఏకపాద ప్రచారోయః సచారీత్యభిధీ యతే" (అప్పయ్య దీక్షిత వ్యాఖ్యానం - యాదవాభ్యుదయం 4 స. 120)

సాధారణంగా పురుషడే తాండవమాడుతాడు. పురుషుని యొక్క "ఈక్షా" అనే పదం స్త్రీ లింగం. భగవంతుని దృష్టి ఆరభటీ నటిగా పోల్చబడింది.

ఇంతకుముందు 16వ శ్లోకంలో తన బిడ్డలకు విశ్రాంతిని కలిగించడానికి దయాదేవి 'ప్రతిసంచరకేళి'ని ఆచరించిందని చెప్పబడింది. ప్రళయం కూడా దయాదేవి కృత్యమే అన్నమాట. జీవుల అపరాధాలను చూచి కినుక వహించి ప్రళయం చేస్తాడు భగవానుడు. నీటికి కలిగే వేడిమి తాత్కాలికమైనట్లే భగవానుని కోపం కూడా కొంతకాలమే ఉంటుంది. మళ్ళీ దయాళుడైన భగవానుడు పునః సృష్టి చేస్తాడు కదా!

ఈ విషయమే కైతకైపుతో సుశ్లోకితమయింది. నటికి నాట్యం నేర్పే అధ్యాపకురాలు దయాదేవి. ప్రేక్షకులు భయపడేరీతిగా ఉద్ధతమైన తాండవమాడే నర్తకి నాట్యమాపకుండా, దానికి శారీరకమైన బాధ కలుగకుండా, ప్రేక్షకులకు తృప్తి కలిగే విధంగా లాస్య మాడునట్లు దయాదేవి పరిణమింపజేసింది.

ప్రసభం గ్రాహయసి ప్రసత్తిలాస్యం:- కోమల కరణాంగ విక్షేపం కలిగి కైశికీ వృత్తి ప్రధానమైన నాట్యం 'లాస్యం'. నర్తకి నాట్యమాడే భారాన్ని దయాదేవియే వహించింది కాబట్టి, ఉగ్రంగా తాండవమాడే నర్తకి హఠాత్తుగా ప్రేక్షకులు ప్రసన్నులయ్యే రీతిలో సుకుమారమైన అంగవిన్యాసం గల లాస్య నటనను స్వీకరించునట్లు మార్చింది. లాస్య నృత్యం చేయునట్లు మార్చిందంటే భగవానుని కోపాన్ని శమింపజేసి దయాదేవి సృష్టిని ఆరంభింపజేసిందని భావం. భగవంతునికి నిర్దయుడని పేరు రాకుండా చేసింది. జీవులకు కరణ కళేబరాలు కలుగజేసింది. దయాదేవి ఉభయులకు ఉపకరించింది. "తదైక్షత, సోஉకామయత, బహుస్యాం ప్రజాయేయ" (ఉపనిషత్తు). శ్రియః పతి చూచాడు. నేను అనేకంగా అవుతానని సంకల్పించాడు" అనే వేదాంత వాక్యార్థం చమత్కారంగా చెప్పబడిన శ్లోకమిది. ప్రళయ మందు దయాదేవికి వైముఖ్యం సూచింపబడిందని భావింపరాదు. 16 & 17 శ్లోకాలలో ప్రళయమూ, సృష్టి కూడా దయా కృత్యాలుగా చెప్పబడినవే కదా!

ఈ శ్లోకంలో శ్రీనివాసునికి దయ యొక్క స్వభావ భూతత్వం ఉత్తరార్ధం చేత దృఢపరచబడింది. "తత్తస్య సదృశం భవేత్" అన్నట్లు, దేశికుల కవితా ప్రభావం చేత 'దయా శతకం' దానికదే సాటి అనడం యుక్తమే కదా!

మం.భా॥ జలరాశి శీతలత చాడ్పునన్ రమా
నిలయ స్వభావయగు నీవు నాథునిన్
ప్రళయాఖ్యదుర్నటన రక్తునిన్ దయా!
లలితాశ్రితాదరణ లాస్యు జేయవే॥

**24. ప్రణత ప్రతికూల మూలఘాతీ ప్రతిఘః కోపి వృషాచలేశ్వరస్య।
కలమే యవసాపచాయ నీత్యా కరుణే! కింకరతాం తవో పయాతి ॥**

అర్థం: కరుణే = ఓ దయాదేవీ! ప్రణత - ఘాతీ! ప్రణత = శరణాగతుల యొక్క; ప్రతికూల = విరోధులను; మూలఘాతీ = వేరుతో పాటు పెరకి వేస్తున్న; కః + అపి = విలక్షణమైన; వృషాచలేశ్వరస్య = వృషగిరీశుడైన శ్రీనివాసుని యొక్క ప్రతిఘః = కోపం; కలమే = వరి పైరునందు; యవస + అప చాయ నీత్యా = కలుపుదీసే న్యాయంగా; తవ = నీకు; కింకరతాం = సేవక భావాన్ని; ఉపయాతి = పొందుతున్నది.

తా: ఓ దయాదేవీ! ప్రపన్నులకు విరోధులైన వారిని సమూలంగా ఉన్మూలిస్తున్న అనిర్వాచ్యమైన శ్రీనివాసుని కోపం వరిపైరు నందు కలుపు దీసే రీతిగా నీకు కింకరభావాన్ని పొందుతున్నది.

వ్యాఖ్య: దయాదేవి భగవంతుణ్ని ఆశ్రయించిన వారి విరోధులను నశింప జేస్తుందని రమణీయమైన వర్ణన.

పూర్వశ్లోకమందు భగవానుని కోపాన్ని శమింపజేసి దయాదేవి ఆయనను సృష్టి జేసే రీతిగా మార్చివేసింది. సృష్టి చేసిన భగవానుడు సాధుజనులను కాపాడుతాడు. దుర్జనులను నశింపజేస్తాడు. విశ్వసృష్టి జేసిన భగవంతునికి కొందరి మీద దయ, కొందరి మీద నిర్దయ యెందుకు ఉండాలి? "నమే ద్వేష్యోஉస్తి నప్రియః" నాకెవ్వరి మీదనూ శత్రుత్వం లేదు, మిత్రత్వమూ లేదు - అని చెప్పిన భగవానునికి ఇంత పక్షపాతమేమిటి? అనే ప్రశ్న జనిస్తుంది. నిజమే కాని భగవానుడు చరాచర ప్రపంచాన్ని విచిత్రంగా సృజించాడు జీవాత్మలకు కరణ కళేబరాలనిచ్చాడు. ప్రకృతిలోని పదార్థాలను అనుభవించడానికి కృపజేశాడు. సృజించిన తనను ఆరాధించుమన్నాడు. తనను ధ్యానించడానికి మంచి మనస్సునూ ఇచ్చాడు. 'ఇదంకురు, ఇదం మాకార్షీః' - ఇది చేయండి, ఇది చేయకండి - అని విధి నిషేధాలను తెల్పే శాస్త్రాన్నీ, జీవ స్వరూపం ఇలాంటిది, భగవత్స్వరూపం ఇలా ఉంటుందని ఉపదేశించే సదాచార్యులనూ అనుగ్రహించారు. "సంసారే తదపిభ్ర

మేమయది కింకుర్వీత సర్వేశ్వరః" అయినా, సంసారంలో మంచి చెడులను తెలుసుకోకుండా ఇష్టం వచ్చిన విధంగా పరిభ్రమిస్తుంటే భగవానుడింకేం చేయాలి?

ప్రణత ప్రతికూలమూలఘాతీ ప్రతిఘః :- "వాసుదేవః సర్వమితి సమహాత్మా సుదుర్లభః" - భగవానుడు సర్వ శక్తిమంతుడైనా ప్రపంచంలో ధర్మానికి గ్లాని, నష్టమేర్పడినప్పుడు తన మహిమను తగ్గించుకొని దేవతిర్యగ్రూపాలెత్తి, చివరకు మనుష్య రూపాన్ని కూడా ధరించి ధర్మరక్షణకు పూనుకొన్నాడు. కన్నయ్య ఎంత చెప్పినా లోకం విన్నదా యేమన్నా. అంతటా వ్యాపించియున్న వాసుదేవుడే సర్వ రక్షకుడు అనే గొప్ప జ్ఞానవంతుడు ఇప్పటికీ నాకు లభించలేదని శ్రీకృష్ణ భగవానుడు స్పష్టంగా తన హృదయాన్ని ఆవిష్కరించాడు.

ప్రపంచంలో అందరు కాదు కానీ, కొందరు కర్మిష్ఠులూ, యోగనిష్ఠులూ ఉన్నారు. తపస్సమాధిలో నుండే వారి వాటికలలో క్రూరమృగాలు కూడా పరస్పర వైరాన్ని మానుకొని ప్రసన్నంగా సంచరిస్తుంటే, మృగాలకంటే కడు హీనంగా హింసకు పాల్పడేవారు ఎక్కువగా ఉన్నారు కదా!

శాస్త్రాలను చదివినా చదువకున్నా కొందరు ఆస్తికులు విహిత కర్మలను ఆచరిస్తూ, ఆ కర్మ ఫలాలను "పరస్మైనారాయణాయేతి సమర్పయామి" అంటూ భగవానునికే సమర్పిస్తారు. అంతేకాదు; సర్వరక్షకుడు భగవానుడే - ధారకుడు, పోషకుడు, భోగ్యుడు పరమాత్ముడే అని మహా విశ్వాసంతో న్యస్తభరులై ఉండేవారు ప్రపన్నులు.

"శ్రూయతాం ధర్మ సర్వస్వం శ్రుత్వాచాప్యవధార్యతామ్।
ఆత్మనః ప్రతికూలాని సర్వేషాం నసమాచరేత్ ॥"

ఉత్తమ ధర్మమేదో పెద్దల చేత విని ఆచరిస్తూ ఉంటారు. ఇతరులు ఏ పనిచేస్తే తమకు కష్టమనిపిస్తుందో ఆ పనిని తామెవరికీ చేయకుండా, భగవత్ప్రీత్యర్థం ప్రణతులై - నమ్రులై జీవిస్తుండేవారిని ప్రణతులు, ప్రపన్నులు అంటారు.

ధర్మమూ లేదు, భగవంతుడూ లేడంటూ స్వేచ్ఛగా ప్రవర్తించే వారు నాస్తికులు. ఇట్టి నాస్తికుణ్ని చూచి ప్రణతుడు మనసులో 'నాస్తిచేత్ నాస్తిమే హానిః, అస్తిచేత్

నాస్తికోహతః" భగవంతుడు లేనే లేడంటే నాకేమి నష్టం లేదు, ఉంటే నాస్తికుడు చస్తాడేమో అని బాధపడుతాడు.

భగవానుడు కూడా ఎవడు చేసిన కర్మఫలం వాడే అనుభవిస్తాడని ఉదాసీనుడై ఊరక ఉంటాడు.

"వర్ధత్యధర్మేణ నరస్తతో భద్రాణిపశ్యతి ।
తతః సపత్నాన్ జయతి సమూలస్తు వినశ్యతి ॥"

అధర్మాన్ని ఆచరించే వ్యక్తి సకల భాగ్యాలనూ పొందుతాడు. తన శత్రువులు అని భావిస్తున్న వారిని కూడా జయించి వృద్ధిలోకి వస్తాడు. అయితే అది తాత్కాలికమే. తుదకు నూరుగొడ్లను తిన్న రాబందును ఒక్క గాలివాన పెట్టన్నట్లు అధర్మపరుడు సమూలంగా నశిస్తాడు కదా! నాస్తికులను చూస్తూ ఉదాసీనుడుగా ఉండే భగవానుడు తన భక్తులను, ప్రణతులను నిష్కారణంగా బాధిస్తుంటే ఊర్కోడు. తన భక్తులకు ప్రతికూలురైన వారే - విరోధులైన వారే భగవానునికీ విరోధులు. ప్రణతుడైన విభీషణుడు శ్రీరామునికి అనుకూలుడైనాడు. "న నమేయం కదాచన" నేనెప్పుడూ తలవంచను, అన్న రావణుడు ప్రతికూలుడయ్యాడు.

శ్రీనివాసుడు దయా స్వభావుడని పూర్వ శ్లోకం చెప్పింది కదా! లోక కంటకుడైన రావణాసురుని బాధలను భరించలేకున్నామని శరణాగతులైన బ్రహ్మాది దేవతలకు శ్రీ విష్ణుభగవానుడు వరమిచ్చాడు.

"భయంత్యజత, భద్రం వోహితార్థం యుధిరావణమ్ ।
స పుత్ర పౌత్రం సామాత్యం సమిత్ర జ్ఞాతిబాంధవమ్ ॥
హత్వాక్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్॥"

భయపడకండి! మీ క్షేమం కోసం, జగద్ధితార్థం దేవతలకూ, ఋషులకూ భయాన్ని కలిగించే దురాత్ముడైన, క్రూరుడైన రావణాసురుణ్ని యుద్ధంలో కొడుకులు, మనుమలు, మంత్రులు, మిత్రులు, దాయాది బంధువులతో పాటు చంపి వేలకొలది యేండ్లు పృథివిని పాలించగలనని చెప్పినంత పనిచేశాడు కదా!

శత్రుశేషం గానీ, ఋణ శేషంగానీ మిగులనీయరాదు. కౌమార దశలో మారీచుణ్ని ప్రాణాలతో ఉంచినందు వల్లనే కదా సీతా రాముల కథ పెరిగింది. అలాగే, దురభిమానియైన దుర్యోధనుని వల్ల భారత కథ పెరిగింది. ఈ ఇర్వురు కూడా ప్రణతులకు ప్రతికూలురైనందు వల్ల భగవానుని కోపానికి కారకులయ్యారు. యుద్ధంలో భగవానుడు సమూలంగా వారిని నాశనం చేశాడు.

ప్రతిఘఃకోఽపి వృషాచలేశ్వరస్య:- శ్రీనివాస భగవానుని కోపం (కః+అపి) ఒకానొకరకమైనది. లోకుల క్రోధం వంటిది కాదు. లోకుల కోపం దుర్గుణమే. కోపిష్ఠికి వివేకముండదు. "క్రుద్ధోహన్యాత్ గురూనపి" - క్రుద్ధుడైన చంపు గురువునైన. "క్రోధః పాపస్య కారణం". కోపం పాపానికి హేతువు కదా! శ్రీరామునికి కలిగిన కోపాన్ని వాల్మీకి "కోపస్య వశమేయి వాన్"-"క్రోధమాహారయత్తీవ్రం" అన్నాడు. సాధువులను రక్షించడం కోసం తెచ్చుకొన్న కోపం చేత దుష్టులను సంహరించాడని అర్థం. సాధుపరిత్రాణమే ప్రధానం. దుష్కృద్వినాశం ఆనుషంగికమని సారాంశం. కాబట్టి, లోకులకు కలిగే కోపానికంటే భగవంతునికి కలిగే కోపం విలక్షణమైనది. వేరైనది అని చెబుతుంది 'కోఽపి' అనే పదం.

కలమే యవసాపచాయనీత్యా:- శ్రీనివాసుడు ఒక కృషీవలుడని (శ్లో.21) చెప్పబడింది కదా! వరి పైరు బాగా పెరుగడానికి అందులో మొలచిన కలుపు మొక్కలను వేరుతో పాటు పెరికి వేయాలి. ఆశ్రితులు వృద్ధి పొందడానికి లోక కంటకులను సమూలంగా నశింపజేయడం న్యాయమే అన్న దానికి దృష్టాంతంగా ఈ మాట చెప్పబడింది. 'ప్రణత' శబ్దం ఉపమేయం. 'కలమ' శబ్దం ఉపమానం. 'ప్రతికూల' శబ్దం ఉపమేయమైతే 'యవస' శబ్దం ఉపమానం. 'మూలఘాతీ' అని పూర్వార్థంలో ఉంది. 'అపచాయ' శబ్దం చేత సమూలంగా కలుపు మొక్కలను దీసి వేయాలనే అర్థం తోచినా, పైరును పెంచడానికి కలిగే శ్రమ కంటే కలుపు దీయడం చాలా తేలిక. పుష్పాపచయం లాగా వ్రేళ్ళతో గానీ గోళ్ళతో గానీ అవలీలగా ఆ పని చేయబడుతుందని విశదమవుతుంది.

"మూలఘాతిషుసజ్జన్తే బుద్ధిమంతో భవద్విధాః" (రా.సుం. 51-18) మీ వంటి బుద్ధిమంతులు సమూలంగా నాశనం చేసే అధర్మకార్యాలను ఆచరిస్తారా! అని

హనుమంతుడు రావణునికి బుద్ధి చెబుతున్న మాట ఇది. సీతా విషయంగా ఘోరపాపం చేయడం వల్ల శ్రీరామునికి కోపం వచ్చి వధించ దలచుకున్నప్పుడు బ్రహ్మ రుద్రేంద్రులకూ అడ్డగింప శక్యం కాదు. లోకకంటకులను సమూలంగా పెరికి వేయడం శ్రీరామునికి ఒక లీలగా ఉంటుందని బోధిస్తాడు. "అంగుళ్యగ్రేణ తాన్ హన్యామ్" చేతి వ్రేళ్ళకొనతో రాక్షసులను చిదిమివేస్తానన్నాడు శ్రీరాముడు. రైతు కలుపుమొక్కలను దీయకుంటె పైరుపెరుగదు. "ఘాసో యవసమ్" (అమరం) "యథోద్ధరతి నిర్దాతాకక్షం ధాన్యంచ రక్షతి" (మనుస్మృతి) 'నిర్దాతా' అంటే కలుపుదీసే వ్యక్తి. పైరుతో పాటు పెరిగే గడ్డిని పెరికి వేస్తేగానీ పైరు పెరిగి ధాన్యం లభించదని భావం.

ఇలాంటిదే మరొక నీతి ఉంది.

"యథేక్షు హేతోః సలిలం ప్రసేచితం తృణాని వల్లీ రపి చ ప్రసించతి ।
తథానరో ధర్మ పథేన వర్తయన్ యశశ్చ కామాంశ్చవసూని చాప్నుతే ॥"

చెరుకు పంట కోసం పారించిన నీరు గరుకనూ, తీగలనూ తడుపుతుంది. అలాగా, ధర్మ మార్గంలో నడిచే మనిషి కీర్తినీ, సంపదలనూ పొందుతాడు. అతని కోరికలూ నెరవేరుతాయి. ముఖ్యమైన ఫలంతో పాటు ఆనుషంగిక ఫలం కూడా లభిస్తుందని భావం.

కరుణే! కింకరతాంతవోపయాతి:- ఆశ్రిత రక్షణమనే పని దయాదేవి కృత్యం. ఆశ్రిత విరోధి నిరసన ఆనుషంగికం. రైతు కలుపు మొక్కలను దీయడానికి కూలీలను పెడుతాడు. సాధు పరిత్రాణ రూపమైన భగవంతుని దయకు ప్రణతప్రతి కూలురను కలుపు మొక్కల లాగా సమూలఘాతం చేయడానికి ఏర్పడిన భగవానుని కోపం సేవకభావాన్ని పొందింది. దయ వేరు. కోపం వేరు. ఈ రెండు పరస్పర విరుద్ధ గుణాలు. కోపం చేత చేయబడిన పని దయాదేవి చేసే ప్రధానమైన పనికి తోడ్పడింది. దయాదేవికి ఇష్టమైన పనికి తోడ్పడడమే సేవ కదా! కాబట్టి, కోపం దయకు కింకరభావాన్ని వహించిందని సుస్పష్టం. భాగవత సహవాసం భగవంతునికి లభించడమూ, భగవద్భక్తులకు తమ విరోధులు నశించడమూ దయాదేవి యొక్క ఉపకారమే. దేశికుల కవితలో పరిచిత పదాలే ఉన్నా అర్థగౌరవం అధికంగా ఉంటుంది.

మంజు॥ శ్రితవైరిమూల హతి జేయు వేంకట
క్షితిభృత్పతిన్ కరుణ! చెందు కోపమా
యతసస్య వృద్ధియవసాంతనీతి స
త్కృతమై భజించు భవదీయ దాస్యమున్॥

25. అబహిష్కృత నిగ్రహాన్ విదంతః
కమలాకాన్త గుణాన్ స్వతంత్రతాదీన్।
అవికల్పమనుగ్రహం దుహానాం
భవతీమేవదయే! భజన్తి సంతః॥

అర్థం: హే దయే = ఓదయాదేవీ! స్వతంత్రత+ఆదీన్ = స్వాతంత్ర్యం మొదలైన; కమలాకాన్త గుణాన్ = లక్ష్మీపతి యొక్క గుణాలను; అబహిష్కృత నిగ్రహాన్ = వెలివేయ్యబడని నిగ్రహం కలిగినట్టివిగా; విదంతః = తెలుసుకొంటున్న; సంతః = సత్పురుషులు; అవికల్పం = వికల్పం లేకుండా; ఒకే రీతిగా; అనుగ్రహం = అనుగ్రహాన్ని; దుహానాం = స్రవింపజేసే; భవతీం, ఏవ = నిన్నే; భజంతి = సేవిస్తున్నారు.

తా: ఓ దయాదేవీ! లక్ష్మీనాథుని స్వాతంత్ర్యం మొదలైన గుణాలను నిగ్రహంతో కూడుకొని ఉన్నవిగా తెలిసియున్న సత్పురుషులు భేదం లేకుండా ఏక రీతిగా అనుగ్రహాన్ని కురియునట్టి నిన్నే భజిస్తుంటారు.

వ్యాఖ్య: దయాదేవికే పరత్వాన్ని చెప్పడానికి సత్పురుషుల అనుష్ఠానమే ప్రమాణమని కవి హృదయం.

భగవానుని క్రోధం ఆశ్రితుల విరోధులను నశింపజేసి వారు తమ వర్ణాశ్రమ ధర్మాలను నిర్వహించే విధంగా చేసినందువల్ల దయా దేవికి దాస్య వృత్తిని పొందిందన్నారు. ఈ శ్లోకంలో దయాపరతంత్రుడు శ్రీనివాసుడు కాబట్టి, దయాదేవికి, పరత్వాన్ని కవి కల్పించినది కాదని, సత్పురుషుల అనుష్ఠానమే ప్రమాణం అని చెప్పబడింది.

కమలాకాంతగుణాన్ స్వతంత్రతాదీన్:- లక్ష్మీనాథుడు జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులనే షడ్గుణాలనే కాక స్వాతంత్ర్యం మొదలైన అసంఖ్యాక గుణాలు కలవాడు. లోకమందు సామాన్య సంపత్తు కలవాడు స్వేచ్ఛగా వ్యవహరిస్తుంటాడు కదా! "గుణలుబ్ధాః స్వయమేవ సంపదః" అన్నట్లు గుణాలు కలవాణ్ని సంపదలు తమంత తామే వరించి ఆశ్రయిస్తాయి. ఇక భగవానుడు కమలాకాంతుడు కదా! ఆయన సమస్త కల్యాణ గుణసముద్రుడు. ఆయన స్వాతంత్ర్యం నిరుపాధికం. ఆయన నిరంకుశుడు. "నతస్యేశేకశ్చన" భగవానుడు మిక్కిలి స్వతంత్రుడైనందువల్ల విశ్వంలో ఆయనను నియమించేవాడే లేదని ఉపనిషత్తు ఉద్ఘోషిస్తుంది.

అబహిష్కృత నిగ్రహాన్ విదంతః:- సకల గుణాలకు సమ్రాజ్ఞియైన దయాదేవి నిగ్రహాన్ని సహించదు. శ్రుతిస్మృతులు భగవదాజ్ఞారూపాలు - శాసనాలు. భగవదాజ్ఞను మీఱి ప్రవర్తించేవారిని నిరంకుశ స్వతంత్రుడైన భగవానుడు నిగ్రహించి దండన విధిస్తాడు. భగవానుని అనుగ్రహానికి పాత్రులమయ్యే ప్రవర్తన మనకు లేనందువల్ల ఆయన నిగ్రహంతో విధించే శిక్షకు గురికావలసి వస్తుంది.

"కామ ఏషః క్రోధ ఏషః రజోగుణ సముద్భవః" -శుద్ధ సత్త్వ గుణ సంపన్నుడైన లక్ష్మీపతి రజోగుణం చేత జనించే కామక్రోధాలను నరుడు కలిగియుండ కూడదని గీతోపదేశం చేశాడు. కమలాకాంతుని యందుండే నిగ్రహాన్ని దాని ద్వారా అపరాధులను దండించే విధానాన్ని, మనం పతితులను, ప్రతికూలురను వెలివేసినట్లే, దయాదేవి పూర్తిగా బహిష్కరించింది. భగవానుని ఇతర గుణాలన్నీ నిగ్రహాన్ని వెలివేయకుండా, అన్ని విధాలా దానికి ఉపయోగపడుతున్నాయి. జ్ఞాన గుణం పాప పుణ్యాలను వేరు చేసి, పాపం చేసిన వారిపైన నిగ్రహం చూపి, దండన విధించడానికి తోడ్పడుతుంది. దేహబలంగానీ బుద్ధిబలంగానీ నిగ్రహాన్ని తీవ్రం చేయడం తప్పదు. ఐశ్వర్యం నిగ్రహానికి నిచ్చెన వేస్తుంది. శక్తి నిగ్రహాన్ని అందలమెక్కిస్తుంది. తేజస్సు నిగ్రహ సామర్థ్యానికి అద్దం పడుతుంది. స్వాతంత్ర్యానికి ఎదురే లేదు. దయాగుణం తప్ప గుణాంతరాలన్నీ నిగ్రహ ప్రవృత్తికి రాచబాట వేసేవే. కాబట్టి, స్వతంత్రాది గుణాలన్నీ నిగ్రహంతో కలిసి, మెలసి ఉంటాయని తెలిసినవారు విద్వాంసులు.

సంతః:- "ధీరాః పరిజానంతి యోనిమ్" విద్వాంసులే కదా భగవానుడు సర్వకారణుడని తెలుసుకొన్నవారు. వారి బుద్ధినిశితమైనది. "అలూక్షాధర్మ కామాస్స్యుః" విద్వాంసులు అలూక్షులు, అంటే క్రూర స్వభావులుకారు. ధర్మాసక్తులు, ధర్మఫలాలనే అభిలషించేవారు కాబట్టి సత్పురుషులనబడుతున్నారు. సచ్ఛబ్ద వాచ్యులు.

"సత్యేసాధౌ విద్యమానే ప్రశస్తేఽభ్యర్హితేచసత్ ।
భవాన్యాంతు సతీస్త్రీస్యాత్ నక్షత్రే సన్నపుంసకమ్ ॥" (నిఘంటువు)

"తస్యైవం విదుషోయజ్ఞస్య" ఆత్మయజ్ఞం తెలిసినవారు సచ్ఛబ్దవాచ్యులు. "అసన్నేవ సభవతి, అసత్ బ్రహ్మేతివేదచేత్" బ్రహ్మశబ్దార్థం గల సత్తును అసత్తుగా-లేనిదిగా - (దేవుడు లేడని) భావించేవాడు లేనివాడుగానే అవుతాడు. 'సః' అనే తచ్ఛబ్దం దూరాన్ని తెలుపుతుంది కాబట్టి దేవుడు లేడనే వ్యక్తిని సత్పురుషులు దూరంగా ఉంచుతారు. సారాసార వివేకం కలిగిన జ్ఞానులు సత్తులు. "అస్తి బ్రహ్మేతి చేద్వేద, సన్తమేనం తతోవిదుః" పరబ్రహ్మ ఉన్నాడని విశ్వసించే వ్యక్తిని (సత్పురుషులు) ఉన్నవాడుగా భావిస్తారు. అంతేకాదు 'ఏనం' అనే ఏతచ్ఛబ్దం సమీపాన్ని సూచిస్తుంది కాబట్టి సత్పురుషులు ఈ వ్యక్తిని దగ్గరివాడుగా భావించి తమతో చేర్చుకొంటారని శ్రుతి తన నెత్తి మీది కెక్కించుకొన్నది కదా!

అవికల్ప మనుగ్రహందుహానాం:- "యథా తరుణవత్సాగౌః" అన్నట్లు లేదూడగల ధేనువు దయాదేవి. మనం 'వత్స' వంటివాళ్ళం. దయాదేవి అనుగ్రహైకదోగ్ధ్రి.

'అవికల్పం' అంటే ఒకప్పుడు నిగ్రహాన్ని మరొకప్పుడు అనుగ్రహాన్ని చూపడం అనే (వికల్పం) భేదాభిప్రాయం లేకపోవడం. వికల్పమెరుగని, ఎల్లప్పుడు అనుగ్రహైక రసిక దయాదేవి.

'దుహానాం' అనడం వల్ల ఊధస్సు (పొదుగు) యొక్క భారాన్ని భరించలేక తనంత తాను పాలను నేల మీద స్రవింపజేసే ధేనువు రీతిగా అని అర్థం. అవికల్పంగా ఎల్లకాలం కనికరం కురిసేది దయాగుణం.

భవతీమేవ భజంతి సంతః:- సత్పురుషులు దయాదేవినే గౌరవంగా సేవిస్తారు. 'భజ-సేవాయాం' అని ధాత్వర్థం. ఇతర గుణాలను సజ్జనులు పట్టించుకోరు. వేయేల?

గుణగణేశుడైన కమలాపతిని కూడా భజించరు. శ్రీదేవికి వేరే ఆలయాన్ని రూపొందించక కేవలం తన దేహమందే నివాసమేర్పరచి, శాశ్వతంగా శ్రీనివాసుడనే పేరుతో స్వయం వ్యక్తమైన శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహాన్ని పోలియున్న దయాదేవిని మాత్రమే సత్పురుషులు ఉపాసిస్తారు.

'భజన్తి' అని పరస్మైపద ప్రయోగం చేత భజన క్రియ యొక్క ఫలం భగవత్కృప వల్లనే లభిస్తుందని విశ్వసింపబడుతున్నది. 'మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు" 'మాం' అనే పదం యొక్క అర్థాన్ని బట్టి, భగవద్దయ చేతనే "నన్నే ఆశ్రయించండి" అని ఉపదిష్టమన్నది స్పష్టమవుతున్నది కదా!

దయాదేవినే భజించడం వల్ల భగవంతుని నిగ్రహ ఫలమైన శిక్ష (Punishment) నుంచి జీవులు తప్పించబడుతారు. రూపమున్న చోట గుణముంటుంది కదా! నిగ్రహం లాగా బహిష్కరింపబడని దయాగుణ సంబంధం వల్ల, ఎన్నిసార్లు దర్శించినా తనివి దీరకుండా, అపర్యాప్తామృతంగా ఉండే శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యరూపాన్ని సకలజనులు - బద్ధ, ముక్త, నిత్య జీవాత్ములందరు అవిచ్ఛిన్నంగా సేవిస్తుంటారు. ఈ విధంగా జీవాత్మలకూ, పరమాత్మకూ కలుగుతున్న లాభం కేవలం దయాదేవి మహిమవల్లనే కదా!

మంజు॥ త్రియుగేశు వీర్య బలధీగుణాదుల
న్నియు నిగ్రహంబునకు నేర్చునంచు, ని
శ్చయ సుప్రసాద మనిశం బొసంగు నిన్
దయ! సంశ్రయింతురిల దద్దయున్ నిన్ బుధుల్ ॥

26. కమలానిలయస్త్వయా దయాలుః
కరుణే! నిష్కరుణా నిరూపణే త్వం।
అత ఏవహి తావకాశ్రితానాం
దురితానాం భవతి త్వదే వ భీతిః ॥

అర్థం: హే కరుణే = జనుల మనస్సును వశం చేసుకొనే దయాదేవీ! కమలా నిలయః = శ్రీనివాసుడు; త్వయా = నీచేత; దయాళుః = దయ గలవాడు. త్వం

= నీవు; నిరూపణే = ఆలోచిస్తే; నిష్కరుణా = దయలేనిదానవు. అతః, ఏవ, హి = ఇందువల్లనే కదా! తావక + ఆశ్రితానాం = నిన్ను ఆశ్రయించిన వారిని చుట్టుముట్టినట్టి; దురితానాం = పాపాలకు; త్వత్ + ఏవ = నీ వల్లనే; భీతిః = భయం; భవతి = కల్గుతున్నది.

తా: ఓ దయాదేవీ! శ్రీనివాసుడు నీ సాహచర్యం చేతనే దయను కలవాడని పేరుపొందాడు. యథార్థంగా విచారించినప్పుడు నీవు దయలేనిదానవని పిస్తుంది. ఎందుకంటే; నిన్ను చేరిన వారిని ఆశ్రయించిన పాపాలు నీ వల్లనే భయపడు తున్నాయి.

వ్యాఖ్య: దయాదేవి దయలేనిదని వ్యాజస్తుతి.

నిగ్రహాన్ని బహిష్కరించే దయాదేవినే పెద్దలు ఆశ్రయిస్తారని చెప్పబడింది. ఆశ్రయించిన వారి పాపాలు మాత్రం దయాదేవికి భయపడి పారిపోతాయని తర్క సహనమైన కవితా శిల్పాన్ని దేశికులు ఆవిష్కరించిన శ్లోకమిది.

కమలానిలయః:- "కమలా శ్రీర్హరి ప్రియా" (అమరం) కమల శబ్దం స్త్రీలింగమైతే లక్ష్మీదేవి అని అర్థం. ఆమెకే పద్మావతి అని పేరు. "పద్మప్రియే పద్మిని పద్మహస్తే, పద్మాలయే పద్మ దళాయతాక్షి' అని లక్ష్మీ దేవి స్తుతింపబడుతుంది. చేతితో కమలాన్ని ధరించేది కమల. లక్ష్మి కమలవాసిని. తామరపూవులాగా కోమల శరీరం కలది.

"పాదారుంతుదమేవ పంకజరజశ్చేటీభృశాలోకితైః
అలగమ్లాని రథాంబ! సాహసవిధౌ లీలారవిందగ్రహః" (శ్రీ గుణ. ర. 42)

లక్ష్మీదేవి పాదాలకు 'పద్మ పరాగం సోకుతుంటే ఆమెకు ఎంతో బాధ కలుగుతుంది. చెలికత్తెల చూపులు సోకినంతనే ఆమె దేహం కందిపోతుంది. విలాసంగా కమల పుష్పాన్ని చేతితో పట్టుకోవడం సాహసకార్యమే అన్నారు శ్రీపరాశర భట్టరు.

"కమనీయ రూపరేఖా రమణీయత జాలనొప్పు రమణీమణి యక్కమలాలయ" - అని పోతన, లక్ష్మి అందానికి కందం. (భాగ. 2 స్కం. 232)

"తామరలన్న నీ వలపుదారికి దారియు తెన్ను లేదు, పొం
దామర యామెమోము, తెలిదామర యా యమకన్నుదోయి, చెం
దామర యామె కేలుగవ, తామరలన్ మఱలన్ జయించు కాం
తామర వాహినీ వికచతామరసంబులు నామెకన్ జిగుల్"

అని సీతాదేవి కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ వారిచే వర్ణింపబడింది. ఇంత సుకుమారియైన కమలాదేవి కంటె మృదువైనది శ్రీపతి దివ్య మంగళ విగ్రహం. "మలర్మగళ్ కైవరుట్ మలర్ పొనిల్‌కిలన్టన" (ఆళ్వార్ల శ్రీసూక్తి) కమలవాసిని లలితంగా పాదసంవహనం చేసినా, శ్రియః పతిపాదారవిందాలు వాడిపోతాయట. దేహం నిలువడానికి దృఢంగా ఉండే చరణాలే ఇంత మృదువుగా ఉన్నాయంటే శ్రియః పతి హృదయం ఇంక ఎంత మృదులంగా ఉంటుందో కదా! అది నవనీతమే. కాబట్టి తన భుజాంతరస్థలా న్నే కమలాదేవికి శుద్ధాంతః పురంగా చేసుకొన్నవాడే కమలా నిలయుడు.

'లీఙ్ శ్లేషణే' అనే ధాత్వర్థాన్ని బట్టి 'నిలయ' శబ్దానికి 'గృహం' అని అర్థం. గృహిణికి తన విశాల ఉరస్థలమే గృహంగా కలవాడు కమలానిలయుడు. 'నికాయ్య నిలయాలయాః' (అమరం) 'నితరాంలీయతే అత్ర జనః ఇతి నిలయః.' జనం నివసించేది 'నిలయం' అని వ్యుత్పత్త్యర్థం. విశేషమేమిటంటే, కమలాదేవి తన పతిని "అకల కిల్లేన్ ఇఱైయుం" క్షణకాలమైనా విడిచి ఉండను, అని సంశ్లేషించి ఉన్నది. కాబట్టి కమలా నిలయుడు శ్రీనివాసుడన్నది అన్వర్థనామం. 'అనపాయిని' యైన శ్రీదేవి కలవాడు కాబట్టి 'శ్రీవారు' అనడమూ ప్రఖ్యాతమే.

త్వయాదయాళుః :– 'దయా' శబ్దానికి 'ఆళుచ్, ప్రత్యయం ఏర్పడినందువల్ల దయకలవాడని అర్థం. గుణసార్వభౌమినియైన దయాదేవి సంబంధం చేత కమలా నిలయుడు దయాళువు అయినాడు. సిరి కలిగియున్నా దయకలిగి యుండడం గొప్ప విషయం. కాబట్టి జీవులు నిర్భయంగా దయాళువును ఆశ్రయిస్తారు. "మృదుర్దయాళుర్మధురః" అన్నది స్తోత్ర రత్నం. రక్షకునికి ఇది గొప్ప బిరుదు. "శరణాగతానాం సంరక్షితేతిబిరుదం వరద! త్వదీయమ్" అన్నది వరద రాజస్తోత్రం.

కరుణే! నిష్కరుణా నిరూపణేత్వం:- ఓ దయాదేవీ! నీవు దయలేనిదానవు. ఏ గుణానికి చైతన్యం ఆరోపించబడిందో, దానికే ఆ గుణం లేదనడం దూషణమే అవుతుంది. పేదవాణ్ని చూచి 'నీ దరిద్రానికి దరిద్రం పట్టింది' అంటే సంతోషమే. కాని, కరుణకే కరుణలేదంటే విచారించదగినదే. దయ ఎవరిని ఆశ్రయిస్తుందో అతనిని దయాళువుగా చేస్తుంది. తాను మాత్రం స్వయంగా దయలేనిదే; అనడం వల్ల దయచేత తిరస్కరింపబడిన స్వాతంత్ర్యాది గుణాలు సంతోషించాయి.

"పరోపదేశేపాండిత్యం సర్వేషాం సుకరం నృణామ్ ।
ధర్మే స్వీయ మనుష్ఠానం కస్యచిత్తు మహాత్మనః ॥"

ఇతరులకు ధర్మాన్ని ఉపదేశించే పాండిత్యం జనులందరికీ ఉంటుంది. స్వయంగా ధర్మాన్ని ఆచరించడం మాత్రం ఎవనికో ఒక్కనికే ఉంటుంది. అతడే గొప్పజ్ఞానవంతుడు - అనే మాట దయాదేవికి కూడా అనువర్తిస్తుంది. 'నిష్కరుణ' అనడం భూషణమే అని ఉత్తరార్ధం నిరూపిస్తుంది.

అత ఏవహి, తావకాశ్రితానాం దురితానాం భవతిత్వదేవభీతిః :- ఈ శ్లోకంలో యుష్మచ్ఛబ్దం యొక్క నాలుగు విభక్తులున్నాయి. త్వం = నీవు (ప్ర.వి.) త్వయా = నీచేత (తృ.వి). తవ = నీ యొక్క ఈ షష్ఠీ విభక్తికి సంబంధార్థక తద్ధిత ప్రత్యయం చేరడం వల్ల 'తావక' అనే పదం ఏర్పడింది. త్వత్ = నీనుంచి, నీ వల్ల (పం.వి) 'తావక' పదం దగ్గర చేరిన వస్తువును తెల్పుతుంది. అయితే, 'త్వత్' పదం అపాదానం కాబట్టి, దూరమవుతున్న దాన్ని తెల్పుతుంది. తావకులు అంటే నీ సంబంధులు, దయాదేవిని శరణు పొందిన వారన్న మాట. తావకులను ఆశ్రయించి యున్నట్టివి దురితాలు. ఆశ్రయించిన వారిని కాపాడడం న్యాయం. దయాదేవి దురితాలను కాపాడడం లేదు. కాబట్టి, దయాదేవి నిర్దయురాలు అన్న మాట హేతుబద్ధమైనది.

"భీషాస్మాద్వాతః పవతే, భీషోదేతిసూర్యః" వాయ్వాది భూతాలూ, సూర్యాది గ్రహాలూ అందరు భగవానునికి భయపడుతారు. కాని పాపాలకు భగవానుని వల్ల భయం లేదు. దయాదేవి దృష్టికి ఆగలేక శ్రీనివాస భగవానుని నిగ్రహం వెనుకంజ వేస్తుంది. అందువల్ల దురితాలకు శ్రీనివాసుని వల్ల భయం లేదు, దయాదేవి వల్లనే

దురితాలకు భీతి కలుగుతుంది. చరాచర పదార్థాలను మ్రింగే దురితాలకు భీతి కలుగుతుంది. చరాచర పదార్థాలను మ్రింగే భగవానుడు పాపాలను మ్రింగలేడు. దయాదేవి తమను నిర్దయతో మ్రింగుతుందని పాపాలకు భయం.

దయాదేవి శ్రీనివాసుని కన్న మిన్న యన్న దేశికులు దయను నిర్దయ అంటున్నారు. సాధారణంగా దయాళువు దగ్గరికి అందరు చేరుకొంటారు. నిర్దయుని వద్దకు పోవడానికి లోకులు భయపడుతారు కదా! "అహంత్వా సర్వ పాపేభ్యః మోక్షయిష్యామి" అని భగవానుడు ప్రియతముడైన ఆశ్రితునికి - నరునికి - అభయ మిస్తానన్నాడు. తన ఆశ్రితునికి, ఆశ్రితుణ్ని ఆశ్రయించిన - చుట్టుముట్టిన - పాపాలకూ అభయమీయడం అసంభవం. నేరుగా ఆశ్రయించిన వారి సంబంధం కంటె ఆశ్రితుల నాశ్రయించిన వారి సంబంధం వ్యవహితం, అంటే ఎడం కలది. దగ్గరున్న వారిని కాపాడి దూరమున్న వారిని వదలి వేయడం మేలు. లేకపోతే వికల్పమేర్పడుతుంది.

తననాశ్రయించిన అపరాధులను కాపాడాలనుకొంటే, వారి అపరాధాలను నశింపజేయాలి. అంటే వారి అపరాధాలచే కలిగే ఫలాలను వారికి అందనీయ కూడదు అని అర్థం. వారి అపరాధాల-పాపాల-నే కాపాడాలని భావిస్తే, ఆశ్రితులను చేతులారా వదలి వేసి పాపాల వల్ల కలిగే శిక్షను, దండనలను వారికి అనుభవింప జేయాలి. కాబట్టి రెండింటిని ఒకేసారి రక్షించడం కుదరదు.

దయాదేవి సాక్షాత్తుగా ఆశ్రితులను రక్షిస్తుంది. ఆశ్రితులను ఆశ్రయించిన పాపాలను నిర్దాక్షిణ్యంగా వెలివేస్తుంది లేదా మ్రింగుతుంది. పాపాలను కాపాడని కరుణ, నిష్కరుణ అనబడింది. ఈ మాట పైకి నిందగా కనబడుతుంది కాని ఆలోచిస్తే, తుదకు స్తుతియే అని స్పష్టమవుతుంది.

"కః స్వర్ధుని! వివేకస్తే నయనే పాపినోదివమ్" - ఓ గంగాదేవీ! పాపాత్ములనూ స్వర్గానికి పంపిస్తుంటే ఇక నీకు వివేకమెక్కడుంది? అన్నట్లు, వ్యాజస్తుతి అలంకారం ఈ శ్లోకంలో ఉంది.

'నిష్కరుణ' అన్న మాటను శ్లోకంలోని ఉత్తరార్ధం నిరూపించింది. కాబట్టి, వాక్యార్థ హేతుక కావ్యలింగాలంకృత శ్లోకమిది.

భగవంతుణ్ని దయాళువని కీర్తించడమూ, జీవవర్గం నిర్భయంగా దయాదేవి నా్రశయించడమూ, ఉభయులకు భగవత్కృప చేత కలుగుతున్న లాభమిది.

మంజు॥ భవదీయ సంగతి గృపాళువయ్యె మా
ధవుడీవ నిర్దయతదాల్తు వందుచే
నవధీరితంబులయి యాశ్రితాఘముల్
దవుదవ్వులన్ బఱచు తల్లి! భీతిచే॥

27. అతిలంఘిత శాసనేష్వ భీక్ష్ణం
వృష శైలాధిపతిర్విజృంభితోష్మా।
పునరేవదయే! క్షమానిదానై
ర్భవతీ మాద్రియతే భవత్యధీనైః॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! ఆభీక్ష్ణం = మాటిమాటికి; అతిలంఘిత శాసనేషు = ఉల్లంఘింపబడిన దైవాజ్ఞ కలవారి యందు; విజృంభిత + ఊష్మా = తీవ్రమైన కోపంగల; వృషశైల+అధిపతిః = వృషాద్రీశుడైన శ్రీనివాసుడు; పునః = మళ్ళీ; భవత్యధీనైః = నీ చేత ఏర్పడిన (నీకు ఆధీనమైన) క్షమా నిదానైః = ఓర్పు యొక్క కారణాల చేత; భవతీం, ఏవ = నిన్నే; ఆద్రియతే = ఆదరిస్తున్నాడు.

తా: ఓ దయాదేవీ! అనేక పర్యాయాలు చట్టాన్ని మీరిన వారి యందు శ్రీనివాస భగవానునికి కోపం విజృంభిస్తుంది. అప్పుడు కూడా భగవానుడు నీ చేత ఏర్పడిన ఓర్పు యొక్క కారణాల చేత మళ్ళీ నిన్నే గౌరవిస్తాడు.

వ్యాఖ్య: క్షమకు హేతువులైన ఉపాయాల చేత నిగ్రహాన్ని మాన్పే దయను భగవానుడు ఎక్కువగా ఆదరిస్తాడని వర్ణన.

దయాగుణాన్ని స్తుతిస్తూ భగవానుని ఇతర గుణాలను నిరసించి నందువల్ల అవి సంతోషపడునట్లు కరుణను నిష్కరుణ అని కవి హేతుబద్ధంగా చమత్కరించాడు. భగవన్నిగ్రహాన్ని శాంతపరచే సామర్థ్యం అన్ని గుణాలకు ఉన్నా, దయా స్వామర్థ్యం జ్వరపీడితునికి చేసే చికిత్స లాగా ఉండడం వల్ల భగవానుడు దయను ఆదరిస్తాడని వర్ణించే శ్లోకమిది.

వృషశైలాధిపతిః :- శ్రీనివాసుడు కొండదొర. "ధర్మస్య ప్రభురచ్యుతః = ధర్మానికి అధిపతికాబట్టి ఆయన ధర్మగిరియందు వెలసి విశ్వాన్ని పాలించే శ్రీమన్నారాయణుడు. కొండలాగా కనబడే మేఘం వర్షిస్తే అంతస్సారమంతా పోయి చులకనై తేలిపోతుంది. తెల్లమొగం వేస్తుంది. మహోన్నతమై, దృఢమైన కొండగా ఉన్న ధర్మం, ఎంత కురిసినా, లోకమెన్ని విధాలుగా ఉపయోగించుకొన్నా, దాని వన్నె వాసి ఇంచుకంతైనా తరుగదు. అట్టి ధర్మగిరికి అధిపతి శ్రీనివాసుడే. ఆయన చేసేదంతా ధర్మమయం. ధర్మశాసనం చేసే వ్యక్తి ధర్మాధిపతి. అంతేకాదు. శ్రీనివాసుడు దేవదేవుడు. విశ్వమంతా ఆయన దివ్యమంగళ విగ్రహమందే ఇమిడియున్నది. బ్రహ్మదేవుడు ఆయన నాభీకమలమందున్నాడు. "పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్" అన్నట్లు తనకంటే తన పుత్రుడు గొప్పవాడు కావాలనే కోరుకొంటాడు కాబట్టి తననే కాక తదితర వస్తువులనన్నిటినీ చూపించే ప్రదీపం లాగా ఉండే ప్రామాణికమైన వేదాలను చతుర్ముఖ బ్రహ్మకు ఉపదేశించాడు. భగవదాజ్ఞా రూపమైన వేదరాశిని అర్థం చేసుకొని తాను సృజించిన లోకాలతో పాటు చతుర్వదనుడైన బ్రహ్మ పరబ్రహ్మయైన శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహానికి సమతౌల్యమైన గరిమస్థానంగా ఉండే నాభియందే ఉన్నాడు.

"వలత్తునన్ తిరిపురమెరిత్తవన్ ఇడమ్ పెఱత్తున్దితలత్తు" (తిరువాయ్ 3.9) నాభియందున్న బ్రహ్మదేవుడే కాదు; త్రిపురాలను దహించిన రుద్రుడు కూడా ఆయన కుడి ప్రక్కననే ఉన్నాడు. "స్వపార్శ్వే దక్షిణే శంభోర్నివాసః పరికల్పితః" అని స్మృతి కూడా ఈ విషాయన్నే బలపరచింది.

అర్చావతారం విభవావతారం కంటే ముందే జరిగింది. క్షీరశాయి యైన భగవానుడు, చతుర్ముఖ బ్రహ్మ నిత్యం పూజించడానికి తగినట్లు అనుగ్రహించండి అని ప్రార్థిస్తే ఈ వ్యూహ స్థలానికి రావడం, కుదరదని శ్రీరంగశాయి విగ్రహాన్ని నిత్యం సత్యం లోకంలోనే ఉండి పూజించుమని అనుగ్రహించినందువల్ల ప్రకృతి మండలంలో అర్చారూపాన్ని పూజించడం మొదట అతని పుత్రునికే ఘటించింది. తర్వాత విభవావతారంలో శ్రీరామ పాదధూళిచే భారతఖండమంతా పవిత్రమైన తర్వాతనే కదా పరమపదంగా వెలసిన "దేవానాం పూరయోధ్యా" అన్నట్లున్న

అయోధ్యలో, భగవదాజ్ఞచే బ్రహ్మదేవుడు ఆ శ్రీరంగ విమానాన్ని చాలా కాలం తపస్సు చేసిన ఇక్ష్వాకు మహారాజుకు ఇచ్చినందువల్ల శ్రీరామచంద్రస్వామి యొక్క పట్టాభిషేకమయ్యే దాకా పూజింపబడింది. క్రమంగా కలియుగంలో జనులు తనను భక్తిశ్రద్ధలతో ఉపాసించడానికి అనుగుణంగా ఒకచోట శేషశాయిగానూ, మరొకచోట పద్మాసనాసీనుడుగానూ వెలిశాడు. కలియుగ వైకుంఠ మనదగిన వృషాద్రియందు తనను సేవించిన వారికి ఈ సంసారసాగరం పూర్వకాయందాక నే ఉంటుందని ఒక చేతితోనూ, నా, ఈ చరణాలను శరణు పొందితే మీకు సంకటాలుండవు, దేహాంతంలోనూ నా చరణాలనే భజిస్తూ శాశ్వతానందం పొందుతారని సాక్షాత్తుగా నిరూపిస్తూ నిలచియున్న దివ్యరూపుడే శ్రీవేంకటేశ్వరుడు.

'వృషశైలాధిపతి' పదంలో దూదిపింజలాగా విప్పుతుంటే, గభీరార్థాలన్నీ నీటికొలది తామర' అన్నట్లు స్ఫుటంగా తెలుతుంటాయి.

"ధర్మార్థకామ మోక్షాణాం య ఇచ్ఛేత్ శ్రేయమాత్మనః ।
ఏకమేవ హరే స్తస్య కారణం పాదసేవనమ్ ॥" (భాగవతం)

చతుర్విధ పురుషార్థాల ద్వారా శ్రేయస్సును పొందదలచే వ్యక్తికి భగవచ్చరణార విందాలను సేవించడమొక్కటే చాలునని ధ్రువుని ఉపాఖ్యానం బోధిస్తుంది.

"జ్ఞాత్వాత మేవం మనసా హృదాచ। భూయోన మృత్యు ముపయాహి విద్వాన్" (హృదాచ = భక్తితో కూడా అని అర్థం) ఈ విధంగా తెలుసుకొని త్రికరణ శుద్ధిగా ప్రవర్తించేవాడే విద్వాంసుడు. అతడు మళ్ళీ సంసారమనే మృత్యుముఖంలోకి ప్రవేశించ లేడని ఉపనిషద్వాణి.

"పృష్ఠతోఽ ధర్మోజాతః" భగవానుని దక్షిణస్తనం నుంచి ధర్మం ఉదయించింది. వీపు నుంచి అధర్మం జనించింది అని భాగవతం, తృతీయ స్కంధంలో ద్వాదశోఽ ధ్యాయమందు వివరింపబడియున్నది.

"కామానుజేన సహసాత ఉపప్లుతాక్షః" (భాగ 3-15-31)

"ఉపప్లుతాక్షః" పరమాత్మనః ముఖదర్శనాత్ ధర్మస్యోదయః। ముఖ దిదృక్షిత భంగే సతి క్రోధః క్షుబితః" అని వీర రాఘవీయ వ్యాఖ్య. సనకసనందాదులకు

పరమాత్ముని ముఖాన్ని చూడగోరే కోరికను భంగపరిచి నందువల్ల క్రోధం చేత కన్నులెఱ్ఱబారి జయవిజయులనే వైకుంఠద్వార పాలురకు వారు శాపమిచ్చారు అని తెలుస్తున్నది.

భగవానుని వీపు (పృష్ఠ భాగం) అధర్మానికి సంకేతం.

బాలగోపాల కృష్ణుడు పరుగెత్తుతుంటే తల్లి యశోదా దేవి కొప్పు వీడిపోతున్నా, ఒక చేతిలో కఱ్ఱనూ, మరొకచేత కోకముడినీ పట్టుకొంటూ అతని వెంట పరుగెత్తుతుంది. అయ్యో! తల్లి ఇంత దూరం చెమటలు పోస్తూ ఉన్నా, తన వెంట బడిందని దయతో వెనుకకు దిరిగి నిలిచి ఉంటే, కృష్ణుని ముఖం చూచి చేతికఱ్ఱను పారవేసి, పట్టుకొని పోయి అతణ్ని కట్టివేసింది. ఈ సందర్భంలో కృష్ణ భగవానుని పృష్ఠ భాగాన్ని చూచినంతవరకు తల్లికి కోపం ఉండింది. అతని ముఖం చూచినంతనే కోపం శమించి వాత్సల్యం కలిగిందన్నారు వ్యాఖ్యాతలు. కాబట్టి, ధర్మస్వరూపమైన తన దివ్యమంగళ విగ్రహపురోభాగాన్ని ఆపాద కిరీటం భక్తులు దర్శించి తరించే విధంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఠీవిగా నిల్చియున్నాడు కదా!

అతిలంఘిత శాసనేష్వభీక్ష్ణం:- వేదాలు, శాస్త్రాలు భగవంతుని శాసనాలు. "శ్రుతిః స్మృతిర్మమైవాజ్ఞా యస్తా ముల్లంఘ్యవర్తతే । ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ మద్భక్తో ఉ పిన వైష్ణవః ॥"

వైదిక శబ్దాలు గభీరార్థాలు కలవి. వేదార్థాలను సులభంగా తెలుసుకోవడానికి ఆనాటి లోకుల వాడుకలో ఉన్న భాషలో ఋషులు అనువదించారు. సంస్కృత భాషయే లోకభాష. "వేదేలోకేచ" అని శబ్దశాస్త్రం చెబుతుంది. స్మృతులు సంస్కృత భాషలో ఉన్నాయి. శ్రుతులను స్మృతులను ప్రభు సమ్మితాలుగా వ్యవహరిస్తున్నారు. శ్రుతులు స్మృతులు విధి నిషేధాలను బోధిస్తాయి. అవి భగవానుని శాసనాలు. వైదిక శబ్దాలు మార్పును (పరివృత్తిని) సహించవు. ఆ శబ్దాలున్న చోట వాటి అర్థముండే పర్యాయపదాలను ఉపయోగించరాదు. అవిశిలా లిఖితాలైన చట్టాలు. భగవంతుని ఆజ్ఞారూపాలైన శ్రుతి స్మృతులను అనుసరించి లోకులు ప్రవర్తించడం ధర్మం. ఆ చట్టాన్ని మీరి ప్రవర్తించడం అధర్మం. శాసనాలను ఉల్లంఘిస్తే తన భక్తుడైననూ భగవానుడు అతణ్ని తనకు ద్రోహం చేసిన వానిగా భావిస్తాడు.

లోకులు ప్రాకృతిక భోగాలను అనుభవించడానికి మరిగి శాస్త్రం చెప్పిన ప్రక్రియలను ఆచరించరు. చేయరాని పనులను చేస్తుంటారు. శ్రీరాముని లాగా ప్రవర్తించాలి. రావణాసురుని వలె ప్రవర్తించ కూడదని మిత్రునిలాగా పురాణాలు చెబుతున్నా, మోహభ్రాంతులై అవినీతిగా జీవనం గడుపుతూ, ఇటు సమాజానికీ, అటు భగవంతునికీ ద్రోహులవుతున్నారు. ఇలా అధర్మంగా ప్రవర్తించే వారిపై ధర్మ ప్రభువుకు తాపం కలుగుతుంది. ఒక్కసారి తప్పు చేసినాడంటేనే తపించే ప్రభువుకు, చేసిన తప్పునే మరీ మరి పదే పదే చేస్తుంటే ఆగ్రహం అంబరమంటుతుంది.

అభీక్ష్ణం అంటే మాటికి మాటికి, ఎల్లప్పుడు అని అర్థం.

"ముహుః పునః పునః శశ్వదభీక్ష్ణ మసకృత్సమాః"

"అభీక్ష్ణం శశ్వదనారతే" ఉభయత్ర అమరం.

విజృంభితోష్మా:- 'ఉష ప్లుష-దాహే' అనే ధాత్వర్థం వల్ల, 'ఊష్మా' అంటే, హృదయం దహించే వారని అర్థం. 'ఊష - రుజాయాం' అనేదాన్ని బట్టి వేడిమి తాపంచే బాధపడువాడని అర్థం. తన శాసనాన్ని పదే పదే సహించరానట్లు మితిమీరి అపరాధాలను చేస్తున్న వారి మీద ధర్మశాసకుడైన ప్రభువుకు కోపం వస్తుంది. కోపం అగ్గిలాంటిది. కోపం చేత ఒళ్ళంతా కాలిపోతుంటుంది. ఆరాధుల చేత ఎంత ప్రసన్నుడవుతాడో, అపరాధుల చేత అంత విషణ్ణుడవుతాడు. హృదయతాపం లోన ఇముడక, దేహం మీదికి కూడా పొంగుతుంది. దండింపరాని వారిని దండించినా దండింపదగినవారిని దండించకున్నా ధర్మ ప్రభువుకు దోష జ్వరమే పట్టుకొంటుంది. ఈ తీవ్ర కోపజ్వరం, అపరాధులకు దండనను విధించి, శిక్షను అనుభవింపజేస్తేనే శాంతిస్తుంది.

ధర్మశాసనాన్ని ఉల్లంఘిస్తే ధర్మాన్ని మాత్రమేకాక శాసకుణ్ని కూడా అవమాన పరచిన వారవుతారు. 'అవమానం కంటే మరణం మేలు' అన్నంత సంతాపాన్ని కలిగిస్తుంది, భగవానుడు అపరాధుల విషయంలో తీవ్ర కోపం కలవాడవుతాడు - విజృంభితోష్మా, అనడం ప్రామాణికమైన మాట.

భవత్యధీనైః క్షమానిదానైః :- నీకు అంటే దయకు వశమైనవే మన్నించడానికి కారణాలు. క్షమా అంటే భారాన్ని ఓర్చుకొనేది క్షమా. "నిదానం త్వాదికారణం"

(అమరం) నితరాం దీయతే జన్యతే కార్యం ఇతినిదానం.దేనిచే కార్యం జనిస్తుందో అది నిదానం.ముఖ్య కారణమన్నమాట.

స్వాతంత్ర్యం, జ్ఞాన బలాదులు నేరం చేసిన వానికి దండనను విధించడానికి తోడ్పడి భగవానుని కోపాన్ని శమింపజేయడం ఒక రకం. కోపాన్ని శమింపజేసే దయావిధానం ప్రశంసింపదగినది.

నాణెం యొక్క రూపానికి బొమ్మ, బొరుసు అనే రెండు ప్రక్కలున్నట్లే దయా గుణానికి క్షమ అనేది మరొక వంక దానికి ఆధీనమై ఉంటుంది. చరాచర రక్షణ భారాన్ని వహించేది క్షమ.

"బాహ్యేచాధ్యాత్మికే చైవ దుఃఖేచోత్పాదితేసతి ।
నకుప్యతి నవాహంతి సాక్షమా పరికీర్తితా ॥"

శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో దుఃఖం కలిగించే రీతిగా బాధపెట్టినా, కన్నెర్ర చేసే చిహ్నమెరుగని ఓర్పుగల నేర్పునే 'క్షమ' అంటారు.

కాబట్టి, అపరాధులను దండించదలచే శ్రియః పతి వారి అపరాధాలను మన్నించడానికి కారణాలైన ప్రపత్తి, ప్రాయశ్చిత్తం మొదలైన ప్రవృత్తులను జీవుల చేత చేయిస్తుంది దయాదేవి. ప్రపత్తి అంటే సర్వరక్షకుడైన భగవానుణ్ని కాదని మమ్ములను మేమే రక్షించుకొంటున్నామనే బుద్ధిని మానుకొని మమ్ము రక్షించినా, రక్షించకపోయినా ఆయనదే భారం, అని మహావిశ్వాసంతో శరణుపొందడం. గోప్తృత్వవరణం - అంటే అఖండ బ్రహ్మాండాన్ని గోప్తా-రక్షకుడు - సర్వేశ్వరుడనే అధ్యవసాయంతో ఆత్మభరన్యాసం చేయడం. ప్రాయశ్చిత్తమంటే తమ తప్పును తాము తెలుసుకొని, ఇక మేము చేసిన నేరాన్ని ఎప్పుడూ చేయమని తన చెంపలను తానే కొట్టుకొని తమను తామే శిక్షించుకొని - భగవదనుగ్రహం కలిగేరీతిగా సత్కర్మల నాచరించడమని అర్థం.

గొప్ప ప్రపన్నులైననూ తాము అమర్యాదులుగానూ, క్షుద్రులు గానూ విన్నవించు కొని, భగవత్కృపా రసైక పాత్రుల వడానికి తమకు తామే నైచ్యాను సంధానం చేశారు.

"ననిందితం కర్మయదస్తిలోకే సహస్రశోయన్న మయావ్యధాయి" లోకంలో దూషింపదగిన పనిని నేను వేయి రకాలుగా చేయలేదనేది లేదు. అనేక పాప

కర్మలను చేసినా, నేనిలా చేసినాననే పరితాపం లేకుండా, అవి పండిన కాలమందు గత్యంతరంలేనివాడనై, దయాళువైన నీకు కూడా పరిహరింపరాని దశను పొందినవాణ్ని కాబట్టి, నీ యెదుట మొరపెట్టుకొంటున్నానన్నారు. దేశికులైతే, అపరాధ చక్రవర్తినని విజ్ఞాపన చేశారు. దయా స్వభావం చేత జీవులకు కలిగిన ప్రపత్త్యాద్యుపాయాలు భగవానుడు వారి అపరాధాలను మన్నించడానికి కారణాలవు తాయి. భగవానుని నిగ్రహం-కోపాగ్ని-చల్లార్చడానికి దయా దేవి ఒక డాక్టరుగా చేసిన చికిత్స లాంటిది ఈ ప్రక్రియ.

పునః భవతీ మేవ ఆద్రియతే:- మాత్ర చిన్నదైనా తీవ్ర జ్వరాన్ని శమింపజేసే గొప్ప వీర్యం కలదానిలాగా దయా గుణం కనబడుతుంది. "అతివీర్యవతీవ భేషజే, బహురల్పీయసి దృశ్యతే గుణః॥" అన్న సూక్తి స్మరణీయం కదా.

దయాపరతంత్రుడైన శ్రీనివాసునికి కలిగిన నిగ్రహాన్ని శాంతింప జేసింది. అపరాధులైన జీవాత్మలను, దండనను అనుభవించకుండా చేయడమే కాక భగవదనుగ్రహ పాత్రులనుగా చేసింది. కాబట్టి, ధర్మ ప్రభువైన శ్రీనివాసుడు ఇంతకు ముందుకంటె అధికంగా దయా దేవిని గౌరవించాడు. గౌరవింపబడిన దయాదేవి శ్రీనివాసుని కన్న ఎంతో మిన్న కదా!

మంజు॥ అతిలంఘితాజ్ఞులగు నస్మదాదులం
దతికోపియైన వృషభాద్రినాథుడున్।
హితవైక్షమించు గతులీవ చూప మా
కతి మాత్రతన్ కరుణ! యాదరించునిన్॥

28. కరుణే! దురితేషు మామకేషు
ప్రతికారాంతర దుర్జయేషు ఖిన్నః।
కవచాయితయా త్వయైవ శార్‌ఙ్గీ
విజయస్థాన ముపాశ్రితో వృషాద్రిమ్॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! మామకేషు = నాకు సంబంధించిన; దురితేషు = పాపాలు; ప్రతికార + అంతర, దుర్జయేషు (సత్సు) = మాఱు క్రియల

చేత జయింప సాధ్యం కానప్పుడు; ఖిన్నః = విషణ్ణుడైన; శార్‌ఙ్గీ = శార్‌ఙ్గం అనే వింటిని ధరించిన శ్రీనివాసుడు; కవచాయితయా = కవచంగా ఉన్న; త్వయా = నీచేతనే; వృషాద్రిం = వృషగిరిని; ఉపాశ్రితః = ఆశ్రయించి ఉన్నాడు.

తా: ఓ దయాదేవీ! నా పాపాలు వేరే ఉపాయాలచే గెల్వరానివవుతుంటే మనోవేదన కల్గిన శ్రీనివాసుడు శార్‌ఙ్గ పాణియై దయాదేవిని కవచంగా ధరించి తిరుమలయందు నివసించి ఉన్నాడు.

వ్యాఖ్య: శ్రీ వేంకటేశ్వరుడు తిరుమలయందు శాశ్వతంగా ఎందుకు వేంచేసి యున్నాడో వివరిస్తున్న శ్లోకమిది.

దైవాజ్ఞను మీరినందువల్ల ఆగ్రహోదగ్రుడైన శ్రీనివాసుడు, అపరాధులను దండింపకుండా పశ్చాత్తాప ప్రాయశ్చిత్త ప్రపత్తుల నాచరింపజేయగా, శాంతించి అనుగ్రహంతో క్షమించడం చేత దయాదేవి యొక్క మాహాత్మ్యం పొగడబడింది. ఆ విషయాన్నే ఇందు మరొకవిధంగా వర్ణిస్తున్నారు దేశికులు.

దురితేషు మామకేషు దుర్జయేషు:- పూర్వ శ్లోకంలో 'తావక' శబ్దాన్ని ప్రయోగించారు. ఈ శ్లోకమందు 'మామక' శబ్దం ప్రయుక్తం. దేశికులు తనను చేరిన పాపాలు సామాన్యమైనవి కావని, తాను 'మహాపాపి' అని నిరూపించు కొంటున్నారు.

ఇతరులను మహా పాపాత్ములనడం కన్నా, తనను తానే మహా పాపిగా చెప్పు కోవడంలో గొప్పతనముంది, నమ్రత ఉంది. తాను వేలకొలది పాపాలను చేసినందు వల్ల అవి తనను భగవంతునికి ప్రతిభటునిగా చేస్తున్నాయి. భగవానుడు 'నీవు నావాడవని (త్వంమే) తన వశం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటే (అహంమే) నాకు నేను స్వతంత్రుడను, నీవాడను కాను అని ఎదిరిస్తున్నట్లు తనను నిలబెడుతున్నాయి. పాపాలన్నీ బాణాలై భగవానుని హృదయాన్ని గాయపరుస్తున్నాయి.

ప్రతికారాంతర దుర్జయేషు ఖిన్నః = క్షణార్ధకాలమందే - రెండు నిమిషాలలో చేతనులు చేసే పాపాలు, కల్పకోటి కాలం దాకా అనేక జన్మలెత్తి, అనుభవించినా తీరిపోని - నశించని విధంగా ఉంటాయి. పాప ఫలం అనుభవిస్తే అంతమై

పోతుందంటారు కదా! ఉప్పొంగి చెంగలిస్తున్న పాప సముద్రాన్ని ప్రాయశ్చిత్తాది కర్మల నాచరించి శోషించేయవచ్చునని శాస్త్రం చెబుతుంది. కాని ఆప్రాయశ్చిత్తాది కర్మలను – పుణ్యతీర్థస్నాన, దాన, జప, తపో హోమాది కార్యాలనుచేస్తున్నప్పుడు కూడా, మంత్రతంత్ర స్వర వర్ణాది లోపాలెన్నో కలిగి, అనేక దోషాలు సంభవిస్తుంటాయి. పాపరాశులు గుట్టలు గుట్టలుగా పెరిగిపోతుంటాయి. ఖర దూషణాది రాక్షసులు పద్నాల్గు వేల సంఖ్యలో ఉన్నా, ఒక్క బాణాగ్ని చేత శ్రీరామ చంద్రమూర్తి, వారిని భస్మం చేసి విజయలక్ష్మిని పొందాడు. రక్తబిందువులతో కూడియున్న నీలమేఘశ్యామ సుందర విగ్రహం, వికసించిన కమలాలతో ప్రకాశించే సరోవరం కదలివస్తున్నట్లు, వీరపత్నియైన సీతాదేవికి కనబడింది. శత్రుహంతకుడైన శ్రీరామచంద్రుణ్ని సీతమ్మ గాఢంగా కౌగలించుకొన్నది. ఆ వీరుడు సమరా యాసమంతా తీరిపోయి అపారమైన ఆనంద జలధి విలోల వీచికలలో ఓల లాడాడన్న వాల్మీకి వాగమృతం శ్రుతిపేయం కదా!

"వ్యసనేషు మనుష్యాణాం భృశంభవతిదుఃఖితః ।
ఉత్సవేషుచ సర్వేషు పితేవ పరితుష్యతి ॥"

కోసల దేశ పౌరులు పండుగ పబ్బాలలో ఆనంద పడుతున్నప్పుడు శ్రీరామభద్రుడు తండ్రిలాగా బ్రహ్మానందాన్ని పొందుతాడట. ఆ పౌరులకు ఆపదలు కలిగినప్పుడు వారికంటె ఎక్కువగా తానే దుఃఖపడుతాడట. చేతనులకు కరణ కళేబరాలనిచ్చి భగవత్ప్రీతి కరాలైన సత్కర్మల నాచరిస్తారని ఆశించే భగవానుడు, సంసార భోగాలను అనుభవిస్తూ, ఎనలేని ఎన్నరాని పాపాలను చేసి తనకు పరిపంథులుగానూ, ప్రతియోధులుగానూ నిల్చినప్పుడు వారి పాపాలను జయింప సాధ్యపడదని విచారమగ్నుడవుతాడు. ఈ శాస్త్రార్థాన్ని తన వృత్తిగా మల్చుకొని విశదపరచారు దేశికులు. తన పాపశస్త్రాలు భగవంతుణ్ని వేధిస్తుంటే, ఆయన ఏ విధంగాను వాటిని గెల్వలేక మనోవేదన పడుతున్నాడన్నారు. ఆ పాపాలకు ఫలమైన దండన – శిక్షనుంచి ఆ జీవులను తప్పించి రక్షించడానికి ఇంతటిదని చెప్పరానంత చింత పడుతున్నాడని అర్థం.

కవచాయితయాత్వ య్యైవ శార్ఙ్గీ:- శ్రీ మహావిష్ణువు ధరించే ధనుస్సుకు శార్ఙ్గమని పేరు. శార్ఙ్గం కలవాడు శార్ఙ్గీ. ఆశ్రిత రక్షకుడైన శ్రీనివాసునికి శంఖ చక్రగదా ఖడ్గ శార్ఙ్గాలు అనే పంచాయుధాలు అనర్ఘ ఆభరణాలుగానూ, ఆశ్రయించిన వారి శత్రువులను నిరసించడానికి ఆయుధాలుగానూ ఉపయోగ పడుతాయి.

యుద్ధం చేసే ప్రవృత్తి కలవారు యోద్ధులు. యోద్ధ కవచాన్ని ధరించి యుంటాడు. కవచమంటే మేజోడు. "కం వాతం వంచయతి ఇతి కవచః" 'వంచు' గతౌ, అని ధాత్వర్థం. గాలిని, శరీరానికి తగులకుండా, పట్టుకొనే చొక్క

"తనుత్రం వర్మ దంశనమ్, ఉరశ్ఛదః కంకటకో జగరః కవచోఽ స్త్రియామ్" (అమరం) కవచం వలె చేయబడిన అనే అర్థం గల పదం కవచాయిత. 'త్వయా' అనే పదానికి 'కవచాయితయా' అనేది విశేషణ పదం.

పాపాలను నశింపజేయడానికి ఇతర గుణాలను విడిచి దయను ఆశ్రయించాడు శార్ఙ్గి. దయ తప్ప వేరే గతిలేదు. దయైకాధీనమైన క్షమ తో నే తప్ప వేరే ఏ ప్రతిక్రియను చేయడం శక్యం కాదు. కాబట్టి పాప శస్త్రఘూతాభిఘాతా లను, శరీరానికి తగులకుండా, తట్టుకొని నెట్టడానికి తగిన కవచంగా క్షమాయుక్త మైన దయను శార్ఙ్గి ధరించాడు. "తితిక్షా వర్మయుక్తస్య ప్రతియోధీ నదృశ్యతే" ఓర్పు అనే కవచాన్ని ధరించిన వానికి ప్రతియోధి అంటే తనతో యుద్ధం చేసేవాడే కనబడదు.

"నతితిక్షా సమమస్తి సాధనం" అని భారవి చెప్పినట్లు, పాపాలనే శత్రువులను గెల్వలేనని నైరాశ్యం కలిగిన యోద్ధకు ఓర్పుతో సమానమైన వేరే సాధనమే లేదు కదా! "జీవన్ భద్రాణి పశ్యతి" (బ్రతికి యుండిన శుభములు బడయవచ్చు" "ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి" (రా.సుం.) సహనంతో జీవితం గడుపుకొనే వ్యక్తికి నూరేండ్లకైనా ఆనందం కలుగుతుంది. అనే లోకోక్తులను తలచుకొని "సర్వేణతు ప్రయత్నేన గిరిదుర్గం సమాశ్రయేత్" - అన్ని రకాల ప్రయత్నంతో పర్వత దుర్గాన్ని ఆశ్రయించాలని మనువు చెప్పిన మాటను ఆదరించాలనుకోవడం సహజమే.

శార్ఙ్గీ విజయస్థానముపాశ్రితో వృషాద్రిమ్:- ప్రబల శత్రువులను ఇంక కొన్నాళ్ళకైనా గెల్చి విజయుడనవుతాననే విశ్వాసంతోనే దయ అనే దృఢమైన కవచాన్ని ధరించిన శార్ఙ్గి - శ్రీనివాసుడు విజయాన్ని కలిగించే వృషగిరి యందు పొందికగా ఉన్నాడు.

"ధన్యాని స్థలవైభవేన కతిచిద్వస్తూని" అన్నట్లు దివ్యక్షేత్రాలలో కెల్ల వృషాద్రి తిరుమల - క్షేత్రం విజయశ్రీని కలిగిస్తుంది. "యతో ధర్మస్తతో జయః" అని గాంధారి పలికినట్లు, వృషాద్రి ధర్మ క్షేత్రం కదా! "మామకాః పాండవాశ్చైవ" (భ.గీ.) పాండవులను కాక తన పుత్రులైన దుర్యోధనాదుల మీదనే మమకారం ఉండి పల్కినందు వల్లనే 'మామకాః' అనబడినవారందరు ధర్మక్షేత్రమందు నశించారు. "స్థాన బలిమికాని తన బల్మి కాదయా" - అన్నట్లు ధర్మరాజాదులు జయశ్రీని పొందారు. దేశికులు ఈ శ్లోకంలో 'మామకేషు' - తనను చేరిన పాపాలు కూడా ధర్మక్షేత్రమైన తిరుమలయందు అవశ్యంగా నశిస్తాయనే అధ్యవసాయంతో దేశికులు ఆ పదాన్ని ప్రయోగించారు. బ్రహ్మాండంలోనే వేంకటాద్రితో సమమైన దివ్యస్థానం లేదు కదా! పెద్దలు ఈ దివ్యక్షేత్రమందు 'భరతవర్షే, భరతఖండే' మొదల్కొని 'వరాహక్షేత్రే ఆనంద నిలయ విమానచ్ఛాయాయాం' అంటూ నిత్యం సంకల్పం చెబుతుంటారు.

శ్రియఃపతి శ్రీ వైకుంఠంలో "సదా పశ్యంతి సూరయః" అన్నట్లు తననే సేవిస్తూ, జాగరూకులై నిత్య సూరులు, దివ్యసూరులందరు స్తోత్రం చేస్తూ తనవలె ప్రకాశించే వారు కదా! తాను వారిపై దయను ప్రత్యేకంగా ప్రసరింపజేసే అవకాశం లేదనీ, అనేక అవస్థలు పడుతున్న సంసారులు తన కృపాకటాక్షాన్ని ప్రసరింపజేయాలని ప్రార్థిస్తుంటారు కాబట్టి దయ యొక్క ప్రాభవ వైభవాలు ప్రకృతి మండలంలోనే విశేషంగా ఆదరింపబడుతాయనీ దయాళువై పరమపదాన్ని విడిచి, ధర్మక్షేత్రమైన వేంకటాద్రియందు "ఇంద్ర ఇవేహ ధ్రువ స్తిష్ఠ" "ఇది పరమైశ్వర్యే" అని ధాత్వర్థం. పరమైశ్వర్యంతో మహాభోగివై పరమపదనాథుడుగా ఉన్నట్లే ఇక్కడ కూడా ఐశ్వర్య భోగవిలాసాలతో స్థిరుడవై నిల్వు 'మని' వేదం శాసించినట్లే, అర్చామూర్తిగా ఆవిర్భవించాడు. ఈ దివ్యక్షేత్రానికి "వషవిలా! వడిమై శెయ్యం వేండుమ్" ఎడ

తెగకుండా ఎల్లకాలం భగవత్కైంకర్యం చేద్దామని బ్రహ్మాది దేవతలూ దిగివస్తారు, సామాన్యులు ధీమాన్యులైన మానవులూ ఎక్కి వస్తారు. వారందరు కలిసి మెలసి అక్కడ తమ ఉనికిచే ప్రకృతిని రంజింపజేస్తున్న స్థావర జంగమాదులను సందర్శించిన కారణంగా సత్వగుణప్రబుద్ధులై, అంజలిబద్ధులై, క్షమాహేతుకాలైన ప్రదక్షిణ, ప్రణామార్చనాది సేవల చేత పాప వర్జితులై "శ్రీనివాస గోవిందా" అనే నామ స్మరణతో శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క దయా తరంగితాంతరంగులవు తున్నారు. ఈ శ్లోకంలోని శార్ఙ్గీ, వృషాద్రి, మామకేషు పదాలు సాభిప్రాయాలు కాబట్టి పరికరాంకురాలంకార శోభితాలు. ప్రకృతమైన దయాస్తోత్రంతోపాటు, అ ప్రకృతమైన శత్రుజయమనే లోకవృత్తాంతమూ గోచరిస్తున్నందువల్ల సమాసోక్తి అనే అలంకార సజ్జిత మీ శ్లోకం.

భగవానునికి పాపాలను జయించడమూ, జీవులుదురిత వర్జితులవడమూ, దయాదేవి వల్ల కలిగిన సౌకర్యాలే.

మంజు॥ ప్రజలాచరించు నఘరాసులొండుమై
విజితంబుగామిపలవించి శార్ ఙ్గీ, ని
త్యజయార్థి దేవి! మఱువై ధరించి, నిన్
విజయస్థలంబుగొనె వేంకటాద్రిపై ॥

29. మయితిష్ఠతి దుష్కృతాంప్రధానే
మితదోషానితరాన్వి చిన్వతీత్వమ్।
అపరాధగణై రపూర్ణ కుక్షిః
కమలాకాంతదయే! కథంభవిత్రీ ॥

అర్థం: హే కమలాకాంతదయే = శ్రీకాంతుని ఓ దయాదేవీ! దుష్కృతాం = పాపవర్తనులలో; ప్రధానే = అగ్రగణ్యుడనైన; మయి, తిష్ఠతి (సతి) నేను, ఉండగా; మితదోషాన్ = స్వల్ప దోషాలు గల; ఇతరాన్ = వేరే జనులను; విచిన్వతీ = వెదకుతున్న; త్వం = నీవు; అపరాధగణైః = పాపరాశులచే; అపూర్ణకుక్షిః = నిండని పొట్టగలదానవై; కథం = ఎట్లు? భవిత్రీ = కాగలవు? (జీవింపగలవు)

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! పాపులలో కెల్ల అగ్రేసరుడనైన నేను నీ యెదుట నిల్చున్నాను. నీవేమో కొంచెం పాపం చేసిన వ్యక్తులనే వెదకుతున్నావు. పాప సముదాయాల చేత కడుపు నిండని దానవై ఎలా బ్రతుకుతావు?

వ్యాఖ్య: దయాదేవి మీద దయ కలిగిన కవి, మహాపాపియైన తన పాపోపహారాన్ని స్వీకరింపుమని దయను వేడుకొంటున్న శ్లోకమిది.

భవరోగ చికిత్స బహువిచిత్రమైనది కదా! పాపాలను జయింప దలచిన శార్ఙ్గపాణి తన ధనుస్సును ప్రయోగించక, భయానికన్నా నయానికే ప్రాధాన్యమిచ్చి, దయాకవచాన్ని ధరించి, మరోదారిని బట్టక, విజయస్థాన మైన వేంకటాద్రి యందు ఆశ్రితుల పాపనిబర్హణార్థం నిరీక్షిస్తూ, నిల్చి ఉన్నాడన్నారు. పూర్ణావతారుడైన శ్రీ వేంకటేశ్వరుడు దయా పరతంత్రుడు, ఆయన పత్ని యైనందువల్ల దయాదేవి చిరుతిండి తినక, ఆచార్యులు సమర్పించే పుష్టికరమైన మృష్టాన్నాన్ని కడుపు నిండా తిని, పూర్ణానుగ్రహంతో 'అన్నదాతా సుఖీభవ' అని తనను ఆశీర్వదించాలనే శ్లోకమిది.

కమలాకాంతదయే:- శ్రీ వేంకటేశ్వరుడు సిరిమగడు. దేవతిర్యఙ్మనుష్య స్థావరాలతో పూర్ణమైన జగత్తు ఆయన సొత్తు.

"యస్యబ్రహ్మచక్షత్రంచ ఉభే భవతి ఓదనమ్ ।
మృత్యుర్యస్యో పసేచనం క ఇత్థా వేద యత్రసః ॥" (కఠోపనిషత్ 2-25)

'చరాచరాత్తా' పరమాత్మ. చరాచరాలు రెండు (జగత్తు) పరమాత్మకు అన్నం; మృత్యువు నంచుకొనే ఊరుగాయ కదా! ముజ్జగాలను బొజ్జలో పెట్టుకొన్న పూర్ణ పురుషుడు భగవానుడు.

"ఇదం పూర్ణమదః పూర్ణం, పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥" (శ్రుతి)

ఇదం, పూర్ణం:- అంతర్యామి అనే భగవత్తత్త్వమిది కల్యాణ గుణపూర్ణమైనది.

అదః, పూర్ణం:- వైకుంఠమందుండే పరరూపమది గుణ పరిపూర్ణమైనదే.

పూర్ణాత్, పూర్ణం ఉదచ్యతే:- జ్ఞానశక్త్యాది షడ్గుణ పూర్ణమైన పరరూపం నుంచి, రెండేసి గుణాలతో పూర్ణమైయున్న వ్యూహరూపం, పలు రకాలుగా ఆవిర్భవించింది.

పూర్ణస్య: పాలకడలి పై పవళించిన అనిరుద్ధ వ్యూహరూపం నుంచి ఏర్పడిన పూర్ణానికి సంబంధించిన,

పూర్ణం, ఆదాయ:- గుణపరిపూర్ణమైన విభవరూపాన్ని తనకు నిమిత్తంగా గ్రహించి,

పూర్ణం ఏవ, విశిష్యతే:- సౌలభ్య సౌశీల్యాది గుణాలతో మరింత పూర్ణమైన అర్చావతారమే పంచావతారాలలో చివరి సీమగా నిలిచింది. ఇది వేద ప్రతిపాదితమైన విషయం.

వృషాద్రీశుడై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వృషోదరుడు కూడ. ధర్మబుద్ధితో భక్తులర్పించిన పదార్థాలను స్వీకరించి తృప్తి పడే గుణపూర్ణుడు.

"భక్తైరణ్వప్యుపానీతం ప్రేమ్ణాభూర్యేవమే భవేత్ ।
భూర్యప్యభక్తోపహృతం నమేతోషాయకల్పతే ॥"

భక్తుడు కానివాడు ఏడుకొండలెక్కడు. ఎక్కి వచ్చినా గొప్ప వెలగల వస్తువులను తెచ్చి ఇస్తున్నాననుకొంటే, అది ఆయనకు సంతోషాన్ని కలిగించదు. ఆ వస్తువు మధ్యలోనే ఏ దొంగపాలో, దొరపాలో అవుతుంది.

భక్తులు (పత్రమో పుష్పమో) స్వల్ప వస్తువును ప్రేమతో సమర్పిస్తే, దాన్ని ఎంతో ఘనంగా భావించేవాడు పరమాత్ముడని భాగవతం బోధిస్తున్నది కదా! అవాప్త సమస్త కాముడు కూడా "నానావాప్తమ వాప్తవ్యం" (భ.గీ.) భగవానుడు పొందనిది లేదు, పొందదగినదీ లేదు. ఏ లోటు లేని వాడు కాబట్టి ఆయనకు 'పూర్ణు'డన్నదే అన్వర్థ నామం. తాను 'పూర్ణుడే' కాబట్టి, ఆశ్రితుల కోరికలనూ పూరించి 'పూరయిత' అన్న నామంతోనూ స్తుతింపబడుతున్నాడు. ఇట్టి విర్థయ్యకు పట్టమహిషియైన ఓ దయాదేవీ! అన్న సంబోధనాంత పదం, శ్లోకించే భావాన్ని పూర్ణంగా గర్భీకరించుకొన్నది.

మయితిష్ఠతి దుష్కృతాం ప్రధానే:- నీవు నా భర్తకు ప్రతియోద్ధగా నిల్చి, పాపపు టమ్ములతో పదే పదే వేధిస్తూ ఖేదం కలిగిస్తుంటే, నీకు నేను చేసేదేముంది? నిన్నెలా రక్షిస్తాను? అని దయాదేవి ఆక్షేపించగా, ఆచార్యుల సమాధానమిట్లున్నది. దేవీ! దుష్కృతులలో కెల్ల ముఖ్యుడను నేనే సుమా! అన్నారు. 'దుష్కృతం' అంటే పాపం. "అంహో దురిత దుష్కృతం" (అమరం) దుష్కృతం చేసిన వ్యక్తిని 'దుష్కృత్' అంటారు. (తకారాంత మరుత్ శబ్దం లాంటి పదమిది) దుష్కృచ్ఛబ్దం యొక్క షష్ఠీ విభక్తి బహువచనమే దుష్కృతాం అవుతుంది. లోకులు నిందించే పనులను చేసిన వాళ్ళల్లో మొదట లెక్కింప దగిన వాడను నేను.

"దయనీయో మదన్యోఽస్తి తవకోఽత్రజగత్త్రయే" మూడు లోకాల్లో నీకు దయనీయుడనైన నా కంటే ఇంకొకడెవడున్నాడు? పలురకాలుగా నేను చేసిన పాపాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. "ఇడగిలేన్ ఒన్టు" = ఒక్కనికైనా పిల్చి అన్నం పెట్టనే లేదు. సరికదా! ఆకలితో కడుపులో పేగులు అరుస్తుండగా ప్రాంగణంలోకి వచ్చి 'అన్నమో రామచంద్రా' అని మొరపెట్టుకొన్న వాళ్ళకు కూడా ఒక్క బిచ్చమైన పెట్టిన వాడను కాను.

'అట్టగిల్లేన్' = నోరెండిపోయి మాట పెకలక దోసిలి నోటి ముందు పెట్టుకొని నాలుకెళ్ళ బెట్టిన వాళ్ళకు గ్రుక్కెడు నీరు పోసినవాడనూ కాను. లోకం లెక్కించే కర్మయోగం చేయనే లేదు.

'ఐమ్ పులన్ వెల్లగిల్లేన్' = జ్ఞానేంద్రియాలైదింటిని అదుపులో ఉంచుకొన్న వాడనూకాను. కాబట్టి జ్ఞానయోగం లో అడుగే పెట్టలేదు.

"కడవనాగి కాలంతోఱుమ్ పూప్పఱిత్తు ఏత్తగిల్లేన్" = నియమం కలిగి తగిన వేళల్లో పూలు సమర్పించి పూజించిన వాడనూ కానందువల్ల భక్తియోగం తెలియనే తెలియదు.

అకించనుడను, అవివేకిని 'వల్వినెయేన్' - ఘోరపాపినైన నేను 'యయాకయాచ విధయా బహ్వన్నం ప్రాప్నుయాత్" అనే ఉపనిషద్వాక్య రీతిగా, ఏ విధంగానో నీకు బహువిధ విచిత్ర రుచులను కలిగించే పుష్కలమైన ఆహారాన్ని తీసుకొని వచ్చి నీ ముందే నిలుచున్నాను కదా! "అనుత్తమం పాత్రమిదం

దయాయాః" దయా పాత్రమవ దానికి ఇంతకంటె ఉత్తమమైనది లేనేలేదని విజ్ఞుల మాట.

మితదోషానితరాన్ విచిన్వతీ త్వమ్:- నీ కోసం పుష్టికరమైన ఆహారాన్ని పట్టుకొని వచ్చి నీ యెదుట నిలచియున్న నన్నే మాత్రం కటాక్షించక వదలిపెట్టి, స్వల్పదోషులైన వ్యక్తులను రక్షించడానికి నీవు వెదకుతున్నావు. ఇదేమీ రీతి? "సిద్ధమన్నం పరిత్యజ్య భిక్షా మటతి దుర్మతిః" తినడానికి సిద్ధమై యున్న అన్నం విడిచిపెట్టి, దుష్టబుద్ధి కల వ్యక్తి భిక్షాటన చేస్తున్న న్యాయాన్ని నీవు పాటిస్తున్నావు. ఈ నీ విధానం నీకుగానీ, నాకు గానీ శ్రేయస్కరమైనది కాదు. నీకు పూర్ణత్వం, కలుగదు, నాకు పాపరాహిత్యముండదు. పైగా, స్వల్పదోషులను వెదకుతుండే శ్రమయే నీకు మిగులుతుంది.

అపరాధగణైః అపూర్ణకుక్షిః :- అసంఖ్యేయాలైన దోషరాశులచేత పూర్ణుడను నేను. నా యందు పాపవర్గాలున్నట్లు ఇతర జనులయందు లేవు; నీకు కడుపు నిండుతుంది. పుష్టికలుగుతుంది. శ్రీకాంతుని పత్నివైన నీకు పూర్ణత్వం సిద్ధిస్తుంది. "పూర్ణతాగౌరవాయ" అన్నట్లు నీకు గౌరవమేర్పడుతుంది. తృప్తి కలుగుతుంది. నాకు దయనీయులలో ప్రథమస్థానం లభిస్తుంది.

స్వల్పదోషులను వెదకుతున్న నీవు రొట్టెలవానికంటె ముక్కలను అడుక్కొనేవాడు మేలనుకొంటున్నావా? అది నీ స్వరూపానికే హాని. తృప్తి కలుగదు. పరిపూర్ణత ఏర్పడదు. బండి మీద అమ్మబడే తిండిగింజలను - పల్లి పల్కులను, వేచిన బటానీలను, మక్కజొన్న పేలాలను కాచిన నూనెలో ముంచి దేవిన పప్పుగింజలను ఎన్ని బుక్కినా షడ్రసోపేతమైన అన్నం తిన్నట్లుండదు.

అపూర్ణకుక్షిః కథంభవిత్రీ:- కడుపునిండా తినని వాళ్ళకు జవసత్త్వాలుండవు. ముఖ్యంగా నీ బ్రతుకుమీద నీకు చింతయే లేదు కదా! నా మేను పాపాలబోను. పెద్ద పెద్ద పాపాలను పట్టి తెచ్చాను. నీవు వాటినన్నింటిని మిగులకుండా తిను, నన్ను ఆవశ్యంగా కాపాడవలసిన బాధ్యత నీయందే ఉంది.

కడుపునిండా తినక డొక్క నకనకలాడుతుంటే నీవేమవుతావో, ఎలా జీవిస్తావో అనే చింత, వగ నాకే కలుగుతున్నది. పూర్ణుడైన శ్రీకాంతుని పత్నివైనందు వల్ల

ఓ దయాదేవీ! నీవు కూడా రూప, గుణపూర్ణవై యుండాలని నా వేడుక. దయనీయుడనైన నా ముందు నీవు దయనీయ స్థితిని పొందకుండా జాగ్రత్త పడాలి. నీవల్ల భగవత్సన్నిధి నిర్భయంగా చేరుకోగలనన్న దృఢాధ్యవసాయం నాకు కలుగుతుంది. దయనీయులలో ఉత్తముడు లభించాడని కమలాకాంతుని డెంద మానందంతో కందళిస్తుంది. వ్యాజస్తుతి చమత్కృతిమత్కృతి ఇది.

మంజు॥ అపరాధభాజనుల కగ్రవర్తినై
కృప! నేనిటుండ పరికింప కీవు స్వ
ల్పపు పాపులైన జనులన్ దలంచుటే
నిపుణంబు? నీకడుపు నిండుటెట్లగున్ ?

30. అహమస్మ్యపరాధచక్రవర్తీ
కరుణే! త్వంచ గుణేషు సార్వభౌమీ।
విదుషీస్థితి మీదృశీం స్వయంమాం
వృషశైలేశ్వర పాదసాత్కురుత్వమ్ ॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! అహం = నేను; అపరాధ చక్రవర్తీ = అపరాధాలకు చక్రవర్తినై; అస్మి = ఉన్నాను; త్వం, చ = నీవు కూడా; గుణేషు = గుణాలయందు; సార్వభౌమీ = సమ్రాజ్ఞివి. ఈదృశీం = ఇట్టి; స్థితిం = పరిస్థితిని; విదుషీ; తెలిసియున్న; త్వం = నీవు; మాం = నన్ను; స్వయం = స్వతంత్రంగా; వృషశైలేశ్వర పాదసాత్కురు = వృషాద్రికి అధిపతియైన శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క చరణాలయందు చేర్చుము.

తా: ఓ దయాదేవీ! నేను అపరాధాల కెల్ల చక్రవర్తిని. నీవూ అసంఖ్యేయ గుణాలకు సార్వభౌమివి. ఇలాంటి మన ఇద్దరి స్థితిని బాగా తెలిసియున్న దానవు. కాబట్టి, నీవే స్వయంగా స్వతంత్రించి నన్ను శ్రీ మలయప్ప పాదాల కడ చేర్చవలెను.

వ్యాఖ్య: దయాదేవితో హేతువాదన చేస్తున్న తార్కికకవి, తన కోరిక నీడేర్చుమని వేడుకొంటున్నాడు.

"దుష్కృతాంప్రధానే" అపరాధులలో అగ్రేసరుడను, "అహమన్న మహమన్నమ్" అన్నట్లు, నా పాపాలనే మృష్టాన్నాన్ని భుజించి, నీ ఉనికికి తగినట్లు పూర్ణతను కలిగియుండమన్నాడు. ఈ శ్లోకంలో, నేనేమీ సామాన్యుడను కాను; నీ బలమూ, నా బలమూ ఎంత పూర్ణంగా ఉన్నదో చూచుకొందామని కవి కయ్యానికి కాలుదూచాడు. ఓడిన వ్యక్తి బానిసగా బ్రతుకడం న్యాయమే కదా! నీకే జయం కలిగినప్పుడు స్వాధీన పతికవు కాబట్టి, నీవే స్వయంగా నన్ను బంధించి, తీసుకొని పోయి నీ పెనిమిటి కాళ్ళ కడబానిసగా పడవేయుమని అకామహతులైన దేశికులు తమ హృదయాన్ని అందంగా, ఆనందంతో ఆవిష్కరిస్తున్నారు.

కరుణే:- బండబారిన గుండె కలవారిని కూడా బావురుమని పించి, వశపరచుకొనే సత్తకల్గిన కరుణాదేవి సంబోధింపబడింది. అహ మస్మి అపరాధ చక్రవర్తీ = (1) నేను అపరాధ చక్రాన్ని త్రిప్పుతున్న వాడను. అపరాధాలను పోషిస్తున్న జగదేకవీరుడను. (2) "అహమస్మి ప్రథమ జాఋతస్య పూర్వం దేవేభ్యో అమృతస్య నాభిః" అని, నిత్యసూరులు పరమ పదనాథుణ్ని స్తోత్రం చేస్తారు. ఋతస్య = సత్యమైన జగత్తుకు (సృష్టికి); ప్రథమజః = మొదట రూపం కలవాడను. దేవేభ్యః = దేవతలకంటే; పూర్వం = ముందు; అమృతస్య = అమృతానికి; నాభిః = ఆశ్రయ భూతుడనై; అహమస్మి = నేనున్నాను. (ఉపనిషత్ = భృగువల్లీ - వాక్యార్థం) ఆచార్యులు అమృతానికి నాభి కాదు; అపరాధ చక్రానికి మాత్రం నాభి; అంటే భగవద్భాగవతా పచారాదులనబడే అపరాధ మండలం మధ్య ఉన్నవాడని అర్థం. ఈ చక్రవర్తిని ఆశ్రయించి, అపరాధ గణమంతా వలయాకారంగా, మహోన్నత ప్రాకారాలతో నిర్మితమైన దుర్గం వలె అభేద్యమై నిల్చి ఉంది. అభేద్య దుర్గానికి, తాను అధిపతియైతే, ముఖద్వారంగా ఉన్నది 'అహం'.

'అహంకార తత్త్వం' వల్లనే ప్రకృతి వికృతి అయింది. అహంకారం చాలా క్రూరమయింది. 'అహం' అంటుకొన్న వస్తువును కాల్చి రూపమే లేకుండా చేసే అగ్గి లాంటిది. అహంకారమంటే 'దేహమే ఆత్మ', అనుకోవడం. దానివల్ల శబ్ద స్పర్శాది విషయాలు ప్రబలంగా ప్రవర్తిస్తాయి. ప్రతికూల వస్తువులను అనుకూల మైనవిగా అనుభవింపజేస్తాయి.

"ఆస్వాద్య దహన జ్వాలాం ఉదన్యా శమనం యథా ।
తథా విషయసంసర్గాత్ సుఖచరితా శరీరిణః ॥
విషయానాంతు సంసర్గాత్ యోబిభర్తి సుఖం నరః ।
నృత్యతః ఫణినశ్ఛాయాం విశ్రమాయాతయే సః ॥"

దప్పి దీరడానికి అగ్నిజ్వాలను మింగినట్లు, నీడకోసం పడగను విప్పి ఆడుతున్న పాము పడగక్రిందికి చేరినట్లు, సుఖమిస్తాయని విషయాలను అనుభవించాలను కోవడం హానికరం. విషయాలు ఆత్మకు బాధకాలు.

విషస్య విషయాణాంచ దూరమత్యంత మంతరం।
ఉపభుక్తం విషం హంతి, విషయాః స్మరణాదపి ॥

'విష, విషయ' శబ్దాలకు 'య' కారమొక్కటే భేదం. కాని ఆ రెండింటికి చాలా భేదముంది. విషం తిన్న వాణ్నే చంపుతుంది, విషయాలు స్మరించినంత మాత్రాన వ్యక్తిని భ్రష్టుని చేస్తాయి. అనేక అపచారాలు చేయడానికి ఇంద్రియాలను ప్రేరేపించే విషయాలే కారణం.

ధనమదం, విద్యామదం, ఆభిజాత్యమదం - ఒక్కటేమిటి? సర్వానర్థాలకు మూలం అహంకారమే. లోకం, మమతా అహంకారాలతోనే చెడిపోతున్నది. ప్రపన్నులకు నైచ్యాను సంధానం జన్మసిద్ధం. భగవద్దాస్యానికి వినియోగపడని విషయమంతా అహంకార దూషితమే. శేషత్వానికి అనుగుణంగా నైచ్యాన్ని అనుసంధించారు.

"ఈవిలాద తీవినైగళ్ ఎత్తనై శెయ్ దనన్ గొల్" (తి.వాయ్మొ. 4.7.3)

ఎన్నో పాపాలను నిరవధికంగా చేసినానని ప్రపన్న జనకూటస్థులైన శ్రీ పరాంకుశ ఋషి సూక్తి.

"అమర్యాదః క్షుద్రః" అని పది రకాలుగా పాపాలను చేసిన నేనెలా తరిస్తాను? స్వామీ! నీ పాదకసుల సేవయే తప్ప వేరే గతి లేదని భగవంతుణ్ని శ్రీ యామునమునులూ స్తుతించారు.

ఆళ్వార్లూ, ఆచార్యులూ దేశికులకు మార్గదర్శకులు కాబట్టి "అహమస్మ్య పరాధ చక్రవర్తీ" అని స్తుతించి భగవత్కృపకు ఉత్తమపాత్రులయ్యారు కదా!

కరుణే! త్వంచ గుణేషు సార్వభౌమీ:- ఓ దయాదేవీ! నీవు కూడా గుణాలలో సార్వభౌమివి. పదకొండవ శ్లోకంలో చెప్పబడినట్లు, అనుచర శక్త్యాది అసంఖ్యేయ గుణాలన్నీ దయా సమ్రాజ్ఞికి మూల బలమని 'చ' కార ప్రయోగం వల్ల స్పష్టమవుతున్నది. 'గుణేషు' అని వ్యస్త పద ప్రయోగం చేత "అపరాధ చక్రవర్తీ' అన్న సమస్త పదంలోని అపరాధాలే గుణాలకు ప్రతిభటమై (విరోధంగా) నిల్చి ఉన్నాయని దేశికులు స్పష్టం చేశారు. అపరాధ గణ బలంతో 'అహంత'ను ప్రకటించుకొన్న చక్రవర్తి కాబట్టి, 'అపరాధి చక్రవర్తిని కాను - కేవలం గుణదోషాల మధ్యపోరు తథ్యమని మొదటి పాదం విశదపరుస్తున్నది. దయాగుణం ప్రవేశించని చోటే ఉండదు. సర్వభూమి యందు వ్యాపించి ఉండే దయాదేవి నిజంగా సార్వభౌమియే కదా! 'సార్వభౌమి' యైన దయ, దోషాలను (మ్రింగి) జయించి, అపరాధ మండల మనబడే శత్రు క్షేత్రం నామమాత్రానికైనా భూచక్రమందులేకుండా చేసుకొనే సామర్థ్యం కలదని వెల్లడించారు దేశికులు.

"చేతోవృత్తిం శమయతి బహిస్సార్వ భౌమేనిరోధే" (హంస సందేశం 2అ-22శ్లో) 'సార్వభౌమ' పదాన్ని భక్తియోగంగా నిరూపిస్తే, 'సార్వభౌమి' పదం వల్ల దయాదేవి 'ప్రపత్తి యోగసాధిక'గా నిరూపింప బడుతుంది కదా!

విదుషీస్థితి మీదృశీం స్వయం:- ఇట్టి స్థితిని స్వయంగా తెలిసిన సార్వభౌమివి నీవు. అపరాధాల మధ్యన ఉన్న (చక్రవర్తియైన) నన్ను జయించడం ప్రీతికరం కదా! ప్రథమ మల్లనిబర్హణ న్యాయమైన ఈ స్థితి నీకు బాగా తెలిసినదే. చక్రవర్తియైన నన్ను జయిస్తే అన్నిటినీ జయించినట్లే. ప్రతిభటక చక్రవర్తిని బంధించి, దండ్యత్వ అదండ్యత్వ నిర్ణయం కోసం న్యాయ సభకు తీసుకొని పోతే అక్కడ విచారణ జరుగుతుంది. జ్ఞానశక్త్యాదులన్నీ క్రూరమైన దండన విధించడానికి వేల అపరాధాలను ప్రదర్శిస్తాయి.

శ్రీరామగోష్ఠిలో విభీషణుణ్ని పరిగ్రహించే విషయంలో వివాదం సంభవించినట్లే, న్యాయసభలోనూ వాదప్రతి వాదులకు గొప్ప వివాదం జరుగుతుంది. పాతకాలు గురుతరమైనవి కదా! అక్కడ ఉండే సచివాధికారులందరు దయా పక్షపాతులే. పక్షపాతమే తెలియని ప్రభువొక్కడేమిచేస్తాడు? దయాదేవి స్వాధీన పతికయే కదా! **మాం వృషశైలేశ్వర పాదసాత్కురుత్వమ్:** విదుషివైన ఓ దయాదేవీ! నీవే స్వయంగా నన్ను భావి జన్మలనబడే కారాగృహంలో పడవేయక, సర్వలోక శరణ్యుడైన శ్రీ వేంకటాచలపతి పాదాలయందు బానిసగా ప్రవేశపెట్టుమని దేశికులు దయాదేవిని ప్రార్థిస్తున్నారు. అపరాధి భారాన్ని వహించే న్యాయాధ్యక్షుని చేతనే, ఎన్ని దోషాలున్నా అవన్నీ భరించవలసి ఉంటుందని దయా సామ్రాజ్యమందు నిర్ణయింపబడుతుంది. దండింప దగిన వ్యక్తి దండన విధి నుంచి విముక్తుడవుతాడు. శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ విగ్రహం కూడా "మాం శరణం వ్రజ" అనియే కదా ప్రబోధిస్తున్నది. 'శైలేశ్వర పాద' ప్రయోగం వల్ల పర్వతరాజ సానువులనే అర్థం కలిగి, తర్వాతి దశకాదిశ్లోకార్థం సూచింపబడుతున్నది. ఈ తర్క సహనశీలమైన కవితా వైభవం నాన్యతో దర్శనీయం.

మం॥ సతతాపచార జన చక్రవర్తి నే
సతతంబుదేవి! గుణసార్వభౌమి నా
స్తుతి గంటివీయునికి జూచి నీవు శ్రీ
పతి కొప్పగింపు నను పాద భృత్యుగా ॥

తృతీయ దశకం సమాప్తం

చతుర్థ దశకం

31. అశిథిలకరణే ఽ స్మిన్నక్షత శ్వాస వృత్తౌ
వపుషి గమనయోగ్యే వాసమాసా దయేయమ్ ।
వృషగిరి కటకేషు వ్యంజయత్సు ప్రతీతై
ర్మధు మథన దయే! త్వాం వారిధారా విశేషైః ॥

అర్థం: హే మధు మథన దయే = మధువను రాక్షసుణ్ని మథించినట్టి శ్రీనివాసుని దయాదేవీ! అస్మిన్ = ఈ; వపుషి = శరీరం; అశిథిలకరణే = సడలని ఇంద్రియాలు కలదై; అక్షత శ్వాస వృత్తౌ = ఎడతెగని నిట్టూర్పులు కలదై; గమన యోగ్యేసతి = సంచరించే సామర్థ్యం కలిగి యున్నప్పుడే; ప్రతీతైః = ప్రసిద్ధిని పొందిన; వారి ధారా విశేషైః = తీర్థధారల చేత; త్వాం = నిన్ను; వ్యంజయత్సు = స్మరింపజేస్తున్న; వృషగిరి కటకేషు = తిరుమల చరియలలో; వాసం = ఉనికిని; ఆసాదయేయం = పొందెదను.

తా: మధువైరియైన శ్రీనివాసుని దయాదేవీ! వార్ధక్యం వల్ల కర్మ జ్ఞానేంద్రియాలు శిథిలంకాకముందే, శ్వాస ఆగిపోక మునుపే, ఈ శరీరం చక్కగా నడిచే స్థితిలో ఉన్నప్పుడే, ప్రసిద్ధమైన సెలయేళ్ళు దయారస ప్రవాహాలే యని సూచించే వేంకటాద్రి సానువుల యందు నివసింప కోరుతున్నాను..

వ్యాఖ్య: దివ్య తీర్థ క్షేత్రమైన తిరుమల యందు ఆచార్యులు నివసించాలని వేడుకొంటున్నారు.

శరీర వియోగానంతరం దేహాంతరంతో దేశాంతరం పోయి పరమ పదనాథునికి కైంకర్యం చేయడం అభిమతమైనట్లే, ఇక్కడనే ఈ శరీరముండునంత కాలం "తిరునారణన్ తాళ్ కాలం పెఱచ్చిన్దిత్తుయ్మ్మినో" (తి.వా.మొ. 4 ప-1-1) నిత్య శ్రీమంతుడైన శ్రీమన్నారాయణుని శ్రీ చరణాల నాశ్రయించి ఉజ్జీవించడమే

కర్తవ్యమని నమ్మాళ్వార్లు సంసారులకు ఉపదేశించారు. శ్రీ వేదాన్త దేశికులు గత శ్లోకంలో నగాధిరాజమైన వేంకటాద్రి సానుప్రదేశమందు నివసించడమే తమ అభిమతమని సూచించారు. తమను పాపాలనుంచి కాపాడడానికి, తిరుమల యందు తాము నివసించడాన్ని కూడా దయాదేవియే అనుగ్రహించాలని ప్రార్థించారు.

భగవంతుడు ఉపేయమైనట్లే ఆయన వేంచేసియున్న దివ్య క్షేత్రమైన తిరుమల కూడా మనకు ఉపేయమే. ఆ కొండ, దాని పరిసర ప్రదేశాలు, అక్కడికి చేర్చేదారి, చేరాలనే అధ్యవసాయం, ఇవన్నీ మనకు పరమ ప్రాప్యాలే. భగవానుడు అధిష్ఠించి యున్న దేశమందు నివసించినంత మాత్రాన కోసల దేశవాసులకు ముక్తి లభించిందని శ్రీ కులశేఖరాళ్వార్లు భగవద్దయా ప్రభావాన్ని వర్ణించారు కదా! ఆ న్యాయ సామ్యం చేతనే తిరుమల యందు నివసించడం వల్ల ముక్తి లభించగలదని వర్ణింపబడుతున్నది. పూర్వ దశ కారంభంలో (21) "శరణాగత సస్యమాలినీ" అని 'మాలినీ' వృత్తం స్మారితం. అక్కడ ఆరంభించిన ఔపచ్ఛంద సికవృత్తంతో ఆ (తృతీయ) దశకాన్ని పూర్తి చేసి, ఈ (4) నాల్గవ పత్తును మాలినీ వృత్తంలో రచించారు దేశికులు.

మాలినియైన ధరణి కృషీవలుడైన భగవంతుణ్ని సంతోషపరచునట్లే, ఈ స్తుతి కూడా మాలినియై భగవద్దయను సంతోషింప జేస్తుంది.

"ననమయయ, యుతేయం మాలినీ భోగిలోకైః" అని మాలినీ వృత్త లక్షణం. కాబట్టి, వృషగిరికి భోగిలోకత్వం వర్ణింపబడుతుంది.

ఆళ్వార్లూ, దేశికులూ భూమండల మందు వేంచేసియున్న కాలంలో తిరుమల పైకి వెళ్ళడానికి ఘాట్ రోడ్లూ లేవు, వాహనాల రాకపోకలూ లేవు. కొండలెక్కి పోవడం చాలా కష్టంగా ఉండేది కదా!

"వైత్త నాళ్వరై యెల్లై కుఱుగి చ్చెన్స్టు
ఎయిత్తిళైప్పదన్మున్నమ్ అడైమినో ।
పైత్త పామ్బణైయాన్ తిరువేంగడమ్
మొయ్త్తశోలై మొయ్ పూమ్తడన్తాష్వరే ॥" (తి.వా. మొ. 3-3-10)

మీకు ఏర్పరచిన ఆయుష్కాలంలో ముసలితనం వచ్చి, ఇంద్రియాల పటుత్వం తగ్గి, దానివల్ల మనస్సు కలత జెందడానికి ముందే, శ్రీనివాసునికి శేషతల్పాన పవళించడం కంటె ఎక్కువ ప్రియమైన తిరుమలనే శీఘ్రంగా ఆశ్రయించండి. తిరుమల యాత్ర చేయండి. కొండచరియల యందున్న దట్టమైన వనాలు, పూల తోటలు, అందమైన సరస్సుల సమృద్ధిచే నిరతిశయభోగ్యమైన తిరుమలనే పరమ ప్రాప్యంగా భావిస్తూ, అక్కడనే సుఖవాసం చేయండి – అని నమ్మాళ్వార్లు చేతనులకు బోధించారు. ఆళ్వార్ల వాగమృతాన్ని తనివి తీర ఆస్వాదించిన దేశికులు దివ్య ప్రబంధ మందలి భావాలను సంస్కృతీకరించి, స్తుతిస్తూ, మనకు అనుగ్రహించారు.

మధుమథన దయే:– మధు కైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి పారిపోయినప్పుడు వారిని పట్టి తెచ్చి వధించినందు వల్ల సర్వేశ్వరునికి మధు మథనుడనీ, కైటభారి అని పేర్లు కలిగాయి.

"మధు మథన విజ్ఞాపన మిదం" (ఆళ్వాందార్ స్తోత్రం) అన్న చోట 'మధు మథన' పదానికి దేశికులు స్తోత్ర భాష్యమందు "నహిత్వదన్య ఈ దృశ ప్రబల విరోధి నివర్తన క్షమః" – నీకంటె మరొకడు ఇట్టి ప్రబల శత్రువు యొక్క కుత్తుకను కత్తిరించిన సమర్థుడు లేడు కదా! అన్నారు.

మధుమథనుని దయాదేవి కూడా అంతే సామర్థ్యం కలది కాబట్టి, మన పాపాలను ధ్వంసం చేసి, పాపవిముక్తులమైన మనను భగవత్పాద పద్మ సన్నిధిలో కింకరులుగా ప్రవేశపెట్టుతుందనే భావం చేత సంబోధింపబడిన పదమిది.

అస్మిన్ వపుషి అశిథిలకరణే:– తిరుమల యాత్ర చేయడానికి శరీరం దృఢంగా ఉండాలి. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు తమ పట్టువీడక చురుకుగా పనిచేస్తుండాలి. విషయరస భోగం కోసం ఇంద్రియాల పటుత్వం అవసరం. చిత్తం క్షోభ పడకుండా, స్థిరంగా ఉండాలి. ఎలప్రాయమంతా విషయాంతరాలకు లోబడక తలచిన కార్యాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడానికి దక్షత కలిగి యుండాలి.

"నిర్విష్టం యతిసార్వభౌమ వచసా మావృత్తిభిర్యౌ వనమ్" దేశికుల యౌవనమంతా భగవద్రామానుజుల శ్రీసూక్తులను ఆవృత్తి చేయడంలోనే గడిచిందంటే ఇంద్రియాలన్నీ వారి అదుపులో ఉన్నాయన్న మాటే కదా!

"నమ్యంతేఽ స్మైకామాః" కోరికలన్నీ ఆచార్యుల ముందు తలవంచు కొన్నాయి కాని చెంగలించ లేదు కదా! ఈ దేహంతోనే శ్రీ వేంకటేశ్వర స్వామికి స్వరూపాను రూపంగా కైంకర్యం చేయడానికి తీవ్రమైన మనోరథం కలిగి యుండాలి. కాబట్టి, ఏడుకొండలెక్క దగిన శరీర ధ్దార్యం అపేక్షితం.

అక్షతశ్వాసవృత్తౌ:- శ్వాస ప్రక్రియ చక్కగా సాగుతుండాలి. ఊపిరితిత్తులు, కొండలెక్కుతుంటే కలిగే శ్రమ ఆయాసం వల్ల దమ్ము తీయరాని విధంగా ఉండక, ఉచ్ఛ్వాస నిశ్వాసలు సముచిత రీతిలో సాగునట్లు, పనిచేయడం అత్యంతావశ్యకం. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులనే పంచప్రాణాలు బలిష్ఠంగా లేకపోతే పర్వతారోహణం సుకరం కాదు.

గమనయోగ్యే:- ప్రకృతి రామణీయక దృశ్యాలను తిలకిస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా గుట్టల దారిలో శరీరం నడవడానికి శక్యమై యుండాలి.

"యావనే విషయైషిణాం" యౌవనంలో విషయభోగాసక్తులైనందువల్ల ఇంద్రియాలు శిథిలమై, ముదిమి ఆవహించి జర్జరిత దేహులైతే గుట్ట లెక్కగలరా? ఆనందనిలయాన్ని సేవించగలరా? శేషవృత్తితో శ్రీనివాస భగవానునికి కైంకర్యం ఎలా చేస్తారు? ఇంద్రియాలు ద్రఢిష్ఠమై ఉంటేగాని భగవానునికి సర్వ విధాలుగా సేవ చేయడం సాధ్యపడదు కదా!

వృషగిరి కటకేషు వాసమా సాదయేయమ్:- వృషాద్రి సాను ప్రదేశాల యందు నివసిస్తాను అని వెల్లడించారు.

"యక్షశ్చక్రే జనక తనయాస్నాన పుణ్యోదకేషు

స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతింరామగిర్యా శ్రమేషు" (మే.సం)

జానకీదేవి స్నానం చేసిన పుణ్యతీర్థాలూ, దట్టని నీడనిచ్చే చెట్లూ కలిగియున్న రామగిరి యందలి అనేకాశ్రమాలలో యక్షుడు నివసించాడని కాళిదాస మహాకవిసూక్తి.

రామగిరి వాసం రీతిగా, దేశికులు సప్తగిరి యందలి అనేక ప్రదేశాలలో నివసిస్తే ఆయా పరిపర ప్రదేశాల పరిచయమూ కలుగుతుంది. ఏ విధంగానో భగవత్సన్నిధిలోనే నిత్యవాసం సమకూర్చాలని దయాదేవి స్తుతింపబడుతున్నది.

వారిధారావిశేషైః త్వాం వ్యంజయత్సు:- పెద్ద పెద్ద బండలతో నిండి యున్న కొండచరియల యందు నివసించడం వల్ల ప్రయోజనమేమి? అంటే, అక్కడ స్థల రామణీయకమే కాదు; ముక్కోటి పుణ్య తీర్థాలూ ప్రవహించే జల రామణీయక ప్రదేశమది. ఆయా పురాణాలు, ఏడుకొండల చరియలలో ఉన్నత ప్రదేశాల నుంచి నిమ్న ప్రదేశాలకు నిరంతరంధారలుగా ప్రవహించే వన వాహినులను ధర్మపద తీర్థాలనీ, జ్ఞానపదతీర్థాలనీ, ముక్తిపదతీర్థాలనీ, భక్తి పద తీర్థాలనీ ప్రశంసించాయి.

రెండు శిఖరాల నడుమ గుండెవిచ్చుకొన్నట్లున్న కొండలోయలు, కోనలో రెండు కొండ చిలువలు పెనవేసికొన్నట్లున్న చెట్ల కొమ్మలు యాత్రికులకు కనువిందు చేస్తాయి. సాంద్రారణ్యాలలో ఎత్తైన కొండలనుంచి దిగువకు దూకే జలపాతాలతో ప్రవహించే "తెణ్ణలరువి, తెషికురళరువి" అని ఆళ్వార్లు పొగడిన తియ్యని, తేట నీరు గల సెలయేళ్ళ గల గల సవ్వడి సామవేదనాదంలా శ్రవణానందాన్ని కలిగిస్తుంది.

స్వామి పుష్కరిణీ తీర్థం, ఆకాశగంగ, పాపనాశం, గోగర్భతీర్థం, కుమార ధారాతీర్థం, తుంబురుతీర్థం, రామకృష్ణ తీర్థం, కాయరసాయన తీర్థం, జాబాలి తీర్థం, శేష తీర్థం, కపిల తీర్థం ఇత్యాది నిరఝ్ఝ్రుల చేత భగవద్దయ తన రూపాన్ని స్పష్టంగా వ్యక్తపరుస్తున్నది. ఈ వారిధారలన్నీ దయా రస ప్రవాహాలే. మాధుర్య శైత్య పాపతాప హరత్వాది గుణాలు గల ఈ సలిల ధారలు శ్రీనివాసుని దయా ప్రవాహాన్ని స్మరింపజేస్తున్నాయని దేశికులు ఉత్ప్రేక్షిస్తున్నారు.

విశ్వంలోనే విచిత్ర ప్రాభవవైభవాలు గల కొండల రాయని సన్నిధిలో ఆళ్వార్లు ఆశించినట్లే దేశికులు నిత్యవాస మపేక్షిస్తున్నారు.

తరలం॥ బలమునింద్రియశక్తులున్ వెస బాయుపూర్వమె శ్వాస వృ
త్తులు దొఱంగక మున్నె దేహముతో జనందుగువేళ, న
న్వెలయ జేర్పుము నీ మహత్త్వము నెమ్మి దెల్పు ప్రసిద్ధమౌ
సలిల ధారల గ్రాలు వేంకట శైల సానువులన్ దయా ॥

32. అవిదిత నిజయోగక్షేమ మాత్మానభిజ్ఞం
గుణలవరహితం మాంగోప్తు కామాదయే! త్వామ్ ।
పరవతి చతురై స్తే విభ్ర మైః శ్రీనివాసే
బహుమతి మనపాయాం విందసి శ్రీధరణ్యోః ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! అవిదిత నిజయోగక్షేమం = తెలియని నా యోగక్షేమాలు కలిగినట్టి; ఆత్మానభిజ్ఞం = నన్ను నేనెరుగనట్టి; గుణలవరహితం = గుణమించుకంతైన లేనట్టి; మాం = నన్ను; గోప్తుకామా = కాపాడ దలచిన; త్వం = నీవు; శ్రీనివాసే = శ్రీనివాస భగవానుడు; చతురైః = సమర్థములైన; తే = నీ యొక్క; విభ్రమైః = విలాసాల చేత; పరవతి (సతి) = పరవశుడవు తుండగా; శ్రీ ధరణ్యోః = శ్రీదేవి, భూదేవి అనే ఇరువురి సపత్నుల యొక్క; అనపాయాం = స్థిరమైన; బహుమతిం = బహుమానాన్ని; విందసి = పొందుతున్నావు.

తా: ఓ దయాదేవీ! నా యోగక్షేమాలు నాకు తెలియవు. నా స్వరూపం నాకే తెలియదు. గుణమేమాత్రమూ లేని నన్ను రక్షింపదలచావు అంతేకాదు; నీ చతురవిలాసాల చేత నీవు శ్రీనివాస భగవానుణ్ని వశపరచుకొంటున్నావు. ఇట్టి నీ చాతుర్యాన్ని చూచి నీ సవతులిద్దరు - శ్రీ భూపిరాట్టులు - నిన్ను శాశ్వతంగా బహుమానిస్తుంటారు.

వ్యాఖ్య: దయాదేవి సవతులచే బహుమతిని పొందే చాతుర్యం కలదని స్తుతి.

దేశికులు దివ్యదేశమైన వేంకటాద్రియందు నిజ నివాసాన్ని అపేక్షించారు కదా! అక్కడి రామణీయక దృశ్యాలలోనూ దయా రూపమే స్ఫురిస్తుందని డెందం కందళిస్తున్నది.

"మహాత్మానస్తు మాంపార్థ! దైవీ ప్రకతి మాశ్రితాః ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతిచ రమంతిచ ॥" (భ.గీత)

అన్నట్లు, ఆ దివ్యక్షేత్రమందు భగవద్గోష్ఠి, భాగవతగోష్ఠి, ఆచార్యగోష్ఠియే కాక వీరందరి సామూహిక గోష్ఠిలోనూ ఉండి, గోవిందనామాను సంధానమూ, భగవద్గుణానుభవమూ చేసే అవకాశం ఉంటుందని ఆనందపడుతూ, తాను

అపేక్షించిన విధంగా దివ్యదేశ వాసాన్ని కల్పించే భగవద్దయాదేవిని అపూర్వమైన అద్భుతమైన స్తుతి చేస్తున్నారు.

అవిదితనిజయోగక్షేమం:- తమయోగ క్షేమాలు తమకే తెలియని మనలాంటి వారిని దయాదేవి రక్షింపగోరడం సామాన్య విషయం కాదు.

ఇంతకు ముందు మనవద్ద లేని వస్తువును పొందడం 'యోగం'. పొందిన వస్తువును విడువకుండా కాపాడుకోవడం 'క్షేమం' పాపాలను విదలించుకొని మోక్ష ప్రాప్తిని అపేక్షించే ముముక్షువులకు ఆచార్య సమాశ్రయణం ద్వారా కలిగే తత్త్వ హిత పురూర్ధ వివేకమే 'యోగం' అనీ, కలిగిన వివేకంవల్ల స్వానురూప హితాన్ని అనుష్ఠించి పురుషార్థాన్ని పొందడమే 'క్షేమం' అని సంప్రదాయజ్ఞులు వివరిస్తారు.

ఆత్మానభిజ్ఞం: దేహం వేరు, ఆత్మ వేరు అనే వివేకమందు అనభిజ్ఞుడు. ఆత్మ స్వరూపం తెలియనివాడని అర్థం. యోగక్షేమాలు తెలియడానికి స్వస్వరూప జ్ఞానం ఆవశ్యకం. తనను తాను తెలుసుకొన్నవారికి తన మేలు కీళ్ళూ తెలుస్తాయి.

తానే దేహమనుకొనే మనిషి కేవలం ఆహారాన్ని, ప్రాకృతిక భోగ విలాసాలను అభిలషిస్తాడు. తానే దైవమనుకొనే వ్యక్తి జరామరణాలు లేకుండా శాశ్వతంగా జీవించడానికి తగిన అమృతాన్ని ఆస్వాదించాలని ఉవ్విళ్ళూరుతాడు. తన కర్మాను గుణంగా అనుగ్రహింపబడిన దేహంలో పరమాత్మకు శేషత్వ (దాస్య)మే స్వరూపంగా గలిగి యున్న జీవాత్మకు చావు పుట్టుకలు లేవని తెలియకపోవడమే ఆత్మానభిజ్ఞత.

గుణలవరహితం:- ఆత్మజ్ఞానం కలుగాలంటే త్రిగుణాలలో సత్త్వగుణం ఉద్బుద్ధమైనందు వల్ల సంభవించే ఆత్మగుణాలు కలిగి ఉండడం ఆవశ్యకం. కాబట్టి అట్టి గుణాలలో ఒక్క గుణమైనా లేదు కదా!

"గుణలవసహవాసాత్ త్వత్ క్షమాసంకుచంతీ"

గుణలవం ఉన్నట్లైతే దయ యొక్క సంకోచానికి కారణమవుతుంది. అజ్ఞానాది దోషాలు కల వ్యక్తి దయనీయుడవుతాడు. సకల దుర్గుణాలున్నప్పటికీ ఓ దయాదేవీ! నన్ను నీవు ఆశ్రిత వ్యామోహం చేత రక్షించడానికి నిశ్చయించుకొన్నావు. నీ యీ ప్రయత్నం ఫలించడానికి చతుర ప్రక్రియనూ చేపడ్తావు.

పరవతి చతురైస్తే విభ్రమైః శ్రీనివాసే:- ఆశ్రిత రక్షణ దీక్షా సమయాన నీ చతుర విభ్రమవిలాసాది భంగిమల చేత నీ భర్తయైన శ్రీనివాస పరబ్రహ్మ తన నిరంకుశ స్వాతంత్ర్యాన్ని కోల్పోయి నీకు వశ్యుడవుతాడు.

బహుమతి మనపాయాం విందసి శ్రీధరణ్యోః:- సర్వేశ్వరుడు, ఆయన పత్నులు, పరివారమంతా చేతన సంరక్షణ దీక్షలో శ్రద్ధ కలిగియున్నా, దయాదేవికే ప్రాధాన్యమిస్తారు. దయాదేవి పై సవతులకు స్పర్ధ లేదు. "హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ" సర్వేశ్వరునికిరు ప్రక్కలలో శ్రీదేవి, భూదేవి సర్వదా విరాజమానలై యుంటారు. దయా పరతంత్రుడై ఆమె కోరిన పనులన్నీ చేయసిద్ధపడే తమ భర్తనూ చూస్తుంటారు. అయినా సపత్నులు దయాదేవి మీద అసూయపడరు. పొగడుతారు, ఆమెను గౌరవిస్తారు.

"మన ప్రజల యొక్క నిశ్శ్రేయసం కోసం ఎంత వాత్సల్యం కలదానవే! ఆశ్రిత పక్షపాతం నీ యందే అతిశయించింది. విభుని వశీకరించే విలాస సంపద అధికంగా కలిగియుండి మన ఆశ్రితులను మహా భయం నుంచి కాపాడే మహా భాగవు నీవే సుమా!" అని ఇద్దరి సవతుల చేత ధయాదేవి స్థిరమైన సన్మానాన్ని పొందుతుంది. మానినులకు సవతుల సన్మానం కంటె మించిన లాభం మరొకటి లేదు కదా!

సవతుల చేత గౌరవింపబడే ఒకానొక నాయికా వృత్తాంతం స్ఫురించడం వల్ల సమాసోక్త్యలంకారం.

తరలం॥ అవిదితాత్మ శరీర బోధుడనజ్ఞుడన్ గుణహీనుడన్
ధ్రువమయైనను వేంకటాద్రి వరుండు నన్ను భరింపగా
భవదనంత విలాస భంగుల వశ్యుడైన దయా! మహీ
భువన మాతలు నీయెడన్ పరిపూర్ణ గౌరవముంచరే॥

33. ఫలవితరణ దక్షం పక్షపాతానభిజ్ఞం
ప్రగుణ మను విధేయం ప్రాప్య పద్మాసహాయమ్।
మహతి గుణసమాజే మానపూర్వం దయే! త్వం
ప్రతివదసి యథార్థం పాప్మనాం మామ కానామ్॥

అర్థం: హేదయే! ఓ దయాదేవీ! త్వం = నీవు; ఫలవితరణ దక్షం = చేసిన కర్మలకు తగిన ఫలాన్ని ఇచ్చే సమర్థుడైన; పక్షపాత+అనభిజ్ఞం= పక్షపాత మెరుగనట్టి; ప్రగుణం = ఉత్కృష్ట గుణాలు కలిగినట్టి; అను విధేయం = ఆశ్రయింప దగిన సౌలభ్యం కల్గినట్టి; పద్మా సహాయం = లక్ష్మీ సహాయుడైన పరమ పురుషుణ్ని; ప్రాప్య = పొంది; మహతి = గొప్ప; గుణసమాజే = జ్ఞాన శక్త్యాది గుణాల సమాజమందు; మానపూర్వం = ప్రమాణ పూర్వకంగా; మామకానాం = నాకు సంబంధించిన; పాప్మనాం = పాపాలకు; యథా+అర్హం = తగినట్లు; ప్రతివదసి = ప్రతివాదం చేస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! చేసిన పనులను బట్టి ఫలమొసగే సామర్థ్యం కలిగిన, ఏ పక్ష మందైననూ అభిమానం చూపే రీతిని తెలియని, సర్వోత్కృష్ట గుణాలు కలిగినట్టి, అందరికీ ఆశ్రయింప దగిన సౌలభ్యం కలిగిన లక్ష్మీనాథుణ్ని పొంది, నీవు గొప్ప గుణసమాజమందు నా పాపాలను గూర్చి ప్రమాణ పూర్వకంగా ప్రతివాదం చేస్తున్నావు.

వ్యాఖ్య: శ్రీనివాస న్యాయస్థానంలో దోషిని రక్షించడానికి దయాదేవి ప్రతివాదించే విధానం వర్ణితం.

దేశికులను తిరుమలలో ఉంచడానికి ప్రతిబంధకాలైన పాపాల విషయమై న్యాయ సభలో విచారణ జరిపించే ప్రక్రియకు దయాదేవి సిద్ధపడింది. వాది ప్రతివాదుల వాదాలను విని న్యాయాధిపతి, అపరాధ చక్రవర్తి దండ్యుడో, అదండ్యుడో తీర్మానించే వృత్తాంతం సుశ్లోకింపబడింది.

వేదాన్త దేశికుల న్యాయశాస్త్రప్రావీణ్యం, శిక్షా స్మృతి విధాన నైపుణ్యం ఈ శ్లోకం చేత విశదమవుతున్నది.

(1) ఫలవితరణ దక్షః :- న్యాయ సభాధ్యక్షుని ప్రవృత్తి తెలియబడుతున్నది. న్యాయాధ్యక్షుడు శ్రీనివాస ప్రభువు. ఆయన పుణ్య పాపాలకు తగిన ఫలాన్ని ప్రసాదించే దక్షుడు. కర్మఫలాన్ని తప్పక అనుభవింపవలసిందే. కర్మ ఫలదానమందు ఆయన కంటె దక్షతరుడెవడున్నాడు? ఆయనకు సాక్షి అవసరం లేదు. ఆయనయే

కర్మసాక్షి. సర్వం ప్రత్యక్షంగా తెలుసుకొనే దక్షతముడు. న్యాయపక్షంగా, గుణ దోషాలను చక్కగా విచారించి తీర్పు చెప్పే నేర్పుకలవాడని అర్థం.

(2) పక్షపాతానభిజ్ఞం:- నిష్పక్షపాతి అన లేదు. పక్షపాతమే తెలియని వాడు. "సమోఽహం సర్వభూతేషు" సర్వప్రాణులను సమానంగా చూచేవాడు భగవానుడు. "నమేద్వేష్యోఽస్తి నప్రియః" నాకు ఒకడు ఇష్టుడు, మరొకడు అనిష్టుడు లేడు అని స్పష్టంగా ప్రకటించాడు కదా!

"విభీషణోవాసుగ్రీవ! యదివారావణః స్వయమ్" సుగ్రీవా! విభీషణునికి అభయమిచ్చాను. ఆయనను నీవే తీసుకొని రావయ్యా! పగవాని తమ్మునికి అభయమివ్వడమేమిటి? అని ఆలోచిస్తున్నావా? విభీషణుడైనా రావణుడే స్వయంగా శరణుకోరి వచ్చినా ఆయనకూ అభయమిస్తానన్న శ్రీరాముని మాటను బట్టి భగవానుడు సర్వసముడని తెలుస్తున్నది కదా! న్యాయ సభాధ్యక్షుడు ఏ వైపూ మొగ్గ కుండా, తులాన్యాయంగా, త్రాసు వంటి చిత్తవృత్తి కలవాడని అర్థం.

(3) ప్రగుణం, అను విధేయం:- "శాస్తా జనానాం" అన్నట్లు జనులందరినీ శాసించే భగవానుడు సర్వగుణోత్కృష్టుడు, సులభారాధ్యుడు. ప్రగుణ = శ్రేష్ఠమైన, మను = మంత్ర జపం చేత; విధేయం = వశ్యుడు; అష్టాక్షర మంత్రానికి విధేయుడు భగవానుడు. 'ప్రగుణమను విధేయం' అంటే ఉత్తమమైన మనుధర్మ శాస్త్ర నియమాలను నియతంగా పాటించేవాడు. న్యాయపతి. అను విధేయుడంటే ప్రాడ్వివాకుడు. "ప్రాడ్వివాకాక్ష దర్శకౌ" (అమరం) ధర్మాధర్మౌపృచ్ఛ తీతిప్రాట్ । వివక్తీతివావకః । ప్రాట్ చాసౌ వివాకశ్చ = ప్రాడ్వివాకః । వివాదానుగతం పృష్ట్వా పూర్వం వాక్యం ప్రయత్నతః । విచారయతియే నాసౌ ప్రాడ్వివాకస్తతః స్మృతః ॥

(4) పద్మా సహాయం: పక్షపాతానభిజ్ఞుడైన భగవానుడు, అజ్ఞాత నిగ్రహుయైన లక్ష్మీదేవి యొక్క సహాయ సంపద కలవాడు. లోకమాత యొక్క సమ్మతి లేకుండా ఏ నిర్ణయం చేయడానికి ఇష్టపడని వాడు భగవానుడు. న్యాయ నిర్ణేత దయార్ద్ర హృదయుడై యుండాలని అర్థం.

పైన చెప్పిన మూడు లక్షణాలతో పాటు ఈ నాల్గవ లక్షణాన్ని మాత్రం లోకజ్ఞులైన న్యాయశాస్త్రజ్ఞులు సాధారణంగా అంగీకరించక పోవచ్చు. ఇలా దేశికులు న్యాయ సభాధ్యక్షుని లక్షణాలను పూర్వార్థంలో వివరించారు.

ఉత్తరార్ధం నేరాలనారోపించడం, నేరగాం(డ్రను నేరాల నుంచి తప్పించే వృత్తి ప్రవృత్తులు కలిగిన వారుండే న్యాయసభను స్ఫురింపజేస్తున్నది. అపరాధియా, నిరపరాధియా, అనే వాద ప్రతివాదాలు జరిపే న్యాయ సభ ఇది. కాబట్టి ఇందు జీవుని పాప సముదాయమే వాది వర్గం. భగవానుని జ్ఞాన బలాది గుణ (పుంలింగం) వర్గమే గొప్ప సభ్య సమాజం. దయాదేవి ఒక్కతే ప్రతివాది. అదృష్టవశాన సభలో ఒక మహిళ పద్మావతి ఉంది.

కొందరు షాడ్గుణ్యాదివర్గం, స్వతంత్రవాత్సల్యాది గుణవర్గమే పాపాలకు తగిన, దండన విధించవలసిందనే వాదివర్గమని వ్యాఖ్యానించారు.

మహతిగుణ సమాజే మానపూర్వం దయే! త్వం

ప్రతివదసి యథార్థం పాప్మనాం మామకానామ్:-

ఓ దయాదేవీ! అసమర్థుడనైన నాకోసం నీవు స్త్రీత్వ సహజ శాలీనతను పరిత్యజించి, ధైర్యంతో గొప్ప గుణరూప పురుష సమాజమున్న సభయందు ప్రవేశించి, ప్రతివావ దూకత్వాన్ని వహించావు అని స్తుతించారు. నిజంగా, దయాదేవి న్యాయశాస్త్ర ప్రమాణాలను ఉదాహరించి, ఈ జీవుని పాపాలు లెక్కింప దగినవి కావు. ఇతడు శిక్షార్హుడు కాడు, ప్రపత్తి చేసిన మహాపురుషుడని ఎదురాడుతూ, జీవుణ్ని దురితాలకు దగిన దండన నుంచి రక్షింప బూనుకొన్నది.

"దుర్వార తీవ్ర దురిత ప్రతివావదూకైః" దేహళీశ స్తవంలో, భగవానుని దయా భరితమైన అపాంగాలే ప్రతివాదులని దేశికులు స్తుతించారు.

"అథవాదికృతం ప్రమాణమన్యైః

ప్రతివాదీవ నిరాకరోత్ ప్రమాణైః ॥" (మాఘం - 20 సర్గ)

ప్రతివాదిలాగా వేరే న్యాయశాస్త్ర ప్రమాణాలతో వాది ఉదాహరించిన ప్రమాణాలు ఖండింపబడెనని, యుద్ధ వర్ణనలో ఉంది.

దయాదేవి చేసే ప్రతివాదం తర్వాతి శ్లోకమందు వర్ణితం. ఈ శ్లోకమూ సమాసోక్త్యలంకృతమే.

తరలం॥ బహుఫలప్రద దక్షునాథుని పక్షపాత విహీను శ్రీ
సహచరున్ గుణధుర్య సేవ్య వశంబొనర్చి బలాదులొ
మహిత సద్గుణ గోష్ఠి నుండి ప్రమాణ పూర్వముగా దయా
యహితుడే యని నన్ను గూర్చి యథార్థమై యెదురాడవే ॥

34. అనుభవితు మఘౌ ఘం నాలమాగామికాలః
ప్రశమయిత మశేషం నిష్క్రియాభిర్నశక్యమ్ ।
స్వయ మితి హి దయే! త్వం స్వీకృత శ్రీనివాసా
శిథిలిత భవభీతిః శ్రేయసే జాయసే నః ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! అఘ+ఓఘం = పాపబృందాలను; అనుభవితుం = అనుభవించడానికి; ఆగామికాలః = రాబోయే కాలం; న, అలం = చాలదు; నిష్క్రియాభిః = ప్రాయశ్చిత్తాల చేత; అశేషం = సంపూర్ణంగా; ప్రశమయితుం = శమింప జేయడానికి; న, శక్యం = సాధ్యం కాదు; ఇతి = అని (ఇలా వాదించి) స్వయం = స్వయంగా; స్వీకృత శ్రీనివాసా = వశపరచుకొన బడిన శ్రీనివాసుని గల దానవవుతూ; త్వం = నీవు; శిథిలిత భవభీతిః = పోగొట్టబడిన సంసార (పతన) భీతిని కలదానవై; నః = మా యొక్క శ్రేయసే = శ్రేయస్సు కోసం; జాయసే = పూనుకొంటున్నావు.

తా: ఓ దయాదేవీ! పాపాలా కొండంతలు. జీవితమేమో బహుస్వల్పం కదా! పాప ఫలాన్ని అనుభవించి పాపాలను నశింప జేయడానికి అపరిచ్ఛిన్నమైన భవిష్యత్కాలం కూడా పర్యాప్తమైనది కాదు. ప్రాయశ్చిత్త క్రమమైతే కొండవీటి చాంతాడంత. దాన ధర్మ జపాది క్రియలనే ప్రాయశ్చిత్తాల నాచరిస్తుంటే మధ్యన ద్రవ్య, మంత్ర, క్రియాది లోపాల చేత కొత్త పాపాలు చేరి వాటిని పూర్తిగా తొలగించుకోవడం సాధ్యం కాదు కదా! సాధ్యం కానప్పుడు మేలైనది 'నీవు చెప్పిన విద్యయే నీరజాక్ష!" అని ఇట్లు వాదించి న్యాయాధిపతియైన శ్రీనివాసుని చిత్తాన్ని మెత్తబడజేసి, నీవు మా శ్రేయస్సు కోసమే పాటుబడుతున్నావని స్తుతించారు కవితార్కిక సింహాచార్యులు.

వ్యాఖ్య: దయాదేవి ప్రతివాదించే క్రమం సుశ్లోకితం.

ఈ జీవుడు అపరాధ చక్రవర్తియే సుమా! అపరాధాలు సత్యమైనప్పుడు ఏదో అపలపించక చట్టం రీతిగా, తగిన ఉపపత్తులచే నిర్ణయం చేయవలసి ఉంటుంది.

"నా భుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి" చేసిన కర్మలకు కల్పకోటి కాలమైనా ఫలాలను అనుభవించకపోతే ఆ కర్మలు నశించవు. కాబట్టి ఈ సంసారి చేసిన కర్మల ఫలమనుభవింపవలసినదే. పాపాలకు తగిన దండనల నియ్యవలసినదే ప్రభూ! అని వాదివర్గంలో కొందరు వాదించారు.

పాపాలను శమింపజేసుకోవడానికి దాన జపహోమాదులు, ద్వాదశాహాది ప్రాయశ్చిత్త కర్మలు శాస్త్ర విహితాలే కదా!

"మణిమంత్రౌషధైర్వాఽ పి దండఘాతాదినాఽ పివా।
క్రియతేనైవ కేనాపి మాయా కుండలి ఖండనమ్ ॥ (శత దూషణి)

అన్నట్లు, పాపాల ఫలమైన దండనను అనుభవించకుండా, ప్రాయశ్చిత్తాదులను ఆచరించకుండా ఉంటే, కేవలం జ్ఞాన మాత్రం చేత భవబంధం తెగదు, పాపాలు నశించవు. కాబట్టి ఈ రెండు ఉపాయాలలో ఏదైన నొక దానిని పాటించే విధంగా ఈ అపరాధిని శాసించే తీర్మానం చేయండి ప్రభూ! అని మరికొందరు పాపవర్గం వారు వాదించారు.

పాపవర్గం యొక్క వాదనలను దయాదేవి అధిక్షేపించ దలచి, లేచి, నామాట నాలకించండి శ్రీనివాస ప్రభూ! అని ఆరంభించింది.

"ఈ చేతనుడు మనోవాక్కాయాల చేత కాలత్రయ మందు అనేక అపరాధాలను నిజంగా చేసినవాడే. పాపకర్మలు ఫలానుభవం చేతనో, నిష్కృతి చేతనో నశించడమూ యథార్థమే. పాపాల నాశనానికి ఈ రెండు పద్ధతులను పాటించడం తప్ప వేరేగతిలేదు.

అనుభవితు మఘౌఘం నాలమాగామికాలః:- ఒక్కొక్క పాపకర్మ యొక్క ఫలానుభవం వంద జన్మలెత్తినా క్షీణించదు. ఈ జీవుని అనంత పాపకర్మలలో

కొన్ని పాపాల ఫలాలను అనుభవించడం కోసం రాబోయే కాలమంతా కూడా సరిపోదు. అపరాధాల కంటె దండనానుభవం న్యూనమే. తక్కువే అవుతుంది. ఫలవితరణ దక్షులైన మీకు కూడా పాపాలన్నిటికీ పూర్తిగా దండన విధించడం శక్యం కాదు. కల్పాంతం వరకైనా, మొత్తం పాప సమూహంలో కొంత భాగమే మీ చేత దండింపబడుతుంది. సమస్త పాపరాశిలో కొంత భాగాన్ని దండనకు గురి చేసి, మిగతా పాపభాగాన్ని మీరు క్షమింపదలచుకొంటే, మొదలే ఈ చేతనుని అపరాధాలనన్నిటిని ఎందుకు క్షమించకూడదు?

ఇక పాపాలు నశించడానికి శాస్త్రం ప్రాయశ్చిత్తాదులను విధించిందని తెలిస్తే చేతనుడు పాపం చేయడమెందుకు? తిరిగి అది శమించడానికి ప్రాయశ్చిత్త మెందుకు చేసుకోవాలి? అని భావించి, పాపపు పనులను చేయనే చేయడు కదా! ఒకవేళ తెలిసియో, తెలియకనో పాపాలు చేస్తే, వాటిని క్షీణింప జేసుకోవడానికి ప్రాయశ్చిత్తాది కర్మల నాచరిస్తున్నప్పుడు ఆ విధానంలో ద్రవ్య, మంత్ర, వర్ణ, స్వర, క్రియాలోపాల చేత కొత్త అపచారాలేర్పడి అపరాధాల సంఖ్య పెరుగుతుందే కాని తగ్గదు కదా! ధనమూ, శక్తీ క్షీణించడం మాత్రం తప్పదు.

ప్రశమయితు మశేషం నిష్క్రియాభిర్నశక్యమ్:- ప్రాయశ్చిత్తాది విధుల చేతనూ పాపాలను సంపూర్ణంగా నశింపజేసుకోవడం చేతనునికి సాధ్యం కాదు. "తస్మా ద పరిహార్యేఽర్థే నత్వంశోచితుమర్హసి" (భ.గీ. 2.27) కాబట్టి, పరిహరింపరాని విషయంలో నీవు శోకింపతగదు - అని మీరే బోధించారు కదా ప్రభూ!

ఈ చేతనుడు ఈ న్యాయసభలో ఉన్న వారందరికంటె నాకు బాగా తెలిసినవాడు. 'కర్మల ఫలమనుభవించకుంటే అవి నశించవు' అనే విషయం ప్రపన్నుని యందు - బ్రహ్మ విద్యోపాసకుని యందు - అన్వయించదు. బ్రహ్మ విద్యా ప్రబావం వల్ల ప్రపన్నునికి సంచితాగామి కర్మలలో సంచిత కర్మలు భస్మమవుతాయి. అగామి కర్మల ఫలం అంటుకోదు.

"తదధిగమ పూర్వోత్త రాఘయోః అశ్లేషవినాశౌ" (బ్ర.సూ)

"ప్రారబ్ధేతర పూర్వ పాపమఖిలం ప్రామాదికంచోత్తరం" - అన్నట్లు ప్రారబ్ధ

కర్మ తప్ప పూర్వోత్తరాఘాలనే సమస్త కర్మలు ప్రపన్నుణ్ని బంధించవు అవి శ్రుతి స్మృతులు బోధిస్తున్నాయి. శ్రుతులూ, స్మృతులు ప్రభూ! నీ ఆజ్ఞా రూపాలే కదా! కాబట్టి, ఈ చేతనునికి మీ శాసన ప్రకారంగా సర్వకర్మలకు ఫలాల నీయకుండా మీరు వాటిని క్షమించడమే న్యాయ్యం" అని దయాదేవి ప్రామాణికంగా ప్రసంగించింది.

స్వయం ఇతి హిదయే! స్వీకృత శ్రీనివాసా:- ఓ దయాదేవీ! నేను నిన్ను ప్రార్థించకున్నా నీవే ఈ విధంగా ప్రతిపాదించి, న్యాయాధ్యక్షుడైన శ్రీనివాస భగవానుణ్ని వశపరచుకొన్నావు కదా! శ్రీదేవి నివసించినందు వల్ల నీ ప్రతివాదం చేత శ్రీనివాసుణ్ని స్వీకరించడం సుకరమైనది కదా! అని దేశికులు దయాదేవిని స్తుతిస్తున్నారు.

శిథిలిత భవభీతిః శ్రేయసే జాయసేనః:- పాప కర్మలు జనన మరణ రూపమైన సంసారానికి కారణాలు. అట్టి సమస్త పాపాలను క్షమించడం వల్ల సంసార పతన భీతిని పోగొట్టావు. మాకు (చేతనులకు) ఇహపర సుఖాలను కలిగించడానికే పుట్టావు. శ్రీనివాసుని అంతరంగ మందు ప్రవేశించావు.

కరణ శైథిల్యం కాకూడదు - ఇంద్రియాలు సడలిపోకూడదని ప్రార్థించారు దేశికులు. దయాదేవి భవభీతినే శిథిలం చేసింది. మోక్ష సామ్రాజ్య ప్రాప్తికి యోగ్యునిగా చేసింది.

శ్రేయసేజాయసేనః :- "స ఉ శ్రేయాన్ భవతి జాయ మానః' (శ్రుతి) భగవానుడు అవతరిస్తూనే శ్రేయస్కుడవుతాడు. ఆయన నిజ శ్రేయస్సు కోసమే జనిస్తాడు. నీవు మాత్రం మా శ్రేయస్సు కోసం జనిస్తావు, అని దేశికులు దయాదేవిని స్తుతించడం వల్ల భగవానుని కంటె భగవద్దయకు వైలక్షణ్యం ధ్వనితం.

మత్తకోకిల॥ దేవి! పాపములన్ ఫలాప్తిని దీర్తుమన్న మితంబ రా
బోవు కాలము నిష్క్రియాదుల బ్రుంగజేయగశక్తులున్
లేవు వేంకటనాథు శ్రీ సఖులీల జెంది యనుక్త వై
నీవ మాక భయింం బొస్తంగుచు నేర్తు గూర్పగ శ్రేయముల్॥

35. అవతరణ విశేషై రాత్మలీలా పదేశై
రవమతి మనుకంపే! మందచిత్తేషు విందన్ ।
వృషభశిఖరినాథ స్త్వన్ని దేశేన నూనం
భజతి శరణభాజాం భావినో జన్మ భేదాన్ ॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! వృషభ శిఖరినాథః = వేంకటాచల పతియైన శ్రీనివాసుడు; త్వత్+నిదేశేన = నీ ఆజ్ఞ చేత; ఆత్మలీలా+అపదేశైః = తన యొక్క లీలలు అనే నెపం కలిగిన; అవతరణ విశేషైః = ఆయా అవతారాల చేత; మంద చిత్తేషు = అల్పబుద్ధిగల వారి యందు; అవమతిం = అవమానాన్ని; విందన్ = పొందుతు; శరణభాజాం = శరణాగతుల యొక్క; భావినః = ముందు రాబోయే; జన్మభేదాన్ = ఆయా జన్మలను; భజతి = పొందుతున్నాడు. నూనం = నిశ్చయం.

తా: ఓ దయాదేవీ! శ్రీనివాస భగవానుడు నీ యాజ్ఞచేత తన లీలా వ్యాజం కలిగిన దేవతిర్యఙ్మనుష్యాద్యవతారాల నెత్తి, మందబుద్ధులైన వ్యక్తుల నుంచి అవమానాన్ని పొందుతూ, ప్రపన్నులకు కలుగబోయే జన్మలను తానే పొందుతున్నాడు.

వ్యాఖ్య: దయాదేవి యాజ్ఞ చేత ప్రపన్నుల భావిజన్మలను భగవానుడే పొందుతుంటాడని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు.

'జాయసే' అని దయ భగవానుని హృదయమందు జన్మిస్తుందని చెప్పబడింది. జన్మించే దయననుసరించి భగవానుడు అవతార రూప జన్మలను పరిగ్రహిస్తాడు. భగవంతుని అవతారాలకు దయాదేవియే ముఖ్యకారణం. దయా జన్మను కీర్తించడం చేత భగవదవతార కీర్తనం ప్రాసంగికంగా సుశ్లోకితం.

అవతార విశేషైరాత్మలీలాపదేశైః :- భగవానుడు అఖిల భువనాలను సృష్టించడం, పాలించడం, లయం చేయడమే ప్రయోజనంగా కలవాడు.

"యదాయదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥"

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ ।

ధర్మసంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే ॥" (భ.గీ. 4-7,8)

అర్జునా! ధర్మానికి హాని కలిగి, అధర్మం పెచ్చు పెరిగిపోతున్నప్పుడు నా సంకల్పం చేత నన్ను నేను సృజించుకొంటాను. సత్పురుషులను రక్షించడం కోసం దుష్టులను దునుమాడి ధర్మాన్ని స్థిరపరచడానికే ప్రతియుగమందు అవతరిస్తుంటాను" అని తన అవతార ప్రయోజనాన్ని కూడా శ్రీకృష్ణ భగవానుడు వివరించాడు. ఇట్టి భగవానుని మత్స్యకూర్మ మృగ దేవ మనుష్యావతారాలన్నీ ఆయన లీలలని చెప్పబడినవి. లీలలంటే వినోదక్రీడలనీ అర్థం. 'అపదేశం' అంటే వ్యాజమని అర్థం. మనసులో ఉండేదొకటి, చేసేది మరొకటి అని భావం.

"వ్యాజోఽ పదేశో లక్ష్యంచ" (అమరం)

"పదే లక్ష్యే నిమిత్తేఽ పదేశః స్యాత్" (నానార్థవర్గం అమరం)

లీలలని చెప్పడమే కాని భగవదవతారాలన్నీ దయాదేవి కార్యాలే అని దయను ప్రశంసించారు దేశికులు.

అవమతి మనుకంపే! మందచిత్తేషు విందన్:- ఓ దయాదేవీ! భగవానుడు భూమియందు అవతరించినప్పుడు స్వల్ప బుద్ధిగల వారి నుంచి అవమానాన్ని పొందడం ఆయనకు తెలియనిది కాదు.

"అవాచ్య వాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।

నిందంతస్త వసామర్థ్యం తతో దుఃఖతరంను కిమ్ ॥" (2-36)

మహారథుల దృష్టిలో మాన్యుడవైన నిన్ను నీ శత్రువులు అనరాని పెక్కు మాటలను అంటూ నీ సామర్థ్యాన్ని నిందిస్తుంటారు. అంతకంటె దుఃఖతరమైన విషయమేముంటుంది? అని పార్థునికి శ్రీకృష్ణుడు బోధించాడు.

"అవజానంతి మాంమూఢాః మానుషీం తనుమాశ్రితమ్ ।

పరంభావ మజానంతో మమభూతమహేశ్వరమ్ ॥" (భ.గీ. 9-11)

నేను అవతరించిన కాలాన మూఢులు (అజ్ఞానులు) సర్వప్రాణులకును ప్రభువునైన నన్ను, నా అప్రాకృత దివ్యరూపమందు సామాన్య మనుష్య భావాన్ని తలచి,

తిరస్కరిస్తూ తక్కువగా ఊహిస్తారని శ్రీకృష్ణ భగవానుడు తన అనుభవాన్ని చెప్పుకొన్నాడు.

వృషభ శిఖరినాథః :- వివిధ భూతవ్రాత రక్షైక దీక్షా ధర్మం గలిగియున్న వేంకటాచలపతి యైన శ్రీనివాస పరబ్రహ్మ అత్యంత ఉన్నత స్థాన మందున్న వాడే అయినా చాలా నీచ స్థాయికి దిగి వచ్చాడు. విభవావతారాలనే కాక అర్చావతార విశేషాన్ని కూడా తెల్పుతున్న పదమిది. జీవులు తన దివ్యమంగళ విగ్రహాన్ని సేవించాలనీ, అర్చకులు తన నెలా ఆరాధించినా అలంకరించినా, అన్నిటినీ సహించి, వారికి సులభుడనై ఉండాలనీ, తనను తానే తక్కువగా చేసికొన్న ఆనంద నిలయుడని అర్థం.

త్వన్నిదేశేన భజతి శరణ భాజాం భావినోఽజన్మభేదాన్:- "శరణాగతులు వారి కర్మల ఫలంగా ఎత్తవలసి యున్న అనేక జన్మలను వారికి బదులు మీరే పొంది వారి కర్మలను తొలగించండి" అని దయాదేవి ఆదేశించినందువల్ల భగవానుడు అవతారాలెత్తుతున్నాడని, భగవదవతారానికి ఒక కొత్త నిర్వచనాన్ని కూర్చారు శ్రీ వేంకటనాథాచార్యులు. జీవులు చేసే ప్రతికర్మకు ఫలముంటుంది. కర్మఫలాన్ని అనుభవించడమంటే శిక్ష - దండనను పొందడమే. పాప పుణ్యాల వల్ల కలిగే ఫలంగా అనేక జన్మలను పొందవలసి ఉంటుంది.

శరణాగతుని అపరాధాలకు కలిగే ఫలాలను-జన్మలను-అతడు పొందునట్లు చేయకూడదని న్యాయసభలో దయాదేవీ ప్రతివాదం చేత తీర్మానించబడింది. పాపాలను ప్రాయశ్చిత్తాది కర్మలతో పరిహరించు కోవడం సాధ్యం కాని యెడల అనేక జన్మలను పొంది కష్టపడడం అవశక్యమే. అయినా చేతనుల పాపాలను భగవానుడు క్షమించాలని దయాదేవి న్యాయాధ్యక్షుడైన శ్రీనివాస ప్రభువును వేడుకొన్నది. న్యాయాధ్యక్షుడు దయాదేవి వాదనను మెచ్చుకొన్నాడు. కాని జన్మలకు కారణమైన పాపకర్మల గతియేమిటి? అనే ప్రశ్న జనించింది.

ఆ సమయాన, స్వీకృత శ్రీనివాసునితో "స్వామీ! శరణాగతుల కోసం మీరు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. వారికి మారుగా మీరే జన్మలనెత్తి లోక విస్తృత పాప కర్మలను పరిహరించండి" అని దయాదేవి పలికింది. ఆయన అంగీకరించాడు. అంతే.

"అజాయమానోబహుధా విజాయతే" పుట్టుక, గిట్టుక లనెరుగని భగవానుడు అనేక రూపాలతో జన్మిస్తున్నాడు అని శ్రుతి బోధిస్తుంది. అంటే భగవానుడు కర్మబద్ధుడు కాడు. "లోకోఽయం కర్మబంధనః" ఈ లోకం కర్మబద్ధమైనది. "నమాంకర్మాణి లింపంతి, నమేకర్మ ఫలేస్పృహా" (4-14) నాకు కర్మ ఫలాసక్తి లేదు, కాబట్టి కర్మలు నన్నంటవని గీతాచార్యుడు విశదపరచాడుకదా!

అందువల్ల, భగవానుడు కేవలం తన కృపాపూర్ణ సంకల్ప బలం వల్ల అనేకావ తారాలనెత్తుతున్నాడు. మందబుద్ధులచే ఇబ్బందులూ పడుతున్నాడు. ఈ అవతార విశేషాలన్నీ లోక ప్రసిద్ధిని బట్టి, భగవానుని లీలలని పేరు పొందినాయి. కాని 'లీల' అనడం అపదేశమే సుమా! దయాదేవి యొక్క ఆజ్ఞ వల్లనే భగవానుడనే కావతారాలతో విరాజమానుడవుతున్నాడన్నదే ముఖ్యమైన సంగతి అన్నారు దేశికులు. భూభారాలను పెంచే పాపాలను పరిహరించడానికే అవతారాలను భగవంతునిచే ధరింపజేసి, దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చేయిస్తున్నావని దయాదేవిని స్తుతించారు.

"శెయ్‌కున్దావరున్దీమై యున్నడియార్ క్కుత్తీర్త్తపురర్క్కుత్తీమై కళ్ శెయ్‌కున్దా" (తి.వా.మొ. 2-6-1)

చేయబడిన, వీడశక్యం కాని పాపాలను నీ దాసులకు తొలగించి అసుర ప్రవృత్తి కలవారికి ఆ పాపాలను చేర్చిన పరిశుద్ధుడా! అన్న దివ్య సూరిసూక్తికి 'ఈడు' వ్యాఖ్య ఇలా ఉంది.

"మున్ ప్రాతికూల్యం పణ్ణిన వర్‌కళ్ అనుకూలిత్తు నాలడివరనిన్ఱవారే, పిన్నై యవర్‌కళ్ శత్రుక్కళ్ మేలే పొకడు మాయిత్తు". ద్విషంతః పాపకృత్యాం" ఎన్గిఱ పడియే కడలుక్కుత్తొడుత్త అమ్బై, అవన్‌ముకంకాట్టిన వాటే మరుకాంతారత్తిలశురర్‌కళ్ మేలే విట్టాప్పోలే.

"అజ్ఞనొరుపోక్కడి కణ్డిలనాగిల్" ఉరసాధారయామాసపార్థం సంఛాద్య మాధవః" ఎన్ఱు భగదత్తన్ విట్ట శక్తియై, అర్జున నైత్తళ్ళి త్తన్నంతః పురత్తిలే యేత్తాప్పోలే, తానేటిట్టుకొణ్డను భవిత్తల్ శెయ్యుమిత్తనై".

మొదట ప్రతికూలంగా ప్రవర్తించినవారు అనుకూలించి నాలుగడుగులు నడిచి వస్తే, వెంటనే వారి శత్రువుల మీద ఆరోపిస్తాడు. భగవంతుని ఆశ్రయించిన వారి

పాపాలను వారి శత్రువులు పంచుకొన జేస్తాడు. (శ్రుతి) అన్నట్లు సముద్రునికి ఎక్కుపెట్టబడిన అమ్మును, అతడు ముఖాన్ని చూపగనే, ద్రుమకుల్యలోని అసురుల మీద ప్రయోగించాడన్న విధంగా:

అలాగా (పాపకర్మఫలాన్ని) పోగొట్టడానికి హేతువేదీ కానరానప్పుడు "మాధవుడు పార్థుణ్ని అడ్డుకొని వక్షఃస్థలాన ధరించాడు" (భార-ద్రోణ పర్వం) అని భగదత్తుడు (అర్జునుని పైన) ప్రయోగించిన శక్తిని, అర్జునుణ్ణి ఆచ్ఛాదించి, (శ్రీకృష్ణుడు) తన అంతః పురమందు (ఉరస్సున) ధరించినట్లే, భగవానుడు ఆశ్రితుల పాపఫలాలను తన మీద ఆరోపించుకొని స్వయంగా అనుభవిస్తాడు.

"త్వంచేన్మనుష్యాదిషు జాయమానః
తత్కర్మపాశం కృపయోపభుం క్షే" (శ్రీరంగరాజస్తవం 2)

అపరాధులు శరణమని నీ చరణారవిందాలను శిరసా నమస్కరిస్తారు. శ్రీరంగ ప్రభూ! నీవేమో మానవాది జాతులలో పుట్టి, దండింప దగిన వారి కర్మపాశాన్ని దయతో స్వయంగా అనుభవిస్తుంటావని శ్రీ పరాశర భట్టరు స్తుతించారు. ఈ విధంగా ప్రపన్నుల భారాన్ని పరమ పురుషుడే వహిస్తాడు.

ఒకరి కర్మఫలాన్ని మరొకరు అనుభవించడం సాధ్యమేనా? అంటే, లోక వ్యవహారమందు, ఒకడు చేసే పనికి మరొకడు (surety) జామీను ఇచ్చినవాడు (ప్రతిభువుడు) బాధ్యుడై పనిచేసి తీరుతున్నాడు కదా! అని సమాధాన పడాలి. ఈ శ్లోకమందు 'చరణభాజాం' అని పాఠమున్నా, అది మంత్రమందలి పదమైనందు వల్ల గౌరవమే కాని 'శరణ భాజాం' అనే శబ్దం యొక్క అర్థంతో భేదించదు.

నూనం:- ఈ పదం ఉత్ప్రేక్షకు సంకేతం. 'హేతూత్ప్రేక్ష' సుశ్లోకితమని కవి తన ఉక్తి చమత్కారాన్ని ఈ పదప్రయోగంతో స్పష్టపరచాడు.

తరలం॥ అవనకేళి ఝుషాది రూపము లాత్మలీల ధరించి మా
ధవుడు తోచిన మంద బుద్ధులు తథ్యమయ్యవతారవై
భవ మెరుంగక దూఱుచున్న భవన్నియుక్తి బ్రపన్నులీ
యవని దాల్చెడు భావిజన్మములాతడొందెడు నోదయా!!

36. పరహిత మనుకంపే! భావయంత్యాం భవత్యాం
స్థిర మనుపధి హార్దం శ్రీనివాసో దధానః।
లలిత రుచిషు లక్ష్మీ భూమినీళాసు నూనం
ప్రథయతి బహుమానం త్వత్ప్రతి చ్ఛంద బుద్ధ్యా॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! పరహితం = ఇతరుల యొక్క మేలును; భావయంత్యాం = తలచుతున్నట్టి; భవత్యాం = నీ యందు; స్థిరం = చలించని; అనుపధి = ఏ కారణమూలేని; హార్దం = ప్రేమను; దధానః = వహించే; శ్రీనివాసః = శ్రీనివాసుడు; లలిత రుచిషు = కోమలమైన కాంతి కలిగిన; లక్ష్మీ భూ నీళాసు = శ్రీభూ నీళ లనే దేవేరుల యందు; త్వత్, ప్రతిచ్ఛంద బుద్ధ్యా = నీ యొక్క ప్రతిబింబాలనే తలపుచేత; బహుమానం = ఆదరాతి శయాన్ని; ప్రథయతి = విస్తరిస్తున్నాడు.

తా: ఓ దయాదేవీ! ప్రతికూలురైన జీవులకు కూడా శ్రేయస్సును కోరుతున్న నీ యందు శ్రీనివాసుడు స్థిరమైన, నిర్హేతుకమైన ప్రేమ కలిగియున్నాడు. పరహితార్థం మనోజ్ఞమైన ఆసక్తి కలిగిన శ్రీ భూనీళాదేవులను నీ ప్రతిబింబాలుగా భావిస్తూ, వారిని కూడా విశేషంగా ఆదరిస్తున్నాడు.

వ్యాఖ్య: శ్రీనివాసుడు దయాదేవి యొక్క ప్రతిబింబాలనూ బహుమానిస్తుంటా డని వర్ణితం.

నేను, శ్రీనివాస ప్రభువును అవమానాల పాలయ్యే అవతారాలనెత్తునట్లు చేశాననీ, ఆయన మనస్సున ఎంతనొచ్చుకొన్నాడో? అని నీవు చింత పడుతున్నావా? తల్లీ! ఆయన కరుణా వరుణాలయుడు. నీ యందు శ్రీనివాసుని కున్న ప్రేమ ఆవగింజంతైనా తగ్గలేదు సుమా! అని కవి దయను ప్రశంసిస్తున్నారు.

పరహిత మనుకంపే! భావయంత్యాంభవత్యాం,

స్థిరమనుపధి హార్దం శ్రీనివాసోదధానః:-

పరహిత భావనయే దయా స్వరూపం. పరులంటే ఇతరులనే అర్థం కాక శత్రువులనే అర్థం కూడా ఉంది కదా! ఆశ్రితులా, అనాశ్రితులా అని ఆలోచించ

కుండా, శాస్త్రాలకూ చట్టాలకూ ప్రతికూలంగా ప్రవర్తించే వ్యక్తులకు కూడా మేలు చేయాలని ఎల్లప్పుడు దయాదేవి చింతిస్తుంటుంది. ఆమె పేరే 'అనుకంప'. ఇతరుల బాధలతో ఏకీభవిస్తుంది. చేతనులనుభవించే కష్టాలతో సహానుభూతి కలది దయ. పరహిత చింతనయే స్వరూప స్వభావాలు గల దయాదేవి యందు శ్రీనివాసునికీ అచంచలమైన, అవ్యాజమైన ప్రేమ ఉంది.

లలిత రుచిషు లక్ష్మీ భూనీళాసు:- లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి ఈ ముగ్గురు దయాదేవికి సవతులే. అయినా వారికి దయాదేవి మీద మాత్సర్యం లేదు. 'రుచి' శబ్దానికి కాంతి, ఆసక్తి అనే అర్థాలున్నాయి.

లక్ష్మీదేవి యొక్క రూపగుణ సౌందర్యాలు అప్రమేయాలే. భూదేవి రత్నగర్భ, వసుంధరయే కదా! నీళాదేవి లావణ్యం అపారమైనది. లక్ష్మిని వక్షఃస్థలాన, భూదేవిని, నీళాదేవిని శ్రీనివాసుడు తనకు ఇరు ప్రక్కల యందుంచుకొని ప్రకాశిస్తున్నాడు. అయినా ఈ ముప్వురు దేవేరులను భగవానుడు వారి సౌందర్యాన్ని బట్టి కాక, కేవలం దయాదేవి యొక్క ప్రతిబింబాలనే భావనతో విశేషంగా ఆదరాన్ని ప్రదర్శిస్తున్నాడు.

బింబం యొక్క లక్షణాలే ప్రతిబింబంలో గోచరిస్తాయి కదా! లక్ష్మీదేవి మూర్తీభవించిన కరుణయే కదా!

"క్షాంతిస్తే కరుణాసఖీ విజయతాం క్షేమాయసర్వాత్మ నామ్" అన్నట్లు (క్షమాషోడశి) దయాదేవికి క్షమాదేవి నెచ్చెలి. నీళాదేవి భక్తుల దోషాలను భగవానుని చూపులకు ఆననీయదు. ఈ దేవీ త్రితయం చేతనులను సంరక్షించడానికి ఎలా పురుషకారం చేస్తుంటుందో మొదటి దశకంలోని 6,7,8 శ్లోకాలలోనే కీర్తింపబడింది.

ప్రథయతి బహుమానం త్వత్ ప్రతిచ్ఛందబుద్ధ్యా:- దయాదేవి యందున్న పరహిత భావన శ్రీ భూనీళా పిరాట్టుల యందు ప్రతిఫలించి యున్నందువల్ల దయాదేవి యొక్క ఛందానువర్తినులైనందువల్ల - శ్రీనివాస భగవానుడు దయాదేవి యందు ప్రదర్శించే బహుమానాన్ని ఆ ముగ్గురు దేవేరులయందు కూడా విస్తరిస్తుంటాడు.

నూనం: నిశ్చయం. భగవత్కృప ఉత్ప్రేక్షితం. వాక్యార్థ హేతుక కావ్యలింగాలం కృతంగా దయాదేవి సుశ్లోకితం.

తరలం॥ పరహితం బెడదన్ దలంచెడు భవ్యవర్తన దేవి! సు
స్థిర తరంబగు చెల్మి నీయెడ శ్రీనివాసుడు దాల్చి, నిన్
సురుచిరాకృతిశో భితల్ మహిషుల్ ప్రధానులు ముప్పురున్
కరము మెచ్చనుతించు నీ యుపకారముల్ తలపోయుచున్ ॥

37. వృషగిరి సవిధేషు వ్యాజతో వాసభాజాం
దురిత కలుషితానాం దూయమానాదయే! త్వమ్ ।
కరణ విలయకాలే కాందిశీక స్మృతీనాం
స్మరయసి బహులీలం మాధవం సావధానా ॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! వృషగిరి, సవిధేషు = తిరుమల, సమీప ప్రదేశాలయందు; వ్యాజతః = ఏదో ఒక నెపం వల్ల; వాస భాజాం = వసతిని ఏర్పరచుకొని యున్నట్టి; దురిత కలుషితానాం = పాప కార్యాలచే మలినులైన వారు కావుననే; దూయమానా = (వారి కోసం) ఎంతో పరితపిస్తున్న; త్వం = నీవు; కరణ విలయకాలే = ఇంద్రియాలు సడలిన (అంత్య) కాలమందు; కాందిశీక స్మృతీనాం = పారిపోయిన తెలివి కలవారికి; బహులీలం = చాలా పనులు కలిగి యున్న; మాధవం = శ్రీ వల్లభుడైన వేంకటేశ్వరుణ్ని; సావధానా = మెలకువ కలదానవై; స్మరయసి = స్మరింప జేస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! వేంకటాద్రి యొక్క పరిసర ప్రదేశాల్లో ఏదో ఒక నెపంతో నివసించిన మహా పాపుల కోసం నీవు ఎంతో పరితపిస్తుంటావు. వారు మరణ కాలాన ఇంద్రియాలు సడలిపోయి స్మృతి తప్పిపడి యున్నా, నీవు వారిచే జగద్వ్యాపారం మొదలైన బహు విధలీలల యందు ప్రవర్తిస్తున్న శ్రీనివాస భగవానుణ్ని సావధానవై స్మరింపజేస్తుంటావు.

వ్యాఖ్య: దివ్యదేశ వాసులైన పాపాత్ములకు దయాదేవి అంతిమ స్మృతిని కలుగజేస్తుందని సుశ్లోకితం.

తిరుమల ప్రాన్త స్థలాల్లో ఎందరో వ్యక్తులు నివసిస్తుంటారు.

వృషగిరి సవిధేషు వ్యాజతో వాసభాజాం:- 'సవిధః' అంటే సమీప మని అర్థం. "సమీపేనికటాసన్న సన్నికృష్ట సనీడవత్, సదేశా భ్యాశ సవిధ సమర్యాద సవేశవత్" (అమరం). వృషాచల సమీప స్థలాల్లో ఏదో నెపంతో నివసించే వారంటే పొట్టకూటి కోసం ఏదైనా పనిచేస్తూ జీవితం గడిపేవారని అర్థం. కొందరు వ్యాపారం చేస్తారు. మరికొందరు పశు పక్ష్యాదులను వేటాడుతారు.

దురితకలుషితానాం:- శ్రీనివాసుని దర్శనం కోసం వచ్చే బాటసారులను బాధించి, వారి ధనాన్ని దోచుకొనేవారు, ముఖ్యంగా జీవహింసయే వృత్తిగా కలవారూ నివసిస్తుంటారు.

దూయమానా దయే! త్వం:- దివ్య దేశమందు నివసించిన పాపాత్ముల విషయంలో కూడా దయాదేవి హిత మాచరించాలని చాలా చింతిస్తుంది, అంటారు దేశికులు.

తిరుమల యందు నివసించకున్నా, ఆ దివ్యక్షేత్రానికి దగ్గరగా ఉన్న ప్రదేశాలలో నివసిస్తే చాలు. వారు భగవద్భజన కోసం నివసించకున్నా స్వప్రయోజనం కోసం ఉదర పోషణకై పాపకృత్యాలకు పాటు పడుతూ కాపురం చేసే జనులకు కూడా మేలు చేయాలని దయాదేవి చాలా పరితపించడాన్ని బట్టి భగవంతుని విషయం దేశ నివాస మహిమ అపారమని తెలుస్తున్నది.

"అపిచేత్ సుదురాచారః" ఎంత దురాచారుడైన దివ్యక్షేత్రానికి దగ్గర ఉన్న స్థలాన్ని విడిచిపోకుండా పొంది ఉన్నందు వల్ల "సాధురేవ సమంతవ్యః" అతడు సాధువు సజ్జనుడుగానే భావింపబడుతాడని పరహిత చింతనయే స్వభావంగా గల దయాదేవి అనుకొంటుంది.

దయాదేవి కలుగజేసే హితమేమిటో 'ఉత్తరార్థం' తెల్పుతుంది.

కరణవిలయకాలే కాందిశీకస్మృతీనాం స్మరయసి:- మరణకాలం సమీపిస్తే ఇంద్రియాలు శిథిలమవుతాయి. సాధారణంగా, జరా వస్థ (ముసలితనం)లో శరీరం జర్జరితమవుతుంది. ఇంద్రియాలు తమ పట్టు తప్పి సడలిపోతాయి.

"ప్రాణప్రయాణ సమయే కఫవాత పిత్తైః కంఠావరోధనవిధౌ స్మరణంకుతస్తే" (ముకుందమాల) దేహావసాన కాలమందు కఫవాత పిత్తాది రుగ్మతల చేత గొంతు అదుమ బడుతుంది. మాట పెకలదు. మనస్సు పనిచేయదు. "వాఙ్మనసి సంపద్యతే, మనః ప్రాణే" (శ్రుతి) వాగింద్రియం మనస్సు నందు, మనస్సు ప్రాణమందు కలిసి పోతుంది. ఇక ప్రాణమే పయినిస్తుంటే స్మృతి ఎలా ఉంటుంది? ఉండనే ఉండదు కదా!

"అప్పొఴుదైక్కిప్పొఴుదు" - ప్రాణం పోయే సమయాన ఓ భగవానుడా! నిన్ను స్మరించడం నాకు సాధ్యం కాదు. కాబట్టి అప్పటి కోసం ఇప్పుడే, ముందే నిన్ను స్మరిస్తున్నాను అన్నారు పెరియాళ్వార్లు.

"అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్య త్రసంశ్రయః ॥" (భ.గీ. 8-5)

మరణకాలమందు కూడా నన్నే స్మరిస్తూ ఎవడు దేహాన్ని విడిచి పోతాడో, వాడు నన్ను స్మరించిన ఆకారాన్నే పొందుతాడు. ఈ విషయంలో సందేహమే లేదు.

"యంయంవాపి స్మరన్ భావం త్యజంత్యంతే కళేబరమ్ ।
తంత మే వైతి కౌంతేయ ! సదా తద్భావ భావితః ॥" (8-6)

ఓ యర్జునా! మొదటి నుంచి భగవంతుణ్ని స్మరిస్తుంటే అభ్యాసాన్ని బట్టి అంత్య కాలాన కూడా స్మరించడానికి సాధ్యమవుతుంది. మరణ సమయంలోనే భగవంతుని స్మరణ కొత్తగా చేయాలంటే అది కలుగనేరదు. కాబట్టి, చరమదశలో ఏయే రూపాన్ని చింతిస్తూ జీవుడు దేహాన్ని విడుస్తాడో, మరుసటి జన్మలో ఆయా రూపాన్నే పొందుతాడని శ్రీకృష్ణ భగవానుడు బోధించాడు.

ఆది భరతుడు తాను పెంచిన జింకను స్మరిస్తూ కళేబరాన్ని విడిచినందు వల్ల పునర్జన్మను మృగరూపంలో అనుభవించాడు. అతడు పూర్వం చేసిన పుణ్యం కూడా అతని అంతిమ ప్రత్యయాన్ని నివారింప జాలలేదు కదా! అని పురాణ కథ వల్ల తెలుస్తున్నది.

అంత్యకాలాన జీవాత్మ పరమాత్మను స్మరించినా, లేదా భగవానుడు జీవాత్మను స్మరించినా, ఆ జీవునికి మోక్ష పురుషార్థం లభిస్తుందని శాస్త్రం చెబుతుంది.

"స్థితే మనసి సుస్వస్థే శరీరే సతియోనరః ।
ధాతు సామ్యే స్థితే స్మర్తా విశ్వరూపంచ మామజమ్ ॥"
తతస్తం మ్రియమాణంతు కాష్ఠ పాషాణ సన్నిభమ్ ।
అహం స్మరామి మద్భక్తం సయామి పరమాంగతిమ్ ॥" (వరాహ పురాణం)

మనస్సు నిలుకడగా ఉన్నప్పుడు, శరీరం వ్యాధి గ్రస్తం కానప్పుడు, వాత పిత్త శ్లేష్మాదులు సమానగతిలో ఉన్నప్పుడు మానవుడు త్రికరణశుద్ధిగా భగవంతుణ్ని స్మరించాలి. అలా స్మరించిన నా భక్తుడు చివరి దశలో కట్టెగానో, రాయిగానో, స్మృతి తప్పి పడిపోయినప్పుడు, అతనిని నేనే స్మరిస్తాను, వైకుంఠానికి తీసుకొని పోతాను - అని భగవానుడే చెప్పినాడు.

ప్రపన్నునికి అంతిమస్మరణం లేకున్నా మోక్షఫలమూ లభిస్తుందని శాస్త్రం చెబుతుంది.

"జ్ఞాన సమకాలముక్త్వా కైవల్యం యాతిగత శోకః ।
తీర్థే శ్వపచ గృహేవా నష్ట స్మృతిః పరిత్యజన్ దేహమ్"

భక్తి రూపజ్ఞానం కలిగిన వ్యక్తి పుణ్యక్షేత్రమందు నివసించినా, చండాలుని ఇంటిలోఉన్నా, అంతిమ స్మరణం లేకపోయినా, శరీరాన్ని విడిచినవాడై పరమపదాన్ని పొందుతాడని చెప్పబడింది.

ఇట్టి క్లిష్ట సమస్యను దేశికులు ఈ శ్లోకంతో చక్కగా పరిష్కరించారు.

జీవహింసాది పాప కార్యాలు చేసే చోరకిరాతాది జనులకు ఇంద్రియాలు ప్రిదిలి పోయినాయి. పరవశులయ్యారు, కాందిశీక స్మృతి కలవారయ్యారు కదా!

"కాందిశీకో భయాద్రుతః" (అమరం). 'కాందిశీకమైన స్మృతి' అంటే ఏ దిక్కు పోవాలో కదా! అనుకొంటూ పరుగెత్తిన స్మృతి, అని అర్థం. స్మృతి లోపించిన వారు / స్మృతి తప్పిపడిపోయిన వారని భావం. ఈ మహా పాపాత్ములకు దేహాంత మందు మాత్రం ఏ పాపపు చింత లేదు కదా! ఇప్పుడు వీరికి రక్షణ అవసరమని దయాదేవి తలచింది. వారికి భగవంతుణ్ని స్మరింప జేసింది. "శ్రీమాన్ వేలా ప్రతీక్షో భవభయహరణేచేత్య భాణీ చ్ఛురారిః" భగవానుడు చేతనులను రక్షించడానికి అవసరాన్ని ఎదిరిచూస్తుంటాడని శ్రీ శఠకోప దివ్యసూరి సూక్తి.

స్మరయసి బహులీలం మాధవం సావధానా:- భగవానుడు బహు లీలలు కలవాడు. లీలా శబ్దం క్రీడార్థకం. "స్వామి పుష్కరిణీ తీరే రమయాసహమోదతే" శ్రీనివాసుడు శ్రీదేవితో సర్వదా క్రీడిస్తుంటాడు. జగద్వ్యాపార క్రీడ. లక్ష్మీదేవితో కూడి జగద్వ్యాపారం చేయడమే లక్ష్మీ పతి లీల. బహులీలలు కలిగిన మాధవుడు శ్రీ వల్లభుడు అంటే విచిత్ర హృదయహారి లీలావిశిష్టుడు భగవానుడని అర్థం.

భగవానుడు స్మరించలేడు కాబట్టి తిరుమల సమీప ప్రదేశాల్లో నివసించి శరీర వియోగ కాలాన కాష్టపాషాణ సన్నిభులైన జనులను స్మరించుమని భగవానునికి దయాదేవి సావధానయై విజ్ఞాపన చేస్తుందని కొందరు వ్యాఖ్యానం చేశారు.

"హేదయే! త్వం కాందీశీక స్మృతీనాం బహులీలం మాధవం

సావధానా (సతీ) స్మరయసి" అని అన్వయం కదా!

దయాదేవి యే జాగ్రత్త పడింది. మహాపాపులైన జనులను రక్షించే విషయంలోనూ భగవానుడే "మదీయైవ దయయా" నా దయ చేతనే అంటాడు కదా!

"దుష్టేంద్రియ వశాత్ చిత్తం నృణాం యత్కల్మషైర్వృతమ్ ।
తదన్తకాలే సంశుద్ధిం యాతినారాయణాలయే ॥"

దుష్టేంద్రియాల మూలంగా మనస్సు కల్మషం పొందినవారై, స్వయం వ్యక్త క్షేత్ర ప్రాంత భూములందు నివసించిన జనులకు శరీరావసాన కాలమందు వారి మనస్సు పరిశుద్ధమవుతుందని భగవచ్ఛాస్త్రం దివ్యక్షేత్ర మహిమాతిశయాలను వివరిస్తున్నది.

"సుభగశ్చిత్ర కూటోஉసౌ గిరిరాజోపమోగిరిః ।
యస్మిన్ వసతి కాకుత్థ్సః కుబేర ఇవ నందనే ॥" (రా)

నందన వనమందు కుబేరుడున్నట్లు శ్రీరామచంద్రుడు నివసించి యున్న చిత్రకూట పర్వతం సౌభాగ్యం కలదై హిమవత్పర్వతంతో తులదూగుతున్నది - అని వాల్మీకి, భగవానుడు నివసించిన క్షేత్ర మహిమను 'సుభగ' శబ్దంతో వివరించాడు

కదా! కాబట్టి, దయాదేవియే దివ్యక్షేత్ర ప్రాంత భూములందు నివసించిన పాపాత్ములకు శరీర వియోగ కాలమందు చిత్తశుద్ధిని, కలిగించి శ్రీనివాసుణ్ణి స్మరింపజేసింది. భగవద్విషయకమైన అంతిమ స్మృతిని పాపులకు కూడా దయాదేవి కలిగించడం ఉత్తమ హితమనీ, దివ్యక్షేత్ర ప్రభావం అద్భుతమనీ ఈ శ్లోకం కావ్యలింగాలంకృతమై ప్రకటిస్తున్నది.

త॥ కరుణ! యావృషభాద్రి చేరువ కాన నుండు నెపంబునన్
దురితవర్తనులై చరించెడు దుష్టచోర కిరాతులన్
కరణముల్ శిథిలంబులయ్యెడు కాలమందు భయద్రుత
స్మరణులంగని యోర్వకీవ రమాధవున్ దలపింపవే॥

38. దిశి దిశి గతివిద్భిర్దేశికై ర్నీయమానా
స్థిర తరమనుకంపే! స్యూన లగ్నా గుణైస్త్వమ్।
పరిగత వృషశైలం పార మారోపయన్తీ
భవ జలధి గతానాం పోత పాత్రీ భవిత్రీ॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! గతి విద్భిః = దయ ప్రసరించే పద్ధతులు తెలిసినట్టి / జలధియందు దారితెన్నులు తెలిసినట్టి; దేశికైః = ఆచార్యుల చేత / నావికుల చేత; దిశి దిశి = ఆయా ప్రాంతాలలో / ఆయా దిక్కుల యందు; నీ యమానా = తీసుకొని పోబడుతున్న దానవుగా / నడుపుకొని పోబడుతున్నదిగా; గుణైః = జ్ఞాన బలాది గుణాల చేత / త్రాళ్ళ చేత; స్థిరతరం = మిక్కిలి దృఢంగా; స్యూనలగ్నా = సంబంధం కలిగిన దానవుగా / బాగా బంధింపబడినదిగా; పరిగత వృషశైలం = తిరుమలను చేరియున్న; పారం = పరమాత్ముడైన శ్రీనివాసుణ్ణి / గట్టును; ఆరోపయంతీ = ఎక్కింప జేసే దానవుగా ఉన్న / పొందింపజేసేదిగా ఉన్న; త్వం = నీవు; భవ జలధి గతానాం = సంసారమనే సముద్రంలో మునిగి యున్న వారికి; పోత పాత్రీ = నౌకగా; భవిత్రీ = అగుతున్నావు.

తా: ఓ దయాదేవీ! నీవు సంసార మనే సాగరంలో మునిగి కొట్టుమిట్టాడు తున్న జనులకు నావగా ఉన్నావు. నీవు ఒక నౌకవు. నీవు భగవానుని దయవు

కాబట్టి, నీవు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రసరిస్తావో ఆ రీతులన్నీ తెలిసిన ఆచార్యులే నిన్ను తీసుకొని పోతారు. నీవు నావవే కాబట్టి, సముద్రమందలి మార్గాలూ, దిక్కులూ బాగా తెలిసి సుశిక్షితులైన నావికులే నౌకను చక్కగా నడుపుతారు. నౌక ఇనుప గొలుసులచే దృఢంగా బంధింపబడియున్నట్లే, నీవు భగవానుని కల్యాణ గుణాలతో బాగా సంబంధం కలిగి యున్నావు.

నావలో పయనించే వారిని అది గట్టుకు చేరుస్తుంది, అట్లే నీవు నిన్ను ఆశ్రయించిన వారిని గుట్ట మీద ఉన్న శ్రీనివాసుని సన్నిధికి చేరుస్తావు.

వ్యాఖ్య:- దయా దేవి నావగా చిత్రింపబడిన శ్లోకం.

గత శ్లోకంలో దయాదేవి దివ్య దేశవాసులకు ఉపకరించింది. ఈ శ్లోకమందు సంసారులకు ఉపకరించే విధానాన్ని దేశికులు శ్లేషానుప్రాణిత రూపకాలంకారికోక్తి చేత తెల్పుతున్నారు.

భవజలధిగతానాం:- సంసారమనేది ఒక మహా సముద్రం. శ్రీ కులశేఖ రాళ్వార్లు ముకుందమాలలో -

"భవజలధిగతానాం ద్వంద్వ వాతాహతానాం
సుతదుహితృ కళత్ర త్రాణ భారార్దితానామ్ ।
విషమ విషయతోయే మజ్జతా మప్లవానాం
భవతి శరణమేకో విష్ణుపోతో నరాణామ్ ॥" (13)

సంసారమనే సముద్రంలో పడినవారు శబ్ద స్పర్శ రూపరసగంధాలనే విషయాలు తలక్రిందులుగా పొంగే జలాలరీతిగా ముంచుతుంటే ఈదలేక, దాటడానికి పడవ లేనివారై, ఉక్కిరి బిక్కిరిగా బాధపడుతారు. సుఖదుఃఖాలు, ఆకలిదప్పులు, శోకమోహాలు, జరామృత్యువులు అనే జంటలు పెద్ద గాలుల వలె ఇటూ అటూ నెట్టివేస్తూ గట్టుకు చేరనీయవు. కొడుకులు, బిడ్డలు, భార్య మొదలైన వారిని రక్షించే పెద్ద బరువు తలమీద ఉండడం వల్ల మరింత లోతునీటిలో మునిగి పోతుంటారు. ఇలాగా సంసార సముద్రంలో మునుగుతున్న వారికి ఒకటే విష్ణుపోతం - భగవానుడనే నావయే శరణం - రక్షకమని స్తుతించారు.

"భగవన్ కరుణాసింధో! భవసింధోర్భవాంస్తరిః ।
యమాశ్రిత్యాశ్రమేణైవ పరంపారంగతా బుధాః ॥"

దయాసముద్రుడవైన ఓ భగవానుడా! సంసారమనే సముద్రానికి నీవు నౌకవు. జ్ఞానులు ఈ నావనెక్కి (నిన్ను ఆశ్రయించి) అనాయాసంగానే ఆవలిగట్టుకు చేరుకొన్నారు. ముక్తిని పొందారు అని శ్రీ శంకరాచార్యులు స్తుతించారు. ఒక సముద్రం మరొక సముద్రానికి నౌకగా ఏర్పడిందని భావం.

"భవజలధిగతానాం పోతపాత్రీభవిత్రీ" – సంసార సముద్రంలో పడినవారికి దయాదేవి నౌకగా శ్రీ వేంకటనాథ కవిచే స్తుతింపబడుతున్నది. జీవులను తరింపజేయడానికి సాధనమైనది యాన పాత్రకాబట్టి దయ అనబడే నావ కూడా సముద్రంలో పెనుగాలులచే గట్టుకు చేరకుండా ఇటూ అటూ పడి తిరుగుతుండడం సంభవమే కదా! దయా నావకు కలిగే కాందిశీకత్వాన్ని పరిహరించి గట్టుకు చేర్చేవారు ఎవరు? అంటే –

దిశిదిశిగతివిద్భిః దేశికైః నీయమానా:– నౌకను నడిపేవారు. దిక్పరిజ్ఞానం కలవారై, ఆయా దిక్కులకు వెళ్ళే సముద్ర మార్గాలూ తెలిసిన నిపుణుల చేత ఒడ్డుకు గొనిపోబడుతుంది. 'యానపాత్రంతు పోతః' (అమరం) 'పూయీ విశరణే' అనే ధాతువును బట్టి, (పూయతే కాలక్రమేణే తిపోతః) కాల క్రమాన ముక్కలయ్యేది 'పోత' మనబడుతుంది. పోతమంటె 'నావ' అగుటకు అర్హమైన దయ 'పోతపాత్రి' అనబడింది.

గమనయోగ్యమైన నావ సుశిక్షితులైన నావికులచే చక్కగా నడపబడునట్లే 'దయ' అనబడే నావ కూడా శాస్త్రజ్ఞులైన దేశికులచే చక్కగా గట్టుకు తీసికొని పోబడుతుంది.

దేశికులంటే ఆచార్యులు అని అర్థం.

"దేవతా రూపధారిత్వాత్ (దే)
శిష్యానుగ్రహకారణాత్ (శి)
కరుణా మయమూర్తిత్వాత్ (క)
దేశికః కథితః ప్రియే ॥ (కులార్ణవం)

దేవ రూపాన్ని ధరించడమూ, శిష్యులను అనుగ్రహించడమూ, దయా స్వభావమూ కలిగి యుండడం వల్ల ఆచార్యులకు దేశిక శబ్దం అన్వర్థమయింది.

ఆచార్యులు ధూమ, అర్చిరాది గతులను తెలిసినవారు. ఐశ్వర్యం, కైవల్యం, పరమపద ప్రాప్తి అనే త్రివిధ గతులను తెలిసినవారు కాబట్టి ఆచార్యులు సంసారులను రక్షింప యోగ్యులు.

రక్షణమంటే, అనిష్టాన్ని తొలగించి ఇష్టాన్ని కలిగించడమని అర్థం కదా! అనిష్టమనేది వారి వారి చిత్తవృత్తిని బట్టి ఉంటుంది. సామాన్యులకు వ్యాధులు సోకడమనిష్టం. ముముక్షువులకు సంసారమనిష్టం. కాబట్టి రక్షించడానికి తగిన చేతనులను దయా పాత్రులయ్యే రీతిగా చేయగల దక్షులు దేశికులని అర్థం.

దేశికుల కటాక్షం ప్రసరించిన చోటనే దయ ప్రసరిస్తుంది. భగీరథుని మార్గాన్ని గంగాదేవి అనుసరించినట్లే, దేశికుల మార్గాన్ని దయాదేవి అనుసరిస్తుంది. ఆచార్యుల అనుగ్రహం ద్వారా భగవంతుని దయ సంసారులను కాపాడుతుంది. కాబట్టి దేశికుల అభిప్రాయం చేత భగవద్దయ తీసికొని పోబడుతుంది.

స్థిరతరం స్త్యానలగ్నాగుణైః:- 'స్థిరచరం' అనే పాఠమూ ఉంది. నావ చాలా దృఢంగా ఉండాలి; లేకపోతే భిన్నమవుతుంది. అది సంచరించేదిగాను ఉండాలి. సంచరించకుంటే ప్రయోజనమే లేదు కదా! కాబట్టి నావ ఇనుప త్రాళ్ళచే గట్టిగా కట్టబడి ఉంటుంది. 'గుణ' శబ్దానికి త్రాడని అర్థం.

"శుల్బం వటారకః స్త్రీతురజ్జు స్త్రిషు వటీ గుణః" (అమరం)

నావ నిర్మాణం దృఢంగా గుణబద్ధమైనట్లే, దయాదేవి కూడా భగవంతుని (ఇతర) జ్ఞానబలాది కల్యాణ గుణాలతో (11 శ్లో) సంబంధం కలిగి ఉంటుంది. స్వేతర కల్యాణగుణాలతో సన్నిహిత సంబంధం కలిగి యుండడం వల్ల దయాదేవి అప్రకంప ప్రభావం కలిగి ఇష్టకార్యాలను నిర్వహించే శక్తిమంతమైనది.

పరిగతవృషశైలం పారమారోపయంతీ:- సాధారణంగా నావ తనయందున్న ప్రయాణికులను సముద్ర తీరాన ఉండే భూమికి (గట్టుకు) చేరుస్తుంది. దయానౌక

తనయందున్న ప్రపన్నులనే ప్రయాణికులను తీరభూమికి గొనిపోవడం కాదు, తిరుమల మీద వేంచేసి యున్న శ్రీనివాసుని పాదపద్మాల చెంతకు - మహోన్నత స్థలమందు - చేరుస్తుంది. దయ యనే నావ మీద పయనించే జనులు చేరే తీరభూమి కొండలరాయని పాద కమలమే అనీ, సదాచార్యుల అనుగ్రహం చేతనే భగవత్కృపకు సంసారులు పాత్రులవుతారనీ శ్రీ వేదాన్త దేశికులీ శ్లోకంలో బోధించారు. సదాచార్య సంబంధం చేత భగవద్దయకు పాత్రులైన సంసారులకు పునర్జన్మ ఉండదని స్పష్టం కదా!

మ॥ అంతటన్ గతివేదులైన మహామతుల్ నడిపింప న
త్యంత సత్త్వ గుణా ప్రకంపత దాల్చి నీవనుకంప! ని
శ్చింత జేర్పుదు యానపాత్రము చెల్వు దాల్చి భవార్ణవా
భ్యంతర స్థితులైన మమ్ము వృషాద్రి శేఖరపారమున్ ॥

39. పరిమిత ఫలసంగాత్ ప్రాణినః కింపచానాః
నిగమ విపణి మధ్యే నిత్య ముక్తానుషక్తమ్ ।
ప్రసదన మనుకంపే! ప్రాప్త వత్యా భవత్యా
వృషగిరి హరినీలం వ్యంజితం నిర్విశంతి ॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! పరిమిత ఫలసంగాత్ = స్వల్ప ఫలాల యందలి ఆసక్తి వల్ల; కింపచానాః = క్షుద్రులైన; ప్రాణినః = జీవులు; ప్రసదనం = అనుగ్రహాన్ని; ప్రాప్తవత్యా = పొందియున్న; భవత్యా = నీచేత; వ్యంజితం = తెల్పబడిన / ప్రదర్శింపబడిన; నిత్య ముక్త+అనుషక్తం = నిత్యులతో ముక్తులతో కూడిన / నిత్య ముక్తా+అనుషక్తం=ఎల్లప్పుడు ముత్యాలతో కూడిన; వృషగిరి హరినీలం = వృషాద్రియందున్న నీల వర్ణం గల హరిని / వృషాచలమే ఆకరమైన ఇంద్రనీలమణిని; నిగమ విపణి మధ్యే = వేదం అనే అంగడి వీథి నడుమ/నగరమందలి సంతలో; నిర్విశంతి = అనుభవిస్తారు / పొంది ఆనందిస్తారు.

తా: ఓ దయాదేవీ! ఒక శ్రీమంతుడేర్పరచిన వేదమనే అంగడిలో అల్పమైన అస్థిరమైన భోగ వస్తువుల మీద ఆశతో తిరుగుతుండే క్షుద్ర జీవులను అనుగ్రహించిన

నీ మహిమచే ప్రభావితులయ్యారు వారు. అందువల్ల స్వల్ప వస్తువులను తీసుకోక, ముత్యాలలోనూ, మణులలోనూ శ్రేష్ఠమైన వృషాద్రియందు ఉండే హరి నీలమణిని శ్రీనివాసుణ్ని గ్రహించినవారై అమితానందాన్ని అనుభవిస్తున్నారు.

వ్యాఖ్య: ప్రకృతి బంధాన్ని తెంచుకోజాలని బద్ధ జీవులను కూడా పరమ ప్రపన్నులను జేసే దయాదేవిని స్తుతించే విలక్షణమైన శ్లోకమిది.

ఈ లోకంలో సుఖమయజీవనం గడుపాలి' అని కోరేవారికైనా 'పరలోకంలో శాశ్వతమైన ఆనందాన్ని పొందాలి' అని కోరుకొనే వారికైనా భగవానుని దయను పొందడం ఆవశ్యకం. "ఒరు కురువిపిణైత్త పిణై ఒరువరాల్ అవిష్క్కప్పోకిఱ తిల్లై; సర్వశక్తి కర్మానుగుణమాక పిణైత్త పిణైయై యవనైయే కాల్ కట్టి యవిష్త్తు క్కొళ్ళ మిత్తనైకాణ్" - ఒక పిట్ట అల్లిన అల్లికను (గూటి చిక్కును) ఒకనిచే విప్పనలవి కాదు; సర్వశక్తిమంతుడైన భగవానుడు కర్మకు తగినట్లుగా అమర్చిన చీలను అతనినే కాళ్ళు బట్టుకొని ఊడగొట్టించుకోవాలి; ఇంతే సుమా - అన్నారు పిళ్ళై తిరువళైయూ రరైయర్.

కింపచానాః:- కించిత్ అన్నం పచంతీతి కింపచానాః. కొద్ది వంటకాన్ని వండుకొన్న వారు 'కింపచానులు'. బహుపాకినులు - బాగా వండుకొన్నవారు కారు అని అర్థం.

"కదర్యేకృపణ క్షుద్ర కింపచాన మితం పచాః" - (అమరం)

పరిమిత ఫలసంగాత్ ప్రాణినఃకింపచానాః:- ఫలం అన్ని విధాలా మితమైనది కాబట్టి పరిమిత ఫలం. మోక్షఫలం సర్వ విధాలా అసంకుచిత మైనందువల్ల అది అపరిమితం. కింపచానులు అల్పమైన, అస్థిరమైన ఫలాన్ని ఆశించే క్షుద్రులు. ప్రాణులనడం వల్ల తోలుతిత్తిలాగా గాలిని పీల్చి, విడిచే వారని, జ్ఞానం లేని వారని అర్థం.

జీవాత్మ స్వయంగా జ్ఞానం కలదైనా, చేసుకొన్న కర్మకు తగిన దేహం లభించడం వల్ల, జ్ఞానం సంకుచితమైన క్షుద్ర జీవులని భావం. ప్రకృతి బద్ధ జీవులన్న మాట. "తరవః కిం న జీవంతి భస్త్రాః కిం నశ్వసంత్యుత". చెట్లు బ్రతుకడం లేదా యేమి? తోలుతిత్తులకు మాత్రం శ్వాస లేదా? అని శ్రీ శుకసూక్తి.

నిగమవిపణిమధ్యే:- 'నిగమ' శబ్దానికి అంగడి వీథి, పట్టణం, వేదం అని అనేకార్థాలున్నాయి. "వణిక్పథః పురం వేదో నిగమః" (అమరం) వేదమే పణ్యవీథి అనడం వల్ల అంగట్లో కోరిన వస్తువులు దొరికే విధంగా వేద మందు విహిత కర్మను ఆచరించడం వల్ల కలిగే ఫలాన్ని ఆయా అధికారులు పొందగలరు. సత్కర్మాను ష్ఠాన పరులకు బ్రహ్మజ్ఞాన ఫలమూ లభిస్తుంది. శ్యేనాది అభిచార కర్మ చేత జ్ఞాతులను, శత్రువులను సంహరించే యోగ్యత కూడా లభిస్తుంది.

నిత్యముక్తానుషక్తం వృషగిరి హరినీలమ్:- శ్లేషచమత్కృతి ఇది. వ్యాపారం చేసే వ్యక్తులు (నైగములు) సామాన్యమైన నిత్యావసర వస్తువులు మొదల్కొని ఉత్కృష్టమైన, అనర్ఘమైన రత్నాలను కూడా అమ్మడానికి ప్రదర్శిస్తారు.

"ముచ్యతే శుక్తి సంపుటాత్ ఇతి ముక్తా" ముత్తెపు చిప్పనుంచి విడువబడేది ముత్యం.

"జీమూత కరిమత్స్యా(ద్రి) హి వంశ శంఖ వరాహజాః ।

శుక్త్యుద్భవాశ్చ విజ్ఞేయా అష్టౌ మౌక్తికయోనయః ॥"

మేఘం, ఏనుగు, చేప, పర్వతం లేదా పాము, వెదురుబొంగు, శంఖం, వరాహం - ఇవి ముత్యాలు పుట్టే స్థలాలు అని ప్రమాణం. "అశ్మగర్భో హరిన్మణిః " (అమరం) గరుడ పచ్చలు, ఇంద్రనీల మణులు శిలాజాతాలని అర్థం.

మణులలో ఇంద్రనీలమణి ఎక్కువ వెలగలది, శ్రేష్ఠమైనది. 'హరి' శబ్దానికి విష్ణువని, ఇంద్రుడని కూడా అర్థం. 'హరినీలం' అంటే నీలవర్ణుడైన హరి (శ్రీనివాసుడు) ఇంద్రనీల మణి, అని అర్థం.

ముత్యాలహారమందు ఇంద్రనీలమణి నాయకమణిగా శోభిస్తుంది.

వృషాచలమనే ఆకరమందు ప్రభవించిన మణి హరినీలం. శ్రీనివాస భగవానుడు నిత్యసూరులతోనూ, ముక్తపురుషులతోనూ కూడి ఉంటాడు. "సదాపశ్యంతిసూరయః" - నిత్యులు, ముక్తులు భగవంతుణ్ని సేవిస్తుంటారు.

"తత్రాయాతైః సపదిమనుజైః స్వర్గిభిశ్చావతీర్ణైః" (హంస సందేశం) తిరుమల మీదికి నిత్యముక్తులు పరమ పదం నుంచి శ్రీ వేంకటేశ్వరుణ్ని దర్శించడానికి దిగి వస్తారు. మనుష్యులు కొండ ఎక్కి వచ్చి సేవిస్తారని దేశికులన్నారు.

ప్రసదన మనుకంపే ప్రాప్తవత్యాభవత్యా:- పరిమిత ఫలాన్ని ఆశించి తిరుమలకు వచ్చే మానవుల పట్ల దివ్య దేశానికి వచ్చినారని ప్రసన్నురాలై భగవంతుని వల్ల మోక్ష ఫలాన్ని పొందజేస్తుంది. దయాదేవి, నిత్యముక్తులతో కూడిన భగవానుణ్ని ప్రదర్శించడం చేత, మీరు కూడా హరినీలమణితో కూడియున్న ముత్యాల లాగా, శ్రీనివాస భగవానుణ్ని సేవిస్తూ ముక్తాత్మలవుతారు. పరిమిత ఫలాన్ని ఆశించకుండా అపరిమిత ఫలాన్ని కోరుతారని తెల్పుతుంది.

కామ్యఫలార్థులే అధికంగా ఉంటారు. మోక్షఫలాన్ని కోరేవారు చాలా తక్కువగా ఉంటారు. కోరిన ఫలాన్ని పొందడానికి తిరుమలకు వచ్చిన జనులకు దయాదేవి నిత్యముక్తులచే ఉపాస్యమానుడైన భగవంతుణ్ని మోక్షప్రదుడని తెలుపుతూ చూపుతుంది. తత్ఫలితంగా, బుభుక్షువులు ముముక్షువులవుతారు. భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించిన ప్రభావం చేత కూడా సత్త్వ గుణం ఉద్బుద్ధమై ఫలసంగం విడిచి, మోక్ష ఫలార్థులవుతారు. ఇదంతా దయాదేవి చేతనే సూచింప బడుతుంది. ఈ విధంగా తిరుమల యందు నివసించడం వల్ల మోక్ష పర్యంతమైన శ్రేయస్సు కలుగుతుందని ఆ దివ్యదేశ నివాస ప్రభావమూ వర్ణితమే.

శ్రీమంతుడు శ్రీనివాసుడు. ఆయన పురుషోత్తముడు. చాలా దయకలవాడు. బద్ధజీవులకు తత్త్వ హిత పురుషార్థాలను బోధించడానికి కృపా ప్రసన్నులైన ఆచార్యులను అనుగ్రహించాడు. తత్త్వం తెలుసుకోదగినది. హితం ఆచరింప దగినది. పురుషార్థం పొంద దగినది. దయాళువైన ఆచార్యుల ఉపదేశం చేత జీవ వర్గమంతా స్త్రీప్రాయమనీ, పురుషోత్తముడే సేవింపదగిన వాడని తెలుస్తుంది. భగవంతుని దయచేతనే సకల వస్తువులు లభిస్తాయి. అంటే దయాదేవి సర్వార్థ ప్రదాయిని కదా! వేదమనే విపణి వీథి భగవద్దయ చేతనే ఏర్పడినది. సప్తలోకాలకు, లోకస్థులకు, లోకేశులకు అవసరమైన సర్వ పదార్థాలు అమర్చబడి ఉన్నాయి. ఈ ఏడు కొట్టులు (shops) చాలా పెద్దవి. ఆ పైన వేదాంత ప్రతిపాద్యుడైన శ్రీమంతుడు అర్థికల్పకంగా వెలసియున్నాడు.

"తన్నైతన్దకల్పగమ్" – కల్పవృక్షం కోరినవన్ని ఇస్తుంది కాని తనను ఇచ్చుకోదు. సర్వేశ్వరుడు మోక్షదాత కదా! తనను కూడా తన పాదాలను పట్టుకొన్న వానికి –

శరణాగతునికి ఇచ్చుకొంటాడు. ఏ వస్తువునైనా తనను కోరి పొందిన వారే ఉదారులు' అన్న వాడే కదా! "ఉదారాః సర్వ ఏవైతే" (భ.గీత) "భక్తిక్రీతోజనార్దనః" - భక్తికి స్వామి అమ్ముడు పోతాడు. బద్ధాత్ములు మొదటి కొట్టులోని సామాన్య ద్రవ్యానికి ఆశపడి ఒక వస్తువును తీసుకొంటే, పై కొట్టులలోని ద్రవ్యాన్ని గ్రహించే అవకాశం ఉండనే ఉండదు. ఫలాశచే ఒక లోకానికి పోయి అక్కడి భోగాన్ని అనుభవిస్తే, ఇక పై లోకాలకు వెళ్ళలేడు. అనుభవించిన లోకం నుంచి క్రిందికి రావడమే నియమం. ఏ కొట్టులోని ద్రవ్యానికి ఆశపడక, ఆపైన అగ్రస్థానంలో ఉన్న హరినీలాన్ని - భగవద్ద్రవ్యాన్ని కోరుకున్న జీవాత్మకు భగవానుడే కాదు సర్వలోకాలు (ఆ మార్కెట్ అంతా 'ఇయర్‌మార్క్' అవుతుంది) తనవే అవుతాయి.

వేదాంతమందు వెలసిన అక్షర పరబ్రహ్మమే వేదమందు, జగమందు ప్రసిద్ధమై ఉంది. "తస్యవాచకః ప్రణవః" ఆయన ఓంకారవాచ్యుడు. ఓంకారార్థమే నమో నారాయణాయ. ఈ అష్టాక్షరి మంత్రమే నిగమ విపణి వీథి. ఈ మంత్రాన్నే తిరుమల యందు 'ఓమ్ నమోవేంకటేశాయ' అని సకల జనులు అనుసంధిస్తున్నారు. భగవద్దయ చేతనే తృప్తి లేని, అవధి లేని ఆనందాన్ని అనుభవిస్తున్నారు. శ్లేష చేత రూపకాలంకారం అనుప్రాణితం.

మత్త కోకిల: **దీనవృత్తి గదర్యులీభువిదేవి! స్వల్ప ఫలార్థులై**
పూని యాగమ పుణ్య వీథుల బొంది తారట నిత్యము
క్తాను షక్త మహాజనార్హ వృషాద్రి రాధ్ధరి నీలమున్
మానకన్ గని సంతసిల్లుట మాత! నీ మహిమన్ గదా ॥

40. **త్వయి బహుమతిహీనః శ్రీనివాసాను కంపే**
జగతి గతి మిహాన్యాం దేవి! సంమన్యతేయః ।
సఖిలు విబుధ సింధౌ సన్నికర్షే వహంత్యాం
శమయతి మృగ తృష్ణా వీచికాభిః పిపాసామ్ ॥

అర్థం: హేదేవి! శ్రీనివాస+అనుకంపే = శ్రీనివాసుని దయాదేవీ! ఇహ = ఈ, జగతి = లోకమందు; యః = ఎవడు; త్వయి = నీయందు; బహుమతి

హీనః = గౌరవం లేనివాడై; అన్యాం, గతిం = వేరే గతిని; సంమన్యతే = బహుమానిస్తున్నాడో; సః = వాడు; విబుధ సింధౌ = దేవనదియైన గంగ; సన్నికర్షే = సమీపమందు; వహంత్యాం = ప్రవహిస్తుండగా; మృగతృష్ణా వీచికాభిః = ఎండ మావుల తరంగాల చేత; పిపాసాం = దప్పికను; శమయతిఖలు = తీర్చుకొను వాడే కదా!

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! ఈ లోకమందు ఎవడు నీ యందు ఆదరభావం లేకుండా వేరే దేవతలను శరణంగా బహుమానిస్తున్నాడో, వాడు దగ్గరనే గంగానది ప్రవహిస్తున్నప్పటికీ ఎండమావుల అలల చేత దప్పి దీర్చుకొంటున్నట్టి వాడేకదా!

వ్యాఖ్య: మోక్ష ఫలాన్ని ఇచ్చే శ్రీనివాసుని దయను ఆశ్రయించక ఇతర దేవతోపాసనలను అవలంబించేవారు అవివేకులని సుశ్లోకితం.

దయాదేవి చేత సర్వభోగ్యాతిశాయియైన భగవద్రత్నమే ప్రదర్శింప బడుతుందని గత శ్లోకం వివరించింది. ఈ శ్లోకం భగవత్కృపయే మోక్ష ప్రాప్తికి పర్యాప్తమైనది; ఇతర మార్గాలన్నీ ఎండమావుల లాంటివని వ్యతిరేకాన్వయ పద్ధతిచేత వివరిస్తున్నది.

హేదేవి! శ్రీనివాసానుకంపే:– వేదాంత దేశికులకు శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క దయ యందు ఉన్న నిరతిశయ బహుమానాన్ని ఈ రెండు సంబోధన పదాలు ప్రదర్శిస్తున్నాయి. ఈ శ్లోకరచన సమయాన దేశికులకు కాళిదాస కవి రచించిన శాకుంతల నాటక మందలి శ్లోకం స్ఫురించి యుంటుందని శ్రీమాన్ ఏ.వి. గోపాలాచార్యుల వారి సంస్కృత వ్యాఖ్యలో ఉంది.

"సాక్షాత్ ప్రియాము పగతా మపహాయపూర్వం
చిత్రార్పితా మహమిమాం బహుమన్యమానః ।
స్రోతోవహాం పథి నికామజలా మతీత్య
జాతః సఖే! ప్రణయవాన్ మృగతృష్ణికాయామ్ ॥ (6 అం. 16 శ్లో)

దుష్యంతుడు మాధవ్యునితో పలికిన మాట ఇది.

మిత్రమా! మొదట సాక్షాత్తుగా పొందిన ప్రియురాలిని వదలివేసి, నేను ఈ చిత్తరువు నందు చిత్రించిన ప్రియురాలిని బహుమానిస్తున్నాను. వాస్తవంగా, దారిలో జలపూర్ణమై ప్రవహిస్తున్న నదిని దాటి, మరీచిక యందు ఆశపడినవాడనయ్యాను.

ఈ శ్లోకంలో శకుంతల సామాన్యమైన నదిగా పోల్చబడింది. ఆమెయొక్క చిత్రపటం ఎండమావితో పోల్చబడింది కదా!

దేశికులు దయాదేవిని దేవనదియైన గంగాదేవితో పోల్చారు. కాబట్టి 'దేవి!' అని విశేషంగా సంబోధించారు.

ఆచార్యులు దయాదేవిని "మాధవ దయామందాకినీ" - "దివ్యాపగావ్యాపకాః " - "కారుణ్యగంగా ప్లావిత మద్విధాన్" - అని గంగానదిగానే ఉల్లేఖించారు కదా! శ్రీనివాసుని పాదాల యందు పుట్టింది గంగాదేవి. ఆయన పాదాల నాశ్రయిస్తే పుట్టేదే దయాదేవి. రెండింటికీ శ్రీనివాస పాదోద్భవత్వం సామాన్యం.

త్వయి బహుమతి హీనః అన్యాంగతిం సమ్మన్యతేయః:- అన్నిటినీ నిర్వహించే దయా దేవియందు సకల పురుషార్థ సాధనకు ప్రాపకమనే విశ్వాసం లేకుండా, ఈ ప్రపంచంలో ఇతర కర్మజ్ఞాన మార్గాలే మోక్షసాధనాలనీ సంభావించే వాడు వెర్రి వెంగళాయయే కదా! భగవత్కృపయే మోక్ష ప్రాప్తికి ఉపాయం. ఇతర దేవతలను ఉపాసించిన వారు కోరిన ఫలాన్ని కూడా శ్రీనివాసుని కృప వల్లనే పొందుతారు.

"సతయా శ్రద్ధయాయుక్తః తస్యారాధన మీహతే ।

లభతేచ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్ ॥" (7-22)

ఏ దేవతా స్వరూపాన్నైనా శ్రద్ధతో ఆరాధించే వ్యక్తి, నా దయవల్లనే ఆ దేవత ద్వారా ఆయా భోగాలను పొందుతాడు అని గీతాచార్యుడు బోధించాడు కదా!

వేరే దేవతలకు సంబంధమే మాత్రమూలేనిదైన మోక్ష ప్రదానానికి సమర్థమైనది శ్రీనివాసుని దయ ఒక్కటే కదా!

"యస్య ప్రసాదే సతతం ప్రసీదేయురిమాః ప్రజాః" చతుర్ముఖాది జీవులు అందరు ఏ ఫలాన్నైనా శ్రీనివాసుని కృప చేతనే పొందుతారనడం సత్యం. కాబట్టి

భగవద్దయయే అన్ని విధాలా కాపాడుతుంది అనే విశ్వాసంతో ఆ దయను అవలంబించి ఉండడం శ్రేయస్కరం.

సఖలు విబుధసింధౌ సన్నికర్షేవహంత్యాం,

శమయతి మృగతృష్ణా వీచికాభిః పిపాసామ్:-

పరమ పురుషుడైన శ్రీనివాసుని దయమీద పూర్ణ విశ్వాస ముంచక, దేవతాంతరోపాసనలను మోక్షసాధనంగా గ్రహించేవాడు తనకు దగ్గరనే గంగానది ప్రవహిస్తున్నప్పటికీ ఆ గంగోదకాన్ని త్రాగక, ఎండమావుల అలల చేత తన దాహాన్ని తీర్చుకొనే వ్యక్తి వంటి వాడేకదా!

భగవద్దయ ఎల్లప్పుడు సర్వజీవులకు సమీపవర్తియై ఉంటుందని 'సన్నికర్షేవ హంత్యాం' అనే విశేషణ పదం చేత ధ్వనిస్తున్నది.

"అనాదృత్యతు యేవిష్ణోః కృపా మన్యదుపాసతే ।
తేకరస్థాం శ్రియం త్యక్త్వా భిక్షామిచ్ఛంతి యాచితుమ్ ॥"

ఎవరైతే విష్ణుమూర్తి దయను ఆదరభావంతో సేవించక వేరే దైవాన్ని ఉపాసిస్తారో, వారు చేతిలో ఉన్న ధనాన్ని పారవేసి బిచ్చమడిగి బ్రతుక గోరే పిచ్చివారు.

"వాసుదేవం పరిత్యజ్య యోఽన్యంధైవముపాసతే ।
తృషితో జాహ్నవీ తీరే కూపంఖనతిదుర్మతిః ॥"

విశ్వమంతట భాసించే వాసుదేవుణ్ణి భజించక ఇతర దేవతను భజించే వ్యక్తి, దప్పిక గొన్నవాడు గంగానది గట్టున నూతిని ద్రవ్వుకొంటున్న బుద్ధిహీనుని లాంటివాడే కదా!

ఎండమావిలో నీరున్నదని జ్ఞానం లేని జంతువులు పరుగెత్తి అలసిపోయి ప్రాణాలను గోలుపోయే రీతిగా, శ్రీనివాసుని దయను ఆశ్రయించక వేరే మార్గాలను అవలంబించిన మూఢులు ఆత్మనాశనాన్ని పొందుతారు. కాబట్టి, జ్ఞానులు శ్రీనివాసుని కృపకు పాత్రులయ్యే విధంగా, అన్యగతిలేని వారుగా ప్రవర్తించి

సంసారం నుంచి సంతరిస్తారనే పంచమ దశకమందలి అర్థాన్ని సూచిస్తున్న ఈ శ్లోకంతో నాల్గవ పత్తు ముగింపబడుతున్నది.

ఈ శ్లోకం లోని పూర్వార్ధ ఉత్తరార్ధాలు బింబ ప్రతిబింబ భావంగా వర్ణింపబడడం వల్ల నిదర్శనాలంకార యుక్త మాలినీ వృత్తమిది.

మత్తకోకిల॥ **కుండలీశ గిరీశరాడ్దయ కోరిసద్గతి యెవ్వడిం**
దొండు త్రోవలు వట్టు నిన్నెద నూది ప్రాపుగ నొల్ల కా
తండు స్వర్ణది చేర బాఱగ దజ్జలంబులు మాని నో
రెండు చుండగ దప్పితీర్చుట కెండ మావులకే గెడున్ ॥

చతుర్థ దశకం సమాప్తం

పంచమ దశకం

41. ఆజ్ఞాం ఖ్యాతిం ధనమనుచరా నాధిరాజ్యాదికం వా
కాలే దృష్ట్వా కమలవసతే రప్యకించిత్కరాణి ।
పద్మాకాంతం ప్రణిహితవతీం పాలనేఽ నన్య సాధ్యే
సారా భిజ్ఞా జగతి కృతినః సంశ్రయంతే దయే! త్వామ్ ॥

అర్థం: హే దయాదేవీ! జగతి = ప్రపంచమందు; కమల వసతేః, అపి = బ్రహ్మదేవునికైనను; ఆజ్ఞాం = శాసనాన్ని, ఖ్యాతిం = కీర్తిని; ధనం = సంపత్తును; అనుచరాన్ = సేవకులను; ఆధిరాజ్య+ఆదికం, వా = రాజాధిరాజత్వం మొదలైన వైభవాన్ని కూడా; కాలే = ఒకానొక కాలాన; అకించిత్ కరాణి = నిరుపయోగాలై చెడిపొయ్యే వాటినిగా; సార+అభిజ్ఞాః = సారమెరిగిన; కృతినః = సమర్థులు; దృష్ట్వా = పరిశీలించి, చూచి; అనన్య సాధ్యే = ఇతరులకు సాధ్యం కానట్టి; పాలనే = రక్షణ వ్యాపారమందు; పద్మాకాంతం = శ్రీ వల్లభుణ్ని; ప్రణిహిత వతీం = నియమించునట్టి; త్వాం = నిన్ను; సంశ్రయంతే = ఆశ్రయిస్తున్నారు.

తా: ఓ దయాదేవీ! లోకంలో బ్రహ్మదేవుని యొక్క ఆజ్ఞ, కీర్తి, సిరి, చతురంగ బలం, సార్వభౌమత్వాది వైభవం కూడా కాలమహిమ చేత ఒకప్పుడు నశించి పోయేవే కదా! అని సర్వశాస్త్రాల సారమెరిగిన ధన్యాత్ములు తెలుసుకొని, ఎవరికీ సాధ్యంకానట్టి పాలన కార్యమందు శ్రీనివాస భగవానుణ్ని నియమించే నిన్ను భజిస్తుంటారు.

వ్యాఖ్య: సర్వశాస్త్ర సారమెరిగిన సుకృతాత్ములు భగవద్దయా వలంబులని వర్ణితం.

పూర్వ దశకమందు దయాదేవిని ఆశ్రయించక, ఇతర దేవతలను ఉపాసించే వారు గంగాజలాన్ని వదలి మరీచికలలో పరుగెత్తే దయనీయ స్థితి ప్రస్తావించ బడినది. దయాదేవి యొక్క ఉత్కర్ష ప్రతిపాదింపబడుతూ తిరుమల యందు

నివాసమూ కోరబడింది. ఈ దశకమందు ఆళ్వారులు, మహనీయులు అవలంబించిన పద్ధతిని బట్టి, తిరుమలయందు జన్మించే ప్రార్థన చేయబడుతున్నది. వేంకటాద్రి యందు క్రమంగా సంచరించడానికి తగినట్లు మందాక్రాంతావృత్తమూ ఉపయుక్తమయినది.

దయాదేవిని ఆశ్రయించిన ముముక్షువుల ప్రభావాన్ని ఈ శ్లోకం శ్లాఘిస్తున్నది.

కమలవసతేః ఆజ్ఞాం ఖ్యాతిం ధనమనుచరా నాధిరాజ్యాదికంవా:- చతుర్ముఖ బ్రహ్మ శ్రీనివాసుని నాభి కమలమందు జన్మించాడు. "త్వన్నాభిజాతా దరవింద నేత్రాత్" తామరసాక్షుడవైన నీ పొక్కిలి యందు పుట్టిన బ్రహ్మ వల్ల - అనే శ్రీ శుక మహర్షి సూక్తిని బట్టి 'కమల వసతిః' అంటే బ్రహ్మ. ఆజ్ఞ అంటే మీర నలవికాని శాసనమని అర్థం. ప్రసిద్ధమైన కీర్తియే ఖ్యాతి. కనకవస్తు వాహనాది సంపదయే ధనమన్నమాట. రథగజతురగబలాదులే అనుచరులు. తన అధీనమందున్న సామంతరాజులూ, వారి రాజ్యాలూ మొదలైన సార్వభౌమత్వాన్నే 'ఆధిరాజ్యాదికం' అంటారు. ఇవన్నీ పుణ్యఫలాన్ని అనుభవిస్తున్న కాలమందు నిత్యం అభివృద్ధిని కలిగించే విధంగా ఉపయోగపడుతుంటాయి. సామాన్య నాయకుని వైభవమే ఇంత గొప్పగా ఉంటే, ఇక బ్రహ్మదేవుని యొక్క ఆజ్ఞాఖ్యాతిరిత్యాది వైభవం చెప్పనలవి కానిది కదా!

కాలేదృష్ట్వా కమల వసతే రప్యకించిత్కరాణి:- పుణ్యకాలం ముగిసినప్పుడు బ్రహ్మ యొక్క సకల సంపద్వైభవం కూడా చెడిపోయేదిగా కనబడుతుంది.

"శూరాశ్చబలవంతశ్చకృతా స్త్రాశ్చ రణాజిరే ।
కాలాభిపన్నాః సీదంతి యథా వాలూక సైతవః ॥"

కాలవిపర్యయాన్ని పొందినవారు, యుద్ధరంగంలో శస్త్రాస్త్ర విద్యల యందు ఆరితేరిన పరాక్రమవంతులైనప్పటికీ, ఇసుకతో కట్టబడిన ఆనకట్టలు, వంతెనల లాగా చెడిపోయి నిష్ప్రయోజకులవుతారన్నది శాస్త్రం.

ప్రజలు ఆజ్ఞను ఉల్లంఘిస్తారు. ఖ్యాతి నశిస్తుంది. ధనరాశులు చెడిపోతాయి. అనుచరులు క్షీణదశలో నున్న రాజును బంధిస్తారు లేదా చంపుతారు కూడా.

కమలవసతేరపి:- బ్రహ్మదేవునికైనా కాలమహిమ చేత అతని శాసన ఖ్యాతి సంపద్వైభవమంతా శాశ్వతంగా ఉండదు. ఇక ఇతరుల విషయంలో చెప్పేదేమీ ఉండదు కదా!

సారాభిజ్ఞాః :- చిరకాలం జాజ్వల్యంగా ఉన్న వైభవమంతా చివరకు అకించిత్కరమని - కొరగానిదైనదని - భగవానుని దయయే సారతమమని మొదటనే గ్రహించిన వైరాగ్య పురుషులని భావం.

అనన్యసాధ్యే పాలనే:- పుట్టించడం సామాన్యమైనా, పాలించడం మాత్రం అందరి చేత అయ్యే పనికాదు.

"నహిపాలన సామర్థ్యం ఋతే సర్వేశ్వరం హరిమ్" రక్షణ సామర్థ్యం శ్రీహరికి తప్ప వేరెవరికీ లేదన్న శాస్త్రమే ప్రమాణం.

"నసంపదాం సమాహారే విపదాం వినివర్తనే ।

సమర్థో దృశ్యతే కశ్చిత్తం వినా పురుషోత్తమమ్ ॥"

ఆపదలను తొలగించి, సంపదలను సమకూర్చే విషయంలో ఉత్తమ పురుషుడైన శ్రియః పతి గాక మరొక సమర్థుడే కనబడడు అని శ్లోకతాత్పర్యం. 'పాలన' శబ్దానికి శాశ్వతమైన ఆనందాన్ని పొందే విధంగా పాలించడమే - "మోక్ష మిచ్ఛేత్ జనార్దనాత్" అన్నట్లు, మోక్ష ప్రదానమే ముఖ్యార్థం.

పద్మాకాంతం ప్రణిహితవతీం పాలనేఽనన్యసాధ్యే:- ఇతరులకు అలవికాని మోక్ష ప్రదానమందు పద్మా పతియైన శ్రీనివాసుణ్ని నియోగించేది దయాదేవి. ప్రణిహిత వతి అంటే ప్రణిధాన యుక్తునిగా చేస్తుందని అర్థం. ప్రణిధాన మంటే తపస్సు. 'తప ఆలోచనే' సృష్టి చేయడానికి శ్రీనివాసుణ్ని ఆలోచింప జేస్తుందని భావం. తపించి విశ్వ సృష్టి జేశాడాయన -

"సతపోఽ తప్యత, సతపస్త ప్త్వా, ఇదం సర్వమసృజత" - అన్న ఉపనిషద్వాక్యాన్ని బట్టి తపశ్శబ్దానికి ప్రణిధానమని అభిప్రాయం. 'పాలన'కు సృష్టి ఉపలక్షణం. సృష్టి జేయడం భగవద్దయా కార్యమే కదా!"

సారాభిజ్ఞా జగతికృతినః సం(శ్రయంతే దయే! త్వామ్:- లోకంలో సారతమమైన శ్రీనివాసుని దయను (ప్రాపకంగానూ, (ప్రాప్యంగానూ భజించేవారు పరమైకాంతులు. వారే సమర్థులు - భాగ్యవంతులు. అజ్ఞాఖ్యాత్యాదులకు ని(ష్ప్రయోజనత్వమనే ధర్మైక్య వర్ణన చేత ఇది తుల్యయోగితాలంకారం.

'పద్మాకాంతం' అనే విశేష్యం పాలనకు ఉపయుక్తమైన పురుషకార సాన్నిధ్యమనే సాభి(ప్రాయ పదం కాబట్టి అలంకారం పరికరాంకురం. దయను శరణ్యత్వం చేత అధ్యవసించడాన్ని 'పద్మా కాంతం (ప్రణిహితవతీం పాలనేఽ నన్యసాధ్యే' అనే వాక్యం చేత సమర్థించడం వల్ల కావ్యలింగాలంకారం.

అంబురుహం॥ **భూధనధాన్య సమృద్ధియుగీర్తియు బూజ్యరాజ్య విభూతియున్**
వేధకునైన నొకప్పడు వమ్మయి వీడిపోవుట గాంచి శ్రీ
నాథుని జీవుల ముక్తికి నైజతనం బొనర్పగ జేయు నిన్
సాధులు సారవివేచనులై దయ! సంశ్రయింతురు నిచ్చలున్ ॥

42. ప్రాజాపత్య ప్రభృతి విభవం ప్రేక్ష్య పర్యాయ దుఃఖం
జన్మాకాంక్షన్ వృషగిరి వనే జగ్మషాం తస్థుషాంవా।
ఆశాసానాః కతిచన విభోః త్వ త్పరిష్వంగ ధన్యైః
అంగీకారం క్షణమపిదయే! హార్ద తుంగై రపాంగైః ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! కతిచన = కొందరు మహనీయులు; (ప్రాజాపత్య, (ప్రభృతి, విభవం = (బ్రహ్మ యొక్క ఐశ్వర్యం మొదలుకొని ఐశ్వర్యాలను అన్నిటినీ; పర్యాయ దుఃఖం = దుఃఖ సమానంగా, (ప్ర+ఈక్ష్య = గమనించి; త్వత్, పరిష్వంగ, ధన్యైః = నీ ఆలింగనం చేత ధన్యత నొందినట్టి; హార్దతుంగైః = (ప్రీతిచేత ఉత్కృష్టాలైనట్టి; విభోః = శ్రీనివాసుని యొక్క; అపాంగైః = కటాక్ష వీక్షణాల చేత; క్షణం, అపి = నాలుగు నిమిషాలైనను; అంగీకారం = స్వీకారాన్ని; ఆశాసానాః (సంతః) = అభిలషిస్తున్న వారై; వృషగిరివనే = వృషాచలమందలి వనమందు / జలమందు; జగ్మషాం = జంగమాల యొక్క గానీ, తస్థుషాం, వా = స్థావరాల యొక్క గానీ; జన్మ = పుట్టుకను; ఆకాంక్షన్ = కోరినారు.

తా: ఓ దయాదేవీ! కొందరు మహాత్ములు చతుర్ముఖ వైభవాది సకల వైభవాన్ని దుఃఖ ప్రాయంగా గుర్తించి నీ స్నేహ ప్రకాశం చేత ధన్యమైనవీ, అత్యంత ప్రీతికరాలైన శ్రీనివాస భగవానుని కటాక్ష వీక్షణాలు ఒక్క క్షణమైనా తమ మీద ప్రసరించాలని వేంకటాచల వనమందు జంగమాలుగా గానీ, స్థావరాలుగా గానీ జన్మించడానికి ప్రార్థించారు.

వ్యాఖ్య: శ్రీనివాసుని కృపా కటాక్షం తమపైన ప్రసరించడానికి తిరుమల యందు చరాచర భూతాలలో ఏదైన ఒక జన్మను సుకృతాత్ములు ప్రార్థించారని వర్ణితం.

పూర్వశ్లోకం దయావలంబులైన ముముక్షువుల ప్రభావాన్ని వర్ణించింది. ఈ శ్లోకం శ్రీనివాసుని దయ అలుముకొన్న కడగంటి చూపు ఒక్క క్షణ కాలమైనా పడుతుందని వృషగిరి వనమందు జంగమ స్థావర రూప జన్మను ప్రార్థించిన, మహనీయుల ప్రభావాన్ని కీర్తిస్తున్నది.

కతిచన:- మనస్సుకూ, మాటలకూ అందని మహిమ గల్గిన వారు కొందరే ఉంటారు. వారు ఋషులను, ఆళ్వారులను పోలిన మహనీయులు. ఇతరులకు "లవణ వణిజఃకర్పూరార్ఘం" అనే న్యాయం లాగా ఉప్పు అమ్ముకొనే బేరగానికి కర్పూరం వెల తెలియని రీతిగా భగవత్కటాక్ష ప్రభావం తెలియదు కదా! మోక్ష ఫలాన్నీ కోరక, భగవత్కటాక్ష లాభాన్ని అపేక్షించే వారు కొందరు.

ప్రాజాపత్య ప్రభృతి విభవం పర్యాయ దుఃఖమ్:- బ్రహ్మ పదవి మొదల్కొని సకల సంపదలు పేరుకు మాత్రం సుఖంగా అనిపిస్తాయి కాని వాస్తవంగా అవన్నీ దుఃఖంతో సమానమైనవే కదా! "సుఖ స్యానంతరం దుఃఖం,దుఃఖ స్యానంతరం సుఖమ్" సుఖం తర్వాత దుఃఖం, దుఃఖానంతరం సుఖమన్నట్లు, తుదకు దుఃఖాన్ని కలిగిస్తుంది ఐశ్వర్యం. నలుమొగాల వేల్పు వైభవమైతేనేమి? అది కూడా నశ్వరమయ్యేదే కదా!

"పతింవిశ్వస్య" అని శ్రుతి పలికినట్లు విశ్వపతి, ప్రజాపతి, పశుపతి అనే ముగ్గురు పతుల విభవాలలో విశ్వపతి యైన శ్రియఃపతికి మాత్రం సంబంధించిన

మోక్ష విభవం శాశ్వతమైనది. విశ్వపతిగా ఉన్న శ్రీనివాసుని విభవం విలక్షణం - వేరే (నశించనిది) అని చెప్పడానికే ప్రాజాపత్య ప్రభృతి విభవమనే పదం ప్రయోగింప బడినది.

ప్రేక్ష్య:- పరిశీలించి అని అర్థం. "పరీక్ష్యలోకాన్ కర్మచితాన్" (శ్రుతి) కర్మల నాచరించి పొందిన స్వర్గాది లోకాలన్నీ, పుణ్యం క్షీణించగానే మర్త్యలోకానికి తిరిగి రావలసినదే కాబట్టి, శాశ్వత సుఖాన్ని కలిగించేవికావు. "ఏతేవై నిరయాస్తాత! స్థానస్య పరమాత్మనః" గొప్ప ఐశ్వర్య స్థానాలన్నీ అశాశ్వతమైనవి. నరకతుల్య మైన విభవాలే అని కొందరు మహాత్ములు గుర్తించారు. కాబట్టి, వారు మోక్షాన్నీ కోరలేదు. మరి ఏమి కోరారు?

జన్మాకాంక్షన్ వృషగిరివనే:- తిరుమల యందలి అడవుల్లో లేదా నీళ్ళల్లో పుట్టాలనీ ప్రార్థించారు. 'వన' శబ్దానికి 'గహనం కాననం వనమ్' అని అడవి అనే అర్థమూ ఉంది. "జీవనం భువనం వనమ్" అని నీరు అనే అర్థమూ ఉంది. "తిరువేంగడమెన్నుమ్, ఎంబెరుమాన్ పొన్మలైమేల్ ఏదేను మావేనే" శ్రీ వేంకటాద్రి అనే నా స్వామి యొక్క స్పృహణీయమైన కొండ మీద ఏదైన ఒక వస్తువుగా ఉండాలని కోరినారు.

"హా జన్మతాను సికతాసు మయా నలబ్ధమ్" - ఆ సైకత ప్రదేశంలో ఒక ఇసుక రేణువుగా పుట్టకపోతిని, అయ్యో! అని శ్రీవత్సాం కమిశ్రులు (కూరత్తాళ్వాన్) విచారపడినారు. అది బృందావనం. కాని ఇది వృషాద్రివనం కదా!

త్వత్ పరిష్వంగ ధన్యైః హార్దతుంగైః విభోరపాంగైః క్షణమపి అంగీకారం ఆశాసానాః :-

శ్రీ వేంకటేశ్వర స్వామి తిరుమల యందు వనవిహారం కోసం సంచరిస్తున్నప్పుడు దయాదేవి యొక్క ఆలింగనం చేత ధన్యమై, ప్రేమ చేత ఉత్కృష్టమైన ఆ భగవానుని కడగంటి చూపు ఒక్క క్షణకాలమైనా తమపైన ప్రసరిస్తుందని ఆశించారు ఆ మహాత్ములు. భగవత్కటాక్షం దయాదేవి యొక్క సంశ్లేషం కలదని దేశికులు అందమైన భావాన్ని ప్రకటిస్తుంటారు.

"అనుకంపా సరి దంబుజై రపాంగైః" (గోపాల వింశతి - 11)

దయ అనే ఏటినీటిలో వికసిస్తున్న తామరపూల లాంటివి శ్రీకృష్ణుని కడగంటి చూపులు, అన్నారు. "దయా భరితై రపాంగైః" (దేహళీశ స్తుతి 26) దయా పూర్ణమైన కటాక్షమన్నారు. భగవానుని దృష్టి దయాదేవి చేత ప్రజలను అనుగ్రహించడం కోసం, హఠాత్తుగా, బిగువుగా కౌగిలింపబడుతుంది. (ధనం లబ్ధీ దృష్టిః ధన్యా)

"మహర్షీణాం సుఖావహం భర్తారం పరిషస్వజే" శత్రువులైన రాక్షసులను సంహరించి, మహర్షులకు సుఖాన్ని చేకూర్చిన శ్రీరాముణ్ని, సీతాదేవి గాఢంగా కౌగిలించుకొన్నది అన్నాడు వాల్మీకి. దయాలింగితయైన నాథుని దృష్టి దోషాన్ని చూడదు. భార్య తనంత తాను భర్తను గాఢంగా కౌగిలించుకోవడం చాలా అరుదు. ఎంతో ప్రీతికరమైనది కాబట్టి కటాక్షం ధన్యమైనదని చెప్పబడింది. హృదయంలో ఉండే దయ కటాక్షంలో ప్రసరిస్తుంది. కాబట్టి దయా సంశ్లేషచే ధన్యమైన శ్రీనివాసుని కటాక్షం ఒక్క క్షణకాలమైనా ప్రసరిస్తే చాలునని, దాని కోసం ఏండ్ల కొలది ఒక వస్తువుగా పడియుండాలని అభిలషించారు.

జగ్మషాం తస్థుషాంవా:- భుక్తి ముక్తులను కూడా తృణీకరించి, కొండ మీద స్థల, జల చరాలలో ఒక ప్రాణిగానో, జడవస్తువులలో ఒకటిగానో జన్మింప వేడుకోవడం మాటలకందని ప్రభావమది. కాని, సత్యదూరమైన విషయం మాత్రం కాదు.

"పత్యుః ప్రజానామైశ్వర్యం పశూనాంవా నకామయే ।

అహంకదంబో భూయాసం కుందో వా యమునా తటే ॥"

చతుర్ముఖ బ్రహ్మ పదవినో పశుపతియైన రుద్రుని పదవినో నేను కోరడం లేదు. కేవలం విశ్వపతియైన శ్రీకృష్ణ పరమాత్మ విహరించే యమునా తరంగిణీ తటమందు కదంబ వృక్షంగానో, కుంద వృక్షంగానో జన్మిస్తాను. తత్ఫలితంగా గోపాలకృష్ణుని దివ్యకటాక్షమూ, ఆయన పాదస్పర్శమూ లభిస్తుందని ఋషులు కూడా భావించారు.

శ్రీ కులశేఖరాళ్వార్లు 'పెరుమాళ్ తిరుమొషి' అనే దివ్య ప్రబంధంలో "ఊనేరు శెల్వమ్" అనే నాల్గవ దశకమందు "వేంగడత్తు కోనేరి వాషుమ్ కురుకాయ్ ప్పిఅప్పేనే" వేంకటాచలం మీద మనుష్యునిగా జన్మింప గోరను. కోన్+ఏరి = స్వామి పుష్కరిణిలో జీవించే కొంగగా పుడుతానన్నారు.

"తేనార్ పూంజోలైత్తిరువేంగడచ్చు నైయిల్
మీ నాయ్ ప్పిఅక్కుమ్ విది యుడైయే నావేనే ॥"

స్వర్గాధిపత్యమూ నాకు అక్కర్లేదు. తేనె స్రవించే పూలతోటలున్న తిరుమల సెలయేరులలో ఒక చేపగా పుట్టినా చాలునన్నారు.

వేసవికాలాన కొండవాగుల నీరు ఇంకి పోతుంది కదా! కాబట్టి, జంగమ జన్మకంటె స్థావరంగానైనా జన్మిస్తానన్నారు.

వేంగడత్తు శెణ్బగ మాయ్ నిఱ్కుమ్" – వేంకటాద్రి యందు శ్రీనివాసునికి ప్రియమైన పుష్పార్చనకు ఉపయోగపడే సంపెంగ చెట్టుగా నిలిచే భాగ్యాన్ని పొందుతా నన్నారు. చెట్టును ఎప్పుడైనా కొట్టివేస్తారేమో అని భావించి, "కాన+ఆఱు+ఆయ్ పాయుమ్" అడవిలో సెలయేరుగా ప్రవహిస్తానన్నారు. వెంటనే, సెలయేరు ఎండిపోతుంది. కాబట్టి "నెఱియాయ్ కిడక్కుమ్" భక్తులు నడిచే దారిగా ఉంటానన్నారు.

వారివారి సౌకర్యం కోసం దారులు మార్చుకోవడముంటుంది. కాబట్టి ఓ శ్రీనివాసా! "పడియామ్ క్కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే" నీ దివ్య సన్నిధిలో కడపగా ఉండి పగడాన్ని పోలిన నీ అధరాన్ని నిరంతరం సేవించే భాగ్యం కలవాడను కావాలని ప్రార్థించారు.

ఈ పాశురం వల్లనే తిరుమలలో స్వామి గర్భాలయంలోని కడపకు 'కులశేఖర ప్పడి' అనే పేరు వచ్చింది.

"యశ్చరామం న పశ్యేత్తు యంచ రామో న పశ్యతి ।
నిందిత స్స వసే ల్లోకే స్వాత్మా ప్యేనం విగర్హతే ॥"

రాముడెవ్వణ్ని చూడలేదో, ఎవడు రాముణ్ని చూడలేదో వాడు భాగ్యహీనుడని లోకం నిందించడమే కాక తనను తానే నిందించుకొనే వాడని వాల్మీకి విశదపరచాడు.

భగవత్కృపా కటాక్ష వీక్షణం సర్వశ్రేయోదాయకమని దయాదేవి స్తుతింప బడింది. తిర్యక్ స్థావర యోనులందు జన్మింప ప్రార్థించడం దోషయుక్తమైనా, శ్రియః పతి కృపాకటాక్ష లాభమనే గుణ విశేషం ఉన్నందు వల్ల అనుజ్ఞాలంకారం.

అంబురుహం॥ **అంబుజగర్భముఖా మరసం పద లంత్యదుఃఖకరంబు లౌ**
టం బరికించి మహాత్ములు కొందతెడన్ వృషాద్రి వనంబులో
నంబ! చరాచర భూతములందొకటై జనింప దలంత్రు, ని
త్యంబు భవద్వశ మాధవ దివ్యకటాక్ష వీక్షణ కాంక్షులై ॥

43. నాభీ పద్మ స్ఫురణ సుభగా నవ్యనీలోత్పలాభా
క్రీడాశైలం కమపి కరుణే! వృణ్వతీ వేంకటా ఖ్యమ్।
శీతానిత్యం ప్రసద నవతీ శ్రద్ధ ధానావగాహ్యా
దివ్యాకాచిత్ జయతి మహతీ దీర్ఘికా తావకీనా ॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! నాభీపద్మ స్ఫురణ సుభగా = పొక్కిలి యందలి కమలం యొక్క వికాసం చేత రమణీయమైన; నవ్యనీల + ఉత్పల + ఆభా = కొత్త నల్ల కలువల యొక్క కాంతి లాంటి కాంతి కలిగిన; నిత్యం = ఎల్లప్పుడు; శీతా = చల్లనైనట్టి; ప్రసదనవతీ = తేటగా ఉన్నట్టి, / అనుగ్రహం కలిగినట్టి; శ్రద్ధధాన+అవగాహ్యా = విశ్వాసవంతులకు మునుగదగిన; దివ్యా = మిక్కిలి ఉత్కృష్టమైనట్టి; మహతీ = చాలా పెద్దదైన; తావకీనా = నీదైన; కాచిత్ = విలక్షణమైన ఒక; దీర్ఘికా = నడబావి; కం+అపి = విలక్షణ ప్రభావంతో కూడిన; వేంకటాఖ్యం = వేంకటమనే ప్రసిద్ధిగాంచిన; క్రీడాశైలం = క్రీడాపర్వతాన్ని; వృణ్వతీ (సతీ) = వరించినదై / ఆశ్రయించినదై; జయతి = సర్వోత్కృష్టంగా ప్రకాశిస్తున్నది.

తా: ఓ దయాదేవీ! వికసించిన కమలం నాభియందు అలంకారంగా ఉన్న, సద్యో వికసిత నీలోత్పలాలచే మిక్కిలి శోభిస్తున్న, శీతలమై ఎల్లప్పుడు స్వచ్ఛమైన, విశ్వాసశాలురకు అవగాహింపదగిన, దివ్యమై పరమాకాశ మందు ఉండునట్టి,

పెద్దదైన ఒక నడబావి, విలక్షణమైన వేంకటాద్రి యనే క్రీడా పర్వతాన్ని ఆశ్రయించి ఉత్కృష్టంగా ప్రకాశిస్తున్నది.

వ్యాఖ్య: శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహం ఒక పెద్ద నడబావిగా అధ్యవసింప బడిన శ్లోకమిది.

గత శ్లోకమందు మహనీయులు తిరుమలయందు చర, స్థిర పదార్థాలలో ఏదో ఒకజన్మను ప్రార్థించారని వర్ణితం. ఈ శ్లోకమందు తిరుమలలో జన్మించిన-వారికి భగవత్కటాక్షం చేత సత్త్వ గుణము ఉద్బుద్ధమై వర్ధిల్లుతూ, ఆదివ్య మంగళ విగ్రహాన్ని దర్శించే భాగ్యం కలుగుతుందని వర్ణింప బడుతున్నది.

నాభీపద్మస్ఫురణ సుభగా:– చతుర్ముఖ బ్రహ్మకు పుట్టిల్లు పద్మం. ఆ పద్మకాంతిచే రమణీయమైనది సరస్సు. శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహం యొక్క కాంతి మధ్యన, అతి మనోహరమైనది పొక్కిలి తామర. వేరే సరస్సులందు ఉండేతామర పూలకు చతుర్ముఖ బ్రహ్మ జనకత్వం లేదు. శ్రీనివాసుని సుందర విగ్రహమనే నడబావి నలువ పుట్టడానికి హేతువైన నాభీ పద్మ శోభ చేత రమ్యమైనది.

నవ్యనీలోత్పలాభా:– అప్పుడే వికసించిన నల్ల కలువల కాంతి వంటి కాంతి కలది శ్రీహరి సరస్సు. ఫుల్లేందీవర కాంతి గల శ్రీనివాసుని సుందర శరీర శోభ అపూర్వమైనది. నీలవర్ణ సలిల పూర్ణమైనది శ్రీనివాసుడనే నడబావి. అది ఒక మోక్షగుండం.

శీతానిత్యం ప్రసదనవతీ:– 'నిత్య' మనే పదం నడుమ ఉండడం వల్ల రెండింటికి అన్వయిస్తుంది. అగాధమైనందు వల్ల వేడిమి ఇంచుకంతయైన లేకుండా దీర్ఘిక, ఎల్లప్పుడు చల్లగా ఉంటుంది. శ్రీనివాసుని నీలమేఘశ్యామ వర్ణం గల శరీర కాంతి నిత్యం చాలా సౌమ్యంగా ఉంటుందని భావం. 'మతుప్' ప్రత్యయం, ఉదారాతిశయాన్ని తెల్పుతుంది. ఇతర ప్రవాహాలు కలుషిత జలంతో నిండి ఉంటాయి. శ్రీనివాసుని నీలవర్ణ శరీర కాంతి ప్రవాహం ఎల్లప్పుడు ప్రసన్నంగా తేటగా ఉంటుంది. కళంకరహితమైన, సజల జలదశ్యాముని విగ్రహం యొక్క ఉజ్జ్వల కాంతి నిత్యం అనుగ్రహైక శీలమై ఉంటుంది.

శ్రద్ధధానావగాహ్యా:- వేదమందూ, వేదప్రతిపాద్యుడైన భగవానుని యందు విశ్వాసం కలవారు శ్రద్ధ ధానులు - శ్రద్ధాళువులు.

"శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽ తీవమే ప్రియాః" అన్నట్లు శ్రద్ధాళువులు పరమభక్తులు, భగవంతునికి చాలా ప్రియమైనవారు కదా! "హరి సరసివిగాహ్యాపీయ తేజోజలౌఘమ్" (ముకుందమాల) అన్నట్లు, పరమభక్తులు నడభావిలో నిర్భయంగా దిగి స్నాన పానాదులను ఆచరించి తాపత్రయాన్ని శమింప జేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

శ్రద్ధాళువులైన సాధువులు ప్రాప్యం - పొందదగినది, పరబ్రహ్మ వర్చస్సే అని స్వీకరించడానికి సముచితంగా ఉంటుంది.

క్రీడాశైలం కమపి కరుణే! వృణ్వతీ వేంకటాఖ్యమ్:- దయాదేవికి క్రీడా పర్వతంగా తిరుమల వర్ణింపబడింది. ఎవరిచేత? శ్రీనివాసుడనే దీర్ఘిక చేత అని సమాధానం. తిరుమలకు వేంకటాచలమని ప్రసిద్ధి.

కమపి:- 'వేంకట' శబ్దానికి విలక్షణమైన అర్థాలు ఉన్నాయి.

"సర్వ పాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే" (భవిష్యోత్తర పురాణం) 'వేం' అంటే పాపరాశి. 'కటః' అంటే దాహకత్వం. సర్వపాపాలను దహించేది 'వేంకట' అనే పర్వతం.

"వేం కారోఽ మృతబీజంతు కటమైశ్వర్య ముచ్యతే" (వరాహ పురాణం)

'వేం' అంటే అమృత బీజం. 'కటం' అంటే ఐశ్వర్య బీజం. అమృతైశ్వర్యాలను ప్రసాదించేది వేంకటశైలం. బుభుక్షువులు వేంకటాచలాన్ని ఆశ్రయిస్తే వారికి ఐశ్వర్యాన్ని, ముముక్షువులకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అకించనులై, అనన్య గతికులైన ప్రపన్నులకు అమృతమనే ఐశ్వర్యాన్ని మోక్ష సామ్రాజ్యాన్ని అనుగ్రహిస్తుందని భావం.

ఆశ్రితుల పాపాలన్నిటినీ నశింపజేసే తన వల్లభయైన దయాదేవికి తన దివ్య తేజఃపుంజమైన విగ్రహాన్ని దీర్ఘికగానూ, తాను చేరియున్న వేంకటశైలాన్నీ క్రీడో

పకరణంగానూ ప్రకాశింపజేసినాడని సారాంశం. ఆశ్రితుల సర్వపాపాలను ధ్వంసం చేయడమే దయాదేవి యొక్క క్రీడ కదా! అట్టి క్రీడా శైలాన్ని ఆశ్రయించింది దయాదేవిదే అయిన దీర్ఘిక.

కాబట్టి 'తావకీనా' నీవే, అనే పదం ప్రయుక్తమైనది. భగవద్విగ్రహం దయితా క్రీడోపకరణమైన దీర్ఘికగా అయినందువల్ల ఆ పెద్ద దీర్ఘికయ ందు ఒక చోట దయితా క్రీడాశైలమైన వేంకటగిరిని తేలియాడునట్లు ప్రకాశపరచిందనే ఒక వైచిత్రిని దేశికులు నిరూపించారని కొందరు వ్యాఖ్యానించారు.

భావనాబలమేదైనా ఆ వేంకటనాథునికే తెలుస్తుంది.

క్రీడా పర్వతమందే పుష్పారామం, సరస్సు రమణీయంగా చిత్రించడం కళాప్రపూర్ణులకు చెల్లుతుంది. సరస్సులో క్రీడాశైలాన్ని తేలియాడునట్లు చిత్రించడం విచిత్రమైన అనుభవమే.

దివ్యాకా చిజ్జయతి మహతీ దీర్ఘికా తావకీనా:- దివి, భవా = దివ్యా. పరమా కాశమందు ప్రభవించేది, ప్రకాశించేది అని అర్థం. ఇక్కడ అర్చామూర్తినీ 'దివ్యా' అనడం వల్ల పొక్కిలి పసిబిడ్డనికి తండ్రి యైన ఆ పద్మనాభునికీ, పద్మావతికి పతియైన ఈ వేంకటేశ్వరునికీ భేదమే లేదని భాషింపబడింది. కాబట్టి 'కాచిన్మహతీ' అని వివరింపబడింది. దయాదేవికి క్రీడోపకరణమైన భగవద్విగ్రహ నీలోజ్జ్వల కాంతి విలక్షణమైన బృహ ద్దీర్ఘికగా నిరూపింపబడింది.

జయతి మహతీ 'దీర్ఘికా తావకీనా:- మూడు పాదాలలోని విశేషణాలన్నీ త్రిపాద్విభూతి నాయకునికి వర్తించేవి కాగా, ఈ నాల్గవదైన, ఏకపాదంలోని విశేషణ పదాలు లీలా విభూతి నాయకునికి వర్తిస్తున్నాయనవచ్చును. శ్రియః పతి యొక్క దివ్యకాంతి త్రిపాద్విభూతిలోనే ఆగకుండా లీలావిభూతిలోనూ ప్రసరిస్తున్నదని సారాంశం.

దివ్య, మహచ్ఛబ్దాలచే వాచ్యయైన దీర్ఘిక దయాదేవిదే అయినందువల్ల 'జయతి' అనే క్రియా పదమూ దయాదేవికే వర్తిస్తుంది. దయాదేవియే సర్వోత్కృష్టంగా ప్రకాశిస్తుందని స్తుతింపబడింది.

తిరుమల ప్రభావమూ, తిరుమలేశుని మూర్తి ప్రభావమూ అసదృశమని, అమోఘమని వర్ణిస్తూ, ఈ రెండింటి ప్రభావం దయాదేవి యొక్క విలాస, విన్యాస విహారాలకు (ఆంతరంగిక) సాధనమని సుశ్లోకితం.

అంబురుహం॥ నీవు విహారముగోరి వృషాద్రిని నెమ్మిజేరగ నాభి రా
జీవ రుచిన్ బెడగై యనుకంప! విశిష్ట నీల నవోత్పల
శ్రీవహియించి దృఢాశయ సజ్జన సేవ్యయై తన రారు శీ
తావహ దివ్య రసోత్కట వాపి త్వదర్థమై యట బొల్చెడున్ ॥

44. యస్మిన్ దృష్టే తదితర సుఖైర్గమ్యతే గోష్పదత్వం
సత్యం జ్ఞానం త్రిభిరవధిభిర్ముక్త మానంద సింధుమ్ ।
త్వత్ స్వీకారా త్తమిహ కృతినః సూరిబృందాను భావ్యం
నిత్యాపూర్వం నిధిమివదయే! నిర్విశం త్యంజనాద్రౌ ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! యస్మిన్ = ఏ పరమాత్మ స్వరూపం; దృష్టే (సతి) = చూబడినప్పుడు; తత్ + ఇతర సుఖైః = దానికంటె వేరైన సుఖాల చేత; గోష్పదత్వం = ఆవు అడుగుపెట్టిన స్థలమంత; గమ్యతే = పొందబడుతున్నదో; సత్యం = ఎల్లప్పుడు ఏకరూపంగా ఉన్నట్టి; జ్ఞానం = స్వయం ప్రకాశమైనట్టి; త్రిభిః = మూడు విధాలైన, అవధిభిః = పరిచ్ఛేదాల చేత; ముక్తం=రహితమైనట్టి; ఆనందసింధుం = ఆనంద సముద్రమైనట్టి; సూరిబృంద+అనుభావ్యం = నిత్య సూరుల సమూహం చేత అనుభవింపదగినట్టి; నిత్య+అపూర్వం = ఎల్లప్పుడు అపూర్వంగా ఉన్నట్టి; తం = ఆదివ్యాత్మ స్వరూపాన్ని; త్వత్ స్వీకారాత్ = నీయొక్క అంగీకారం వల్ల; ఇహ = ఈ ప్రకృతి మండలమందు; కృతినః = ధన్యాత్ములు; నిధిం, ఇవ = నిధిని వలె; అంజన+అద్రౌ = అంజనాచలమనే తిరుమల యందు; నిర్విశంతి = అనుభవిస్తున్నారు.

తా: ఓ దయాదేవీ! ఏ పరమాత్ముని స్వరూపం సాక్షాత్కారం కాగా అనుభవింపబడే బ్రహ్మానంద సముద్రం ముందు దానికంటె ఇతర ప్రాపంచిక సుఖాలన్ని గోష్పాదమంత కనబడడం నైసర్గికమో, అట్టి సత్య జ్ఞానానంత లక్షణాలు కలిగి, దేశకాల వస్తు పరిచ్ఛేద రహితమై, నిత్యసూరిబృందం చేత అనుభవింప

దగినదై, సతతం ఆశ్చర్యావహమైన ఆ పరమాత్మ స్వరూపాన్ని నీవు స్వీకరించడం వల్ల ఈ లోకమందే కొందఱు పుణ్యాత్ములు అంజనాద్రి యందు నిధిని కనుగొన్నట్లు ఆనందాన్ని అనుభవిస్తున్నారు.

వ్యాఖ్య: దయాదేవి పరిగ్రహించడం వల్ల ఆశ్రితులు అంజనాద్రియందే పరమాత్మ స్వరూపాన్ని ఆనందంగా అనుభవిస్తున్నారని సుశ్లోకితం.

ఇంతకు ముందున్న శ్లోకం శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించింది. ఈ శ్లోకం శ్రీనివాసుని దివ్యాత్మ స్వరూపాన్ని వర్ణిస్తున్నది.

యస్మిన్ దృష్టే:- భగవానుని దివ్యాత్మస్వరూప ప్రభావాన్ని ముండకోపనిషత్తు ప్రతిపాదించిన విధానం ఇలా ఉంది.

"భిద్యతే హృదయగ్రంధిః, ఛిద్యంతే సర్వసంశయాః ।

క్షీయంతే చాస్యకర్మాణి, తస్మిన్ దృష్టే పరావరే ॥ (4 ఖం. 10 మంత్రం)

సర్వోత్కృష్టమైన పరమాత్మ సాక్షాత్కరింప బడగా ఉపాసకుని హృదయమందలి రాగద్వేషాదులనబడే గ్రంధి (బలిసిన గడ్డ) పగిలిపోతుంది. సంశయాలన్నీ తొలగిపోతాయి. ప్రారబ్ధానికి వ్యతిరేకమైన కర్మలన్నీ ఫలించకుండా నశిస్తాయి; అని ఈ మంత్రార్థం.

ఈ మంత్రంలో "తస్మిన్ దృష్టే పరావరే" అని ఉంటే, దేశికులు "యస్మిన్ దృష్టే" అని ఈ శ్లోకంలో ఉపయోగించుకొన్నారు.

పరులంటే చతుర్ముఖాది దేవతలు అధికులనబడేవారు. అవరులంటే తక్కువ వారు. పరే అవరే యస్మాత్ సః = పరావరః (ఇది విగ్రహ వాక్యం)

విశ్వంలో గొప్పవారుగా భావింపబడే బ్రహ్మాది దేవతలు ఎవరికన్న తక్కువ వారో అట్టి పరమాత్మ 'పరావరు' డనబడుతాడు.

యోగులు (ఉపాసకులు) ఒకటి రెండు సారులే ధ్యానం చేయక, తైలధార లాగా ఎడతెగకుండా ధ్యానంచేస్తారు. ఎంత వరకు చేస్తారు? అంటే "సఖలు ఏవం

వర్తయన్ యావదాయుషం" అనే శ్రుతివాక్యం. జీవించి నంతకాలం దాకా ధ్యానం సాగిస్తూ ఉండాలని చెబుతుంది. ఇలా "విచ్ఛేదం లేకుండా సాగే దర్శన సమానాకారధ్యాన మందు పరమాత్మ గోచరీకరింపబడినప్పుడు' అని 'యస్మిన్ దృష్టే' అనే మాటకు అర్థం.

తదితర సుఖైర్గమ్యతే గోష్పదత్వం:- అప్పుడు పరమాత్మ యొక్క ఆనంద స్వరూపం సముద్రంలాగా కనబడుతుంది. ప్రపంచంలోని సుఖాలన్నిటినీ దానితో పోల్చిచూస్తే గోష్పాదమంత కనబడడం అనుభవైక వేద్యం.

'గోష్పదీకృత వారాశిం' అని హనుమంతుణ్ని స్తుతిస్తుంటాం కదా! ఆయన, అగాధమైన జలమున్న విశాలమైన సముద్రాన్ని ఆవు అడుగుపెట్టిన నేల మీద ఏర్పడిన నీటికుంటను దాటినట్లే దాటినాడని అర్థం. నిరతిశయానంద స్వరూపానుభవం సముద్ర జలమంతటిది కాగా, బ్రహ్మాండంలో చీమ మొదల్కొని సత్యసీమాధిపతియైన బ్రహ్మదేవుని ఐశ్వర్యం వరకున్న సకల సుఖానుభవం గోవు యొక్క పాద న్యాస స్థలమందునిలిచిన నీరంతటిదే అని పరమాత్మ యొక్క దివ్య స్వరూపాన్ని దర్శించిన సుకృతాత్ములు భావిస్తారు. దివ్యాత్మ స్వరూపాన్ని దర్శించి బ్రహ్మానందం పొందిన వ్యక్తికి సాంసారిక సుఖరాశి తృణప్రాయంగా ఉంటుంది.

సత్యం జ్ఞానం త్రిభిరవధిభిర్ముక్త మానందసింధుమ్:- పరబ్రహ్మ లక్షణాలను తైత్తిరీయోపనిషత్తు వివరిస్తుంది. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" (ఆనందవల్లి) 'సత్య' మంటే స్వరూపంగానీ, స్వభావంగానీ వికారం చెందకుండ ఒకే విధంగా ఉండే లక్షణం కలది పరబ్రహ్మ. 'జ్ఞానం' అంటే ఇతరమైన ఏ వస్తువు యొక్క సహాయాన్ని ఆపేక్షించక, ఎప్పుడు గానీ ఏ మాత్రం సంకుచింపబడక, నిత్యం తనంత తానే ప్రకాశించే లక్షణం కలది పరబ్రహ్మ. 'అనంతం' అంటే అంతం లేనిది. "బృహత్వంచ స్వరూపేణ గుణైశ్చ" - స్వరూపం చేతనూ, గుణాల చేతనూ చాలా గొప్పది అని బ్రహ్మ శబ్దానికి అర్థం సిద్ధిస్తున్నది. "నాంతం గుణానాం గచ్ఛంతి తేనా నంతోఽ యమ ముచ్యతే" అనే స్మృతి వల్ల గుణానంత్యం 'అనంత' శబ్దార్థం. అనంత శబ్దానికి రూఢిగా దేవతా విశేషమే నిర్ణయింపబడింది.

'త్రిభిరవధి భిర్ముక్తం' అనే మాట 'అనంత' అనే పదాన్నే వివరిస్తున్నది. అంటే, త్రివిధ పరిచ్ఛేద రాహిత్యాన్ని ప్రకటిస్తున్నది.

(1) దేశ పరిచ్ఛేదం లేనిది – అంటే ఇక్కడనే ఉంటాడు' అనే నియమం లేకుండా ఎక్కడనైనా (అంతటా) ఉండే లక్షణం కలవాడు పరబ్రహ్మ.

(2) కాలపరిచ్ఛేదం లేనిది: అంటే, ఇప్పుడే ఉంటాడు అనరాకుండా ఏకాల మందైనా ఉండే లక్షణం కలవాడు పరబ్రహ్మ.

(3) వస్తు పరిచ్ఛేదం లేనిది – 'ఈ విధంగా ఉంటాడని' చెప్పరాకుండా ఏ వస్తువు గానైనా ఉండే లక్షణం కలవాడు పరబ్రహ్మ.

సర్వదేశ, సర్వకాలాలలో సర్వ వస్తువులయందు అంతర్యామిగా ఉండే స్వరూప లక్షణం పరబ్రహ్మకే ఉంది. ఇది పరబ్రహ్మ లక్షణ వాక్యార్థం.

ఆనందసింధుం :– పరమాత్మ ఆనంద సముద్రుడు. సకలారోగ్యైశ్వర్యాదులతో కూడిన సార్వభౌముడైన ఒక మనిషి యొక్క ఆనందం కంటే కోటిరెట్లు ఆనందంగల చతుర్ముఖ ప్రజాపతి కన్ననూ వందరెట్లు ఆనందాధిక్యం కలవాడు పరబ్రహ్మ. "తేయేశతం ప్రజాపతేరానందాః, స ఏకోఽబ్రహ్మణ ఆనందః" అని ఉపనిషత్తు ప్రతిపాదించింది. స్వాభావిక నిరతిశయానందం, విపశ్చిత్త్వం, సర్వభయాభయ హేతుత్వం, మొదలైన గుణాలు పరమాత్మకు అసాధారణాలు. కాబట్టి ఆనందమయుడు పరమాత్మ. ఈ విషయం బ్రహ్మ విద్యలలో 'ఆనందమయ విద్య' గా ఉపాసింపబడుతున్నది.

గత శ్లోకంలో దివ్యమంగళ విగ్రహం ఒక దీర్ఘికగా వర్ణింపబడితే, ఈ శ్లోకంలో పరమాత్మ స్వరూపం ఆనంద సముద్రమని వర్ణితమయింది. శుభాశ్రయమైన విగ్రహాన్ని అనుభవించడం ద్వారా స్వరూపాను భవలాభం ప్రదర్శింపబడుతున్నది.

ఈ శ్లోకంలోని పూర్వార్థం పరమాత్మ స్వరూపలక్షణాలను వివరించిన తర్వాత ఉత్తరార్థం ఆదివ్యాత్మ స్వరూపం ఈ లోకంలో సుకృతాత్ములైన కొందఱికి దయాదేవి

స్వీకారం వల్ల నూతన రుచులచే మించినదై ఎంత అనుభవింపదగియున్నదో విశద పరుస్తున్నది.

త్వత్స్వీకారాత్ తమిహకృతినః సూరిబృందానుభావ్యమ్:- "సదా పశ్యంతి సూరయః" పరమపదమందు నిత్యసూరులు, ముక్తాత్మలు అనవరతం పరమాత్మ స్వరూపాన్ని సేవిస్తుంటారు, అని శ్రుతి బోధిస్తున్నది. "బృందం బృంద షయోధ్యాయామ్" (రామాయణం) అన్నట్లు భగవానుని కల్యాణ గుణాలను సామూహికంగా కీర్తిస్తే అధికానందం కలుగుతుంది. "తద్విప్రాసో విపన్యవః జాగృవాంసః సమింధతే" వైకుంఠంలో నిత్య ముక్త పురుషులు దివ్యాత్మ స్వరూప రూపగుణ వైభవ శీలాదులను జాగరూకులై స్తుతిస్తూ తేజోమూర్తులై భాసిస్తుంటారు. నిత్య విభూతిలో సూరిబృందం చేత నిత్యం సేవింపదగిన పరమాత్మ స్వరూపాన్ని ఈ ప్రకృతిమండలమందే దయాదేవి అనుగ్రహానికి పాత్రులైన ధన్యాత్ములు అనుభవిస్తూ ఆనందిస్తున్నారు.

దయాదేవి యొక్క 'స్వీకారం' అంటే ఆశ్రితులను అనుగ్రహించి, స్వజనంగా చేసుకొన్నందువల్ల, పరమాత్మ స్వరూపాన్ని భూమండలమందే సేవించే సమర్థులయ్యా రని భావం.

ఈ స్వీకారం పరమాత్మకూ ఇష్టమైనందువల్ల దయాదేవి వైకుంఠంలో సూరి బృందం చేత అనుభవింపదగిన పరమాత్మను మర్త్యలోకాన అవతరింపజేసి తన ఆశ్రితులచే అనుభవింపజేస్తున్నదని కూడా స్పష్టమవుతున్నది.

నిత్యాపూర్వం: పరమాత్మ స్వరూపం నిత్య విభూతిలోగానీ, ఈ లీలా విభూతిలో గానీ, నిత్యం ఆశ్చర్యావహంగా గోచరిస్తుంది. అది సనాతన స్వరూపమే. అయినా "భవతి నవో నవోఽ యమక్ష్ణోః"-"క్షణే క్షణేయన్నవతా ముపైతి" - అన్నట్లు నిత్య నూతనంగా కనబడుతుంది. అపూర్వం అంటే ఇంతకుముందు లేనిది. ఎంత కాలం సేవించినా, అపూర్వంగానే దృష్టిగోచరమవుతుంది. కాబట్టి "సదాతనత్వేఽ పి తదాతనత్వ వత్" (వరదరాజస్తవం 100) అని శ్రీ కూరేశులు స్తుతించారు.

"అప్పొషుదైక్కప్పొషు దెన్నారావముదమే" (తి.వా.మొ. 2-5-4) నేనెంత కాల మనుభవించినా, ప్రతిక్షణం తన యనుభవమందు ఆశను రేకెత్తిస్తూ, తృప్తిలేని

అమృతం లాగా భోగ్యభూతమైనది ఆ పరమాత్మ స్వరూపం; అన్నారు శ్రీ శఠకోప దివ్యసూరులు.

ఇహ నిధిమివ దయే! నిర్విశంత్యంజనాద్రౌ:- దయాదేవి స్వీకారంవల్ల సుకృతాత్ములు పరమవ్యోమమందు ఉండే శ్రీనివాస పరమాత్మను ఈ పృథివిలోనే అంజనాచలమందు నిధిని వలె అనుభవిస్తున్నారు.

"అమృత ఇహభవతి" అన్నట్లు, దివ్యలోక విశేషవర్తియైన భగవంతుని ఆత్మ స్వరూపం ఈ జగత్తునందు సర్వవ్యాప్తమై యున్నది. అమృత శబ్ద వాచ్యమైన మహానంద రూపమది. మృతం కానిది అమృతం. సంసార సంబంధం లేనిది అమృతం. 'ముక్తిర్మోక్షో మహానందః' అని నిఘంటు ప్రకారం ఆనందప్రదమైన (మోక్ష) రూపం అమృత మనబడున్నది. ఆ స్వరూఫం "వైత్త మానిదియామ్" (తి.వామొ. 6-7-11) స్థాపించిన మహానిధిగా నున్నదని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి. ఆ శ్లాఘ్య నిధి దివియందే కాక భువిలో కూడా, ప్రతిప్రాణి హృదయమందే ఉన్నది. "నిహితం గుహాయాం" అని శ్రుతి పలికినట్లు, సమీప వర్తియే కాని దూరస్థం కాదు. నిగూఢంగా స్థాపింపబడిన నిధి; నిహిత మనబడింది.

"హిరణ్యనిధిం నిహితం క్షేత్ర జ్ఞాః ఉపర్యుపరిసంచరంతో నవిందేయుః" (ఛాం. ఉప) దహరాకాశమందు (హృదయమందు) ఉన్న పరమాత్మను 'హిరణ్యనిధి' గా వర్ణించింది ఉపనిషత్తు. హిరణ్య నిధిని దాచిన స్థలం మీదనే తరచుగా సంచరిస్తున్నా జీవులు దాన్ని తెలుసుకోలేకపోతున్నారు, పొందలేక పోతున్నారని కూడా స్పష్టపరిచింది.

బ్రహ్మ విద్యలలో ఈ విషయాన్ని 'దహరవిద్య'గా 'అన్వేష్టవ్యమ్' వెదుక దగినది అని ఉపాసిస్తున్నారు. దాచబడిన ద్రవ్యనిధిని కనుగొనడానికి కంటికి అంజనం (కాటుక) పెట్టుకోవలసి యుంటుంది. కాని, అది కాటుకకొండ - అంజనాద్రియే కాబట్టి, కాటుక అవసరంలేదని ధ్వనిస్తున్నది. శ్రీ వేంకటేశ్వర స్వామి యొక్క అర్చా రూపమే అంజనంగా ఆయన ఆత్మ స్వరూప దర్శనానికి తోడ్పడుతుంది.

నిత్యం కరీశ! తిమిరావిల దృష్టయోఽపి
సిద్ధాంజనేన భవతైవ విభూషితాక్షాః ।

పశ్యంత్య పర్య పరి సంచర తామదృశ్యం
మాయా నిగూఢ మనపాయ మహానిధిం త్వామ్ ॥ (వ.రా.పంచాశత్ 28)

అని దేశికులు అన్నట్లు, అర్చామూర్తిగా నున్న శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాన్ని సేవిస్తూ ఉన్న వారి కన్నులకు ఆ రూపమే కాటుక (అంజనం) గానై ప్రకృతి సంబంధం చేత కనుమఱుగైయున్నఅంతర్యామిని, దాని మీదనే నడిచినా తెలుసుకోలేరని శ్రుతులు చెప్పిన మహానిధియైన భగవద్దివ్యాత్మ స్వరూపాన్ని కనుగొడానికి సహాయపడుతుంది కదా!

"ఎమ్మావీట్టు త్తిఅముమ్ శెప్పమ్, నిన్ శెమ్మాపాదపఱ్పుత్తలై శేర్ తొల్లై" (తి.వామొ. 2.9.1)

ఓ స్వామీ! అందమైన నీ పాదపద్మాలను నా తలపైన ఉంచాలనే కోరిక తప్ప సర్వోత్కృష్టమైన పరమ పదమందు కూడా నాకు ఇచ్ఛ లేదని విన్నవించుకొన్న ఆళ్వార్ల సంప్రదాయాన్ని అనుసరించిన దేశికులు కూడా "సత్యంశపే, వారణశైలనాథ! వైకుంఠ వాసేఽ పి నమేఽ భిలాషః" (వ.రా.పం. 49) ఓ హస్తిగిరినాథా! వైకుంఠమందు నివసించడానికైనా ఇష్టపడను, సత్యంచెబుతున్నా నన్నారు. దయాదేవి అనుగ్రహం వల్ల, తిరుమలయందు నివసించి యున్న భాగ్యవంతులు ఇక్కడే మోక్షానందాన్ని పొందుతారని కవిహృదయం.

అంబుజం॥ ఎందుగనన్ జనుగోష్పదమట్లు సుఖేతరంబులు నట్టి యా
నంద నిధిన్ నిరవద్యుని పంకజ నాభు సూరిజనోచితున్
బొందగరాని మహాద్భుతధాము నపూర్వదర్శను నంజనా
ద్రిందయ! చూపవె పెన్నిధిగన్న గతిన్ సుఖింపగ సంశ్రితుల్ ॥

45. సారంలబ్ధ్వా కమపిమహతః శ్రీనివాసాంబురాశేః
కాలేకాలే ఘనరసవతీ కాళికే వానుకంపే।
వ్యక్తోన్మేషా మృగపతి గిరౌ విశ్వమాప్యాయ యంతీ
శీలో పఙ్ఞం క్షరతి భవతీ శీతలం సద్గుణౌ ఘమ్ ॥

అర్థం: హే అనుకంపే = ఓ దయాదేవీ! మహతః = పెద్దదైన, శ్రీనివాస+అంబురాశేః = సముద్రం లాంటి శ్రీనివాసుని నుంచి / శ్రీనివాసుడనే సముద్రం నుంచి; కం, అపి = విలక్షణమైన, సారం = సారాంశాన్ని / జలాన్ని; లబ్ధ్వా = పొంది; ఘనరసవతీ = సాంద్రమైన, సారమైన గుణాలు కలదానవై / నిండు నీరు కలదైన; మృగపతి గిరౌ = సింహాలు నివసించే తిరుమలయందు; వ్యక్త+ఉన్మేషా = ప్రకటితమైన గుణావిర్భావం గల / ప్రదర్శింపబడిన మెఱుపుగల; భవతీ = నీవు; కాలికా, ఇవ = మేఘమాలవలె; విశ్వం = ప్రపంచాన్ని; ఆప్యాయయంతీ = సంతోషింపజేస్తూ; కాలే కాలే = ఆయా సమయాలలో; శీల+ఉపజ్ఞం = సౌశీల్యం మొదలైన / స్వభావమే కారణమైన; శీతలం = చల్లని; సత్+గుణ+ఓఘం = కల్యాణగుణ సమూహాన్ని/మంచి పంటలను పండించే ప్రవాహాన్ని; క్షరతి = వర్షిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! శ్రీనివాసుడనే కల్యాణ గుణోదధి నుంచి సారాన్ని గ్రహించి మేఘపంక్తిలాగా వేంకటాద్రి మీద ప్రకాశిస్తూ, నీవు విశ్వాన్ని తాపం దీరునట్లు ఆప్యాయ పరుస్తూ, సకాలంలో సౌశీల్యాది సద్గుణౌఘాన్ని వర్షిస్తున్నావు.

వ్యాఖ్య: దయాదేవి మేఘమాలగా చిత్రింపబడిన శ్లోకమిది.

దివ్యస్వరూపాన్ని అనుభవించిన వెంటనే, కల్యాణ గుణానుభవం దయామేఘం వర్షించడం వల్ల కలుగుతుందని వర్ణితం. వాస్తవంగా, భగవద్గుణాలను ఆశ్రితులకు అనుభవింపజేసే ప్రేరకురాలు దయాదేవి. "అమ్మా నాశిప్పిఠాన్ అవన్ ఎవ్వడిత్తాన్ యానార్" (తి.వా.మొ. 5-1-7) సకల కల్యాణ గుణోదన్వంతుడైన, చక్రపాణియైన శ్రియఃపతి ఎక్కడ? అత్యంత నికృష్టుడనైన నేనెక్కడ? అని భగవద్భక్తులు సర్వేశ్వరుని శ్రైష్ఠ్యాన్ని, తమనైచ్యాన్ని అనుసంధానం చేస్తూ భగవత్సాన్నిధ్యాన్ని కోరే యోగ్యత నాకెక్కడిది?" అంటూ నైరాశ్యాన్ని చెందుతారు. కాని, భగవానుడు దయామయుడై నందువల్ల తన ఆశ్రితులు ఇంత హతాశులుగా ఉండడాన్ని సమ్మతింపడు. తన పరత్వాన్ని జాగ్రత్తగా మరుగుపరచుకొని, కేవలం తన సౌశీల్య సౌలభ్య, వాత్సల్యాది గుణాలచే వారిని ఆకర్షిస్తాడు. చేతనులు సౌశీల్యాది భగవద్గుణ గణాలను అనుభవించి ఉజ్జీవించడం కోసం ఎంతో పాటుపడుతున్న దయాదేవిని దేశికులు కావ్యశైలిలో వర్ణిస్తున్నారు.

ఇందు ఉపమేయం దయాదేవి. ఉపమానం కాలిక.

సారం లబ్ధ్వా కమపి మహతః శ్రీనివాసాంబురాశేః:– 'ఆనందసింధుః' అని గత శ్లోకంలో స్తుతింపబడింది. శ్రీనివాసుడు గంభీరమైన, విశాలమైన సముద్రం వంటి వాడు. దయాదేవి మహా సముద్రం లాంటి శ్రీనివాసుని నుంచి విలక్షణమైన శ్రేష్ఠమైన గుణగణాన్ని గ్రహిస్తుంది. "రసగ్గ్హ్యేవాయం లబ్ధ్వా" అన్నట్లు "సారం లబ్ధ్వా కమపి" అని ప్రయోగ వైచిత్ర్యం. మేఘం లవణసముద్రం నుంచి శుద్ధ జలాన్ని అద్భుతంగా స్వీకరిస్తుంది.

"సారో బలే స్థిరాంశేచ న్యాయ్యే క్లీబం వరే త్రిషు" (అమరం)

కాలే కాలే ఘనరసవతీ కాలికే వానుకంపే:– అగాధమైన సముద్రం నుంచి ఎక్కువ నీటిని నింపుకొని అవసరమైన సమయాల్లో వర్షించడానికి యోగ్యమైన మేఘం నీలవర్ణంతో వ్యాపించి ఉంటుంది కాబట్టి 'కాలికా' అనబడింది. "మేఘపుష్పం ఘనరసం" (అమరం)

కాల (నల్లని) వర్ణం కల్గియున్నందువల్ల మేఘమాలకు 'కాలిక' అని పేరు.

"మేఘజాలేచ కాలికా" (అమరం)

నీలవర్ణం గల భగవద్విగ్రహం నుంచి సారవైన గుణాలను తనకు ఉపకరణాలుగా గ్రహించి చేతనుల సుకృతం పరిపక్వమైన కాలాలలో వారి ఉజ్జీవనానికి ఉపయోగపడునట్లు చేసేది దయాదేవి.

"ఘనం నిరంతరం సాంద్రం" (అమరం) రసశబ్దానికి గుణం అనే అర్థముంది. "శృంగారాదౌ విషే వీర్యే గుణే రాగే ద్రవే రసః" (అమరం)

వ్యక్తోన్మేషా మృగపతి గిరౌ విశ్వ మాప్యాయయంతీ:– అధిక జలాన్ని తనలో నింపుకొని మీదికిపోయి సింహాలు సంచరించే పర్వతం మీద బాగా వ్యాపించి గర్జనలతోనూ మెఱుపులతోనూ తన ఉనికిని స్పష్టపరుస్తున్న మేఘజాలం, ఉచ్చనీచ విభాగం లేకుండా ప్రపంచాన్ని తృప్తిపరుస్తూ జలధరింప జేసి, చైతన్యవంతం చేస్తుంది.

భగవద్గుణాలతో చేతనులను అనుగ్రహించడానికి ముందు చూపులోనూ, ధీరగమనం లోనూ పరాక్రమంలోనూ సింహం వంటి శ్రీనివాసుడు వేంచేసి యున్న వేంకటాద్రి యందు మేఘపంక్తి లాగా ప్రతిష్ఠితయైన దయాదేవి సర్వజనులను, హెచ్చుతగ్గులు లేకుండా సమానమైన ఆదరభావంతో అభివ్యక్తమవుతూ, ఆనందపరుస్తుంది. శ్రీనివాసునికి "సర్వదృక్సింహః" (వి.స.నా) అని 'సింహ' నామమున్నందు వల్ల, ఆయన వెలసియున్న తిరుమల 'మృగపతిగిరి' అనబడింది.

శీలోపజ్ఞం క్షరతిభవతీ శీతలం సద్గుణౌఘమ్:- మిట్ట పల్లాలనే భేదం లేకుండా అవనియందంతట, అది సర్వసస్యాఢ్యయై శోభిల్లునట్లు, వర్షించే స్వభావం కల మేఘమూ దయామూర్తియే కదా!

కల్యాణగుణాలలో సౌశీల్యగుణానికి ప్రాథమ్యముంది.

"సౌశీల్యం నామ మహతోమందైస్సహ నీరంధ్ర సంశ్లేషః" మహాపురుషుడు నికృష్టులతో కలిసి మెలసియుండే స్వభావాన్ని సౌశీల్యమంటారు.

"ఉపజ్ఞా జ్ఞాన మాద్యం స్యాత్" (అమరం) మొదట తెలుసుకోబడిన దాన్ని ఉపజ్ఞ అంటారు. దయాదేవి సర్వజనులకు యోగక్షేమాలు కలుగునట్లు సౌశీల్యాది సద్గుణాల సముదాయాన్ని చల్లగా వర్షిస్తుంది. భగవద్గుణానుభవాన్ని కలుగ జేస్తుంది. మేఘం వర్షించ కుంటే మనకు నీరు దొరకదు. భగవత్కృప ప్రసరించ కుంటే మనలో మంచిగుణాల ఆవిష్కారం ఉండదు. యుష్మచ్ఛబ్దం కంటే భవచ్ఛబ్దం గౌరవాన్ని తెల్పుతుంది. దేవరవారు అన్నట్లు గౌరవ వాచకం. అక్షరుడైన పరమాత్మను మనకు అందజేయడమే కాక ఆయన కల్యాణగుణాలను కూడా మన శ్రేయస్సు కోసం కాలికయై వర్షిస్తుంది దయాదేవి.

క్షరతి భవతీ:- అక్షరునికి కూడా క్షరణం దయా ప్రభావం చేతనే కదా!

"విది వాయిక్కిన్టు కాప్పారార్" భగవత్కృప ఫలించునప్పుడు అడ్డుకొనేవారెవరు? అన్నారు వకుళాభరణులు.

అ౦॥ భూరి రసావహా! నీవు ఘనావళి బోలి మాధవుడన్ మహా
వారిధి సారమశేషము బీల్చుచు వ్యక్త కాంతి వృషాద్రి పై

జేరి సకాలమునన్ గురియన్ విభు శీల ముఖ్యుల సన్మహో
దార గుణామృత ధారల విశ్వము తాపవర్జితమౌ దయా ॥

46. భీమే నిత్యం భవజలనిధౌ మజ్జతాం మానవానాం
ఆలంబార్థం వృషగిరి పతి స్త్వన్నియోగాత్ ప్రయుంక్తే।
ప్రజ్ఞాసారం ప్రకృతి మహతా మూలభాగేన జుష్టం
శాఖాభేదై స్సుభగ మనఘం శాశ్వతం శాస్త్ర పాణిమ్ ॥

అర్థం: (ఓ దయాదేవీ!) వృషాచలపతిః = తిరుమలేశుడు; త్వత్ + నియోగాత్ = నీ యాజ్ఞవల్ల; భీమే = భయంకరమైన; భవ జలనిధౌ = సంసారమనే సముద్రమందు; నిత్యం = ఎల్లప్పుడు; మజ్జతాం = మునుగుతున్న; మానవానాం = మానవులకు; ఆలంబనార్థం = చేయూతకోసం; ప్రజ్ఞాసారం = వివేక ప్రధానమైన; ప్రకృతి మహతా = స్వభావం చేత గొప్పదైన / పెద్దదైన; మూల భాగేన = మూలమంత్రాంశమైన ప్రణవం చేత / బాహుమూల భాగం చేత; జుష్టం = కూడినట్టి; శాఖాభేదైః = అనేక శాఖల చేత/అంగుళుల చేత; సుభగం = మనోజ్ఞమైన; అనఘం = దోషరహితమైన/వైకల్యం లేని; శాశ్వతం = స్థిరమైన / దృఢమైన; శాస్త్రపాణిం = హస్తం వంటి వేద శాస్త్రాన్ని / వేదశాస్త్ర మనే హస్తాన్ని; ప్రయుంక్తే = అందిస్తున్నాడు.

తా: ఓ దయాదేవీ! వృషగిరి నాథుడైన శ్రీనివాస భగవానుడు నీ ప్రేరణ చేత భయంకరమైన సంసారమనే సముద్రమందు మునుగుతున్న జనులకు ఆలంబనం కోసం మంచి బలమూ, పెద్ద భుజమూలమూ కలిగియున్న, ఎట్టి వైకల్యం లేని, వ్రేళ్ళచే అందమైన, దృఢమైన చేయిలాగా ఉన్నట్టి, వివేకమనే సారం కలిగి, స్వభావం చేత గొప్పదైన, ప్రణవం (ఓంకారం) తో కూడినట్టి, సహస్ర శాఖలుకలిగి, దోషరహితమైన, నిత్యమహత్త్వం గల వేదశాస్త్రాన్ని ప్రవర్తింపజేస్తున్నాడు.

వ్యాఖ్య: భగవానుడు చేసే శాస్త్ర ప్రదానం పరమదయాకార్యంగా వర్ణితం. ఆనందసాగరావగాహం చెప్పబడింది. భవసాగరం నుంచి ఉద్ధరణం చెప్పబడుతున్నది. "మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్ర పాణినా" సంసార సాగర మగ్నులైన

జనులను శ్రీమన్నారాయణుడు వేదశాస్త్రమనే చేతిని పట్టుగా ఇచ్చి ఉద్ధరించడం కరుణా కార్యమే.

భీమేనిత్యం భవజలనిధౌ మజ్జతాం మానవానామ్:- జీవులు జనన మరణ చక్రంలో పరిభ్రమించడమే సంసారం, సంసారం భయం కరమైన సముద్రం. సంసారంలో కష్టసుఖాలు, సముద్రంలో పెనుగాలుల చేత గుట్టల వలె ఉవ్వెత్తుగా లేచి తలక్రిందులుగా పడే కెరటాల లాంటివి. ఇల్లాలు ఒక సుడిగుండం. తోబుట్టువులు, తనయులు మొసళ్ళే అనడం అతిశయోక్తి కాదు. ఇట్టి భయంకరమైన భవ జలధిలో పడి ఈదుతూ దరిచేర లేక జనులు మునిగిపోతుంటారు. మనువంశ సంజాతులైననూ మూఢులై, కామక్రోధాదులైన జలజంతువులచే భయంకరమై, దుస్తరమైన సంసార సముద్రంలో మునుగుతున్నారని 'మానవ' శబ్దం సూచిస్తున్నది.

ఆలంబార్థం వృషగిరి పతిః త్వన్నిదేశాత్ ప్రయుంక్తే:- నిరంతరం సంసార సముద్రంలో మునుగుతున్న మానవులకుచేతిపట్టును, లేచిరావడానికి ఆధారంగా, ఒసగకపోతే జీవించ లేరు. దయాదేవి శ్రీనివాసుణ్ని ప్రేరేపించడం వల్ల, ఆయన సంసార సాగర మగ్నులకు వేదశాస్త్రమనే చేతిని ఊతగా అందిస్తున్నాడు.

ఉత్తరార్ధం ఆ శాస్త్రపాణి యెట్టిదో శ్లేషచేత వివరింపబడుతున్నది.

ప్రజ్ఞాసారం, ప్రకృతి మహతామూలభాగేనజుష్టమ్:- సృష్టి తర్వాత చేతనులకు సంసారం నుంచి విముక్తి కలిగించడమే భగవంతుని సంకల్పం, దయాపరవశుడై భగవానుడిచ్చిన శాస్త్రంలోని విధిని పాటించక విశృంఖలంగా ప్రవర్తించేవాడు ఇహపర సుఖాలను పొందలేడు.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।
జ్ఞాత్వాశాస్త్ర విధానోక్తం కర్మకర్తు మిహార్హసి ॥ (భ.గీ. 16-24)

కర్తవ్యాన్ని - చేయదగినదాన్ని, అకర్తవ్యాన్ని - చేయరానిదాన్ని; నిర్ణయించడానికి శాస్త్రమే ప్రమాణం. కాబట్టి శాస్త్రం చెప్పిన కర్మలను బాగా తెలుసుకొని, కర్మల నాచరించాలి. విధి నిషేధాలను తెలుసుకోవాలంటే ప్రజ్ఞ అవసరం. ప్రజ్ఞ - నవ నవోన్మేషశాలిని - ఎప్పటికప్పుడు వికసించే బుద్ధి.

"బుద్ధిర్మనీషాధిషణా ధీః ప్రజ్ఞాశేముషీమతిః" (అమరం)

మంచి చెడులను తెలుసుకొని, చెడును విడచి మంచిని చేయడమే వివేకం. కాబట్టి 'ప్రజ్ఞాసారం' - వివేకం ప్రధానమైనది - శాస్త్రం.

శాస్త్రమే పాణి కాబట్టి, బుద్ధి కలవాడే చేతిని పనికోసం ఉపయోగిస్తాడు. బుద్ధి ఉన్నా, చేతికి బలం లేకపోతే ఉద్ధరించలేడు కదా! పైకి లేపడానికి సారం బలం కలది అని పాణిపరమైన అర్థం.

ప్రకృతిమహతా మూలభాగేన జుష్టమ్:- మూలమైన శాస్త్రం వేదం; ఆ వేదంలోని శబ్దాలు పర్యాయ పదాలను సహించవు. 'పాదం' అన్న చోట 'చరణం' అనరాదు. అపౌరుషేయం కాబట్టి, స్వభావం చేతగొప్ప దైన వేద మూలభాగం ప్రణవమే. (అంటే, ఓంకారం) ఆ, ప్రణవంతో కూడినది వేదం. (ఓంకారాన్ని మొదట ఉచ్చరించి వేదాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుందన్న మాట).

పాణిపరంగా - పనులు చేసే మహిమ గల అవయవంగా ప్రకృతి చేత ఏర్పడి, మూలభాగమైన భుజంతో కూడినది, హస్తం.

శాఖాభేదైః సుభగమ్:- వేదాలు అనంతమైనవి. అనేక శాఖలూ కలిగి (మార్పులేని దవడం వల్ల) ఒకే రూపంగా ఉండడం చేత మనోహరమైనది వేదం. అంగుళాల (వ్రేళ్ళ) చేత అందమైనది పాణి. "పంచశాఖః శయః పాణిః" (అమరం)

చేతికి అందమైన వ్రేళ్ళు రూపొందడానికి ఆధారమైనవి భుజమూల కణాలే అని మానవ పిండోత్పత్తి శాస్త్రం.

"Patterning of the digits (fingers) is depended on the group of cells located at the base of the limbs on their posterior border known as the Zone of Polerizing Activity (Z.P.A). These cells established as morphogen gradient that appears to involve retinoic acid and a series of homeobox genes to produce the normal sequence of digits. (Human Embryology)

ఈ విషయాన్ని నాల్గవ తమ్ముడైన డా. టి. వెంకటరమణాచార్యులు తెల్పినారు.

అనఘం: శాసనం లాంటిది కాబట్టి, అపశబ్దం, అసాధువనే దోషం లేనిది వేదం. ఎముక విరుగడం, వాతాది వ్యాధి దోషం లేనిది చేయి.

శాశ్వతం: ఎల్లప్పుడు శబ్ద ప్రమాణం చేత స్థిరమైనది వేదం. నిత్యం సహాయపడే అలవాటుచేత దృఢమైనది పాణి.

శాస్త్రపాణిమ్:- ఉద్ధరించడానికి కరావలంబనం అత్యంతావశ్యకం. వేదోపబృంహితాలైన సాత్త్విక పురాణాది శాస్త్రాలు పరదేవతా పారమార్థ్య నిశ్చయానికి పరమసాధనాలు. కాబట్టి 'శాస్త్ర పాణిం', అనడంలో ఎంతో ఔచిత్యమున్నది.

'కరుణే! దయే!' అని ఇందు సంబోధింపబడలేదు. 'త్వన్నియోగాత్' అనే పదం వల్ల, భగవానుని శాస్త్ర ప్రవర్తకత్వం కరుణాకార్యమని సుస్పష్టం.

ఉం॥ మానకదుస్తర భీమభవాంబుధి మగ్నులైన నరాళికిన్
బూనిత్వదాజ్ఞను నూతకొనన్ దయ! బోధసారము మూలభా
గానుగుణంబు వివర్జిత దోషము నై యనేక పుశాఖలన్
జానుగ నొప్పెడు శాస్త్రకరం బహిశైల భూషణుడిచ్చెదున్॥

47. విద్వత్సేవాకతక నికషై ర్వీత పంకాశయానాం
పద్మాకాంతః ప్రణయతి దయే! దర్పణం తేస్వశాస్త్రమ్।
లీలాదక్షాం త్వదన వసరే లాలయన్ విప్రలిప్సాం
మాయాశాస్త్రాణ్య పిదమయితుం త్వత్ప్రపన్నప్రతీపాన్॥

అర్థం: దయే = ఓ దయాదేవీ! పద్మాకాంతః = శ్రీనివాసుడు; విద్వత్ సేవా కతక నికషైః = శాస్త్ర కోవిదుల పరిచర్య అనే చిల్ల గింజయొక్క రాపిడుల చేత; వీత పంకాశయానాం = తొలగిపోయిన బురద గల వారికి; తే = నీకు, దర్పణం = అద్దమైన; స్వశాస్త్రం = తన శాస్త్రమైన పాంచరాత్ర శాస్త్రాన్ని; త్వత్ + అనవసరే = నీ అవసరంలేనప్పుడు; లీలాదక్షాం = లీలల యందు సమర్థమైన; విప్రలిప్సాం = వంచనేచ్ఛను; లాలయన్ = ప్రశంసిస్తూ; త్వత్ ప్రపన్న ప్రతీపాన్ = నిన్నాశ్రయించిన వారి యొక్క విరోధులను; దమయితుం = శిక్షించడానికి; మాయాశాస్త్రాణి, అపి = మోహన శాస్త్రాలను కూడా; ప్రణయతి = ప్రవర్తింపజేస్తున్నాడు.

తా: ఓ దయాదేవీ! చిల్లగింజగంధం చేత నీటిలోని బురద తొలగి శుద్ధ జలమేర్పడినట్లు శాస్త్రజ్ఞులకు చేసిన సేవ చేత అజ్ఞానాదిపాపరాశిని తొలగించుకొన్న నిర్మలాంతః కరణులకు శ్రీకాంతుడు నీకు అద్దం లాంటి భగవచ్ఛాస్త్రాన్ని అందిస్తున్నాడు. నీ అవసరం లేదనుకొన్నప్పుడు లీలాదక్షమైన వంచనేచ్ఛను పొగడుతూ, నీ శరణాగతుల విరోధులను అణచివేయడానికి వేద విరుద్ధాలైన మోహన శాస్త్రాలనూ ప్రవర్తింపజేస్తున్నాడు.

వ్యాఖ్య: శ్రీకాంతుడు పాంచరాత్రశాస్త్రాన్నే కాక మాయా శాస్త్రాలనూ ప్రవర్తింప జేస్తాడని వర్ణితం.

దయాళుడైన భగవానుని శాస్త్ర ప్రదానం గత శ్లోకంలో వర్ణింపబడింది. ఈ శ్లోకంలో రెండు శాస్త్రాలను భగవానుడు భిన్న పద్ధతులతో ప్రవర్తింప జేసిన విధం వర్ణింపబడుతున్నది. అంటే, రెండు శాస్త్రాలకున్న భేదం చూపబడుతున్నది. పూర్వార్ధంలో పాంచరాత్ర శాస్త్రం దయాదేవికి అద్దంగా చిత్రింపబడింది.

విద్వత్సేవా కతకనికషైః వీతపంకాశయానాం:- శాస్త్రాలను అభ్యసించి సత్సంప్రదాయ సిద్ధులై, సత్త్వనిష్ఠులై, సదాచారపరులైన వారు విద్వాంసులు. అట్టి విద్వాంసులను ఆశ్రయించి, వారికి అన్ని విధాలా సేవచేస్తూ, వారు చెప్పినట్లు వినడమూ, వారి అడుగుజాడలలోనే నడువడమే విద్వత్సేవ. శాస్త్ర కోవిదులైన సదాచార్యుల సేవచేసిన వారి యొక్క చిత్తంలో మాలిన్యాలు తొలగిపోయి పరిశుద్ధి యేర్పడుతుంది.

చిల్లగింజను రాపిడి చేయగా కలిగిన గంధాన్ని బురద నీరున్న కడవలో కలిపితే, బురద అడుగుకు జేరి నీరు స్వచ్ఛమవుతుంది.

"నిషద్వరస్తు జంబాలః పంకోఽ స్త్రీశాదకర్దమౌ" (అమరం)

'పంక' శబ్దానికి బురద, పాపం అనే అర్థాలున్నాయి.

"మందోఽ ప్యమందతామేతి సంసర్గేణ విపశ్చితః ।
పంకచ్ఛిదః ఫలస్యేవ నికషేణావిలం పయః ॥"

అని కాళిదాస కవి చెప్పినట్లు అడుసును తొలగించే చిల్లగింజ యొక్క పొడి (చూర్ణం) చేత బురదనీరు తేటపడినట్లే, విద్వాంసుని సహవాసం చేత మందుడు కూడా కౌశలాన్ని (చైతన్యాన్ని) పొందుతాడు.

చిల్లగింజ పొడిచేత నీటిలోని బురదపోయి తేట నీరైనట్లు, విద్వాంసులైన సదాచార్యుల నాశ్రయించి వారికి పరిచర్య చేసిన వారి యొక్క అజ్ఞానం, పాపం తొలగిపోయి అంతఃకరణం నిర్మలమవుతుంది.

పద్మాకాంతః ప్రణయతిదయే! దర్పణంతే స్వశాస్త్రమ్:– "కరుణాం మూర్తిమతీమివ" – భగవానుని దయయే మూర్తీభవించినదో అన్నట్లు ప్రకాశించేది పద్మాదేవి. అట్టి పద్మకు – లక్ష్మికి భర్తయైన భగవానుడు దయకు నిలువుటద్దమై వెలిగే స్వశాస్త్రాన్ని నిర్మలాంతఃకరణుల కోసం ప్రవర్తింప చేస్తున్నాడు. స్వశాస్త్రమంటే పాంచరాత్ర శాస్త్రానికే భగవచ్ఛాస్త్రమని పేరు. "పాంచరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణస్స్వయమ్" అన్నట్లు సాక్షాత్తుగా భగవన్ముఖోద్గత మైనది. ఏకాయనం, దివ్యాగమం, సాత్వతశాస్త్రం అనే పేర్లతో ప్రసిద్ధమైనది పాంచరాత్రం.

"శ్రీ, శేష, శేషాశన, పద్మగర్భ, సేనేశేభ్యః పంచభ్యః పంచభీరాత్రిభిః

నిర్వ్యూఢోఽస్య ఉపదేశ ఇతి పాంచరాత్ర మితి వ్యుత్పత్తి రన్వర్థా"

లక్ష్మీదేవి, శేషుడు, శేషాశనుడు, బ్రహ్మ, విష్వక్సేనుడు అనే ఈ ఐదుగురికి, ఐదు అహోరాత్రాలు భగవానుడు ఉపదేశించినందువల్ల ఈ శాస్త్రానికి పాంచరాత్రం అనే పేరు కలిగింది. 'ఆగమ ప్రామాణ్యం' అనే శ్రీ యామున మునులు రచించిన గ్రంథమందు దీని ప్రాశస్త్యం ప్రకటితం. భగవద్రామానుజులు శ్రీ భాష్యంలో దీని వైశిష్ట్యాన్ని బాగా ప్రస్తుతించారు. వేదాంత దేశికులు 'పాంచరాత్ర రక్ష' అనే ఒక గ్రంథాన్నే రచించారు. భగవద్దయ చేతనే ప్రపన్నులు రక్షింపబడుతారు. పాంచరాత్ర శాస్త్రంలో భగవత్స్వరూప రూపగుణవైభవమూ, ప్రపత్తి యొక్క ప్రభావమూ, దయ యొక్క మహత్త్వమూ బాగా నిరూపించి చూపించడం వల్ల దయాదేవికి ఆ శాస్త్రం దర్పణంగా ఉన్నది.

"లక్ష్మీ కాంత స్ఫటిక ముకురో లక్ష్మణార్యోపదేశః" (య.రా. స.33)

భగవద్రామానుజుల గ్రంథజాలం స్ఫటికమయమ్మైన దర్పణం.

శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితో కూడి ఈ స్వచ్ఛమైన అద్దంలో తన దివ్య సుందర విగ్రహాన్ని చూచుకొంటూ అలంకరించుకొంటాడు. అలాగా, దయాదేవి తన స్వరూప స్వభావ వైభవాన్ని పాంచరాత్రాగమమనే అద్దంలో చూచుకొని సంతోష పడుతుంది. దయా ప్రభావాన్ని విశేషంగా వెల్లడించే పాంచరాత్ర శాస్త్రాన్ని విద్వత్సేవ చేత చిత్తశుద్ధి యేర్పడి మహా విశ్వాసం కలిగిన సాత్త్వికులకే పద్మాకాంతుడు ప్రణయనం చేస్తున్నాడు. జగదుద్ధరణ కోసం భగవద్దయచే ప్రణీతమైన పాంచరాత్ర శాస్త్రం దయాకార్యమే కదా!

ఉత్తరార్ధంలో జనులను విపరీతానుష్ఠాన పరులుగా జేసే మోహన శాస్త్రాలను భగవానుడు ప్రవర్తింపజేయడం కూడా దయాకార్యమే అని వర్ణితం.

లీలా దక్షాం త్వదనవసరే లాలయన్ విప్రలిప్సాం:- విప్రలబ్ధమంటే వంచింపబడడం. "విప్రలబ్ధస్తు వంచితః" (అమరం) లబ్ధుం ఇచ్ఛా = లిప్సా/ పొందే కోరిక అని అర్థం. వి, ప్ర, అనే ఉపసర్గల వల్ల విపరీతార్థం కలిగింది. 'విప్ర లిప్సా' అంటే 'వంచన చేసే కోరిక'. 'విప్రలిప్స' (చేతన త్వమారోపింపబడినందువల్ల) అనే మహిషి - దేవేరి - లీలాదక్షురాలు, అంటే విలాస చాతుర్యం కలది; మహావిలాసిని. 'త్వదనవసరే' అంటే దయాదేవితో అవసరం లేదనుకొన్నప్పుడు భగవానుడు లీలా దక్షురాలైన విప్రలిప్సను లాలిస్తుంటాడు.

"మిథః కలహకల్పనా విషమవృత్తి లీలా దయా
పరిగ్రహణ కౌతుక ప్రథిత పారవశ్యః" (సం.సూ. 1-28)

భగవానునికి దయ, లీల అనే ఇద్దరు దేవేరులలో దయాదేవి కారుణ్యమూర్తి కాగా, లీలాదేవి విలాసమూర్తి అని దేశికుల కల్పన. దయాదేవితో ఒకప్పుడు విప్రలంభ శృంగారం - ఎడబాటు కలిగే సమయం - భగవానునికేర్పడుతుంది. దయాదేవి దగ్గర ఉన్నప్పుడు లీలాసఖియైన విప్రలిప్సకు అవకాశం ఉండదు. దయ అవసరం లేని వేళలో విప్రలిప్స లాలింపబడుతుంది. ఇదొక ఉక్తి వైచిత్రి. లోకవృత్తాంతం స్ఫురిస్తున్నందువల్ల సమాసోక్త్యలంకారమిది. దయ లేనప్పుడే వంచించే కోరిక జనిస్తుంది అని సారాంశం.

మాయా శాస్త్రాణ్యపి (ప్రణయతి) దమయితుం త్వత్ప్రపన్న ప్రతీపాన్:- వేద శాస్త్రాలకు విరుద్ధమైన శాస్త్రాలు. యథార్థ జ్ఞానాన్ని కలిగించని శాస్త్రాలు; మోసపు శాస్త్రాలు కాబట్టి మాయా శాస్త్రాలు అనబడుతాయి. భగవానుడే బుద్ధస్వామిగా అవతరించి స్వయంగానూ, మరికొన్ని సమయాల్లో "త్వం వారుద్ర! మహాబాహో! మోహశాస్త్రాణికారయ" (మహాబాహువైన ఓ రుద్రా! నీవు కూడా మోహన శాస్త్రాలను ప్రవర్తింపజేయుము) అన్నట్లు మరికొందరి మూలంగానూ, తత్త్వహిత పురుషార్థాలలో జనులు మోహపడే రీతిగా అవైదిక సిద్ధాంతాలను, మోహన శాస్త్రాలను ప్రవర్తింప జేశాడు.

"మాట్టాద పలశమయమ్ మది కొడుత్తాయ్" (తి.వా.మొ. 3-4) ఓ సుందర బాహు స్వామీ! మొదలే (నీయందు) భగవద్విషయ మందు ఆసక్తి రుచి లేని జనులకు జ్ఞానహాని కలిగించే అనేక మతాలను సృజించి, మత వైరుద్ధ్యాలతో వైషమ్యాలను పెంచుకొని, పరస్పరం కలహించుకొని, వారు సమన్వయ బుద్ధిని కోల్పోయి నశించే విధంగా మోహన శాస్త్రాలనూ ప్రవర్తింపజేశావు. చేతనులు భగవంతుణ్ని (నిన్ను) ఆశ్రయించే దారి యేది? అని నమ్మాళ్వార్లు సంసారుల పట్ల జాలిపడినారు.

భగవద్దయ చేత అనుగ్రహింపబడిన స్వశాస్త్రమే పాంచరాత్ర శాస్త్రం. మాయా శాస్త్రాలు భగవంతునిచే ప్రవర్తిల్లినవే అయినా విప్రలిప్సా ప్రయుక్తాలు. మాయా శాస్త్రాలను ప్రాణుల కర్మలను బట్టి ప్రవేశపెట్టడంలో కూడా భగవద్దయ యొక్క స్వభావం గోచరించక మానదు. భగవానుడు తన నుంచి తొలగిన దయ యొక్క మెప్పును పొందడానికే చేస్తున్నాడు. భగవత్కృపా విషయమై అపచార పడడం, ధూర్తులు తమ శక్తిని లోక వినాశానికి ఉపయోగించడం చాలా క్రూరమైనది. భగవదపచారం క్రూరం. భాగవతాపచారం క్రూరతరం. భాగవతాశ్రితులకు అంటే చరమావధిదాసులకు చేసే అపచారం క్రూరతమం. "శఠేశాఠ్యం సమాచరేత్" అన్నట్లు ముల్లును ముల్లుతోనే తీయాలికదా! భగవద్దయకు దూరులై వర్తిస్తున్న వారిని, దయాదేవిని ఆశ్రయించిన ప్రపన్నులకు విరోధులైన వారిని దండించడానికే పద్మాకాంతుడు విప్రలిప్సను లాలిస్తూ మాయాశాస్త్ర ప్రవర్తకు డైనందువల్ల, ఎల్లప్పుడు దయా విధేయత్వమే ప్రకటింపబడుతున్నది.

"ఆసురీం యోని మా పన్నా మూఢా జన్మని జన్మని ।

మామప్రాప్యైవ కౌంతేయ! తతో యాంత్యధమాంగతిమ్" (భ.గీ. 16-20)

ఓ యర్జునా! అహంకార, బల, దర్ప, కామ, క్రోధాలకు వశులై ఇతరులనూ (భగవంతుణ్ని) నన్నూ ద్వేషించే ఆసురీ ప్రకృతి గల మూఢులు. వారు నన్ను పొందక, ప్రతి జన్మలో ఆసురీయోనులనే పొందుతూ, తుదకు అంతకంటె హీనమైన గతిని - నరకాన్ని - పొందుతారని గీతాచార్యోపదేశం. వారికి అదే తగిన శిక్ష.

త్రిపురాసురులను ధర్మభ్రష్టుల జేసి, తర్వాత దేవాసుర యుద్ధ మందు రుద్రుని చేత వారిని సంహరింపజేసిన వాడు శ్రియఃపతియే కదా!

"హతాశ్చతేఽసురా దేవైః సన్మార్గ పరిపంథినః" (వి.పు)

సదాచారపరులైన వారికి శత్రువులైన అసురులు దేవతల చేత చంపబడి నారని వేద శాస్త్ర పురాణాలు వివరిస్తున్నాయి.

"ఇతిమోహన వర్త్మనాత్వయా గ్రథితం బాహ్యమతం తృణాయమన్యే" (శ్రీరం. రా.స్తవం ఉ.శ. 16) ఓ రంగనాథా! నీ భక్తుల విరోధులను వంచించే సంకల్పం చేత నీవు రూపొందించిన ఈ వేదబాహ్యమతాన్ని చెత్తగా భావిస్తున్నానన్నారు శ్రీ పరాశర భట్టరు.

లీలాదక్షయైన విప్రలిప్స కూడా దయకు కింకరురాలే అనిపిస్తుంది. ఎందుకు? అంటే, తత్ప్రయుక్త మాయాశాస్త్రానుసారులైన వారు దయా దూరులైనందు వల్లనే కదా ప్రతారింప - వంచింప - బడుతున్నారు. కాబట్టి దయావాల్లభ్యానికి హాని లేదు.

అం॥ శ్రీదయితుండు భవన్మహిమన్ వివరించు శాస్త్రచయంబు లా
పాదిలజేయు బుధాశ్రయ నిర్గత పంకిలాత్ములకున్ దయా
వేద విరుద్ధములన్ బ్రకటించెడు విప్రలంభము నొంది నీ
కాదట గూర్చ తథాగతుడై భవదాశ్రితారులు చేడ్పడన్ ॥

48. దైవాత్ప్రాప్తే వృషగిరితటం దేహిని త్వన్నిదానాత్
స్వామిన్! పాహీ త్యవశ వచనే విందతి స్వాపమంత్యమ్ ।

దేవః శ్రీమాన్ దిశతి కరుణే! దృష్టిమిచ్ఛంస్త్వదీయాం
ఉద్ఘాతేన శ్రుతి పరిషదా ముత్తరేణాభి ముఖ్యమ్॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! త్వత్+నిదానాత్ = నీవే కారణంగా గల; దైవాత్ = భాగ్య విశేషం వల్ల; వృషగిరితటం = తిరుమల ప్రదేశాన్ని; ప్రాప్తే = పొందిన; దేహిని = ప్రాణి; స్వామిన్ = ఓ స్వామి! పాహి = కాపాడుము; ఇతి = అని; అవశవచనే = తనవశమందులేని మాటను కలవాడై; అంత్యం = చివరిదైన; స్వాపం = నిద్రను; విందతి (సతి) = పొందుతుండగా; శ్రీమాన్ = శ్రీమంతుడైన; దేవః = దేవుడు; త్వదీయాం = నీదైన; దృష్టిం = కటాక్షాన్ని; ఇచ్ఛన్ = కోరుతూ; శ్రుతి పరిషదాం = వేద సమూహాలకు; ఉద్ఘాతేన = ఆరంభరూపమైన ప్రణవమనే; ఉత్తరేణ = సమాధానం చేత; ఆభిముఖ్యం = అంగీకారాన్ని, దిశతి = సూచిస్తున్నాడు.

తా: ఓ దయాదేవీ! నీవు కలిగించిన సుకృతం చేత తిరుమలయందు ప్రవేశించిన ప్రాణి 'ఓ స్వామి! రక్షింపు' మని తన వశం తప్పిన మాటను పలుకుతూ మరణించగా, లక్ష్మీ విశిష్టుడై క్రీడాత్మకుడైన భగవానుడు నీ కటాక్షాన్ని కోరుతూ, అట్లే రక్షిస్తాననే అర్థం కలిగిన 'ఓం' కారాన్ని ఉచ్చరిస్తూ తన సమ్మతిని తెల్పుతున్నాడు.

వ్యాఖ్య:- భగవద్దయా వీక్షణ ప్రభావాన్ని వర్ణించే శ్లోకమిది.

భగవానుడు దయాప్రేరితుడై శాస్త్ర ప్రదానం చేస్తాడని తెల్పబడింది. తిరుమల యందు మరణిస్తున్న ప్రాణిచే 'పాహి, మాం' అనిపించిన దయాదేవి శ్రీనివాసునిచే 'తథాస్తు' అని వాగ్దానమిప్పిస్తుందని ఈ శ్లోకం వివరిస్తున్నది.

దైవాత్ప్రాప్తే వృషగిరితటం దేహిని త్వన్నిదానాత్:- మనుష్య పశుపక్ష్యాదు లన్నిటికీ దయాదేవి అనుగ్రహాన్ని పొందే అధికారమున్నది. కాబట్టి 'దేహి' అనబడింది. తిరుమల యందు జన్మించకున్నా, ఒక జంతువు తిరుమల పైకి చేరి యుండే అవకాశమూ ఉంది. ఒక ప్రాణి, తనకు తెలియక, తిరుమలకు చేరుకోవడమే ఒక భాగ్య విశేషం. దాన్నే దైవమంటారు. 'విధి' అనవచ్చు.

"దైవం దిష్టం భాగధేయం భాగ్యం స్త్రీనియతి ర్విధిః" (అమరం)

త్వన్నిదానాత్:- 'నీ యొక్క కారణం వల్ల' అని అర్థం. "నిదానం త్వాదికారణం" (అమరం) ఒక ప్రాణికి కలిగిన భాగ్యానికి భగవద్దయయే మూల కారణం.

"స్వామిన్! పాహి" ఇతి అవశవచనే విందతి స్వాపమంత్యమ్:- భగవానుని దయయే కారణంగా గల సుకృతం వల్ల ఒక జీవుడు వేంకటాచలం మీద ఉండడం, తెలివి తప్పి పడిపోయినప్పటికీ, "స్వామీ! రక్షించు" మని తన నోటితో పల్కడం, వెంటనే దీర్ఘనిద్ర పోవడం జరుగుతుంది. 'అవశవచనే' అనడం వల్ల, మరణ సమయ మాసన్నమైనప్పుడు, మాట పెకల కున్నా 'స్వామీ! కాపాడు' మనడం వింతగా కనబడుతుంది.

"అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి సమద్భావం యాతి; నాస్త్య త్రసంశయః॥ (భ.గీ. 8-5)

చివరి దశలోనూ నన్నే తలచుకొంటూ దేహాన్ని వదిలి ఎవడు ఉత్క్రమిస్తాడో వాడు నా రూపాన్నే - మోక్షాన్నే పొందుతాడు. సంశయమే లేదు అని శ్రీకృష్ణుడు చెప్పిన మాట నిజమే కాని ఇక్కడ 'అవశవచన' మంటే తనంత తాను కోరి స్మరించలేదని స్పష్టమవుతున్నది కదా!

"ఆకృశ్య పుత్ర మఘవాన్ యదజామిళోఽపి నారాయణేతి మ్రియమాణ అవాపముక్తిమ్" పాపాత్ముడైన అజామిళుడు మరణిస్తూ తన పుత్రుణ్ని 'నారాయణ' అని పిలిచి కూడా ముక్తిని పొందాడు, అనే కథలో, బ్రతికినంత కాలం అజామిళుడు 'నారాయణ' అనే పేరుగల కుమారుణ్ని పిలిచిన అభ్యాసం కలవాడు కాబట్టి, అతడా నామాన్ని వశం తప్పి ఉచ్చరించినా, ముక్తిని పొందాడనవచ్చు.

"అవశేనాపియన్నామ్ని కీర్తితే సర్వపాతకైః । పుమాన్ విముచ్యతే సద్యః సింహత్రస్తై ర్మృగైరివ" పరవశుడైనా భగవంతుని నామాన్ని ఉచ్చరించినట్లైతే, సింహానికి భయపడి జింకలు పారిపోయినట్లే సర్వ పాపాలు తొలగిపోయి, పరిశుద్ధాత్ముడై ముక్తిని పొందుతాడు.

అంత్యకాలమందు అవశంగానైనను భగవన్నామాన్ని స్మరిస్తే మోక్షం లభిస్తుంది. "మదీయయైవదయయా" అన్నట్లు ఆశ్రితులైన ప్రాణుల పట్ల సావధానయైన దయాదేవి "స్వామి! కాపాడు" మని వారిచే మరణ సమయాన ఉచ్చరింప జేస్తుందని విశదమవుతున్నది. తిరుమల తటమందే ప్రాణోత్క్రర్షణ మవుతుంది. ఇంత భాగ్యం దయాదేవి వల్లనే కలుగుతుందని పూర్వార్ధ సారాంశం.

దేవఃశ్రీమాన్ దిశతికరుణే! దృష్టిమిచ్ఛన్ త్వదీయామ్:- శ్రీనివాసుడు కూడా (పూర్వార్ధంలో చెప్పబడిన) ఒక ప్రాణి సుకృతానికి తగినట్లు స్పందించిన విధానాన్ని ఉత్తరార్థం వెల్లడిస్తుంది. "దేవః శ్రీమాన్ స్వసిద్ధేః కరణం" అని దేశికులు ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి (7) యందు చెప్పినారు. జీవుడు మృతిచెందే వేళ తనను స్మరిస్తే తగినట్లు అనుగ్రహించే వాడు దేవుడు. 'దేవ' శబ్దానికి 'దివ్-క్రీడాదౌ' అనే ధాత్వర్థం వల్ల క్రీడించేవాడు, ప్రకాశించేవాడని అర్థం. దేవుడు చేసే చేష్టలన్నీ క్రీడగా, లీలగా భావింపబడుతాయి. ఆయనకు ఆ క్రీడ ఆనందాన్ని కలిగించడం స్వాభావికం. "స ఏకాకీ నరమేత" ఒంటరిగా ఉండేవాడు ఆనందాన్ని పొందలేడు అని శ్రుతి పలుకుతుంది కదా! కాబట్టి, ఆయన శ్రీమంతుడు కూడాను. అంటే సిరికలవాడు. లక్ష్మితో కూడి ఉండేవాడు. శ్రీదేవి కూడా ఆడుతుంది, ఆడిస్తుంది. ఆనందపరుస్తుంది, ఆనందింప బడుతుంది. అందుకే "దేవః, శ్రీమాన్" అని పరమాత్మకు రెండు పదాలు ప్రయోగింపబడ్డాయి.

మహాత్ములెందరో తిరుమల యందు శ్రీనివాసుని కటాక్ష వీక్షణం కోసం కోరుతుంటారు. (42 శ్లో) శ్రీనివాసుడేమో దయాదేవి యొక్క కటాక్ష వీక్షణాన్ని కోరుతుంటాడు. భగవానుడు ప్రాణులను కటాక్షించడానికి శ్రీదేవి సహాయపడుతుంది. శ్రీదేవి, తన అందమైన చూపులతో సూచింపబడే దయాదేవి యొక్క అంగీకారాన్ని భగవానుడు పొందినట్లు చేసి ఆనందిస్తుంది.

"తత్త్వావబోధ శమిత ప్రతికూల వృత్తిం
కైంకర్య లబ్ధ కరణత్రయ సామరస్యమ్ ।
కృత్వా త్వదన్య విముఖం కృపయా స్వయం మాం
స్ఫాతిం దృశోః ప్రతిలభస్వ జగజ్జనన్యాః" (శరణాగతి దీపిక 57)

ఓ దీప ప్రకాశస్వామి! ఆచార్య కటాక్షం వల్ల నాకు తత్త్వ జ్ఞానం కలుగజేసి, విపరీత చేష్టలను చేయని వానిగా ఉండునట్లు నన్ను కటాక్షించవయ్యా! నా మనోవాక్కాయా లనే త్రికరణాలు నీకు కైంకర్యం చేసి, అవి సమరసంగా ప్రవర్తిల్లు నట్లు కృపతో చూడవయ్యా! ఇక నాకు నిన్ను తప్ప వేరే దైవాన్ని చింతింపని మనోవృత్తిని కృపజేయవయ్యా! సకలలోకమాతయైన లక్ష్మీదేవి తన సంతాన మందొకడనైన నన్ను నీవు ఈ విధంగా కరుణించి కాపాడినందు వల్ల చాలా ఆనందించి, ఆ యరవిందలోచన స్వీయ కృపాకటాక్షాన్ని నీపైన సమృద్ధిగా ప్రసరింప జేసే లాభాన్ని పొందవయ్యా! స్వామి! అని దేశికులచే, భగవానుడు లక్ష్మీ కటాక్ష మహిమను పొందే యోగ్యుడు కావాలని ప్రార్థితుడయ్యాడు. "స్ఫాతి ర్వృద్ధౌ" (అమరం)

ఉద్ఘాతేన శ్రుతి పరిషదా ముత్తరేణా భిముఖ్యమ్:- తనను కాపాడుమని వేడుకొంటూ మరణిస్తున్న దేహికి శ్రీనివాస భగవానుడు దయాదేవి యొక్క కటాక్షాన్ని అభిలషిస్తూ, తన ఆభిముఖ్యాన్ని 'ఓంకారం' చేత ప్రకటించాడు. కోరినందుకు సమాధానంగా 'ఓమ్' అనబడే ప్రణవాన్ని ఉచ్చరించాడు భగవానుడు.

'ఉద్ఘాత' శబ్దానికి ఆరంభమని అర్థం. వేదాలను 'ఓమ్' అని మొదట ఉచ్చరించి అధ్యయనం చేయడం దృఢమైన నియమం.

"స్యాదభ్యాదాన ముద్ఘాత ఆరంభః" (అమరం)

వేదాలకు ఆరంభపదమైన 'ఓమ్' ప్రత్యుక్తిగా ప్రకటితమయింది. 'ఓమ్' అంటే 'నీవు కోరినట్లే అవుతుంది' అని మాట ఇవ్వడం.

"ఓ మేవం పరమం మతే" (అమరం) ఓమ్, ఏవం, పరమం ఈ మూడు పదాలు అంగీకారమందు వర్తిస్తాయి.

వేదాలన్నీ భగవంతుని స్వరూప స్వభావాలనే తెల్పుతాయి. వేదార్థ సారాన్ని ప్రణవం ప్రకటిస్తుంది. భగవానుడు 'ఓమ్' అనడం, మరణిస్తున్న ప్రాణి యొక్క రక్షణాభిలాషను వేదాలన్నీ సమర్థిస్తున్నాయన్న మాట. భగవానుడు ప్రణవ స్వరూపుడు. 'ఓమ్' అనే వాగ్దానం అబద్ధంగా మారితే వేదాలన్నీ నిష్ప్రయోజ కాలవుతాయి. వేద ప్రతిపాద్యుడైన భగవానుని తత్త్వమంతా అసత్యమై, విశ్వం

విశ్వాసాన్ని కోల్పోతుంది. "ఉద్ఘాతః ప్రణవోయాసామ్" అని (కుమారసంభవం) కాళిదాసోక్తి. అంగీకార సూచకంగా వేదారంభపదమైన ఓంకారాన్ని ఉచ్చరించడం చేత భగవానుని వాగ్దానం ఎంత దృఢమైనదో, శాశ్వతమైనదో స్పష్టమవుతున్నది.

శ్రుతిపరిషదా ముత్తరేణ:- శ్రుతి పరిషత్తులకు ఉద్ఘాతమైన ప్రణవం యొక్క మహిమ స్పష్టమయింది. ఇక వాటికి ఉత్తర పదాన్ని చూద్దాం. ఉద్ఘాతం, ఉత్తరం అనే పదాలు ముందు, తర్వాత అనే అర్థాలు కలవి. 'ఉద్ఘాతం' మాటనిచ్చిన రీతిని తెల్పింది. ఇక 'ఉత్తరం' మాట నెరవేరే గతిని తెల్పుతుంది. ఉపనిషత్తులు ఉత్తర గతిని తెల్పుతున్నాయి. ఉత్తర శబ్దం చేత అర్చిరాదిగతి, అతివాహ్యాభిముఖ్యం సూచింపబడుతున్నది. ఛాందోగ్యంలో చివరకు, బ్రహ్మ సూత్రార్థమైన శ్రీ భాష్యంలో చతుర్థ పాదమందు, 'తిరువాయిమొషి' అనబడే దివ్యప్రబంధాంత మందు కూడా అర్చిరాది గతి స్పష్టంగా ఉంది. ఉద్ఘాతంతో ముడిపడింది ఉత్తరపథం. "ససామభిరున్నీ యతే బ్రహ్మలోకమ్" అని శ్రుతి. ఓంకారం ఆలంబమైన ఉత్తర పథం చేత మోక్షప్రాప్తి అనడం సిద్ధాంతం. ప్రణవాన్ని చెప్పక 'ఉద్ఘాతేన శ్రుతిపరిషదాం' 'అని గమ్యార్థాన్ని తెల్పడం వల్ల పర్యాయోక్తమలంకారం. దయా కటాక్షాన్ని తోడుగా కోరుతూ అట్లే రక్షిస్తా ననడం దయాదేవి స్వాధీన పతికగా గోచరిస్తుంది. కాబట్టి సమాసోక్త్యలంకారం.

ఉం॥ దేవి భవన్నియతిన్ వృషభాద్రిని దేహి యొక్కడు చేరి "నన్
గావవె స్వామి!" యటంచు వసంబటి కాలధర్మము నొందినన్।
దేవశిఖామణి శ్రీపతి తావక దృష్టి సఖ్యము గోరి సం
భావన దోప ప్రసన్నత దెల్పును భాసురంబుగ నోం కృతిన్॥

49. శ్రేయః సూతిం సకృదపిదయే! సమ్మతాం యః సఖీంతే
శీతోదారా మలభత జనః శ్రీనివాసస్య దృష్టిమ్।
దేవాదీనా మయ మనృణతాం దేహవత్త్వేఽ పివిందన్
బంధాన్ముక్తో బలిభి రనఘైః పూర్యతే తత్ప్రయుక్తైః॥

అర్థం: దయే = ఓ దయాదేవీ! యః = ఏ; జనః = జనుడు; శ్రేయ స్సూతిం = శ్రేయస్సును కలిగించునట్టి; శీత+ఉదారాం = చల్లదనమూ, ఔదార్యమూ కలదైన;

తే=నీకు; సమ్మతాం = ఇష్టమైన; సఖీం = నెచ్చెలియైన; శ్రీనివాసస్య = శ్రీనివాస భగవానుని యొక్క; దృష్టిం = కటాక్షవీక్షణాన్ని; సకృత్, అపి = ఒక్కసారైనా; అలభత = పొందినాడో; అయం = ఈ జనుడు; దేహవత్త్వే, అపి = దేహాన్ని కలిగి యున్నప్పుడును; దేవ+ఆదీనాం = దేవతలు మొదలైన వారి యొక్క; అనృణతాం = అప్పులేని తనాన్ని; విందన్ = పొందుతూ; బంధాత్+ముక్తః = దేహబంధం నుంచి విడిపడినవాడై; తత్+ప్రయుక్తైః = ఆ దేవతాదులచే ఒసగబడిన; అనఘైః = పరిశుద్ధమైన; బలిభిః = ఉపహారాల చేత; పూర్యతే = నిండుగా గౌరవింపబడుతున్నాడు.

తా: ఓ దయాదేవీ! శ్రేయోదాయకమైన, శీతోదార స్వభావం కల్గిన, నీ ప్రియ సఖియైన శ్రీనివాస దృష్టిని ఒక్కసారైనా పొందిన భాగ్యవంతుడు జీవించి యున్నప్పుడే మూడు రకాలైన ఋణాన్ని తీర్చుకొని మరణిస్తాడు. వెంటనే, ఆ జీవుడు అర్చిరాది మార్గాన పయనిస్తూ ఆయా దేవతల చేత అర్పించ బడిన కానుకలను పొందుతూ, పరమపదాన్ని చేరుకొంటాడు.

వ్యాఖ్య: దయా శీతలిత శ్రీనివాస కటాక్షలేశం వలని లాభం వర్ణితం.

శ్రియఃపతి 'శ్రేయస్తద్ధేతుదాతా' అని తిరువాయ్ మొషిలో పంచమ శతకం (5వ పత్తు) యొక్క సారాంశంగా, ద్రవిడోపనిషత్తాత్పర్య రత్నావళి (8) యందు దేశికులు తెల్పినారు.

ఈ శ్లోకం 'శ్రేయసూతిం' అనే పదంతో ఆరంభమైనది. ఈ శతకంలోని, ఈ పంచమ దశకం యొక్క ముఖ్య విషయాన్ని ఈ పదం సూచిస్తున్నది. ఒక భాగ్య శాలియైన జీవుడు పొందే సకల శ్రేయస్సులకు ముఖ్యహేతువు భగవత్కృపా కటాక్షమని తాత్పర్యం. 'శ్రేయః' శబ్దానికి శుభమనీ, మోక్షమనీ అర్థం. "శ్వశ్శ్రేయసం శివంభద్రం కల్యాణం మంగళం శుభమ్" "ముక్తిః కైవల్య నిర్వాణ శ్రేయో నిశ్శ్రే యసామృతం, మోక్షోஉపవర్గః" (ఉభయత్ర, అమరం)

తే సమ్మతాం సఖీం:- శ్రీనివాసుని దృష్టి (కటాక్షం) దయాదేవికి ప్రియమైన సఖి. భగవానుని కడగంటి చూపులో నిరంతరం దయ కలిసి ఉంటుంది.

'అతివేల దయోత్తరంగం' (దేవనాయక పంచాశత్ (24)

దయా నదీ నీరజాలు అపాంగాలు (గోపాల వింశతి-11) భగవదపాంగాలు దయా పరిష్వంగ ధన్యమైనవని (ద.శ. 42) స్తుతింపబడినాయి కదా! భగవద్దృష్టికీ, దయకూ అత్యంత సాన్నిహిత్యం కలదని విశదీకరింపబడింది.

శీతోదారాం:- భగవత్కటాక్షం భక్తుల త్రివిధ తాపాలను హరించే శైత్య గుణం కలది. ఉదారమైనందువల్ల సకలార్థ ప్రదమని సుస్పష్టం. ఈ సమాస పదం దాత యొక్క సౌమ్యత పూర్ణచంద్రుని వంటిదని బోధిస్తుంది.

శ్రీనివాసస్య దృష్టిం:- మిధున దృష్టి ఇది. దంపతుల కటాక్ష వీక్షణమని తెల్పుతున్నది.

యః సకృదప్యలభత:- కారణం ఉండనీ, లేకపోనీ శ్రీనివాసుని కృపా కటాక్షాన్ని ఒక్కసారి ఎవడైనా పొందినాడంటే చాలు, వాని జన్మ సఫలమవుతుంది.

దేవాదీనా మయమనృణతాం దేహవత్త్వేఽపి విందన్:- జన్మసిద్ధమైన మూడు ఋణాలను తీర్చిన తర్వాత మనస్సును మోక్ష మార్గమందు ప్రవేశపెట్టాలి. "ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షేనివేశయేత్" అని మనుస్మృతి వచనం బోధిస్తున్నది.

"జాయమానో వై బ్రాహ్మణస్త్రిభీ ఋణవాన్ జాయతే, బ్రహ్మచర్యేణర్షిభ్యో యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్యః ఏషవా అనృణః" (శ్రుతి)

1. ఋషిఋణం:- శ్రుతిస్మృతుల ద్వారా జ్ఞానశక్తిని ప్రసాదించిన ఋషులకు ప్రతిమనుజుడు ఋణపడి యున్నాడు. బ్రహ్మచర్యమందు వేదశాస్త్రాధ్యయ నాదుల చేత అర్ష విజ్ఞానాన్ని ఆర్జించి, అనుష్ఠించి, ప్రచారం చేయడం వల్ల ఋషి ఋణం నుంచి విముక్తుడవుతాడు.

2. దేవర్ణం:- మనిషి ఆహార విషయంలో దేవతలకు ఋణపడి యున్నాడు. "అగ్నిముఖావై దేవాః" అగ్ని ముఖులైన దేవతలు, యజ్ఞాల యందు అర్పించబడిన హవిస్సును అగ్ని ద్వారా గ్రహించటం వల్ల, తృప్తి నొందినవారై మనుష్యులకు పాడి, పంటలు బాగా వృద్ధిని పొందునట్లు అనుగ్రహిస్తారు. కాబట్టి, యజ్ఞాలు చేయడం వల్ల మనిషి దేవతల ఋణం నుంచి విముక్తుడవుతాడు.

3. పితౄణం:- మనుజుల దేహాలన్ని పితృదేవతల అనుగ్రహం చేత పొందబడినవి. అంటే, సృష్టికార్యం వృద్ధి చేయబడింది. కాబట్టి, పితృదేవతలకు మనిషి ఋణపడి యున్నాడు. పురుషుడు ఒక స్త్రీని వివాహం చేసుకొని గృహస్థాశ్రమ ధర్మాన్ని ఆచరిస్తూ, సత్సంతానాన్ని పొంది వంశవృద్ధికి పాటుపడినందువల్ల, ఆ సంతానం ద్వారా తమకు పిండోదకాలు లభిస్తాయని తృప్తిపడుతారు పితృదేవతలు. కాబట్టి, మంచి సంతానాన్ని పొంది వంశవృక్షాన్ని పెంచిన మనిషి పితరుల అప్పును తీర్చుకొన్న వాడవుతాడు.

"అనపాకృత్య మోక్షం తు సేవమానః పతత్యధః" ఋణత్రయం నుంచి వినిర్ముక్తుడు కాకుండా మోక్షాన్ని అపేక్షించే వాడు అధః పతితుడవుతాడని శ్రుతి స్మృతులు బోధిస్తున్నాయి.

శ్రీనివాసుని దయా పూర్ణ కటాక్షాన్ని పొందిన జనుడు పుట్టుక తోనే కలిగిన ఋణత్రయాన్ని దేహ సంబంధమున్నప్పుడే తొలగించుకొంటాడు. ఋణ పరిహార సాధనాలైన ఈ ధర్మాలను భగవదాజ్ఞా కైంకర్య రూపంగా ఆచరిస్తాడు.

కర్మఠులైన మీమాంసకులు పాత్రచయనం దాకా ఋణం అనువర్తిస్తుం దంటారు. కాబట్టి వారి మత వ్యావృత్తి కోసం 'దేహవత్త్వేஉపి' అనబడింది. దేహ సంబంధమున్నప్పుడు కూడా అనృణుడుగా - దేవర్షి పితౄల యొక్క అప్పు లేనివాడై ఉంటాడని అర్థం.

ఉపాయోపేయాలు రెండూ భగవానుడే అని అధ్యవసాయం గల ప్రపన్ను డు దేవర్షి భూత పితృగణాలకు కింకరుడై, ఋణవంతుడై యుండడు. ఈ విషయంలో

"దేవర్షిభూతాత్మనృణాం పితౄణాం
నకింకరో నాయమృణీచ రాజన్ ।
సర్వాత్మనా యఃశరణం శరణ్యం
నారాయణం లోక గురుం ప్రపన్నః ॥"

అనే శ్లోకమే ప్రమాణం.

"దృష్టస్త్వయైవ జనిమాన పవర్గమకృష్ట పచ్యమనుభవతి" (ద.శ. 20) పుట్టినప్పుడే భగవద్దయా దృష్టి ప్రసరించిన భాగ్యశాలి, కర్మజ్ఞాన భక్తియోగాలనే మోక్ష సాధనాల కోసం కృషి చేయకుండగనే – అకృష్టపచ్యం – ఆకార వాచ్యుడైన భగవానుడే ఆ సాధనాల చోట నిలిచి ఫలింపజేయడం వల్ల మోక్ష ఫలాన్ని అనుభవిస్తాడని చెప్పబడింది కదా!

ఈ శ్లోకం మరికొంత విశేషంగా ఆ విషయాన్నే వివరిస్తున్నది.

బంధాన్ముక్తో బలభిరనఘైః పూర్యతే తత్ప్రయుక్తైః :– దేహ బంధమున్నప్పుడు కూడా దేవాదులకు అప్పు పడనివాడై జీవితం గడిపిన ఈ భగవద్దయా భరిత కటాక్ష పాత్రుడు, దేహబంధం వీడిపోయిన తర్వాత, ఆ దేవాదుల చేతనే పరిశుద్ధమైన అనేక సత్కారాలను పొందుతూ గౌరవింపబడుతాడు. శ్రీ వేదవ్యాస భగవానుడు **'తదోకోఽధికరణమ్'** (బ్రహ్మసూత్రం)లో చెప్పినట్లు ప్రపన్నుడు **'తత్ప్రకాశిత ద్వారః'** హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవానుడు ప్రకాశింపజేసిన దారిలో దేహాన్ని వదలి పయనిస్తాడు. ఆ మార్గమే **'దేవయానః పరం పంథాః'** దేవయానమనీ, అర్చిరాది మార్గమనీ వ్యవహరింపబడుతున్నది. ఇది వాయువరుణేంద్ర బ్రహ్మ లోకాల ద్వారా బ్రహ్మాండా వరణం దాటి పరమపద పర్యంతం పోయే విలక్షణమైన మార్గమని 'సర్వ వేదాంత ప్రత్యయ న్యాయం' గా చెప్పబడింది. ఈ దారిలో పయనిస్తున్న ముక్తాత్మకు ఆయా లోకాధిపతులు అభిమాన దేవతలు "సర్వేఽస్మై దేవా బలిమావహంతి" అని శ్రుతి పల్కినట్లు, గౌరవంగా కానుకలను సమర్పిస్తారు. 'బలి' అంటే, పూజ, కానుక.

"కరోపహారయోః పుంసి బలిః ప్రాణ్యంగ జే స్త్రియామ్" (అమరం)

"తొషుదన రులకర్కళ్ తూప నన్మలర్ మప్షై పోషివనర్ – వషియితు వైకుందర్కు ఎన్ఱు వన్దైతిరే" (తి.వామొ. 10-9-3)

ఊర్ధ్వలోకాధిపతులు ముక్తాత్మను పూర్ణకుంభంతో ఎదుర్కొని, "వైకుంఠానికి మార్గమిదే, వేంచేయండి" అని స్వాగత వచనాలను పల్కి, పూలవర్షం కురిపించి,

షోడశోపచారాలతో సత్కరించి, సాంజలిబద్ధులై సాగనంపుతారని శ్రీ శఠకోప దివ్యసూరులు అర్చిష్పథంలో అమరబృందం ఆదరించే విధానాన్ని తెలిపారు.

అనపత్యుడైన భీష్మాచార్యులకూ, యజ్ఞయాగాదులంటేమిటో తెలియని గజేంద్రునికీ, జటాయువుకూ మోక్షం లభించడానికి కారణం భగవత్కృపా కటాక్ష వీక్షణమే కదా!

ఉ॥ నీకు సఖంబు నుదారము శీతము నిత్య సౌఖ్యకరంబు లో
కైక శరణ్యము నైన రమేశు కటాక్షముంగను నెవ్వడిం
దాకృతి దేవఋణాదుల నీగుచు నర్చిరాది పథంబునన్
గైకొనుదేవి! సురావళి యిచ్చెడు కానుకల్ గొని తృప్తుడై ॥

50. దివ్యాపాంగం దిశసికరుణే। యేషుసద్దేశికాత్మా
క్షిప్రం ప్రాప్తా వృషగిరిపతిం క్షత్రబంధ్వాదయస్తే।
విశ్వాచార్యాః విధిశివముఖాః స్వాధికారోపరుద్ధాః
మన్యేమాతా జడ ఇవ సుతే వత్సలామాదృశేత్వమ్ ॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! యేషు = ఏ జనులయందు; సత్+దేశిక + ఆత్మా (సతీ) = సదాచార్య రూపిణి వవుతూ; దివ్య+అపాంగం = ఉత్తమమైన కటాక్షాన్ని; దిశసి = ప్రసారిస్తున్నావో; తే = అట్టి; క్షత్ర బంధు+ఆదయః = క్షత్ర బంధవు మొదలైనవారు; వృషగిరి పతిం = శ్రీనివాస భగవానుణ్ని; క్షిప్రం = శీఘ్రంగా; ప్రాప్తాః = పొందినవారవుతున్నారు. విశ్వాచార్యాః = జగద్గురువులైన; విధిశివముఖాః = బ్రహ్మ రుద్రాదులు; స్వ+అధికార+ఉపరుద్ధాః = తమ అధికారం చేత కట్టుబడినవారై ఉన్నారు. (అతః = అందువల్ల) మాతా = తల్లి; జడే = చైతన్యం లేని, సుతే, ఇవ = పుత్రుని యందు వలె; త్వం = నీవు; మాదృశే = మావంటి వారి యందు; వత్సలా = అధిక ప్రేమను కలదానివిగా; మన్యే = భావిస్తున్నాను.

తా: ఓ దయాదేవీ! సదాచార్య రూపవైన నీ యొక్క దివ్య కటాక్ష లాభం చేత క్షత్రబంధువు మొదలైనవారు త్వరగా మోక్షాన్ని పొందారు. బ్రహ్మ రుద్రేంద్రాదులు విశ్వాచార్యులైననూ తమతమ అధికార కృత్యాలను నిర్వహించడ

మందే నిరతులై మోక్షాన్ని పొందకున్నారు. కాబట్టి, మందుడైన సుతుని యందు ఎక్కువ మక్కువ గల తల్లి లాగా, నీవు మావంటి అల్పులయందు అధిక వాత్సల్యం కలదానవు కదా!

వ్యాఖ్య: సదాచార్య కటాక్ష వీక్షణ ప్రభావం సుశ్లోకితం.

దయాదేవి యొక్క దృష్టి 48వ శ్లోకమందు వర్ణితం. శ్రీనివాసుని దృష్టి 49వ శ్లోకమందు వర్ణింపబడింది. ఈ శ్లోకం దయాదేవి యొక్క రూపమైన ఆచార్యుల కటాక్షమే దివ్యాపాంగమనీ, దీన్ని పొందినవారు శీఘ్రంగా ముక్తిని పొందుతారని వర్ణిస్తున్నది. "దివ్యాపాంగం" అనడం దయాదేవిదో, శ్రీనివాసునిదో - ఏ ఒక్కరిదో కాక వారిద్దరిదీ కలిసి ఒకటే అయిన (మిథున) దృష్టియే దివ్యాపాంగమనబడింది.

దివ్యాపాంగందిశసి కరుణే! యేషు సద్దేశికాత్మా:- దయాదేవియే సదాచార్య రూపంగా ఆవిర్భవించింది. 'ఆచార్యః సహరిః సాక్షాత్ చరరూపీ న సంశయః" అన్నట్లు సదాచార్యుడు నడయాడే దేవుడు. సదాచార్యుడు హరిస్వరూపుడై తనను ఆశ్రయించిన జనులకు జ్ఞానోపదేశం చేసి, సర్వేశ్వరుని యందు రుచిని కలిగించి ఆయన దయకు పాత్రుడయ్యే విధంగా చేస్తాడు.

"జ్ఞానమనుట్టానమివై నన్గాగవే యుడైయ నానగురువై అడైన్దక్కాల్
మానిలత్తీర్ తేనార్ కమలత్తిరుమామగళ్ కొషనన్ తానే వైగుందం తరుమ్"

(ఉప.ర)

జ్ఞానమూ దానికి తగిన ఆచారమూ కలిగిన సదాచార్యులను ఆశ్రయించిన వ్యక్తులను తేనెలొలికే కమల మందు ఉద్భవించిన లక్ష్మీదేవికి పతియైన సర్వేశ్వరుడు స్వయంగా వైకుంఠానికి చేర్చుకొంటాడు - అని పాశురార్థం. సదాచార్య సంబంధమే మోక్షానంద దాయకమని భావం.

'ఆత్మన్' శబ్దానికున్న అనేకార్థాలలో శరీరమనే ఒక అర్థమున్నది. ఎంతటి పాపాత్ములైనా- శీఘ్రంగా మోక్షం పొందడానికి సదాచార్య రూపాన్ని దాల్చిన భగవద్దయ యొక్క దివ్యాపాంగ వీక్షణమే కారణం. దివిభవ్యం దివ్యం. కాబట్టి దివ్యకటాక్షం పరమపదమందే సంకల్పితం. అది భూలోకంలో సదాచార్య కృపా కటాక్షంగా ప్రసరిస్తున్నది.

క్షిప్రం ప్రాప్తా వృషగిరి పతిం క్షత్ర బంధ్వాదయస్తే:- క్షత్ర బంధువు మొదలైన వారు సదాచార్య సమాశ్రయణం చేత త్వరగా శ్రీనివాస భగవానుణ్ని పొందినారు. మోక్షం పొందినారని అర్థం. 'క్షత్ర బంధువు' అనే వాడు క్షత్రియ ధర్మాన్ని తిరస్కరించి, పాపకార్యాలను చేసేవాడు అని అర్థమిచ్చే పదం. బ్రాహ్మణ కర్మాలను వదలి వేసి, దుష్కర్మలను చేసినవాణ్ణి 'బ్రహ్మబంధువు' అంటారు. పాపిష్ఠుడని అర్థం.

"బ్రహ్మబంధు రధిక్షేపే నిర్దేశే" (అమరం)

"పాపిష్ఠః క్షత్రబంధుశ్చ పుండరీకశ్చ పుణ్యకృత్ ।
అచార్య వత్తయా ముక్తౌ తస్మాదాచార్యవాన్ భవేత్ ॥"

ధర్మాత్ముడైన పుండరీకుడూ, పాపాత్ముడైన క్షత్రబంధువూ, ఇద్దరు, సదాచార్యులను కలవారపడం చేత ముక్తులయ్యారు. అందువల్ల, ప్రతివ్యక్తి ఆచార్యులను కలవారై ఉండాలి; అని శ్లోకార్థం. 'విష్ణుధర్మం' అనే పురాణ గ్రంథంలోనిది ఈ శ్లోకం.

మొయ్త్త వల్వినైయుళ్ నిన్టు మూన్టెషుత్తుడైయ పేరాల్ కత్తిర పన్దు మన్టే పరాంగతి కండుకొండాన్" బలమైన పాపాలలో ఉన్నప్పటికీ, గోవిందా! అనే మూడక్షరాలను పలికినంత మాత్రాన క్షత్రబంధుడు మోక్షాన్ని పొందాడు కదా!

సూర్యవంశంలో జన్మించిన క్షత్రబంధుడు అడవిలో వేటాడడానికి పోయి సకల జంతువులను సంహరించేవాడు. బాటసారులను హింసించేవాడు. తపోధనుడైన ముద్గల మహర్షి స్నానం చేయడానికి జలాశయానికి వచ్చాడు. అడవిలో పాపిష్ఠుడైన క్షత్రబంధుడు దారి తప్పి ఇటు వచ్చిన సమయాన, ఆ మహర్షి కాలుజారి మడుగులో పడినాడు. "దర్శనాదేవసాధవః" అన్నట్లు మహర్షిని చూచిన వెంటనే మంచి బుద్ధి కల్గిన క్షత్రబంధుడు మహర్షికి చేయూత నిచ్చాడు. కృపా ప్రసన్నుడైన మహర్షి 'నీవు క్రూర కృత్యాలను విడిచిపెట్టి, మంచి పనులను చేయు'మని క్షత్రియ బంధువుకు బోధించాడు. 'నాకు అలవాటైన పనులను మానలేను' అన్నాడు. పోనీ, నీవు కూర్చున్నా, లేచినా, తిరుగుతున్నప్పుడైనా, 'గోవింద' అని పలుకుతుండవయ్యా! అని చెప్పి వెళ్ళిపోయాడు. సదాచార్యోపదేశం చేతను, పరిపూర్ణంగా కటాక్షించడం

వల్లనూ, క్షత్రబంధుడు 'క్షిప్రంభవతిధర్మాత్మా' అన్నట్లు 'గోవింద' నామస్మరణం చేస్తూ ధర్మాత్ముడయ్యాడు. మరుసటి జన్మలో పూర్వజన్మ చింతన కలిగి, గోవిందుణ్ణి శరణం పొంది మోక్ష సామ్రాజ్యాన్ని అనుభవించాడు. కాబట్టి "ఆచార్యవాన్ పురుషోవేద" అని ఉపనిషన్మంత్రం కూడా ఆచార్య సంబంధం కలవాడే తెలుసుకొంటాడని బోధిస్తుంది. దేశికులు, క్షత్రబంధ్వాదులు వృషగిరిపతిని త్వరగా పొందినవారయ్యారు అన్నారు. వృషగిరి ధర్మగిరియే కదా! శ్రీనివాసుడు మోక్ష ధర్మ ప్రభువు కాబట్టి పరమపదం కంటెనూ శ్రీ వేంకటాద్రికి ప్రాప్యత్వం అధికమని అనురణిస్తున్నది. శ్రీనివాసుని దయయే సదాచార్య రూపంతో సంచరించడం వల్ల సదాచార్య రూపం విశ్వాచార్యుల కంటె విలక్షణమైనదని సదాచార్య కటాక్ష ప్రభావం పూర్వార్ధంలో స్తుతింపబడింది.

ఇక ఉత్తరార్థం, భగవద్దయా పాంగ దృష్టిని పొందని వారి గతిని వివరిస్తున్నది.

విశ్వాచార్యాః విధిశివముఖాః స్వాధికారో పరుద్ధాః:- సకల లోకాలకు ఆచార్య స్థానాన్ని పొందదగిన మహా ప్రభావం కలవారు బ్రహ్మరుద్రాదులు. అయినా, దయాదేవి యొక్క దివ్యకటాక్ష వీక్షణాన్ని పొందనివారు కాబట్టి మోక్షాధికారులు కాకపోవడానికి వీరి జగత్సృష్ట్యాది ఆధికారిక కృత్యాలే అడ్డుపడుతున్నాయి. ఆధికారిక కృత్యాలను నిర్వహించడమందే నిరతులైన వారికి అధికార సమాప్తి దాకా మోక్షప్రాప్తి ఉండదు. **యావదధికార మవస్థితి రాధికారికాణామ్** (బ్ర.సూ). అధికారమందు నియుక్తులైన బ్రహ్మరుద్రేంద్రాదులు తమ అధికార కృత్యం పూర్తి అయ్యేంత వరకు ఈ విశ్వమందే ఉంటారని అర్థం.

విశ్వాచార్యులనబడేవారు ప్రకృతి బంధంలో ఉండగానే, ఆచార్య దివ్య కటాక్ష పాత్రులైనవారు మోక్షాన్ని పొందుతున్నారు.

క్షత్రబంధునికే త్వరగా మోక్షం లభించిందంటే, నేను బ్రహ్మ బంధువును కాబట్టి నాబోటి వారికీ త్వరగా మోక్షం లభిస్తుందనే విశ్వాసముందని దేశికుల ఆశయం.

దయాదేవి దివ్యకటాక్షం విశ్వాచార్యులంతటి వారిపైన ప్రసరించక పోవడానికి కారణమాలోచిస్తే, మాతృస్వభావం లోకంలో కనబడుతున్నదే కదా! అనిపించింది.

మన్యేమాతా జడ ఇవ సుతే వత్సలా మాదృశేత్వమ్:- తల్లికి పుత్రులెందరో ఉన్నా, అసమర్థుడైన, చేతకాని వాడైన పుత్రుని యందు అధిక వాత్సల్యం కలిగి ఆమె అతనికి ఇతరుల కంటె ఎక్కువ సహాయపడుతుండడం లోక పరిపాటి.

"సహజం జననీ జనస్యలోకే జడజాతేషు విశేష వత్సలత్వమ్" అన్న విధంగా దయాదేవి యొక్క కటాక్షం 'జడే సుతే ఇవ మాదృశే' అని నైచ్యాను సంధానం చేయడం వల్ల, దేశికుల యందు త్వరగా ప్రసరించగలదనే భావం ప్రకటితం. దేశికులు కార్పణ్యాన్ని అసమర్థతను ప్రదర్శించడంతో ఈ దశకాన్ని ముగించి, తర్వాతి దశకాన్ని, 'అతికృపణోఽపి' అని ఆరంభిస్తున్నారు. శరణాగతి ప్రపత్తికి మొదట ఆచార్య కటాక్ష మావశ్యకం కాబట్టి, ఆరవదశక విషయప్రసక్తితో ఈ దశకాన్ని పూర్తిచేశారు.

౫౦॥ చల్లని నీదు కటాక్షములబ్బిన క్షత్రబంధముఖుల్ వడిన్
దెల్లముగా వృషభాద్రి పు బొందిరి దేవి! సద్గురు శిక్షలన్।
జెల్లుబడిన్ జతురాస్య హరాదులు చిక్కిరాత్మ విచేష్టలన్
తల్లి జడాత్మజు మెచ్చుగతిన్ దయతాల్తు వర్మిలి మాయెడన్॥

పంచమ దశకం సమాప్తం

షష్ఠ దశకం

51. అతికృపణో౽పి జన్తు రధిగమ్య దయే! భవతీం
ఆశిథిల ధర్మ సేతు పదవీం రుచిరామచిరాత్ ।
అమిత మహోర్మిజాల మతిలంఘ్య భవాంబునిధిం
భవతి వృషాచలేశ పదపత్తన నిత్యధనీ ॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! అతికృపణః = చాలా నికృష్టుడైన; జంతుః , అపి = జీవుడు కూడా; రుచిరాం = మనోజ్ఞమైన; అశిథిల ధర్మ సేతు పదవీం = దృఢమైన, ధర్మార్థమైన, వంతెన దారిగా నున్న; భవతీం = నిన్ను; అధిగమ్య = పొంది; అచిరాత్ = తొందరగా; అమిత, మహా+ఊర్మి జాలం = మితిలేని పెద్ద అలల సముదాయం కలిగిన; భవ+అంబునిధిం = సంసార మనే సముద్రాన్ని; అతిలంఘ్య = దాటి; వృషాచల+ఈశ, పద పత్తన నిత్యధనీ = వృషగిరీశుడైన శ్రీనివాసుని పాదాలనే పట్టణమందు; నిత్యమైన సంపదను కలవాడు; భవతి = అవుతున్నాడు.

తా: ఓ దయాదేవీ! దరిద్రుడైన మానవుడు కూడా దృఢమైన, ఆకర్షణీయమైన, ధర్మం కోసం కట్టబడిన, సేతు మార్గంగా ఉన్న నిన్ను ఆశ్రయించి, శీఘ్రంగా పెద్ద కెరటాలతో భయంకరమై దాటరాని సంసార సముద్రాన్ని దాటి శ్రీనివాసుని పాద యుగ్మమనే పట్టణమందు చేరి నిత్యధనవంతుడవుతున్నాడు.

వ్యాఖ్య: పరమదరిద్రుడు దయా ప్రభావం చేత నిత్య ధనవంతుడవుతున్నాడని వర్ణితం.

సకల శ్రేయస్సులకు - మోక్షో పాయానికీ కారణమైన దయా రూప సదాచార్యుల యొక్క కటాక్ష ప్రభావం వర్ణింపబడింది. ఈ దశకమందు ప్రపత్త్యధికారం - దయాదేవి యందు ప్రపత్తిని అనుష్ఠించే రీతి - వర్ణింప

బడుతున్నది. "ముముక్షుర్వై శరణమహం(ప్రపద్యే" అని శ్వేతాశ్వతరోపనిషత్తు శరణాగతిని బోధిస్తున్నది.

"పుగలొన్రిల్లా వడియేన్ ఉన్న డీక్కీష్ అమర్న్దు పుగున్దేనే" అని నమ్మాళ్వార్లు శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యపాదారవిందాల యందు శ్రీ మహాలక్ష్మీ పురుషకారంతో పూర్ణశరణాగతిని అనుష్ఠించారు.

'తిరువాయ్‌మొషి' యందు ఆరవ పత్తు (శతకం)లో '(ప్రపదన సులభత్వం' విషయీకరింపబడింది. ఈ దయాశతకంలోని ఆరవ దశకంలోనూ ఆ విషయమే నిరూపింప బడుతున్నది.

విషయానికి అనుగుణమైన, 'నర్దటకం' అనే వృత్తం ఈ దశకంలో వాడబడింది. శ్రీ శుక(బ్రహ్మ భాగవతంలో ఈ వృత్త (ప్రణీతమైన '(శ్రుతిగీత' ను (ప్రవచించారు. ఇది కరుణరసానుగుణంగా ఉంటుంది. కురరీరుతా సదృశంగా ఉంటుంది. "రోరూయమాణాం కురరీ మివార్తామ్" అని సభలో (క్రందిస్తున్న (ద్రౌపది వర్ణింప బడింది. కాబట్టి, 'కురరీరుత' వృత్తమూ అనవచ్చు. రెండింటిలోనూ గణాలు ఒకే విధంగా ఉంటాయి. "నజ భజ జగణా, లఘుర్గురుశ్చ" అని నర్దటక వృత్త లక్షణం. కృపణుని కరుణా (క్రందనం ఈ దశకంలో స్పష్టం. సంసార సము(ద్రాన్ని దాటడానికి దయాదేవి ధర్మార్థం నిర్మింపబడిన సేతువుగా పోల్చబడి, "అతికృపణోఽపిజన్తుః – నిత్యధనీ" అనే ఆద్యంత పదాలుగల ఈ శ్లోకం (ప్రపదన ఫలాన్ని కీర్తిస్తున్నది.

అతికృపణోఽపిజన్తుః:– జీవుడెంత నికృష్టతముడైనా దయాదేవిని ఆ(శ్రయించే అధికారముంది. 'జంతు' వనడం వల్ల నర పశుపక్ష్యాది (ప్రాణులన్నిటికి – అందు అనన్య గతిత్వం, అకించనత్వం గల వాటికి అధికారం మెండు.

"అనితర శరణానా మ(గ్రిమస్యాస్య జన్తోరవశ కరణవృత్తే ర(గ్రతః సన్నిధేయాః " (పా.స. 992) గతిలేని వాళ్ళల్లో మొదటివాడైన ఒక జీవుడు తన అవసాన కాలంలో ఇం(ద్రియాలన్ని సడలిపోయినప్పుడు దనుజారిని దగ్గరికి తెచ్చి చూపించు తల్లీ! అని పాదుకాదేవిని (ప్రార్థిస్తాడు.

రుచిరా మశిథిల ధర్మసేతు పదవీం భవతీ మధిగమ్య:– ధనసంపాదనం కోసం పయనించే దరి(ద్రునికి ఎక్కువ (శ్రమ కలిగించని, పైస ఖర్చులేని, దగ్గరి

మార్గం ఆకర్షణీయంగా ఉంటుంది కాబట్టి, రుచిర మనబడింది. దయాదేవి ధర్మసేతు పదవిగా పోల్చబడింది. ప్రజలకు మేలు చేయడానికి, ఈవలి గట్టు నుంచి ఆవలి గట్టుకు చేరడానికి దృఢంగా నిర్మింపబడిన వంతెన గలదారిని మాన్యులూ, సామాన్యులూ ఉపయోగించుకొంటారు.

అశిథిలమైన ధర్మం అచ్యుత భగవానుడే "కృష్ణం ధర్మం సనాతనమ్" "విదిత స్సహి ధర్మజ్ఞః శరణాగత వత్సలః" (రా.సుం) అని సీతాదేవి శరణాగతి ధర్మాన్ని వివరించింది. ధర్మమంటే శరణాగత వాత్సల్యమే. "అమృతస్యైవ సేతుః" 'ఏష సేతు ర్విధరణ ఏషాం లోకానా మసం భేదాయ" అని వేదవాణి. కాబట్టి ధర్మసేతువు భగవానుడే.

శరణాగత ధర్మం అభంగురమైన, దృఢమైన సేతువు. ఆ సేతు పదవి దయా దేవియే అని అర్థం. 'అశిథిల' శబ్దం వల్ల ఆశ్రయించిన వారిని చేపట్టి ఎన్నడూ జారవిడువకుండడమనే అర్థం స్ఫురిస్తుంది. "భయంత్యజత, భద్రంవః"–"నమే భక్తిః ప్రణశ్యతి"–"యోగక్షేమం వహామ్యహం". అని ప్రతిజ్ఞలు చేసిన దయానిధియైన శ్రీనివాసుడు ఆశ్రిత రక్షణమందు నిత్య వ్రతుడనడం నిర్వివాదాంశమే కదా!

అధిగమ్య దయే! భవతీం:- సేతు పదవియే దయాదేవి. సేతు పదవిని పొందితే సంసార సముద్రాన్ని సులభంగా దాటవచ్చును. దయాదేవిని ఆశ్రయిస్తే, మహా విశ్వాసంతో ప్రార్థిస్తే, శాశ్వతమైన ఫలం ప్రాప్తిస్తుంది. 'అధిగమ్య' పదం పూర్వార్ధమందున్నది. 'అతిలంఘ్య' పదం ఉత్తరార్ధమందున్నది. పూర్వార్ధమందు ఉపాయం. ఉత్తరార్ధమందు ఫలం. దయాదేవిని ఆశ్రయించిన ఉత్తర క్షణాన ఫలాను భవం కలుగుతుంది.

అచిరా దమిత మహోర్మిజాల మతిలంఘ్య భవాంబునిధిమ్:- సంసారమే సాగరం. "తృష్ణాతోయే మదన పవనోద్ధూతమోహోర్మి మాలే, దారావర్తే తనయ సహజగ్రాహ సంఘాకులేచ। సంసారాఖ్యే మహతిజలధౌ" (ముకుందమాల 15)

సంసారమనే సముద్రంలో ఆశ అనే జలం, కామమనే పెనుగాలిచే కదలింప బడి మోహమనే అలలు క్రమంగా లేచి పడుతుంటాయి. ఇందులో భార్యయే

సుడిగుండం. సంతానం, బంధువులు మకరాది జలచరాలు. ప్రాకృతిక సముద్రం కంటెనూ గొప్పది సంసార సముద్రమని రూపకాలంకారంతో చెప్పబడింది.

ఊర్మిజాలం:– "బుభుక్షాచ పిపాసాచ ప్రాణస్యమనసఃస్మృతః ।
శోకమోహౌ శరీరస్య జరామృత్యూ షడూర్మయః ॥"

ఆకలి, దప్పి, శోకం, మోహం, ముదిమి, మృత్యువు అనే ఆరు తరంగాలు (షడూర్మిలు) అవాంతర భేదాలచే అనేక తరంగాలైదుస్తరమైన భవసాగరాన్ని (సేతు పదవి) వారధి మార్గాన శీఘ్రంగా దాటడం జంతువులకు సుఖకరం.

సేతుపదవి అనబడే దయాదేవిని ఆశ్రయిస్తే సంసార ప్రతిబంధకాల నుంచి బయటపడడం సులభం. అచిరాత్ – ప్రపన్నుడు త్వరగా తరిస్తాడు. ఒక్కసారి దయాదేవి యొక్క అనుగ్రహంతో ఆవలి గట్టున చేరిపోతే అక్కడ కనబడేదేమిటి?

భవతి వృషాచలేశ 'పదపత్తన నిత్యధనీ:– అక్కడ వైభవోపేతమైన తిరుమలేశుని పాద పద్మమనే పట్టణం కనబడుతుంది. జ్ఞాన వైరాగ్య భూషణులైన వేదాన్త దేశికులకు నగరాలు, రాజనగరులు కనబడవు. కేవలం రెండే రెండు పట్టణాలు వారికి గోచరిస్తాయి. ఒకటి 'వృషాచలేశ పద పత్తనం'. రెండవది 'యతి చక్రవర్తి పదపద్మ పత్తనం'. (యతిరాజసప్తతి) (భగవద్రామానుజుల పాద కమల మనే పట్టణం) యతిరాజుల పాదాలకు అధికంగా 'పద్మ' శబ్దాన్ని ప్రయోగించడం వల్ల కృపా ప్రసన్నులైన ఆచార్య కటాక్షం వల్లనే శ్రీనివాస భగవానుని యందు దేశికులకు భక్తి పరిపక్వమయిందని ధ్వని. భగవద్దయ ద్వారా శరణాగతి చేసి ఆ స్థలానికి చేరిన వెంటనే 'సత్త' కలుగుతుంది. వృషాచలేశుని పదమే ధనం. అది నిరపాయమైన, శాశ్వతమైన ధనం. "నః కులధనం". ధనంజయ వివర్ధనం ధనముదూఢగోవర్ధనం. సుసాధన మబాధనం, సుమనసాం సమారాధనం!!" అది మహాధనం గల పట్టణం కదా! అక్కడ నిత్యులు, ముక్తులు, ముముక్షువులు అందరు హరిదాస్య రసికులే ఉంటారు. అక్కడ అధికంగా క్రయవిక్రయాలు జరుగుతాయి. అతికృపణుడైనా దయాదేవిని ఆశ్రయించినందువల్ల ఆ దేవి అనుగ్రహం చేత, భగవత్పద మనే పట్టణంలో నివసించి ఏనాటికీ తరుగని గొప్ప సంపద కలవాడై శాశ్వతానందాన్ని పొందుతున్నాడు. నిత్య కైంకర్య లక్ష్మిని పొందుతున్నాడని భావం.

ఒక నిర్ధనుడైన వణిజుడు ధనాశతో సేతు మార్గాన సముద్రాన్ని దాటి మహానగరం జేరి బాగా ధనాన్ని ఆర్జించి ఆనందపడుతున్నాడనే అప్రకృత విషయం స్ఫురించడం వల్ల సమాసోక్త్య లంకారం.

చం॥ కరము దృఢంబు రమ్యమునుగా రచియించిన ధర్మసేతువై
పరగెడు నిన్ను నండగొన ప్రాణి యకించనుడైన నేమి; చె
చ్చెరను బహూర్మి భీమభవ సింధువునంబ! తరించి వేంకటే
శ్వర పద పట్టణంబు గనిసంతస మొందడె నిత్యధన్యుడై ॥

52. అభిముఖ భావ సంపదభి సంభవినాం భవినాం
క్వచిదుపలక్షితా క్వచిద భంగుర గూఢగతిః।
విమల రసావహా వృషగిరీశ దయే! భవతీ
సపది సరస్వతీవ శమయత్యఘమ ప్రతిఘమ్ ॥

అర్థం: హే వృషగిరీశదయే = శ్రీనివాస దయాదేవీ! విమలరస+ఆవహా = కపటం లేని ప్రేమ కలిగినట్టి / పరిశుద్ధమైన జలాన్ని ప్రవహింప జేయునట్టి; క్వచిత్, ఉపలక్షితా = ఒకప్పుడు కనబడునట్టి; క్వచిత్, అభంగుర, గూఢ గతిః = ఒకప్పుడు ఆగిపోనట్టి, కనబడని (రహస్యమైన) ప్రవాహం కల్గినట్టి; భవతీ = నీవు; సరస్వతీ, ఇవ = సరస్వతీ నదివలె; అభిముఖ భావ సంపత్+ అభిసంభవినాం = ఆభి ముఖ్యమనే సంపదకు అనుకూలమైన పుట్టుకను కలిగినట్టి; భవినాం = సంసారులకు, అఘం = పాపాన్ని; అప్రతిఘం = అడ్డు లేకుండా; సపది = ఆక్షణం లోనే; శమయతి = పోగొడుతున్నావు.

తా: ఓ దయాదేవీ! కనబడినా, కనబడకున్నా ఆగకుండా శుద్ధ జలాన్ని ప్రవహింప జేసే అంతర్యామినియైన సరస్వతీ నదివలె నిష్కపటమైన ప్రేమ గల నీవు, నిన్నాశ్రయించే అభిలాషగల మంచి జన్మను పొందిన సంసారుల యొక్క పాపాన్ని అడ్డులేకుండా పోగొట్టుతున్నావు.

వ్యాఖ్య: దయాదేవి సరస్వతీ నదితో పోల్చబడినది.

గత శ్లోకం ధన ప్రసక్తితో ముగిసింది. ఈ శ్లోకం సంపద అనే విషయంతో

మొదలవుతున్నది. శరణం పొందిన అకించనుణ్ని - నిర్ధనుణ్ని - దయాదేవి నిత్యధనవంతునిగా చేసింది. దయాదేవిని ఆశ్రయించిన వారికి ఒకానొకప్పుడు కష్టాలు రాకమానవు కదా! సంపద కలిగిననాడు దేవుని దయ కలిగినదని, ఆపద సంభవించినప్పుడు దేవుని దయ లేదని లోకం భావిస్తుంది. ఇలా భావించడం సముచితం కాదు. దేవుని దయకు పక్షపాత బుద్ధి లేదు. అందరియందు అన్ని వేళల్లో దేవుని దయ శుభ్రంగా ప్రసరిస్తూనే ఉంటుంది. అది ఉన్నట్లు కనబడక పోయినా, అంటే మనకు హితం - మేలు - జేయడానికే కష్టాలను కలిగించి నంత మాత్రాన దయా ప్రవాహం ఆగిపోయిందనుకోకూడదు. దయాదేవి గూఢంగా - మనకు తెలియకుండా అనుగ్రహిస్తూనే ఉంటుంది.

"విపదో నైవ విపదః, సంపదో నైవ సంపదః ।
విపత్ విస్మరణం విష్ణోః, సంపత్ తస్యైవ సం స్మృతిః ॥"

ఆపదలు ఆపదలూ కావు, సంపదలు సంపదలూ కావు. భగవంతుణ్ని స్మరించక ధ్యానించక ఉండడమే ఆపద. ఆయనను స్మరిస్తూ ఉండడమే నిజమైన సంపద కదా!

అభిముఖభావ సంపద భి సంభవినాం భవినాం:- ద్వేషించక అటువైపు ముఖం పెట్టి నిలిచి ఉండడమే అభిముఖభావం. దీన్నే ఆభిముఖ్యమంటారు. అద్వేషం, ఆభిముఖ్యమే సంపత్తు. ఈ లక్షణం దైవీ సంపత్తు అనబడుతుంది.

"దైవీసంపద్విమోక్షాయ, నిబంధా యాసురీమతా ।
మాశుచః సంపదం దైవీ మభిజాతోఽసిపాండవ॥" (భ.గీ. 16-5)

దైవలక్షణంతో పుట్టినవారు కొందరు, అసుర లక్షణాలతో జన్మించినవారు కొందఱు; ఈ సంసారంలో మానవులు రెండు విధాలుగా ఉన్నారు. 'అర్జునా! దైవీ సంపద ముక్తిదాయకం. ఆసురీ సంపద బంధహేతువు. నీవు దైవీసంపదతో పుట్టిన వాడవు. కాబట్టి, శోకించకు' మన్న గీతోపదేశం స్మరింపదగినది. "బ్రహ్మలోక మభిసంభవాని" (ఛాం.ఉ.) 'భవులు' అంటే జన్మకలవారు సంసారులు అని అర్థం.

దయాదేవి యందు శరణం కోరే స్వభావం కల్గిన సంసారులకు ఫలం సిద్ధిస్తుందని (శ్లోకంలోని ప్రథమ పంక్తి యొక్క) సారాంశం.

విమలరసావహా సరస్వతీవ:- సరస్వతీ నది పరిశుద్ధ జలంతో ప్రవహిస్తుంది. దయాదేవి నిష్కపటమైన ప్రేమతో సర్వదేశ దశాకాలాల్లోనూ హితకార్యాన్నే చేస్తుంది. అతిప్రసన్నయై, హితరూప రసావహ యైనది దయాసరస్వతి. నిందించినా నిందించ కున్నా జనులకు మేలు మాత్రమే చేస్తుంది.

క్వచిదుపలక్షితా క్వచిదభంగుర గూఢగతిః:- సరస్వతీ నది యొక్క తీర్థ ప్రవాహం కొన్ని చోట్ల కొన్ని సమయాల్లో కనబడుతుంది. కొన్ని వేళల్లో కొన్ని ప్రదేశాల్లో కనబడకుండా భూమిలోపలనే ప్రవహిస్తుంది. యమున, గంగ, సరస్వతి అనే మూడు నదుల తీర్థ ప్రవాహాలు కలిసే చోటు "త్రివేణీ సంగమం' అని ప్రసిద్ధ తీర్థ స్థలం. అక్కడ గంగా యమునా సరస్వతీ నదుల జలప్రవాహాలు, మూడు పాయలతో జడ అల్లుతున్నట్లు, మనోహరంగా ప్రవహిస్తుండే దర్శనీయ స్థలం. కాబట్టి, సరస్వతి గూఢమైన, అంతర్వాహిని కదా!

దయాదేవి యొక్క స్నేహరసం మన జీవితం ప్రియంగా సాగుతున్నప్పుడు చక్కగా ప్రసరిస్తున్నట్లు కనబడుతుంది. మన జీవితం అనిష్టంగా, అప్రియంగా సాగుతుంటే దయ ప్రసరిస్తున్నట్లు కనబడదు కదా! కాని కష్టాలలో కూడా దయాదేవి హితమాచరిస్తూనే ఉంటుంది. పరహితప్రావణ్యమే దయా స్వభావం.

సపది శమయ త్యఘ మప్రతిఘమ్:- గత శ్లోకంలో 'అచిరాత్' అన్నట్లే ఇక్కడ 'సపది' శబ్దం ప్రయుక్తం. ప్రాణుల యందు హిత మతియైన దయాదేవి తన యందు ఆభిముఖ్యం కలవారికి వెంటనే శ్రేయః ప్రాప్తికి అడ్డుతగిలే క్రూర పాపరాశిని సరస్వతీ నదివలె అప్రతిహతంగా నశింపజేస్తుంది. ఉపమాలంకారం 'ఛేకానుప్రాస' శబ్దాలంకారం.

చం॥ పటు భవశక్తి నీయెడను పాసన బుద్ధులు గల్గువారి కు
త్కట రసపూర్ణయై యొకటగాన కరాకయు నొక్కచోట బ్ర
స్ఫుట ముగ జూడబోలియు న మోఘుపుభంగుల నా సరస్వతీ
తటిని క్రియన్ స్రవించి దురితంబులు వే దొలగింపవే దయా! ॥

53. అపికరుణే! జనస్య తరుణేందు విభూషణతా
మపి కమలాసనత్వ మపి ధామవృషాద్రిపతేః।

తరతమతావశేన తనుతే ననుతేవితతిః
పరహితవర్ష్మణా పరిపచేళిమకేళిమతీ ॥

అర్థం: కరుణే = ఓ దయాదేవీ! పరహిత వర్ష్మణా = పరహిత మనే రూపం చేత; పరిపచేళిమ కేళిమతీ = పరిపక్వం చెందిన లీలలు కలిగిన; తే = నీ యొక్క; వితతిః = విస్తృతి (వ్యాపారం); జనస్య = (ఆశ్రయించిన) జనానికి; తరుణ+ఇందు, విభూషణతాం, అపి = బాలచంద్రుణ్ని ఆభరణంగా ధరించిన శివుని యొక్క స్థానాన్ని, కమలాసనత్వం, అపి = కమలాన్ని ఆసనంగా గల నలువయొక్క స్థానాన్ని; వృషాద్రిపతేః = శ్రీనివాసుని యొక్క; ధామ, అపి = స్థానాన్ని కూడా; తరతమతా వశేన = తారతమ్య వశం చేత; తనుతే, నను = ఇవ్వడం లేదా! నిశ్చయంగా ఇస్తున్నావు.

తా: ఓ కరుణాదేవీ! పరహిత మనేదే నీ శరీరం. దానిచే, పరిణతి చెందిన లీల కలది నీ విస్తృతి. అందువల్ల, ఆశ్రయించిన భక్తుల పూర్వ కర్మానుగుణంగా చేసే ప్రార్థనలను బట్టి, వారికి శివ పదవిని, బ్రహ్మ పదవిని, విష్ణుపదవిని కూడా ఇస్తున్నావు కదా!

వ్యాఖ్య: దయాదేవి సకల పురుషార్థ ప్రదాత్రిగా సుశ్లోకితం.

గత శ్లోకంలో దయా సరస్వతి, హితరూప రసవాహినిగా వర్ణింపబడింది. ఈ శ్లోకమందు దయా ప్రవాహం పరహితాచరణ రూపంగా ఉంటుందని స్తుతింప బడుతున్నది. 'హిత' మంటే విశిష్టాద్వైత సంప్రదాయమందు విశేషార్థముంది. మోక్షానికి సాధనంగా అనుష్ఠించే ఉపాయమే 'హితం'. ఇది భక్తి, ప్రపత్తి అని రెండు విధాలుగా ఉంది. భక్తియోగం కర్మజ్ఞానాద్యం గాలతో కూడి యుండేది. కాబట్టి అనుష్ఠించడం చాలా కష్టం. పైగా, మోక్షం పొందే దాకా అనుష్ఠిస్తూ ఉండాలి. చిరకాల సాధ్యమైనందువల్ల దీన్ని ఆచరించే శక్తిలేని వారికి ప్రపత్తిని మోక్షోపాయంగా అనుష్ఠించడం సులభం.

ప్రపత్తినే శరణాగతి, న్యాసం, భరసమర్పణం - అంటారు. ఒక్కసారి అనుష్ఠిస్తే చాలు, ఫలం సిద్ధిస్తుంది. ప్రపత్తిని స్వయంగా ఆచరించి, ప్రకటించడం ఆచార్య

కృత్యం. భక్తి ప్రపత్తులు రెండూ ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాలనూ ఇస్తాయి.

పరహిత వర్ష్మణా పరిపచేళిమకేళిమతీ తే వితతిః:- 'వర్ష్మ' పదానికి శరీరమని అర్థం. దయాదేవి ఆశ్రితులకు హితమాచరించడమే శరీరంగా కలది. ఆ రూపం చేత పరిపక్వమైనదే లీల. ఆ కేళియే దయ యొక్క విస్తారమైన వ్యాపారం. దయాదేవి నదీ ప్రవాహం కదా! ప్రవాహం పెరుగడం వల్ల అలలు విస్తారంగా విజృంభించిడమే క్రీడ. 'దయా తరంగమాల అనేదే 'దయావితతి'. ఈ విస్తృతికీ - వ్యాపారానికీ అవధి లేదు. భక్తులు కోరినవన్నీ ఇవ్వడమే పరహిత రూపయైన దయ యొక్క లీల. "పరహితమనుకంపే! భావయంత్యాం భవత్యాం" (శ్లో. 36) అని వర్ణితమే.

అపికరుణే! జనస్య తరుణేందు విభూషణతామ్:- భక్తుడు కోరడమే ఆలస్యం, అతని కోరికను లీలగా తీర్చుతుంది దయాదేవి. శివ పదవి కోసం ప్రార్థించినా, ఆ పదవిని అతనికి కేటాయించడమే లీల.

"గుణదోషౌ బుధో గృహ్ణన్ ఇందుః క్ష్వేళా వివేశ్వరః ।
శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి ॥

పరమశివుడు గుణ దోషాలను రెండింటినీ గ్రహించాడు. బాలచంద్రునిలో ఆహ్లాద పరచే సౌమ్యగుణముంది. కాబట్టి చంద్రుణ్ని శిరస్సున అలంకరించు కొన్నాడు. ఉసురుదీసే దోషమున్న విషాన్ని (మ్రింగక) కంఠమందే కట్టడిగా నిలిపాడు. మంచి చెడులను సమభావంతో స్వీకరించిన దయా స్వభావుడు బాలేందుశేఖరుడు. ఇట్టి శివత్వాన్ని పొందడం దుర్లభం కదా!

అపికమలాసనత్వమపిధామ వృషాద్రిపతేః:- విష్ణువు యొక్క నాభీ కమల మందు ఉద్భవించి, దానియందే స్థిరంగా ఉన్న భాగ్యం గల చతుర్ముఖ బ్రహ్మత్వాన్ని పొందడం దుర్లభతరం. 'ధామన్' శబ్దానికి ఇక్కడ స్థానం అని అర్థం. 'వృషాద్రి పతేః ధామాపి' అంటే శ్రీనివాసుని స్థానం. "తద్విష్ణోః పరమం పదమ్" - మోక్ష సామ్రాజ్యమనే పరమ పదాన్ని పొందడం దుర్లభ తమం.

దయాలీల, దాని వితతి (విస్తృతి) తరతమ భావంతో ('తను-విస్తారే') విస్తరించిన రీతిని పూర్వార్ధం ప్రకటిస్తున్నది. ఆశ్రితుల గుణవృత్తుల, కోరికల తారతమ్యాన్ని బట్టి, వారి అపేక్షాని కనుగుణంగా దుర్లభమైన శివత్వాన్ని ప్రసాదించడం వల్ల దయ యొక్క లీలామహత్తు ప్రకటితమవుతున్నది. దుర్లభతరమైన చతుర్ముఖ స్థాయిని ప్రసాదించడం మహత్తమమైన లీల కదా! ఇక దుర్లభతమమైన, నిస్సమాభ్యధికమైన విష్ణు పదవిని కూడా అనుగ్రహించడం మహత్తమమైన లీలను విశదీకరిస్తున్నది. ఉత్తరార్ధంలో ఛేకాను ప్రాసాలంకారం. ఇలాగా, తరతమ భావాలను సూచించడం పరికరాంకురమనే అలంకార లక్షణం. ఈ త్రిమూర్తుల స్థానాలు ఒకదానికంటె మరొకటి ఉత్కృష్టమైనవిగా వర్ణించడం వల్ల సారాలంకారం. మోక్ష ఫలాన్నే అనుగ్రహిస్తుంటే, త్రివర్గ ఫలాలను గూర్చి చెప్పేదేమి? అని కైముత్యన్యాయంగా సిద్ధించడం వల్ల కావ్యార్థా పత్త్యలంకారం. ముఖ్యంగా 'సంకరాలంకార సజ్జిత మీ శ్లోకం.

చం॥ పరహితమెట్టులౌనని కృపా! తలపోయుట నీకు కేళియై
పరగుట బ్రాణిజాత గుణ భంగులు వృత్తుల తారతమ్యముల్।
వరమతి జూచి వానికి శివత్త్వము నైన విధిత్త్వము నైన సు
స్థిరమగు శేష భూధర పతిత్త్వమునైన నొసంగు చుండవే॥

54. ధృత భువనా దయే! త్రివిధ గత్యనుకూల తరా
వృషగిరినాథ పాద పరిరంభవతీ భవతీ।
అవిదిత వైభవాऽపి సురసింధురివా తనుతే
సకృదవగాహ మాన మ పతాప మపాపమపి॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! ధృత భువనా = పోషింపబడిన లోకములను కలిగినట్టి / ధరింపబడిన నీరు కలిగినట్టి; త్రివిధగతి + అనుకూలతరా = మూడు విధాలైన గతులను కలుగజేసే యోగ్యురాలవైనట్టి / మూడు లోకాల యందు ప్రవహించుట చేత అనుకూలంగా ఉన్నట్టి; వృషగిరినాథ పాద పరిరంభవతీ = శ్రీనివాసుని పాదాల యొక్క సంశ్లేష కల్గినట్టి / పెద్ద కొండ చరియల యొక్క కౌగిలింత కల్గిన; భవతీ = నీవు; సురసింధుః, ఇవ = దేవనదియైన గంగ వలె;

అవిదిత వైభవా, అపి = తెలియబడని మహిమకలదానివైనప్పటికి; సకృత్ = ఒక్కసారి; అవగాహమానం = ఆశ్రయించిన వ్యక్తిని / స్నానం చేసిన ప్రాణిని అపతాపం=తాపం తొలగిన వానిగా; అపాపం, అపి = పాపం లేని వానినిగా కూడా; ఆతనుతే = చేస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! పెద్ద పర్వత సానువులందు దొరలుతూ పరిశుద్ధమైన తీర్థం చేత మూడు లోకాల యందు ప్రవహించి పవిత్రపరచే గంగానది వలె విష్ణు పాద సంశ్లేష కలిగి లోకాలను పోషిస్తూ త్రివిధ పురుషార్థాలకు అనుకూలమైన నీవు, నీ మహిమ తెలియకున్ననూ ఒక్కసారి ఆశ్రయిస్తున్న / స్నానం చేస్తున్న వ్యక్తిని తాపపాపాలు లేనివానిగా చేస్తున్నావు.

వ్యాఖ్య: దయాదేవికి గంగానదికి సామ్యం వర్ణితం.

అభిముఖ - 52 - శ్లోకమందు దయాదేవికి సరస్వతీ నదితో సాదృశ్యం వర్ణింపబడింది. ఈ శ్లోకమందు గంగానదితో సామ్యం చెప్పబడుతున్నది. సురసింధువు అని గంగను చెప్పినందువల్ల, త్రివిధ పదంచే త్రివేణిగా, త్రిపథగ స్ఫురిస్తున్నది. కాబట్టి, సరస్వతిని వర్ణించిన పిమ్మట గంగాయమునలను రెండింటిని వర్ణించడం ఆవశ్యకమని ద్యోతకమవుతున్నది. దానికి తగినట్లు విశేషణ పదాలు ప్రయోగింపబడినాయి. తర్వాత ఉన్న శ్లోకం కూడా ఇలాంటిదే.

ధృతభువనా:- గంగా నది జీవనది. యమునా నది గంగతో కలిసి ప్రవహిస్తుంది. జలసమృద్ధి కలది. 'భువన' శబ్దానికి ఇక్కడ 'నీరు' అని అర్థం. అమృతం జీవనం భువనం వనమ్' (అమరం) నీటిని ధరించినందువల్ల ప్రాణులు, ఓషధులు జీవిస్తున్నాయి. లోకాలను సర్వదా రక్షించేది దయాదేవి. లోకులను పోషించడమే దయాగుణ లక్షణం. 'భువన' శబ్దానికి లోకమని అర్థం. "జగతీ లోకోవిష్ట పం భువనం జగత్" (అమరం) పోషించడం, పాలించడమనే అధికారం చేత దయాదేవి లోకాలను ధరిస్తున్నదని అర్థం.

త్రివిధగత్యనుకూలతరా:- సురసింధువు - దేవనది. "గంగా విష్ణుపదీ జహ్నుతనయా సురనిమ్నగా" (అమరం). స్వర్గలోకం నుంచి భూలోకానికి చేరి,

భూలోకం నుంచి పవనాంధోలోకానికి ప్రవహించింది. కాబట్టి త్రివిధ గతులుకలది. స్వర్గ, మర్త్య, పాతాళలోకాలయందు ఒకదానికంటె మరో లోకమందు ఎక్కువ ఆనుకూల్యంతో ప్రవహిస్తుంది గంగానది.

దయాదేవి త్రివిధ గతులకు అనుకూలంగా ఉంటుంది. "ఐశ్వర్యమక్షర గతిం పరమం పదంవా" (శ్రీ గుణ రత్నకోశం) అన్నట్లు ఐశ్వర్యాన్ని కోరేవారికి ఐశ్వర్యాన్ని, కైవల్యార్థులకు కైవల్యాన్ని, మోక్షకాములకు మోక్షాన్ని ప్రసాదించడానికి సహాయ పడుతుంది. 'అనుకూల తరా' అని 'తరప్' ప్రత్యయం చేత భక్తి కంటె ప్రపత్తికి ఎక్కువ ఆనుకూల్యాన్ని ప్రదర్శించే స్వభావం కలది భగవద్దయ అని ద్యోతకమవు తున్నది.

వృషగిరినాథ పాద పరిరంభవతీ:– నదులు సామాన్యంగా పర్వతాల యందు ఉద్భవించి, తటప్రదేశాల నుంచి అంచెలంచెలుగా దూకుతూ – దొరలుతూ స్వాదు జలంతో ప్రవహిస్తాయి. వృషగిరి నాథుడు శ్రీనివాసుడే కదా! "విష్ణుః పర్వతానా మధిపతిః" అన్నది వేదవాణి. త్రివిక్రమావతారమందు విష్ణుమూర్తి యొక్క ఎడమ కాలు బొటన వ్రేలు నుంచి పొటమరించింది గంగ. విష్ణు పాదం నుంచి ఉద్గమించిన గంగ సర్వదా ఆపాదాన్ని సంశ్లేషించుకొని ఉంటుంధి. శ్రీకృష్ణావతారం లోనూ గోపికలతో జలక్రీడలాడుతున్నప్పుడు శ్రీకృష్ణుని పాద పరిరంభణం చేత యమునా నది హర్షాతిరేకంతో విజృంభించింది. "తూయ పెరునీర్ యమునై" (తిరుప్పావై). పరిరంభణం వల్ల, వారి గుండూషాదిజలం చేత అతి పవిత్రమైనది. గాఢావగాహనానికి అనుకూలంగా స్వచ్ఛ దివ్యోదక పూర్ణయై చెంగలించింది. "కృష్ణాన్వ యేన దధతీం యమునాను భావ్యం తీర్థైర్యథావదవగాహ్యా సరస్వతీం తే" (గోదా స్తుతి). అన్నట్లు దేశికుల వారి అభిప్రాయమిదే కదా!

శ్రీనివాసుని దయ పుట్టడానికి మొదటిస్థానం ఆయన పాద పద్మమే. పాదాలను ఆశ్రయించిన క్షణాన దయ ఊటలూరి హృదయాన్ని ఆర్ద్రీకరిస్తూ, ముఖాన్ని ప్రసన్నం చేసి కనుకొలకులలో నుంచి ప్రసరిస్తుంది దయ, విశేషమేమిటంటే, సురసింధువు నిమ్నగ అయితే, దయాసింధువు పాద పరిరంభణం కల్గియుండడం వల్ల 'ఊర్ధ్వగ' యై ఉపకరిస్తున్నది.

"రూఢా వృషాచలపతేః పాదే" (19) అని దయాదేవి కీర్తింప బడింది కదా! పాదాల యందు నమ్రులైన వారి తాపం చేత పైకి వ్యాపించిన భగవంతుని దయ ఆయన కటాక్ష వీక్షణాల ద్వారా నమ్రులైన వారి యందు క్రమంగా ప్రసరించి, వారికి ఊర్ధ్వ గతిని కల్పిస్తుందని స్ఫురించడం వల్ల శ్రీనివాసుని పాద పరిరంభవతి అనే పద ప్రయోగం రమణీయం కదా!

అవిదిత వైభవాऽపి సురసింధురివాతనుతే,

సకృదవగాహమాన మపతాప మపాపమపి :- సురసింధువు యొక్క మహిమ అందు స్నానం చేసే వానికి తెలియకున్నా, తాపం చల్లారిన అనుభవం వానికి అవశ్యంగా కలుగుతుంది. అలాగే పాపం కూడా తొలగి పరిశుద్ధుడవుతాడు. 'త్రిపథగ' లో స్నానం చేస్తే, తాపత్రయమూ, పాపమూ పోతుంది. దయాదేవి యొక్క వైభవం తెలియకున్నప్పటికీ ఆర్తుడు, ఒక్కసారి శరణాగతి చేసిన వెంటనే, ఆమె అప్రపన్నుణ్ని ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవికాలనబడే తాపత్రయం లేని వానిగా చేస్తుంది. దుర్నివారమైన పాపాలు లేనివానిగాను చేస్తుంది. నిప్పు గొప్పతనం తెలియనవసరం లేదు. నిప్పు అని తెల్వక ముట్టిన వాణ్ని కూడా దహించడమే దాని స్వభావం. ఒక్కసారి ఆశ్రయించిన వాణ్ని తాప పాపాల నుంచి కాపాడడమే దయా స్వభావం.

"ఇతి తవ సూరయ స్త్ర్యధిపతే ऽఖిల లోక మల క్షపణకథామృతాబ్ధి మవగాహ్య తపాంసి జహుః" (భా.గ. 10-87-17) సకల లోకుల పాపాలను పోగొట్టే భగవానుని కథలు అనే అమృత సముద్రంలో మునిగి పానం చేసిన వివేక వంతులకు తాపత్రయం విడిపోతుంది, అనే 'శ్రుతిగీత' స్మరణీయం.

ఒక్కసారి ప్రపత్తి చేసినంత మాత్రాన సర్వఫలాలను ఇచ్చే ప్రపత్తి వైభవం శ్రుతిగీతలో చెప్పబడింది.

భువి పురుపుణ్య తీర్థ సదనాన్యృషయో విమదా
స్త ఉత భవత్పదాంబుజ హృదో ऽఘభిదంఘ్రి జలాః।
దధతి సకృన్మనస్త్వయి య ఆత్మని నిత్యసుఖే

నపున రుపాసతే పురుషసార హరావసథాన్ ॥ (భాగ. 10-87-36)

భగవానుని చరణామృత సింధువులో ఒక్కసారి మునిగి, భగవల్లీలా కథామృతాన్ని పానంచేసిన మహానుభావులు తాపత్రయ రహితులవుతారు. ధన, విద్యా, ఆభిజాత్యమదాలు లేనివార్రై, భూమండలాన్ని పవిత్రం చేసే పుణ్య తీర్థాలు వారే. పరమహంసలు వారే. ఎందుకు? అంటే, వారు తమ హృదయమందు భగవత్పాదార విందాలను నిల్పుకొని సర్వదా ధ్యానం చేస్తుంటారు. నిత్యానంద స్వరూపుడైన పరమాత్మ యందు ఒక్కసారైనా మనస్సును నిల్పి ఉపాసించినవారు లేదా ఆత్మను సమర్పించినవారు గేహమందు, దేహమందు అనురాగాన్ని వీడి, భోగాసక్తి లేనివారై ఉంటారని శ్రుతులు భగవానుణ్ని స్తుతించిన రీతిని ఈ శ్లోకం స్మరింపజేస్తున్నది. 'ఛేకానుప్రాస' అనే శబ్దాలంకారం. శ్లేషాను ప్రాణితో పమాలంకార సజ్జిత మీ శ్లోకం.

చం॥ అనయము మూడు సద్గతుల యందనుకూలపు వృత్తి దాల్చి యం
జనగిరినాథ పాద జలజంబుల సంగతి నిత్యధన్యవై
ఘన భువనోద్ధతిన్ త్రిపథగా నది బోలి శ్రితాళి కేక మ
జ్జనమున దాపమున్ దురిత సంతతియున్ తొలగింపవే దయా!

55. నిగమ సమాశ్రితా నిఖిల లోక సమృద్ధికరీ
భజదఘకూల ముద్రుజ గతిః పరితప్త హితా ।
ప్రకటిత హంసమత్స్య కమఠా ద్యవతారశతా
విబుధ సరిత్త్రియం వృషగిరీశదయే! వహసి ॥

అర్థం: హే వృషగిరీశదయే! (సంబుద్ధ్యంత పదమిది) నిగమ సమాశ్రితా = వేదాలచే సేవింపబడినట్టి / శ్రుతులచే ప్రతిపాదిత మైనట్టి; నిఖిల లోక సమృద్ధికరీ = సకల జనులకు సమృద్ధిని కలుగజేయునట్టి / లోకత్రయ నివాసులకు సమృద్ధిని కలిగించునట్టి; భజత్ + అఘకూలం, ఉద్రుజ గతిః = భజించేవారి పాపరాశిని నిర్మూలించే గమనం కలిగినట్టి / సేవించేవారి పాపమనే ఒడ్డును పెకలించే తీవ్ర వేగం కలిగినట్టి; పరితప్తహితా = తాపం చెందిన వారికి మేలు చేయునట్టి; ప్రకటిత

హంసమత్స్య కమఠ + ఆది + అవతారశతా = ప్రకటింపబడిన హంస, మత్స్య, కూర్మాది అనేక భగవదవతారాలు గల్గిన / స్పష్టంగా కనబడే అంచలు, చేపలు, తాబేళ్ళు మొదలైన జలచరాలున్న రేవులు చాలా కల్గిన; (నీవు); విబుధసరిత్ + శ్రియం= దేవనదియైన గంగ యొక్క శోభను; వహసి = వహిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! గంగా ప్రభావం లాగా నీ ప్రభావం వేద విహితమైనది. లోకసమృద్ధిని కల్గిస్తూ, గంగవలె ఆశ్రితుల పాపమనే ఒడ్డును కూల్చే గమనవతివి. తాపం కలవారికి ప్రశాంతిని కలిగిస్తావు. హంసలు చేపలు తాబేళ్ళు మొదలైన నీటి జంతువులు గల గంగానదికి పలురేవులున్నట్లే, భగవదవతారాల నెన్నింటినో నీ విషయంగా కలిగియున్న దానవు. దేవనది యొక్క పరమ శోభను నీవు వహిస్తున్నావు.

వ్యాఖ్య: దయా ప్రభావం గంగా ప్రభావ సదృశమని వర్ణితం.

గత శ్లోకంలో గంగా యమునలతో దయాదేవికి సామ్యం చెప్పబడింది. ఈ శ్లోకం, కేవలం దేవనదీమహిమ దయాదేవికీ కలదని కీర్తిస్తున్నది. ప్రపత్తి దశయందు దయా ప్రవాహ మహిమ చాలా సమంజసంగా ప్రస్తుతింప బడింది.

నిగమసమాశ్రితా:- దేశికులు 'అధికరణ సారావళి' యందు "మోక్షాకాంక్షీ 'ప్రపద్యే శరణమహ' మితిక్వాపి మంత్రే శ్రుతంచ" అన్నారు.

"ఇమంమే గంగే యమునే సరస్వతి" అనీ "హిరణ్య శృంగం వరుణం ప్రపద్యే తీర్థం మేదేహి యాచితః" అనీ గంగానదిని, జలాధిపతి యైన వరుణ దేవుణ్ణి వేదాలు ప్రస్తుతించాయి.

అలాగే, ముముక్షువులు భగవత్కృపా పాత్రులవడానికి శరణు వేడే రీతిని వేదాలు ప్రతిపాదించాయి. "ప్రయతపాణిః శరణం ప్రపద్యే స్వస్తి సంబాధేష్వ భయం నోఽస్తు" - చేతులు జోడించడం ఆకించన్యానికి గుర్తు. కాళ్ళు జోడించడం అగతికత్వానికి సంకేతం. కాబట్టి ముకుళిత హస్తుడనై అంజలి ఘటించి శరణాగతి చేస్తున్నాను, సంకటాలు కల్గినప్పుడు శుభమూ, మాకు అభయమూ కలుగు గాక' అని ఆర్తుడు ప్రార్థిస్తుంటాడు.

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున । ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ ॥ (భ.గీ. 7-16) ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! శుభకర్మల నాచరిస్తూ సుఖ సంపదలను కోరే అర్థార్థులు, శారీరిక మానసిక సంతాపాలకు గురియైన ఆర్తులు, ప్రాకృతిక విషయాల మీద ఆసక్తిని వీడి పారమార్థిక జ్ఞానాన్ని పొందగోరే జిజ్ఞాసువులు, భగవత్ప్రాప్తి కోసం పాటుపడే జ్ఞానులు ఈ నాల్గు రకాలైన భక్తులు నన్ను భజిస్తారు, అని గీతాచార్యులు ఉపదేశించారు కదా! ఇలాగా, గంగాదేవి, భగవద్దయ - ఉభయత్ర వేద, వేదాంత ప్రతిపాదితాలు.

నిఖిల లోక సమృద్ధికరీ:- గంగా ప్రవాహం, లోకాల్లో పాడిపంటల సమృద్ధిని కలిగిస్తుంది. అలాగే, దయా ప్రవాహం కూడా 'పునాత్వ ఘమర్షణః' అన్నట్లు జనులకు పాప నిబర్హణం చేసి పుణ్య సమృద్ధిని కలిగిస్తుంది. ఈ రెండు ప్రవాహాలు సర్వజనులకు అభ్యుదయాన్ని సమకూర్చడం ఆజానజం.

భజదఘకూలముద్రుజగతిః:- ప్రవాహ సమయంలో గంగ గట్టులను తెగగోసి, ఆ పైనున్న ప్రదేశాల్లో పారుతుంది. ఆ విధంగానే దయా ప్రవాహం, తనను సేవించే వారి పాపాలను ఉద్వేలంగా ప్రవహిస్తూ ముంచి వేస్తుంది. "అతిపాప్మాన మరాతింతరేమ" అని శ్రుతి పలికినట్లు, మోక్షోపాయానికి విరోధంగా నిల్చియున్న పాపపుణ్యాలనే కర్మప్రవాహాన్ని దాటిపోతామని తాత్పర్యం.

పరితప్తహితా:- గంగా ప్రవాహం తాపదగ్ధులకు సుఖాన్ని కలిగించినట్లే, దయాదేవి పశ్చాత్తప్తులకు ప్రశాంతిని కలిగిస్తుంది. "శరీరే జర్జరీ భూతే వ్యాధిగ్రస్తే కళేబరే। ఔషధం భాగీరథీతోయం, వైద్యోనారాయణో హరిః ॥"

ప్రకటిత హంసమత్స్య కమఠాద్యవతారశతా:- గంగా ప్రవాహాన్ని దాటడానికి అనేకమైన రేవులున్నాయి. ప్రవాహంలోకి దిగి స్నానం చేయదగిన ఘట్టాలు - ప్రదేశాలున్నాయి. ఆ పరీవాహ ప్రదేశాల్లో నిల్చి చూస్తే, తనలో నున్న హంసలు, చేపలు, తాబేళ్ళు మొదలైన జలజంతువులను గంగ స్పష్టంగా చూపిస్తుంది.

హంస మత్స్యాద్యవతారాలను దయాదేవియే శ్రీనివాసునికి కలుగజేస్తుంది. హంసావతారం, మత్స్యావతారం రెండూ నష్ట వేదాలను సంపాదించిన, జ్ఞాన

ప్రదాలైన అవతారాలు. కూర్మావతారం అమృతోద్భవ హేతువైన అవతారం. "ఋచః సామాని యజూగ్ంషి, సాహిశ్రీ రమృతా సతామ్" అని శ్రుతమవుతున్నది కదా!

'అవతారం' అంటే, దిగి తరింపజేసేది. 'శత' శబ్దం 'అనంత' మనే అర్థానికి ఉపలక్షణం. భగవానుని వివిధావతారాలన్నీ ఆయన దయాకార్యాలే కదా!

విబుధ సరిచ్ఛ్రియం వృషగిరీశదయే! వహసి:- "త్రిదశా విబుధాః సురాః" (అమరం) ధర్మశిఖరికి అధిపతిగా వేంచేసి యున్న శ్రీనివాసుని దయయే దేవనది యొక్క సొంపు, పెంపును వహిస్తున్నది. తదితరుల దయకు ఈ శోభ లేదని ఈ తురీయ చరణం, వక్ష్యమాణ శ్లోకానికి ఊతనిస్తున్నది. శ్లేషాను ప్రాణితమైన లుప్తోపమాలంకారం.

చం॥ బహువిధ వేద వాక్యనుత బంధుర వైభవయై, సమస్త లో
కహిత విధాన సంఘటన కారిణియై శ్రిత పాప భిద్ర సో
ద్వహయు ఝషాది భాస్వదవతార శతాఢ్యయునై సురాపగా
మహిమ వహించె దీవు గుణమాన్యదయా! జగదేకవందితా ॥

56. జగతి మితంపచా త్వదితరా తు దయే! తరళా
ఫలనియమోజితా భవతి సంతపనాయపునః।
త్వమిహ నిరంకుశ ప్రశకనాది విభూతిమతీ
వితరసి దేహినాం నిరవధిం వృషశైలనిధిమ్ ॥

అర్థం: హే దయే! ఓ దయాదేవీ! జగతి = లోకమందు; త్వత్+ఇతరా = నీకంటే (శ్రీనివాసుని దయకంటెను) వేరైన; దయా, తు = దయ అయితే; మితంపచా = స్వల్ప ఫలాలను ఇచ్చేదిగానూ; తరళా = చంచలమైనదిగానూ; ఫలనియమ + ఉజితా = నిశ్చయంగా ఫలమిస్తుంది అనే నియమం లేనిదిగానూ, సంతపనాయ, పునః = తాపత్రయాన్ని మళ్ళీ కలిగించేదిగానూ; భవతి = అవుతున్నది. నిరంకుశ, ప్రశకన + ఆది, విభూతిమతీ = అడ్డగించ వీలుకానట్టి శక్తి, స్వాతంత్ర్యం మొదలైన గుణాలను విభూతిగా కలిగియున్న; త్వం = నీవు, ఇహ = ఈ జగత్తునందు; దేహినాం = ప్రాణులకు (దేహం కలవారికి); నిరవధిం = అపరిమితమైన;

వృషశైలనిధిం = వేంకటాద్రి యందున్న (శ్రీనివాసుడనే) హిరణ్య నిధిని; వితరసి = ఇస్తున్నావు.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! ప్రపంచమందు నీ కంటే ఇతర దేవతల దయ అల్ప ఫలాలనే ఇస్తుంది. చంచలమైనవి కాబట్టి ఆ ఫలాలు అస్థిరమైనవి కదా! ఫలం తప్పనిసరిగా ఇచ్చే నియమమేదీ లేనిది. ఇతర దేవతల దయ మోక్ష ఫలాన్ని ప్రసాదించజాలదు కాబట్టి, ఆధ్యాత్మికాది తాపత్రయం శాశ్వతంగా విడిపోదు. నిరంకుశమైన, స్వతంత్రమైన నీ దయ మాత్రం తిరుమల యందున్న శ్రీ వేంకటేశ్వర స్వామిని అనుభవించదగిన తరుగని నిధిని ప్రసాదించగలదు.

వ్యాఖ్య: శ్రీనివాసుని దయకు, ఇతరుల దయకు తారతమ్యం వర్ణితం.

త్రిపథగయైన గంగా సామ్యం చేత శ్రీనివాసుని దయకు గల సర్వలోక సమృద్ధి కరమైన గుణాలు వర్ణింపబడినాయి. ఈ శ్లోకమందు ఇతరుల దయకు గల కొఱత, శ్రీనివాసుని దయకు గల పూర్తి నిరూపింపబడుతున్నది.

జగతిమితం పచాత్వదితరాతు:- ప్రపంచంలో శ్రీనివాసుని దయకంటె ఇతరులైన బ్రహ్మరుద్రేంద్రాది ద్దేవతలయొక్క, నరపతుల యొక్క దయకు గల శక్తి పరిమితమైనదే కాబట్టి, వారి దయచేత లభించే ఫలాలు స్వల్పమైనవిగా ఉంటాయి. అంతే కాదు.

తరళా:- ఆ ఫలాలు కూడా స్థిరమైనవి కావు. ఆ దయ నశ్వరమైనదే. దేవతాంతరులను ఉపాసించినందువలన వారికి దయ కలిగినప్పటికీ వారి దయ చేత ప్రాణులకు ఫలం లభించడానికి ముందే, వారూ నశిస్తే, వారి దయ కూడా నశిస్తుంది. కాబట్టి, ఇతర దేవతల, నరపతుల దయ చంచలమైనది క్షణభంగుర మైనది.

ఫలనియమోజితా:- నిష్కర్షగా ఫలమిచ్చి తీరవలెననే నమ్మకం లేనిది ఇతరుల దయ. స్వల్ప, అస్థిర ఫలాలను ఇవ్వవచ్చు, ఇవ్వకపోవచ్చును. ఫలమిచ్చినా, తిరిగి పుచ్చుకోవచ్చును. వారు అనుకూలురై ఉన్ననాడు వారికి దయ పుట్టుతుంది; ప్రతికూలురైన నాడు వారి దయ నశించి విపరీత ఫలాన్ని ఇచ్చే కోపం

ఉదయిస్తుంది. ఒకవేళ వారి దయచేత ఫలాన్ని పొందినప్పటికీ ఆ ఫలం శాశ్వతంగా, అపరిచ్ఛిన్నంగా ఉండనేరదు. నియమ శూన్యమైన ఫలం కలది ఇతరుల దయ, అని భావం.

పునః సంతపనాయ భవతి:- ఒకవేళ లభించిన స్వల్పఫలం ముగిసి పోతే, మళ్ళీ సంసారతా పత్రయం దేహధారులను పీడిస్తుంది. తుదకు, ప్రాణులకు దుఃఖాన్నే అనుభవింపజేస్తుందికదా!

ఈ శ్లోకంలోని పూర్వార్ధం, భగవద్దయకు భిన్నమైన (దేవతల) దయ మితమూ అస్థిరమూ అని చెప్పింది.

ఇక, ఉత్తరార్ధం శ్రీనివాసుని దయ మాత్రం అపరిమితమైనదని చెబుతున్నది.

నిరంకుశ ప్రశకనాది విభూతిమతీ, త్వం:- అడ్డులేని ప్రకృష్టమైన శక్తి, బలం, ఐశ్వర్యం, స్వాతంత్ర్యం మొదలైన గుణాల వైభవం గలది శ్రీనివాస దయ. అంటే, సాక్షాత్తుగా శ్రీనివాసునికి సంబంధించిన, గుణ సార్వభౌమియైన దయాదేవి ఆశ్రిత పక్షపాతం కలిగియున్నట్లు ఖ్యాతి గాంచినది. జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్యాది గుణ సంపత్తు గల శ్రీనివాసుని దయా మహిమ పదవ (10) శ్లోక మందు చెప్పబడింది కదా!

ఇహదేహినాం నిరవధిం వృషశైల నిధిం వితరసి:- ఈ సంసారమండలమందే దేహవంతులకే - నరులకే కాదు, ఆశ్రయించిన సర్వజీవులకు ఎంత అనుభవించినా, తరిగిపోయే ప్రసంగమే లేని, శాశ్వతమైన నిధి అనబడే శ్రీనివాసుణ్ణిపొంది నిత్య కైంకర్య రూపమైన రసాన్ని అనుభవింప జేస్తున్నది దయాదేవి.

ఉపనిషత్తులు శ్రీనివాస భగవానుణ్ణి హిరణ్య నిధియని ప్రశంసించాయి కదా! 'నిధి' అంటే భగవత్పాద పద్మమే. 'దేహినాం' అనడం వల్ల సర్వాధికారత్వం సూచింపబడింది. ఆత్మ సమర్పణం చేసిన ప్రపన్నునికి భగవానుడు దయ చేత సమర్పింపబడుతాడు.

"య ఆత్మదా బలదా" అని శ్రుతి. "స్మరతః పాదకమల మాత్మానమపి యచ్ఛతి" శ్రీనివాసుడు తనను తైలధారవలె ఎడతెగకుండా, నిత్యం స్మరించే భక్తునికి

తన పాదారవింద యుగళినే కాదు, తనను కూడా సమర్పించుకొంటాడు. ఈ నిరవధియైన నిధియొక్క లాభం చేత అతి కృపణుడు కూడా నిత్య ధనవంతుడవుతాడు. "అవ్వరుళల్లన్ అరుళుమల్ల" ఇతర దేవతల దయ ముఖ్యంగా దయ కానే కాదు, అన్నారు నమ్మాళ్వార్లు.

మోక్షం పొందగోరి ప్రపత్తిని అనుష్ఠించే వ్యక్తి, శ్రీనివాసుని దయకూ, దేవతాంతరుల దయకూ ఉన్న తారతమ్యాన్ని గ్రహించి, తిరుమల శ్రీనివాసుని యందు మహా విశ్వాసముంచి ప్రార్థిస్తే అవశ్యంగా ప్రేయః శ్రేయస్సులను పొందుతాడనడం నిర్వివాదాంశం.

దయాదేవి శ్రీనివాస నిధిని ఆశ్రితులకు వితరణ చేస్తుందనే విషయాన్ని, దయ 'నిరంకుశ ప్రశకనాది విభూతిమతి' యని సమర్థించడం వల్ల కావ్యలింగాలంకారం. దయను ఇతర దయతో పోల్చి, ఉపమేయమై శ్రీనివాసుని దయను అధికంగా వర్ణించడం వల్ల 'వ్యతిరేకాలంకారం'.

చం॥ ఇలను త్వదన్య దైవతములిచ్చు ఫలంబులు కొద్ది, నశ్వరం
బులు, చపలంబులౌట తుది బొందగజేయు విషాదమున్ దయా
యలఘు గుణంబులందధికవై యసమాన విభూతి నొప్ప నీ
వెలమి వృషాచలేశ నిధి నియ్యవె మాకిట శాశ్వతంబుగన్ ॥

57. సకరుణ లౌకిక ప్రభు పరిగ్రహ నిగ్రహయోః
నియతి ముపాధిచక్ర పరివృత్తి పరంపరయా ।
వృషభ మహీధరేశ కరుణే! వితరంగ యతాం
శ్రుతి మిత సంపది త్వయి కథం భవితా విశయః ॥

అర్థం: వృషభ మహీధరేశ కరుణే = వృషాద్రీశుని దయాదేవీ! ఉపాధి చక్ర పరివృత్తి పరంపరయా = (ఆనుకూల్య, ప్రాతికూల్యాలు అనే) కారణచక్రం పదే పదే పరివర్తించడం చేత; సకరుణ లౌకిక ప్రభు, పరిగ్రహ నిగ్రహ యోః = దయాళువైన సామాన్య నరపతి యొక్క అనుగ్రహ నిగ్రహాల యొక్క; నియతిం = నియమాన్ని – వ్యవస్థను; వితరంగయతాం = నిశ్చయించే వారికి; శ్రుతిమిత సంపది

= వేదాలచే ప్రకటింపబడిన వైభవం కలిగిన; త్వయి = నీయందు; విశయః = సంశయం; కథం = ఎట్లు; భవితా = కలుగుతుంది? కలుగదు.

తా: ఓ తిరుమలేశుని దయాదేవీ! లోకంలో కారుణిక ప్రభువు సైతం తనకు అనుకూలంగా ఉండేవారి పట్ల దయను, ప్రతికూలంగా ఉండే వారి పట్ల కోపాన్ని చూపడం నియమమై యున్నదని సాక్షాత్తుగా చూచి నిశ్చయించే మాకు, వేదాల ప్రశంసించే వైభవం గల నీ (ఆశ్రిత పాలన) విషయమై సంశయం ఎలా కలుగుతుంది? సందేహమే కలుగదని తాత్పర్యం.

వ్యాఖ్య: దయాదేవి స్వరూపాన్ని బాగా పరిశీలించిన ప్రపన్నునికి ఆమె పట్ల మహా విశ్వాసమే కలుగుతుంది కాని సంశయమే కలుగదని వర్ణితం.

భగవద్దయను కాక ఇతరుల దయను ఆశ్రయించడం తెలివితక్కువ తనమనీ శ్రీనివాస దయయే ఆశ్రయించ తగినదని గత శ్లోకం వివరించింది. ఈ శ్లోకం, భగవద్దయను ఆశ్రయించే బుద్ధి కలిగినవారికి, వెంటనే దయాదేవి వారిని రక్షిస్తుందనే గొప్ప నమ్మకం కలుగుతుంది, సంశయమే లేదని కైముతిక న్యాయంగా తెల్పుతున్నది.

వృషభమహీధరేశ కరుణే:- వృషాద్రీశుని దయను సంబోధించే పదమిది. కాబట్టి, ధర్మచింతనను కలిగించేది దయాదేవి అని ధ్వనిస్తున్నది. "యథాలోకా మ్నాయమ్" అన్నట్లు, లోక ధర్మాన్ని అనుసరించి వైదిక ధర్మమందు దృఢమైన విశ్వాసం కలుగుతుంది. అంటే, విశ్వాస దార్ఢ్యం కోసం లౌకిక వైదిక సంప్రతిపత్తి ఆవశ్యకమని భావం.

ఉపాధి చక్రపరివృత్తి పరంపరయా:- 'ఉపాధి' అంటే ప్రయోజకం "ఉపాధిర్నా ధర్మచింతా" (అమరం) ధారక, పోషక, భోగ్యాసక్తికి కారణమని అర్థం. అనుగ్రహానికి ఉపాధి అనుకూలంగా ప్రవర్తించడం. నిగ్రహానికి ఉపాధి ప్రతికూలంగా ప్రవర్తించడం - అపరాధం చేయడమన్న మాట. ఈ ఆనుకూల్య ప్రాతికూల్యాలనే ఉపాధి, చక్రం లాగా మాటిమాటికి ప్రవర్తిస్తుంది.

సకరుణ లౌకిక ప్రభు పరిగ్రహ నిగ్రహయోః నియతిం:- ఈ ఉపాధి చక్రభ్రమణం చేతనే లోకంలో ఒక దయగల ప్రభువు యొక్క అనుగ్రహాన్ని,

నిగ్రహాన్ని పొందే నియమం కనబడుతుంటుండది. ఒక పౌరుడు ప్రభువు పట్ల అనుకూలుడై ఉన్నప్పుడు ఆ ప్రభువు యొక్క అనుగ్రహాన్ని పొందుతాడు, ప్రతికూలుడై ఉన్నప్పుడు నిగ్రహానికి గురి అవుతాడు. ఆనుకూల్య ప్రాతికూల్యాలను బట్టి, కరుణ గల రాజుకు అనుగ్రహ నిగ్రహాలు ఏర్పడడం సుస్పష్టం.

వితరంగయతామ్:- నిస్సంశయంగా నిశ్చయించే వారికి అని అర్థం. తరంగాలకు డోలాయితత్వం - ఉయ్యేలలాగా ఊగడం - స్వభావం కదా! సంశయ మంటే మనస్సు డోలాయమానంగా - ఒకసారి ఒక రకంగా ఆలోచించి, వెంటనే దానికి భిన్నంగా మరొక రకం ఆలోచించే విధంగా ఉండడమే 'తరంగత్వం' 'వితరంగత్వ' మంటే సంశయ డోలా శూన్యత్వం. మనస్సు ఇటు అటు ఊగులాడక స్థిరంగా ఉండడమన్న మాట. నిశ్చయస్థితిలో ఉన్న మనస్సు కలవారు 'వితరంగ యంతులు' 'వితరంగయ' చ్ఛబ్దం యొక్క షష్ఠీ విభక్తి బహువచనాంత (పద)మే "వితరంగయతామ్".

అనుకూల్యాన్ని కొద్దిగా ప్రదర్శిస్తే అనుగ్రహించే రీతిగా, కొద్ది అపరాధానికే దండన విధించే రాజు దుస్సేవ్యుడు. సకరుణ లౌకిక ప్రభువు కాబట్టి, ఏ మాత్రం అనుకూలంగా ప్రవర్తించని, మహా పరాధులనే దండిస్తుంటాడు. మహా పరాధియైనప్పటికీ కొద్దిగా ఆనుకూల్యాన్ని ప్రదర్శిస్తే రక్షించే స్వభావం లోకంలో కారుణికుడైన ప్రభువు నందుండే నియమాన్ని చూచి నిశ్చయించే వారికి వేదాలు స్తుతించే శ్రీనివాస దయాదేవి పట్ల అనుకూలుడై, అభిముఖుడై ఉంటే ఆమె అనుగ్రహాన్ని పొందే విషయంలో సందేహమెందుకు కలుగుతుంది? దయాదేవి అనుగ్రహాన్ని నిస్సంశయంగా పొందవచ్చును అనే విశ్వాసం ఏర్పడుతున్నది.

అనుకూలంగా ఉంటే దయ ప్రసరిస్తుంది. ప్రతికూలంగా ప్రవర్తిస్తే నిగ్రహ మేర్పడుతుంది అని ఈ శ్లోకంలో లోకస్వభావాన్ని ప్రదర్శించడం వల్ల 'ఆనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం' అనే ప్రపత్తి యొక్క అంగాలు ప్రబోధింపబడు తున్నాయి.

శ్రుతిమిత సంపది త్వయి:- దయాదేవి వేదాలచే ప్రస్తుతింపబడే వైభవం కలది. శ్రుతి 'ఆప్తతమ' యైనది. వేల తల్లిదండ్రుల కంటె వత్సల తరమైనది. 'భ్రమ,

ప్రమాదం, అశక్తి, వంచన' అనే నాలుగు దోషాలు లేకుండా హితాన్ని బోధించేది శ్రుతి. కర్ణాకర్ణికగా ప్రసరించిన వేదమే 'శ్రుతి'. వేదం ధర్మా ధర్మాలను తెలుపుతుంది. (విద్యేతే అనేన ధర్మా ధర్మావితి = వేదః).

వశ్చ, ఈశ్చ = వయౌ. వయౌదదా తీతి = వేదః. (అని వ్యుత్పత్తి). 'వకారం' అంటె అమృతం. 'ఈకారం' అంటే ఐశ్వర్యం. ఈ రెండింటిని ఇచ్చే భోగ మోక్ష ప్రదుడైన, సిద్ధోపాయ రూపవస్తువైన శ్రియః పతిని తెల్పేది వేదం.

"అథ ఋషయో దధు స్త్వయి మనో వచనాచరితం
కథ మయథా భవంతి భువి దత్త పదాని నృణామ్॥" (16)

నేల మీద కాలుమోపి నడిచే నరులు క్రింద పడరు కదా! అట్లే శ్రీనివాసుణ్ని త్రికరణశుద్ధిగా ఉపాసించే ధ్యానించే ఋషులు సంసారంలో పడరు.

"భవత ఉపాసతేఽ ంఘ్రి మభవం భువి విశ్వసితాః "(21)

'దేహమందు జీవాత్మలో అంగుష్ఠమాత్ర పురుషుణిగా వెలసియున్నాడు', అని వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థులైన తాపసులు, అంతర్యామియైన పరమాత్మ రూపాన్ని ఉపాసన చేస్తూ, తమకు సంసారబంధం ఉండదనీ, మోక్షమిస్తాడని దృఢంగా విశ్వసించి ఉన్నారు. ఈ విధంగా శ్రుతులు భగవంతుణ్ని స్తుతించాయి. (భాగవతం శ్రుతిగీతలు)

ఇట్టి శ్రుతిమితమైన అనుభావం కలిగియున్న శ్రీనివాస దయాదేవి, ప్రతికూలంగా ప్రవర్తించడానికి కారణమైన పాపాలను పోగొట్టి, అనుకూలురై ఉండే రీతిగా మనలను సంస్కరించి అనుగ్రహిస్తుందనే మహా విశ్వాసంతో దయాదేవిని శరణం పొందే వారికి, ఇక సంశయించే అవకాశమే కలుగదు. ప్రపత్తికి ముఖ్యాంగమైన మహా విశ్వాసమూ ఈ శ్లోకమందు వివక్షితం. 'కావ్యార్థాపత్తి' అలంకారమే కాక, దయా వైభవాన్ని చెప్పి అనుమాన రాహిత్యాన్ని సమర్థించడం చేత కావ్యలింగాలంకారమూ శోభిస్తున్నది.

చం॥ సదయ విభుండొకండు పటుశాత్రవులైచను నిగ్రహార్హులన్
గుదురుగ బ్రోచుచుండు ననుకూలత యించుక కల్గెనేని, ని

య్యది విదితంబు మాకగుట నాగమ సంస్తుత వత్సలత్వ సం
పద కడునొప్ప నీ యెడ కృపా! యనుమానమదేల కల్గెడున్ ॥

58. వృషగిరి కృష్ణమేఘ జనితాం జనితాపహరాం
త్వదభిమతిం సువృష్టి ముపజీవ్య నివృత్త తృషః
బహుషు జడాశయేషు బహుమానమపోహ్యా దయే !
నజహాతి సత్పథం జగతి చాతకవత్ కృతినః ॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! జగతి = లోకమందు; కృతినః = భాగ్యవంతులు; చాతక వత్ = చాతక పక్షుల వలె; వృషగిరి కృష్ణమేఘ జనితాం = వృషగిరి యందు ఉండే కృష్ణుడు అనే నల్లని మేఘంనుంచి ఉద్భవించినట్టి; జనితాప హరాం = జనన (మరణ) పరంపరచే కలిగే తాపాన్ని పోగొట్టునట్టి; త్వత్ + అభిమతం = నీ యభిమానం అనే; సువృష్టిం = మంచి వానను; ఉపజీవ్య = పొంది; నివృత్త తృషః = దప్పిలేనివారై; బహుషు = అనేకాలైన; జలాశయేషు = చెరువులయందు / జడాశయేషు = జడమతులయందు; బహుమానం = ఆదరాన్ని; అపోహ్యా = వదలి; సత్పథం = చుక్కల దారియైన ఆకాశాన్ని, సన్మార్గాన్ని న, జహాతి = వదలరు.

తా: ఓ దయాదేవీ! లోకంలో సుకృతాత్ములు, కేవలం వాన నీటినే త్రాగి వృద్ధిని పొందే చాతక పక్షుల లాగా, తిరుమల మీద వెలసియున్న శ్రీనివాసుడనే నీలమేఘం వర్షించునట్టి, జనన మరణ రూపమైన సంసార తాపాన్ని శమింప జేయునట్టి దయ అనే సువృష్టి చేత తృప్తిని పొందినవారై పలు జలాశయాలను ఆదరించక / జడాశయులైన ఇతర దేవతలను ఆశ్రయించక, సన్మార్గాన్ని / ఆకాశాన్ని వదలడం లేదు.

వ్యాఖ్య: ప్రపన్నులు చాతక పక్షుల వంటి వారని మనోజ్ఞమైన సాదృశ్యం వర్ణితం.

"ప్రపన్నశ్చాతకో యద్వత్" ప్రపన్నుడు కేవలం శ్రీనివాసుని దయ మీదనే ఆధారపడి ఉంటాడు. చాతక పక్షి వాన నీటినే త్రాగి జీవిస్తుంది. ఉష్ణమ్ శోషు

పరుకుం నీర్ తిన్నుం పెత్తి లైయుమెల్లాం కణ్ణన్” అన్నట్లు అన్నం, నీరు, తాంబూలం మొదలైన ధారక పోషక భోగ్య పదార్థాలన్నీ శ్రియః పతియైన సర్వేశ్వరుడే అని ఉజ్జీవించే వారు ప్రపన్నులు. చాతక పక్షి ముక్కుకు రంధ్రం ఉండడం వల్ల నేల మీద ఉండే మడుగులనీళ్ళని త్రాగితే అవి కడుపులోకి పోలేక ఛిద్రం నుంచి జారిపోతాయి కాబట్టి, ఆ పక్షి కేవలం వాన పడినప్పుడే ఆకాశాన నిల్చి, నోరు పైకి తెరచి వాన నీటిని త్రాగి జీవిస్తుంది. చాతకపక్షి జీవనం వర్ష జలం మీదనే ఆధారపడి ఉంటుంది. గత్యంతర హీనమైన చాతకం లాగా ప్రపన్నుడూ అనన్య గతికుడే.

జగతిచాతక వత్ కృతినః :- లోకంలో చాతక పక్షుల లాంటి వారు సుకృతులు. అది వారి భాగ్యమన్న మాట. భగవంతుని కృపా ప్రభావం కలిగిన దివ్యజ్ఞాన భక్తి ప్రపత్తి పరిమళ భాసురులు కాబట్టి, ప్రపన్నులకు ఉపాయం, ఉపేయం రెండూ శ్రియఃపతియే. ‘ఉపాయం’ అంటే, ఫలాన్ని పొందించే సాధనమని అర్థం. భక్తి ప్రపత్తులు. ‘ఉపేయం’ అంటే, పొంద దగిన ఫలమే. కైంకర్య రూప మోక్షఫలం. గత శ్లోకమందు అనుకూల్య ప్రాతికూల్యాలు అనే ప్రపత్తికి గల రెండు అంగాలు చెప్పబడినాయి. రక్షిస్తాడనే మహా విశ్వాసంతో గోప్తృత్వ వరణం - తన కోరికను విన్నపించుకోవడం; అలాగే కార్పణ్యం - (కృపణత్వం) నేనేమి లేనివాడను, కర్మజ్ఞాన భక్తులు కలవాడను కాను; ‘అకించనుడను’ అని గర్వం లేని రీతిగా, దయపుట్టునట్లు నైచ్యాన్ని అనుసంధించడమనే ప్రపత్తి యొక్క మరికొన్ని అంగాలను నేరుగా తెల్పక వాటిని ఆళ్వారుల పూర్వాచార్యుల ఆచరణల ద్వారా చెప్పుతున్నారు దేశికులు. ప్రపన్నులు తెలుసుకోదగిన విషయాలు కాబట్టి, శ్రీనివాసుని దయను శరణంగా పొందే పరమైకాంతులను చాతక పక్షితో పోల్చి, ప్రపత్త్యనుష్ఠాన విధానం తెల్పబడుతున్నది. ఇంతకుముందు 45వ శ్లోకమందు దయాదేవి మేఘ మాలగా చిత్రింపబడింది. ఈ శ్లోకమందు శ్రీనివాసుడే మేఘంగా చిత్రితుడయ్యాడు.

వృషగిరికృష్ణ మేఘజనితాం:- వృషాద్రి మీద ఉన్న కృష్ణుడనే నల్లని మేఘం నుంచి పుట్టింది దయావృష్టి.

శ్రీనివాసుడే వృషగిరి శిఖరాన్ని ఆనుకొని యున్న కృష్ణమేఘం. అయితే శ్రీదేవియే ఆ మేఘమందలి మెరుపు - విద్యుత్తు.

"మాభూదేవం పునరపిచ తే విద్యుతా విప్రయోగః" కవి కులగురువైన కాళిదాసు మేఘసందేశ మహాకావ్యమందు "ఓ మేఘమా! నీకు పత్నియైన విద్యుత్తు చేత ఎడబాటు కలుగకుండు గాక!" అని మేఘుని విషయమై మంగళాశాసనం చేశాడు.

శ్రీనివాసుడనే కృష్ణమేఘానికి లక్ష్మి అనే విద్యుత్తు – మెఱుపు చేత విప్రయోగం ఎప్పుడూ ఉండదు. కరుణాపూర్ణుడైన ఈ కృష్ణమేఘుడు సర్వదా చల్లని దయావృష్టినే వర్షిస్తాడు. నల్లని మబ్బు నుంచే కదా చల్లని వాన జనిస్తుంది.

జనితాపహరాం:- జనించిన ఆ దయా వృష్టి, జని తాపాన్ని వెంటనే తెలుసుకొని, జనుల యందు చాలా దయ కలిగి, జనన మరణాలు అనబడే సంసార తాపాన్ని పోగొడుతుంది. వాన వేడిమిని అపహరిస్తుంది. చాతక తాపం తీరుతుంది. "జను ర్జనన జన్మాని జనిరుత్పత్తి రుద్భవః" (అమరం). జని శబ్దానికి 'పుట్టుక' అని అర్థం. దయ అనే వాన మళ్ళీ జన్మనే లేకుండా చేస్తుంది. ప్రపన్నునికి పునర్జన్మ ఉండదని భావం.

త్వదభిమతం సువృష్టిం:- దయా దేవి యొక్క అభిమానమే చల్లని వృష్టి. దయావృష్టి అతి వృష్టి కాదు, అనావృష్టి కాదు. లోకులకు యోగక్షేమాలను కల్పించే సువృష్టి. చాతక పక్షులకు జీవనాధారమైన మంచి వాన అది.

"లక్ష్మీ విద్యుల్లలిత వపుషం తత్ర కారుణ్యపూర్ణం
మా భైషీ స్త్వం మరకత శిలా మేచకం వీక్ష్యమేఘమ్॥"

"ఓ హంసరాజమా! శోభించే మెఱుపుల చేత అందమైన శరీరమూ, మరకతమణిలాగా నీలవర్ణమూ కలిగియున్ననూ, కరుణా రసభరితమైన మేఘాన్ని చూచి నీవు భయపడవద్దు" అని దేశికులు హంస సందేశ కావ్యంలో సుశ్లోకించారు. "కరిశైల కృష్ణ జలదః కాంక్షాధికం వర్షతి" కంచి వరదరాజస్వామి అనే కృష్ణ మేఘం కోరిన దాని కంటె ఎక్కువగా వర్షిస్తుంది అని దేశికులు 'యతిరాజ సప్తతి' లో కీర్తించారు.

ముఖ్యంగా, భోజ మహారాజు అందంగా వర్ణించిన చంపు రామాయణంలోని శ్లోకం ఇక్కడ స్మరింపదగినది.

"సంతాపఘ్నం సకల జగతాం శార్ఙ్గచా పాభిరామం
లక్ష్మీ విద్యుల్లలిత మతసీ గుచ్ఛ సచ్ఛాయ కాయమ్ ।
వైకుంఠాఖ్యం మునిజన మనశ్చాతకానాం శరణ్యం
కారుణ్యాపం త్రిదశ పరిషత్కాల మేఘం దదర్శ ॥"

సకల లోకాల సంతాపాన్ని ఉపశమింపజేయునట్టి, శార్ఙ్గం అనే కోదండం చేత శోభించునట్టి, లక్ష్మీదేవి అనే మెరుపు చేత మనోజ్ఞమైనట్టి, అతసీ పుష్పస్త బకం యొక్క కాంతి వంటి కాంతి ఉన్న శరీరం కలిగినట్టి, తాపనుల చిత్తాలనే చాతక పక్షులకు శరణ్యుడైన, దయా జలం కల్గినట్టి, వైకుంఠ నామం కలిగిన, దేవ సభయందున్న నీలమేఘాన్ని చూచాడు అని తాత్పర్యం.

ఉపజీవ్య నివృత్తతృష్ణః- చాతకపక్షులు వాన నీటిని త్రాగి దప్పిదీరి తృప్తిని పొందాయి. అలాగే, ప్రపన్నులకూ తృణ్నివృత్తి దయా వృష్టి చేత కలిగింది. ఏ విషయమందైనా తృష్ణ లేనివారుండరు. దప్పి తీరిందనే ఫలం సిద్ధించిన తర్వాత దయా వృష్టిని మరువకుండా జీవిస్తూ వృద్ధి జెందుతుంటారు.

"నివృత్త తర్షై రుపగీయమానాత్" (భాగవతం 10-1-4)

శ్రీకృష్ణభగవానుడు ఉత్తమశ్లోకుడు. లోకులచే కీర్తింపదగిన వాడు. విషయతృష్ణ లేని ఋష్యాదుల చేతను గుణగానం చేయబడేవాడని శుకమహర్షి శ్రీసూక్తి.

'ఉపజీవ్య' అనే పదం చేత దప్పితీరిందని దయారసాన్ని ఆదరించక పోతే అన్యాయమనిస్తుంది. భగవత్కృపయే స్వయంగా ఫలం కాబట్టి, దప్పితీరినా, ఎల్లప్పుడు దయారసాన్ని పానం చేయడమే ప్రయోజనం. పిపాసతీరింది కాని 'అ పిపాస' అంకురించింది. స్వస్వరూపావిర్భావమనే బీజం మొలిచింది. 'నివృత్త తృషః ' అనే పదప్రయోగం వల్ల అపహతపాప్మా ద్యష్ట గుణాలలో 'అపిపాస' (ఒకటి) స్వరూప గుణం కాబట్టి అపిపాసాది గుణాష్టకం ఆవిర్భవించి, నిత్యసూరి బృందంతో చేరి 'తద్విప్రాసోవిపన్యవో జాగృవాంసః సమింధతే" అని శ్రుతి పలికినట్లు, జాగరూకులై పరమపదనాథుణ్ని 'హా ఉ హా ఉ హా ఉ" అని (సామగానంతో) స్తోత్రం చేస్తూ ప్రకాశిస్తుంటారని తెలుస్తున్నది. 'అపహతపా ప్మత్వాదులు' అంటే

(1) పాపపుణ్యాలు (2) ముదిమి (3) చావు (4) దుఃఖం (5) ఆకలి (6) దప్పి అనే హేయగుణాలు లేకపోవడం; (7) సత్యకామం (8) సత్యసంకల్పం అనే కల్యాణ గుణాలు కలుగడం అనే ఎనిమిది గుణాలు మోక్ష దశలో ముక్తపురుషునికి ఆవిర్భవిస్తాయని వేదాంత శాస్త్రం బోధిస్తుంది. దేశికులు ఈ గుణాష్టకాలను "పరిణమం త్యపవర్గ దశాంకురాః" అని సంకల్ప సూర్యోదయ నాటకంలో స్పష్టపరచారు కదా!

బహుషు జలాశయేషు బహుమానమపోహ్యః- చాతక పక్షులు, వాన నీరే వాటికి ఆలంబనం కాబట్టి, వానపడి నేల మీద నీరు నిండుగా నిల్చియున్న పలు సరస్సులను, తటాకాలను చూచినా, వాటిని గౌరవించవు, లక్ష్యపెట్టవు. 'లడలకు భేదం లేదు' కాబట్టి 'జడాశయేషు' అని పలుకదగును కదా! దయాదేవిని ఆశ్రయించిన ప్రపన్నులు వేరే దేవతలను ఆదరించరు. బ్రహ్మరుద్రాదులు తమను స్తోత్రం చేసిన - ఉపాసించిన - వారికి వెంటనే వరాలనిచ్చే ఆశుతోషులు. వారి నుంచి వరాలను పొందిన వారే తిరిగి వారిపైన దాడి చేస్తే ఎదిరించలేని శక్తి, యుక్తి దరిద్రులు. వారు తమ రక్షణ కోసం శ్రీ మహావిష్ణు సన్నిధిలో ప్రార్థన చేసి కృతార్థులవుతారు. "క్షుద్రా రుద్రపితామహః ప్రభృతయః కీటా స్సమస్తాస్సురాః" అన్నట్లు ఇతర దేవతలు భగవంతుని విభూతిలో కీటకప్రాయులు కాబట్టి 'జడాశయులు' అనబడినారు. వారూ, వారి లోకాలూ పునరావృత్తిని పొందడం నైసరిక్గమే కాబట్టి, పరబ్రహ్మానందానుభవమనే మోక్ష ఫల పురుషార్థాన్ని ఇచ్చే సమర్థులూ, స్వతంత్రులూ కారని ప్రపన్నులు ఇతర దేవతలను ఆశ్రయించరు, ఆరాధించరు. ఇంతకు ముందు బహు రసాశయాలతో పరిచయమున్నప్పటికీ శరణ్య శ్రీనివాసదయయే' అని విశ్వసించిన మహనీయులు ఇక వాటినన్నిటినీ వదలి వేస్తారు.

నజహాతి సత్పథం: చాతక పక్షులు ఆకాశాన విహరించునట్లే ప్రపన్నులు సన్మార్గగాములే సుమా. సత్పథమంటే నక్షత్ర మార్గం, అంటే ఆకాశమని అర్థం. సత్సంప్రదాయమైన వైదిక మార్గం నుంచి ఇంచుకంత నైనా తప్పుకొని నడువరు. ఆకాశమంటే 'పరబ్రహ్మ' అని అర్థముంది.

"ఆకాశ శరీరం బ్రహ్మ" ఖం బ్రహ్మ.. "సయ ఏషోఽ న్తర్హృదయ ఆకాశః" "తత్రాపి దభ్రం గగనం విశోకస్తస్మిన్యదన్త స్తదుపాసి తవ్యమ్" ఇత్యాది శ్రుతివాక్యాల ను బట్టి, గగన శబ్ద వాచ్యుడు పరబ్రహ్మ అని విశదమవుతున్నది. కాబట్టి ఆకాశాన్ని విడువక ఉంటారు. ప్రపన్నుల మనస్సు పరబ్రహ్మనే చింతన చేస్తుంది. వారి వాక్కు శ్రియఃపతి యొక్క గుణాలను అనుసంధానంచేస్తుంది. శరీరం చేత శ్రీనివాసుణ్ని ఆరాధిస్తుంటారు. సత్పథాచారాన్ని ప్రపన్నులు వదలరు.

"స్వనిష్ఠాభిజ్ఞానం సుభగ మపవర్గాదుపనతాత్" అన్నట్లు ప్రపన్నులకు యథార్థమైన నిష్ఠగల జ్ఞానం మోక్షం కంటే భోగ్యమైనది. రూపకాను ప్రాణితో పమాలంకారం. నీలమేఘం గ్రీష్మతాపాన్ని మాత్రం తొలగిస్తుంది. కృష్ణమేఘం మాత్రం ఆధ్యాత్మికాది తాపత్రయాన్ని హరించడం విశేషోక్త్యలంకారం.

చం॥ చెలువగు కృష్ణమేఘమున శేషగిరిన్ ప్రభవించి దేహవం
తుల భవతా పముల్ తొలగద్రోయునినున్ దయ! నీ సువృ
ష్టులెగొని దాన దృప్తులయి సువ్రతులొండు జడాశయంబులన్
దలపక చాతకం బువలె ధన్యత గాంతురు సత్పథస్థితిన్॥

59. త్వదుదయ తూలికాభిరమునా వృషశైలజుషా
స్థిర చరశిల్పినైవ పరికల్పిత చిత్ర ధియః।
యతిపతి యామున ప్రభృతయః ప్రథయన్తి దయే!
జగతిహితం న నస్త్వయి భరన్యసనాదధికమ్ ॥

అర్థం: హేదయే = ఓ దయాదేవీ! వృషశైల జుషా = తిరుమలయందు వెలసి యున్న; అమునా = ఈ; స్థిర చరశిల్పినా, ఏవ = స్థావరజంగమాలను సృష్టించిన శ్రీనివాసుడనే శిల్పిచేతనే; త్వత్+ఉదయ, తూలికాభిః = నిన్ను జన్మింపజేసే భగవత్సం కల్పాలనే రంగులను పూసే కుంచెల చేత; పరికల్పిత చిత్రధియః = కల్పించబడిన చిత్రమైన జ్ఞానాలుగల; యతిపతి యామున ప్రభృతయః = భగవద్రామానుజులు, యామునాచార్యులు మొదలైనవారు; జగతి = లోకమందు; నః మాకు; త్వయి = నీయందు; భరన్యసనాత్ = భరన్యాసం కంటె; అధికం = గొప్పదైన; హితం = హితం; న = లేదు (అని); ప్రథయన్తి = ప్రకటిస్తున్నారు.

తా: ఓ దయాదేవీ! వృషగిరియందు వేంచేసియున్న ఈ చరాచర వస్తువులను సృష్టించే శ్రీనివాసుడనే శిల్పకారుని చేతనే నీ యొక్క ఆవిర్భావాన్ని కలుగజేసే భగవత్సంకల్పాలనే వర్ణాలను పూసే కుంచెల చేత కల్పించబడిన అద్భుత ప్రజ్ఞలు గల యతి పతి యామునాది పూర్వాచార్యులు లోకమందు మాకు నీ యందు భరన్యాసం చేయడం కంటె గొప్ప శ్రేయస్సు మరొకటి లేదని ప్రకటిస్తున్నారు.

వ్యాఖ్య:– ప్రపత్తి మార్గాన్ని నిరూపించిన పూర్వాచార్యులను స్మరించే శ్లోకమిది.

గత శ్లోకమందు ప్రపత్తికి గల అంగాలను ప్రస్తావించిన తర్వాత, ఈ శ్లోకమందు న్యాసవిద్యను ఉపదేశానుష్ఠానాదులచే లోకంలో ప్రకటించిన పూర్వాచార్యులు స్మరింపబడుతున్నారు. పూర్వాచార్యులు అద్భుత జ్ఞాన సంపన్నులు. యతిపతి యామున ప్రభృతి పూర్వాచార్యులను శ్రియఃపతియే ఆత్మలను రక్షించే ఉపాయ జ్ఞానం కలవారినిగా సృష్టించాడని, చిత్రకళా శాస్త్రపద్ధతిలో దేశికులు ప్రబోధిస్తున్నారు.

అమునా వృషశైలజుషా స్థిరచరశిల్పినైవ:– విశ్వ సృష్టి జేసిన శిల్పి చతుర్ముఖ బ్రహ్మ కాదు. తిరుమల యందు వెలసియున్న శ్రీనివాస భగవానుడే స్థావర జంగమాలను నిర్మించిన శిల్పకారుడని అర్థం.

"క్రీడార్థం సృష్టిరిత్యన్యే భోగార్థమితి చాపరే ।
దేవస్యైవ స్వభావోఽయమాప్తకామస్య కాస్పృహా ॥"

భగవానుడు లీల కోసం – విలాసం కోసం – సృష్టి చేస్తాడంటారు కొందరు. ఆనందానుభవమనే ప్రయోజనార్థం సృష్టి చేస్తాడని మరికొందరంటారు. ఆప్త కాముడైన భగవానునికి ప్రయోజనాపేక్ష ఎందుకుంటుంది? ఉండదు. లీలగా – అనాయాసంగా జగత్తును సృష్టించడమే భగవంతుని స్వభావం.

"అఖిల భువన జన్మస్థేమభంగాది లీలే – బ్రహ్మణి శ్రీనివాసే" – అనే శ్లోకమే ప్రమాణం.

యతిపతి యామునాద్యాచార్యుల ఉపదేశానుష్ఠానాదులను వివేకవంతులైన ప్రజలు ఎందుకు అంగీకరిస్తారనే ప్రశ్నకు స్థిరచరాత్మక విశ్వాన్ని నిర్మించిన శ్రీనివాస పరబ్రహ్మయే ఆచార్యుల ప్రజ్ఞా సమన్వితమైన ఆకారాలను స్వయంగా నిర్మించాడు, అన్నదే సమాధానం.

త్వదుదయ తూలికాభిః పరికల్పిత చిత్రధియః:- సృష్టి నిర్మాణానికి శ్రీనివాస భగవానుడు మొదట ఒక చిత్రాన్ని లిఖిస్తాడు. చిత్రం గీసిన పిమ్మట తృప్తి కలిగితే అందు ప్రాణాన్ని కల్పించడం శిల్పి యొక్క స్వభావం.

"చిత్రే నివేశ్య పరికల్పిత సత్త్వ యోగా రూపోచ్చయేన విధినా మనసా కృతాను" (శాకుంతలం). లోకోత్తరమైన సుందర శరీరాన్ని నిర్మించడానికి మొదట చిత్రాన్ని కల్పించి, మనసుకు తృప్తి కలిగే దాకా దాన్ని దిద్ది తీర్చి, ఆ తర్వాత దానికే ప్రాణం పోస్తాడని కాళిదాస సూక్తి. చిత్రలేఖనం లేకుండా మొదటనే శరీరాన్ని నిర్మించి ప్రాణవంతంగా చేస్తే, మనస్సుకు నచ్చక మరొక రకంగా మలచడానికి శక్యం కాదు కదా!

క్రీడాతూలికయాస్వస్మిన్ కృపారూషితయాస్వయమ్ ।
ఏకో విశ్వమిదం చిత్రం విభుఃశ్రీమానజీజనత్ ॥ (యాదవాభ్యుదయం)

శ్రియఃపతి దయ అనే వర్ణమందు - రంగులో - ముంచిన సంకల్పమనే కుంచెతో విశ్వమనే చిత్రాన్ని నిర్మించాడు - అని దేశికుల సూక్తి. విశ్వ చిత్ర లేఖనం ఒకే కుంచెతో శిల్పి చేసినట్లున్నది. ఆచార్యుల ఒక్క విచిత్ర ధీచిత్రలేఖనానికి (తూలికాభిః) అనేక తూలికలు ఉపయోగింపబడినవి. ఈ తూలికలు దయామయ మైనవి. క్రీడా తూలికలు కావు. ఆచార్యులధీ చిత్ర లేఖనానికి క్రీడ - లీల అనేది లేశమాత్రమైనా లేదు. లీలాదేవి మోహన శాస్త్రాలను కల్పిస్తుందని 47వ శ్లోకం కీర్తించింది కదా! చిత్రం గీయడానికి ఉపయోగించే రంగు - వర్ణం - దయయే. భగవానుని సంకల్పాలే చిత్రలేఖన సాధనాలైన కుంచికలు. ఈ కుంచికలను దయ అనే వర్ణంలో ముంచినందువల్ల కుంచికల అంచులు దయామయాలై ధీచిత్రాన్ని నిర్మించడమయింది. చిత్రమందు కుంచికలు కనబడవు కదా! కేవలం వర్ణమే -

రంగు కనబడినట్లు, శ్రీనివాస పరబ్రహ్మయొక్క దయ ఆచార్యుల ప్రజ్ఞయందు నెలకొని యున్నందువల్ల, వారి శ్రీ సూక్తుల యందు దయా దేవి ప్రభావం అపరిమితంగా ఉంది. రజస్తమస్సులు లేని సత్త్వ గుణం గల శేముషి ఆచార్యులది. "సూర్యా చంద్రమసౌ ధాతా యథా పూర్వమకల్పయత్" శ్రుతి పల్కినట్లు లోకాలను ప్రకాశింప జేసే తేజోమూర్తుల కల్పనకు 'కల్పన' పదం వాడబడింది. ఆచార్యుల చిత్ర ధీకల్పనకు 'పరికల్పిత' అని 'పరి' ఉపసర్గను ప్రయోగించడం గమనీయం. భగవాను డెన్నోసార్లు ఆ ధీ చిత్రాన్ని అనేక తూలికలను దయావర్ణంలో ముంచి వ్రాస్తూ, తుడిచి వేస్తూ తన ఆత్మకు తృప్తి కలిగే దాకా, కొత్త కొత్త తూలికలను రంగులో అద్ది, శ్రద్ధతో దిద్ది తీర్చి నిర్మించాడు.

చిత్ త్రాయత ఇతి = చిత్రం. చిత్రా ధీః యేషాంతే = చిత్రధియః. చేతన రక్షణమైన జ్ఞానం కలవారు ఆచార్యులని అర్థం. 'జ్ఞానం' అంటే మోక్షం పట్ల బుద్ధి. (మోక్షే దీర్జ్ఞానమ్) అమరం.

యతిపతియామున ప్రభృతయః :- "పత్యుః సంయమినాం ప్రణమ్య చరణౌ తత్పాద కోటీరయోః సంబంధేన సమిధ్యమాన విభవాన్ ధన్యాంస్త థాన్యాన్ గురూన్॥" అన్నట్లు మొట్టమొదట యతిరాజు లైన భగవద్రామానుజులు స్వీకరింపబడినారు. రామానుజుల ఆచార్యులకు ఆచార్యులు యామునాచార్యుల వారు. 'ప్రభృతి' శబ్దం చేత యామునాచార్యుల పితామహులైన (తాతగారు) శ్రీమన్నాథమునులు తెల్పబడి నారు. రామానుజ యతీంద్రులు తమ పరమాచార్యుల సంప్రదాయాన్ని బాగా సంరక్షించి, జగదాచార్యులుగా భాసించారు. విశిష్టాద్వైత సిద్ధాన్తానికి రామానుజ దర్శనమనే పేరు కలిగింది. శ్రీ భాష్యాదినవ గ్రంథాలు జగత్ప్రసిద్ధి గాంచినవి. "తద్వశీకరణం తచ్ఛరణాగతిరేవ" - భగవంతుణ్ని వశపరచుకొనే ఉపాయం 'శరణాగతి' యే అని నొక్కి వక్కాణించారు. వారిది ఆప్త వాక్కు. నమ్మాళ్వార్లు ప్రపన్న జన కూటస్థులు అయితే భగవద్రామానుజులు 'శరణాగత సార్థవాహులు.

ప్రథయన్తి హితంన నస్త్వయి భరన్యసనాదధికమ్- త్యాగం, భరన్యాసం, ప్రపత్తి, శరణాగతి, ఆత్మ సమర్పణం - ఇవి పర్యాయపదాలు. "అకించనుడను, అనన్యగతికుడను. అపరాధ చక్రవర్తిని. నన్ను రక్షించే భారం నీదే తల్లీ" అని

భగవద్దయ పట్ల మహా విశ్వాసముంచి తన రక్షణభారాన్ని సమర్పించడమే భరన్యాసం. ప్రపత్తిని అనుష్ఠించడానికి అందరూ అధికారులే. 'ప్రపత్తియే సులభమైన మోక్షోపాయం' అని ఆచార్యులు తామాచరించి జనులచే ఆచరింపజేశారు, చేస్తున్నారు.

చం॥ అతులిత చిత్రకారుడు వృషాద్రినివా సకు డీవుతూలికా
గతినుదయించి తోడుపడగా రచియించిన చిత్రబుద్ధులా
యతిపతియామునాదులు దయా! భరమంతయు నీ యధీనమై
హితమతి నొప్పగించుటకు నెక్కుడు లేదని మాకు దెల్పరే!!

60. మృదుహృదయే దయే మృదిత కామహితే మహితే
ధృతవిబుధే బుధేషు వితతాత్మధురే మధురే ।
వృషగిరి సార్వభౌమ దయితే మయితే మహతీం
భవుకనిధే నిధేహి భవమూలహరాం లహరీమ్ ॥

అర్థం: మృదుహృదయే = మెత్తని చిత్తం కలిగినట్టి; మృదిత కామహితే = మర్దింపబడిన కోరికలు కల వారి యందు మేలు కలిగించునట్టి; మహితే = గొప్పగా పొగడబడినట్టి; ధృతవిబుధే = ధరింపబడిన జ్ఞానులు కలిగినట్టి; బుధేషు = జ్ఞానులయందు; వితత+ఆత్మధురే = విస్తరింపబడిన, తన భారాన్ని కలిగినట్టి; మధురే = తియ్యనైనట్టి; వృషగిరి సార్వభౌమ దయితే = వృషాచలాధిపతియొక్క వల్లభవైనట్టి; భవుక నిధే = మంగళనిధివైయున్న; హేదయే = ఓ దయా దేవీ! భవ మూల హరాం = సంసార వృక్షం యొక్క వేరును పెళ్ళగించగలిగే; తే = నీ యొక్క మహతీం = గొప్పదైన; లహరీం = ప్రవాహాన్ని; మయి = నాయందు; నిధేహి = ఉంచుము = ప్రసరింపజేయుము.

తా: ఓ దయాదేవీ! నీవు మృదు హృదయవు, విరక్తుల పట్ల హితాన్ని చింతించే దానవు, పూజనీయవు, జ్ఞానులచే ఆశ్రయింపబడినదానవు, నీ చేతన రక్షణభారాన్ని ఆచార్యులకు విస్తరించినదానవు, మధుర స్వభావవు, శ్రీనివాసుని వల్లభవు, సకల

శుభాలకు నిధివైయున్న నీవు సంసార వృక్షమూలాన్ని పెళ్ళగించ గలిగే నీ గొప్ప ప్రవాహాన్ని నా పైన ప్రవహింపజేయుము.

వ్యాఖ్య: దయాదేవి యందు ప్రపత్తిని అనుష్ఠించి దేశికులు తమ అభీష్టాన్ని ప్రార్థిస్తున్న శ్లోకమిది.

పూర్వాచార్యులు ప్రాప్య, ప్రాపకాలు రెండూ శ్రియఃపతియే అని మహా విశ్వాసంతో ప్రార్థిస్తూ, సులభోపాయమైన శరణాగతి పద్ధతిని ప్రదర్శించారు.

"ఇదం శరణ మజ్ఞానాం, ఇదమేవ విజానతామ్ ॥

ఇదం తితీ ర్షతాం పారం, ఇద మానంత్యమిచ్ఛతామ్ ॥"

అజ్ఞానులకు శరణాగతియే ఉపాయం. జ్ఞానవంతులకిదియే ఉపాయం. సంసార సాగరాన్ని దాటగోరే వారికి ఇదే ఉపాయం. మోక్షార్థులకిదియే ఉపాయం – అని న్యాసవిద్య ప్రబోధింపబడింది.

"త్వమేవో పాయభూతో మే భవేతి ప్రార్థనా మతిః। శరణాగతిరిత్యుక్తా" నీవే నాకు మోక్షోపాయం అయ్యెదవు గాక అని ప్రార్థనా రూపజ్ఞానమే 'శరణాగతి' అని చెప్పబడింది. ఇందు, 'ఏవ' – 'ఉపాయ' అనే శబ్ద ప్రయోగం వల్ల భరన్యాసమే ముఖ్యమని సూచింపబడింది.

"అతః శ్రీరామ మిశ్రాద్యైః భరన్యాస వివక్షయా ।

స్వప్రవృత్తి నివృత్త్యం శః ప్రపత్తిరితి లక్షితః ॥"

ఈ విధమైన భరన్యాసాన్ని బట్టియే శ్రీరామమిశ్రులు మొదలైన పూర్వాచార్యుల చేత 'స్వప్రవృత్తి నివృత్తియే ప్రపత్తి' యని చెప్పబడింది.

"భగవత్ ప్రవృత్తి విరోధి స్వప్రవృత్తి నివృత్తిః ప్రపత్తిః"

రక్షింపుమని భగవంతుణ్ని ప్రార్థిస్తూ, తన రక్షణ భారాన్ని ఆయన పైన మోపితే రక్షించే స్వభావం భగవంతునిది. దానికి విరుద్ధమైన, తనను తాను రక్షించుకొనే ప్రయత్నాన్ని చేతనుడు మానుకోవడమే 'ప్రపత్తి' అని ప్రపత్తి లక్షణం చెప్పబడింది. భరన్యాసం లేదా ఆత్మ నిక్షేపం ముఖ్యమైనది అంటే 'అంగి' అన్న మాట. "న్యాసః

పంచాంగ సంయుతః” ఈ న్యాస విద్య, ప్రపత్తి ఐదు (5) అంగాలతో కూడి యున్నది.

అనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్యవర్జనమ్ ।
రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వ వరణం తథా ।
ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః ॥”

యోగశాస్త్రమందు - యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానాలు అనే (7) ఏడు అంగాలను ముఖ్యమైన 'సమాధి' అనే అంగితో కలిపి 'అష్టాంగ యోగ' మనబడింది కదా!

అట్లే, ఆనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, మహా విశ్వాసం, గోప్తృత్వ వరణం, కార్పణ్యం అనే ఐదు(5) అంగాలను 'ఆత్మనిక్షేపం' అనే అంగితో కలిపి - అంగాంగి యోగ సముచ్ఛయాన్ని బట్టి - శరణాగతి 'షాడ్విధ్యం' అని చెప్పబడింది.

“నిక్షేపా పరపర్యా యోన్యాసః పంచాంగ సంయుతః ।
సన్న్యాస స్త్యాగ ఇత్యుక్తః శరణాగతిరిత్యపి ॥”

'నిక్షేపం' అని పల్కబడే న్యాసం అయిదు అంగాలతో కూడి యున్నది. దీన్నే సన్న్యాసం, త్యాగం, శరణాగతి యని కూడా అంటారని నిర్వివాదంగా తెల్పబడింది.

ఈ శతకంలో ఆరవ దశకం ప్రపత్తికి సంబంధించింది. కాబట్టి (ఏదో ఒక రకంగా) ఇది వరకు ఐదు అంగాలు చెప్పబడినాయి.

52వ శ్లోకమందు ఆనుకూల్య సంకల్పం ప్రస్తావించబడింది.

57వ శ్లోకంలో ప్రాతికూల్యవర్జనం; 51 శ్లోకమందు కార్పణ్యం; 56, 59 శ్లోకాలలో మహా విశ్వాసం అనే విషయాల ప్రసంగం కనబడుతుంది కదా!

(1 & 2) ఆనుకూల్య సంకల్పం ప్రాతికూల్య వర్జనమనే ప్రపత్తి యొక్క అంగాల వల్ల ఆజ్ఞనుమీరి ప్రవర్తించడం చేత కలిగిన పాపాలు నివారింప బడుతాయి.

"ఆనుకూల్యేతరాభ్యాంతు వినివృత్తి రపాయతః" అన్నది శాస్త్రం.

(3) 'కార్పణ్యం' అంటే కృపణ వృత్తిచే శరణ్యుడైన భగవంతునికి కరుణను జనింపజేయడానికై (వేరే సాధనాల నుంచి నివర్తింప జేసి) అనన్యోపాయత్వానికి ఉపయుక్తమైన అంగమిది. "కార్పణ్యేనాప్యు పాయానాం వినివృత్తిరిహేరితా"

(4) 'మహా విశ్వాసం' వల్ల నిస్సంశయత్వం – అంటే, నిరంతరానుష్ఠానం సిద్ధించడం కోసం, తర్వాత నిర్భరుడై, నిర్భయుడై ఉండడానికి ఉపయోగపడుతుంది. "రక్షిష్యతీతి విశ్వాసా దభీష్టోపాయకల్పనమ్".

ఇక, స్వరూపానుకూలమైన పురుషార్థాన్ని కోరితేనే సర్వేశ్వరుడు ఇస్తాడు. "అప్రార్థితో నగోపాయేత్" ప్రార్థించకపోతే సర్వేశ్వరుడు రక్షించడు. ఆత్మ నిక్షేపానికి అత్యావశక్యమైన అంగం గోప్తృత్వవరణం.

(5) "గోప్తృత్వ వరణం నామ స్వాభిప్రాయ నివేదనమ్" – అన్నట్లు ఈ (60వ) శ్లోకమందు దేశికులు తమ కోరికను నివేదించుకొని శరణాగతి చేస్తున్నారు. రమ్యమైన, సంబోధనాంత పదగుంభనతో, శ్రీనివాసుని మహిమ ఆయన దయ మీద ఆధారపడింది కాబట్టి – శ్రీనివాసదయనే ప్రార్థిస్తూ ప్రపత్తి చేయబడింది.

నమ్మాళ్వార్లు ఆరవ శతకం లోని చివరి దశకంలో (ఉలకముండ పెరువాయా – తిరువేంగడత్తానే) 'పూర్ణశరణాగతి' చేసిన పద్ధతిని అనుసరించినట్లున్నదీ శ్లోకం.

"అగలకిల్లే నిత్తైయు మెన్రు అలర్మేల్మంగైయుఱై మార్బా!
నిగరిల్ పుగషాయ్! ఉలగమూన్రుడైయాయ్! ఎన్నై యాళ్వానే !
నిగరిలమరర్ మునిక్కణంగళ్ విరుంబుం తిరువేంగడత్తానే !
పుగలొన్రిల్లావడియేన్ ఉన్నడిక్కీషమర్న్దు పుగున్దే నే॥" (తి.వా.మొ. 6–10–10)

తా: ఒక్క క్షణమైనా ఎడబాసి యుండలేనని పుష్పవాసినియైన శ్రీదేవి నివసిస్తున్న వక్షఃస్థలం కలవాడా! నిరుపమాన యశస్సు కలవాడా! జగత్త్రయ రక్షకుడా! నన్ను పరిపాలించువాడా! సాటిలేని నిత్యసూరులూ, ముని గణాలూ సేవించే శ్రీ వేంకటాద్రి నిలయుడా! ఏ ఒక్క ఉపాయములేని దాసుడనైన నేను నీ పాద పద్మాలను ఉపాయంగా విశ్వసించి ఆశ్రయించాను.

ఈ పాశుర మందు స్వామి అయిదు (5) పదాలతో సంబోధింపబడినాడు. దేశికుల చేత ఈ శ్లోకంలో దయాదేవి తొమ్మిది (9) పదాలతో సంబోధింపబడింది. ఉభయత్ర బేసి సంఖ్యయే. అయినా, తొమ్మిది పెద్ద సంఖ్య కదా! అస్తు.

1. మృదుహృదయే:- వెన్నవలె చల్లని, మెత్తని హృదయం కలదానా! "మృదుర్దయాళుర్మధురః" అనే గుణపారక్రమం అనుసరింపబడింది. ఆత్మనిక్షేపానికి అవసరమైన ఆక్రందన ఇది. "వ్యసనేషుమనుష్యాణాం భృశంభవతి దుఃఖితః" అన్నట్లు ఎవరికైనా కష్టాలు కలిగితే దయాదేవి గుండె చెరువవుతుంది. వారి కష్టాలను తాను పోయి తీర్చి, వారికి యోగక్షేమాలను కలిగించేదాకా కుదుట పడని కోమలమైన మనస్సు కలది కదా!

2. దయే:- శతకంలో సామాన్యంగా సంబోధింపబడుతున్న పదమే.

3. మృదితకామహితే:- కోరికలను అణచివేసిన వ్యక్తులకు మేలు చేయుదానా! దారేషణ, ధనేషణ, పుత్రేషణ అనే ఈషణత్రయాన్ని వదలుకొన్నవారు త్యాగ పురుషులు. అట్టి త్యాగులపట్ల హితాన్ని చింతిస్తుంది దయాదేవి.

"పరిత్యక్తామయాలంకా మిత్రాణిచధనానిచ" లంకను, స్నేహితులను, ధనాన్నీ విడిచినాను - అన్న విభీషణుడు త్యాగియే కదా!

"ఆత్మారాజ్యం ధనంచైవ కళత్రం వాహనానిచ।
ఏతత్ భగవతే సర్వమితి తత్ప్రేక్షితం సదా॥"

నేనూ, నా రాజ్యమూ, ధనమూ, భార్యా, గజతురగాది వాహనాలూ అన్నీ, నేనూ నాతో సంబంధించినవన్నీ భగవంతునివే అని వివేకం కలుగడం దయాదేవి యొక్క హిత చింతనవల్లనే కదా! భగవత్కృప లేనిది ప్రపత్తికి ప్రతికూలంగా ఉండే కామ్యాలను వదలి వేయడం - ప్రాతికూల్య వర్జనం - సాధ్యం కాదు.

"యస్యానుగ్రహ మిచ్ఛామి తస్యవిత్తం హరామ్యహమ్" నేను అనుగ్రహింప దలచిన వానికి ద్రవ్యమేమీ లేకుండా చేస్తాను - అన్న భగవద్వాక్యం గమనీయం కదా!

కోరికల మర్దన రూపమైన హితం కూడా అనుగ్రహ కార్యమే. అందుకే "విపదః సంతుమే నిత్యం" నాకు ఎల్లప్పుడూ ఆపదలే ఉండుగాక - అని తలచింది కుంతీ దేవి.

"అధనోఽయం ధనం ప్రాప్య మాద్యన్నుచ్చైర్నమాంస్మరేత్" - "ఇతి కారుణికో నూనం ధనం మే భూరినాదదాత్" - ఈ దరిద్రుడు, ధనం లభించిన వెంటనే బాగా మదించి నన్ను స్మరించడు, అని భావించిన దయాళుడు కాబట్టి నిశ్చయంగా, శ్రీకృష్ణుడు నాకు గొప్ప ధనమివ్వలేదు, అని కుచేలుడు తలచిన మాట కూడా కోరికలను అణచివేసే బుద్ధి కలుగడం భగవద్దయ వల్లనే అని విశదపరుస్తున్నది కదా!

తైత్తిరీయక ఆనందవల్లిలో మానవానందం మొదల్కొని బ్రహ్మానందం వరకు ఆనంద పరిమాణ క్రమం చెప్పబడింది. అందు "శ్రోత్రియస్యచాకామహతస్య" - కామహతుడు కానట్టి అంటే (కామంలేని వాడని అర్థం కాదు) కామం చేత నష్టపడని శ్రోత్రియుని - బ్రహ్మనిష్ఠుని - ముక్త పురుషుని యొక్క ఆనందం, ఆయా దేవతల, ఇంద్ర, బృహస్పతి, ప్రజాపతి యొక్క ఆనందంతో సమానంగా ఉంటుందని ఉపనిషద్వాక్యార్థం.

కామం ఉండకూడదని అర్థం కాక, పరిమిత ఫలాలను - ప్రాపంచిక భోగాలనాశించేదిగా ఉండక - కేవలం భగవత్పరమైన కామం అవశ్యంగా ఉండాలనే భావం బోధింపబడుతున్నది. ("పరిమిత ఫలసంగాత్" అనే 39వ శ్లోకం స్మరింప దగినది).

"పరమాత్మని యోరక్తో విరక్తోఽ పరమాత్మని" - పరమాత్మ యందు కోరిక కలవాడు ఇతర విషయాలయందు కోరికలు లేనివాడవుతాడు. భగవత్కామునికి ప్రాపంచిక భోగాసక్తి నశిస్తుంది అని భావం. ఇట్టి మృదితకాములకు - విరక్తులకు యోగక్షేమాలను కల్పించేది దయాదేవి.

4. మహితే:- బాగా పూజింపబడుదానా! స్తుతింపబడుదానా! ఈ పదానికి ఈ స్తోత్ర శతకమంతా తార్కాణమే.

5. ధృత విబుధే:- జ్ఞానులను ధరించుదానా! ధీమాన్యులకు ధారక పోషక భోగ్యురాలై, వారి రక్షణ భారాన్ని వహించేది దయాదేవి.

6. బుధేషు వితతాత్మధురే:- పూజ్యులైన ఆచార్యుల యందు చేతనులను రక్షించే తన భారాన్ని, వ్యాపింప జేయుదానా! "జ్ఞానీత్వాత్మైవమేమతం" "సచమమ ప్రియః " జ్ఞాని మాత్రం, నా ఆత్మయే అని నా ఆశయం. ఆయన నాకు చాలా ఇష్టమైన వాడు అని గీతాచార్య సూక్తి.

"సద్దేశికాత్మా" (50 శ్లో) అన్నట్లు, గురువులు భగవానుని దయ యొక్క రూపాంతరులు. కాబట్టి, చేతనులను రక్షించే భారం దయాదేవిదే అయినా, అట్టి భారాన్ని ఆచార్యులకు ఒప్పగించింది అన్న మాట.

"యథాదేవే తథాగురౌ" - "తేవుమత్తఱియేన్" - "దేవవత్స్యాదుపాస్యః" - అనే వాక్యాలన్ని గురువు దేవుని లాగా పూజింపదగినవాడని, ప్రపత్తి రూపమైన ఆచార్యనిష్ఠను ప్రబోధిస్తున్నాయి.

"అనాపృష్ట మపి బ్రూయుః గురవో దీనవత్సలాః" అడుగబడని రహస్యాలను కూడా ఆశ్రయించిన వారికి ఉపదేశించేవారు దీనులయందు వాత్సల్యం కలిగి యున్న ఆచార్యులే కదా! కృపా ప్రసన్నులు ఆచార్యులు.

7. మధురే:- దయాదేవి సహజంగా తియ్యనిది. శిశువుకు కన్నతల్లి కలకండ వలె మధురమైనది. చెరకు రసం లాగా అతి మధురమైనది దయాదేవి.

8. వృషగిరి సార్వభౌమదయితే :- దయాదేవి వృషగిరి సార్వభౌముడైన శ్రీనివాసునికి ప్రియమైన మహిషి. దేవేరులైన శ్రీ భూనీళాదేవులు శ్రీనివాస భగవానునికి దయాదేవి యొక్క ప్రతిబింబాలుగా కనబడుతారు (36వ శ్లోకం)

9. భవుకనిధే:- సకల శుభాలకు నిధి. దయాదేవి మొట్టమొదట (10వ శ్లో) 'అకించన నిధి' దిక్కూ చక్కీ లేని పేదలకు నిధి - అనే పదం తోనే స్తుతింపబడింది కదా!

తేమహతీం భవమూలహరాం లహరీం మయినిధేహి:- ('భవమూలహరీం లహరీ' మితి బాహులకత్వాత్ హరతేష్టప్రత్యయే టిత్వాత్, జీపి భవమూలహరీ మితి భవతి।' - 'భవమూలహరాం' అని టాబంత కల్పనం అను ప్రాసకు విరుద్ధమే అని శ్రీ.శ్రీ న.చ. రఘునాథాచార్య స్వామి వారిచే శోధింపబడిన 'సూక్తి సాధుత్వ మాలికా" అనే గ్రంథమందున్నది (53) గమనీయం)

తొమ్మిది పదాలచేత దయాదేవిని ఆర్తితో పిలిచాడు. తర్వాత, సంసారంలో అనేక జన్మలనెత్తి, ఆయా జన్మల్లో చేసిన పెక్కు పాపాలు శాఖోపశాఖలుగా పెరిగి, సంసారమనే వృక్షం బాగా విజృంభిస్తున్నది కాబట్టి దయా ప్రవాహం తన కెరటాల తాకిడిచేత సంసార వృక్షాన్ని కూకటివేర్లతో పాటు పెళ్ళగించ గలుగుతుంది. అందువల్ల ఓ దయాదేవీ! నా రక్షణ భారం నీ పైన ఉంచాను. నీవు నీ గొప్ప ప్రవాహాన్ని నా పైన ప్రసరింపజేయుమమ్మా! అని దేశికులు పూర్ణశరణాగతిని చేశారు. సప్తమ దశకంలో ఈ దయా ప్రవాహ ప్రభావమే వివరింపబడుతుంది. ఈ శ్లోకం ముక్తపదగ్రస్తంగానూ, అనేక వర్ణాల అసకృదావృత్తి కలదైన శబ్దాలంకారంతో రమణీయమైనది.

చం॥ బుధజనవంద్యవీవ, కడుపుణ్యవు, నీ యెదకోమలంబు నీ
విధము శ్రుతుల్ వచించు, గుణ విశ్రుతవీవ యకించనాళికిన్
నిధివి, భరింతు వీవ సుమనీషుల శేషగిరీశమాన్య నీ
మధుర ఝరిన్ హరింపగదె మద్భవ హేతుకపాపముల్ దయా ॥

షష్ఠదశకం సమాప్తం

సప్తమ దశకం

61. అకూపారై రేకోదక సమయ వైతం డికజవై
రనిర్వాప్యాం క్షిప్రం క్షపయితు మవిద్యాఖ్య బడబామ్।
కృపే! త్వం తత్తా దృక్ ప్రథిమ వృషపృథ్వీధరపతి
స్వరూప ద్వైగుణ్య ద్విగుణ నిజబిందుః ప్ర(భవ) వహసి ॥

అర్థం: హే కృపే = ఓ దయాదేవీ! తత్తాదృక్ – బిందుః । తత్ = అది; తాదృక్ = అటువంటిదే అనదగిన; ప్రథిమ = విస్తారమైన; వృష పృథ్వీ ధర పతి = వృషాద్రీశుడైన శ్రీనివాసుని యొక్క; స్వరూప = దివ్యాత్మ స్వరూపానికి; ద్వైగుణ్య = రెండింతలు పెద్దదైన వస్తువు కంటె; ద్విగుణ = రెండురెట్లు పెద్దదైన; నిజబిందుః = స్వీయ బిందువు గల; త్వం = నీవు; ఏక+ఉదక సమయ, వైతండిక జవైః = ఒకే జలమయమైన ప్రళయకాలమందలి, వితండావాదుల వాదాలకంటె, గొప్ప వేగంగల; అకూపారైః = సముద్రాల చేత; అనిర్వాప్యాం = ఆర్ప బడజాలని; అవిద్యా+ఆఖ్య బడబాం = అవిద్య అనే బడబాగ్నిని; క్షిప్రం = త్వరగా; క్షపయితుం = ఆర్పడానికి; (ప్రభవసి = సమర్థురాలవు) ప్రవహసి = ప్రవహిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! అని సంబోధన – శ్రీ వేంకటేశ్వరుని దివ్యాత్మ స్వరూపం చాలా విశాలమైనది. దానికదే సాటి. అట్టి శ్రీనివాసుని స్వరూపం కంటె నాలుగు రెట్లు పెద్దదైన స్వరూపం కలది దయాదేవి. ప్రళయకాలమందు సప్త సాగరాలు పొంగి ఏకార్ణవ మవుతున్నప్పుడు, వితండావాదుల శబ్ద జాలా ర్భాటం కంటె మించి మహోద్ధృతమైన వేగం కల్గిన సముద్రాల చేత ఆర్పబడజాలని అవిద్యాబడబాగ్నిని దయాదేవి తన యొక్క ఒక్క ప్రవాహ వీచికతో శీఘ్రంగా ఆర్పే సామర్థ్యం కలిగి ప్రవహిస్తుంటుందని తాత్పర్యం.

వ్యాఖ్య: సంసారమూలమైన అవిద్యా కర్మ వాసనలను సమూలంగా పెళ్ళగించే శక్తి కలది దయాదేవి అని నిరూపించే శ్లోకమిది.

ఆరవ దశకాంతమందు దయా లహరి భవమూలాన్ని హరిస్తుందని చెప్ప బడింది. భరన్యాసం – ప్రపత్తిని అనుష్ఠించిన తర్వాత కలిగే ప్రాతికూల్యాలు దయా ప్రవాహ కార్యం వల్ల నివారింప బడుతాయని నిరూపింపబడుతున్నది. తిరువాయి మొషి ఏడవ శతకంలో 'అనిష్టవిధ్వంస శీలమే' ప్రస్తావింపబడింది కదా!

న్యస్తభరునికి భగవానుని వల్ల భయపడవలసిన అవసరం లేదు. "భీషాఽస్మాద్వాతః పవతే" అని శ్రుతి పలికినట్లు అందరు భగవంతునికి భయపడుతుంటారు. కాని దయాదేవి యందు రక్షణభారాన్ని ఉంచిన వ్యక్తి నిర్భరుడై నిర్భయంగా ఉండడానికే, దయా పరాధీనుడైన భగవానుని స్వరూపం కంటె దయా స్వరూపం చాలా పెద్దదని 'శిఖరిణీ' వృత్తం చేత ప్రదర్శింపబడుతున్నది. ఇంతకు ముందు 'వృషభశిఖరి' అని 35వ శ్లోకమందు ప్రయుక్తమైనది. ఈ దశకమందలి అనేక శ్లోకాలలో 'శిఖరి' శబ్ద ప్రయోగం గమనీయం కదా!

ఏకోదక సమయ వైతండిక జవైః అకూపారైః:– ఒక్క నీరు మాత్రమే ఉండే సమయం – ప్రళయకాలమని అర్థం. సప్త సముద్రాలన్ని ఉద్ధృతంగా పొంగి ఏకార్ణవమయ్యే సమయమది. సముద్రాలు విజృంభించే వేగం వితండావాదుల వేగంతో పోల్చబడింది. 'వైతండిక' శబ్దానికి వితండావాదులని అర్థం. వితండావాదమంటే ఇతరుల సిద్ధాంతాన్ని ఖండిస్తూ స్థాపించదగిన స్వపక్ష సిద్ధాంతమే లేని వాదన. కేవలం కటు శబ్ద ప్రయోగాలతో ఆర్భాటం చేయడం. హస్త విన్యాసాలతో వట్టి వాగాడంబరంతో ఘోషిస్తూ చెలరేగే వేగం కలది వితండావాదం. ఆ వేగంతో తాను మునుగుతాడు, ఇతరులను ముంచుతాడు. ఇది వైతండిక వేగ లక్షణం.

అలాగే, సముద్రాలన్ని ఏకమై గొప్ప వేగంతో పొంగుతూ, ఉంచదగిన భాగమిది, ముంచదగిన భాగమది అనే రీతి లేకుండా, చరాచర పదార్థాలనన్నిటినీ క్రుంగదోయడమే ప్రళయ సమయంలో అకూపారాలకుండే ప్రచండ వేగలక్షణం.

"సముద్రోఽబ్ధిరకూపారః పారావారః సరిత్పతిః" (అమరం) (దీని వల్ల, వితండావాదం పట్ల దేశికుల న్యక్కారం సూచితం కదా!)

అనిర్వాప్యామవిద్యాఖ్యబడబామ్:- నీరు అగ్నిని చల్లార్పుతుంది. కాని, ప్రళయ కాలమందు విశ్వాన్ని మ్రింగివేసే ప్రచండ కోపంతో అమిత వేగం కలిగిన అకూపారాలు కూడా తమ అడుగులో ఉన్న బడబాగ్నిని ఆర్పజాలవు. సముద్రపు టడుగున బాడబం అంటే ఆడ గుఱ్ఱం యొక్క ముఖం వంటి ఆకృతి గల అగ్ని ప్రజ్వరిల్లుతుంటుందని శాస్త్రం. ఈ బడబాగ్ని నీటిలోనే ఉన్నా, ఏకార్ణవంలోనే ఉన్నా, చల్లారక ఆ నీటినే తపింప జేసి ఇంకింప జేస్తుంది. బాడబం నీటిచే పోషింప బడుతున్నదో అన్నట్లు ఉజ్జ్వలిస్తుంటుంది. నీరే ఇంధనంగా కలది కాబట్టి, బడబాగ్ని అబింధనమే. సముద్రాలన్నీ ఏకోదకమైనప్పటికీ, బడబాగ్ని ఆర్పబడదు.

ప్రళయకాలంలోనూ అవిద్య అనే బడబాగ్ని నశించదని అర్థం. "అవిద్యా కర్మ సంజ్ఞాన్యా" (వి.పు. 6.7.61)

అవిద్య బడబాగ్నితో పోల్చబడింది. 'అవిద్య' అంటే కర్మ. విద్యకంటే ఇతరమైన కర్మ. జీవుల పాపకర్మ సముచ్చయమే అవిద్య. అగ్గి తానాశ్రయించిన వస్తువులను బుగ్గి జేసినట్లే, కర్మలు కూడా తమ కాశ్రయాలైన జీవులను నశింపజేస్తాయి. అవిద్య చాలా దృఢమైనది.

నిమిత్త మాత్రమే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి ।
ప్రధాన కారణీభూతా యతో వైసృజ్య శక్తయః ॥

(వి.పు. 1-5-50) శక్తులంటే (ప్రాచీన) కర్మలని అర్థం.

సృజింపబడే జీవుల విషయమై సర్వేశ్వరుడు నిమిత్త మాత్రుడు. ఆయా జీవుల కర్మలే జన్మలకు ప్రధాన హేతువులు అని శ్లోకార్థం. దేవ మనుష్యాది విచిత్ర దేహాలు కలుగడానికి వారి వారి ప్రాచీన కర్మమే కారణమని శ్రీ పరాశర మహర్షి సూక్తి.

"నకర్మావిభాగాదితిచేన్నా నాదిత్వా దుప పద్యతే చాప్యుప లభ్యతేచ" (బ్ర.సూ. -1-35)

అవిభాగాత్ కర్మ న, ఇతిచేత్న. సృష్టికి పూర్వం చిదచిత్ విభాగం లేనందువల్ల విషమసృష్టికి కారణమైన కర్మ అప్పుడు లేదు, అన్నట్లైతే అది సరికాదు.

అనాదిత్వాత్ ఉపపద్యతేచ ఉపలభ్యతేచ. జీవులూ, వారి కర్మలూ అనాదులు. కాబట్టి, సృష్టికి పూర్వం నామరూప విభాగం లేక పోవడం ఉచితమే. ప్రమాణ సిద్ధమే, అని సూత్రార్థం.

ప్రళయకాలాన సంవర్తసాగరాలూ అవిద్య అనే బడబాగ్నిని - జీవుల కర్మలనూ - నశింపజేయజాలవు.

త్వంక్షిప్రం క్షపయితుం ప్రభవసి:- ప్రళయోదకం ఆర్పజాలని అవిద్య అనే బడబాగ్నిని ఓ దయాదేవీ! నీవు క్షణమాత్రంలో శమింపజేస్తావని పూర్వార్థం (శ్లోకం)లో వివరింపబడింది. ఇక ఉత్తరార్థంలో, అవిద్యాగ్నిని ఆర్పే సామర్థ్యం గల దయా ప్రవాహ ప్రబావం విశదీకరింపబడుతున్నది.

రెండవ దశకం- 13వ శ్లోకంలో "దయా ప్రవాహమందు ఉన్నతుడైన శ్రీనివాసుడే మునిగిపోతుంటే, ఆయన నాశ్రయించిన జీవుల పాపాలు కూడా మునిగిపోవడం నిస్సంశయ"మని చెప్పబడిన భావం ఇక్కడ విస్తరింప బడుతున్నది.

తత్తాదృక్ ప్రథిమ వృషపృథ్వీ ధరపతి స్వరూప

ద్వైగుణ్యద్విగుణ నిజబిందుః ప్రవహసి:- వృషాద్రి ప్రభువు యొక్క స్వరూపం ఇంత పరిమాణం కలదని చెప్పరానిది. అవాఙ్మనస గోచరమది. ఆయన ప్రభువే కాదు, విభువు కూడా. విశ్వమంతట వ్యాపించి యుండి, "నజ్యాయోఽ స్తికశ్చిత్" అంతకంటె పెద్దవాడెవ్వడూ లేడు - అన్నట్లు బృహత్తమ స్వరూపం కలవాడు కదా!

"పేశిత్తే పేశలల్లాల్ పెమై యొన్నుణర లాగాదు" వేదం చెప్పిన దాన్నే చెప్పడం తప్ప భగవద్వైభవం అముక (పలానా) వస్తువు వంటిదని చెప్పడానికి, కొద్ది భాగం కూడా తెలుసుకోవడానికి సాధ్యం కాదు.

"మనత్తుళ్ళానైవణంగి నామిరుప్పదల్లాల్ పేశత్తానావదుండో" హృదయంలో నివసించే శ్రియః పతిని నమ్రతతో సేవించి మనం జీవయాత్రను గడుపడమే తప్ప ఏదో చెప్పి యేమి ప్రయోజనం? అని తొండరడిప్పొడి యాళ్వార్ ('తిరుమాలై 22) కీర్తించారు.

పరబ్రహ్మతో సమానమైన దృష్టాంత వస్తువే లేనప్పుడు, పరిచ్ఛేదించి - నిష్కర్షించి చెప్పడానికి వీలులేని, విస్తారమైన స్వరూపం కలవాడనియే చెప్పడం సముచితం.

ఇట్టి శ్రీనివాస పరబ్రహ్మ స్వరూపం కంటె రెండింతలు పెద్దదైన వస్తువు కన్న రెండు రెట్లు అధిక పరిమాణం కలది దయా ప్రవాహమందలి ఒక్క బిందువు. దయారస బిందువు పరబ్రహ్మ స్వరూపానికంటె (4) నాలుగురెట్లు పెద్దది అని చెప్పక (2×2=4) "ద్వైగుణ్యద్విగుణ నిజబిందుః" అని చెప్పడం గోదాదేవి "ఈరిరండు" అని (తిరుప్పావై పాశురం 30) చెప్పినట్లున్నది.

ఒక్క దయాబిందు స్వరూపం అనంత స్వరూపానికి నాలిగింతలు పెద్దదై అత్యనంతంగా ఉండకపోతే, శ్రీనివాస పరబ్రహ్మ యొక్క స్వరూపాన్ని పూర్తిగా ఆవరించియుండకపోయేది కదా! అంతేకాదు, 34వ శ్లోకంలో చెప్పినట్లు, అగాధమైన, అనంతమైన చేతనుల పాపరాశిని - సముద్రాలన్నీ ఏకమై ఆర్పజాలని అవిద్యా బడబాగ్నిని - నశింపజేసే సామర్థ్యం ఉండక పోయేది కదా! ఉభయ విభూతుల స్వరూపం ఉపనిషత్తులో -

"పాదోఽస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి" అని చెప్పబడింది. ప్రకృతి మండలం ఒక భాగమైతే, దీనికంటె మూడు భాగాలు పెద్దదై శోభిస్తున్నది వైకుంఠసీమ.

చతుష్పాద విశిష్టమైన ఉభయ విభూతి నాయకుని స్వరూపం కంటె నాలుగు రెట్లు పెద్దది దయాబిందు స్వరూపం. నిత్యయోగమైన శ్రీశ్రియః పతుల స్వరూప ద్వంద్వం కంటె రెండు రెట్లు అధికంగా ఉంది దయా బిందువు.

'ప్రభవసి' అనే శబ్దం కంటె 'ప్రవహసి' శబ్ద ప్రయోగమే సమంజసం.

దేశికుల కవితా శిల్పం పరిచిత గహనమే కదా! వేదాన్త దేశిక ప్రజ్ఞాం కోనుజానాతుమర్హతి?

ఆధారమైన భగవత్స్వరూపం కన్న ఆధేయమైన దయా స్వరూపం మిన్న, బ్రహ్మ సింధువు నతిశయించి యున్నది దయాబిందువు. అధికాలంకారం రూపకానుప్రాణితం.

మ॥ చతురంభోనిధులొక్కటై కలిసి యాశ్చర్యంబుగా రేగి యు
ద్ధత వేగంబున నార్పజాలని యవిద్యాబాడబాగ్నిన్ దయా !
ద్రుతమే యార్పుదు నీవు బిందువుల దోడ్తో శేషశైలేశ్వరో
న్నత నిర్బోధ్యమహాస్వరూపమునకున్ నాల్గంతలైతోచుచున్ ॥

62. వివిత్సావేతాళీ విగమపరిశుద్ధేఽపి హృదయే
పటు ప్రత్యాహార ప్రభృతి పుటపాక ప్రచకితాః।
నమంత స్త్వాం నారాయణ శిఖరి కూటస్థ కరుణే।
నిరుద్ధ త్వద్ద్రోహా నృపతిసుత నీతిం నజహతి ॥

అర్థం:- నారాయణ శిఖరి కూటస్థ కరుణే = నారాయణాద్రి శృంగమందు నిల్చిన శ్రీనివాసుని దయాదేవీ! హృదయే = మనస్సు; వివిత్సావేతాళీవిగమ పరిశుద్ధేఽపి = భోగసాధనాలను పొందాలనే ఆశాపిశాచి వదలి వెళ్ళడం చేత, నిర్మల మైనప్పటికీ; పటు ప్రత్యాహార ప్రభృతి పుటపాక ప్రచకితాః = ఉగ్రమైన ప్రత్యాహారం మొదలైన భక్తి యోగాంగాలు అనే పుటపాకం నుంచి జంకిన వ్యక్తులు; త్వాం = నిన్ను; నమంతః = శరణు పొందినవారై; నిరుద్ధత్వత్+ద్రోహాః = ఆపివేయ బడిన నీయందలి ద్రోహబుద్ధి కలిగినవారై (నీ యందు ప్రాతికూల్య వర్జితులై). నృపతి సుతనీతిం = రాజకుమార న్యాయాన్ని; న, జహతి = విడువరు.

తా: నారాయణాద్రి యందు స్థిరంగా నెలకొన్న శ్రీ వేంకటేశ్వరుని దయా దేవీ! విషయ భోగాలను పొందాలనే ఆశాపిశాచి మనస్సు నుంచి లేచిపోయినందు వల్ల పరిశుద్ధులైననూ, ఉగ్రమైన ప్రత్యాహారాది పుటపాకం నుంచి భయపడిన అకించనులు నిన్ను శరణుపొందిన వారై నీ యాజ్ఞానుకూలురై, నరపతి పుత్రన్యాయాన్ని విడవరు.

వ్యాఖ్య: ప్రపన్నుని ఉత్తరాఘాలను దయాదేవి నశింపజేసే ప్రక్రియ వర్ణితం. గత శ్లోకమందు ప్రపన్నుని పాపాగ్నిని దయా ప్రవాహ వేగమే చల్లార్పుతుందని వర్ణింపబడింది. ప్రపత్తిని అనుష్ఠించే సమయమందున్న పాపాలన్నీ (పూర్వాఘాలు) నశించిపోతే, ప్రపత్తి చేసిన తర్వాత కాలాన కలిగే పాపాలు కూడా దయా ప్రవాహ ప్రభావం చేత పోగొట్టబడుతాయని ఈ శ్లోకమందు చెప్పే విధానం గమనీయం.

వివిత్సా వేతాళీ విగమ పరిశుద్ధేఽపిహృదయే:- చిత్తశుద్ధి కలిగే విధానం ఈ మొదటి చరణంలో విశదీకరింపబడింది. ఆశలేని ప్రాణి ఉండదు. ఆశ చాలా గొప్పది కదా!

"గిరే ర్మహాన్ గిరేరబ్ధి రబ్ధేరపి నభోమహత్ ।
నభసోఽపి పరబ్రహ్మ, తతోప్యాశా మహీయసీ ॥"

లోకంలో పర్వతం పెద్దది. ఆ పర్వతాలను పొట్టబెట్టుకొనే సముద్రం అంతకంటె పెద్దది. అన్నింటిని తన క్రింద ఉంచుకొని పైన ప్రకాశించే ఆకాశం మరెంతో గొప్పది. ఆకాశం కన్న పరబ్రహ్మ ఎన్నో రెట్లు మిన్న. జగత్కారణుడైన ఆ పరబ్రహ్మను కూడా కబళించగోరే ఆశకు అంతులేదు.

'వివిత్సా' అంటే స్త్రీ ధన ధాన్యాది భోగసాధనాలను పొందాలనే కోరిక. ఈ ప్రాపంచిక విషయాలు విషతుల్యమైనవి. "విషస్య విషయాణాంచ దూరమత్యంత మంతరం । ఉపభుక్తం విషంహంతి విషయాఃస్మరణా దపి॥" అన్నట్లు, విషానికీ విషయాలకూ చాలా తారతమ్యమున్నది. విషాన్ని తింటేనే అది నశింపజేస్తుంది. కాని విషయాలు మాత్రం వాటిని తలచుకొన్నంతలోనే నశింపజేస్తాయి.

కాబట్టి, విషయభోగాలను అనుభవించాలనే ఆశ (వేతాళీ) ఒక పిశాచిగా పోల్చబడినది. కోరిన పదార్థాలను ఇవ్వకపోతే పిశాచి తాను పట్టిన మనిషిని నశింపజేస్తుంది. అట్లే, ఆశను తృప్తి పరచకపోతే అది వ్యక్తిని క్షోభింపజేస్తుంది.

"అవితికైక్కవైవర్కు మైక్కుమ్ శిత్తిన్బమ్ పావియేనై ప్పల నీకాట్టి ప్పదుప్పాయో" (తి.వా.మొ. 6-9-9) మనస్సు క్షోభించే విధంగా, పంచేంద్రియాలు బాధించే రీతిగా అల్పసుఖాలను చూపించి, పాపిష్ఠుడనైన నన్ను పాడు చేస్తావా స్వామీ! అని శ్రీ పరాంకుశమునులు ప్రార్థించారు. కాబట్టి పరమపురుషార్థ విషయమైన రుచి చెడిపోక ఉండాలంటే, విడిచిపెట్టవలసిన వాటిలో ప్రధానమైనది శబ్దాది విషయాల పట్ల ప్రీతి.

ఈ వివిత్సా పిశాచి తొలగిపోతే హృదయం పరిశుద్ధంగా ఉంటుంది. "కామతాంక మతీత్య కోపదహనం నిర్వాప్య విత్త స్పృహా వేతాళీం వ్యవధూయ"

(సం.సూ) కామకళంకాన్ని కడిగివేసి, కోపాగ్నిని ఆర్పివేసి, ధనాశ అనే పిశాచిని దులిపివేస్తే, చిత్త నైర్మల్య మేర్పడుతుంది. మోక్షం పొందే కోరిక జనిస్తుంది.

మోక్షాన్ని కోరే వారికి భక్తి, ప్రపత్తులు అనే రెండు ఉపాయాలు శాస్త్రోక్తమైనవి. "వికల్పోఽ విశిష్టత్వాత్" (బ్ర.సూ.) అనే అధికరణ మందు, భక్తి ప్రపత్తులలో మోక్ష ఫలభేదం లేనందువల్ల బ్రహ్మవిద్యోపాసన అనే భక్తియోగాన్నైనా లేదా న్యాస విద్య అనే ప్రపత్తినైనా (ఏదైన ఒక్కటి) అనుష్ఠించవలెనని స్పష్టపరచబడింది కదా! భక్తి యోగాన్ని ఎందుకు అనుష్ఠించ రాదు? అంటే, రెండవ చరణమే సమాధానం.

పటు ప్రత్యాహార ప్రభృతి పుట పాక ప్రచకితాః:- పరిశుద్ధ హృదయులై వైరాగ్యం కలవారైనప్పటికీ కొందరు మహాపురుషులు భక్తి యోగాంగాలైన ప్రత్యాహార ధారణ ధ్యానాది రూపమైన చిరకాల తీవ్ర తపశ్చర్యకు భయపడుతుంటారు.

యమనియమాసన ప్రాణాయామాలనే నాలుగు భక్త్యంగాల తర్వాత అనుష్ఠింప బడే ప్రత్యాహారాద్యంగాలు ఉగ్రమైనవి. శ్వాసను కుంభింప జేసి ఇంద్రియాలను వశపరచుకొనే ప్రత్యాహారాది ప్రక్రియ పుటపాకం వంటిది.

ఔషధాలను తయారు చేసే విధానం 'పుటపాకం'. రజిత సువర్ణాది పదార్థాలను ఒక ముంతలో వేసి, పైన మూతను పెట్టి, ఒక గోతిలో పిడుకలు ఎండుటాకులు, పుల్లలు వేసి వాటి నడుమ ముంతను పెట్టి అగ్గిని రగిల్చి, కొంతకాలం పుటంపెట్టగా ముంతలో ఉన్న పదార్థంపాకమై, భస్మమేర్పడుతుంది. ఈ పుటపాకంలో పైకి జ్వాల లేర్పడవు. అంతర్దాహం అధికంగా ఉంటుంది.

చిరకాలయత్నమైన ప్రత్యాహారాద్యంగాలు గల భక్తి యోగానుష్ఠానం పుటపాకం వంటి తీవ్రతపశ్చర్య కాబట్టి, అందుకు ఓర్పు, నేర్పు, శక్తి చాలా అవసరం. శక్తి లేనట్టి శుద్ధ మనస్కులైన మహనీయులు లఘూపాయమైన ప్రపత్తిని అనుష్ఠించి స్వాభీష్టసిద్ధిని పొందుతారు.

ప్రపత్తిని ఒక్కసారి అనుష్ఠిస్తే చాలును. పూర్వాఘాలు నశిస్తాయి. అభయం లభిస్తుంది. నిర్భయంగా శేష జీవితం భగవద్భాగవత కైంకర్యంతో గడుపుతుంటారు.

ప్రపత్తి అనుభవానికీ, మోక్షానుభవానికీ మధ్య నుండే కాలమందు అంటే, ప్రపత్తిని అనుష్ఠించిన తర్వాత కొంత కాలమీ ప్రకృతిలో చేరియుండడం వల్ల

ప్రామాదికంగానో, బుద్ధిపూర్వకంగానో విపరీతానుష్ఠానం తటస్థించినప్పుడు - అపాయాన్ని తొలగించుకోవడానికి - మళ్ళీ శరణాగతిని చేయడమే ప్రాయశ్చిత్త మవుతుంది. "ప్రాయశ్చిత్తిరియం సాత్ర యత్పునః శరణం వ్రజేత్" అన్నదే ప్రమాణం. తాదృగ్విద్యైవ తన్నిష్కృతిరితిహి విదాంచక్రురామ్నాయవృద్ధాః" అని "తత్త్వముక్తా కలాపం' లోనూ ఈ 'న్యాసవిద్య'కు ప్రాయశ్చిత్తత్వమూ చెప్పబడింది.

నమంతస్త్వాం నారాయణశిఖరి కూటస్థకరుణే:- లోహ పరికరాలను సిద్ధం చేసే శిల్పులు (కమ్మరి, కంసాలి) లోహ పద్ధార్థాలను బాగా కొలిమిలో వేడి చేసి, వెంటనే సాగదీయడానికి ఒక లోహవేదిక (గుది) మీద పెట్టి, పెద్ద సుత్తితో కొడుతుంటారు. ఎంత కొట్టినా కదలక, మారక ఉండే భూమిలో పాతిన ఆ లోహవేదికను 'కూట' మంటారు. కూటస్థుడంటే నిర్వికారుడని అర్థం. స్థిరనివాసుడు. 'నారాయణాద్రి' అని వేంకటాద్రికి మరో పేరున్నది. 'నారాయణ' సంజ్ఞగల పర్వతం ఘనీభూతమైన దయయే కదా! ప్రపత్తిని అనుష్ఠించే మంత్రంలోనిదే 'నారాయణ' శబ్దం. భగవన్నామాలన్నీ 'నారాయణ' శబ్దార్థం లోకి పర్యవసిస్తాయి. 'నారాయణ' సంజ్ఞ మాత్రం ఇతర నామాల అర్థంలోకి అనువర్తించదుకదా!

"నారాయణా య విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అని వేద కల్పతరువులోని ఒక్క ఉపనిషచ్ఛాఖాగ్రాన మంత్రపుష్పం లో పరిమళించే మూడు - నారాయణ, వాసుదేవ, విష్ణు - వ్యాపక మంత్ర శబ్దాలలో ప్రాథమ్యాన్ని సంతరించుకొన్న పదమిది. శ్రీనివాసుడు నారాయణాద్రి కూటస్థుడై నిర్వికారుడై యున్ననూ దయాదేవి వల్ల వికారం చెందుతాడు - ద్రవించిపోతాడు. దయాంతరంగుడే కదా!

"అజ్ఞానా దథవాజ్ఞానాత్ అపరాధేషు సత్స్వపి ।
ప్రాయశ్చిత్తం క్షమస్వేతి ప్రార్థనైకైవ కేవలమ్ ॥" (ర.త్ర. సారం)

తెలియకనో, తెలిసియో అపరాధాలు (ఉత్తరాఘాలు) సంప్రాప్తమైనప్పుడు క్షమింపుమని ప్రార్థించడమే ప్రాయశ్చిత్తం.

భక్తియోగాన్ని అనుష్ఠించలేని అశక్తులైన వారు శ్రీనివాసుని దయను (నమంతః) శరణు పొందుతుంటారు.

ఉగ్రమైన తపశ్చర్య నాచరించడానికి తమకు శక్తి చాలదని భయపడుతుంటారే కాని "భక్తి యోగం శ్రేష్ఠమైన ఉపాయం కాదు, అది స్వరూపానికి విరుద్ధం" అనే భావం మాత్రం అకించనులకు లేదు, ఉండదు కూడా.

నిరుద్ధత్వద్ద్రోహాః నృపతి సుతనీతిం నజహతి:- దయాదేవిని గూర్చి శరణాగతిని అనుష్ఠించిన వారు ఆమె పట్ల ద్రోహచింతన లేనివారై, భగవదాజ్ఞా రూపాలైన శ్రుతి స్మృతులయందు చెప్పబడిన కర్మలను ఆచరిస్తుంటారు, రాజపుత్ర న్యాయాన్ని అనుసరించి ప్రవర్తిస్తారు.

పాపమొక్కటే జాతి, గుణ, అధికార భేదాన్ని బట్టి తీక్ష్ణమైన ఫలాన్నిగానీ, తేలికయైన ఫలాన్ని గానీ ఇచ్చేదిగా ఉంటుంది. ఈ విషయం లోకమర్యాదను బట్టి గూడా ఉప పన్నమవుతుంది. కాబోయే యువరాజు లాగా, మోక్ష సామ్రాజ్యానికి వారసుడయ్యే ప్రపన్నుడు చాలా భద్రంగా నడచుకోవాలి.

"నప్రాగ్వత్ విద్ధిపూర్వాఘే నచాత్యంతమనిగ్రహః ।
లఘుర్దండః ప్రపన్నస్య రాజపుత్రా పరాధవత్ ॥"

ప్రపన్నునికి, బుద్ధిపూర్వకంగా పాపకృత్యాన్ని ఆచరించినప్పుడు, దండన పూర్వం లాగా ఉండదు, దండించక పూర్తిగా అతణ్ని క్షమించడమూ లేదు. అయితే రాజు తన కుమారుడు అపరాధం చేస్తే అతనికి నామకార్థం దండన విధించినట్లు (కాకికి కన్ను పోగొట్టినట్లు) ప్రపన్నునికి స్వల్ప దండనమే ఉంటుంది, అని చెప్పబడింది. కాబట్టి, దయాదేవి, శాస్త్రోల్లంఘనం చేసి, పాపకర్మ నాచరించిన ప్రపన్నులకు రాజపుత్ర నీతి ననుసరించి, తేలికపాటి దండనను వారు జీవించి యున్నప్పుడే అనుభవింప జేసి, శుద్ధాత్ములుగా తీర్చిదిద్ది మోక్ష ఫలాన్ని ప్రసాదిస్తుంది.

మ॥ ధనలాభేచ్ఛ పిశాచ వర్జిత విశుద్ధంబైన చిత్తంబు గ
ల్గిన సాధుల్ భువిగొంద ఱింద్రియములన్ గెల్వంగ రాకున్న భీ
తిని నిన్నే శరణంబుగా దలచుచున్ దేవీ! భవత్సమ్మతిన్
గని భూపాత్మజ నీతిగాంతురు మహానందంబు నిష్పాపులై ॥

63. అనన్యాధీనస్సన్ భవతి పరతంత్రః ప్రణమతాం
కృపే! సర్వద్రష్టా నగణయతి తేషా మపకృతిమ్।
పతి స్త్వత్పారార్థ్యం ప్రథయతి వృషక్ష్మాధరపతిః
వ్యవస్థాం వైయాత్యాదితి విఘటయంతీ విహరసి॥

అర్థం:- హే కృపే = ఓ కృపాదేవీ! వృషక్ష్మా ధరపతిః = వృషాద్రి నాథుడైన శ్రీనివాసుడు; అనన్య+అధీనః, సన్ = ఇతరులకు వశుడు కాని వాడైనను; ప్రణమతాం = నమస్కరించిన వారికి; పరతంత్రః = పరతంత్రుడుగా; భవతి = అవుతున్నాడు. సర్వద్రష్టా = అన్నిటినీ స్పష్టంగా చూచేవాడైనను; తేషాం = ఆ శరణాగతుల యొక్క; అపకృతిం = అపరాధాలను; న, గణయతి = లెక్కించడం లేదు; పతిః (సన్) = భర్తయైనను; త్వత్ + పారార్థ్యం = నీయందు పరతంత్రతను; ప్రథయతి = ప్రకటిస్తున్నాడు. వైయాత్యాత్ = (నీ యొక్క) ధార్ష్ట్యం వల్ల; వ్యవస్థాం = శాస్త్ర మర్యాదను; ఇతి = ఇలాగా, విఘటయంతీ = మీరజేస్తూ; విహరసి = ఆడుతున్నావు.

తా: ఓ కృపాదేవీ! శ్రీ వేంకటేశ్వరుడు సర్వస్వతంత్రుడైనప్పటికీ ప్రపన్న జనులకు పరతంత్రుడుగా ఉంటున్నాడు. సకల వస్తువులను సాక్షాత్తుగా చూచేవాడైననూ ఆశ్రితుల అపరాధాలను లెక్కపెట్టకున్నాడు. నీకు నాథుడే ఐననూ నీకు లోబడి యున్నాడు. ఇలాగా నీ వత్తిడి వల్ల భగవానుని చేత శాస్త్ర మర్యాదను ఉల్లంఘింప జేస్తూ ఆడుకొంటున్నావు గదమ్మా!

వ్యాఖ్య: దయాదేవి ప్రాగల్భ్యాన్ని ప్రశంసించే శ్లోకం.

దయాదేవి ప్రపన్నుల ఉత్తరాఘాలకు స్వల్ప దండనను భగవానునిచే విధింప జేస్తున్నదని పూర్వ శ్లోకం నిరూపించింది. ఈ శ్లోకమందు దయాదేవి తన వాల్లభ్యం వల్ల శాస్త్ర విహితమైన వ్యవస్థను ఉల్లంఘింప జేస్తున్నదని పొగడబడుతున్నది.

(1) అనన్యాధీనః సన్:- మరొకరికి లోబడి యుండని వాడగుతూ, అని అర్థం. శ్రీనివాస పరబ్రహ్మను నియమించేవాడు వేరొకడు లేనే లేడని "న తస్యేశే కశ్చన" అనే ఉపనిషత్తు చెబుతున్నది.

"అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే" (10-8) సమస్త జగత్తు యొక్క ఉత్పత్తికి నేనే కారణం. నా వల్లనే, జగత్తంత ప్రవర్తిస్తున్నది.

"గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్। ప్రభవః ప్రళయః స్థానం నిధానం బీజ మవ్యయమ్॥" (9-18)

పరమధామాన్ని నేనే. జగత్తును భరించి పోషించే వాడను, స్వామిని; అందరి శుభా శుభాలను చూచేవాడను, అందరికి నివాస స్థానాన్ని, శరణం పొందదగిన వాడను నేనే. ప్రత్యుపకారాన్ని ఆశించక హితమొనర్చే వాడను. విశ్వసృష్టి స్థితి లయాలకు హేతువును, శాశ్వత కారణమూ నేనే.

"మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి" (7-7 భగవద్గీత) నా కంటె పరమ కారణమైనది మరొకటి ఏదీ లేదు - అని శ్రీకృష్ణ భగవానుడే విశదపరచాడు. అయినా, ఆశ్రితుల పట్ల తన స్వభావానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం పరిపాటి అయింది.

భవతి పరతంత్రః ప్రణమతాం:- ప్రణామ పరులకు పరతంత్రుడవుతున్నాడు అని అర్థం. నిరుపాధిక స్వతంత్ర సత్త భగవానునికే ఉంది. స్వతంత్రుడైనా ఆయన దయా పరతంత్రుడు. దయకే పరతంత్రుడు కాదు, దయను ఆశ్రయించిన జనుల కందరికీ పరతంత్రుడే అవుతున్నాడు. వారికి సకల సేవలు చేస్తున్నాడు. 'ప్రణమతాం' అనే శబ్దం శత్రర్థకం. కాబట్టి, శరణాగతిని పొందుతున్న క్షణాననే పరతంత్రుడవు తున్నాడని స్పష్టమవుతుంది. ఆశ్రిత పరతంత్రుడు - భక్త పరాధీనుడు అని ఖ్యాతిని బడసినాడు. ఆశ్రితుడైన అర్జునునికి రథసారథిగా ఉండడమే కాక, రథాశ్వాలను కూడా తన చేతులతో కడిగిన శ్రీకృష్ణ భగవానుడు తన స్థాయిని ఎంత దిగజార్చు కొన్నాడో, లీలాశుకుని శ్లోకం తెల్పుతుంది కదా!

"నఖ నియమిత కండూన్ పాండవ స్యందనాశ్వాన్
అనుదిన మభిషించన్ అంజలిస్థైః పయోభిః ।
అవతు వితతగాత్ర స్తోత్ర నిష్యూత మౌళి
ర్దశన విధృతరశ్మి ర్దేవకీ పుణ్యరాశిః ॥ (శ్రీకృష్ణ కర్ణామృతం 2 ఆ. 47)

పద్యం: తలదోత్రంబు ధరించి పగ్గములు దంతశ్రేణి గీలించి య
గ్గలికన్ మేనిగిడించి పార్థ రథ కంఖాణంబులన్ దోయిటన్
జలముల్ సల్లి న ఖాళియై నివురుచున్ రక్షించు నా దేవకీ
లలనా పుణ్యఫలంబు నన్ను గరుణాలంకారుగా జేయుతన్ ॥

(2) సర్వద్రష్టా నగణయతి తేషామపకృతిమ్:- "యః సర్వజ్ఞః, సర్వవిత్" సర్వేశ్వరుడు అన్ని తెలిసినవాడు, అన్నిటిని పొంది యున్నవాడు అని ఉపనిషద్వాణి. సర్వదా సర్వం సాక్షాత్కరించే స్వభావం కలవాడైననూ, ఆ శరణాగతుల అపరాధాలను లెక్కించక ఉన్నాడు. అపకృతిం న పశ్యతి. ఒక్క తప్పునైనా చూడడం లేదు అనక 'దోషాలను లెక్కించడం లేదు' అనడం వల్ల 'అపకృతిం' అనే పదాన్ని జాత్యేకవచనంగా - దోషరాశిగా భావించాలి.

"న స్మర త్య పకారాణాం శతమప్యాత్మ వత్తయా" అనే శ్రీ మద్రామాయణ వాక్యాన్ని బట్టి ఆశ్రితుల పాపాలను లెక్క చేయడని స్పష్టమవుతున్నది.

"జ్ఞానీత్వాత్మైవ మేమతం" 'సర్వం వాసుదేవుడే' అనే అధ్యవసాయం గల జ్ఞాని తనకు ఆత్మయే అని గీతాచార్యుని శ్రీ సూక్తి కదా! "అవిజ్ఞాతా" అనే పేరు విష్ణు సహస్రనామాలలో ఒకటి ఉంది. "సహస్రాంశుః" అనేది మరొక పేరు దాని ప్రక్కనే ఉంది.

సహస్రం - అపరిమితాః, అంశవః - జ్ఞానాని అస్య ఇతి = సహస్రాంశుః ఈ పేరు భగవాను డెంత సర్వజ్ఞుడో తెల్పుతుంది.

'అవిజ్ఞాతా' అంటే 'దోషో యద్యపి తస్యస్యాత్'

"దోషం ఉంటే ఉండని" అని భగవానుడు ప్రపన్నుల విషయమై అపరాధాలను తెలియని వాని వలె ఉండి ఉపేక్షిస్తాడు అని శ్రీ పరాశర భట్టర్ వి.స.నా భాష్యం. శాస్త్రార్థమేమిటంటే, బుద్ధిపూర్వకంగా ప్రపన్నుడు అపరాధం చేస్తే, ఆ ఉత్తరాఘానికి శాస్త్రోక్తంగా ప్రాయశ్చిత్తం అనుష్ఠించక పోతే, స్వల్ప దండన విధింపబడి తర్వాత శుద్ధాత్ముడుగా తీర్చబడుతాడు. "ప్రాయశ్చిత్త మాచరించే శక్తి సామర్థ్యాలు లేవు స్వామీ! నన్ను నీవే కృపతో రక్షించాలి" అని మళ్ళీ ప్రపత్తి చేయడమే ప్రాయశ్చిత్త

మవుతుంది. పునః ప్రపత్తి చేసిన వ్యక్తికి స్వల్ప దండనమే ఉండదు. భగవానుడు ఇలా ప్రవర్తించిన ప్రపన్నుల ఉత్తరాఘాలను - పాపాలను ఏ మాత్రం లెక్కించక ఉపేక్షిస్తాడు. అంటే, ఆ పాపాలు దండనకు అర్హమైనవిగా భావించదని సారాంశం.

(3) పతిస్త్వత్పారార్థ్యం వృషక్ష్మాధర పతిః ప్రథయతి:- "పతిం విశ్వస్య" అని శ్రుతి పలుకుతుంది. విశ్వపతియైన శ్రీనివాసుని కే దయా దేవి పత్ని కదా! పత్నికి పారతంత్ర్యమే న్యాయం. శ్రీనివాసుడు సర్వశేషి. "శేషః పరార్థత్వాత్" అన్నట్లు పారార్థ్య మేశేషత్వం. సర్వశేషియైనా శ్రీనివాసుడు దయాదేవికి శేషభూతుడుగా మెలగుతున్నాడు. ఇది విపర్యాసమే. జగన్నాథుడే దయాదేవికి భర్త కాబట్టి, ఆమె చెప్పినట్లు ప్రవర్తించి, దయా పరతంత్ర తను ప్రకాశపరుస్తూ ఆనందపడుతున్నాడు.

వ్యవస్థాం వైయాత్యాదితి విఘటయంతీ విహరసి:- భగవానునికి వ్యవస్థితమైన గొప్ప లక్షణాలు స్వాతంత్ర్య, సార్వజ్ఞ్య శేషిత్వాలు. దయాదేవి యొక్క వాల్లభ్యం వల్ల ఈ వ్యవస్థ కించపరచబడింది. శాస్త్ర మర్యాదను పాటించక విహరించడం వల్ల దయాదేవి యొక్క ధార్ష్ట్యం ఆహా! ఎంతటిదో! అని విస్మయం కలుగక మానదు.

"విశేషేణ ఆభిముఖ్యం యాతీతి = వియాతః"

"ధృష్టే ధృష్ణుర్వియా తశ్చ" (అమరం) వియాతమే వైయాత్యం. బాగా ఎదురు తిరుగడం; ప్రాగల్భ్యం - దిట్టతనం అని అర్థం.

ఈ శ్లోకం శ్రీ కూరత్తాళ్వాన్ శ్లోకాన్ని స్మరింపజేస్తుంది.

"అనన్యాధీనత్వం తవ కిల జగుర్వైదిక గిరః
పరాధీనం త్వాంతు ప్రణత పర తంత్రం మనుమహే ।
ఉపాలంభోఽయం భోః శ్రయతి బత! సార్వజ్ఞ్య మపితే
యతోదోషం భక్తేష్విహవరద! నైవాఽ కలయసి॥ (20)

ఓ వరదరాజా! నీవు స్వతంత్రుడవని వేదవాక్కులు ప్రశంసిస్తున్నాయి. కాని మేము నిన్ను మాత్రం ప్రణత జనులకు పరతంత్రుడవని భావిస్తున్నాం. "ఇలా భావించడం నింద కదా!" అని (స్వామి) అంటే, ఆహా! ఈ నింద నీ సర్వజ్ఞత్వాన్ని కూడా తగులుకొంటుంది. ఎందుకంటే, ఈ లోకంలో భక్తుల దోషాలనే మాత్రం నీవు లెక్కించడమే లేదు కదా! అని తాత్పర్యం. (వరద రాజస్తవం)

భగవానుని స్వభావాన్ని బలాత్కారంగా మారుస్తున్నదని దయాదేవిని నిందిస్తున్నట్లు అనిపించినా, ఈ నింద "ఆహా! ఏమి నీ పతి వాల్లభ్యం! నీ నాథుడు నీకు వశ్యుదవడమే కాక నీ ఆశ్రితులకు కూడా వశ్యునిగా జేసి వారి పాపాలను స్మరింపకుండ జేసే గుణ సౌభాగ్య సంపత్తి నీకే కలదని దయాదేవి పట్ల స్తుతిగానే పర్యవసిస్తుంది.

మ॥ సకలజ్ఞుండు నిరంకుశ ప్రభువు శేషక్ష్మాధరేశుండు సే
వక వశ్యుండయి తత్కృతాపకృతులన్ బాటింప కొక్కింతయున్।
ప్రకటించున్ భవదీయ నిత్యవశతన్ భావింప స్వాధీన భ
ర్తృక లీలన్ విహరించు నిన్ విభుడుదానెమ్మాడ్కి మీఱున్ దయా॥

64. అపాంపత్యుఃశత్రూ నసహనమునేర్ధర్మ నిగళం
కృపే! కాక స్యైకం హితమితి హినస్తిస్మ నయనమ్।
విలీన స్వాతంత్ర్యో వృషగిరి పతిస్త్వద్విహృతి భి
ర్దిశత్యేవం దేవో జనితసుగతిం దండన విధిమ్॥

అర్థం:- హే కృపే = ఓ దయాదేవీ! త్వత్+విహృతిభిః = నీ విహారాల చేత; విలీన స్వాతంత్ర్యః = విడువబడిన స్వతంత్రత గల, వృషగిరి పతిః = శ్రీనివాస భగవానుడు; అపాంపత్యుః = సముద్రుని యొక్క; శత్రూన్ = పగతురను; అసహన మునేః = ఓర్పు లేని మునియైన పరశురాముని యొక్క; ధర్మ నిగళం = పుణ్యమనే సంకెలను; కాకస్య = కాకాసురుని యొక్క ఏకం = ఒక; నయనం = కన్నును; హితం, ఇతి = హితమని తలచి; హినస్తి, స్మ = హింసించాడు. ఏవం = ఇట్లు; దేవః = శ్రీనివాసుడు; జనిత సుగతిం = కల్పింపబడిన సద్గతి గల; దండనవిధిం = దండన గతిని; దిశతి = ఇస్తున్నాడు.

తా: ఓ కృపాదేవీ! నీ లీలలచే స్వాతంత్ర్యాన్ని వదలుకొన్న శ్రీనివాసుడు (రామావతారంలో) సముద్రుని శత్రువులనూ; భార్గవరాముని పుణ్య నిగళాలనూ; కాకాసురుని ఒక కంటినీ; వాళ్ళకు హితమనే భావనతో పోగొట్టి, వారి ప్రాణాన్ని కాపాడినాడు. ఇలాగా, దేవుడు సద్గతిని కలిగించడానికే సాపరాధులను దండిస్తుంటాడు.

వ్యాఖ్య: భగవానుడు కోపంతో అపరాధులకు విధించిన దండన దయా ప్రేరణ వల్ల హితంగా పర్యవసిస్తుందని దృష్టాంతీకరించే శ్లోకం.

ప్రపత్తి రూపమైన ప్రణతులర్పించిన జనుల యొక్క దోషాలను (ఉత్తరాఘాలను) సర్వప్రాయశ్చిత్త రూపమైన ప్రభావం చేత భగవానుడు ఏ మాత్రం స్మరించకుండా ఉపేక్షిస్తాడని గత శ్లోకం వివరించింది. అంతకు ముందటి శ్లోకం, ప్రపన్నునికి దండన స్వల్పంగా ఉంటుందని తెల్పింది. ఈ శ్లోకమందు దండన కూడా భగవదనుగ్రహమే అని చెప్పబడింది. "క్రోధోஉపి తేஉనుగ్రహ ఏవ సమ్మతః" (భాగవతం) అన్నట్లు, భగవానుని నిగ్రహం కూడా అనుగ్రహంగానే ఉండడం చేత దయా ప్రభావం ప్రతిష్ఠింపబడుతున్నది. భగవత్కృప వల్ల 'ప్రాణానికి ప్రాణ' మన్నట్లున్న చాలా కఠినమైన దండన విధిలో గొప్ప మార్పు వచ్చింది. అపరాధులకు (హితం) మేలు చేయడానికి శిక్షాస్మృతి సంస్కరింపబడింది. ఈ విషయాన్ని దేశికులు రామాయణంలోని మూడు సంఘటనలను దృష్టాంతంగా ప్రదర్శించారు.

(1) అసహనమునేర్ధర్మ నిగళం హితమితిహినస్తిస్మ:- సీతారాముల కల్యాణమైన తర్వాత అయోధ్యకు తిరిగి వస్తుండగా శ్రీరాముని ప్రఖ్యాతిని సహించలేక దారి కడ్డంగా వచ్చి యుద్ధానికీడ్చిన వాడు భార్గవరాముడు. శివధనుర్భంగం చేసిన శ్రీరాముని వీర్యశౌర్యాలను ఓర్వజాలని అసూయతో తక్కువగా తలచి, తన వద్దనున్న వైష్ణవ ధనుస్సు నెక్కుపెట్టి తనతో ద్వంద్వ యుద్ధం చేయుమని కాలాగ్ని లాగా మండిపడుతూ పరశురాముడు శ్రీరామునికి విష్ణు ధనుస్సు నందించాడు.

శ్రీరాముడు వైష్ణవ ధనుస్సు నెక్కుపెట్టాడు. తన పరాక్రమాన్ని అవమానింప దలచిన అసహనగుణాన్ని దోషంగా భావించాడు శ్రీరాముడు.

"యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మేమతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాంస్తాన్ విద్ధి నష్టాన చేతసః ॥" (భ.గీ. 3-32)

"నా యందు దోషారోపణ చేస్తూ, నేను చెప్పిన మాట ననుసరింపని వ్యక్తులు సమస్త జ్ఞాన విషయాలయందు మోహితులై - విపరీత జ్ఞానోపహతులై, భ్రష్టులై కష్టాల పాలవుతారని తెలుసుకొమ్మన్నాడు కదా! గీతాచార్యుడు. అంతే కాదు.

"క్షిపా మ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు" (16-19) అలాగా, ఇతరులను ద్వేషించే పాపాత్ములను ఆసురీయోనులలోనే పడవేస్తుంటానన్నాడు.

తన పితృహంతకులు క్షత్రియులు అని, శత్రువులుగా భావించి సంహరించినా కొందరిని పరశురాముడు సహించాడేమో కాని, తనలాగా భగవదంశ కలవాడైనను శ్రీరాముని క్షాత్ర వీర్యఖ్యాతిని ఏ మాత్రం సహించజాలని వాడు పరశురాముడు అని 'అసహన ముని' అనే పదం చేత బోధపడుతున్నది. క్షత్రియులచే పూపింజబడే వాడు, విశ్వామిత్రునికి మేనల్లుడైన జమదగ్నికి పుత్రుడైనందు వల్ల పరశురాముని ప్రాణాన్ని ఎక్కుపెట్టిన బాణం హరించదన్నాడు శ్రీరాముడు. అమోఘమైన ఆబాణంతో

"ఇమాం పాదగతింరామ! తపోబల సమార్జితాన్ ।
లోకాన ప్రతిమాన్వా తే హనిష్యామి యదీచ్ఛసి ॥" (రా.మా. 76-7)

ఓ భార్గవరామా! నీ పాద గమనశక్తినైనా, నీ తపస్సు చేత సంపాదించిన పుణ్యలోకాలను పొందే కర్మఫలాలనైనను కొట్టి వేస్తాను నీ కిష్టమైనదేదో చెప్పుమన్నాడు.

తాను జయించిన భూమిని కాశ్యపునికి దక్షిణగా నిచ్చాడు. ఆ భూమిలో నుండక మనోజవంతో ఆకాశగమనాది రూపమైన శక్తిచేత మందర పర్వత మందు వసింపబోయే తన ప్రతిజ్ఞకు భంగమవుతుందన్నాడు పరశురాముడు. - వైష్ణవ తేజస్సు ఆ ధనస్సును గ్రహించినప్పుడే పూర్తిగా శ్రీ రాముణ్ని ఆవహించి నందువల్ల, పరశు రాముడు జవసత్వాలు ఉడిగి జడీభూతుడయ్యాడు. నీవు అక్షయ్యుడవు, మధు హంతవు. త్రిలోకనాథుడవని స్తుతించిన భార్గవరాముని పాదగతిని కాక, దివ్యలోకాలను పొందే అతని పుణ్యకర్మ ఫలాలను శ్రీరాముడు కొట్టివేశాడు.

ధర్మనిగళం: - "స్యాద్ధర్మ మస్త్రి యాం పుణ్యం" (అమరం) ధర్మమంటె పుణ్య కర్మ అని అర్థం. పుణ్యం కూడా బంగారు సంకెలయే.

"కస్మైస్వదేత సుఖ సంచరణోత్సుకస్య
కారాగృహే కనక శృంఖల యాఽపి బద్ధః ॥"

స్వేచ్ఛగా సంచరించే ఉత్కంఠగల వ్యక్తికి బంగారు సంకెళ్ళతోను చెరసాలలో బంధిస్తే మాత్రం రుచిస్తుందా?

"ధర్మం త్రైవర్గికం చ స్వయమిహ నిగమః పాపకోటౌ పపాఠ". ధర్మార్థ కామాలనే త్రివర్గ ఫలం కూడా పాపరాశిగానే శ్రుతి పలుకుతుందని 'తత్త్వముక్తా కలాప' మందు చెప్పబడింది. మోక్షప్రతిబంధకమైన పుణ్య కర్మనిగళాలను పరశురాముని హితం కోసమే శ్రీరాముడు విరుగగొట్టాడు.

(2) కాకస్యైకం హితమితి హినస్తిస్మ నయనమ్:- కాకాసురుడు ఇంద్రుని కుమారుడైన జయంతుడనే నామధేయుడు. అతడు తండ్రికి అర్పించిన యజ్ఞ హవిస్సులను భుజించే ఆశ కలవాడైనందువల్ల ఋషులచే శప్తుడై కాకాసురు దయ్యాడు. సీతారాములు చిత్రకూట పర్వతమందు విహరించి, సీతమ్మ తొడ మీద తలబెట్టి శ్రీరాముడు నిద్రిస్తున్న సమయాన కాకాసురుని దృష్టి సీతాస్తనమందు పడింది. మెత్తని మాంసమందలి ఆశతో సీతమ్మ స్తనాన్ని గాయపరచిన ఆర్ద్రా పరాధికాకాసురుడు. వేడి రక్తబిందువు పైన పడగానే మెలకువతో లేచాడు శ్రీరాముడు.

"అస్త్రామాస తృణం ప్రియా ద్రుహి" ప్రియురాలికి ద్రోహం చేసిన కాకి విషయమై గడ్డి పరకను విరిచి అభిమంత్రించగా అది బ్రహ్మాస్త్రమయింది. అది ధగ ధగ మంటూ వెంటబడితే, తండ్రియైన ఇంద్రుడు కాపాడలేనన్నాడు. ఋషులూ దేవతలూ అందఱు రక్షింపజాలక వదలివేస్తే మూడు లోకాలలోనూ తిరిగి తిరిగి వచ్చి అశక్తుడై "సతం నిపతితం భూమౌ" నేల మీద పడినాడు. రాముని పాదాలను పట్టుకోవాలనే బుద్ధితో పడలేదు.

"ప్రణత ఇతి దయాళుః" అన్నారు ఆళవందార్. దయాళుడైన శ్రీరాముడు భూమిపైన పడిన కాకాసురుణ్ని 'శరణు పొందుతున్నా'డని భావించాడు.

"వధార్హమపికాకుత్స్థః కృపయా పర్యపాలయత్" (సుం. 37-34)

శరణాగతవత్సలుడైన శ్రీరాముడు వధకు అర్హుడైన కాకాసురుణ్ని దయతో సంరక్షించాడని వాల్మీకి వాక్కు.

"తతస్తస్యాక్షి కాకస్య హినస్తిస్మ స దక్షిణమ్" (రా.సుం. 38-37)

ఆ కాకి కుడికంటినే హింసించాడట. ఆ కాకికి మేలు చేయాలనే బుద్ధి లేకపోతే, వైద్యుడు శస్త్ర చికిత్స చేసినట్లు, ఆ మాత్రం హింస కూడా చేయకపోయే వాడు కదా!

కాకిని శిక్షింపకుంటే నరక పతన మవుతుందనీ, రెండు కన్నులను పోగొడ్తే దేహయాత్రకు భంగం కలుగుతుందని శ్రీరాముడు దయా పరుడయ్యాడు.

"రాజభిర్ధృత దండాస్తు కృత్వా పాపాని మానవాః ।
నిర్మలాః స్వర్గమాయాంతి సంతస్సుకృతినోయథా ॥"

పాపాలు చేసి రాజులచే దండింపబడిన మానవులు నిర్మలులై పుణ్యాత్ముల లాగా స్వర్గాన్ని పొందుతారు అన్నట్లు, రాజదండితునికి యమదండన వేరే యుండదనే నీతిని బట్టి, కాకి మేలును కోరి దాని నయన మొక్కటినే బ్రహ్మాస్త్రానికి బలిచేసి ప్రాణంతో విడిచిపెట్టినందువల్ల కాకి 'చిరంజీవి' అనే పేరు పొందింది.

(3) అపాంపత్యుః శత్రూన్ హితమితి హినస్తిస్మ:- శ్రీరాముడు తన వానర సైన్యంతో సముద్రాన్ని దాటి లంకకు పోదలచాడు. శరణాగతి చేస్తే కోరిక శీఘ్రంగా ఫలిస్తుందనే తన అనుభవాన్ని బట్టి, విభీషణుడు 'భూపతివైన నీవు జలాధి పతియైన సముద్రునికి శరణాగతి చేస్తే ఆయన కరుణించి దారిని కల్పిస్తా'డని శ్రీరామునికి సూచించాడు. నూతన ప్రపన్నుని సూచనను బట్టి, శ్రీ రాముడు సముద్ర తీరమందు దర్భలు పరచుకొని కుడిభుజాన్ని తలగడగాపెట్టుకొని, మూడు రాత్రులు ప్రాయోప వేశ నియమాలను పాటిస్తూ మౌనంగా పడుకొన్నాడు. అయినా సముద్రుడు కనబడ లేదు.

క్షమాగుణం గల వ్యక్తిని అసమర్థునిగా భావిస్తున్నాడు సాగరుడు.

"చాపమానయసౌమిత్రే! శరాంశ్చాశీ విషోపమాన్ ।
సాగరం శోషయిష్యామి పద్భ్యాం యాంతుప్లవంగమాః ॥" (యు. 21-22)

లక్ష్మణా! ధనుస్సునూ, విషాన్ని విరజిమ్మే సర్పాల లాంటి బాణాలనూ తీసుకొని రా! సముద్రాన్ని ఎండగొడ్తాను. వానరులందరు నడచిపోదురు గాక! అన్నాడు

శ్రీరాముడు. లక్ష్మణుడు తెచ్చి ఇచ్చిన వింటిపైన బాణాన్ని ఎక్కుపెట్టి బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు రాముడు. సముద్రమంతా అల్లకల్లోల మయింది. ఏం ప్రళయం కానున్నదో అని భూచర, జలచర, ఖేచరాలన్నీ భయంతో కంపించిపోతున్నాయి.

"సముద్ధత మమిత్రఘ్నోరామో నదనదీపతిమ్" (యు. 22-16)

రాముడు శత్రుహంత: అపాంపతి బాగా ఉద్ధతుడని వాల్మీకి (సముద్రుడు రాముణ్ని శరణువేడక ముందు) అన్న మాట ఇది.

"తతో మధ్యాత్సము ద్రస్య సాగరః స్వయముత్థితః" - "గంగా సింధు ప్రధానాభి రాపగాభి సమావృతః । సాగరః, సముప క్రమ్య" (యు. 22 స. 23) మహాజలరాశి మధ్య నుంచి దివ్య స్వరూపంతో పైకి లేచి, పత్నులైన గంగాసింధు ప్రభృతి పుణ్య నదులతో ఆవరింపబడిన సముద్రుడు శరణు వేడడానికి శ్రీరాముని దగ్గరికి మెల్లగా వచ్చాడు. సమావృతుడనడం వల్ల స్త్రీల మధ్యన పురుషుని ఆకృతియే కనబడలేదని, దయోత్తంభనం కోసమే పత్నులతో సమావృతుడై వచ్చాడని స్పష్టమవుతున్నది. సముద్రుడు బద్ధాంజలియై విన్నపించే మాటలిలా ఉన్నాయి.

"పృథివీ వాయురాకాశమాపోజ్యోతిశ్చ రాఘవ ।
తత్స్వభావోమమాప్యేష యదగాధోఽహమప్లవః ॥" (25)

స్వామీ! సృష్టికర్తవు నీవే కదా! భూతాలకు స్వభావాలను కూడా నీవే కల్పించావు. భూమికి కాఠిన్యం, వాయువుకు సదాసంచరణం, అగ్నికి ఊర్ధ్వ జ్వలనం, ఆకాశానికి అంతటా వ్యాపించడమెలా స్వభావమో, ఆలాగే సముద్రుడనైన నాకు గాంభీర్యమూ, ఉచ్చలత్తరంగాలతో దాటనీయని స్వభావమూ కల్పించిన నీ నియమాన్ని పాటించి నిన్ను ఆదరించక పోవడమే అపరాధమయింది. ప్రభూ! క్షమించుమని అపాంపతి శరణాగతి చేశాడు. శ్రీరామభద్రుడు ప్రసన్నుడయ్యాడు.

ప్రసన్నుడు కాకుండా స్వామి నిగ్రహించిన వాడైతే, జగన్మంగళలైన గంగాదినదులకు పతిహాని చేత అమంగళత్వమేర్పడి లోకాలకు అనర్థమే జరిగేది కదా! అందుకే ప్రసన్నుడైన క్షణంలోనే,

"తమ బ్రవీత్తదారామః, ఉద్యతోహినదీపతే ।
అమోఘోఽయం మహాబాణః కస్మిన్దేశే నిపాత్యతామ్" (29)

నదీపతియైన ఓ సముద్రుడా! సంధించబడిన ఈ బాణం అమోఘం కదా! ఎక్కడ ప్రయోగించుమంటావు? అని రాముడు అడుగడం ఆశ్చర్యమనిపించక మానదు.

"ప్రణత ప్రతికూలమూలఘాతీ ప్రతిఘః కోఽపి" అనే (24) శ్లోకం, "భవతి పరతంత్రః ప్రణమతాం" (63) శ్లోకం కీర్తించి నట్లు – 'ఆశ్రిత పరతంత్రుడైన రాముడూ, ఆశ్రితుల శత్రువులను సర్వనాశనం చేసే రాముని కోపమూ, ప్రపన్నుడైన వరుణాలయుని (సముద్రుని)కి కింకరత్వాన్ని సేవాధర్మాన్ని నెరవేర్చడం రమ్యంగా ప్రదర్శింపబడుతున్నది.

"ఉగ్ర దర్శన కర్మాణో బహవస్తత్రదస్యవః" (32) నాలోనే ద్రుమకుల్య, మనే ప్రసిద్ధమైన ఉత్తర ప్రాంతమందు భీకరాకృతి కలిగి ఉగ్రకర్మల నాచరిస్తున్న శత్రువులు అనేకులున్నారు. జలాన్ని పీల్చి వేసి ఎడారిగా మార్చిన నా శత్రువుల (దస్యుల) మీద నీ బాణాన్ని ప్రయోగించి నాకు భద్రతను కల్పించుమని ప్రార్థించాడు సముద్రుడు. శ్రీరామభద్రుడు సముద్రునిపై ఆగ్రహంతో ప్రయోగించిన బాణం చేత, అతడు ప్రణమిల్లిన క్షణాన అతని హితం కోరి, అతని విరోధులను సర్వ నాశనం చేయడం సముద్రుని పట్ల వరప్రసాదంగా పరిణమించింది.

విలీన స్వాతంత్ర్యో వృషగిరిపతి స్త్వద్విహృతిభిః:– శ్రీనివాస భగవానుడు ధర్మగిరి ప్రభువు. ధర్మాధర్మాల ఫలప్రదాన నియమానికి భంగం కలుగరాదు అనే ఆయన స్వాతంత్ర్యం దయాదేవీ విలాస విహార విన్యాసాలలో విలీనమయింది. అపరాధుల పట్ల భగవంతునికి కలిగే ఆగ్రహం, అనుగ్రహంగా మారితే భగవతి దయాదేవి చాలా సంతోషపడుతుంది. "ననమేయంతు కస్యచిత్" – ఎవరికీ తలవంచను అన్న వ్యక్తులను దండించుగాక, కాని సాపరాధులు సప్రశ్రయులై ప్రణతులర్పించిన వారి పట్ల భగవానుడు నిగ్రహాన్ని చూపి శిక్షింప యత్నిస్తే, ఆయన ప్రయత్నాన్ని దయాదేవి తన ప్రభావంతో ఆటంకపరుస్తుంది. తన కోరికను తాను చక్కగా నెరవేర్చుకోలేని వాడనే అర్థం కలది 'విలీన స్వాతంత్ర్యః' అనే పదం. కాలానల జ్వాల లాగా ప్రజ్వలించే బాణాలు ప్రశాంతతను పొందడం దయాకార్యమే.

దిశత్యేవం దేవో జనితసుగతిం దండనవిధిమ్:– సముద్రునిపై సంధింపబడిన రామబాణం సముద్రుని బాహ్య శత్రువులను సంహరించి సముద్రునికి సంక్షేమం

కలిగించింది. ప్రఖ్యాతి బడసిన పరాక్రమాన్ని సహింప జాలక దోషంగా భావించే పరశురామునిపై నిగ్రహంతో ఎక్కుపెట్టిన రామబాణం ఆయన అంతఃశత్రువులను నశింపజేసి సుగతికి హేతువయింది. పచ్ఛిద్రోహియైన పక్షి కావు కావు మని అరచినా వినకుండా వెంటబడి తరిమిన బ్రహ్మాస్త్రం, పక్షి శక్తిలేనిదై నేలమీద పడగానే దాని ప్రాణాన్ని హరించకుండా, దాని ఆత్మ హితాన్ని కోరి, ధ్వాం క్షం యొక్క దక్షిణాక్షిని మాత్రమే ధ్వంసం చేసింది.

"నా హితం కారయే ద్ధరిః" భగవానుడు చెఱపు జేయడు. ఆయన విధించే దండన క్రమం ఆయన కృప వల్లనే శోభన ఫలప్రాప్తి రూపంగా పర్యవసిస్తుంది. దండనకే దుర్గతిపడుతుంది. చేతనులకు సద్గతియే కలుగుతుంది. భగవద్దయ విహరించే క్రమమే క్రమమైనది కదా!

మ॥ నయవిచ్ఛేష గిరీశు డబ్ధిరిపులన్ దండించె, గాకా సురున్
నయనం బొక్కటి గొంచు గాచె గొని పుణ్య స్తోమముల్ బ్రోచెనా,
స్మయమానుండగు రాము నీ విహృతులన్ స్వాతంత్ర్య నిర్ముక్తుడై
దయ! దండం బొనరింప బూనిన శుభోదర్కంబుగా జేసెడున్ ॥

65. నిషాదానాం నేతా కపికుల పతిః కాఽపి శబరీ
కుచేలః కుబ్జాసా వ్రజయువతయో మాల్యకృదితి ।
అమీషాం నిమ్నత్వం వృషగిరిపతేరున్నత మపి
ప్రభూతైః స్రోతోభిః ప్రసభ మనుకం పే! సమయసి ॥

అర్థం:- హే అనుకంపే = ఓ దయాదేవీ! నిషాదానాం = బోయ వారికి; నేతా = నాయకుడైన గుహుడు; కపికుల పతిః = వానరేశుడైన సుగ్రీవుడు; కా+అపి, శబరీ = ఒకానొక బోయ స్త్రీయైన శబరి; కుచేలః = జీర్ణవస్త్రుడైన కుచేలుడు; సా = ఆ, కుబ్జా = గూనిదైన కుబ్జ; వ్రజయువతయః = గొల్ల పడతులు; మాల్యకృత్ = మాలాకారుడు; ఇతి = అని; అమీషాం = వీరి యొక్క; నిమ్నత్వం = తక్కువ తనాన్ని; వృషగిరిపతేః = వేంకటాద్రీశుడైన శ్రీనివాసుని యొక్క; ఉన్నతిం, అపి = ఎక్కువ తనాన్ని; ప్రభూతైః = చాలా పెద్దవియైన; స్రోతోభిః = ప్రవాహాల చేత; ప్రసభం = బలాత్కారంగా, సమయసి = సమీకరిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! గుహుడు, సుగ్రీవుడు, శబరి, కుచేలుడు, కుబ్జ, గొల్ల పడతులు, మాలాకారుడు అనే వీరు జాత్యాదులచే విహీనులు. శ్రీ వేంకటేశ్వరుడు మహోన్నతుడు. నీ గొప్ప ప్రవాహాల చేత ఇట్టి ఉచ్చ నీచాలను మిట్టపల్లాలను సమానం చేస్తున్నావు.

వ్యాఖ్య: దయా ప్రవాహ ప్రభావం ఉచ్చనీచాలెంచక భగవానునికీ భాగవతులకు సామ్యాన్ని సంఘటింపజేస్తుందని వర్ణితం.

ప్రవాహం అవట తటవైషమ్యం లేనిది. నిమ్నోన్నతాలను సమానం చేస్తుంది. "కో మజ్జతో రణుకులాచల యోర్విశేషః" (స్తో.ర) పరమాణువైనా పర్వతమైనా మునిగిపోతుంటే వాటికి తరతమ భేదమేమున్నదన్నారు ఆళవం దార్లు. తిరుమలేశుని దయా ప్రవాహం ఉచ్చనీచాలను సమానం చేస్తుంది.

సమకాలీనుల పట్ల సమాన ధర్మంతో ప్రవర్తించే వ్యక్తి నే 'గుణవాన్' (గుణవంతుడు) అని వాల్మీకి అన్నాడు. "వశీవదాన్యో గుణవాన్" అన్నారు ఆళవందార్లు. దయాదేవికి ప్రముఖ సఖియైన ఈ ఉత్తమ గుణమే 'సౌశీల్యం' అనబడుతుంది.

"మహతో మందైః సహ నీరంధ్ర సంశ్లేషః సౌశీల్యమ్" మహోన్నతుడైన వ్యక్తి జన్మచేతనూ, వృత్తి చేతనూ చాలా హీనులైన వారితో ఎచ్చు తగ్గులను భావించక కలిసి మెలసి యుండడమే సౌశీల్యమని నిర్వచింపబడింది.

సౌశీల్యం కేవలం దయచేత ఆవిష్కరింపబడే ఉత్తమ గుణమైతే, "పరమం సామ్యముపైతి" అని ఉపనిషత్తు బోధించే పరమ సామ్యం' ఉత్తమ ఫలం.

ఈ భరత వర్షమందు భగవానుడు అవతరించి, సౌశీల్యంతో ప్రవర్తించి, భవిష్యత్తులో కలిగే పరమసామ్య రూపమైన మోక్షదశ ఇక్కడనే అంకురిస్తుందని సర్వలోక సాక్షికంగా ప్రదర్శించాడు.

శరణాగతి చేసి కృత కృత్యుడైన వ్యక్తి 'అనఘోముక్తవదసౌ" ఇతడు ముక్త పురుషుని వలె ధన్యాత్ముడు – అన్నట్లు అనుసంధింపబడుతుంటాడు.

"యజ్జాతీయో యాదృశో యత్స్వభావః, పాదచ్ఛాయాం సంశ్రితో యోఽపి కోఽపి। తజ్జాతీయస్తాదృశస్త త్స్వ భావః, శ్లిష్యత్యేవం సుందరో వత్సలత్వాత్" (సుం. బా.స్తవం -30) ఏ జాతిలో జన్మించినా, ఏ నడవడి కలవాడైనా, ఎవడైనా తన పాదాలను ఆశ్రయిస్తే చాలు; సుందర బాహుస్వామి వాత్సల్యం కలవాడైనందు వల్ల ఆ జాతినే, ఆ నడవడినే, ఆ స్వభావాన్నే కలవాడై అతనితో సంశ్లేషిస్తుంటాడు.

"తద్వై తథాఽస్తు కతమోఽయ మహో స్వభావో
యావాన్యధా విధగుణో భజతే భవన్తమ్।
తావాంస్తథావిధ గుణ స్తద ధీనవృత్తిః
సంశ్లిష్యసి త్వమిహ తేన సమాన ధర్మా" (శ్రీ వై.స్త 66)

స్వామి! నీ స్వభావం అవాఙ్మానస గోచరం. నీ సౌశీల్యం అనిర్వచనీయం. నిన్ను ఉపాసించే వ్యక్తి ఎట్టి జ్ఞాన, గుణాలు కలవాడై నిన్ను భజిస్తాడో, అతని పట్ల నీవు అట్టి జ్ఞాన గుణాలను కలవాడవై, అతని అధీనమైన ప్రవర్తన మరియు అతనితో సమాన ధర్మాలను కలవాడవై, అతనికి సంశ్లేష రూప ఫలాన్ని ఇస్తావు - అని శ్రీ వత్సాంకమిశ్రులు స్తుతించారు.

"తమ్మై యోడొక్క అరుళ్ శెయ్‌వర్" తమతో సామ్యాన్ని కృప జేస్తాడు అన్నారు ఆళ్వార్లు.

"తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్" తన కృప చేతనే భగవానుడు ప్రపన్నునికి సాక్షాత్కరిస్తాడు, సంశ్లేషిస్తాడు అన్నది ఉపనిషత్తు.

"ముక్తిం తతో హి పరమం తవ సామ్యమాహుః"

భగవానుని తోటి పరమసామ్యాన్నే ముక్తి అన్నారు బ్రహ్మవిదులు. "నిరంజనః పరమం సామ్యముపైతి" పాపపుణ్యకర్మలు నశించిన పరిశుద్ధాత్ముడు పరమసామ్యమనే మోక్షాన్ని పొందుతాడు అని ఛాందోగ్యోపనిషత్తు విశదీకరిస్తున్నది. భగవానునికి సామ్యబుద్ధిని కల్గించడం దయాకార్యమని స్తుతిస్తున్న ఈ శ్లోకంలో మూడు రామాయణంలోనివి, నాలుగు భాగవతం లోనివి, మొత్తం ఏడు (7)

వృత్తాంతాల చేత, జాత్యాదిహీనులతో సామ్యం ప్రకటింపబడుతున్నది. శ్రీరామకృష్ణులు పూర్ణావతార పురుషులు కదా!

1) నిషాదానాం నేతా:- గుహుడు అజ్ఞానానికి, పరహింసా ప్రవృత్తికి హేతువైన క్రౌర్యానికి ఆశ్రయమైన ఆటవిక జాతియందు పుట్టిన కిరాతులకు నాయకుడు. భయంకరమైన ఆకారం కలవాడు. అజ్ఞానం గానీ, క్రౌర్యం గానీ సత్సంగాదుల చేత మారవచ్చునేమో కాని, జన్మసిద్ధమైన ఈ జాతి మాత్రం మారేది కాదు. 'క్షుద్ర ప్రవృత్తి గల నీచజాతి వాడను' అని తన నైచ్యాన్ని చెప్పుకొని ఆశ్రయించిన వాడూ కాడు. ఇక శ్రీరాముడు, మాయా మానుష విగ్రహుడు, దేవత్వాన్ని దాచుకొని వచ్చిన మానవుడే అయినా పరమధార్మికులైన ఇక్ష్వాకు ప్రభృతి మహారాజులకులమందు జన్మించినవాడు. విద్యా సంస్కారాలు కలవాడు. జన్మసిద్ధమైన జాతి వైషమ్యమిద్దరిలో ఎంతో ఉంది. జ్ఞానాధిక్యం, జితేంద్రియత్వాలను బట్టి శ్రీరామునికీ, గుహునికీ పర్వత పరమాణువులంతటి తారతమ్యమున్నది.

అయినా శ్రీరాముడు సపరివారంగా వస్తున్న గుహుణ్ని చూచి, "ఆత్మసమః సఖా" తన ప్రాణం వంటి మిత్రుడని భావించి, "సహసౌమిత్రిణారామస్సమాగచ్ఛత్" లక్ష్మణునితో కూడి ఎదురేగినాడు. రామునికి రాజవంశమందు జన్మించితిననే అహంకారం లేదు. ఆ గుహుని రాముడు (నీరంధ్ర సంశ్లేషం) గాఢాలింగనం కావించుకొన్నాడు. రాముని ఆలింగనమందే గుహుడు రామునికి ఆప్తుడు, మిత్రుడు, భక్తుడు అనే భాగాలన్నీ ఇమిడియున్నాయి.

"అపితే కుశలం రాష్ట్రే మిత్రేషు ధనేషుచ" అని గుహుని యోగక్షేమాల నారసినాడు.

శ్రీరాముని దర్శనభాగ్యం వల్ల గుహుని అంతరాత్మతాండవించింది. ఆత్మార్పణ గావించాడు.

'పెరియతిరుమొషి' అనే దివ్యప్రబంధమందు పరకాలముని అనుసంధించిన 'ఏప్షై ఏదలన్ కీష్మగన్' అనే పాశురాన్ని బట్టి, గుహుని విషయంలో శ్రీరామభద్రుడు దివ్యమైన కృపను ప్రసరింపజేశాడని తెలుస్తున్నది.

"మాషైమాన్ మడనోక్కి ఉన్‌తోషి, ఉమ్బి ఎమ్బి, ఎన్టొషిన్దిలై ఉగన్దు, తోషన్ నీ ఎనక్కు" (పె.తి. 5శ. 8 దశకం. 1పా)

'అమాయకమైన లేడి వంటి చంచలమైన చూపులు గల నా పత్ని సీత నీకు స్నేహితురాలు, నా తమ్ముడు లక్ష్మణుడు నీకూ తమ్ముడే, అని ఇంతటితో ఆగక, నీవు నాకు స్నేహితుడవు' – అని ఏ మాత్రమీసడింపు లేకుండా, "మమసాధర్మ్య మాగతాః" అని గీతాప్రమాణానుసారంగా, ఆశ్రితులకు మోక్షదశలో గుణ, భోగ, దేహసామ్యాలను ప్రసాదించే విధంగా, శ్రీరామచంద్రమూర్తి క్రియా రూపంగా తన మహోన్నతాశయాన్ని ప్రకటించాడు కదా!

"ఆచచక్షేఽథ సద్భావం లక్ష్మణస్య మహాత్మనః ।
భరతా యా ప్రమేయాయ గుహో గహనగోచరః ॥" (రా. అర. 86–1)

గుహుడు లక్ష్మణుని వృత్తాంతాన్ని భరతునికి తెల్పినాడన్న సందర్భ శ్లోకమిది. ముగ్గురు మహానుభావులకు మూడు విశేషణ పదాలను వాల్మీకి ప్రయోగించాడు.

(1) గుహుడు గహనగోచరుడు – వేదాంత వన సంచారియైన పరబ్రహ్మను చూచే 'బ్రహ్మచారి' అని అర్థం. (బ్రహ్మ భావే మనశ్చారో బ్రహ్మచారీ ప్రచక్షతే)

(2) లక్ష్మణుడు మహాత్ముడు – (మహాన్ ఆత్మా యస్మిన్ సః) పరమాత్మను తన యందు నిల్పుకొన్న జ్ఞాని / శేషుడు.

(3) భరతుడు అప్రమేయుడు – (అం, ప్రకర్షేణ మాతుం యోగ్యః) విష్ణుమూర్తిని బాగా కొలిచేవాడు.

లక్ష్మణుడు భగవంతుణ్ని అనుసరించిన వాడు కాగా, మిగత ఇద్దఱు కొలుస్తూ (వనమందు) తిరిగేవారే. వస్తుతః, ముగ్గురూ భక్తులే కదా!

"నిషాదజాత్యో బలవాన్ స్థపతిశ్చేతి విశ్రుతః" (అర. 50 స. 33)

గుహునికి (నిషాద) స్థపతి అని ప్రసిద్ధనామం. ఆ వనమంతా అతని పరిపాలనలోనిదే. లోకులను గుహుడు గంగానదిని దాటించేవాడు. రాముడు దుస్తరమైన సంసార సింధువును దాటిస్తాడు. గుహుడు 'నిషాదానాంనేతా'. రాముడు 'విశ్వేషాం నేతా'.

(519) పరంజైమినిర్ముఖ్యత్వాత్ (4-3-11) అనే సూత్రానికి శ్రీ భాష్యమందు 'నిషాద స్థపతిన్యాయేన బ్రహ్మైవ లోకో బ్రహ్మ లోక ఇతి కర్మధారయస్యైవ యుక్త త్వాత్" అనే పంక్తి ఉంది. 'నిషాదస్థపతి' అనే న్యాయమంటే "ఏతయా నిషాద స్థపతిం యాజయేత్" అనే వాక్యం, నిషాదస్థపతిచే యాగాన్ని చేయించవలెనని పూర్వ మీమాంసయందు విధిస్తున్నది.

'నిషాదానాం స్థపతిః' నిషాదులకు ప్రభువైన ద్విజుడు (యాగం చేయడానికి అర్హుడు) అని షష్ఠీ తత్పురుష సమాసం తెల్పుతుంది. 'నిషాదశ్చాసౌ స్థపతిశ్చ నిషాద స్థపతిః' అనే కర్మధారయ సమాసం నిషాదజాతివాడైన ప్రభువును తెల్పుతుంది (అదొక చర్చ).

కర్మధారయ సమాసాన్ని సమానాధికరణ తత్పురుషమంటారు. 'నిషాదానాం స్థపతిః' అనే షష్ఠీ సమాసం వ్యధికరణ తత్పురుష ప్రకరణంలోనిది కదా!

'నిషాదస్థపతి' అనే సమాస పదాన్ని గానీ, 'స్థపతి' అనే వ్యస్త పదాన్ని గానీ దేశికులు ప్రయోగించలేదు. కేవలం 'నేతృ' శబ్దాన్ని ప్రయోగించిన 'నిషాదానాం నేతా' అనే వ్యధికరణం చేత భగవానుడైన శ్రీరాముడు గుహుని చేత ఆత్మ యాగాన్ని చేయిస్తున్నాడేమో అన్నట్లూ, నేత వెంట వచ్చిన నిషాదుల తోనూ సంశ్లేష ప్రదర్శన కోసమూ (విభీషణుడు నలుగురు రాక్షసులతో వచ్చాడన్నట్లూ) నిర్దేశింప బడుతున్నది కదా!

(2) కపికులపతిః :- చాపల్యానికి పేరు పొందిన శాఖా మృగజాతికి అధిపతి సుగ్రీవుడు. కోతులు, కొండెంగలు, భల్లూకాలకు మేటి దొరయైన సుగ్రీవునితో శ్రీరామచంద్ర స్వామి అగ్నిహోత్ర సాక్షిగా మైత్రిని నెరపినాడు.

సువేల పర్వతశిఖరం మీద సైన్యంతో ఉన్న రామలక్ష్మణులను తన భవనం మీది నుంచి రాజఠీవితో చూస్తున్న రావణుని మీదికి లంఘించి, అతనితో ద్వంద్వయుద్ధం చేసి వచ్చిన సుగ్రీవుణ్ని తాను కౌగలించుకొని, అందఱు జయధ్వానాలు చేస్తుంటే, శ్రీరాముడు మాత్రం అతణ్ని మందలించిన మాటలు తనకు సుగ్రీవునితో గల స్నేహదార్ఢ్యాన్ని ప్రకటిస్తున్నాయి.

"త్వయి కించిత్సమా పన్నే కింకార్యం సీతయా మమ।
భరతేన మహాబాహో! లక్ష్మణేనయవీయసా ॥" (యు. 41-4)

నాతో చెప్పకుండా ఎంత సాహసం చేశావయ్యా! నీకేదైనా ప్రమాదం జరిగితే నేను జీవింపగలనా? అప్పుడు నాకు సీతతో నేమి పని? తమ్ములతోనేమి ప్రయోజనం? నీవు ఇక ముందు ఇట్టి సాహసకృత్యం చేయకు సుమా! అన్నాడు.

(3) కాఽపిశబరీ:- కిరాత, శబర, పుళిందులనేవి ఆటవికుల జాతిభేదాలు. అడవిలో వేటాడి జీవించే జాతి శబరజాతి. ఆ జాతిలో జన్మించి ప్రత్యేకమైన పేరులేని ఆవిడ కాబట్టి 'కా అపి' - ఒకానొక అసాధారణమైన పుణ్యస్త్రీ. 'శబరి' అనే పేరుతో వ్యవహరింపబడుతున్నది.

మతంగమహాముని ఆశ్రమంలో చేరి, ఆయన పాదాల నాశ్రయించి, ఆచార్య సేవలోనే శబరి తల 'ముగ్గుబుట్ట' అయింది. కామక్రోధాదులను జయించింది ఆవిడ.

'ఆగమిష్యతి తేరామః సుపుణ్య మిమమాశ్రమమ్ ।
సతే ప్రతిగృహీ తవ్యః సౌమిత్రి సహితో ఽతిథిః ।
తంచదృష్ట్వా వరాన్‌లోకా నక్షయ్యాంస్త్వంగమిష్యసి ॥" (అర. 74-16)

ఈ ఆశ్రమానికి లక్ష్మణునితో పాటు శ్రీరాముడు రాగలడు. ఆయనను దర్శించి, ఆతిథ్యమిచ్చి పూజించిన తర్వాత నీవు శాశ్వతానంద మయ లోకాలను పొందగలవని మతంగముని శబరితో చెప్పి దివంగతుడయ్యాడు. కాబట్టి శబర్యాశ్రమానికి రాముణ్ని రప్పించగలిగినది కేవల మావిడ యందు ఆచార్యులకు గల అభిమానమే.

"శబర్యాపూజితః సమ్యగ్రామో దశరథా త్మజః' అన్నాడు వాల్మీకి. శబరి ఏండ్ల కొలది రాముని రాక కెదిరిచూస్తూ ప్రతిదినం పూలూ, పండ్లనూ తెంపి భద్రంగా ఉంచేది. తన ఆశ్రమానికి వచ్చిన రాముణ్ని పూజించింది. పండ్లను తినిపించింది. నీ దర్శనం వల్ల 'పూతాఽస్మి' - నా జన్మ పావనమయిందన్నది. ఆవిడ ఆచార్యుల మహిమను ఆవిడ నోటనే విన్న రాముడు మహానందంతో రాజిల్లాడు. ముక్తిని

అనుగ్రహించుమని శబరి, మాట వరుసకైనా రాముణ్ని అడుగ లేదు. నేను వెళుతున్నానని రామలక్ష్మణులను అక్కడనే విడిచిపెట్టి, యోగ మార్గాన తన జీర్ణ దేహాన్ని దగ్ధం చేసుకొన్న యోగిని శబరి. అందుకే – "అపరాధ్య మహిమ మునిజన భజన మృదిత హృదయ కలుష శబరీ మోక్ష సాక్షిభూత" (రఘువీర గద్య)

దేశికుల వారు శ్రీరామచంద్రస్వామిని శబరి మోక్షానికి సాక్షిభూతుడని వర్ణించారు.

భగవానుడు రామావతారమందు జాతి, లింగ భేదమూ చూడక, గుహుడు, సుగ్రీవుడు, శబరి అనే వ్యక్తులతో సమానంగా, తన ఉన్నత స్థాయిని తగ్గించుకొని, ప్రవర్తించిన మర్యాదా పురుషోత్తముడు కదా!

శ్రీకృష్ణభగవానుడు లీలామానుష విగ్రహుడు. ఆయన దేవుడుగానే పుట్టాడు. పుట్టిన వెంటనే ఆ శిశువు శంఖచక్ర గదా ఖడ్గ పాణియైన నారాయణ స్వరూపంతో తల్లిదండ్రులకు – దేవకీ వసుదేవులకు – సాక్షాత్కరించాడు. శైశవం నుంచి కృష్ణుడు చేసిన ఘనకార్యాలన్నీ అతి మానుష చేష్టితాలే. దయాదేవి, సమాజంలో కడు తక్కువ స్థాయిలో ఉన్న వ్యక్తులందఱికి ఉపగమ్యుడుగా శ్రీకృష్ణుణ్ని ప్రవర్తింప జేసింది. ఆబాలగోపాలం హర్షించే విధంగా కృష్ణుడు, పరత్వ సౌలభ్యాలను స్వేచ్ఛగా ప్రదర్శించాడు. ఆయన కృత్యాలన్నీ 'కృష్ణ లీలలు' గానే ప్రసిద్ధిని పొందాయి.

(4) కుచేలః :– పేదబాపనయ్య. కట్టుకొన్న భార్యకు, కన్న బిడ్డలకు పట్టెడన్నం పెట్టి పోషింపజాలని నికృష్ట దరిద్రుడు కుచేలుడు. చినిగిన, పాత, ముఱికి బట్టలను కట్టుకొన్న రూపాన్ని బట్టి 'కుచేలుడు' అనే పేరు అన్వర్థమయింది. సుదాముడని పేరు. అఖండ విద్యా విజ్ఞాన సంపన్నుడు. కుచేలుడు, కృష్ణుడు బాల్య మిత్రులు. 'సాందీపని' గురువు వద్ద సకల విధసేవలు చేసి విద్య నభ్యసించిన సహాధ్యాయులు.

పత్నీ ప్రేరణచే కుచేలుడు ద్వారకకు వెళ్ళాడు. కృష్ణుని దర్శనం ఇహపర సాధన మని భావిస్తూ కృష్ణుని భవనంలోకి చేరాడు.

"తం విలోక్యాచ్యుతో దూరాత్ప్రియా పర్యంక మాస్థితః ।
సహసోత్థాయచాభ్యేత్య దోర్భ్యాం పర్యగ్రహీన్ముదా ॥" (భాగ. 10-80-18)

శ్రీకృష్ణుడు దూరం నుంచి చూడగానే తటాలున తల్పందిగి, ఎదురేగి, రెండు బాహువులతో కుచేలుణ్ని గాఢాలింగనమొనర్చు కొన్నాడు. తల్పం పైన కూర్చుండ బెట్టి, కలశజలంతో కాళ్ళు కడిగి, పాదజలాన్ని తలమీద జల్లుకొన్నాడు. చందన పరిమళ ద్రవ్యాలను లేపనం చేశాడు. రుక్మిణీదేవి వింజామర వీచింది. మూటలోని ముక్క అటుకులను బుక్కాడు కృష్ణుడు. చిన్ననాటి ముచ్చట్లు గుర్తుకు తెచ్చుకొన్నారు. రాత్రి విందారగించారు.

ఉదయాన లేచి కుచేలుడు తన పురానికి బయల్దేరాడు.

దారిలో 'దరిద్రునికి సంపద వస్తే తనను మరచిపోతాడని విత్తమేమీ తనకు కృష్ణుడివ్వ లేదు' అనుకొంటూ ఇల్లు చేరాడు. గుడిశ కనబడలేదు. మహేంద్ర భవనం లాంటి మందిరంలో నుంచి దివ్యాంగనల్లాంటి స్త్రీలు వచ్చారు, మంగళవాద్యాల తోనూ, సంగీత నృత్యగానాలతో కుచేలుణ్ని స్వాగత పరచి లోనికి తీసుకొని పోగా, లక్ష్మీదేవి లాగా సర్వాభరణ భూషితయైన భార్య దాసీ జనంతో వచ్చి పాదప్రక్షాళన చేసి, ఆ నీటిని శిరస్సున చిల్కరించుకొన్నది. కుచేలుడు, సర్వ సంపదల సమృద్ధి కలుగడానికి కారణం, రాత్రివేళ అందఱు నిద్రిస్తుంటే పెద్దగా వర్షించే మేఘం లాంటి శ్రీకృష్ణ భగవానుని ఉదార స్వభావమే కదా! అని కృష్ణాను స్మరణంతో సుఖజీవనం గడిపాడు.

(5) కుబ్జా, సా:- మధురానగర ప్రభువైన కంసుని చేటి. ఇది గూనిది. పేరు త్రివక్ర. కంసునికి చందనాను లేపనం చేయబోయే ఈ దాసికి వీధిలో బలరాముల దర్శనమయింది. మాకు చందన మిస్తావా? అని అడిగిన కృష్ణుని మాటకు, రూపానికి ముగ్ధురాలై స్నిగ్ధమైన చందనాను లేపనమొసగింది. కృష్ణుడు ఈ మెను రెండుసార్లు సమీకరించాడు.

"పద్భ్యామాక్రమ్య ప్రపదే ద్వ్యంగుళోత్తాన పాణినా ।
ప్రగృహ్యచుబుకేఽ ధ్యాత్మ ముదనీన మదచ్యుతః ॥ (భాగ. 10-427)

మూడు వంకరలుగల కుబ్జ యొక్క రెండు పాదాల ముందు భాగాన్ని తన రెండు పాదాలతో నొక్కి పట్టి, ఆమె గదువ క్రింద రెండు వ్రేళ్ళు వెలకిలగా తన చేతిని పెట్టి పైకి లాగాడు కృష్ణుడు - కుబ్జ శరీరం సమానమై మనోహరమయింది. ఇది మొదటి సమీకరణం.

"ఉత్తరీయాంతమాకృష్య స్మయంతీ జాతహృచ్ఛయా" రూప గుణౌదార్య సంపన్నయైన కుబ్జ కృష్ణుణ్ని అనుభవించే కోరిక కలదై ఆయన ఉత్తరీయాన్ని పట్టి లాగి నవ్వుతూ 'ఏహి వీర! గృహం యావః" వీరశిరోమణీ! ఇంటికి పోదాం రమ్మన్నది.

"కుబ్జా కృష్టాంబర ధరః" అనే పేరు కృష్ణుని కేర్పడింది. (అష్టోత్తర శతనామావళి)

"దోర్భ్యాం స్తనాంతరగతం పరిరభ్య కాంత మానంద మూర్తి మజహా దతిదీర్ఘ తాపమ్" – కుబ్జ అతిలోక సుందరియైన తర్వాత రెండు చేతులతో కృష్ణుణ్ని గాఢంగా ఆలింగనం చేసుకొని దీర్ఘతాపాన్ని పోగొట్టుకున్నది. ఇది రెండవ సమీకరణం.

రామాయణంలో 'మంథర' అనే పేరుగల పాపదర్శినియైన కుబ్జ కైకేయికి దాసిగా ఉంది కదా! 'కుబ్జయా పాపదర్శిన్యా విషాదమగమత్పరమ్" (అయో 7-16) "కైకేయీత్వబ్రవీత్ కుబ్జాం కచ్చిత్ క్షేమం ను మన్థరే!" (7.17). ఈ మంథర జన్మ వృత్తాంతం రామాయణంలో "యతోజాతా" ఎక్కడనో పుట్టిందని ఉంది కాని స్పష్టంగా తెలియదు.

భారతంలో అరణ్య పర్వమందు మాత్రం ఇలా ఉంది.

"పితామహవచః శ్రుత్వా గంధర్వీ దుందుభిస్తతః ।
మంథరా మానుషేలోకే కుబ్జా సంభవత్తదా ॥"

చతుర్ముఖ బ్రహ్మ యొక్క ఆజ్ఞా ప్రకారం 'దుందుభి' అనే గంధర్వ స్త్రీ మర్త్య లోకంలో 'మంథర' అనే పేరుతో కుబ్జ (గూని కలది)గా పుట్టింది అని తెలుస్తున్నది.

"కూనే శిదైయ వుండైవిల్ నిఱత్తిల్ తెఱిత్తాయ్ గోవిందా" (తి.వామొ 1-5-5) శ్రీ రాముడు చిన్నతనాన ధనుర్విద్యను అభ్యసిస్తున్నప్పుడు మంథర గూను మీద ఉండెల దెబ్బవేశాడట. అందుకే మంథరకు రామునిపై కోపం ఉండింది.

శ్రీరాముడు చేసిన దుష్కృత్యాలన్నీ శ్రీకృష్ణుని పైననే (నింద) మోపబడినవి అని ఈడు వ్యాఖ్య. అంటే శ్రీరామునికి గుణకీర్తి, శ్రీకృష్ణునికి అల్లరి పిల్లడని పేరు వచ్చింది.

"కుబ్జా, సా" అనడం వల్ల 'మంథర' అనబడే కుబ్జకాదు. మధురానగరంలో కంసునికి చందన లేపనం చేసే 'త్రివక్ర' అనబడే ప్రసిద్ధమైన 'కుబ్జ' అని తచ్ఛబ్దం (సా) తెల్పుతున్నది.

(6) వ్రజయువతయః :- గోపికలు ఏ మాత్రం జ్ఞానం లేనివారు. "అరివొన్రు మిల్లాద వాయ్క్కులమ్" కుడి యెడమలు తెలియని గొల్లలు. పల్లె పడతులు. నాగరికలు కారు. ఆ వ్రేతల అమాయుక ప్రవృత్తి వారి మాటల్లోనే ప్రస్ఫుటమవుతుంది.

"తాసాం ముకుందో మధు మంజుభాషితైః గృహీతచిత్తః పరవాన్ మనస్వ్యపి।
కథం పునర్నః ప్రతియాస్యతేఽబలా గ్రామ్యా స్సలజ్జస్మిత విభ్రమైర్భ్రమన్ ॥"
(భాగ. 10-39.24)

నాగరికలైన మధురానగర వనితలు తేనెలొలికే తీయని మాటలతో కృష్ణుని చిత్తాన్ని తమ వైపు లాగుకొంటారు. అతడు వారి సుకుమార విలాసాలను, లజ్జతో కూడిన సుందర మందహాసాలను చూచి అక్కడనే రమిస్తాడు. మా ముకుందుడు పల్లెటూరి వాళ్ళమూ, గొల్లవాళ్ళమైన మా దగ్గరికి ఎలా? ఎందుకు వస్తాడు? మరి తిరిగి రాడు అని వ్యాకులపడినారు. పర్వతాన్ని లోయలోకి పడగొట్టి నేలను సమానం చేసినట్లు, దయాదేవి పుణ్యమూర్తి, విజ్ఞాన ఘనుడైన కృష్ణుణ్ని యాదవకులం లోకి చేర్చి సామ్యాపత్తిని సంఘటింప జేసింది.

(7) మాల్యకృత్:- మధురానగర వీధుల్లో పూలమాలికలల్లి అమ్ముకొని జీవించే తోటమాలి, సుదాముడనే పేరుకలవాడు.

"తతః సుదామ్నో భవనం మాలాకారస్య జగ్మతుః ।
తౌ దృష్ట్వా సహసోత్థాయ ననామశిరసాభువి ॥" (భాగ 10-41-43)

బలరామకృష్ణులు సుదామునింటికి పోగానే అతడు త్వరగా లేచి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"ప్రసాద పరమౌనాథౌ । మమగేహముపాగతౌ ।
ధన్యోఽహ మర్చయిష్యామి త్యాహ తౌమాల్య జీవినః ॥" (వి.పు. 5-19-21)

ఓ ప్రభువులారా! పూలదండలనమ్మి జీవించే నా యింటికి వచ్చారు. ధన్యుడ నయ్యాను. మీరు పూర్ణ దయగల మహానుభావులు. నేను చేసే అర్చన - పూజను స్వీకరించగలరని మాలాకారుడు వేడుకొన్నాడు. అర్ఘ్య పాద్యాల నిచ్చి, సుందర సుగంధ పుష్ప మాలికలను సమర్పించి, శ్యామసుందరుణ్ని, గౌర సుందరుణ్ని సుమనోహరంగా అలంకరించి ఆనందింప జేశాడు. బలరామకృష్ణులు సుదామునికి అష్టైశ్వర్యాలతో యావజ్జీవం భోగభాగ్యాలననుభవించి, అంత్యకాలాన భగవంతుణ్ని స్మరించడం వల్ల మా దివ్య లోకానికి చేరుకోగలవు అని వరమిచ్చారు.

అమిషాం నిమ్నత్వం వృషగిరి పతే రున్నతిమపి
ప్రభూతైః స్రోతోభిః ప్రసభమనుకంపే! సమయసి:-

సమాజంలోని వ్యక్తుల హీన దశనూ, శ్రీనివాసుని ఉన్నత దశనూ చూచిన దయాదేవి గుండె చలించి నీరైంది. నీరు పల్లానికే పారుతుంది కదా! ఆ నీరు ఏరైంది. దయా ప్రవాహమూ నిమ్న స్థల్లాలోనే నిరాటకంగా ప్రవహిస్తుంది. పెల్లుబికిన దయా సౌశీల్యా దిగుణాలనే ప్రవాహాలు ఉన్నత శిఖరులను మించి, ముంచి ప్రవహించడం వల్ల సమానస్థితి యేర్పడుతుంది. భగవద్దయ వల్ల కలిగే ఈ పరమసామ్యం పరమాత్మకూ, ప్రకృతికీ రంజకంగా ఉంటుంది. ఇదీ మోక్షం. దయాస్తుతి పరంగా మిట్టపల్లాలను సమానంగా చేసే గొప్ప నదీ వృత్తాంతం గోచరిస్తున్నందు వల్ల సమాసోక్త్యలంకార సజ్జిత మీ శ్లోకం.

మ॥ గుహుడెవ్వాడు కుచేల కుబ్జ శబరీ గోపాంగనా మాల్యకృ
ద్విహగా ధీశ కపీంద్రు లెవ్వరిల దేవీ! వీరినైచ్యంబు నా
యహి శైలేశు మహోన్నత స్థితియు నీవత్యంత ముద్యక్తవై
మహితోదార భవత్ప్రవాహముల సామ్యం బొందగా జేయవే ॥

66. త్వయా దృష్ట స్తుష్టిం భజతి పరమేష్ఠీ నిజపదే
వహన్మూర్తీ రష్టౌ విహరతి మృడానీ పరిబృఢః।
బిభర్తి స్వారా జ్యం వృషశిఖరి శృంగారి కరుణే।
శునాసీరో దేవాసుర సమరనా సీర సుభటః॥

అర్థం:- హే వృషశిఖరి శృంగారి కరుణే = వృషాద్రీశుడైన శ్రీనివాస విలాసుని కరుణా! త్వయా = నీ చేత; దృష్టః = కటాక్షింపబడిన; పరమేష్ఠీ = చతుర్ముఖ బ్రహ్మ; నిజపదే = తన స్థానమందు; తుష్టిం = సంతోషాన్ని; భజతి = పొందుతున్నాడు. మృడానీ పరిబృఢః = పార్వతితో కూడియున్న పరమేశ్వరుడు; అష్టౌ = ఎనిమిది; మూర్తీః = రూపాలను; వహన్ = వహిస్తూ; విహరతి = విహరిస్తున్నాడు. శునాసీరః = దేవేంద్రుడు; దేవ+అసుర, సమర, నాసీర, సుభటః = దేవదానవ యుద్ధమందు సేనా ముఖాన నిల్చిన యోధులలో అగ్రగణ్యుడై; స్వారాజ్యం (స్వః + రాజ్యం) స్వర్గాధిపత్యాన్ని; బిభర్తి = వహిస్తున్నాడు.

తా: శ్రీనివాసుని ప్రియమహిషివైన ఓ దయాదేవీ! చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు నీ కటాక్ష వీక్షణం వల్ల తన బ్రహ్మ పదమందు సంతోషాన్ని పొందుతున్నాడు. పార్వతీ వల్లభుడు నీ చల్లని చూపు వల్ల అష్టమూర్తిగా విహరిస్తున్నాడు. దేవేంద్రుడు సురాసుర సమరమందు ముందు నిల్చినవాడై తన స్వారాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు.

వ్యాఖ్య: దయాదేవి యొక్క ఔదార్యం వల్ల బ్రహ్మ రుద్రేంద్రులు తమ పదవులందు సుఖంగా ఉన్నారని వర్ణితం.

గత శ్లోకమందు సౌశీల్యం - నికృష్టులకు సామ్యం చెప్పబడింది. ఈ శ్లోకమందు ఉత్కృష్టులైన బ్రహ్మరుద్రాదులూ భగవత్కృపకు పాత్రులై విలాస జీవితాన్ని గడుపుతున్నారని ప్రశంసింపబడుతున్నది.

చంద్రశేఖరుడు, కమలాసనుడు ప్రార్థించిన విధంగా పరహిత ప్రావణ్యం గల భగవద్దయ చేత తమతమ పదవులను పొందినారని 53వ శ్లోకంలో వర్ణింపబడింది. ఈ శ్లోకంలో భగవత్కృపచే అనుగ్రహింపబడుతున్నారు కాబట్టి విధి శివశునాసీరులు, తమ పత్నులతో కూడి, తమ పదవులందు విలసిల్లుతున్నారని వర్ణించడం విశేషం.

త్వయాదృష్టస్తుష్టింభజతి పరమేష్ఠీ నిజపదే:- నిత్యం వేదాధ్యయన పరుడూ, సృష్టికర్త యైన చతుర్ముఖ బ్రహ్మ ఉత్కృష్ట స్థానమైన తన బ్రహ్మ పదవి యందుండి దయాదేవి యొక్క కటాక్షం వల్ల సంతోషంగా జీవిస్తున్నాడు.

పరమే తిష్ఠతీతి = పరమేష్ఠీ - పరమశబ్దానికి ఉత్కృష్ట స్థానమని అర్థం. అట్టి స్థానమందున్న వాడనడం వల్ల విష్ణుమూర్తి అనే అర్థం కూడా కావచ్చు; విష్ణు సహస్ర నామాలలో, 'పరమేష్ఠి' నామమొకటి కదా! ఇక్కడ పరమ పదమందున్న విష్ణువు కాదనడానికి 'నిజపదే' - తన స్థానమని చెప్పబడింది. చతుర్ముఖుడు తన బ్రహ్మ పదమందు తుష్టిగా ఉండడానికి దయాదేవి దృష్టియే హేతువు కదా! "పరమేష్ఠీ పితామహః" - (అమరం) "పదం వ్యవసిత త్రాణ స్థాన లక్ష్మాం ఘ్రి వస్తుషు" (అమరం).

వహన్మూర్తీ రష్టౌ విహరతి మృడానీపరిబృఢః:- (మృడతీతి మృడః -మృడ-సుఖనే) సుఖించేవాడు లేదా ఆశ్రితులను సుఖింప జేయువాడు, శివుడు. మృడుని పత్ని మృడాని, పార్వతి. "గిరీశో గిరిశోమృడః" "పార్వతీ దుర్గామృడానీ" (అమరం) (పరిబృంహతీతి = పరివృఢః; బృహ-వృద్ధౌ) వృద్ధిని పొందేవాడు.

"నేతా ప్రభుః పరివృఢోఽధిపః" (అమరం) 'మృడానీ పరివృఢః' అంటే అర్ధనారీశ్వరుడైన పరమశివుడు. పార్వతీ పతి ఒక రూపం చేత తుష్టిని పొందే వాడు కాడు. ఆయన ఎనిమిది రూపాలను వహించేవాడు. పరమేశ్వరుడు అష్టమూర్తి యైనందు వల్ల విలాసంతో ఎక్కువగా విహరిస్తాడు. "నేల, నీరు, నిప్పు, నింగి, గాలి, సూర్యుడు, చంద్రుడు, హోత్రి" అనే ఎనిమిది రూపాలను వహిస్తాడు కాబట్టి అర్థనారీశ్వరునికి విహారభోగం అధికమని సూచింపబడుతున్నది.

శునాసీరో దేవాసుర సమర నాసీర సుభటః స్వారాజ్యం బిభర్తి:- 'నాసీరం' అంటే, సేనాగ్ర భాగం. శోభనం నాసీరం యస్యసః = సునాసీరః. శ్రేష్ఠమైన సేన ముందుగా కల ఇంద్రుడు అని అర్థం. 'శ' వర్ణమున్నందున అర్థం మారుతుంది. శునంతీతి శునాః - కదిలేవి. (శున. గతౌ) 'సీర' శబ్దానికి 'నాగేలు' అని అర్థం (లాంగలం). శునాః సీరాః (లాంగలాని) యేనసః = శునాసీరః. ఇంద్రుడు మేఘ వాహనుడు. కాబట్టి వర్షాన్ని కురిపించినందువల్ల ఇతని చేత నాగేళ్ళు కదలుతాయి. తత్ఫలితంగా 'శునాసీరు' డని ఇంద్రునికి పేరు కలిగింది. దేవతలు రాక్షసులు జ్ఞాతులు, అంటే. పాలివాండ్రు. కాబట్టి, సామాన్యంగా అప్పుడప్పుడు సురాసురులకు యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధ మందు ఇంద్రుడు మంచి పరాక్రమం గల వీరసేనను

ముందుంచుకొని తానూ నిలిచి యుద్ధంలో గెలుస్తాడు. కాబట్టి స్వారాజ్యాన్ని నిర్విఘ్నంగా పరిపాలిస్తాడు దేవేంద్రుడు.

స్వర్+రాజ్యం = స్వారాజ్యం. 'స్వరవ్యయం' 'స్వః' అనే పదం అవ్యయం - స్వర్గమనే అర్థం కలది - స్వః. ("సస్వరాడ్భవతి" అని ఉపనిషద్వాక్యం చెప్తున్న ముక్తి రూప స్వారాజ్యం కాదని గ్రహించాలి).

వృషశిఖరి శృంగార కరుణే = 'తిరుమలేశుడు శృంగారి' శ్రీనివాసుడు తన ప్రియ మహిషియైన దయాదేవితో విహరించడం భువనత్రయానికి కమనీయమే. అట్లే పరమేష్ఠి దయాదేవి అనుగ్రహ దృష్టి వల్ల, సరస్వతితో కూడి తన బ్రహ్మ పదవి యందు తుష్టిని పొందుతుంటాడు. దయాదేవి కటాక్ష వీక్షణం వల్ల అర్ధనారీశ్వరుడైన ఉమాపతి తన ఎనిమిది మూర్తులతో కూడి అధికంగా విహరిస్తుంటాడు. ఇక, దేవేంద్రుడు, దయాధీనుడై యుద్ధమందు జయించి, అంచనడకల వంటి నడకగల శచీదేవితో సుఖాన్ని అనుభవిస్తూ భగవత్కృపకు పాత్రుడై అమరావతి రాజధానిగా స్వర్గరాజ్యాన్ని మనోజ్ఞంగా పరిపాలిస్తుంటాడు. వృషగిరికి అలంకారంగా ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దయా దృష్టి బ్రహ్మ రుద్రేంద్రుల మీద ప్రసరించడం వల్ల, వారు వారి పదవులందు వైభవంగా వెల్గుతున్నారని దయాదేవి ప్రస్తుతింపబడుతున్నది.

శా॥ దేవీ! బ్రహ్మ భవత్కటాక్షమునగాదే సృష్టులంజేసి యెం
తేవెల్గొందెడు, నష్టమూర్తియు మృడానింగూడి లోకంబు సం
భావింపన్ విహరించు, నాకపతియై పాకారి వెల్గున్ సురల్
సేవింపన్ ద్రిదశాసురా హవములన్ సేనాగ్ర యోధుండునై ॥

67. దయే! దుగ్ధో దన్వ ద్ద్యుతియుత సుధాసింధు నయతః
త్వదాశ్లే షా న్నిత్యం జనిత మృత సంజీవన దశాః ।
స్వదంతే దాంతే భ్యః శ్రుతి వదన కర్పూర గుళికాః
విషణ్వంతశ్చిత్తం వృషశిఖరి విశ్వంభర గుణాః ॥

అర్థం:- హే దయే = ఓ దయా దేవీ! దుగ్ధ + ఉదన్వత్ - నయతః । దుగ్ధోదన్వత్ = క్షీర సముద్రంతో; వి+అతి, యుత = సాంద్రంగా కూడియున్న; సుధా సింధు = అమృత సముద్రం యొక్క; నయతః = న్యాయాన్ని బట్టి యున్న; నిత్యం = శాశ్వతంగా; త్వత్ + ఆశ్లేషాత్ = నీ సంశ్లేషం వల్ల; జనిత మృత సంజీవన దశాః = జన్మించి మృతప్రాయులైన వారిని ఉజ్జీవింప జేసేస్థితి కలవి యైన; వృష శిఖరి విశ్వం భరగుణాః = వృషాద్రి యందున్న జగత్కుటుంబియైన శ్రీనివాసుని (ఇతర) కల్యాణగుణాలు; శ్రుతి వదన కర్పూర గుళికాః = శ్రుతికాంత నోటికి కర్పూర గుళికలుగా ఉన్నట్టివై; చిత్తం = మనస్సును; విషణ్వంతః = పిండుతున్నవై; దాంతేభ్యః = జితేంద్రియుల (కొరకు)కు; స్వదంతే = రుచిస్తున్నవి.

తా: ఓ దయాదేవీ! పాలసముద్రంతో అమృతసింధువు చేరియున్నట్లు శ్రీనివాస భగవానుని గుణాలతో నీకు నిత్యం సాంద్రమైన సంబంధమున్నది. అందువల్ల ఆయన కల్యాణ గుణాలు సంసార పతితులై మృతప్రాయులైన వ్యక్తులను ఉజ్జీవింప చేస్తున్నాయి. అవి ఉపనిషత్తులచే ప్రతిపాదింపబడుతున్నాయి. అవి మనస్సును పిండుతూ, చలించకుండా స్థిరపరుస్తున్నాయి. కాబట్టి, ఇంద్రియ నిగ్రహపరులైన మహానుభావులకు ఆ కల్యాణగుణాలు బాగా రుచిస్తున్నాయి.

వ్యాఖ్య: దయా సంబంధం వల్ల శ్రీనివాసుని కల్యాణ గుణాలు దాంతులచే అమృతాయమానంగా అనుభవింపబడుతున్న వర్ణన.

చతుర్ముఖ, పంచముఖ, శతమఖ ముఖ బర్హిర్ముఖులు దయాదేవీ కటాక్షం వల్ల శక్తిమంతులై తమ తమ పదవులను నిర్వహిస్తు సుఖ పడుతున్నారని గత శ్లోకం వర్ణించింది. ఈ శ్లోకమందు శ్రీనివాస పరబ్రహ్మ యొక్క సమస్త గుణాలు దయా సంశ్లేషం వల్ల కల్యాణ గుణాలై మధురంగా ఆస్వాదింప బడుతున్నవని కీర్తింప బడుతున్నాయి.

జ్ఞానశక్తి బలైశ్వర్యాది భగవద్గుణాలు దయా గుణ సంబంధం వాటికి లేనప్పుడు దోషాలుగానే అవుతాయని 15వ శ్లోకం వర్ణించింది. దయాదేవి యొక్క చేరిక చేత ఆ గుణాలకు జీవుల పట్ల అపకారం చేసే దోషరూపమైన అనిష్టం ధ్వంసమై, ఉపకారాత్మకమైన పేరు ప్రతిష్ఠలుకల్గినాయి. పాలకడలిని చిల్కినప్పుడు హానికరమైన

విషమే జనించింది. భగవంతుని యందుండే ఇతర గుణాలు పాల సముద్రం లాంటివి. తర్వాత ఆ క్షీర సాగరమందే మరణించిన వారిని జీవింప జేసే అమృతం ఉద్భవించింది కదా! కాబట్టి దయా గుణం అమృత సముద్రం లాంటిదని ఇందు వర్ణింపబడింది.

22వ శ్లోకం, పాలసముద్రంతో సమానమైనది దయా సముద్రమనీ, దాని నుంచి ఉద్భవించిన పదార్థాలలో కెల్ల సారతమమైన అమృత రూపంగా ఆవిర్భవించింది శ్రీనివాసుని అర్చా మూర్తియని, ఆ దివ్య మంగళ విగ్రహం మృత సంజీవనమని కూడా వర్ణించిన విషయం గమనీయం.

దుగ్ధోదన్వద్వ్యతియుత సుధాసింధునయతః :- క్షీరసాగరంతో అతి సన్నిహితంగా చేరిన అమృతసాగరం రీతిగా, భగవద్గుణాలతో దయాదేవి బాగా కలిసి యున్నందు వల్ల అవి కల్యాణగుణాలై పరమభోగ్యంగా ఉన్నవని అర్థం. దయచేతనే పరబ్రహ్మ గుణాలన్నీ కల్యాణ గుణాలుగా పరిణమించాయి. "దహర ఉత్తరేభ్యః" (బ్ర.సూ. 1-3-13) దహరాకాశం పరబ్రహ్మమే అని తెల్పుతుంది. శ్రీ భాష్యంలో "ఏతాంశ్చ సత్యాన్‌కామాన్" 'ఛాం. ఉప. 1-1) అనే వాక్యమున్నది. నిరుపాధికాత్మత్వం, అపహత పాప్మ త్వాదికం, సత్యకామత్వం, సత్య సంకల్పత్వం అని దహర విద్యలో చెప్పబడిన కల్యాణ గుణాలను అనుభవించడం భగవద్దయ లేకపోతే సిద్ధించదని స్పష్టమవు తున్నది.

త్వదాశ్లేషాన్నిత్యం జనితమృత సంజీవనదశాః:- నేల మీద పుట్టిన ప్రాణులన్నీ సంసార తాపంచేత చచ్చి పడినట్లున్నాయి. దయాదేవి గుణసార్వభౌమి. నిరతి శయ సౌశీల్యం కలిగియున్నది. మృత తుల్యులైన జీవులను ఉజ్జీవింప జేసే అమృత దశ అనంత కల్యాణ గుణాలకు దయాదేవి యొక్క గాఢమైన సంశ్లేష వల్లనే సాధ్యమవుతుంది. 12వ శ్లోకంలోని ప్రార్థన కమనీయమే కదా!

శ్రుతివదన కర్పూర గుళికాః :- శ్రుతులకు భగవద్గుణాలలోని రసాన్ని గ్రహించడమే స్వభావం. శ్రుతులు - వేదాలు - అనే కాంతలు పచ్చ కర్పూరపు బిళ్ళలను నోటిలో నోరు పరిమళించడానికీ, శ్వాస కమ్మగా ఉండడానికీ ఉపయోగి స్తారు. కర్పూర గుళికల వల్ల చల్లని, కమ్మని లాలారసం నోటిలో ఊరుతుంది.

వదనమంటే ముఖం, నోరు అని అర్థం. ముఖం రుచి చూడడానికే కాకుండా మాటాడడానికీ ఉపయోగపడుతుంది కదా! దేశికులు ఒక చోట "స్పృహణీయ సౌరభముచావాచా" తమ శ్రీ సూక్తి పరిమళాన్ని గుభాళిస్తుంది, కమనీయంగా ఉంటుంది అన్నారు.

"శ్రుతి కుహరకండూహర గిరః" (10) సత్పురుషుల మాటలు, చెవి గూబలోని దురదను గెలికి పోగొట్టేవి అని వాల్మీకి వాగ్విషయంలో "పాదుకా సహస్రం" లో ఉపయోగించారు. వేదార్థ విచారంలో కలిగే సందేహాలను తొలగించే సూక్తులని తాత్పర్యం. ఇక్కడ 'శ్రుతి వదనకర్పూర గుళిక' లనడం వల్ల ఉపనిషత్తులు "సర్వరసః, సర్వగంధః", సర్వజ్ఞః, సర్వవిత్" అని భగవానుని గుణాలను - సరసంగా, సాదరంగా, సామోదంగా వర్ణిస్తున్నాయని సారార్థం. వేదాన్త వచనాలకు భూషణాలైనందు వల్ల, అనంత కల్యాణ గుణాలే భగవన్నామాలై నోరార కీర్తించడానికి రుచి జనకంగా ఉంటాయి కదా!

చిత్తం విషణ్వంతః:- సోమాభిషవం లాగా చిత్తాభిషవం మనస్సును పిండు తుంటాయి. కల్యాణ గుణాలు. దయా సంశ్లిష్టమైనవి కాబట్టి భగవద్గుణాలు అమృతం లాగా ఆస్వాదింప బడినవై, పాషాణం వంటి హృదయాన్ని కూడా ద్రవింప జేస్తాయి. మనస్సును మరొక విషయమందు పోనీయకుండా కల్యాణ గుణానుభవమందే నిల్చే విధంగా దృఢపరుస్తాయి. "వల్వినైయేనై ఈర్‌గిన్ద గుణ్ణంగళ్" "పాపాత్ముడనైన నన్ను వశపరచుకొన్న గుణాలు" అన్నారు నమ్మాళ్వార్లు.

వృషశిఖరి విశ్వంభర గుణాః దాంతే భ్యః స్వదంతే:- మనో నిగ్రహం, శమదమాది గుణ సంపత్తి గలవారికి తిరుమలయందు జగత్కుటుంబిగా వేంచేసి యున్న శ్రీనివాస పరబ్రహ్మ యొక్క కల్యాణ గుణాలు అమృతాయమానమై అనుభవించడం చేత ఎక్కువ రుచిగా ఉన్నాయి. పరమాత్మ యందు రక్తిని కలిగించి, ఇతర విషయాల యందు విరక్తిని పుట్టించి, ఆనందింపజేస్తాయి పరమాత్మ కల్యాణ గుణాలు. శ్రుతులచే ప్రతిపాదింపబడడం వల్ల గుణాలకు మహిమ, గుణాలను ప్రతిపాదించడం వల్ల శ్రుతులకు మహిమ, పరస్పరం కలుగజేసే వర్ణనను బట్టి, ఇది అన్యోన్యాలంకారం.

శా॥ క్షీరాంభోనిధిలో సుధాతటిని సంశ్లేషించి నట్లీ వునున్
జేరంగాదె వృషాద్రి నాథు గుణముల్ చిత్త ప్రకర్షంబులై
స్ఫారోదారములై శ్రుతిస్తుతములై శాంతానుభావ్యంబులై
సారస్యం బొడగూర్చెడున్ మృతులకున్ సంజీవనం బై దయా!

68. జగజ్జన్మ స్థేమ ప్రళయ రచనాకేళి రసికో
విముక్త్యేక ద్వారం విఘటిత కవాటం ప్రణయినామ్ ।
ఇతిత్వయ్యా యత్తం ద్వితయ ముపధీ కృత్య కరుణే !
విశుద్ధానాం వాచాం వృషశిఖరినాథః స్తుతి పదమ్ ॥

అర్థం:- హే కరుణే = ఓ దయాదేవీ! వృషశిఖరి నాథః = వృషాద్రి పతియైన శ్రీనివాసుడు; జగత్ -- రసికః । జగత్ = ప్రపంచం యొక్క; జన్మ = సృష్టిని; స్థేమ = స్థితిని; ప్రళయ = సంహారాన్ని, రచనా = చేయడమనే; కేళి = లీలయందు; రసికః = ప్రీతిని కలవాడు; ప్రణయినాం = ప్రేమ-భక్తి కలవారికి; విఘటిత కవాటం = తెరువబడిన తలుపులు గల; విముక్తి+ఏక ద్వారం=మోక్షానికి ఉన్న ముఖ్యమైన (మార్గం) ద్వారం గానూ (ఉన్నాడు). ఇతి=ఇట్లు; త్వయ్యాయత్తం = నీచే యేర్పడిన; ద్వితయం = రెండు కృత్యాలను; ఉపధీకృత్య = నిమిత్తంగా గొని; విశుద్ధానాం = పరిశుద్ధమైన; వాచాం = వేద వాక్కులకు; స్తుతిపదం = స్తోత్రపాత్రుడు (అవుతున్నాడు).

తా: ఓ దయాదేవీ! శ్రీనివాసుడు జగత్సృష్టి స్థితి లయాలను చేసి వినోదిస్తున్నాడు. ప్రపన్నులైన చేతనుల ప్రతిబంధకాలను నివారించి, మోక్షమార్గానికి హేతువవుతున్నాడు. విశ్వంలో ఏ ప్రబల శక్తిగల దైవం కూడా చేయలేని జగత్కారణత్వం, మోక్షప్రదత్వం, అనే రెండు కృత్యాలూ నీకు పరతంత్రుడై చేస్తున్నందు వల్ల, పవిత్రమైన వేదాలకూ స్తుతి పాత్రుడవుతున్నాడు.

వ్యాఖ్య: దయకు అభిమతమైన రెండు ఉత్కృష్ట కార్యాలను చేసే శ్రీనివాసుణ్ని వేదాలు స్తుతిస్తున్నాయని, దయా మహిమ వర్ణితం.

భగవానుని అనంత గుణాలు దయా సంబంధం చేతనే అమృత తుల్యమైన ఉత్కర్షాన్ని పొంది వేదాలచే శ్లాఘింప బడుతున్నవని గత శ్లోకం వర్ణించింది. ఈ

శ్లోకం సమస్త కల్యాణ గుణాలకు ఆశ్రయుడైన శ్రీనివాసుడు దయాదేవికి ఇష్టమైన జగద్వ్యాపారాన్నీ, మోక్ష ప్రదత్వాన్నీ నిర్వహిస్తున్నందు వల్లనే వేదాలకు స్తుతి పాత్రుడవుతున్నాడని వర్ణిస్తున్నది.

జగజ్జన్మస్థేమ ప్రళయ రచనాకేళి రసికః:- దయాళువైన పరమచేతనునికే రచనా ప్రక్రియ సంభవిస్తుంది. చైతన్యం లేని ప్రకృతికి రచన సాధ్యం కాదు. అట్లే దయలేని పరమ పురుషునికి కూడా రచనోప పత్తి లేదు. "తదైక్షత, బహుస్యాం ప్రజాయేయ" అది చూచెను. అనేకంగా అవుతాను అనే శ్రుతి కారణ వస్తువు - సత్'ను తెల్పుతుంది. "ఈక్షతేర్నా శబ్దమ్" (1-1-5) (బ్ర. సూత్రం వల్ల వేద మందు తెల్పనిది 'అశబ్దం' అంటే ప్రకృతి.) 'అశబ్దం, న; ఈ క్షతేః' - అచేతనమైన ప్రకృతికి ఈక్షణం అసంభవం. కారణవస్తువైన 'సత్' అనే పరబ్రహ్మ ఈ క్షణం వల్ల సంకల్పం వల్ల జగం కలిగింది. దయ కల పరమచేతునుడే దూరదృష్టి - సంకల్పం - తో ప్రణాళిక నేర్పరుస్తాడని తెలుస్తున్నది. "జన్మాద్య స్యయతః" (బ్ర.సూ) 'యతః అస్య జన్మాది' - ఎవనివల్ల ఈ ప్రపంచం యొక్క ఉత్పత్తి (స్థితి, లయాలు) మొదలైనవి కల్గుతున్నవో అని తెల్పుతున్నది.

"యతోవా ఇమాని భూతాని జాయంతే, యేనజాతాని జీవంతి, యత్ప్రయంత్యభి సంవిశంతి; తద్విజిజ్ఞాసస్వ, తద్బ్రహ్మేతి" - (భృగువల్లీ - తై-ఉప) ఎవనివల్ల ఈ చరాచర పదార్థాలు కల్గుతున్నవో, కలిగిన వస్తువులెల్ల కాపాడబడుతున్నవో, అవి తిరిగి ఎవనిలోనికి చేరుతున్నవో, అతడే పరబ్రహ్మ అని తెలుసుకొమ్మని ఈ శ్రుతివాక్యార్థం.

ఇలా శ్రీనివాస పరబ్రహ్మకు జగత్తును కల్పించడం, పాలించడం, మళ్ళీ తన యందే లయం చేసుకోవడమనే రచన - ప్రక్రియ ఒక లీల, అంటే అనాయాసంగా, ఉత్సాహంతో కూడిన చేష్ట. ఈ లీలయందే ఆయనకు రాసిక్యమెక్కువ. భగవద్రా మానుజులు, "అఖిల భువన జన్మస్థేమభంగాదిలీలే" అని శ్రీ భాష్యారంభమందు మంగళాచరణంగా సుశ్లోకించారు కదా!

విముక్త్యేకద్వారం విఘటితకవాటం ప్రణయినామ్:- "తదోకోఽ ధికరణమ్" - "తదోకోఽ గ్రజ్వలనం తత్ప్రకాశిత ద్వారః" - (4-2-16) శ్రీభాష్యమందు హార్ద

పురుషుని దయవల్ల ద్వారం ప్రకాశించి అర్చిరాదిగతి సంభవిస్తుందని వివరింప బడినది.

"వినత వివిధభూతవ్రాతరక్షైక దీక్షే" ఇందున్న 'రక్ష' శబ్దానికి మారుగా 'విముక్తి' అనీ, 'వినత' శబ్దానికి 'ప్రణయి' అనీ దేశికులు ప్రయోగించినట్లున్నది. శ్రియః పతి ప్రపన్నులను 'శరణాగతులు'గా భావించడు. స్నేహితులుగానూ, ప్రియులుగానూ పరిగణిస్తాడని తెలుస్తున్నది. శరణాగతుడైన విభీషణున్ని "మిత్రభావేన సంప్రాప్తం" స్నేహభావంతో వచ్చాడని శ్రీరాముడు ప్రకటించాడు. లక్ష్మీదేవి కూడా అలాగే భావిస్తుంది. సీతాదేవి రావణునితో "మిత్రమౌపయికం కర్తుం రామః" అనీ, "తేనమైత్రీ భవతుతే" – 'నీవు రామునితో మిత్రునిగా ప్రవర్తించు' మని హితం పలికింది కదా!

'ప్రణయినాం విఘటిత కవాటం' – ప్రేమ, భక్తి, విశ్వాసాదులు కలవారికి పగులగొట్టబడిన ప్రతిబంధకం కలవాడు పరమాత్ముడని అర్థం. పరమాత్మున్ని పొందడానికి అడ్డుగానున్న పాప పుంజమనే కవాటాన్ని – తలుపును – విరుగగొట్టి, "మోక్షయిష్యామి మాశుచః" అన్నట్లు సర్వపాపాల నుంచి విడిపించేవాడు భగవానుడు.

'విముక్త్యేక ద్వారం' – తెఱువబడిన మోక్షద్వారమే భగవానుడు. ఇక్కడ 'సిద్ధోపాయత్వం' రమ్యంగా చెప్పబడింది.

"యమేవైష వృణుతే తేన లభ్యః" – భగవానుడు ఎవణ్ని ఇష్టపడుతాడో, అతనికే తనను ఇచ్చుకొంటాడని ఉపనిషద్వాక్యార్థం. ముక్తిలోకానికి తెఱువబడిన ద్వారం తానే అయి ఉన్నాడు. 'ఏక ద్వారం' – ప్రధానోపాయం – ఒకే ఒక మార్గంగా ఏర్పడియున్నాడు. "నాన్యఃపంథాః" వేరే మార్గం లేదు. అది మన శక్తి – ప్రయత్నం చేత సాధింపరానిది. మోక్షమీయడమనేది ఇతర దేవతలకు సాధ్యం కానిది.

"స్వర్గద్వార మపావృతం" తెరువబడిన వైకుంఠద్వారమన్నట్లున్నదీ వాక్యం. "తమేవం విద్వాన్" – ఆ పరబ్రహ్మను తెలుసుకొన్న జ్ఞానికే కవాట విఘటనం సాధ్యం. ప్రణయాత్మక జ్ఞానం కలవ్యక్తి పాపరాశి నశించడం వల్ల ముక్తి ద్వారంలో ప్రవేశిస్తాడని భావం. భగవానుని మంత్రాలు ముక్తిద్వార కవాటికా విఘటన

ధ్వానానికి ప్రతిధ్వని వంటివని 'సంకల్ప సూర్యోదయం' వెల్లడిస్తున్నది. భగవంతుని చరణం ముక్తి ద్వారకవాటికా విఘటనకు కుంచిక లాంటిదని అభినవ భట్టబాణుని సూక్తి.

భగవానుడే సిద్ధోపాయం కాబట్టి, దయాదేవి అది దూరమార్గమైనా, మార్గ గమనం వల్ల కలిగిన బడలికను తొలగించి, ప్రపన్నులకు పొందదగిన భగవంతుణ్నే తెరచియున్న తలుపులు గల ముక్తి ద్వారంగా చేస్తుందని ఉల్లేఖింపబడింది.

త్వయ్యాయత్తం ద్వితయ ముపధీకృత్య కరుణే:- జగత్కారణత్వం, మోక్ష ప్రదత్వం అనే ఈ రెండు శ్రీనివాస పరబ్రహ్మకున్న ఉత్కృష్ట గుణాలు. ప్రత్యేకంగా ఆయనకు స్వంతమైన ఆస్తి. ఇతర దేవతల కెవ్వరికైనా ఈ ఆస్తిలో కొద్ది భాగాన్ని కూడా పంచుకోవడానికి శక్తిలేదు. ఈ రెండు గుణాలు దయాధీనాలైనందువల్ల - దయ చేత ఏర్పడినవనే కారణాన్ని బట్టి, శ్రీనివాసుడు ఉత్కృష్ట గుణద్వయాశ్రితుడని శ్లాఘ్య మానుడవుతున్నాడు.

విశుద్ధానాం వాచాం వృషశిఖరినాథః స్తుతిపదమ్:- వేదాలు అపౌరుషేయాలు. పురుషులచే నిర్మింపబడితే భ్రమ, ప్రమాద, వంచనాది దోషాలు కల్గియుండేవి కాని అవి నిత్యమైనవి కాబట్టి, అట్టి దోషాలకు అవకాశమే లేనట్టివి, విశుద్ధమైనవి వేదవాక్కులు.

కొందరు దరిద్ర, ధనిక, ఉచ్చ నీచ జాత్యాది పూర్ణమైన జగత్తును జూచి, భగవానుడు విషమ సృష్టి చేశాడని, నిర్దయుడని, గుణరహితుడని పలురకాలుగా భావిస్తారు. ఇవన్నీ లౌకిక వాదాలు. కాని వేదాలు ఆప్తవాక్యాలు, యథార్థాన్ని ప్రకటిస్తాయి. "పుణ్యః పుణ్యేన కర్మణాభవతి పాపః పాపేన కర్మణా" - సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ పాపోభవతి". పాప పుణ్య జన్మలను, ఉచ్చనీచ జన్మలను పొందడానికి - దేవ మనుష్యాది విచిత్ర దేహాలు కల్గడానికి వారి వారి ప్రాచీన కర్మమే కారణమని వేదాలు ప్రకటిస్తున్నాయి. వేదవ్యాస భగవానుడు 'వైషమ్య నైర్ఘృణ్యే నసాపేక్షత్వాత్, తథాహి దర్శయతి" (బ్ర.సూ. 2-1-34).

సృజింపబడిన ఆయా ప్రాణుల సుకృత దుష్కృత రూపకర్మలే విషమ సృష్టికి కారణాలు; సర్వేశ్వరుని పక్షపాతంగానీ, నిర్దయ గానీ కారణాలు కావనీ, అందుకు శ్రుతులూ, స్మృతులూ ప్రమాణాలనీ ప్రదర్శించాడు.

జగజ్జన్మాదికర్తగానూ, చేతనులు భగవత్కృపను పొందడానికి ప్రపత్తిని అనుష్ఠించినందువల్ల, వారి పాప సంచయాన్ని తొలగించి, వారికి మోక్షాన్ని ప్రసాదించే వాడుగానూ శ్రీనివాసుడు వేదాల యొక్క స్తోత్రానికి పాత్రుడవుతున్నాడు.

"సర్వే వేదా యత్పద మామనంతి" "బ్రహ్మవిదాప్నోతిపరం" - "స స్వరాడ్భవతి" "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా" - తద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే" "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంత కృద్వేద విదేవచాహమ్" ఇత్యాది శ్రుతివాక్యాలు భగవత్కృపా వైభవాన్ని ప్రశంసిస్తున్నాయి.

మ॥ భగవంతుండు వృషాద్రినాథు డనుకంపా! నీ నిదేశంబునన్
జగముల్ లీలను సృష్టి జేయు మనుచున్ సంహారమున్ జేయు, పా
పగతుల్ వేదొలగించి మోక్షమొసగున్ భక్తాళికిన్ దాన, య
ట్లగుటన్ గాదె పొగడ్తకుం దగియె శ్రుత్యంతంబులందెంతయున్ ॥

69. కలిక్షోభోన్మీలత్ క్షితి కలుషకూలంకషజవై
రనుచ్ఛేదైరేతైరవట తట వైషమ్యరహితైః ।
ప్రవాహైస్తే పద్మా సహచర పరిష్కారిణి! కృపే !
వికల్ప్యంతేఽనల్పా వృషశిఖరిణో నిర్ఝర గణాః ॥

అర్థం:- పద్మా సహచర పరిష్కారిణి = పద్మాదేవితో కూడియున్న శ్రీనివాసునికి అలంకారాన్ని కలుగజేస్తున్న; హే కృపే = ఓ దయాదేవీ! కలిక్షోభ+ఉన్మీలత్ క్షితి కలుష కూలంకష జవైః = కలి పురుషుని ఉగ్రతవల్ల వృద్ధిజెందుతున్న ప్రపంచ జనుల పాపాలను నిర్మూలించి త్రోసివేసే వేగం కల్గియున్నట్టి; అనుచ్ఛేదైః = ఎడతెగక ప్రవహించునట్టి; అవట తట వైషమ్య రహితైః = నిమ్నోన్నత భేదం - నికృష్ట, ఉత్కృష్ట తారతమ్యం - లేనట్టి; ఏతైః = ఈ; తే = నీ యొక్క; ప్రవాహైః = ప్రవాహాలతో; అనల్పాః = తక్కువగానట్టి; వృషశిఖరిణః = వేంకటాచలమందున్న; నిర్ఝరగణాః = సెలయేరుల సమూహాలు; వికల్ప్యంతే = సమానంగా భావింప బడుతున్నవి.

తా: పద్మావతి సహచరుడైన శ్రీనివాసునికి భూషణయైయున్న ఓ దయాదేవీ! కలికాల క్షోభవల్ల పెరుగుతున్న భూ కాలుష్యాన్ని దరుల నొరసి త్రోసివేసే వేగం కలిగినట్టి, నిరంతరం పారుతున్నట్టి; ఎత్తువంతలనే భేదం లేకుండా సమమైన నీ ప్రవాహాలతో తక్కువ లేని వేంకటాచలమందలి కొండవాగులు సమానంగా ఉన్నాయి.

వ్యాఖ్య: తిరుమలయందలి కొండవాగులు భగవత్కరుణా రసధారలతో సమానమైన వని వర్ణితం.

భగవద్గుణాలకూ, భగవానునికీ దయాదేవి సంబంధం వల్లనే సర్వోత్కర్ష మేర్పడినదని ఇతఃపూర్వ శ్లోకం నిరూపించింది. ప్రపన్నుల విషయంలో అనిష్టవిధ్వంస శీలమైన ప్రభావం గల శ్రీనివాసుని దయా ప్రవాహాలకూ, తిరుమలలో ప్రవహించే నిర్ఝురులకూ, ఈ శ్లోకం మనోజ్ఞమైన సాదృశ్యాన్ని వర్ణిస్తున్నది.

దయాశతకారంభ శ్లోకమందే శ్రీనివాసుని దయ ఇక్షుసార స్రవంతిగా వర్ణింప బడింది. 31వ శ్లోక మందు వేంకటాద్రి సానువులు పుణ్యతీర్థధారల - వారి ధారా విశేషాల చేత దయా స్వభావాన్ని సూచించాయి. ఈ సప్తమ దశకంలో, 61వ శ్లోకం దయాదేవి యొక్క ఒక బిందువు పరబ్రహ్మ స్వరూపం కంటె నాలుగు రెట్లు పెద్దదనీ, దాని ప్రవాహం చేత అవిద్య అనే కర్మలు నశిస్తున్నాయని వర్ణించింది. దయా ప్రవాహ ప్రసంగం ఈ దశకంలో అధికంగా ఉంది. ఇదంతా దయా స్వరూప ప్రకటన యేకదా!

పద్మాసహచర పరిష్కారిణి! కృపే! :- ఇది సంబోధన. లక్ష్మీ దేవికి సహచరుడు నారాయణుడు. నారాయణుని సహచారిణి లక్ష్మీదేవి. పద్మావతికి సహచరుడుగా ఉన్న శ్రీనివాసునికి ఆభరణంగా ఉన్నది దయాదేవి. పద్మావతి, శ్రీనివాసుడు ఇర్వురు ఒకరికొకరు అన్యోన్యమైన ఆభరణంగా ఉన్నవారు. దయాదేవి ఈ దివ్య దంపతులకు ఇద్దటికీ ఒక భూషణంగా ఉంది.

దయాదేవి ప్రభావం చేత శ్రీనివాసుడు ప్రకాశిస్తున్నాడని తాత్పర్యం.

(1) కలిక్షోభోన్మీలత్ క్షితికలుష కూలంకషజవైః :- కలికాలమందలి ఉపద్రవాల చేత భూమి మీద కాలుష్యం బాగా పెరిగిపోతున్నది. తిరుమల యందలి

నిర్ఝరులు ఒక్కొక్కటి కొండల మీది నుంచి దూకుతూ, దరులను కూల్చి వేగంతో ప్రవహించే స్వచ్ఛమైన సలిలధారల చేత ముఱికిని కాలుష్యాన్ని పోగొట్టుతున్నాయి.

కలిపురుషుని ఔద్ధత్యం వల్ల ప్రపంచమందలి జనుల వివేకం చెడిపోయి, పాపం బాగా విజృంభిస్తున్నది. దయా ప్రవాహం శక్తిమంతమైన వేగంతో పాప రాశిని కూకటివేర్లతో పాటు పెళ్ళగించి ధ్వంసం చేస్తున్నది.

(2) అనుచ్ఛేదైః :- కొండవాగులు ఎల్లకాలం ఎడతెగక ప్రవహిస్తున్నట్లే, దయా ప్రవాహం రసధారలతో అవిచ్ఛిన్నంగా సంతతం ప్రవహిస్తుంటుంది.

(3) అవట తట వైషమ్య రహితైః:- ఎత్తు వంతలనకుండా సెలయేళ్ళు ప్రవహిస్తున్నాయి. అప్పుడప్పుడు గిరి శిఖరాలను దొరలించి లోయలలోకి త్రోసి నేలను సమానం చేస్తూ ప్రవహించడం ప్రకృతి సిద్ధమైనది.

అవటమంటె వంత. గుంత. తటమంటె గట్టు, దిబ్బ, ఒడ్డు. దయాదేవి ఉత్కృష్టులు - నికృష్టులు అనే జన్మసిద్ధమైన ప్రజల ఉచ్చనీచ స్థితులను పాటించకుండా, అందరియందు సమానభావంతో ప్రసరిస్తుంది. 65వ శ్లోకం చెప్పినట్లు, ఆశ్రితులకు తరతమ భావాన్ని ఎంచక సామ్యస్థితిని కల్పించడం దయాప్రవాహ లక్షణం.

(4) అనల్పాః :- లోతుగా, స్వచ్ఛగా, కలుషహారులై, మధురజలంతో ప్రవహించడం జలపాత నదులకు పరిపాటి. నిర్ఝరులన్నీ గొప్పవే. తీర్థమాడిన వారిని పవిత్రం చేస్తాయి. దయా ప్రవాహం నిర్ఝరుల కన్న తక్కువ ప్రభావం కలది కాదుకదా! దయాప్రవాహమందు అవగాహులైన వ్యక్తులకు స్వస్వరూపమే ఆవిర్భవిస్తుంది. ఉభయత్ర మహిమ అనల్పమే.

వృషశిఖరిణోనిర్ఝరగణాః వికల్పంతే:- తిరుమల యందు ప్రవహించే ఆకాశ గంగ, పాపనాశిని,తుంబురు తీర్థం మొదలైన సెలయేరులలో తలమునుకలుగా స్నానం చేసినచో పాపం క్షాళితమై, ఇహ, పర సుఖాలను పొందుతారు. దయాప్రవాహంలో క్రుంకులిడిన వారు అపహత పాప్మత్వాద్యష్టగుణా విష్టులవుతారు.

'గణాః' అన్నచోట 'గుణాః' అనే పాఠమూ ఉంది. శైత్య, మార్దవ, మాధుర్య, పావనత్వాది గుణాలు నిర్ఝరులకు సహజమని గమనించాలి.

'వికల్పంతే' అనడం వల్ల సెలయేర్లైనా, దయాప్రవాహమైనా, సమాన ప్రభావం కలిగియున్నవని తాత్పర్యం. "వికల్పోఽ విశిష్ట ఫలత్వాత్" (3-3-57) వ్యాస మహర్షి చేత 'వికల్పాధికరణం'లో - రెండింటిలో ఫలభేదం లేనందువల్ల ఉపాసనలలో భేదమున్నా, ఫలప్రాప్తి సాధారణమే, ఫలం మాత్రం ఒక్కటే అని సాదృశ్యమందు వికల్పమనే పదం ప్రయోగింపబడింది. ఇది శాస్త్రజ్ఞుల మాట. నిర్ఝరగణాలు దయా ప్రవాహంతో ఉపమింపబడినట్లు వర్ణితం. 'వికల్పంతే' అన్న చోట, సామ్యాన్ని పొందడానికి చూస్తున్నవి. (ఉపమీయంతే). ఇవి వారి ధారలా, లేక దయా ప్రవాహాలా అని సందేహింప తగినట్లున్నాయి నిర్ఝరులు, అని కొందరు వ్యాఖ్యానించారు. ఈర్ష్యచే సెలయేరులు దయా ప్రవాహాలను ఉపమింపజూస్తున్నాయి కాని సాదృశ్యాన్ని పొందకున్నవి. కాబట్టి, వృషాద్రి నిర్ఝరాల కంటె భగవద్దయ సమాశ్రయింప దగినదని భావించారు.

మ॥ కలి సంక్షోభ వివర్ధమాన దురితౌఘంబుల్ సమూలంబుగా
దొలగింపన్ భవదీయధారలు దయా దుర్వారమై పృథ్వి ని
చ్చలు నుత్కృష్ట నికృష్టులం దొకట వైషమ్యంబు వర్జించి, యి
మ్ముల బర్వన్ వృషభాద్రి నిర్ఝుర శతంబుల్ గోరు నీ సామ్యమున్ ॥

70. ఖిలంచేతో వృత్తేః కిమిదమితి విస్మేరభువనమ్
కృపే! సింహక్ష్మాభృత్ కృతముఖ చమత్కార కరణమ్ ।
భరన్యాస చ్ఛన్నప్రబల వృజిన ప్రాభృత భృతామ్
ప్రతి ప్రస్థానం తే శ్రుతినగరశృంగాటక జుషః ॥

అర్థం:- హే కృపే = ఓ దయాదేవీ! శ్రుతి నగర శృంగాటక జుషః = వేదమనే పట్టణమందలి చతుష్పథాన్ని పొందియున్న; తే = నీ యొక్క; భరన్యాసచ్ఛన్న ప్రబల వృజిన ప్రాభృత భృతాం = భరసమర్పణ విధిచే కప్పబడిన మహాపాపాలు అనే కానుకలను పట్టుకొని వచ్చేవారికి; ప్రతి ప్రస్థానం = ఎదురేగడం (స్వీకరించడం అనేది); (చేతస్+వృత్తేః) చేతో వృత్తేః = మనో వ్యాపారం యొక్క; ఖిలం = లోపం; కిం, ఇదం? ఇతి = ఇదేమిటి; అని; విస్మేర భువనం = ఆశ్చర్యంతో కూడిన ప్రపంచం కలదిగానూ; సింహక్ష్మాభృత్, కృతముఖ చమత్కార కరణం =

సింహాచలమని నామాంతరం కలిగిన వేంకటాద్రి యందున్న, పండితునికి, ఆశ్చర్యాన్ని కలిగించేదిగానూ ఉన్నది.

తా: ఓ దయాదేవీ! వేదమనే నగరమందు ఉపనిషత్తులనే నాల్గు దారులు కలిసే చోట నీవు వేచి యుండి, శరణాగతి యనే మేలి ముసుగుచే కప్పబడిన ప్రబల పాపాలను నీకు కానుకగా తెస్తుంటే, నీవే ఆ ప్రపన్నుల కెదురుగా నడచిపోయి, వాటిని స్వీకరించడం నీ చిత్తవృత్తి యొక్క లోపమా! ఇదేమిటి? అని లోకం నివ్వెరపోతున్నది. విద్వాంసుడైన వెంకటేశ్వరుడు కూడా ఆశ్రితుల మీద నీ కింత వ్యామోహమా! అని విస్మయ పడుతున్నాడు.

వ్యాఖ్య: ప్రపన్నుల మీద దయాదేవి ఆదరాతిశయంతో చేసే సాహసకృత్యం వర్ణితం.

ఈ దశకంలో ప్రపత్తిని అనుష్ఠించిన మహానుభావులకు దయాదేవి ఉపకారాలు వర్ణింపబడినాయి. గత శ్లోకంలో దయా ప్రవాహ స్వరూపమూ వర్ణితం. దయా చమత్కారకృత్యం మనస్సు కందనిదని స్తుతిస్తూ ఈ శ్లోకంతో సప్తమ దశకాన్ని దేశికులు ముగిస్తున్నారు.

"ఏతం హవావ న త పతి; కి మహం సాధు నా కరవం;
కిమహం పాప మకరవ మితి ।" (ఆనందవల్లీ)

నేను పుణ్యకర్మల నెందుకు చేయకున్నాను? నేను పాప కర్మలనేల చేశాను? అనే సంతాపం ప్రపన్నునికి కలుగదు; ఎందుకంటే, మోక్ష ఫలాన్ని కోరే వారికి భక్తి ప్రపత్తులలో ప్రపత్తి లఘూపాయం కదా!

"వాయ్‌నాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క, పోయ పుఘదుమ్
పుగుదరువానిన్టనవుమ్, తీయనిల్ తూశాగుమ్" (తిరుప్పావై 5)

త్రికరణశుద్ధిగా భగవద్గుణానుసంధానం చేస్తే, భగవత్కృప వల్ల సంచిత కర్మలు అగ్గిపడిన దూది లాగా బుగ్గి అవుతాయి. ఆగామికర్మలు నీరు తామరాకును వలె అంటుకోవు.

"తదధిగమ ఉత్తర పూర్వాఘయో రశ్లేష వినాశౌ" (బ్ర.సూ. 4-1-13)

ఉపాసకులకు అంటే భగవద్ధ్యాన పరులకు పూర్వాఘాలు నశిస్తాయి. ఉత్తరాఘాలు అంటకుండా దూరమవుతాయి. ఇట్లు వేదాన్త శాస్త్ర ప్రతిపాదితమైన భగవద్దయ వలన ప్రపన్నుడు నిర్భయుడై, నిర్భరుడుగా ఉంటాడనే విషయమూ చమత్కారంగా సుశ్లోకితం.

శ్రుతినగర శృంగాటక జుషః:- వేదమనే పట్టణంలో "ఐశ్వర్య మక్షరగతిం పరమంపదంవా" అన్నట్లు ఐశ్వర్యం, కైవల్యం, ముక్తి అనే సమస్త పురుషార్థాలు లభిస్తాయి. "శృంగాటక చతుష్పథే" (అమరం) నాల్గు దారులు కలిసే స్థలం 'శృంగాటకం, చతుష్పథం' అనబడుతుంది. పట్టణంలో చతుష్పథం (చౌరస్తా) ముఖ్యమైన స్థలం. అట్లే వేదనగరమందు వేదాన్తమే (ఉపనిషద్భాగం) చతుష్పథం. అన్ని మార్గాలను పరమాత్మ యందు సమన్వయింప జేసే స్థలం కాబట్టి దయాదేవి శృంగాటకమందు నిల్చియున్నదని వర్ణన.

ఎవరు ఏదారి నుంచి వచ్చినా చతుష్పథమందు నిల్చినవారికి కనబడుతారు కదా! "చతుర్విధా భజంతేమాం" అన్నట్లు ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు అనే నాలుగు విధాలైన భక్తులు ఆయా ఫలాలను కోరి వచ్చినప్పుడు దయాదేవికి ఆ చోట కనబడడం వల్ల తానే వారి కోరికలను ఈడేర్చి అనుగ్రహించాలని వేచి యున్నది.

భరన్యాసచ్ఛన్న ప్రబలవృజిన ప్రాభృత భృతామ్:- 'వృజినం' అంటే పాపం. "వృజినైనోఽఘమంహో దురిత దుష్కృతమ్" 'ప్రాభృతం' అంటే ఉపహారం, కానుక. "ప్రాభృతంతు ప్రదేశనం, ఉపాయనముప గ్రాహ్యం ఉపహారస్తథోపదా" (ఉభయత్ర, అమరం) ఎవరికే పంట పండితే వారికదే ధనం అవుతుంది కదా! దేవునికి నైవేద్యం, గురువుకు దక్షిణ, రాజుకు కప్పం, ఆప్తునికి కానుకను సమర్పించడం లోక మర్యాద.

దయాదేవికి పాపరాశియే ఆహారమని (29వ శ్లో).

సూచింపబడింది కదా! శరణాగతి చేసే వ్యక్తి తనకు పండిన పాపాలను దయాదేవికి కానుకగా సమర్పించడానికి తీసుకొని పోతున్నాడు. 'కానుక'ను ఒక

పళ్ళెరంలో పెట్టి దాని మీద మెరుగైన ఒక మేలి గుడ్డను - వస్త్రాన్ని - కప్పి పట్టుకొని పోవడం పరిపాటి. ప్రపన్నుడు పాపోపహారాన్ని 'భరన్యాస' విధి అనే మెరిసే బట్టతో మూసి, పట్టుకొని దారిలో నడిచి వస్తుంటే, శృంగాటకంలో ఉన్న దయాదేవికి కనబడినాడు.

ప్రతిప్రస్థానం తే:- ప్రస్థానమంటే పయనం, బయల్దేరడం. ప్రతి ప్రస్థానం అంటే ప్రత్యుద్గమనం, ఎదురేగడం. అప్పుడు రుచికరమైన షడ్రసోపేతమైన ఆహారాన్ని తెస్తుంటే, పేరాసతో ఎదురేగి దాన్ని తానే స్వీకరించడం ఎంత ఆశ్చర్యంగా ఉంటుందో, ఆ విధంగానే ప్రపన్నుడు తెస్తున్న కానుకను కొంతదూరం నుంచే చూచిన దయాదేవి ఆదర, సంభ్రమాలతో రెండు గంతులు వేస్తూ ఎదురేగి కానుకను స్వీకరించింది. ఈ ప్రక్రియను దేశికులు రమ్యంగా చిత్రించారు.

ఖిలం చేతో వృత్తేః కి మిద మితి విస్మేరభువనమ్:- దయాదేవి శరణాగతుని కెదురేగడమేమిటి? అతడర్పించక ముందే తాను పేరాశతో కానుకను స్వీకరించడ మేమిటి? అతడు మొదటనే పాపిష్ఠుడు. కృతఘ్నుడు. వంచనపరుడు. అతడు తెచ్చిన ఉపహారాన్ని మూసియుంచిన మెరుగైన వస్త్రాన్ని చూచే తాను అందుకోవడం చూచిన వాళ్ళకు నగుబాటు అనిపించింది. 'కిమిదంచేతో వృత్తేఃఖిలమ్?' ఇదేమిటి? దయాదేవి మనో వ్యాపారం లోపించిందా? స్మృతి భ్రంశమయిందా? మతిచలించిందా? అని హేళనచేస్తూ పలికారు. దయాదేవి ప్రత్యుద్గమనం చేయడం నిత్య ముక్తాత్మలున్న లోకాన్ని నవ్వుల పాలు చేసిందన్నారు దేశికులు. జగమంతా దయాదేవి కృత్యం మనసున బట్టక ముక్కు మీద వ్రేలు వేసుకొని తిలకిస్తున్నది.

సింహ క్ష్మాభృత్ కృతముఖ చమత్కారకరణమ్:- క్రూర మృగం కదా సింహం. సింహాలకు రాజు అంటే క్రూరతముడన్న మాట. అనంత కల్యాణ గుణాలకంటె మించి యున్న ప్రపన్నుని అనంత పాపాలకు తగినట్లు సింహక్ష్మాభర్తయైన శ్రీనివాసునికి తీవ్ర నిగ్రహ సంకల్పం లోపించిందా? దయాధీనుడైనందు వల్ల అనాది, అనంత, ప్రబల పాపాలను శరణాగతిచేసినప్పుడే మరచిపోయాడు కాబట్టి, సర్వజ్ఞుడైన శ్రీనివాసుని చేతో వృత్తికీ ఖిలమేర్పడింది కదా! 'నస్మరత్య పరాధానాం శతమపి' - పాపాలెన్ని ఉన్నా స్మరించడమేలేదు కాబట్టి, భగవంతునికి కూడా

మనస్సు లేకుండా పోయింది. ఎందుకంటే, దయాదేవి చేస్తున్న పని భగవానునికీ "కిమిదం?" ఇదేమిటి అని ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

"కిమిదం వ్యాహృతం మయా"? (రా.బా. 2-16)

నే నిదేమి మాటాడితిని? అని వాల్మీకి కరుణ వేదియై - దయకు లోనయ్యి - "మానిషాద!" అని తాను పల్కిన మాటయే తనకు ఆశ్చర్య జనకమయింది కదా!

"స్వయంజహార కిమిద మితి పృథుక తండులాన్" - (భాగ 10-81-9). కుచేలుడు, తన భార్య నాలుగిండ్లు తిరిగి నాలుగు పిడికిళ్ళ అటుకులను యాచించి తెచ్చి చినిగిన ఉత్తరీయంలో మూటగట్టి కృష్ణుని దగ్గరికి పంపిస్తే, తాను లజ్జతో పెట్టకున్నా, సర్వజ్ఞుడైన కృష్ణ భగవానుడే 'ఇదేమిటి?' అని ఆశ్చర్యపడుతూ, మూట ముడి విప్పి పిడికెడు అటుకులు తనకు ఉపహారంగా తెచ్చినాడని తానే తీసుకొన్నాడు కదా!

సింహాలు సంచరించే పర్వతం కాబట్టి నారాయణాద్రికి 'సింహాచల' మని మరొక పేరు, పురాణ కథనమిది.

"వైజ్ఞానికః కృతముఖః కృతీ కుశల ఇత్యపి" (అమరం)

'కృతముఖుడు' అంటే, ఉపాయాలను నేర్చినవాడు విద్వాంసుడని అర్థం. "విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్".

విద్యాభ్యాసం చేసేవాని పరిశ్రమ విద్వాంసునికే తెలుస్తుంది అని ఆభాణకం. దయా మహిమ దయాళువుకే తెలుస్తుంది. మహోన్నత పర్వత శిఖరం నుంచి సింహావలోకనం చేసే శ్రీనివాస పరబ్రహ్మకు కూడా దయాదేవి యొక్క క్రీడ ఆశ్చర్యకరంగానే ఉంది.

శరణాగతుడు తెచ్చిన పాపోపహారాన్ని అదెంత భారతరమైనదో తెలుసుకోకుండా భరన్యాసాన్ని చూచి, దయాదేవి అతని పాప వాసనాభారాన్ని తానే వహించి, అతణ్ని అకించనునిగా, నిరంజనునిగా చేస్తున్నది. ఆహా! ప్రపన్నులను రక్షించడానికి దయాదేవిది ఎంత సాహసమో! అని ఇహలోక పరలోక వాసులకే

కాక, ఉభయ విభూతినాయకుడైన శ్రీనివాస పరబ్రహ్మకూ దయా వైభవం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇలా, ఈ శ్లోకం అష్టమదశకంలోని విషయసూచకంగా ఉంది.

మ॥ శ్రుతిసన్మౌళి పురీచతుష్పథమునన్ సొంపారు నిన్నున్ దయా!
చతురుండా వృషశైలనాథుడనుపన్ సంన్యస్త రక్షా భరుల్
హతపాప ప్రచయోపహారులయిడాయన్ నీవు ప్రత్యుద్గమో
ద్యతవై వారల గూడుటేమని జగం బాశ్చర్యమున్ బొందెడున్ ॥

సప్తమ దశకం సమాప్తం

అష్టమ దశకం

71. త్రివిధచిదచిత్సత్తా స్థేమ ప్రవృత్తినియామికా
వృషగిరి విభోరిచ్ఛా సాత్వం పరైర పరాహతా।
కృపణ భరభృత్కిం కుర్వాణ ప్రభూత గుణాంతరా
వహసి కరుణే! వైచక్షణ్యం మదీక్షణ సాహసే॥

అర్థం: కరుణే = ఓ దయాదేవీ! త్రివిధచిత్ + అచిత్, సత్తా, స్థేమ, ప్రవృత్తి, నియామికా = మూడువిధాలైన చేతనుల, అచేతనాల స్వరూప, స్థితి, ప్రవృత్తులను నియంత్రించేదానివై; పరైః = ఇతరులచే, అపరాహతా = ఎదురింప శక్యం కాని దానివై; కృపణ భరభృత్ = దీనుల భారాన్ని మోయుదానివై; కింకుర్వాణ ప్రభూత గుణ+అంతరా = సేవ చేస్తున్న మిగత భగవద్గుణాలు కలదానివై; వృషగిరివిభోః = శ్రీనివాసుని యొక్క; ఇచ్ఛా = సంకల్పమైన; సా = అట్టి; త్వం = నీవు; మత్+ఈక్షణ, సాహసే = నన్ను కటాక్షించడమనే సాహసకృత్యమందు; వైచక్షణ్యం = నేర్పరితనాన్ని; వహసి = వహిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! బద్ధులు, ముక్తులు, నిత్యులు అనే మూడు విధాలైన జీవుల యొక్క, మరియు ప్రకృతి, కాలం, శుద్ధ సత్త్వం అనే మూడు రకాలైన జడ వస్తువుల యొక్క స్వరూప స్థితి ప్రవృత్తులను నియమించే పరబ్రహ్మ సంకల్పమే నీవు. నిర్నిరోధసామర్థ్యం కలిగియున్నట్టి, ప్రపన్నుల భారాన్ని భరిస్తున్నట్టి, తక్కిన భగవంతుని గొప్ప గుణాలచే సేవింపబడుతున్నట్టి, ప్రసిద్ధమైన నీవు మహాపరాధినైన నన్ను కటాక్షించే సాహసమందు సామర్థ్యాన్ని వహిస్తున్నావు.

వ్యాఖ్య: శ్రీనివాస పరబ్రహ్మ యొక్క సంకల్పమే దయాదేవి యొక్క స్వరూపమని నిర్వచించే శ్లోకమిది.

ఇంతవరకు దయాదేవి జీవాత్మలకూ, పరమాత్మకూ ఉపకరించిన విధానం వర్ణింపబడింది. గత శ్లోకం ప్రపన్నుని విషయమై ప్రత్యుద్గమించిన దయాదేవిని జూచి విశ్వంవిస్మయ పడిందని వర్ణించింది.

ఈ దశకంలో 'భక్తచ్ఛందానువర్తిని' అంటే, ఆశ్రితుల ఇష్టాన్ని బట్టి అనుసరించే భగవద్దయా స్వరూప వైభవం ప్రధానంగా వర్ణింపబడుతున్నది. దయ యొక్క ఉపకారాలను స్మరించే జీవుల కృతజ్ఞతాభావమూ ప్రకటింపబడుతున్నది. కమలాకాంతుని కారుణ్య విషయమై చాతకపక్షిలాగా ఏకాంత భక్తి ఆవశ్యకం కాబట్టి, దయా స్వభావానుసంధానం చేత ఆశ్రితుల భయం నివారింపబడుతున్నది. కోమలమైన మృదు హృదయం, బెదురుచూపులు గలది హరిణి. (ఉత్తమ గుణాలు కలిగి చుఱుకుతనమున్న 'చిత్రిణి' అనే స్త్రీ జాతిని 'హరిణి'కి మారుపేరుగా 'ఆప్టే' నిఘంటువు పేర్కొన్నది). ఈ అష్టమ దశకంలో దయాదేవిని 'హరిణీ' ఛందోవృత్తంతో దేశికులు స్తుతిస్తున్నారు. హరిణీవృత్తం గలది దయాదేవి. "చకిత హరిణీ ప్రేక్షణానిమ్ననాభిః" (కాళిదాసు మేఘ సందేశం) "త్రస్తైకహాయన కురంగ విలోల దృష్టిః" (సీత విషయమై భవభూతి వాక్యం). భగవత్సంకల్పమే తన స్వరూపమై నందువల్ల మహా పాపిష్ఠులైన ప్రపన్నులను నిర్భయంగా దయాదేవి కటాక్షించే సామర్థ్యం కలదని ఈ మొదటి శ్లోకం కీర్తిస్తున్నది.

త్రివిధ చిదచిత్సత్తా స్థేమ ప్రవృత్తినియామికా:- చిత్ = జ్ఞానం ఒక గుణంగా (ధర్మభూత జ్ఞానం) గల జీవాత్మ 'చేతనుడు' అనబడుతాడు. అసంఖ్యేయులైన చేతనులు (జీవాత్మలు). మూడు విధాలు.

1. బద్ధులు:- కర్మ బంధం చేత సంసార చక్రమందే పరిభ్రమించేవారు.

2. ముక్తులు:- సంసారంలో కొంతకాల ముండి సదాచార్య సంబంధం వల్ల మోక్షోపాయాన్ని అనుష్ఠించి ముక్తిని పొందినవారు.

3. నిత్యులు:- కర్మబంధమే లేకుండా, పరమ పదమందు భగవత్కైంకర్య మందు మగ్నులైన అనంత, గరుడ, విష్వక్ సేనాదులు.

అచిత్ = జ్ఞానం లేని (జడ) వస్తువు 'అచేతన' మనబడుతుంది. అచేతనం చేత ఏర్పడిన ఫలాన్ని భగవత్సంకల్పం వల్ల చేతనుడు అనుభవిస్తాడు. అచేతనం కూడా మూడు విధాలు.

1. ప్రకృతి:- సత్త్వరజస్తమోగుణాలు (3) కలది - 'త్రిగుణ' మంటారు. అనేక తత్త్వాలుగా మారుతుంటుంది.

2. కాలం:– జడ వస్తువైనా విభువుగా ఉంటుంది. కాలం చేతనే అనేక మార్పులేర్పడుతాయి. కాల ప్రభావం వైకుంఠంలో ఉండదు.

3. శుద్ధసత్త్వం:– కేవలం సత్త్వగుణమనే విలక్షణ ద్రవ్యమిది. పరమపదమంతా శుద్ధ సత్త్వమయమే.

మూడేసి విధాలుగా ఉన్న చేతనా చేతనాల స్వరూప, స్థితి, ప్రవృత్తులను తరతమ భేదాలచే నియమించేది 'వృషగిరి విభోః ఇచ్ఛా' – తిరుమల పైనున్న శ్రీనివాస పరబ్రహ్మ యొక్క సంకల్పమే 'దయా స్వరూపం', అని నిర్వచింపబడినది. దయ, పరహిత ప్రావణ్యం కలది. జగజ్జన్మాది కారణమైన భగవానుడు దయారూపమైన సంకల్ప విశిష్టుడు.

పరైరపరాహతా:– పరాహతకానిది అపరాహత. ఎవరిచేతనైనా, దేనిచేతనైనా అడ్డుకొనడానికి సాధ్యం కానిది. దయా ప్రభావం అమోఘమైనది. భగవత్సంకల్పం / ఇచ్ఛ ఎదురు లేనిది కాబట్టి, భగవదిచ్ఛకే దయ అని పేరు కలిగింది.

కృపణభరభృత్:– కృపణులంటే దిక్కూ – చక్కీ లేని వారు. గతిలేనివారు; దీనులు. అనన్య గతికులైన ప్రపన్నుల భారాన్ని – పాప భారాన్ని తన నెత్తి మీద పెట్టుకొని, భుజాలతో రక్షణ భారాన్ని సమర్థవంతంగా నిర్వహించే దయా రూపమే భగవదిచ్ఛ.

కింకుర్వాణ ప్రభూత గుణాంతరా:– దయాదేవి గుణ సార్వభౌమి. కాబట్టి ఇతరమైన జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్యతేజః ప్రముఖమైన భగవదనంత కల్యాణ గుణాలు సేవ చేసే భాగ్యం కలది దయా స్వరూపం.

కరుణే! మదీక్షణ సాహసే వైచక్షణ్యం వహసి:– 'కరుణే' అని సంబోధన వల్ల హరిణీ సదృశమైన ఈక్షణ లక్షణం కలది దయాదేవి అని ధ్వనిస్తుంది.

తన పతియైన శ్రీనివాస భగవానునికి ఎదురుగా నిలిచే ప్రతియోధుడైన అపరాధ చక్రవర్తిపైన కురంగ నయనయైన దయాదేవి స్వయంగా కటాక్ష వీక్షణాన్ని ప్రసారించడమే గొప్ప సాహసం. (నైచ్యాను సంధానమిది) "న్యస్తభరుల మహాభారాన్ని వహించడం కూడా నీకు భారం కాదు తల్లీ! క్రూరుడనైన నాయందు మొదట నీవు

కటాక్ష దృష్టిని సారించడమే అతిభారం కదా! అమ్మా! రాక్షసులని భయపడకుండా విభీషణులను కటాక్షంతో ఈక్షించే సాహసమందే నీ వైచక్షణ్యం స్ఫురిస్తున్నది, దేవీ!" అని దేశికులు సన్నుతించారు. విశేషణాలు సాభిప్రాయాలైనందువల్ల ఇది పరికరాలంకృత శ్లోకం.

మహాస్రగ్ధర॥

చిదచిద్వస్త్వాళి సర్గ స్థితివిలయగతుల్ చెల్లు నీయాజ్ఞచే నీ
కెదురెందున్ లేదు నీయంది తరగుణములున్ భృత్యవృత్తిన్ వహించున్।
పదవిన్యస్తాత్మభారావనపరవగుటన్ బన్నగాధీశ్వరేచ్ఛా
ప్రదవౌటన్ నన్ను బాలింపగ జతురవుగా పద్మనాభానుకంపా॥

72. వృషగిరి పతేర్హృద్యా విశ్వావతార సహాయినీ
క్షపిత నిఖిలావద్యా దేవి! క్షమాది నిషేవితా।
భువన జననీ పుంసాం భోగాపవర్గ విధాయినీ
వితమసి పదే వ్యక్తిం నిత్యాం బిభర్షిదయే! స్వయమ్॥

అర్థం:- దయే! దేవి = ఓ దయాదేవీ! వృషగిరిపతేః = శ్రీనివాసునికి; హృద్యా = మనోహారిణివి; విశ్వ+అవతార సహాయినీ = సర్వావతారాలయందు తోడుగా ఉన్నదానవు; క్షపితనిఖిల + అవద్యా = తొలగింపబడిన సమస్త దోషాలు గలదానవు. క్షమా+ఆది, నిషేవితా = క్షమమొదలైన వాటిచే సేవింపబడేదానవు; భువన జననీ = విశ్వానికంతటికి తల్లివి; పుంసాం = చేతనులకు; భోగ+అపవర్గ, విధాయినీ = భుక్తినీ, ముక్తినీ ఇచ్చేదానవు; వితమసి = తమోగుణంలేని; పదే = స్థానమందు; నిత్యాం = శాశ్వత మైన, వ్యక్తిం = రూపాన్ని; స్వయం = సొంతంగా; బిభర్షి = భరిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! నీవు శ్రీనివాసునికి ప్రియమైన దానవు. సకలావతారాల్లో సహాయ భూతవు; సర్వదోషాలను తొలగించేదానవు; క్షమాదులచే సేవింపబడే దానవు; లోకమాతవు, పురుషార్థులకు భోగ మోక్షాలను ప్రసాదించేదానవు; తమోగుణం లేని చోట స్వయం వ్యక్తిగా నిత్యం ప్రకాశిస్తుంటావు.

వ్యాఖ్య: దయాదేవి యొక్క రూపం స్తుతింపబడుతున్నది.

గత శ్లోకమందు దయా స్వరూపం వర్ణితం. స్వరూపం తర్వాతనే ఈ శ్లోకమందు కటాక్షించే సాహస కృత్యం విశ్వమాతకే తగుతుంది కాబట్టి, దయారూపమైన లక్ష్మీదేవి కూడా శ్లిష్టపదాల చేత విశేషంగా వర్ణింపబడుతున్నది.

ఏమయ్యా వేంకటనాథా! దయాస్తుతి చేస్తున్నావేమిటి?

చేతనులు కదా స్తుతింపదగినవారు! గుణసార్వభౌమినైననూ గుణాలకు చైతన్యం ఉండదు కదా!

"కామార్తాహి ప్రకృతి కృపణా శ్చేతనాచేతనేషు" - (మేఘ సందేశం) కామార్తులు ఇది చేతనం, అది అచేతనం అనే పరిజ్ఞానం లేని వారు కదా! "గాఢోన్మాదః ప్రణయపదవీం ప్రాప్తవార్తానభిజ్ఞే" జడవస్తువును చేతనంగా భావించి సంబోధించడమూ,.చేతనుడు అచేతనంతో సంభాషించడం గాఢోన్మత్తుని కృత్యమే అన్నాడు కవికుల గురువు కాళిదాసు.

"విశ్లేషేణ క్షుభిత మనసాం మేఘశైలద్రుమాదౌ యాచ్ఞాదైన్యంభవతి"

విరహబాధను భరించని వ్యక్తులు మబ్బునూ, దిబ్బనూ, గుట్టనూ చెట్టునూ 'నీకు కనబడిందా? నా వార్త నందించు' మని యాచించడం వెఱ్ఱి వెంగళాయ లక్షణమే అని నీవు కూడా 'హంస సందేశం'లో అన్నావు కదా! నా విషయంలో ఇంత బాగా స్తుతించడం ఉన్మత్త ప్రలాపమే అవుతుంది. అని ఆక్షేపించబడింది.

ఓ దేవీ! అచేతనమందు చేతనత్వాన్ని ఆరోపించడం కవి సమయం. శిష్టాచార సంప్రదాయమని నీకు తెలియకున్నదా! తల్లీ! నీవు శ్రీదేవి రూపమే. నీకు అచేతనత్వమెక్కడిది? అందుకే ఈ స్తోత్రారంభమందే "చైతన్య స్తన్యదాయినీం, కరుణా మివ రూపిణీమ్" అని లక్ష్మీదేవిని స్తుతించాను కదా! అన్నారు. దయాదేవికీ, శ్రీదేవికీ భేదమే లేదని సుశ్లోకితం. ఈ శ్లోకమందు 'దయే! దేవి!' అని రెండు సంబోధన పదాలు ప్రయుక్త మవడం గమనీయం.

ఆరుపదాలచే అభేదం నిరూపింపబడుతున్నది.

1) వృషగిరిపతేర్హృద్యా:- ఇచ్ఛారూపమైన దయ యొక్క స్థానం శ్రీనివాసుని హృదయం. గుణాలన్నిటికన్నదయ మీద భగవానునికి ప్రీతి మిన్న.

లక్ష్మీదేవి శ్రీనివాసుని వక్షఃస్థలమందే నివసిస్తుంది. ఆయనకు పట్టమహిషి లక్ష్మీ దేవి యే కాబట్టి ఆమెపైన ప్రేమ అధికం.

2) విశ్వావతార సహాయినీ:- భగవానుని సకలావతారాలకు దయ సహాయ పడుతుంది. దయ చేతనే భగవానుడు అవతరిస్తాడు. లక్ష్మీదేవి భగవానుని అవతారాలన్నిటి యందు సహచారిణి. "విష్ణోః శ్రీరన పాయినీ" "అగలకిల్లేన్" సర్వావతారాలలోనూ భగవంతుణ్ని క్షణమైనా విడిచియుండనిది లక్ష్మీదేవి.

3) క్షపిత నిఖిలావద్యా:- దయాదేవి బహిష్కృత నిగ్రహ. నిగ్రహాన్ని దగ్గరికి రానీయదు, వెలివేసింది. సర్వపాపాలను తొలగించేది దయ.

"దూరీకర్తుం దురితనివహం త్యక్తుమాద్యా మవిద్యామ్" ప్రజలు అనాదియైన అవిద్యను తొలగించుకోవడానికి లక్ష్మీదేవిని ఆశ్రయిస్తారు. లక్ష్మీదేవి అజ్ఞాత నిగ్రహ, నిగ్రహం తెలియనిది. సర్వ పాపాపనోదినియేగాక "మంగళం మంగళానామ్" సకల శుభాలను సమకూర్చేది లక్ష్మి.

4) క్షమాది నిషేవితా:- దయాదేవి ఆశ్రితులను రక్షించే సమయాన క్షమ (ఓర్పు), శక్తి, ఔదార్యాది గుణాలు ఆమెకు అంగాలుగా ఉండి తోడ్పడుతాయి. అనుచర వర్గమైన క్షమాది గుణాలచే సేవింపబడేది దయాదేవి.

"దేవిత్వా మనునీళయా సహ మహీదేవ్యః సహస్రం తథాయాభిస్త్వంస్తన బాహు దృష్టిభిరివ స్వాభిః ప్రియంశ్లాఘసే" (శ్రీగుణ. ర.కో. 26) 'క్షమ' అంటే భూదేవి.

లక్ష్మీదేవి తనకు అవయవాలన్నట్లున్న భూదేవి, నీళాదేవి, మొదలైన దేవేరుల చేత సేవింపబడుతుంది.

5) భువన జననీ:- అఖిల భువనాల సృష్టికి భగవద్దయే కారణం. లక్ష్మీదేవి "త్వం మాతా సర్వలోకానాం" లోకమాతయే కదా!

6) పుంసాం భోగాపవర్గవిధాయినీ:- "సూతిమపవర్గ త్రివర్గయోః" (10) దయాదేవి ఆశ్రితులకు ప్రాపంచిక సుఖాలనూ, మోక్షానందాన్నీ ప్రసాదిస్తుంది.

లక్ష్మీదేవి తనకడగంటి చూపులతోనే "శరీరారోగ్యమైశ్వర్యం అరిపక్ష జయః సుఖం। దేవి! త్వ ద్దృష్టి దృష్టా నాం పురుషాణాం న దుర్లభమ్॥" అన్నట్లు ఆశ్రయించిన చేతనులకు ఇహలోక భోగాలనన్ని అనుభవింపజేస్తుంది. (వి.పు) అలాగే, పురుషార్థులకు "శ్రేయోన హ్యరవింద లోచన మనః కాంతాప్రసాదాదృతే" (చతు శ్లోకి) లక్ష్మీదే వ్యనుగ్రహం చేతనే మోక్ష సామ్రాజ్యానుభవమూ కల్గుతుంది.

వితమసి పదే వ్యక్తిం నిత్యాంబిభర్షిదయే! స్వయమ్:- తమోగుణం లేని చోట దయాదేవి శ్రీనివాసునివలె "స్వయం వ్యక్తి ముపాగతమ్"(9) స్వయంగా ప్రకటితమవు తుంది. 'వితమసి' అనే పదానికి అజ్ఞానమనే అర్థాన్నీ చెప్పవచ్చు. అజ్ఞానాంధులకు దయారూపమే అగుపడదు. తమోగుణ రహితులకు దయా ప్రభావం నిత్యం ప్రకటితమే కదా! 'వితమసి పదం' అంటే శుద్ధసత్త్వమైన వైకుంఠం. "వైకుంఠేతు పరేలోకే శ్రియాసార్థం జగత్పతిః ఆస్తే" లక్ష్మీదేవి వైకుంఠంలో జగన్నాథునితో పాటు శాశ్వతమైన దివ్యమూర్తిగా భాసిస్తుంది. వైకుంఠుడు లక్ష్మీదేవితో కూడి ఉంటాడు.

ఈ విధంగా 6వ శ్లోక భావం కమనీయంగా ఇక్కడ విస్తరింపబడింది. శ్లేషాలంకృత పదరచన దయకు, లక్ష్మికి సమానార్థకంగా ఉంది. అప్రస్తుతమైన లక్ష్మీ వృత్తాంతం స్ఫురించడం వల్ల సమాసోక్తి చమత్కృతి మత్కృతి ఇది.

స్రగ్ధర॥ భూమిన్ లీలావతారం బులహరిపొడమున్ బూని తోడౌట యోగ
క్షేమంబుల్ దల్లి వోలెన్ శ్రితులకరయుటన్ ఛేదితావద్యవౌటన్।
బ్రేమన్ గొల్వన్ క్షమాదుల్ వృషగిరిపతికిన్ హృద్యవౌటన్ దయా! యా
శ్రీ మాడ్కిన్ నిస్తమంబౌ స్థిర పదమున నీ శ్రేష్ఠమౌ వ్యక్తితోచున్॥

73. స్వయముదయిన స్సిద్ధాద్యావిష్కృతాశ్చ శుభాలయాః
వివిధ విభవ వ్యూహావాసాః పరంచ పదం విభోః।
వృషగిరి ముఖేష్వే తేష్విచ్ఛావధి ప్రతి లబ్ధయే
దృఢవినిహితా నిశ్శ్రేణిస్త్వందయే! నిజ పర్వభిః॥

అర్థం:- హేదయే = ఓ దయాదేవీ! స్వయం + ఉదయినః = స్వయం వ్యక్తమైన అర్చామూర్తులను కలిగియున్నట్టి; సిద్ధ+ఆది+ఆవిష్కృతాః, చ = సిద్ధులు, మొదలైన వారిచే ప్రకాశితమైన విగ్రహాలను కలిగియున్నట్టి; వివిధ విభవ

వ్యూహ+ఆవాసాః = పలు విధాలైన విభవరూపాలకు, వ్యూహరూపాలకు నివాస స్థానాలైనట్టి; విభోః = పరమ పురుషుని యొక్క; పరం పదం, చ = వైకుంఠమనే స్థానమైన; శుభ+ఆలయాః = దివ్యక్షేత్రాలున్నాయి. వృషగిరి ముఖేషు = వేంకటాద్రి మొదలు పరమపదం వరకున్న; ఏతేషు = ఇట్టి దివ్యదేశాల యందు; ఇచ్ఛా+అవధి ప్రతి లబ్ధయే = ఇష్టపూర్తిని పొందడం కోసం; త్వం = నీవు; నిజ పర్వభిః = నీ సోపానాల (కణపుల) చేత; దృఢ వినిహితా = గట్టిగా నిర్మించబడిన; నిశ్రేణిః = నిచ్చెనగా ఉన్నావు.

తా: ఓ దయాదేవీ! వేంకటాద్రి మొదలైన స్వయం వ్యక్తమైన అర్చావతార స్థలాలనుగానీ, అనేక విధాలైన విభవ, వ్యూహాల చేత ప్రకాశించే దివ్య దేశాలను గానీ, పరమ పదాన్ని గానీ చేరి చేతనులు భగవత్కైంకర్య సిద్ధిని పొందడానికి, నీకు ఆయా దివ్యక్షేత్రాలు పర్వాలై విలసిల్లగా, దృఢమైన నిచ్చెనలాగా నీవు ఉండి, వారిని ఆయా స్థలాలను పొందే విధంగా చేస్తున్నావు.

వ్యాఖ్య: చేతనులు ప్రాప్యస్థానాన్ని చేరడానికి దయాదేవి నిచ్చెనగా ఉన్నదని వర్ణితం.

మూర్తీ భవించిన దయాదేవి పరమ పదమందు లక్ష్మీదేవిగా ప్రకాశిస్తున్నదని గత శ్లోకం నుతించింది. "దయే! స్వయమ్" అని పూర్వ శ్లోకాంత పదంతో ఈ శ్లోకం ఉపక్రమింపబడింది. కాబట్టి, ఇది అంతాది శ్లోకం.

భగవదవతారాలన్ని దయాదేవి చేత నేర్పడినవే; చేతనులు తమ రుచికనుగుణమైన భగవత్కైంకర్యమనే మోక్ష ఫలాన్ని పొందడమూ దయాయత్తమని సుశ్లోకింపబడుతున్నది.

స్వయముదయినః సిద్ధాద్యా విష్ణుతాశ్చ శుభాలయాః :- భగవానుడు అర్చామూర్తిగా వెలసియున్న స్థలాలే శుభాలయాలుగా పేర్కొనబడినవి. "కల్యాణం మంగళం శుభం" (అమరం). అనిష్టం తొలగిపోయి ఇష్టాన్ని పొందడమే శుభమని అర్థం. దేహయాత్ర మొదల్కొని భగవత్సన్నిధిలోచేరునంత వరకు జీవులను సేవా మగ్నులను చేసి ఉజ్జీవింప జేసే స్థలం 'ఆలయం' అనబడుతుంది. శుభాలయాలంటే దివ్యక్షేత్రాలని, దివ్యదేశాలని అర్థం.

ఆగమశాస్త్ర ప్రకారం, భగవానుడు - శ్రీమన్నారాయణుడు పర, వ్యూహ విభవ, అంతర్యామి, అర్చామూర్తి అనే ఐదు (5) రూపాలతో ప్రకాశిస్తూ జగద్రక్షణ చేస్తుంటాడు. వీటిలో అర్చామూర్తిగా వెలసిన దేవాలయాలు "స్వయం వ్యక్తం, సైద్ధం, దైవం, ఆర్షం, మానుషం" అనే అయిదు (5) విధాలుగా వర్గీకరింప బడినాయి. 'స్వయం వ్యక్త'మంటే భగవానుడు 'స్వేచ్ఛ - సంకల్ప రూపమైన కృప-తో తనను తానే అర్చారూపంగా ప్రకటించుకొన్న పవిత్ర స్థలం. (పవి = వజ్రాయుధం; త్ర = రక్షించడం. వజ్రఘాతం లాంటి సంసారబాధ నుంచి రక్షించేది - అని 'పవిత్ర' శబ్దానికి అర్థం).

'సిద్ధ, ఆది' అనడం వల్ల, సిద్ధులు, దేవతలు, ఋషులు తపస్సు చేసి, ప్రార్థించి నందుకు ఫలంగా, భగవానుడు వారు పూజింపదగిన (అర్చా) మూర్తిగా ప్రకాశించిన పుణ్యస్థలాలే క్రమంగా సైద్ధం, దైవం, ఆర్షం అని ప్రసిద్ధిని పొందాయి. ఇవి పూర్వమే సిద్ధమైనవి.

మానవుడు ఆగమశాస్త్ర రీతిగా ఆలయాన్ని నిర్మించి, తానెన్నుకొన్న భగవద్విగ్రహాన్ని దారు శిలాలోహాలలో నొకదానిచే ఏర్పరచి, దాని యందు వేదమంత్రాలతో కళాన్యాసం చేత భగవానుణ్ని ఆవహింపజేసి, ప్రతిష్ఠించిన దేవాలయాలు 'మానుషం' అని ఖ్యాతి బడసినాయి.

విభోర్వివిధవిభవ వ్యూహావాసాః:- శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడుగా (సజాతీయుడై) భగవానుడు లోకంలో ఆవిర్భవించిన రూపాలు 'విభవావతారాలు' గా పరిగణింపబడినాయి.

జగద్వ్యాపారం కోసం భగవానుడు క్షీరాబ్ధినాథుడై 'వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ' అనే నాల్గు నామరూపాలచే వ్యవహరింపబడిన మూర్తులు "వ్యూహావతారాలు'. తైలధారలాగా ఎడతెగకుండా నిరంతరం ధ్యానం చేసిన ఋషులకు, ఆళ్వారాదులకు దర్శన సమానాకారంగా సాక్షాత్కరించి, బ్రహ్మానందానుభవాన్ని కలిగించిన వారు 'వ్యూహమూర్తులే' అని పురాణాలు, దివ్యప్రబంధాలు వెల్లడిస్తున్నాయి.

'విభు' శబ్దం (వివిధంభవతీతి విభుః) శ్రీ మహావిష్ణువు విభవ వ్యూహాలు - అనేక విధాలుగా రూపొందేవాడనే అర్థమిస్తుంది.

ఆవాసాః :- ఈ పదం అవతారస్థలాలనే అర్థాన్ని తెల్పుతుంది. విభవ వ్యూహమూర్తులు నివసించే క్షేత్రాలు కూడా దివ్యస్థలాలే కదా! కొందరు వ్యాఖ్యాతలు 'ఆవాస' శబ్దానికి హార్దపురుషుడు - మానవుల హృదయమందు 'అథోనిష్ట్యా వితస్త్యంతే నాభ్యాముపరితిష్ఠతి" శ్రుతి పల్కినట్లు, నాభికి ప్రాదేశ మాత్రమైన ఉపరిస్థలమందు - హృదయమందున్న 'అంతర్యామి'గా చెప్పినారు.

'ఆవాస' శబ్దానికి నివాసస్థలమన్న వారు 'పరంచపదం'లోని 'చ' కారానికి 'అంతర్యామి' అనే అర్థాన్ని ధ్వనింపజేశారు. 'పరంపదం' అంటే వైకుంఠం. 'వృక్ష ఇవస్తబ్ధో దివి తిష్ఠతి" అన్న శ్రుతిరీత్యా, మూల విరాడ్రూపమున్న స్థానమిది. సత్త్వ రజస్తమో గుణాలలోని సత్త్వం కాక, వేరే 'శుద్ధ సత్త్వమనే ద్రవ్యమున్న లోకమది. ప్రకృతి మండలం కంటె "త్రిపాద స్యామృతం దివి" అనే వేదవాక్కును బట్టి, మూడు రెట్లు పెద్దగా నున్న శాశ్వతమైన స్థానమది. "న తత్ర సూర్యోభాతిన చంద్రతారకం" అక్కడ సూర్యచంద్రతారకల వెలుగుండదు. "నకాల స్తత్ర వై ప్రభుః" అన్నట్లు పరమ పదమందు కాల ప్రభావం చెల్లదు. ఇదే నిత్యవిభూతి.

వృషగిరిముఖే ష్వేతేషు:- వేంకటాచలం మొదలైన (పరమపదం వరకున్న) ఈ స్థలాలన్నీ దివ్యక్షేత్రాలే - శుభాలయాలే. పరవ్యూహ విభవాంతర్యామ్యర్చావతార స్థలాలనే ఐదింటిలోనూ, స్వయంవ్యక్త సిద్ధాది పంచశుభాలయాలలోనూ 'వృషగిరి' తిరుమల ప్రథమ స్థానాన్ని వహించి తల మానికంగా ఉందని వ్యక్తమవుతున్నది. తిరుమల స్వయం వ్యక్తమైన దివ్యదేశమని, ఈ క్షేత్ర మహిమ ఉత్తమ శ్రేణికి చెందినదని దేశికుల ప్రధానాశయం.

తిరుమల నుంచి త్రిపాద్విభూతి వరకు గల దివ్యక్షేత్రాలలో ఉండే భగవన్మూర్తులను జనులు శ్రద్ధాభక్తులతో సేవించి, ఉపాసించే వారెందరో ఉంటారు.

ఇచ్ఛావధి ప్రతిలబ్ధయే:- ఆ ఉపాసకుల మనోరథం పూర్తిగా సఫలమయ్యే విధంగా సహాయపడేది దయా దేవియే కదా! స్వయం వ్యక్తమైన భగవద్రూపాలు

దయాదేవి చేతనే అభివ్యక్తమవుతున్నాయి. ఆయా రూపాలను ధ్యానించి వారు కోరిన ఫలాలను పొందునట్లు చేసేది కూడా దయాదేవియే.

దృఢ వినిహితా నిశ్శ్రేణిః త్వందయే! నిజపర్వభిః :- కోరే ఫలాలనిచ్చి భక్తులను క్రమంగా ఎక్కించుకొని, పరమ పదనాథుణ్ని సేవించి ఉజ్జీవింప జేసే నిచ్చెనయే దయ. క్రింద ఉన్నవాళ్ళను మీదికెక్కించేది నిచ్చెనయే కదా! జీవుల కోరిక సంపూర్ణంగా ఫలించడానికి పరమపురుషుడు కూడా జీవులను అనుగ్రహించాలనే కోరికతో క్రిందికి దిగిరావాలి. కాబట్టి పైన ఉన్న పరమపద నాథుణ్ని అర్చామూర్తి దాకా దించుకొని వచ్చేది కూడా దయ అనే నిచ్చెనయే.

దయ అనే నిచ్చెన దృఢంగా - గట్టిదిగా ఉండాలి. నిచ్చెనకుండే పర్వాలు - సోపానాలు గట్టిగా నిర్మింపబడి ఉండకపోతే ప్రమాదం - అపాయం కలుగుతుంది. కాబట్టి నిచ్చెన కణపులు - మెట్లు దృఢంగా నిర్మింపబడినవై ఉండాలి. భగవానుని పరవ్యూహ విభవాది రూపాలే దయ అనే నిచ్చెన యొక్క పర్వాలు. పరమపద మందు ఉండే శ్రియఃపతి ఆశ్రితులను రక్షించడం కోసం ఆవిర్భవించి నివసించే శుభాలయాలు, దివ్యదేశాలు చాలా ఉన్నాయి. ఆయా స్థానాలు నిచ్చెనకు పర్వాల వలె ఉన్నాయి. దయా నిశ్శ్రేణికి చివరి పర్వం తుది మెట్టు పరమపదమే.

"నిష్ప్రత్యూహ షడంగ యోగ నిగమ ప్రాసాదనిఃశ్రేణికా".

ప్రపత్తిని ప్రతిపాదించే 'నిక్షేప రక్ష' అనే గ్రంథం నిచ్చెనగానే దేశికులకు స్ఫురించింది కదా!

చేతనుల ఇచ్ఛకన్న భగవంతుని ఇచ్ఛ బలీయమైనది. చేతనులు సేవ చేయాలి. భగవానుడు అనుగ్రహించాలి. ఇచ్ఛ పూర్తిగా ఫలిస్తుంది. కాబట్టి, పరమ పదనాథుడు దిగడానికి, చేతనులు ఎక్కడానికి దయానిశ్శ్రేణి అనుకూలంగా అమరియున్నది.

స్రగ్ధర॥ దేవీ! శ్రీశేషశైలా దిగ బహువిభవా ధిష్ఠిత స్థానముల్ వ్యూ
హావాసంబుల్ సురాద్యాయుత పరమ పదాంత్యంబుగా గల్గుచోట్లన్ ।
జీవాళిన్ గోరినట్లే స్థిరతర భగవత్సేవలన్ సిద్ధి బొందన్
నీవే పర్వాఢ్య నిశ్శ్రేణిగబరగి దయా! నేర్తువెందైన జేర్పన్ ॥

74. హితమితి జగద్దృష్ట్యా క్లుప్తైరక్లుప్త ఫలాంతరై
రమతి విహితైరన్యైర్ధర్మాయితైశ్చ యదృచ్ఛయా।
పరిణత బహుచ్ఛద్మా పద్మాసహాయ దయే! స్వయం
ప్రదిశసి నిజాభి ప్రేతం నః ప్రశామ్యద పత్రపా ॥

అర్థం:- హే పద్మాసహాయ దయే = లక్ష్మీదేవి సహాయుడైన ఓ శ్రీనివాసుని దయాదేవీ! జగత్ + దృష్ట్యా = లోక దృష్టిచేత; హితం, ఇతి = హితమని; క్లుప్తైః = కల్పించుకొనబడిన ప్రాసంగిక సుకృతాల చేత; అక్లుప్త ఫల +, అంతరైః = సుకృత కర్మ ఫలం కంటె ఇతర ఫలమందు తలంపులేని అనుషంగిక సుకృతాల చేత, అమతివిహితైః = బుద్ధిపూర్వకం కాని అజ్ఞాత సుకృతాల చేత; యదృచ్ఛయా = తనంతతానే (దైవికంగా); ధర్మ+ఆయితైః = ధర్మంగా అవుతున్న యాదృచ్ఛిక సుకృతాల చేత; అన్యైః, చ = వీటికంటే వేరైన సామాన్య బుద్ధిపూర్వక సుకృతాల చేతను; పరిణత బహుచ్ఛద్మా = పరిపక్వమైన అనేక వ్యాజాలుగల నీవు; ప్రశామ్యత్ + అపత్రపా = శమించిన లజ్జగలదానివవుతూ; స్వయం = నీయంత నీవె; నిజ+ అభిప్రేతం = స్వీయాభి మతమైన పురుషార్థాన్ని; నః = మాకు; ప్రదిశసి = ఇస్తున్నావు.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! లోకదృష్టిలో హితమైనవని ప్రాసంగిక, అనుషంగిక, అబుద్ధిపూర్వక, యాదృచ్ఛిక, సామాన్య బుద్ధిపూర్వకమైన అనేక సుకృతాలను వ్యాజంగా చేసుకొన్న నీవు - ఇంతకాలం చేతనులను రక్షించక పోతినని సిగ్గుపడుతున్న నీవు, ఇపుడు సిగ్గువిడిచి, నీ కిష్టమైన పురుషార్థాన్ని మాకు ప్రసాదించి రక్షిస్తున్నావు.

వ్యాఖ్య:- దయాదేవి చేతనుల కర్మలలో సుకృతాన్ని నెపంగా జేసుకొని వారికి మోక్ష ఫలాన్ని ప్రసాదిస్తుందని వర్ణితం.

ప్రాప్యస్థాన లాభం దయాధీనమే అనబడింది. ఇందు ప్రాపక లాభమూ దయా యత్తమే అనబడుతుంది. ఇచ్ఛా వధి - ఇష్టపూర్తి కోసం దయాదేవి నిచ్చెనగా ఉంది. పాపిష్ఠులను సైతం దయాదేవి కటాక్షించడం సాహసమే అన్నారు. సాహస మట్లుండనీయండి. స్త్రీలకు భూషణమైన లజ్జ కూడా దయకు లేదంటున్నారు.

ప్రపత్తిని అనుష్ఠించక ముందున్న చేతనుని స్థితి నుంచి ప్రపత్త్యనుష్ఠానానంతర ముండే దశ వరకు ఈ దశకం వర్ణిస్తున్నది.

చేతనులు చేసేవన్ని పాపాలు. పురుషార్థాలను పొందాలని మాత్రం కోరుతారు. పాపాలకు విధింపబడిన దండన – శిక్షను పొందడానికి కూడా ఇష్టపడరు. తాము చేసిన కర్మల ఫలమెట్లుంటుందో చేతనులకు తెలియదు. మహానుభావులెవరైనా వచ్చి 'మీరీ పని చేస్తే బాగుపడుతార'న్నారనుకోండి. వెంటనే ఒంటికాలు పైలేచి 'ఏమయ్యా నీవెందుకు వచ్చావు? రమ్మని బొట్టుపెట్టి పిలిచానా? సిగ్గులేకుండా వచ్చి నేనేమీ నిన్ను అడుగకముందే ఏమో చెబుతున్నా'వని కసరు కోవడమూ చేతనుల స్వభావమే కదా!

దయాదేవి 'అయ్యో! ఇన్నాళ్ళు చేతనులను రక్షించే యత్నమే చేయకుంటిని కదా!' అని సిగ్గుపడుతూ ఉండింది. చేతనులను రక్షించడానికి సాహసంతో కటాక్షిస్తూ దయాదేవి నిచ్చెనగా తనను మలచుకొన్నది. కాని, నిచ్చెన మీద ఎక్కే యోగ్యత సుకృతాత్ములకే ఉంటుంది కదా! కాబట్టి, రక్షించే నెపంతో దయాదేవి సిగ్గు విడిచి, చేతనులు చేసిన కర్మలలో సుకృతాన్నే వెదుక్కొని, దానికి తగిన పురుషార్థాన్ని వారికి అనుభవింప జేయడం దయాధర్మం కదా!

పద్మాసహాయదయే:- పద్మ అంటే లక్ష్మి; ఆమె యొక్క సహాయం కలవాడు శ్రీనివాసుడు. ఆయన దయను సంబోధించే పదమిది. "వృషగిరి పతేః హృద్యా" (72) అని శ్రీదేవికీ, దయాదేవికీ భేదం లేదని – అంటే, ఇద్దరి రూపం ఒక్కటే అనబడింది. 'సహాయ' పదం మధ్యన ఉన్నది.

జగత్కారణుడైన తన వల్లభుడు పక్షపాతం, వైషమ్యం లేనివాడని నిరూపించుకో గలిగింది లక్ష్మీదేవి. తన సంతానం ఏయే పనులు చేస్తుందో అని కనిపెడుతుండడం తల్లియొక్క స్వభావం. తనపతి పొట్టలో పెట్టుకొన్న జీవుల యొక్క పాప పుణ్యకర్మలన్ని జగన్మాత కళ్ళల్లో నిల్చి ఉన్నాయి. ఆయనకు ప్రేయసి, జగత్తుకు శ్రేయసి కాబట్టి, "యద్భ్రూభఙ్గాః ప్రమాణం స్థిరచర రచనాతార తమ్యేమురారేః" (శ్రీ గుణ.ర.కో) లక్ష్మీదేవి తన కనుబొమలను కదిలిస్తుంటే నారాయణుడు ఆ

కదలికలను అందులో జీవుల కర్మలను గమనించి, ఆ కర్మలకు తగిన ఫలాన్ని ఆయా జీవులకు అంటగట్టి, తరతమ భావంతో జగత్తును సృజించడానికి - సహాయంగా పరిగ్రహించాడు. అర్థసౌరభాన్ని అమితంగా విరజిమ్ముతున్న పదమిది.

హితమితి జగద్దృష్ట్యాక్లుప్తైః :- లోకంలో దేహధారులు ఏ పనిని చేయకుండా కాలం గడిపితే, వారికి దేహయాత్ర గడపడమే దుర్లభం అవుతుంది. "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరోజనః" (భ.గీ. 3-21) శ్రేష్ఠుడైన వ్యక్తి యొక్క ప్రవర్తనను జూచి ఇతరులు అనుసరిస్తారు. లోకహితార్థమే కర్మలు శాస్త్ర విహితమైనవి.

దయాదేవి చేతనులు చేసిన కర్మలలో సుకృతాన్ని అన్వేషిస్తూ, లోకహితమైన పని కల్పించుకొన్న పనులు కొన్ని ఈ శ్లోకంలో ఉదహరింపబడినాయి. ప్రాసంగికమే మొదట చెప్పబడింది.

1) ప్రాసంగిక సుకృతం:- లోకంలో తల్లిదండ్రులు తమ బిడ్డలకు శ్రీనాథుడు నారాయణుడు, రాముడు, సీతమ్మ మొదలైన పేర్లనే పెట్టి, వారిని పిలుస్తుంటారు. ఎవ్వరు రావణుడు, శూర్పణఖ అనే పేర్లను పెట్టరు. భగవన్నామాన్ని ఉచ్చరించడం వల్ల 'శ్రీనాథా! నారాయణా! సీతా!' అని పిల్లలను పిలిస్తే పుణ్యం కలుగుతుందని తెలిసినా తెలియకున్నా, ఆ పేర్లను పెట్టి పిలువడం శిష్టాచార సంప్రదాయంగా ఉంది. ఆ విధంగా భగవన్నామాన్ని అప్పుడప్పుడు, కీర్తించడం వల్ల, బ్యాంకులో ధనాన్ని దాచుకొంటున్నట్లు, సుకృతాన్ని మూటగట్టుకోవడమే అవుతుంది.

2) అక్లుప్తఫలాంతరైః :- ఆనుషంగిక సుకృతమిది:- ఒక వ్యక్తిని దారిలో చోరులు హింసించడానికి చుట్టుముట్టారు. ఆ దారిలోనే వస్తున్న ఇంకొక మనిషి చోరుల కంటబడగానే 'ఈ వ్యక్తి యొక్క అంగరక్షకుడే ఆ మనిషి' అనే భ్రమ కలిగి, చోరులు హింసించకుండా పారిపోయారు. ఈ వ్యక్తికి హింస కలుగకపోవడానికి కారణమైన ఆ మనిషికేర్పడిన సుకృతమే 'ఆనుషంగిక' మనబడుతుంది.

3) అమతివిహితైః :- అబుద్ధిపూర్వక సుకృతమిది:- చచ్చిన వ్యక్తి యొక్క బొక్క ఏ కారణం చేతనైనా ఎగిరి గంగలో పడితే, ఆ చచ్చిన వ్యక్తిని సుకృతాత్ము డనడంలోక పరిపాటి కదా!

గంగానదీ తీరమందు విహరించబోయిన వ్యక్తికి, హఠాత్తుగా కాలుజారి దొర్లుతూ ప్రవాహంలో పడి గంగలో మరణం సంభవించడం వల్ల అజ్ఞాత సుకృతమే ర్పడింది.

4) యదృచ్ఛయా ధర్మాయిత్రైః :- యాదృచ్ఛిక సుకృతం:- ఒక జాలరి చేపలను బట్టడానికి పుణ్యతీర్థాలలో లేదా సముద్రంలో మునుగుతున్నప్పుడు ఆ సమయం పర్వకాలమైనందువల్ల, జాలరి పుణ్యం కోసం మునుగకున్నా, పుణ్యకాల, తీర్థాల మహిమ వల్ల, అతని కేర్పడిన సుకృతం యాదృచ్ఛికం.

5) అన్యైశ్చ:- (వీటికంటెను వేరైన సుకృతం) సామాన్య బుద్ధి మూలకమైన సుకృతం:- ఒకడు సువర్ణదానం చేయాలనే బుద్ధి కలిగి ఒక బ్రాహ్మణుణ్ని పిలిచి, పాదప్రక్షాళన పూర్వకంగా సువర్ణాన్ని దానమిచ్చి, భోజనంపెట్టి, యథావిధిగా పూజించాడు. అతడు సామాన్య బ్రాహ్మణుడనుకొన్నాడు. కాని, ఆ బ్రాహ్మణుడు శ్రోత్రియుడు. వేదశాస్త్ర విద్వన్మణి, సదాచార నిష్ఠకలవాడు. కాబట్టి, దాతకు సత్పాత్రదానమనే సుకృత విశేష మేర్పడడం బుద్ధిమూలకం.

పరిణత బహుచ్ఛద్మా:- ఇట్టి అనేక సుకృతాలను వ్యాజంగా చేసుకొంటుంది దయాదేవి. భరన్యాసచ్ఛద్మం తో పాపరాశిని కానుకగా చేసుకోవడం మొదల్గాని ఛద్మపరంపర కలది దయాదేవి.

స్వయం ప్రదిశసి నిజాభిప్రేతం నః ప్రశామ్యదపత్రపా:- మనం చేసిన కర్మల ఫలమెట్టిదో? అదెప్పుడు కలుగుతుందో మనకే తెలియదు. ఇక మనం కోరిన ఫలం మనకు లభించడం జరిగే పని కాదు. భగవద్దయ వల్లనే జరుగుతుంది. కాబట్టి, దయాదేవి ఇంతకాలం చేతనులను రక్షించ లేదనే లజ్జను విడిచి సుకృతాన్ని అన్వేషింప సాగింది. చేతనులకు శాశ్వతమైన, ఆత్యంతిక దుఃఖరాహిత్యమనే మోక్ష ఫలాన్ని కలిగించాలనేదే దయాదేవి కోరిక. వృషాద్రి యందే ఉన్న నిచ్చెన నెక్కించ దలచింది. స్వయం 'నిజాభిప్రేతం' అనే చోట 'స్తోత' కోరిన ఫలాన్ని దయ ప్రసాదిస్తుంది అని అర్థం కాదు; దయాదేవియే తనంతతాను తనకు ఇష్టమైన మోక్ష పురుషార్థాన్నే చేతనులకు - స్తోతలకు - ప్రపన్నులకు ప్రసాదిస్తుంది అన్న భావమే ప్రాచీన వ్యాఖ్యాతల అభిమతం.

మహాస్రగ్ధర:

క్షితిపై వేదోక్త కర్మార్జితములు నదనైచేరు పుణ్యంబులున్ ని
శ్చితముల్ గానట్టియాదృచ్ఛిక సుకృతములున్ జేరగామమ్ము సంపా
దితనానా వ్యాజవై సందియములు దొలగన్ ధీరవై మాకు నీవే
హిత బుద్ధిన్ వాంఛితార్థం బెలమినిడుదుగా యిందిరేశాను కంపా!

75. అతివిధిశివై రైశ్వర్యాత్మానుభూతి రసైర్జనాన్
అహృదయ మిహోపచ్ఛం ద్యైషా మసంగదశార్థినీ !
తృషిత జనతా తీర్థస్నాన క్రమక్షపితైనసాం
వితరసి దయే! వీతాతంకా వృషాద్రి పతేః పదమ్ ॥

అర్థం:- దయే = ఓ దయాదేవీ! అతి విధిశివైః = బ్రహ్మ రుద్రుల (ఆనందాల)ను మించినట్టి; ఐశ్వర్య + ఆత్మ + అనుభూతి, రసైః = ఐశ్వర్యం యొక్క, కైవల్యం యొక్క, అనుభవానందాలచేత; జనాన్ = జనులను గురించి; ఇహ = ఈ ఐశ్వర్య కైవల్యాలలో; అసంగ దశ+అర్థినీ = ఆసక్తి లేని స్థితిని పొందజేయ కోరిన దానివై; అహృదయం (యథాతథా) = ఇష్టం లేనట్లుగా; ఉపచ్ఛంద్య = (ఐశ్వర్యాది ఫలాలనిచ్చి వారిని) సమాధానపరచి, తృషిత - ఏనసాం! తృషిత = దప్పిగొన్న; జనతా = జనులయొక్క; తీర్థస్నాన క్రమ= పుణ్య నదీ జలమందు స్నాన న్యాయం చేత; క్షపిత = పోగొట్టబడిన; ఏనసాం = పాపం గల; ఏషాం = ఈ జనులకు; వీత + ఆతంకా (సతీ) = పోయిన భయలజ్జాదులు గలదానివవుతూ; వృషాద్రిపతేః = శ్రీనివాసుని యొక్క; పదం = స్థానాన్ని (మోక్షాన్ని); వితరసి = ఇస్తున్నావు.

తా:- ఓ దయాదేవీ! బ్రహ్మ రుద్రులు అనుభవించే ఆనందాల కంటెను ఉత్కృష్టమైన ఐశ్వర్య కైవల్యానుభవానందాలను ప్రపన్నులకు కలుగజేశావు. వారు ఐశ్వర్య కైవల్య ఫలాలను అనుభవిస్తున్నప్పుడు, వాటిలోని దోషాలను గమనించి వారికి వాటియందు రుచి - ఆసక్తి - లేకుండా జేశావు. ఆ ఫలానుభవం పట్ల అసంగదశను - విరక్తిని కలిగించిన దానివి నీవే అని వారు భావించకుండా జాగ్రత్త పడినావు. గ్రీష్మర్తువులో తాపంతో దప్పిగొన్న వ్యక్తి పుణ్య తీర్థమందు స్నానం చేసిన

వెంటనే వాని దాహం, తాపం తొలగిపోయింది. తాననుకోకున్నా, పుణ్యతీర్థ ప్రభావం వల్ల పాపం కూడా తొలగిపోయి పరిశుద్ధుడయ్యాడు కదా! అట్లే, శరణాగతులకు ఐశ్వర్య కైవల్య ఫలాలననుభవించడం పట్ల రుచిపోయి, మోక్షమందు ఆశ జనించింది. కాబట్టి, నీవు వీతాతంకవై క్రమంగా వారిని భగవత్సన్నిధానానికి చేరుస్తున్నావు. మోక్షానందాన్ని కల్పిస్తున్నావు.

వ్యాఖ్య:- ప్రపన్నులకు ఇష్టమైనట్లు ప్రవర్తిస్తూ దయాదేవి క్రమంగా మోక్షానందాన్ని కల్పిస్తున్నదని సన్నుతించే శ్లోకం.

గత శ్లోకంలోని 'ప్రదిశసి నిజాభిప్రేతం" అన్న మాటను దేశికులు ఈ శ్లోకంలో విశేషంగా వివరిస్తున్నారు.

సంశయాత్మకంగా ఉన్న మాట ఇది.

(1) ప్రపన్నునికి ఇష్టమైన ఫలాన్ని ఇవ్వడమనే అర్థం,

(2) దయకు ఇష్టమైన ఫలాన్ని ఇవ్వడమనే అర్థమూ ఉంది.

మనం దయను సమాధానపరచలేము. 'ఇదే ఇమ్ము, అది వద్దు' అని దయాదేవిని బలాత్కరించగలమా? తననాశ్రయించిన జనుల యోగక్షేమాల పట్ల దయాదేవి చాలా శ్రద్ధ వహించి, తన కోరిక రీతిగా ఉపకరిస్తుంది. 'భయం, లజ్జ, పక్షపాతం లేనిది దయాదేవి' అని ఉపాసకులు భావించే విధంగా ప్రవర్తిస్తుందని వివరిస్తున్నది. ముఖ్యంగా ఈ దశకంలోని ప్రధాన విషయమైన భక్తచ్ఛందానువర్తిత్వం' సుశ్లోకిత మవుతున్నది.

అతివిధిశివైరైశ్వర్యాత్మానుభూతిరసైః :- 'విధి' అంటె చతుర్ముఖ బ్రహ్మ. బ్రహ్మ దేవుడు ఉన్నతమైన తన పదవిని అధిష్ఠించి గొప్ప ఆనందాన్ని పొందుతున్నాడు. మహా దేవుడైన శివుడు తన పదవిని స్వేచ్ఛగా నిర్వహించుకొంటూ బ్రహ్మాండమందు మహానందాన్ని అనుభవిస్తున్నాడు. బ్రహ్మకుగానీ, శివునికిగానీ గొప్ప ఆనందానుభవాన్ని ప్రసాదించే వాడు శ్రీనివాస భగవానుడే అని అందరికీ తెలిసిన విషయమే. వీరిరువురి ఆనందానుభవం కంటె ఎంతో శ్రేష్ఠమైనది ఐశ్వర్య కైవల్యాను భవానందం.

'ఐశ్వర్యం' అంటే ప్రాపంచిక సుఖాలనన్నింటిని అనుభవింపజేయగల సంపత్తు కదా! అధ్యాత్మ విదులు కూడా సాధారణంగా ఐశ్వర్యాన్ని కోరుతారు. 'కైవల్యం' అంటె ఆత్మానుభవానందం. ఇది మోక్షస్థానమే అయినా, పరమాత్మతో సంబంధం లేని, అందరికీ లభ్యం కాని ఉత్తమ ఫలం. జీవుడు తన దేహాన్ని విడిచిపోయిన తర్వాత పరమాత్మ సన్నిధిని చేరక, కేవలం తనను తాను సేవించుకొంటూ ఎడతెగని ఆనందాన్ని పొందడమే 'కైవల్యం'. ఇటు సంసారంలో మళ్ళీ జన్మించే అవకాశం ఉండదు. అటు పరమాత్మను సేవించే భాగ్యమూ లేని పురుషార్థమిది.

అయితే, బ్రహ్మ రుద్రుల ఆనందంకంటె ఐశ్వర్య కైవల్యాను భవానందం గొప్పదా? అనే శంక జనించకమానదు. బ్రహ్మరుద్రుల ఆనందం శాశ్వతమైనది కాదు. బ్రహ్మకు వేదాలు అపహరింపబడినప్పుడు కలిగిన క్షోభ దుర్భరమైనది. పరమశివునికి గురుపాతకం తగిలి – కపాలం అరచేతికి అంటుకొన్నప్పుడు పడిన అవస్థలు – బాధలు చెప్పనలవికానివే కదా! తాము ఎవరికి వరాలిచ్చారో, వారిచేతనే ఆనందం భగ్నమై వీరు దుఃఖపడిన వైనం పురాణాల్లో ప్రసిద్ధమే. భగవద్దయ వల్ల, దుఃఖసంబంధమున్న బ్రహ్మశివానందానుభవం కంటే, నిరంతర సుఖానుభవాన్ని కలిగించే ఐశ్వర్యమూ, కైవల్యానుభవమూ గొప్పవనడం ప్రామాణికమే.

జనాన్ అహృదయ మిహో పచ్ఛంద్య, ఏషామసంగ దశార్థినీ:– దయాదేవికి, మోక్షానందానికి వ్యతిరిక్తమైన ఐశ్వర్య కైవల్యానుభవరసాన్ని ఆశ్రితులకు ప్రసాదించాలనే ఇష్టముండదు. కాని తనకిష్టం లేకపోయినప్పటికీ, భక్తులు కోరిన ఫలాలనే ఇచ్చి వారిని ఉపచ్ఛందనం చేస్తుంది.

ఉపచ్ఛందనం:– తల్లి ప్రేమతో తన పిల్లలు కోరిన వాటిని ఇచ్చి, వారిని తృప్తి పరచేరీతిగా నటించి, మెల్లగా వారి భావాలను మార్చివేసి, ఇచ్చిన వస్తువుల పైన రోత పుట్టించి, వదలి వేసేటట్లు చేస్తుంది. వెంటనే వారి శ్రేయస్సు కోసం తాను ఇష్టపడిన రసవత్తరమైన ఫలాలను ఇస్తుంది.

ఆ విధంగానే, దయాదేవి ఫలసంగులైన ఆశ్రితులకు కోరిన విచిత్ర ఫలాలనిచ్చి ప్రలోభపెడుతుంది. 'ఆహా! కోరిన వెల్ల ప్రసాదిస్తుంది మా తల్లి' అని భక్తులు ఐశ్వర్య కైవల్యాది ఫలాలను పొంది తృప్తి పడుతుంటారు. దయాదేవి మాత్రం

వారికి ఈ ఫలసంగ దశ ఉండకూడదనే మనోరథం కలది. కాబట్టి, క్రమంగా వారికి ఐశ్వర్య కైవల్యాది ఫలాలలో ఉండే దోషాలను గమనింప జేస్తుంది. వాటిపైన విరక్తిని పుట్టిస్తుంది. మోక్ష ఫలమందు రుచిని – రక్తిని – కలిగిస్తుంది.

తృషిత జనతా తీర్థస్నాన క్రమక్షపి తైనసాం:– పాపాలను తొలగించుకోవాలనీ, పుణ్యాన్ని సంపాదించుకోవాలనే ఆశ లేని కేవలం ప్రచండమైన ఎండకు తాపం చెందుతున్న వ్యక్తి గంగానదిలోకి దిగి మునిగి తాపాన్ని చల్లార్చుకొన్నాడు. వెంటనే వానికి తాపమేకాదు పవిత్రమైన గంగా జలస్నానం చేత పాపాలు నశించాయి. పునీతుడయ్యాడుకదా! అలాగే ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి అనే మూడు వర్గాలకు సంబంధించిన భక్తులను దయాదేవి జ్ఞానులుగా మార్చే ప్రయత్నం చేస్తుంది. శ్రీనివాస పరబ్రహ్మ పాద సన్నిధిని పొందడమే శాశ్వతమైన ఆనందమనే రుచిని పుట్టించి, వేంకటాద్రికి తీసికొనివచ్చి, నిచ్చెన నెక్కిస్తుంది.

వితరసి దయే! వీతాతంకా వృషాద్రిపతేః పదమ్:– 'వీతాతంకా' అంటే 'భయాన్ని తొలగించుకొన్నదై' అని దయాదేవికి సన్నంతపద విశేషణమది. దయాదేవి చాలా భద్రంగా ప్రవర్తిస్తుంది. పక్షపాతం, వైషమ్యం కలదని ఎవరు తనను దూషించకుండా వారి వారి ఇష్టప్రకారం ప్రవర్తిస్తూ, క్రమంగా సుకృతాన్వేషణం చేసి, మోక్ష ఫలానుభవయోగ్యతను కల్పిస్తుంది.

"ఘుణక్షితి లిపిక్రమా దుపనిపాతినః పాతినః" (సం.సూ) 'ఘుణం' అంటె కట్టెను తొలిచే పురుగు. 'ఘుణక్షితి' అంటె పురుగు కట్టెను తొలువగా ఏర్పడిన అక్షరం. ఈ అక్షరాన్ని కల్పించాలని పురుగు అనుకోదు కదా! కాని అది చేసిన పనిని బట్టి ఏదో ఒక అక్షరం ఏర్పడుతుంది. ఆ రూపాన్ని చూచి 'ణ' అక్షరమిది అని చదువరి గ్రహించినట్లే, భగవానుడు ఘుణాక్షరన్యాయం'గా మనలోని, మనకు తెలియని సుకృతాన్ని వెదకి, స్వీకరించి శ్రేయస్సును కలిగిస్తుంటాడని దేశికులన్నారు.

దయాదేవి వాత్సల్యంతో 'అసంగదశార్థిని' అయినా, ఫలసంగులకు ఫలాల నిస్తూనే జాగ్రత్తగా మనలను క్రమేణ సంగ రహితులను జేసి వీతాతంకయై, వృషాద్రికి తీసికొనిపోతుంది. శ్రీనివాసుని పాదసన్నిధిని జేర్చుతుంది. మోక్ష సామ్రాజ్య భోగానుభవరసాన్ని ప్రసాదిస్తుంది. మోక్షమంటే సాలోక్య, సారూప్య, సామీప్య,

సాయుజ్య మనే నాలుగు విధాలలో సాయుజ్యమే సాటిలేని మోక్షమని అర్థం. "సాయుజ్య మన్యే సతుమోక్ష ఉక్తః"

"సాయుజ్యం ప్రతిపన్నాయే తీవ్రభక్తా స్తపస్వినః ।
కింకరా మమతే నిత్యం భవంతి నిరుపద్రవాః ॥"

అన్నట్లు, భగవచ్చరణార వింద నిత్య కైంకర్య రసానుభవాన్ని పొందడమే మోక్షానందాన్ని పొందడమని అర్థం.

మ.స్ర. ఇలతీర్థస్నానమెట్లున్ దృషితుల శుచికిన్ హేతువైనట్లు నీచే
జలజోజ్జాతేశ్వరాదుల్ చవియెఱుగనియైశ్వర్య కైవల్య భోగం
బులయందున్ రక్తి చిత్తంబుల వదలు దశన్ బొందుటర్థించి శుద్ధా
త్ములకున్ సాయుజ్య సౌఖ్యంబు నొసగ కరుణా! పూనవే త్యక్త భీతిన్॥

76. వృషగిరి సుధాసింధౌ జన్తుర్దయే! నిహితస్త్వయా
భవ భయ పరీతాపచ్ఛిత్త్యై భజ న్నఘమర్షణమ్ ।
ముషిత కలుషో ముక్తే రగ్రేసరై రభిపూర్యతే
స్వయ ముపనతైః స్వాత్మానంద ప్రభృత్యనుబంధిభిః ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వయా = నీచేత; భవ భయ పరీతాపచ్ఛిత్త్యై = సాంసారిక భయాన్ని, తాపత్రయాన్ని తొలగించడం కోసం; వృషగిరి సుధాసింధౌ = వేంకటాచలమందున్న అమృత సముద్రమైన శ్రీనివాసుని యందు; నిహితః = చేర్చబడిన; జన్తుః = ప్రాణి; అఘమర్షణం = అఘమర్షణ స్నానాన్ని - సర్వపాప ప్రాయశ్చిత్తరూపమైన ప్రపత్తిని; భజన్ = పొందుతూ - అనుష్ఠిస్తూ; ముషిత కలుషః = నిరస్తపాపుడై; స్వయం, ఉపనతైః = స్వయంగా ప్రాప్తులైనట్టి; ముక్తేః = మోక్షమార్గానికి; అగ్రేసరైః = ముందు నడిచే వారైన; స్వ+ఆత్మానంద, ప్రభృతి + అనుబంధిభిః = స్వాత్మస్వరూప స్వభావానుసంధాన ప్రీతియు, పరమాత్మ స్వరూప స్వభావాను సంధాన జనిత ప్రీతియు కలిగి, అనుసరించి ప్రవర్తించే మోక్షాయత్త చిత్తుల చేత, అభిపూర్యతే = పూరించబడుతున్నాడు / పరివేష్టింప బడుతున్నాడు.

తా: ఓ దయాదేవీ! సంసారమందుకలిగే భయాన్ని, తాపత్రయాన్ని నివారించడానికి నీవు చేతనుణ్ని వేంకటాద్రి పైనున్న అమృత సముద్రమైన శ్రీనివాసుని యందు చేర్చుతున్నావు. అఘమర్షణమని చెప్పబడే ప్రపత్తిని అనుష్ఠింప జేస్తూ ఆతని పాపాలను నశింపజేస్తున్నావు. లోకమందున్నంత వరకు పరమపద మందు అనుభవింపదగిన భోగాలను, ముముక్షువుల గోష్ఠిలో ఉండి పరమాత్మాను భవానందాన్ని పూర్ణంగా అతనికి సంభవింపజేస్తున్నావు.

వ్యాఖ్య: శ్రీనివాసుని దయ వల్ల ప్రపన్నుడు ఇక్కడనే అపవర్గ సౌఖ్యాన్ని అనుభవిస్తాడని వర్ణితం.

'అఘమర్షణం' అనే సూక్తాన్ని పఠిస్తూ స్నానం చేస్తే పంచ మహాపాతకాలు పటా పంచలవుతాయని ధర్మశాస్త్రం. "పునంతు వసవః పునాతు వరుణః పునాత్వ ఘమర్షణః" అని ఆ మంత్రాన్ని ఉచ్చరిస్తూ తీర్థమాడిన వ్యక్తి బాహ్యాభ్యంతరాలతో పాటు శుచిర్భూతుడవుతాడు. ఈ శ్లోకంలో సర్వ పాపాలకు ప్రాయశ్చిత్తమైన ప్రపత్త్యుపాయం అఘమర్షణమని చెప్పబడింది.

వృషగిరిసుధాసింధౌ జంతుర్దయే! నిహితస్త్వయా:- దయాదేవి తన నాశ్రయించిన జీవులకు 'అఘమర్షణం' కలుగజేయగోరింది. కాబట్టి, మొదట వేంకటాద్రి యందున్న అమృతోదధి యైన శ్రీనివాసుణ్ని పొందజేస్తుంది.

ఏషబ్రహ్మప్రవిష్టోఽ స్మిగ్రీష్మే శీతమివహ్రదమ్" మండుటెండల్లో చల్లని సరస్సులో మునిగే విధంగా, నేను ఈ బ్రహ్మమనే సరస్సులో ప్రవేశిస్తానన్న మాట స్మరణీయం.

"యా మోహితా వివిధభోగమరీచికాభిర్విశ్రాంతిమద్య లభతే
విబుధైకనాథ! గంభీర పుణ్యమధురం మమధీర్భవంతం
గ్రీష్మే తటాకమివ శీతమనుప్రవిష్టా!" (దేవనాయక పంచాశత్)

ఓ దేవనాథా! పలు రకాల ప్రాపంచిక భోగాలనే ఎండమావులచే వ్యామోహితమైన నా బుద్ధి గ్రీష్మకాలాన గంభీరమైన, పవిత్రమైన, మధురమైన, చల్లని తటాకంలో ప్రవేశించినట్లు, కమనీయమైన నీయందు చేరి విశ్రాంతిని పొందిందని దేశికులు స్తుతించారు.

అక్కడ తటాక మని చెప్పిన దేశికులు ఇక్కడ ఒక సముద్రాన్నే సంభావించారు. అది కూడా అమృతసముద్రం కదా! పవిత్రీకరించడంలోనూ, భోగానుభవంలోనూ ఎంతో వైలక్షణ్యం సూచింపబడుతున్నది.

ఆరోగ్యకరమైనను, సుఖకరమైనను, అపవిత్రులను పవిత్రం చేసేదైనను అఘమర్ష ణానికి చేతనులు ఇష్టపడరు. కాబట్టి దయాదేవి పట్టుబట్టి సంసారులను సువర్ణావకాశం నుంచి విడిపోనీయకుండా, అమృత జలధిలోకి నెట్టివేస్తుంది కదా! తల్లిదెంత ప్రేమయో! "మంజన మాదనీ వారాయ్" అని యశోద శ్రీకృష్ణుణ్ని స్నానమాడ రమ్మని పిలిచింది. "నీరాడప్పోదువీర్ పోదుమినో". అని గోదాదేవి కూడా తీర్థమాడ ప్రేరేపించింది.

భవభయపరీతాపచ్ఛిత్యై భజన్నఘమర్షణం ముషితకలుషః:- శ్రీనివాసుడనే అమృత సింధువులో అఘమర్షణ స్నానమాడితే చేతనుల పాపతాపాలు నశించడమే కాదు, అనాదిగా జన్మ జన్మల నుంచి పట్టుకొని పీడిస్తున్న సంసార భయం కూడా ప్రధ్వంసమవుతుంది. "కలుషం వృజినైనో ఘమంహోదురిత దుష్కృతమ్" (అమరం) "తదైవ ముష్ణాత్యశుభాన్యశేషతః" - ప్రకృతి బంధం వల్ల ఆత్మకు జిడ్డుగా తగుల్కొన్న కలుషం - మురికి, దురితమంతా అఘమర్షణమనే ప్రపత్త్యనుష్ఠానం చేత పూర్తిగా దొంగిలింపబడుతుంది. పూర్వాఘాలన్నీ భస్మమవుతాయి. పులుగడిగిన ముత్యమై ఆత్మ ప్రకాశిస్తుంది.

ముక్తేరగ్రేసరైః స్వయముపనతైః :- ప్రపత్తిని అనుష్ఠించిన వెంటనే మోక్షేచ్ఛ ఉత్కటంగా జనిస్తుంది. ప్రపత్తికి ఉత్తర కాలాన అంటే మోక్షకాలం పొందే దాకా, ప్రపంచమందు ఉండునంత వరకు సర్వశుభాలు ఆశ్రయిస్తాయి. ప్రపన్నుడు కోరకున్నను, తమంత తామే పరమ పదమందు అనుభవింప దగిన భోగాలన్నీ చేరుతాయి. మోక్షమార్గాన ముందు నడిచే వారితో సాంగత్యమూ ఏర్పడుతుంది. తనంత తానుగా వచ్చే పరమాత్మానుభవాన్ని సంపూర్ణంగా ఈ లోకంలోనే ప్రపన్నుడు అనుభవింప యోగ్యుడవుతాడు. అనన్తకల్యాణగుణామృతోదధియైన సర్వేశ్వరుడు ప్రపన్నుని ప్రజ్ఞయందు ప్రకాశించడం వల్ల నిత్యనైమిత్తికాది సర్వకర్మలనన్నీ భగవంతుని ప్రీతికోసమే చేస్తుంటాడు. తత్ఫలితంగా, పరమాత్మానుభవం ఇక్కడనే పూర్ణంగా లభిస్తుంది.

స్వాత్మానంద ప్రభృత్యనుబంధిభిరభిపూర్యతే:- స్వాత్మానంద మంటే భగవత్సంబంధం లేని కేవలం ఆత్మానుభూతి అనే అర్థం (కైవల్యం) కాదు. ఆత్మకు శేషత్వమే స్వరూపం కాబట్టి, జీవుడు హరిదాస్య రసికతను అనుభవించడమే స్వాత్మానంద పదానికి అర్థం. మరొక అర్థం ఇక్కడ గమనీయం.

విశ్వాత్మయైన పురుషోత్తముడు జీవునికి ఆత్మ. కాబట్టి, జీవుడు తనకు ఆత్మయైన పరమపురుషుని ఆనందాన్ని అనుభవించడమూ 'స్వాత్మానంద'మే. 'ప్రభృతి' శబ్దం చేత ఈ రెండు రకాల భోగాలను అనుభవించే వారితో అనుబంధముంటుందని గమనించాలి.

1) సర్వకర్మ సమారాధ్యుడైన శ్రియః పతికి సర్వవిధాలా కైంకర్యం - సేవ చేస్తూ, తనను శేషభూతుడుగా, 'దాసోఽహం'గా భావిస్తూ, జీవాత్మను అనుభవించే ఆనందంతో ప్రవర్తించేవారు.

2) శరీరభూతుడైన జీవాత్మకు సర్వాత్ముడైన పరమాత్ముడే ఆత్మ. "నిహితంగుహాయామ్" - శ్రుతిరీత్యా అంతర్యామిగా ఉన్న పరమాత్మను సాక్షాత్కారం చేసుకొనే యోగ్యత సాధారణంగా లేనందువల్ల, అర్చామూర్తి యొక్క దివ్యమంగళ విగ్రహ స్వరూప స్వభావాలను సంపూర్ణంగా అనుభవించే ఆనందంతో ప్రవర్తించే వారు అని భావం. శ్రీనివాసుని దయకు పాత్రుడై తచ్చరణారవింద ప్రాప్తి వల్ల

"సం సృజ్యతే యదిచ దాస జనస్త్వదీయః
సంసార ఏష భగవన్! అపవర్గ ఏవ ॥"

అన్నట్లు, మోక్షాసక్తులైన భగవద్దాసులగోష్ఠిలో ఉండి, భగవద్గుణానుభవం చేస్తుండే ప్రపన్నుడు సంసారంలోనే ఉన్ననూ, శ్రీవైకుంఠంలో మోక్షమనే అరుదైన ఆనందామృతాన్ని అనుభవిస్తుంటాడు.

మహాస్రగ్ధర:

దయనీయున్ జీవు దాపత్రయ వినిహతిచే ధన్యునింజేయ నీవే
స్వయమై శేషాద్రి పీయూషమయ జలధిముంచన్ గతాశేష పంకా
శయుడై స్వాత్మైక నిష్ఠా జనిత పరసుఖాస్వాదులం గూడి వాడ
క్షయ మోక్షానంద మిందే సతతముబడయున్ శార్ఙ్గ ధన్వానుకంపా ॥

77. అనితరజుషా మంతర్మూలే ౭ ప్యపాయపరిప్లవే
కృతవిదనఘా విచ్ఛిద్యైషాం కృపే! యమవశ్యతామ్।
ప్రపదన ఫలప్రత్యాదేశ ప్రసంగ వివర్జితం
ప్రతి విధిముపాధత్సే సార్థం వృషాద్రిహితైషిణా ॥

అర్థం:- హే కృపే = ఓ దయాదేవీ! అనితరజుషాం = ఇతర దేవతలను, ఇతర ఫలాలను కోరని ప్రపన్నులకు; అంతః+మూలే = బుద్ధిపూర్వకమైన; అపాయ పరిప్లవే+అపి = అపరాధమనే సంకరం కలిగిననూ; కృతవిత్ = కృతజ్ఞురాలవూ; అనఘా = నిగ్రహేచ్ఛ అనే దోషం లేని దానవూ అయిన నీవు; ఏషాం = ఈ ప్రపన్నులకు; యమవశ్యతాం = యమునికి లోబడడమనే ఆపదను; విచ్ఛిద్య = తొలగించి; వృషాద్రి హితైషిణా, సార్థం = వేంకటాద్రి యందే ఉండి హితాన్ని కోరే శ్రీనివాసునితో కూడి; ప్రపదన ఫల ప్రత్యాదేశ ప్రసంగవివర్జితం = ప్రపత్తికి ఫలమైన మోక్షప్రాప్తికి భంగమనే మాట కలుగనట్టి; ప్రతివిధిం = ప్రతిక్రియను (స్వల్ప దండనను); ఉపాధత్సే = కల్పిస్తావు.

తా: అనన్యశరణులైన వారికి బుద్ధిపూర్వకంగా పాపం చేసినప్పటికీ, ప్రపత్తిని జేసినవాడని కృతజ్ఞురాలవై, హింసించే దోషం లేని నీవు ప్రపన్నులకు యముని వశమయ్యే బాధను వారించి, ఓ దయాదేవీ! నీవు శ్రీనివాసునితో కలిసి ఆలోచించి ప్రపత్తికి ఫలమైన మోక్షాన్ని పొందడానికే లాటి ఆటంకంలేని స్వల్పదండన మనే ప్రతిక్రియను కల్పిస్తావు.

వ్యాఖ్య: ప్రపన్నులకు బుద్ధిపూర్వకమైన ఉత్తరాఘ ప్రసక్తి కలిగిననూ, మోక్ష ప్రాప్తికి లోటులేని పరిహారాన్ని కల్పించడం దయాకార్యమని స్తుతి.

ప్రపత్తికి ఉత్తరకాలాన ఈ లోకంలో ఉన్నంత వరకు స్వాత్మానుభవమూ, భగవదనుభవమూ కలిగిన మోక్షగాములతో పరివేష్టింపబడిన ప్రపన్నుడు ఈ లోకమందే పరమపదమందలి భోగానుభవాన్ని పొందుతాడని గత శ్లోకం వివరించింది. ఈ శ్లోకం ప్రపన్నునికి మనఃపూర్వక పాపంగానీ, శాస్త్రోల్లంఘనం గాని ఏర్పడినా, మోక్షప్రాప్తి తప్పక కలుగుతుందని వర్ణిస్తున్నది.

అనితరజుషాం:– దేవతాంతర పరులు, ప్రయోజనాంతరపరులు కాని వారికి అని అర్థం.

అంతర్మూలే అపాయపరిప్లవే అపి:– 'అంతః' అంటే అంతఃకరణం – మనస్సు. దాని మూలమంటే మనఃపూర్వక మని అర్థం. 'అపాయ' మంటే భగవదాజ్ఞా రూపాలైన శాస్త్ర విధులను ఉల్లంఘించడమని అర్థం. 'పరిప్లవ' మంటే ప్రసరించడమని అర్థం.

ఇతర ప్రయోజనాలను కోరకుండా, ఇతర దేవతలను సేవించకుండా శ్రీనివాసుని కృపనే పొందవలెనని శరణాగతిని చేసిన వారికి తెలియకుండా చేసిన పాపాలు అంటనే అంటవు. ఆ పాపాలకు ఫలమీయడు భగవానుడని భావం. ఒకవేళ బుద్ధిపూర్వకంగా శాస్త్ర విహితమైన విధులను ప్రపన్నుడు ఆచరించక పోతే – పునః శరణాగతి అనే ప్రాయశ్చిత్తం అనుష్ఠించకపోతే పాపం ప్రసరించక మానదు – అంటే, అపరాధం అంటుకొంటుంది. అయితే ప్రపన్నునికి ఉత్తరాఘమేర్పడినప్పుడు దయాదేవి ఉపకరించక ఊర్కోదు.

కృతవిత్, అనఘా:– ఆశ్రయించిన వాడు చేసినదేమిటో తెలుసుకొన్నట్టిది దయాదేవి. ఆర్తితో, ఆక్రందిస్తూ మోక్షార్థియై ప్రపత్తి చేసినాడని గుర్తెరిగినది కాబట్టి కృతజ్ఞురాలు కదా! పైగా, అపరాధి కాబట్టి అవశ్యంగా హింసించాలనే దోషం లేనిది.

విచ్ఛిద్య్రేషాం యమవశ్యతామ్:– పాపాత్ములకు యముడు నరకబాధను కలిగిస్తాడు. కాబట్టి, ప్రపన్నుని నిర్యాణ కాలమప్పుడు యముడో, అతని భటుడో వచ్చి, తీసుకొని పోయి, కలిగించే నరకానుభవాన్ని తొలగించే యత్నం తప్పక చేస్తుంది దయాదేవి.

"నఖలు భాగవతా యమవిషయం గచ్ఛన్తి" – భగవద్భక్తులు నరకలోకానికి పోనే పోరు కదా! అని ప్రమాణమున్నది.

వృషాద్రిహితైషిణాసార్థం:– సర్వ ప్రాణుల హితాన్ని కోరే వాడు శ్రీనివాసుడు. "నా హితం కారయేద్ధరిః" – భగవానుడు ఎప్పుడూ అనిష్టాన్ని – చెడును – చేయడని

ప్రసిద్ధి. దయాదేవి కూడా చేతనులచే శరణాగతిని చేయించి, తర్వాత ప్రపన్నులను రక్షింప జేయడానికి భగవానునితో కలిసి ఆలోచిస్తుంది.

ప్రపదన ఫలప్రత్యాదేశ ప్రసంగ వివర్జితం ప్రతివిధిముపాధత్సే:- ప్రపత్తికి మోక్ష ఫలమీయడం భగవత్సంకల్పం. ప్రపత్త్యనంతరం ప్రారబ్ధవశాన కలిగిన అపరాధానికి తగినట్లు శ్రీనివాసుడు దండన విధిస్తాడేమో అనే భావం చేత దయాదేవి భగవానునితో సంప్రదిస్తుంది. ప్రాయశ్చిత్తంగా పునఃప్రపత్తిని చేయిస్తుంది. ఒకవేళ ప్రాయశ్చిత్తం - మళ్ళీ ప్రపత్తిని - ఆచరించకపోతే, అపరాధియైన రాజపుత్రునికి స్వల్ప దండన విధించే న్యాయ ప్రకారంగా పాప పరిహారం కోసం ప్రతివిధిని - ప్రతి క్రియను కల్పిస్తుంది.

"కృతమిహదురితం ప్రమాదవృత్త్యా
కిమపి ముకుంద కృపానిమగ్నమేనమ్ ।
పవన తనయ వాలవహ్ని నీత్యా
నదహతి ధక్ష్యతి యోజితం పరేషు ॥"

ప్రమాదం చేత పాపాలను ఆచరించినప్పటికీ, ముకుందుని కృప యందు మగ్నుడైయున్నందు వల్ల, హనుమంతుని తోక నిప్పు తనను కాల్పక పగతురనే కాల్చి వేసినట్లు; ప్రపన్నుడు చేసిన పాపానికి ప్రతిక్రియగా స్వల్పదండనను విధింపజేసి, నరకబాధ కలుగకుండా కాపాడుతుంది దయాదేవి. అంతేకాదు, ప్రపత్తికి ఫలమైన మోక్షప్రదాన సంకల్పానికి ఏ విధమైన లోపం కలుగకుండా చేసి, ప్రపన్నుడు అవశ్యంగా మోక్షాన్ని పొందునట్లు దయాదేవి మహోపకారం చేస్తుంది.

"ధీపూర్వోత్తరపాప్మనా మజననాత్ జాతేఽ పితన్నిష్కృతేః
కౌటిల్యేసతి శిక్షయాఽ ప్యనఘయన్ క్రోడీకరోతి ప్రభుః" (రహస్యత్రయసారం)

ప్రపన్నునికి ప్రపత్తి చేసినప్పుడే పూర్వ పాపాలు నశిస్తాయి. ఉత్తరాఘాలు సంభవింపవు. ఒకవేళ సంభవించినా ప్రాయశ్చిత్తం వల్లగానీ, స్వల్పదండనానుభవం వల్ల గానీ అవి నశించి పోతాయి. తత్ఫలితంగా, ప్రపన్నునికి కర్మశేషం లేకుండా

చేసి, భగవానుడు ప్రపత్తికి ఫలం మోక్షప్రాప్తియే అన్న తన సంకల్పాన్ని అమోఘంగా నెరవేరుస్తాడని దేశికులన్నారు.

మహాస్రగ్ధర॥

జగతిన్ పుణ్యుల్ ప్రపన్నుల్ సకలుషమతి దుష్కర్మముల్ సేసినన్ బా
పగతిన్ బోనీక వారిన్ ప్రపదన ఫల సంప్రాప్తికే యడ్డులేకన్
దగుమై శిక్షింపగా నిత్యము సలుపుదు మంత్రంబు దేవీదయా! ప
న్నగ శైలేశాప్తుతో మానవ పతి తనయన్యాయతన్ స్వల్పరీతిన్ ॥

78. క్షణవిలయినాం శాస్త్రార్థానాం ఫలాయనివేశితే
సురపితృగణే నిర్వేశాత్ ప్రాగపి ప్రళయంగతే ।
అధిగత వృషక్ష్మాభృన్నాథా మకాల వశం వదాం
ప్రతిభువ మిహ వ్యాచఖ్యుస్త్వాం కృపే! నిరుపప్లవామ్ ॥

అర్థం: హే కృపే = ఓ దయాదేవీ! క్షణ విలయినాం = కొద్దికాలంలో నశిస్తున్న; శాస్త్ర+అర్థానాం = శాస్త్రమందు విధింపబడే యాగదానాది సత్కర్మల యొక్క; ఫలాయ = ఫలం కోసం; నివేశితే = నియమింపబడిన; సురపితృగణే = దేవపితృగణం; నిర్వేశాత్ = సత్కర్మ ఫలానుభవం కంటె; ప్రాక్ = ముందే; ప్రళయం గతే, అపి = నశించిపోయినప్పటికీ; అకాలవశం వదాం = కాలానికి కట్టుబడనట్టి; నిరుపప్లవాం = ఏయుపద్రవం పొందనట్టి; అధిగత వృషక్ష్మాభృత్ + నాథాం = ఆశ్రయింపబడిన శ్రీ వేంకటేశ్వరుణ్ని కలిగినట్టి; త్వాం = నిన్ను; ఇహ = సత్కర్మ ఫలదాన విషయంలో, ప్రతిభువం = ప్రతినిధివిగాను; వ్యాచఖ్యుః = చెప్పియున్నారు.

తా: ఓ కృపాదేవీ! యాగాది సత్కర్మల ఫలమీయడానికి దేవ పితృబృందం నీచే నియమింపబడింది. స్వర్గాది ఫలాలనాశించి యాగ దానాదులు చేసినవారు ఆ సత్కర్మ ఫలాలను పొందులోపలనే ఫలదాత లైన ఇంద్రాది దేవతలు, పితృదేవతలు కాలం తీరి నశించిపోయినప్పుడు, కాలావధిలేని, ఎవరి చేతను ఉపద్రవం పొందని, శాశ్వతంగా శ్రీనివాసుణ్ని ఆశ్రయించి యుండే నీవే, నశించిన దేవపితృ బృందానికి ప్రతినిధిగా ఉండి ఆయా అనుష్ఠాతలకు స్వర్గాది పుణ్య ఫలాలను ప్రదానం చేస్తుంటావని ప్రాజ్ఞులు చెప్పియున్నారు.

వ్యాఖ్య: స్వర్గాది ఫలప్రదాతలైన ఇంద్రాదులు నశిస్తే, దయాదేవి ప్రతినిధిగా నిల్చి యాగాద్యనుష్ఠాతలకు పుణ్యకర్మ ఫలాలనిస్తుందని సుశ్లోకితం.

పాపాలను నశింపజేయడానికి పునః ప్రపత్తి రూపమైన ప్రతిక్రియను లేదా ప్రపన్నునికి స్వల్పదండనను కల్పించి, మోక్షాన్ని అనుగ్రహిస్తుంది భగవత్కృపయే అని పూర్వశ్లోకం వివరించింది. పుణ్యకర్మ ఫలాలనిచ్చే దేవ పితృగణానికి ప్రతినిధిగా భగవద్దయయే ఉంటుందని ఈ శ్లోకం చెబుతున్నది.

క్షణవిలయినాం శాస్త్రార్థానాం ఫలాయనివేశితే సురపితృగణే:- ఏ కర్మ చేస్తే, ఏమి ఫలం లభిస్తుందో వివరించడమే శాస్త్ర ప్రయోజనం. కాబట్టి, శాస్త్రార్థాలంటే స్వర్గాది ఫలాలను పొందడానికి జేయబడే జ్యోతిష్టోమ యాగదానహోమాది పుణ్య కర్మలని అర్థం. యజ్ఞాది కర్మలు శాశ్వతమైనవి కావు. క్షణకాలంలోనే నశిస్తాయి. కర్మలు స్వల్పకాలంలో నశిస్తున్ననూ, ఆయా కర్మల చేత ఆరాధింపబడి, ఆ పుణ్యకర్మలకు తగిన ఫలాలను కర్మిష్ఠుల కొసగడానికి ఇంద్రాది దేవతలు, పితరులు భగవత్కృప చేత ఏర్పాటు చేయబడినారు.

కర్మలు క్షణికాలు: ఫలాలు కొంతకాలానికి లభించేవి కదా! కాబట్టి అచేతనాలైన కర్మలకు ఫలమిచ్చే శక్తి లేదు. కర్మలను చేసిన వెంటనే అవి నశిస్తుండగా 'అపూర్వం' అనే పదార్థమొకటి సంభవిస్తుందనీ, అదే ఫలాన్ని ఇస్తుందని పూర్వమీమాంసా శాస్త్రంలో కల్పింపబడింది. కర్మారాధితులైన ఇంద్రాది దేవతలే ఫలప్రదాతలై యుండగా కల్పితమైన 'అపూర్వం' యొక్క ప్రయోజన మేమున్నది? అందువల్ల 'అపూర్వ పదార్థకల్పన' అందరి సమ్మతిని పొందలేదు కదా!

సతయాశ్రద్ధయా యుక్తః తస్యారాధనమీహతే ।
లభతేచ తతః కామాన్మయైవ విహితాన్ హితాన్॥ (7-22)

ఏ కోరికను కోరే భక్తుడు ఆ కోరికను దీర్చే దేవతనే శ్రద్ధతో ఆరాధిస్తాడు. దానికి ఫలితంగా, నా అనుగ్రహం వల్లనే ఆ భోగాలను ఆ దేవత నుంచి అతడు పొందుతాడు; అన్నాడు గీతాచార్యుడు.

భగవానుడు ఇంద్రాదిదేవతలకు అంతర్యామిగా ఉండడం వల్లనే యాగాది సత్కర్మానుష్ఠాతలు ఆయా దేవతల ద్వారా ఆయా ఫలాలను పొందుతుంటారని వేదాంతశాస్త్రం బోధిస్తున్నది. ఆ దేవ పితృలు కూడా ప్రకృతిమండలమందున్న ఆయా పదవులలో భగవత్కృపచే నియమింపబడిన వారేకదా! వారికీ కాల నియతి ఉంది. వారి పదవులూ శాశ్వతమైనవి కావు.

నిర్వేశాత్ప్రాగపి ప్రళయంగతే:- యాగాద్యనుష్ఠాతలు పుణ్య కర్మఫలాలను పొంద వలసిన సమయానికి ముందుగనే ఫలదాతలైన ఇంద్రాది దేవతలు తమ ఆయుష్కాలం పూర్తి కాగానే తమ భోగస్థానాలతో పాటు నశిస్తే, ఇక ఆయా ఫలాల నొసగే అధికారులెవరున్నారు?

అధిగతవృషక్ష్మాభృన్నాథాం:- ధర్మం స్థిరమైనది, క్ష్మా అంటే స్థిర' అనే ప్రసిద్ధమైన పేరు కలిగిన భూమి. ఆ భూమిని భరించిన పర్వతానికి 'అచల' మని ప్రసిద్ధి. ఆ వృషాచలానికి నాథుడైన శ్రీనివాసుడు కడు స్థిరమైనవాడని తెల్పుతున్న పదమిది. అత్యంత స్థిరమైన శ్రీనివాసుని పొందియున్న దయాదేవి మరెంతో శాశ్వతమైనది కదా!

అకాలవశం వదాం:- కాల ప్రభావం వల్ల కలిగే వికారాలు లేనిది దయాదేవి. ప్రళయంలోనూ లయించని దయాదేవి యొక్క నిరపాయ స్వరూపాన్ని తెల్పుతున్న పదమిది.

నిరుపప్లవా:- తన ఇష్టానికి విరుద్ధమైన ఉపద్రవం ఎవరిచేతనూ, ఎప్పుడూ పొందజాలని వైభవం కలది దయాదేవి.

ప్రతిభువమిహ వ్యాచఖ్యుస్త్వామ్:- యాగాది పుణ్య కర్మలకు ఫలదాతలైన ఇంద్రాదులు కాలానికి లోబడి విలీనమైననూ, పుణ్యకర్మానుష్ఠాతలు ఫలాలను ఇక పొందలేమని భయపడవలసిన అవసరమే లేదు. దయాదేవి ఆయా ఫలాలను అనుగ్రహించడానికి నశించిన ఇంద్రాది దేవతలకు ప్రతిభువు - Guarantor - గా ఉందని శాస్త్రజ్ఞులు చెప్పినారు. భగవద్దయ యొక్క మాహాత్మ్యం అవాఙ్మానసగోచరమని స్పష్టమవుతున్నది.

స్రగ్ధర॥ కాలాధీనంబులై స్వర్గముఖ వివిధ భోగస్థలంబుల్ ఫలార్థుల్
బోలన్ బ్రాపించుమున్నే పొలుపరి ననుదద్భోగముల్ బొందజేయున్
స్థాలిత్యం బెందులేకే జగదధి పతికిన్, స్థానమై నిత్యవౌటన్
భూలోకం బందు నిన్నే బుధవరులు దయా! పూటకాపండ్రు కాదే॥

79. త్వదుప సదనాదద్య శ్వోవా మహాప్రళయేఽపి వా
వితరతి నిజం పాదాంభోజం వృషాచలశేఖరః।
తదిహ కరుణే! తత్తత్క్రీడా తరంగ పరంపరా
తరతమ తయా జుష్టాయాస్తే దురత్యయతాం విదుః॥

అర్థం: హే కరుణే = ఓ దయాదేవీ! త్వత్+ఉపసదనాత్ = నిన్ను ఆశ్రయించడం వల్ల; అద్య, శ్వో, వా = నేడో, రేపో; మహాప్రళయే+అపి, వా = మహాప్రళయమందైనా; వృషాచలశేఖరః = వృషాద్రికి తలమాణికమైన శ్రీనివాసుడు; నిజం = తనదైన; పాద+అంభోజం = చరణకమలాన్ని; వితరతి = ఇస్తున్నాడు. తత్ = అందువల్ల; ఇహ = ఈ రక్షణ విషయమై; తత్+తత్, క్రీడా తరంగ పరంపరా తరతమతయా = ఆయా పలు కెరటాల వంటి క్రీడల తారతమ్యంతో; జుష్టాయాః = కూడుకొన్న; తే = నీయొక్క; దురత్యయతాం = అతిక్రమింప శక్యం కాని తనాన్ని; విదుః = (విజ్ఞులు) తెలిసికొన్నారు.

తా: ఓ దయాదేవీ! నిన్ను శరణం పొందడం వల్ల శ్రీనివాస భగవానుడు నేడో రేపో మరికొన్నాళ్ళకో - మహా ప్రళయకాలమందైనను తన పాదారవిందాన్ని సేవింప నిస్తున్నాడు. కాబట్టి, ఈ మోక్ష ఫలప్రదాన విషయంలో, లీలా తరంగాల తారతమ్యంతో కూడిన నిన్ను దాటి పోవడానికి ఎవరికీ సాధ్యం కాదని శాస్త్రజ్ఞులు తెలుసుకొన్నారు.

వ్యాఖ్య:- భగవద్దయ నాశ్రయించిన వారికి కాలక్రమాన మోక్షమవశ్యంగా లభిస్తుందని సుశ్లోకితం.

పుణ్యకర్మల ననుష్ఠించిన వారికి ఆయా ఫలాలనిచ్చే దేవతలు కాలగర్భంలో కలిసి పోయినప్పుడు, శ్రీనివాసుని దయయే ఆ ఫలాలను అవశ్యంగా అందజేస్తుందని

పూర్వశ్లోకం తెలిపింది. ఈ శ్లోకం భగవత్కృపా పాత్రులకు మోక్షం త్వరగానో, నిదానంగానో లభించక తప్పదనే శాస్త్రార్థాన్ని తెల్పుతున్నది

"మమమాయా దురత్యయా" - నా మాయదాటరానిది అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. "మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే" (7-14) దాటరాని దంటూనే, దాటడానికి ఉపాయమూ చూపించాడు కదా! ఎవరైతే తనను ప్రపత్తి - శరణాగతిని చేస్తారో వారు ఈ మాయను ప్రకృతిని అధిగమిస్తారని భగవద్గీతోపనిషత్తులూ చెబుతున్నాయి.

దయాదేవిని శరణం పొందక పోతే చేతనులు, హెచ్చుతగ్గులుగా ఉండే లీలాతరంగాలతో పారే దయాసింధువును మాత్రం దాటి పోగలరా? అసంభవం. దయాదేవి యందు మహా విశ్వాసమున్న వారికే నేడో మరోనాడో మోక్ష ఫలానుభవం అవశ్యంగా కలుగుతుంది.

త్వదుపసదనాత్ అద్యశ్వోవా మహాప్రళయేఽపివా, వితరతి నిజం పాదాంభోజం వృషాచలేశ్వరః:- ఈ పూర్వార్థం, ఫలాన్ని పొందడం మాత్రం నిశ్చితమే అని చేతనుల విశ్వాసాన్ని దృఢపరుస్తున్నది.

"అద్యవాఽబ్ద శతాంతేవా మృత్యుర్వై ప్రాణినాం ధృవః"

"జాతస్య హి ధృవో మృత్యుః" జన్మించిన ప్రాణులకు ఈ వేళ గానీ, ఇంక నూరేండ్లకు గానీ చావు తప్పదు. మరణమెట్లు నిశ్చితమో, అట్లే ప్రపన్నులకు భగవత్పాదకమల సేవారూపమైన మోక్ష ఫలాన్ని వితరణం చేయడమూ నిశ్చితమే.

తదిహ కరుణే! తత్తత్క్రీడా తరంగ పరంపరా తరతమతయా జుష్టాయాస్తే దురత్యయతాం విదుః:- 'నేడో, రేపో' అన్న మాటకు కారణాన్ని వివరిస్తున్నది ఈ ఉత్తరార్థం. కాలక్రమభేదం దయాదేవి యొక్క లీలా తరంగాల తరతమ భావం చేత విశదమవుతున్నది. చేతనులు ప్రపత్తిని అనుష్ఠిస్తున్నప్పటి మానసిక స్థితిని బట్టి, దయా ప్రవాహంలో చిన్న అలలు, పెద్ద అలలు ఏర్పడుతుంటాయనడం ఉక్తి చమత్కారం. ఈ సంసార తాపాన్ని భరించలేను స్వామి! త్వరగా కరుణతో మోక్ష ఫలాన్ని ప్రసాదించుమని ఆర్తితో ప్రపత్తి జేస్తే, దయాప్రవాహంలో మహోన్నత తరంగాలు ఉద్భవిస్తాయి. ఆర్త ప్రపన్నునికి శీఘ్రంగా మోక్షం లభిస్తుంది.

'నీ దయకు పాత్రుడనైతే చాలు స్వామి! ఈ లీలా విభూతిలోనే ఉంచినా, లేదా నిత్య విభూతికి గొనిపోయినా నీ ఇష్టమే సుమా!' అని నెమ్మదిగా శరణాగతిని జేస్తే, దయా సింధువులో చిన్న కెరటాలు లేస్తాయి. ఇట్టి దృప్త ప్రపన్నునికి కాలక్రమేణ మోక్షప్రాప్తి కలుగుతుంది. ఈ రెండు విధాలుగా కాకుండా, ఇతర భోగానుభవాలను పొందాలని దయాదేవిని ఆశ్రయించిననూ, ప్రళయ కాలాన మోక్ష పర్యంత ఫలం పొందడమూ నిశ్చితమే.

దురత్యయతాం విదుః:- మోక్షఫలాన్ని కాంక్షించే చేతనుల చేతగానీ, మోక్ష ఫలప్రదాతయైన శ్రీనివాసుని చేతగానీ చిన్నపెద్ద తరంగ పరంపరలతో కూడిన దయను మీరిపోవడానికి సాధ్యం కాదనేది శాస్త్ర విహితమైన విషయమే కదా!

మహాస్రగ్ధర॥

అకళంకంబైన యాత్మీయపదము కరుణా! యా మృగేంద్రాద్రి నిర్వా
హకుడిచ్చున్ నేడు నున్ తే పయిన బ్రళయమందైన నిన్ బొంద రక్షో
త్సుకతా క్రీడా తరంగ స్ఫురిత విభవ సంజుష్టయోనిన్ భవత్రా
తకునైనన్ సంసర చ్చేతనతతి కయినన్ దాటగా వచ్చునొక్కో॥

80. ప్రణిహిత ధియాం త్వత్సంపృక్తే వృషాద్రి శిఖామణౌ
ప్రసృమర సుధాధారాకారా ప్రసీదతి భావనా।
దృఢమితి దయే! దత్తాస్వాదం విముక్తి వలాహకం
ని భృత గరుతో నిధ్యాయంతి స్థిరాశయ చాతకాః॥

అర్థం: హే దయే = ఓ దయాదేవీ! త్వత్, సంపృక్తే = నీతో దృఢ సంబంధమున్న; వృషాద్రి శిఖామణౌ = వృషాచల శిఖరాన మణివలె ప్రకాశించే శ్రీనివాసుని యందు; ప్రణిహిత ధియాం = గాఢంగా ఉంచబడిన బుద్ధిగల వారికి (ఉపాసకులకు); ప్రసృమర సుధాధారా+ఆకారా = పారుతున్న అమృతధారతో సమానమైన; భావనా = ధ్యానం; ప్రసీదతి = స్వచ్ఛగా ఏర్పడుతుంది. దృఢం = నిశ్చయం. ఇతి = ఇట్లు; దత్త + ఆస్వాదం = ఇవ్వబడిన రసం గల; విముక్తి వలాహకం = మోక్షాన్ని కురిసే మేఘమైన శ్రీనివాసుణ్ని; స్థిర + ఆశయ, చాతకాః = చలించని మనస్సు కల్గిన చాతక పక్షుల లాంటి వారు (యోగులు, ప్రపన్నులు);

నిభృత గరుతః (సంతః) ఆడింపని రెక్కలు గల/కర్మజ్ఞానాలను పాటించని/వారై; నిధ్యాయంతి = ధ్యానిస్తుంటారు/ప్రతీక్షిస్తుంటారు.

తా: ఓ దయాదేవీ! నీతో ప్రగాఢ సంబంధం కలిగియున్న వృషగిరి శిఖామణియైన శ్రీనివాసుని యందు మనస్సును ఏకాగ్రంగా ఉంచిన ఉపాసకులకు ఎడతెగకుండా ప్రవహించే అమృతధారను బోలిన ధ్యానం స్ఫుటంగా ఏర్పడుతున్నది. ఇది నిశ్చయమే అని మనోజ్ఞమైన రసాస్వాదన మిచ్చి మోక్షాన్ని వర్షించే శ్రీనివాసుణ్ని, వాన చినుకుల కోసం నిశ్చల చిత్తంతో రెక్కలాడించకుండా ప్రతీక్షించే చాతక పక్షుల వలె, భక్తియోగులు కర్మజ్ఞానాలను పాటించకుండా నిరంతరం ధ్యానిస్తుంటారు. అలాగే, ప్రపన్నులు నిశ్చలాత్ములై ప్రతీక్షిస్తుంటారు.

వ్యాఖ్య: భగవదుపాసనాపరులకూ, న్యాసపరులకూ భగవద్దయయే కారణమని సుశ్లోకితం.

శరణాగతికీ, భగవత్పాద పద్మప్రాప్తికీ మధ్య, కాల విలంబన కారణాలను గత శ్లోకం వివరించింది. భగవత్కృప వల్లనే ప్రపన్నులకు మోక్ష ఫలం లభించే రీతిగా, భగవద్ధ్యాన పరులైన యోగులకూ భక్తి యోగం సిద్ధిస్తుందని ఈ శ్లోకం తెల్పుతున్నది.

త్వత్సంపృక్తే వృషాద్రి శిఖామణౌ:– వేంకటాద్రి శిఖరమందు ఇంద్రనీలమణి లాగా వేంచేసి యున్న వాడు శ్రీనివాసుడు. అందమైన రూపమూ, ప్రకాశించే గుణమూ కలిగి, కొంగున ముడివేసుకోదగిన సౌలభ్యం కలది మణి. మణిని పవిత్ర భావనతో పూజిస్తే కోరికలన్నీ నిరాటంకంగా సిద్ధిస్తాయి. వేంకటాద్రియే సర్వాభీష్ట సిద్ధిని కలిగిస్తుంటే, దాని కొమ్మున మణి లాగా ప్రకాశించే శ్రీనివాసుణ్ని కొలిచే భక్తులకు ఇహపర సుఖాలు కలుగుతాయనడం రెండు వాదాలకు తావు లేని మాట. సకల గుణాలను మంగళప్రదంగా చేసే దయా గుణంతో విడువడి యుండక, ఎల్లప్పుడు సంశ్లేషించి యుండేవాడు శ్రీనివాసుడు.

ప్రణిహితధియాం:– ప్రపన్నులు భగవద్దయను పొందడానికి పాటు పడినట్లే, భక్తులు కూడా విశేషంగా నియమాలను పాటించి, భగవంతుని దయకు పాత్రులవు

తారు. మోక్ష ఫలాన్ని పొందడానికి ఉపాసన విద్య, న్యాస విద్య అని రెండు విధానాలున్నాయి. భక్తియోగాన్నే ఉపాసన, ధ్యానం అంటారు. 'న్యాస'మనే పదానికి త్యాగం, ప్రపత్తి, శరణాగతి అని అర్థం. ప్రపత్తికి 'సాధ్య భక్తి' అనే పేరును కూడా వ్యవహరిస్తారు. ఈ దశకంలో భగవంతుని ఇచ్ఛారూపమైన దయ భక్తచ్ఛందాను వర్తనంగా ఉండే విషయం ప్రసక్తమైనది. ఇంతవరకు ప్రపత్తికి సంబంధించిన విధానాలన్నీ ప్రస్తావించబడినాయి. భక్తి యోగం కూడా దయాధీనమే అని ఈ శ్లోకం నొక్కి చెబుతున్నది. భక్తియోగం అష్టాంగ యోగమని చెప్పబడుతుంది. అనేక నియమాలతో, భగవంతుని యందు చేతనుడు తన మనస్సును ఇతర వస్తువుల పైకి పరుగెత్తకుండా నిగ్రహించి, మోక్ష పురుషార్థ విషయమై, స్థిరంగా నిల్పి యుంచడమే ధ్యానం. దయాన్వితుడైన శ్రీనివాసుణ్ని ఏకాగ్రచిత్తులై ధ్యానించేవారికి

ప్రసృమర సుధాధారాకారా ప్రసీదతి భావనా:- భగవంతుని యందు భక్తి అంటే, ధ్యానం ఎడతెగకుండా సాగుతుంటే యోగం ప్రసన్నమవుతుంది. తమసా నదీ సలిలం "సన్మనుష్య మనోయథా" - సత్పురుషుని మనస్సు లాగా ప్రసన్నంగా - తేటగా ఉంది అన్నాడు వాల్మీకి.

భక్తి యోగమంటే 'తైలధారావదవిచ్ఛిన్న స్మృతి సంతానం" నూనె ధారవలె ఎడతెగని ధ్యాన పరంపర - అని అర్థం. దేశికులు 'తైలధార' అనే చోట రూప గుణాలతో ఇంపైన 'సుధాధార' అనే పదాన్ని ఉపయోగించారు. వాగర్థాల వలె దర్శనీయుడైన, దయా సంపృక్తుడైన శ్రీనివాసుని పట్ల మధురమై, మనోజ్ఞమై అవిచ్ఛిన్నమైన అమృతధారను బోలిన భక్తి ప్రసన్నమవుతున్నది. అంటే ధ్యానం భగవద్దర్శనంతో సమాన మైన దశను పొందుతున్నది.

దృఢమితి దత్తాస్వాదం విముక్తి వలాహకమ్:- భక్తి భావన ఇంత దృఢంగా ఏర్పడుతున్నందు వల్ల ఉత్కృష్టమైన రసాన్ని అనుభవింపజేసే వాడు శ్రీనివాసుడే. కొండ(ల) మీద మెరుస్తూ ముక్తిని వర్షించే మేఘమే 'స్వామి' అన్నారు దేశికులు. 'రసో వైసః' శ్రీనివాసుడు రసస్వరూపుడు. కృపారసాన్వితుడైన శ్రీనివాసుడు తన పాద సేవా రసానుభవానందాన్ని కలిగింపజేస్తాడు.

నిభృతగరుతో నిధ్యాయంతి స్థిరాశయచాతకాః:- కర్మజ్ఞాన సహకృతమైనది భక్తి యోగం. భక్తియోగం ప్రసన్నమవడమంటే ధ్యానం సమాధి యోగ దశను పొందడమని అర్థం. (మయాసహవర్తత ఇతి = సమః. సమే ఆధీయత ఇతి = సమాధిః) దయాన్వితుడైన శ్రీనివాసుని యందు మనస్సు చలించకుండా నిల్చియున్నదని భావం. సమాధి యోగఫలాన్ని అనుభవిస్తున్నప్పుడు కర్మ జ్ఞానాలు సంకుచిస్తాయి. సమాధి ఫలమే విముక్తి వలాహకం. భక్తులు, ప్రపన్నులు చాతక పక్షుల వంటి వారన్నది వేదాంత శాస్త్రం.

రెండు రెక్కలు = కర్మజ్ఞానాలు. ప్రపన్నులు జీవనదశలో ప్రాపంచిక భోగ వైమనస్యం కలవారై, వర్షం కోసం మేఘం వైపు అఱ్ఱుచాచి రెక్కలాడించక నిల్చియుండే చాతక పక్షుల లాగా, నిశ్చలాత్ములై భగవత్పాదకమల సేవలభించే దాకా ఎదిరి చూస్తుంటారు. కాలవిలంబాన్ని సహిస్తూ, రెక్కలాడించకుండా, వాన చినుకుల కోసం మేఘం వైపు మనసు పెట్టి నిల్చియున్న చాతక పక్షుల వలె ఉపాసకులు కర్మజ్ఞానయోగాలను అతిక్రమించిన సమాధి యోగ ఫలాన్ని పొందడానికి నిశ్చలాత్ములై దయాసంపృక్తమై కొండల నాశ్రయించి యున్న మోక్షమేఘాన్ని దృఢంగా ధ్యానిస్తుంటారు. భక్తి ప్రపత్తులు కలవారికి దయాదేవియే బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. తర్వాత ఉన్న దశకంలోని కాలమేఘాన్ని స్మరింపజేసే విముక్తి వలాహకాన్ని ఈ శ్లోకంలో కీర్తించి దశకాన్ని పూర్తిచేశారు దేశికులు.

మహాస్రగ్ధర॥

తలపుల్ నీ దివ్య సాంగత్యమున వరసుధాధారలట్లయ్యు హేంద్రా
చలచూడారత్నమందున్ సతత భజన సంసక్తిమై బొంది పుణ్యా
త్ములు తృప్తిందాల్తురిం దిమ్ముల శుభరసభృన్ముక్తి మేఘంబుకై ని
శ్చల వృత్తిన్ వేచి విశ్వాసము గలిగి దయా! చాతకోదారలీలన్ ॥

అష్టమదశకం సమాప్తం

నవమ దశకం

81. కృపే! విగత వేల యా కృతసమగ్రపోషైస్త్వయా
కలి జ్వలన దుర్గతే జగతి కాలమేఘాయితమ్ ।
వృషక్షితి ధరాదిషు స్థితిపదేషు సానుప్లవైః
వృషాద్రి పతి విగ్రహై ర్వ్యపగతాఖిలావగ్రహైః ॥

అర్థం: హే కృపే = ఓ దయాదేవీ! విగతవేలయా = కాలమే లేని/ ఎల్లయే లేని; త్వయా = నీచేత; కృత సమగ్రపోషైః = చేయబడిన సంపూర్ణ పోషణ కలిగినట్టి/ సమస్త జీవుల పోషణ కలిగినట్టి, వ్యపగత+అఖిల+అవగ్రహైః = వీడిన సమస్త నిగ్రహాలు కలిగినట్టి / పోగొట్టబడిన కఱవు కాటకాలు కలిగినట్టి; వృషక్షితి ధర+ఆదిషు = వేంకటాద్రి మొదలైన; స్థితి పదేషు = భగవన్నివాస స్థలాల యందు; సాను ప్లవైః = అనుచరులతో కూడినట్టి / అనుకూల వాతాదులతో కూడినట్టి; వృషాద్రి పతి విగ్రహైః = శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాల చేత; కలి జ్వలన దుర్గతే = కలి పురుషుడనే అగ్నిచే దుర్దశను పొందినట్టి; జగతి = జగత్తు నందు; కాలమేఘ + ఆయితం = కాలమేఘం వలె ఆచరించబడింది.

తా: ఓ దయాదేవీ! ప్రపంచ సంరక్షణ విషయంలో నీకు అడ్డు లేదు; సర్వదేశ సర్వకాలాల్లోను సర్వ ప్రాణులను పోషించగలవు; వేంకటాద్రి మొదలైన దివ్యక్షేత్రాల యందు అర్చామూర్తులన్నీ నీ వల్లనే వెలసినాయి. గాలి, మెఱుపులతో కూడిన మేఘం వర్షించడం వలన దుర్భిక్షం తొలగిపోయే రీతిగా, అనంతగరుడాది పరివారంతో అర్చామూర్తిగా ఆయా క్షేత్రాల యందువెలసిన భగవద్విగ్రహాలు కలిపురుషుడనే అగ్నిచేత బాధపడుతున్న జీవుల విషయమై నిగ్రహాదులను వీడి రక్షిస్తున్నందు వల్ల, భగవానుడు నీ చేత కాలమేఘంగా ఆచరింపబడినాడు.

వ్యాఖ్య: దయాప్రేరితుడైన శ్రీనివాసుడు, వేంకటాద్రి వంటి దివ్యక్షేత్రాలలో అర్చామూర్తులుగా వెలసి, మహాకాలమేఘంగా నిరూపించబడే శ్లోకం.

"స్థిరాశయ చాతకాః" నిశ్చలాత్ములైన భక్తి ప్రపత్తులు కలవారు చాతక పక్షుల వంటి వారని గత దశకాంత శ్లోకమందు ప్రస్తావింపబడింది. చాతక పక్షుల జీవనం మేఘ వర్షబిందువులపైన ఆధారపడి యున్నది. భక్తులకు, ప్రపన్నులకు విముక్తి వలాహకమైన భగవదర్చామూర్తిసేవ, దానికి అనుబంధించి యున్న విభవావతార మహిమకూడా చాలా ముఖ్యమైనది.

భగవానుడు అవ్యాజసౌహార్దం చేతనే పృథివి యందు అవతరిస్తాడు. ఈ తొమ్మిదవ దశకమందు దయాదేవి యొక్క పరమోపకారం వల్ల భగవానుడు దశావతారాలను దాల్చినట్లు, అర్చామూర్తులుగా ఆయా దివ్యదేశాలలో వెలసి సకల జగత్తుకు సద్గతిని కల్పిస్తున్నట్లు దేశికులు వర్ణిస్తున్నారు.

"స ఉశ్రేయాన్ భవతి జాయమానః" అని శ్రుతి పల్కినట్లు భగవానుని ఆవిర్భావం శ్రేయోరూపమైనది. దయాభరితుడై భగవానుడు పృథివి యందు అవతరించిన విషయానికి తగినట్లు ఈ దశకంలో దేశికులు పృథ్వీ వృత్తమందే శ్లోకాలను రచించారు. ఆ శ్లోకాలలోనూ పృథివికి పర్యాయపదాలను - జగత్, క్షితి, విశ్వంభర, మేదినీత్యాది పదాలను - ప్రయోగించడం గమనించ దగినదే. "కలౌవేంకట నాయకః" అన్నట్లు కలికాలాన కలిగే దుర్దశను దూరం చేసి, జగమందు యోగక్షేమాలను కల్పించే శ్రీనివాసుని వంటి సకల దివ్యదేశాలలో వెలసిన అర్చామూర్తులన్నీ ఒక కాలమేఘంగా మొదటి శ్లోకం వర్ణిస్తున్నది.

1) విగతవేలయా కృతసమగ్రపోషైస్స్వయా:- 'వేలా' అంటె కాలమనీ, అవధి అనీ, గట్టు అనీ నానార్థాలు. భగవద్దయ అవధిలేనిది. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ ప్రాణినైనా రక్షించే సామర్థ్యం కలది. దయాదేవిని ఏ ప్రబల శక్తి కూడా అడ్డుకొన జాలదు. కాబట్టి దయాదేవి ప్రేరణచేతనే భగవానుడు అవతారాలనెత్తినాడు.

కాలమేఘం:- "ఆషియుళ్ పుక్కుముగందుకొడార్తేఱి" (తిరుప్పావై) సముద్రంలోని జలాన్ని బాగా త్రాగడం వల్ల మేఘం నీలవర్ణంగా మారుతుంది. జలభారంతో పైకి బాగా పోలేక, కొండల నాశ్రయిస్తుంది. నీలమేఘం నీటి చేత పోషింపబడుతుంది.

అర్చారూపం:- భగవదర్చా విగ్రహాలు దయాదేవిచే పోషింపబడుతున్నవి. దివ్యమంగళ రూపాలు దయా పూర్ణమై తేజరిల్లుతున్నవి.

"విధృతలోకయా" అని పాఠాంతరం (విగతవేలయా' అనే పదానికి మారుగా) ఉంది. ధరింపబడిన సర్వలోకాలు కలది దయాదేవి అని అర్థం. లోకాలు దయచేతనే ధరింపబడుతున్నాయి.

"యదిహ్యహం న వర్తేయం జాతుకర్మణ్య తంద్రితః ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః ॥ (23)
ఉత్సీదేయు రిమేలోకా నకుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్యచ కర్తాస్యాం ఉపహన్యామిమాః ప్రజాః ॥" (భ.గీత. 3-24)

ఓ పార్థా! ఎప్పుడైనా నేను సావధానుడనై కర్మల యందు ప్రవర్తింపక పోతే లోకానికి గొప్ప హాని సంభవిస్తుంది. ఎందుకు? అంటే, మానవులందరు సర్వ విధాలా నన్నే అనుసరిస్తారు. నేను కర్మల నాచరించకుంటే లోకాలన్నీ నశిస్తాయి. లోకాల్లో సాంకర్యమేర్పడుతుంది. ప్రజానష్టం వాటిల్లడానికి నేనే కారకుడనవు తానన్నాడు భగవానుడు.

అవాప్తసమస్త కాముడైనా, లోకం నశిస్తుందనే భయం వల్ల భగవానుడు లోకాలను ధరించడం కేవలం దయచేతనే కదా! ధరించడమే కాదు; సమగ్ర పోషణం కూడా దయచేతనే జరుగుతున్నది.

2) వ్యపగతాఖిలావగ్రహైః :- సకల దుర్భిక్షలను తొలగించేవి. మేఘాలు జలభారాన్ని మోయజాలక పర్వతాల యందు దిగి భూమి మీద వర్షిస్తాయి. 'అవగ్రహం' అంటే కఱవు, కాటకం. అనావృష్టి - వాన పడకుంటే కఱవేర్పడుతుంది కదా! కాలమేఘం వర్షించి, నదులను గట్లు పొరలి ప్రవహించునట్లు చేసి, నేలయందు సస్యాభివృద్ధి చేసి సర్వజంతువులను పోషిస్తుంది. సర్వోపద్రవాలను లేకుండా చేసేది కృష్ణమేఘం.

ఆర్చారూపం:- తనను ఆశ్రయించిన వారి పాపాలను భగవానుడు చూడడు. చూచినా "దోషోయద్యపి తస్య స్యాత్" అన్నట్లు, దోషమతని యందు ఉంటే ఉండుగాక అని నిగ్రహాన్నైనా చూపడు. కోపించడమే ఉండదంటే, ఇక దండనను విధిస్తాడా? భగవద్విగ్రహాలు త్రికరణ శుద్ధిగా తమను ఆరాధించి, సేవించినంత మాత్రాన దురితాలనన్నిటినీ దూరం చేసి సంరక్షిస్తాయి.

3) వృషక్షితి ధరాదిషు స్థితిపదేషు సానుప్లవైః :- కొండల మీద ఉండే నీలమేఘం మెరుపులతోనూ, ఉరుములతోనూ, చల్లని గాలితోనూ కూడి ఉంటుంది.

అర్చారూపం:- అవతారమంటే దిగుట. పరమపదమందు నివసించే వారికి ఆనందమేకాని ఆపదలుండవు కదా! దయాపూర్ణుడైన వైకుంఠునికి దయను ప్రసరింప జేసే అవకాశమే ఉండదు కదా! కాబట్టి భగవానుడు కారుణ్య భారాన్ని భరించలేక దిగివచ్చి ధర్మ భూధరాలయందు నివసిస్తాడు. నాయకుడు ఒక్కడే రాడు కదా! అనుచరులందరు ఆయన వెంట వస్తారు. దేవేరులతోనూ, అనంత, గరుడ, విష్వక్ సేనాది పరివారంతోనూ వైకుంఠం నుంచి దిగివచ్చి మహీధ్రాల మీద మక్కువతో నుంటాడు భగవానుడు.

వృషాద్రిపతి విగ్రహైః కలిజ్వలన దుర్గతే జగతి కాలమేఘాయితమ్:- దయనీయులు లోకులు. కలికాల ప్రభావం వల్ల వివిధ పాప తాపాలకు గురియై మంట తగిలితే మాడిపోయినట్లు, అనేక బాధలు పడుతారు.

"గురుతరకరుణాభార ఖిన్నాశ యాస్తే" (హరిపాదాది కేశాంతస్తోత్రం) శ్రీ శంకర భగవత్పాదుల సూక్తి ప్రకారంగా, మేఘం వలె భగవానుడు కరుణాభార భరితుడై తన స్థానం నుంచి దిగి గిరి శిఖరం మీదికి వచ్చి హితమనే అమృతాన్ని వర్షిస్తాడు. కలికాలపు చిచ్చు నార్పడం వేంకట గిరిశిఖరమందున్న కాలమేఘానికే శక్యమవుతుంది. "శ్రీ వేంకటాద్రి శిఖరాలయ కాలమేఘమ్" అన్నట్లు ఈ కాలమేఘం ఆనందనిలయంలో వేంచేసియున్న దివ్యమంగళ విగ్రహమే ప్రధానమైనదని అర్థం. స్వయం వ్యక్తమైనది. విగతయైన అవగ్రహం కలది = విగ్రహమని ఉక్తి వైచిత్రి. కాలమేఘ మయినందువల్ల అమృతవర్షం కురిపించి దుర్భిక్షను తొలగించి రక్షిస్తుంది. దివ్యమైన మూర్తి కాబట్టి పాపాత్ముల పాపాలను జూచి నిగ్రహించి దండించక వారికి తన పాదసన్నిధిని జేర్చుకొంటుంది.

వృషగిరి శిఖరాన వెలసిన శ్రీనివాస దివ్యమంగళ విగ్రహాల లాంటి భగవదర్చామూర్తులు - ఆలయాలు - అహోబలం, వేదాద్రి, మంగళగిరి, హస్తిగిరి, యాదవాద్రి, సింహాద్రి, బదరీత్యాది దివ్యక్షేత్రాలు భరత ఖండమందు చాలా ప్రఖ్యాతి చెంది ఉన్నాయి. వీటి ద్వారా కాలమేఘ కృత్యం దయాదేవిచే ఆచరింపబడింది.

ఈ దివ్య దేశాలను సేవించి మంగళాశాసనం చేసి, 'సమస్త పరివారాయ సర్వ దివ్యమంగళ విగ్రహాయ శ్రీమతే నారాయణాయ నమః' అని ఆళ్వార్లూ, ఆచార్యులూ దండవత్ప్రణామాల నాచరించి, మనకు విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అవలంబింపజేశారు. శ్లేషాలంకృత శ్లోకమిది.

మందాక్రాంత॥

ప్రావృణ్మేఘ ప్రచుర రుచితో పన్రమేశాను కంపా
దేవున్ దివ్యస్థిత పదములన్ దెచ్చి సానుప్లవుండై
నీవే నెమ్మిన్ నిలిపి జగముల్ నిహ్నుతావగ్రహంబై
కావన్ గాదే కలిదహనుచే గ్రాగి చేటొందకుండన్ ॥

82. ప్రసూయ వివిధం జగత్తదభివృద్ధయే త్వందయే ।
సమీక్షణ విచింతన ప్రభృతిభిః స్వయం తాదృశైః ।
విచిత్ర గుణచిత్రితాం వివిధ దోషవై దేశికీం
వృషాచల పతే స్తనుం విశసి మత్స్య కూర్మాదికామ్ ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వం = నీవు; వివిధం = నానావిధమైన; జగత్ = జగత్తును; ప్రసూయ = ప్రసవించి; తాదృశైః = అట్టివే అయిన; సమీక్షణ విచింతన ప్రభృతిభిః = చూడడం, ధ్యానించడం మొదలైన ప్రక్రియల చేత; తత్+అభివృద్ధయే = ఆ జగత్తుయొక్క అభివృద్ధి కోసం; విచిత్ర గుణచిత్రితాం = అద్భుతమైన గుణాలచే చిత్రమైనట్టి; వివిధ దోష వైదేశికీం = అనేక దోషాలకు దూరమైనట్టి; వృషాచల పతేః = వేంకటాద్రికి ప్రభువైన శ్రీనివాసుని యొక్క, మత్స్య, కూర్మ+ఆదికాం = చేప, తాబేలు మొదలైన; తనుం = శరీరాన్ని; విశసి = ప్రవేశిస్తున్నావు.

తా: ఓ దయాదేవీ! నీవు అనేక విధాలుగా ఉండే జగత్తును సృష్టించి, అటువంటివే యైన కన్నులతో చూడడం, మనస్సుతో తలవడం మొదలైన వ్యాపారాలచే జగత్తు యొక్క అభివృద్ధి కోసం నానా విధ గుణాలచే చిత్రమైన, ఎట్టి దోషాలకూ ఆస్పదం కానట్టి, శ్రీనివాసుని యొక్క మత్స్య కూర్మాది శరీరంలో ప్రవేశిస్తున్నావు.

వ్యాఖ్య:- దయాదేవి, జగత్సృష్టి తర్వాత భగవానుని మత్స్య కూర్మాద్యవతారంలో అను ప్రవేశం చేస్తుందని సుశ్లోకితం.

దయాదేవి ప్రేరణవల్ల క్షామాన్ని బాపే కాలమేఘం రీతిగా, కలితాపాన్ని దీర్చి జీవులకు క్షేమం కలిగించడానికి శ్రీనివాసుని వంటి అర్చామూర్తులు - దివ్య క్షేత్రాలు - వెలసియున్నాయని పూర్వశ్లోకం వివరించింది.

"అజాయ మానో బహుధా విజాయతే" - పుట్టుకయే లేనివాడు అనేక విధాలుగా పుడుతున్నాడని శ్రుతి పల్కుతున్నది. భగవానుడు లోకోద్ధరణార్థం అనేకావతారాలను కల్పించుకొంటాడని భావం. అసంఖ్యాకావతారాలలో (10) దశావతారాలు సంప్రదాయబద్ధమయినాయి. దేశికులు ప్రత్యేకంగా 'దశావతార స్తోత్ర' రచన చేశారు.

సలిల విహారులిద్దఱును, సంతత కాననచారు లిద్దఱున్
వెలయగ విప్రులిద్దఱును, వీరపరాక్రమశాలురిద్దఱున్
పొలతుల దాయువాడొకడు, భూమిజరించెడి వాడునొక్కడున్
జెలువుగ మీకభీష్ట ఫలసిద్ధి ఘటింతురనంత కాలమున్ ॥

ఒక కవిచేత, దశావతార సంకేతంగా ఆశీర్వదింపబడిన పద్యమిది.

నవమదశకంలో ఈ శ్లోకం మొదల్కొని దశకాంతం వరకు మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, కృష్ణ, కల్కి అనే దశావతారాలు వర్ణింపబడినాయి. ఈ (82) శ్లోకంలో మత్స్య, కూర్మ అవతారాలను - రెండింటినీ - దేశికులు సంగ్రహించి వర్ణించారు. తర్వాత ఎనిమిది శ్లోకాలతో ఒక్కొక్క విభవావతారానికి ఒక్కొక్క శ్లోకాన్ని రచించి, దశకాన్ని ముగించారు.

ప్రసూయ వివిధంజగత్, తదభివృద్ధయే త్వందయే:- దయాదేవి వివిధమైన జగత్తును కన్నది. సత్యలోకం మొదల్కొని (14) చతుర్దశ భువనాలు కలది జగత్తు. అది దేవతిర్యఙ్మనుష్య స్థావరాత్మకమైనది. పాంచభౌతికమైన ప్రపంచాన్ని ప్రసవించిన భగవద్దయ జగన్మాత కాబట్టి ఆ జగత్తును పెంచి పోషించాలను కోవడం స్వాభావికమే కదా!

సమిక్షణ విచింతన ప్రభృతిభిః స్వయంతాదృశైః :- జగత్సృష్టికి ముందు భగవానుడు 'తదైక్షత' అన్నట్లు ఈక్షించడం, సంకల్పించడమయింది. దయాదేవి జగత్తును ప్రసవించింది. ఆ జగత్తు యొక్క అభివృద్ధికి హేతువులైన వి(తాదృశైః) ఆ సమిక్షణ చింతనాది దివ్యమైన వ్యాపారాలేకదా! తల్లి తన సంతానాన్ని కన్నులతో చూడడం, మనస్సున తలచుకోవడం, చేతులతో స్పృశించడం, హృదయానికి హత్తుకోవడం మొదలైన ప్రక్రియలతో స్వయంగా పోషిస్తుంది. సృష్టి కార్యమంతా భగవద్దయా కార్యమే అని సంస్తవ్యం. దయాళువై; విశ్వ పరిపాలనా జాగరూకుడైన శ్రీనివాసుని ఈక్షణ చింతనాదులను స్తుతించే సందర్భంలో చేప, తాబేలు తమ సంతానాన్ని రక్షించుకొనే పద్ధతిని దేశికులు సూచించారు.

ఈ క్షణ ధ్యాన సంస్పర్శైః మత్స్యాకూర్మ విహంగమాః ।

పుష్ణంతి స్వాన్య పత్యాని తథాఽహమపి పద్మజే ॥ (పు)

అన్నట్లు, చేపనీళ్ళల్లో ప్రసవిస్తూ - ఈనుకొంటూ పోతుంది. ఈనిన తర్వాత వెనుదిరిగి చూస్తుంది. చూచినంతలోనే తాను కన్న చేపపిల్లలన్నీ, తన చూపుతోనే - చురుకుగా నీళ్ళల్లో ఈదులాడుతుంటాయి. చేప పిల్లల పోషణ శక్తి తల్లియైన చేపయొక్క చూపులోనే ఉంది. చేప జలచరమేకదా!

అలాగే, ఉభయచరమైన - నేలమీదనూ, నీళ్ళల్లోనూ చరించే - తాబేలు పిల్లలను కన్న వెంటనే వాటిని తన మనస్సులో తలచుకొంటున్న క్షణంలోనే అవి వర్ధిల్లి భద్రంగా సంచరిస్తుంటాయి.

ఇక హంసలు మొదలైన పక్షులు గ్రుడ్లను పెట్టి, వాటిపైన తమ రెక్కలను కప్పి - పొదిగి, స్పృశించడం చేత గ్రుడ్లలో నుంచి పక్షి పిల్లలు బయల్దేరి వృద్ధిని పొందుతాయి.

ఆ రీతిగా భగవానుడు తన దయచేత సృజింపబడిన జగత్తును సమీక్షణ ధ్యాన స్పర్శ క్రియల చేత వృద్ధిని పొందజేయడానికి మత్స్య కూర్మ హంసావతారాలను ధరించాడు.

భగవానుడు హంసావతార మెత్తిననూ, దశావతారాలలో హంసావతారం ప్రస్తావింపబడలేదు. అందువల్ల సమీక్షణ విచింతనలను స్పష్టంగా తెల్పి, ప్రభృతి

శబ్దం చేత స్పర్శక్రియను పేర్కొనక సూచించడమయింది. దీని కనుగుణంగానే 'మత్స్య కూర్మాదికాం' అని మత్స్య కూర్మాలను పేర్కొని, 'ఆది' శబ్దం చేత హంసావతారం సూచన మాత్రంగానే ఇమిడి ఉన్నది.

విచిత్ర గుణచిత్రితాం, వివిధ దోషవైదేశికీం:- మత్స్యకూర్మాది దివ్య శరీరాలెట్టివో ఈ రెండు పదాలు విశదపరుస్తున్నాయి. అవతరించిన భగవానుని శరీరమందు కూడా భగవానునికి స్వాభావికమైన ఉభయ లింగత్వమున్నది. మత్స్యకూర్మాద్యవతారాలను ధరించినను, భగవానుడు తన స్వభావాలను విడువ కుండా ప్రవర్తించినవాడని స్పష్టమవుతున్నది. ప్రకృతిలో ఉన్న చేపల శరీరం, తాబేళ్ళ శరీరం లాంటివి కావు భగవదవతార శరీరాలు. ప్రకృతిలోకి దిగివచ్చినను, భగవచ్ఛరీరం దివ్యమైనది, శుద్ధసత్త్వమయమైనది. సత్త్వరజస్తమస్సులనే త్రిగుణాత్మకమైన - ప్రాకృతమైన - శరీరం కాదు అని తెల్పుతున్న పదం.

విచిత్రగుణ చిత్రితాం:- అంటే ప్రాకృత మత్స్య కూర్మాదులకు దుర్లభాలైన జ్ఞానశక్త్యాది అద్భుత గుణాల చేతనూ, సౌందర్య సౌగంధ్య సౌకుమార్యాది శరీరగుణాల చేతనూ ముద్రింపబడినది. భగవానుని మత్స్య కూర్మాదుల శరీరం.

వివిధ దోషవైదేశికీం:- దుర్గంధం మొదలైన దోషాలు లేనిది అని అర్థం. ఈ రెండు పదాలు వేదాంత శాస్త్ర విహితమైన ఉభయ లింగత్వాన్ని - రెండు లక్షణాలు కలిగినదాన్ని చెబుతున్నాయి. దివ్యాత్మ స్వరూపం (1) కల్యాణ గుణ మూర్తి కలది. (2) హేయగుణ రహితమైనది.

ఈ రెండు పదాలు అంటే మూడవ పాదం 'తనుం' పదానికి విశేషణ పదాలుగా ప్రయోగింపబడినాయి.

వృషాచలపతేస్తనుం విశసి మత్స్యకూర్మాదికామ్:- దయాదేవి శ్రీనివాసుణ్ణి మత్స్య కూర్మాద్యవతారాలను ధరించేరీతిగా చేసింది. వెంటనే ఆ మత్స్యాది శరీరాలలో తాను ప్రవేశించింది.

"తత్సృష్ట్వా, తదనుప్రవిశ్య" అని ఉపనిషద్వాక్యాలు భగవానుడు జగత్తును సృష్టించి, సృజింపబడిన జగమందు తాను అను ప్రవేశం చేశాడని తెల్పుతున్నాయి. ఇక్కడ దయాదేవి జగత్తును సృష్టించి, దాన్ని వర్ధిల్లజేయడానికి శ్రీనివాస భగవానుణ్ణి

మత్స్య కూర్మాద్యవతార శరీరాలను ధరించునట్లు చేసి వెంటనే తాను కూడా ఆ మత్స్యాది శరీరాల యందు ప్రవేశించినట్లు తెల్పబడింది. మత్స్యావతారమెత్తిన శ్రీనివాసుని శరీరంలో కన్నులందు దయాదేవి ప్రవేశించింది. కూర్మావతార మందు శ్రీనివాసుని మనస్సులో ప్రవేశించింది దయాదేవి.

వేదాలను ముచ్చిలించి సముద్రంలో దాచిన సోమకాసురుణ్ని శ్రీనివాసుడు మత్స్యావతారుడై సముద్రంలో వెదకుతున్నప్పుడు దయాదేవి మత్స్య నయనాల్లో ప్రవేశించింది, తత్ఫలితంగా, ఆ పుండరీకాక్షుడు సమ్యఙ్నిరీక్షణ చేస్తుంటే, ఆ కన్నులు సముద్రంలో పలుచోట్ల కమల వనంగా ఏర్పడినవన్నారు దశావతార స్తోత్రంలో సోమకుణ్ని సంహరించి, అఖిల ధర్మాలకు మూలమైన వేదరాశిని ఉద్ధరించడం వల్ల జగమందు యోగక్షేమాలు కలుగడానికి కారణభూతయైనది దయాదేవి.

క్షీరసముద్రంలో మందర పర్వతాన్ని వేసి దేవదానవులు చిల్కుతున్నప్పుడు పర్వతం సముద్రపుటడుగున పడకుండా శ్రీనివాసుడు కూర్మంగా అవతరించి పర్వతాన్ని ధరిస్తే వీపు ఒరసుకొని పోతుండగా దయాదేవి శ్రీనివాసుని మనస్సులో ప్రవేశించింది. ఆ కారణంగా, మహాకూర్మం తన అంగాలను లోనికి ముడుచుకొని స్థిరంగా ధ్యానమగ్నమైనందువల్ల అమృతోత్పత్తికీ, లక్ష్మీ ప్రాదుర్భావానికీ హేతువైనది దయాదేవి.

ఈ విధంగా వేదోద్ధరణం, లక్ష్మీ ప్రాప్తిని కలిగించే మీన కూర్మావతారాలలో సమీక్షణ విచింతనల ద్వారా జగత్తును అభివృద్ధి పరచిన పరమోపకారురాలు దయాదేవి.

జ్ఞానలక్ష్మి యొక్క వరలక్ష్మి యొక్క అనుగ్రహాన్ని పొందుతున్న జీవులు ప్రేయ శ్శ్రేయస్సులను నేడు కూడ అనుభవిస్తున్నారు.

మందాక్రాంత॥

చిత్రస్ఫూర్తిన్ జెలగ జగముల్ సృష్టిగావించి, వానిన్
మైత్రిన్ వీక్షా ప్రముఖ విధులన్ మన్పగాంక్షించి దేవీ!
చిత్రాకారాంచిత శుభగుణాశ్లిష్ట మత్స్యాది శుంభ
ద్గాత్రంబుల్ వేంకటగిరి పతిన్ గైకొనం జేసితీవే॥

83. యుగాంత సమయోచితం భజతి యోగనిద్రారసం
వృషక్షితి భృదీశ్వరే విహరణక్రమాజ్జాగ్రతి।
ఉదీర్ణ చతురర్ణవీ కదన వేదినీం మేదినీం
సముద్ధృతవతీ దయే! త్వదభిజుష్టయా దంష్ట్రయా ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వం = నీవు; యుగాంత సమయ+ఉచితం = ప్రళయకాలానికి తగిన; యోగ నిద్రారసం = యోగనిద్రా సుఖాన్ని; భజతి = పొందుతున్న; వృషక్షితి భృత్+ ఈశ్వరే = వేంకటాచలాధిపతియైన శ్రీనివాసుడు; విహరణ క్రమాత్ = లీలా క్రమం వల్ల; జాగ్రతి (సతి) = మేల్కొంటుండగా; ఉదీర్ణ చతుః + అర్ణవీ, కదన వేదినీం = పొంగి పొరలే నాలుగు సముద్రాల చేత, ఏర్పడిన పీడను తెలియచేస్తున్న, మేదినీం = భూమిని; త్వత్+అభిజుష్టయా = నీతో కూడిన; దంష్ట్ర యా = (వరాహమూర్తి యొక్క) కోఱ చేత; సముద్ధృతవతీ (సం+ఉత్+హృతవతీ) = బాగా పైకి లేవనెత్త జేసినావు.

తా: ఓ దయాదేవీ! ప్రళయకాలాన భగవానుడు యోగనిద్రను పొందుతాడు. ప్రళయాంతమందు తన సంకల్పం చేతనే మేల్కొంటాడు. ప్రళయార్ణవంలో మునిగి తన బాధను తెల్పుతున్న భూదేవిని నీవు శ్రీనివాసుణ్ని వరాహావతారమెత్తించి, ఆయన కోఱలో ప్రవేశించి ఉద్ధరింపజేసినావు

వ్యాఖ్య: వరాహావతారమందు దయాదేవి ఉపకారం వర్ణితం.

మత్స్యకూర్మావతారాల యందు దయాదేవి యొక్క ఉపకారాన్ని గత శ్లోకం వర్ణించింది. ఈ శ్లోకంలో సపత్నియైన భూదేవిని దయాదేవి ఉద్ధరించిన విధానం తెల్పబడుతున్నది.

యుగాంతసమయోచితం భజతియోగనిద్రారసం:- మనుష్యుల కాలమానం వేరు. దేవతల కాలమానం వేరు. వీరికంటె చాలా భేదంగా ఉండేది చతుర్ముఖ బ్రహ్మ యొక్క కాలమానం. బ్రహ్మ యొక్క చతుర్యుగ సహస్ర కాలమానం ఆయనకు ఒక్క దినంగా పరిగణింపబడుతుంది. ఆ దినాంతమందు అంటే రాత్రి పూట శ్రీనివాస భగవానుడు పవళిస్తాడు. అది ప్రళయకాలం, కాబట్టి, ఏకార్ణవం

ఏర్పడినందువల్ల, భగవానుడు ఆదిశేషుడనే పర్యంకమందు యోగరూపమైన నిద్రా రసాన్ని అనుభవిస్తుంటాడు. నిర్వ్యాపారస్థితిలో శయనిస్తాడన్న మాట. ప్రాణుల యోగార్థమే నిద్రపోతాడు.

ఇది యోగ నిద్ర. యోగమంటే "అలబ్ధస్యలాభః" పొందబడని వస్తువును పొందడం. అంటే మళ్ళీ జగత్తును సృజించి, జీవులకు సద్గతిని కలిగించి, క్షేమంగా ఉంచే ఆలోచన చేయడమే యోగం. ఈ యోగరసాన్ని ప్రళయకాలం పూర్తి అయ్యే దాకా భగవానుడు అనుభవిస్తాడు.

వృషక్షితిభృదీశ్వరే విహరణక్రమాత్ జాగ్రతి:– భూమిని ధరించే పర్వతాలకు అధిపతి సర్వేశ్వరుడు. కాబట్టి వేంకటాచలాధీశుడైన శ్రీనివాసునిచే భరించదగినది భూమి అని వ్యంజితం. చతుర్ముఖ బ్రహ్మ యొక్క రాత్రి పూర్తికాగానే – ముగిసినప్పుడు – యోగనిద్ర నుంచి తన సంకల్పం చేతనే భగవానుడు మేలుకొంటాడు.

ప్రళయ సమయాన నిద్రా రసమనుభవించినట్లే భగవంతుడు ప్రళయాంత మందు మేల్కోవడమూ జరుగుతుంది. ఇలా నిద్రా జాగరణలు భగవంతునికి విహరణ క్రమం – క్రీడా పద్ధతి – లీలాక్రమమని భావం.

ఉదీర్ణ చతురర్ణవీ కదన వేదినీం మేదినీమ్:– శాస్త్రంలో సప్త సముద్రాలు చెప్ప బడినాయి. ఇక్కడ నాలుగు సముద్రాలనే పేర్కొనడం వల్ల, ప్రళయకాలంలో నలు దెసల నుంచి పొంగి పొరలివచ్చిన నాలుగు సముద్రాలు భూమిని ఆవరించి, అట్టడుగుకు త్రోసి, ముంచి వేశాయి. భగవానుడు యోగనిద్రా రసాన్ని అనుభవిస్తున్నప్పుడు దయాదేవి తన సవతికి కలిగిన ఆపదను గమనించింది. 'ఆశ్రితులను ఆపద నుంచి రక్షించాలి' అనే భావంతో జాగరూకుడైన శ్రీనివాసుణ్ని వరాహమూర్తిగా పరిణమింప జేసింది.

భూదేవి తనకు కలిగిన హింసను తెలియజేయదలచిన క్షణంలోనే దయాదేవి గుండె చెరువయింది. వెంటనే –

సముద్ధ ృతవతీ దయే! త్వదభిజుష్టయా దంష్ట్రయా:- దయాదేవి వరాహం యొక్క దంష్ట్ర - కోర - యందు ప్రవేశించింది. వరాహావతారానికి సంబంధించిన శ్లోకమిది. కాని దీనిలో 'వరాహ' పదమే లేదు. కేవలం 'దంష్ట్ర' అనే పదం చేతనే గమనింపవలసి యున్నది.

"ఉద్ధ ృతాసివరాహేణ కృష్ణేన శతబాహునా" అని శ్రుతి వరాహం చేత, ముఖ్యంగా అఖండమైన భూమి పదునైన కోఱచేత క్రుచ్చి, ఉద్ధరింపబడినదని పల్కుతున్నది. దయాభిజుష్టమైన దంష్ట్రచే ధరణిని భగవానుడు ఉద్ధరించాడన్నది స్పష్టమవుతున్నది. దయయే శ్రీనివాసునికి కిటిరూపాన్ని ధరింపజేసి, దాని కోఱయందు తాను ప్రవేశించి, భూమిని మహార్ణవం నుంచి ఉద్ధరింపజేసింది. "నివారయామాస మహావరాహః కల్పక్షయో ద్వృత్తమివార్ణవాంభః" - (రఘువంశం)

"వరైమేల్ మరతగమేపోల తిరైమేల్ కిడన్దానై క్కీణ్డానై కేష్లాయ్ ప్పూమియిడన్దానైయేత్తి యెషుమ్" పర్వతం మీద మరకతమణి పొదిగిన విధంగా పాల కడలిపైన పవళించిన వాడు భూమిని అండభిత్తి నుంచి తీసి, ఎత్తిన స్వామిని గుణానుసంధానం చేసి నా మనస్సు ఉజ్జీవిస్తుందని పొయ్గైయాళ్వార్లు స్తుతించారు.

మందాక్రాంత॥

కల్పాంతంబున్ గని జలధిపై గాంచితా యోగనిద్రన్
కల్పాదిన్ వేంకట విభుడు మేల్కాంచుచో నీవ దేవీ!
తెల్పన్ గాలాబ్ధి మునిగిన పృథ్విన్ ఘనుండుద్ధరించెన్
పొల్పొందంగా బొడమి కుహనా పోత్రియై యొక్క కోఱన్॥

84. సటాపటలభీషణే సరభసాట్ట హాసోద్భటే
స్ఫుర త్క్రుధి పరిస్ఫుటత్భ్రుకుటికే౭ పి వక్త్రేకృతే।
దయే! వృషగిరీశితుర్దనుజడింభదత్త స్తనా
సరోజసదృశా దృశా సముదితా కృతిర్దృశ్యసే॥

అర్థం: హే వృషగిరీశితుః, దయే = శ్రీ వేంకటాచలపతి యొక్క దయాదేవీ! సటా పటల భీషణే = మెడమీది వెంట్రుకల సమూహం చేత భయంకరమైన;

సరభస+అట్టహాస+ఉద్భటే = వేగంతో కూడిన ధ్వనిగల నవ్వుచే ఉద్ధతమైన; పరిస్ఫుటత్ భ్రుకుటికే = బాగా కనబడుతున్న కనుబొమల వక్రతను కలిగిన; వక్త్రే = (నృసింహుని) ముఖమండలం; స్ఫురత్ క్రుధి = తీక్ష్ణ కోపం కలిగినదిగా; కృతే, అపి = చేయబడి యున్నను; సరోజసదృశా = పద్మంతో సమానమైన; దృశా = కంటి చూపుచేత; దనుజడింభ, దత్తస్తనా = అసురబాలుడైన ప్రహ్లాదునికి ఇయ్యబడిన చనుబాలుగల నీవు; సముదిత + ఆకృతిః = ఆవిర్భవించిన స్వరూపం కలదానివై; దృశ్యసే = కనబడుతున్నావు.

తా: శ్రీనివాసుని దయాదేవీ! కేసరాల సమూహం చేత భయంకరమైన సంభ్రమంతో కూడిన అట్టహాసం చేత ఉద్ధతమైన, ప్రకాశిస్తున్న కనుబొమల ముడిని గల నృసింహ స్వామి యొక్క ముఖమండలం తీవ్ర కోపం కలదిగా ప్రకటింప బడినప్పటికీ, తామరపూవుతో సమానమైన కనుచూపుతో, హిరణ్యకశిపుని శిశువైన ప్రహ్లాదునికి చనుపాలనిచ్చి లాలించే స్వరూపం చేత ఆవిర్భవించిన దానివిగా కనబడుతున్నావు.

వ్యాఖ్య: నృసింహావతారమందు దయాదేవి యొక్క అఘటిత ఘటనాచతురిమ సుశ్లోకితం.

శ్రీనివాస భగవానుడు క్రోడ రూపంలో ఉంటే ఆ పదునైన కోఱయందు దయాదేవి ప్రవేశించి, సముద్రమందు మునిగి యున్న తన సవతియైన భూదేవిని సముద్ధరించినదని ఇతః పూర్వం సుశ్లోకితం. ఈ శ్లోకం, నృసింహావతారంలో నరరూప మిశ్రితమైన ఉగ్రసింహ ముఖం ఉన్ననూ, దయా ప్రభావం చేత కమల సుమసదృశమైన కటాక్షంచే పూర్ణమైయున్నదని విశదపరుస్తున్నది.

హిరణ్యకశిపుడు కోరుకొన్న వరాలలో నరకేసరి రూపం లేదు. ఈ శ్లోకం లోనూ 'నృసింహ' శబ్దమూ వ్యక్తం కాలేదు. కవితార్కిక కేసరికి ప్రియమైనది నరకేసరి రూపం. "ఆకంఠమాది పురుషం కంఠీరవముపరి" (కామాసికాష్టకం). మెడ క్రింది భాగమంతా మనుష్యరూపమే. మెడ నుంచి మీది భాగమంతా సింహ ముఖం కాబట్టి మిశ్రరూపమిది. శ్లోకమందు ఈ సింహభాగమే పేర్కొనబడింది. 'హింస' పదం వ్యత్యస్తమై 'సింహ' పదమైనదని రూఢి. మృగరాజైన సింహ వదనం దుర్నిరీక్ష్యమైనది.

అతి భయంకరమైనది.

(1) సటాపటల భీషణే:- 'సటా' అంటే సింహం యొక్క మెడమీద ఉండే వెంట్రుకలు. కేసరాలంటారు. 'జూలు' అని వ్యవహరిస్తారు. ఆ కేసరాలు ఒత్తుగా ఉన్నాయి. సటా పటలం నిటారుగా నిక్కి ఉన్నది. "సటాచ్ఛటా భిన్నఘటా" అని మాఘకవిసూక్తి. సింహ కంఠంపై నున్న సటాపటలమే భయాన్ని కొల్పుతుంది.

(2) సరభసాట్టహా సోద్భటే:- ఆవిర్భవించడంతోనే ప్రచండమైన కోపవేగం చేతనూ, గర్జిస్తూ కరాళ దంష్ట్రలు వెలుగుతూ, జగమంతా గజగజ వణకునట్లు పెద్ద అట్టహాసం చేతనూ, సింహముఖ మండలం అతిభీషణంగా ఉన్నది. వీటికి మఱొక భీషిక తోడున్నది.

(3) స్ఫురత్క్రుధి పరిస్ఫుటత్ భ్రుకుటికే వక్త్రే:- రెప్పలు వాల్చక, నిప్పులు చెరుగుతున్న కన్నులతో క్రూరంగా చూస్తూ, వంకరటింకరగా కనుబొమలను ముడిచే ఆ కంఠీరవ ముఖ మండలం, మూర్తీభవించిన కోపంతో బండబాఱిన గుండెలను రెండుగా చీల్చేటట్లు మిక్కిలి భయంకరంగా నున్నది.

కృతేఽ పి వృషగిరీశితుః సరోజసదృశాదృశా

దనుజడింభదత్తస్తనా సముదితాకృతిర్దృశ్యసే:-

హిరణ్యకశిపుని వధ కోసం ముఖమందు తీక్ష్ణమైన కోపం ప్రకటితమైనప్పటికీ రవి కిరణ వికసిత కమల సదృశమైన వృషగిరిపతి కంటి చేత ప్రహ్లాదుని విషయమై వాత్సల్యాతిశయం ప్రకటింప బడుతున్నది.

భగవానుని కోపం "కృతే అపి" అనడం వల్ల కృత్రిమమైనది. క్రోధం స్వాభావికమైనది కాదు, తాత్కాలిక మైనది. "క్రోధమాహారయత్ తీవ్రమ్" ఖరాసురునితో యుద్ధం చేసినప్పుడు శ్రీరాముడు తనకు లేని తీవ్రమైన క్రోధాన్ని తెచ్చి పెట్టుకొన్నాడని వాల్మీకి సూక్తి.

నృసింహావతారం చాలా స్వల్పకాలమే ఉండింది. దేవుడు లేడని వాదిస్తూ కొడుకును పలు బాధలు పెడుతున్ననూ 'చక్రి ఎందెందు వెదకి చూచిన అందందే కలడు' అని, 'భగవానుడు సర్వాంతర్యామి' అన్న ప్రహ్లాదుని మాటను ఋజువు

చేయడానికి అవతరించిన మూర్తి నృసింహ మూర్తి. భగవద్ద్వేషియైన హిరణ్యకశిపునికి ఉగ్రసింహ ముఖం భయంకరంగా కనబడుతున్న సమయాననే ప్రహ్లాదుని విషయమై ఆ సింహముఖ మందలి పద్మారుణ శోభ కలిగిన కంటి చూపునందే శీతలమైన దయ ప్రభవించి ప్రవహించింది. ఏకకాలమందే క్రోధరసం, కరుణరసం దృక్కులో ప్రసరించడం అఘటిత ఘటనాసామర్థ్యమే కదా! ఒక కంటితో కోపం, మరొక కంటితో దయ చూపబడింది. "శీత్తత్తోదరుళ్‌పెత్తు" – క్రోధంతో పాటు కృపను నృసింహ స్వామి చూపినాడని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి.

"ప్రహ్లాదహిరణ్య కశిపు రంజన భంజన నిమిత్తాంతరంగ బహిరంగ కరుణా రస రౌద్రావేశ పరిపూర్ణుడు' నృసింహుడని ఆంధ్ర మహాభాగవతంలో పోతన వాగ్విలాసంగమనీయం. కరుణా కటాక్షావలోకనమనే స్తన్యమిచ్చి శిశువును తృప్తి పరచునట్లే, దనుజడింభకుడైన ప్రహ్లాదునికి ఆనందాన్ని కలుగజేసిన దయాదేవి యొక్క సంపూర్ణ స్వరూపం నృసింహమూర్తి యొక్క నేత్రమందు ప్రకాశించింది.

భక్తాగ్రగణ్యుడైన ప్రహ్లాదుణ్ని భద్రంగా కాపాడినవాడు నృసింహమూర్తి. నృసింహోపాసన మంత్రంలోనే 'భద్ర' పదం ఇమిడి యున్నది. "భద్రాం నృసింహ కుహనామ్" (వరద రాజస్తవం)

ఈ శ్లోకంలోని పూర్వార్ధం నరకేసరి క్రోధాన్ని వర్ణించినా అది ఆగంతుకమనీ, ఉత్తరార్ధం దయయే భగవానునికి స్వాభావికమని వివరిస్తున్నది. ఉత్తరార్ధం కామాసి కాష్టకంలోని శ్లోకాన్ని స్మరింపజేస్తున్నది.

"కృపా కపటకేసరిన్! దనుజడింభదత్తస్తనా ।
సరోజసదృశాదృశా వ్యతిభిషజ్యతే వ్యజ్యతే ॥" (కా. అష్టకం)

మందాక్రాంత॥

క్రోధస్ఫూర్తిన్ భ్రుకుటియు సటా రూక్ష దంష్ట్రాదులొప్పన్
నాథుండు గ్రాస నుడయిహిరణ్య ప్రహారార్థియైనన్ ।
సాధున్ బాలున్ సదమల సుధా సారసంవాద వీక్షా
మాధుర్య శ్రీ మనిచి తను కంపాతతిన్ దోచి నీవే ॥

85\. ప్రసక్త మధునా విధిప్రణిహితైస్సపర్యోదకైః
సమస్త దురితచ్ఛిదా నిగమగంధినాత్వందయే !
అశేష మవిశేషతస్త్రి జగదంజనాద్రీశితుః
చరాచర మచీకరశ్చరణ పంకజేనాంకితమ్ ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వం = నీవు; విధిప్రణిహితైః = చతుర్ముఖ బ్రహ్మచే సమర్పించబడిన; సపర్యా + ఉదకైః = పూజకొరకైన జలం చేత; ప్రసక్త మధునా = స్రవించే తేనె కలిగినట్టి; సమస్త దురితచ్ఛిదా = సకల పాతకాలను ఛేదించునట్టి; నిగమ గంధినా = వేద పరిమళం కలిగినట్టి; అంజనాద్రి+ఈశితుః = అంజనా చలపతి యైన శ్రీనివాసుని యొక్క; చరణపంకజేన = పాద కమలం చేత; చర+అచరం = జంగమస్థావర రూపమైన; త్రిజగత్ = త్రిలోకాలను; అశేషం = సంపూర్ణంగా; అవిశేషతః = తారతమ్యం లేకుండా; అంకితం = ముద్రింపబడినవిగా; అచీకరః = చేసినావు.

తా: ఓ దయాదేవీ! వామనుడు త్రివిక్రముడైనప్పుడు ఒక పాదం చేత భూమిని కొల్చాడు. మరొక పాదంతో ఊర్ధ్వలోకాలను కొలిచాడు. పైకి చాచబడిన పాదాన్ని సత్యలోకాధిపతియైన నలువ ధర్మజలంతో కడుగుతుండగా, మకరంద ధారలు గలిగిన, సర్వ పాపాలను నశింపజేయునట్టి, శ్రుతి పరిమళం గల అంజనాచలపతి యైన శ్రీనివాస పరబ్రహ్మ యొక్క పాద పద్మం చేత చరాచరాత్మకమైన జగత్త్రయాన్ని నీవు ఉచ్చనీచ విభాగం లేకుండా పూర్తిగా ముద్రింపజేసినావు.

వ్యాఖ్య:- త్రివిక్రమావతారమందు దయాదేవి శ్రీనివాస పరబ్రహ్మ పాదారవిందం చేత జగత్త్రయాన్ని ముద్రింపజేసి సర్వం వైష్ణవమని ప్రకటించిందని సుశ్లోకితం.

భాగవతాగ్రగణ్యుడైన ప్రహ్లాదుని పట్ల తండ్రి చేసిన అసహ్యాపచారాన్ని సహించ లేక అవతరించిన ఉగ్రనరసింహ మూర్తి యొక్క నేత్రాంచలమందు ప్రవేశించిన దయాదేవి దుష్కృద్వినాశనాన్ని ఆనుషంగికంగానూ, సాధుపరిత్రాణమే ముఖ్య కార్యం గానూ తన స్వరూపాన్ని కనబరచిందని తెల్పబడింది.

"కొణ్ణానైయల్లాల్ కొడుత్తారైయార్ పషిప్పార్?" పొయ్గై యాళ్వారన్నట్లు, తన సొత్తును తాను స్వంతం చేసుకొన్న భగవానుణ్ని వంచకుడని నిందించే వారే తప్ప, తనదికాని భూమిని తనదిగా భావించి దానమిచ్చిన దురహంకారియైన మహాబలిని ఎవరు నిందిస్తారు? 'మహాదాత' అనే పొగడుతారు. గుణవంతుణ్ని నిందించి, గుణహీనుణ్ని కీర్తించే స్వభావం కలిగిన లోకానికి యథార్థం తెల్యజేయడానికే కావచ్చు, దయాదేవి త్రివిక్రముని పాదారవిందమందు ప్రవేశించి, జగత్త్రయాన్ని భగవత్పాద పద్మంచే ముద్రింపజేసిందని ఈ శ్లోకం తెల్పుతున్నది.

విధిప్రణిహితైఃసపర్యోదకైః :- మహేంద్రాది దేవతలను హింసించిన మహా బలియొక్క అహంకారాన్ని అణచి వేయడానికి శ్రీనివాసుడు వామనావతారాన్ని ధరించాడు. అందమైన గుజ్జు రూపంగల బ్రహ్మచారియైన వామనుడు మహాబలిని మూడడుగుల భూమిని తనకిమ్మని యాచించాడు. దనుజ గురువైన శుక్రాచార్యులు వద్దని చెప్పినా, బలిచక్రవర్తి భూమిని జలధారా పూర్వకంగా దానం చేశాడు. వామనుడు ఉదకం చేతిలో పడుతుండగానే బ్రహ్మాండమంత పెరిగినాడు. ఒక పాదంతో మొత్తం భూమిని కొలిచాడు. రెండవ పాదమెత్తి పై లోకాలను కొలిచాడు. మూడవ అడుగు కోసం మహాబలిని స్థలం ఏది? అని అడిగినాడు.

ఈ సందర్భంలో రెండవపాదం సత్యలోకంలోకి చేరగానే చతుర్ముఖుడు సాదరంగా ధర్మతీర్థాలచే విధిగా భగవత్పాద పద్మాన్ని అభిషేకించాడు. పాదాలను కడిగే ఉదకాన్ని 'పాద్యం' అంటారు. 'సపర్య' అంటే పూజ. పాదపూజ కోసం ఉపయోగించే ఉదకం, సపర్యోదకం అనబడింది. విధి అంటె బ్రహ్మ, శాస్త్రమందు చెప్పబడిన పద్ధతి, అదృష్టం, అని నానార్థాలున్నాయి. శాస్త్రవిధిగా బ్రహ్మకడిగిన పాదం అది.

(1) ప్రసక్తమధునా:- ఆ పాదం పద్మం వంటిదే కాబట్టి, పూదేనె - మకరందం ధారలుగా స్రవిస్తుంది. "విష్ణోః పదే పరమే మధ్వఉత్సః" అని శ్రుతి పల్కుతుంది. బ్రహ్మకడిగిన పాద్య తీర్థాలలో ఈ మధుధారలు కలిసినాయి. గంగానది ఉద్గమించింది. కాబట్టి 'విష్ణుపాదోద్భవి' అని గంగ ప్రసిద్ధిగాంచింది.

(2) సమస్త దురితచ్ఛిదా:- పాతకాలు తీగల లాగా చుట్టుకొనడం వల్ల ప్రాణులు సుఖంగా గమ్యాన్ని చేరలేరు. భగవత్పాద పంకజాన్ని ఆశ్రయించిన వారి సకల పాతకాలు - గమ్యం చేరనీయని ప్రతిబంధకాలు ఛేదింపబడుతాయి. మేరు మందర తుల్యమైన పాపరాశులను ధ్వంసం చేసే శక్తి కలది త్రివిక్రముని పాదం.

(3) నిగమగంధినా:- వేదాల పరిమళం కలది. భగవత్పాద పంకజం; "వేలాతీత శ్రుతి పరిమళం" (భగవద్ధ్యానసోపానం) "ఆమోదితోஉపి నిగమైర్విభురం ఘ్రియుగ్మే" (గోదాస్తుతి) వేదాల ఆమోదాన్ని - సుగంధాన్ని - పొందిన పాద పద్మమని అర్థం. "సర్వే వేదాః యత్పదమామనంతి" సర్వ వేదాలు భగవత్పాదాన్ని ప్రశంసిస్తుంటాయి.

త్రిజగదంజనాద్రీశితుశ్చరణ పంకజే నాంకితమ్:- ఈ శ్లోకంలో 'వృషాద్రి' పదాన్ని కాక, అంజనాద్రి పదాన్ని దేశికులు ప్రయోగించడంలో ఔచిత్యమున్నది. 'చరణం' పంకజం - పద్మంలాగా మృదువుగానూ, ఎఱ్ఱని వర్ణంతోనూ, మనోజ్ఞంగా భాసిస్తున్నది. 'అంజనాద్రి' కాటుక కొండయే కదా! ముజ్జగాలను త్రివిక్రముని పాదపంకజంతో దయాదేవి ముద్రించడానికి (సీల్ చేయడానికి) తగినంత కాటుక (బ్లాక్ పేస్ట్) గా 'అంజనాద్రి' సరిపోతుంది.

భగవత్పాదాన్ని ముద్రగా దయాదేవి ఉపయోగించుకొన్నది. (సీల్) ముద్రలో కొన్ని గుర్తులు ఉండాలి కదా!

'శంఖ, రథాంగ, కల్పక, ధ్వజారవిందాంకుశ, వజ్రలాంఛనమ్" (స్తోత్ర రత్నం) భగవత్పాదతల మందు ఏడు గుర్తులు - సప్త లాంఛనాలున్నాయి. దయాదేవి అట్టి భగవత్పాదాన్ని మూడు జగాలపై ముద్ర వేయడం వల్ల అవి శ్రీనివాస పరబ్రహ్మ సొత్తని, చరాచర పదార్థాల మీదనూ ముద్రించడం వల్లనూ, అవి భగవంతుని ఆస్తిగా తెలియపరచింది.

అశేషమవిశేషతస్త్రి జగదంకితమచీకరః:- వీరు పుణ్యాత్ములనీ, వారు పాపాత్ములనీ ఏ విధమైన వ్యత్యాసం లేకుండా, అందరికీ - అన్ని వస్తువులకు ఒకటై నను విడిచి పెట్టకుండా, భగవత్పాద సంబంధాన్ని దయాదేవి ఏర్పరచింది.

అంతేకాదు జగత్త్రయానికి వేదపరిమళాన్ని విరజిమ్మింది. ముద్ర వేస్తే నొప్పి కలుగ కుండా పాదం పంకజంలా మృదువుగా, కమనీయంగా ఉండడం వల్లనూ, సువాసన కలదైనందుననూ, హృద్యంగా వైష్ణవ ముద్ర వేసి, ఎవరి ముద్ర ఉంటే అది వారి సొత్తని తెలియజేసింది దయాదేవి.

"అనాలోచిత విశేష, అశేషలోక శరణ్య" - అనే భగవద్రామానుజుల వారి గద్యలో వర్ణింపబడిన భావం ఈ శ్లోకంలో 'అశేష మవిశేషతః" అనే పదంలో గుంభితమయింది. "ఇదం విష్ణుర్విచక్రమే త్రేధానిదధేపదమ్" అని శ్రుతి పల్కినట్లు వామనావతార ఫలితం త్రివిక్రమావతారమందే పర్యవసించింది.

దయే! త్వమంకి తమచీకరః:- భగవత్కృప చేత ముజ్జగాలకు విష్ణుచరణ పంకజ ముద్ర వేయబడింది. నిరవధిక సౌహార్దం ప్రకటితమే. కాబట్టి, త్రివిక్రమావ తారం దయాదేవి కిరీటంలో కలికితురాయి కదా!

మందాక్రాంత॥

సర్వస్రష్టా చరిత పదపూజాజలోద్ధూతపాపున్
ఖర్వుండా వేంకట విభుజగత్క్రాంతు వీక్షించి దేవున్
సర్వంబున్ దచ్చరణకమల స్పర్శచే భావితంబై
పర్వన్ కాన్పింపవె దయ ! భవత్పాలనం బేర్పడంగన్॥

86. పరశ్వథ తపోధన ప్రథన సత్క్రతూ పాకృత -
క్షితీశ్వర పశుక్షరత్ క్షతజ కుంకుమస్థాసకైః।
వృషాచల దయాళునా నను విహర్తు మాలిప్యథాః
నిధాయ హృదయే దయే! నిహత రక్షితానాం హితమ్ ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! వృషాచల దయాళునా = వృషాద్రి యందున్న దయాళువైన శ్రీనివాసుని చేత; నిహత రక్షితానాం = చంపబడి రక్షింప బడినవారి యొక్క; హితం = మేలును; హృదయే = మనస్సునందు; నిధాయ = భావించి; విహర్తుం = విహరించడానికి; పరశ్వథతపోధన - స్థాసకైః। పరశ్వథ = గండ్రగొడ్డలి ఆయుధంగా గల; తపోధన = మునియైన పరశురాముని యొక్క;

ప్రధన = యుద్ధమనే; సత్క్రతు = ఉత్తమ యాగమందు; ఉపాకృత = బలిజేయ బడిన; క్షితి+ఈశ్వర = భూపతులనే; పశు = యాగ పశువుల నుంచి; క్షరత్ = స్రవించే; క్షతజ = రక్తమనే; కుంకుమ, స్థాసకైః = ద్రవ్యాల చేత; ఆలిప్యథాః, నను = పూయ బడినట్లున్నావు.

తా: ఓ దయాదేవీ! వేంకటాద్రియందున్న శ్రీనివాసుడనే దయాళువు చేత చంపబడి రక్షణ రూపం గలవారి యొక్క హితాన్ని మనస్సున ఆలోచించి విహరించడం కోసం, పరశురాముడు చేసిన క్షత్రియ వినాశన మనే ఉత్తమ యాగంలో దుష్టులైన రాజుల-మరణ దండనం చేత శుద్ధి చేయబడిన బలిపశువుల సంహార సమయాన కారిన రక్తమనే కుంకుమ ద్రవ్యాలచే లేపనం చేయించుకొన్నావు కాదా!

వ్యాఖ్య:- దుష్ట రాజుల సంహారమనే యాగం ద్వారా లోక కల్యాణ మొనరించిన పరశురామావతారం దయాకృత్యమే యని సుశ్లోకితం.

పూర్వశ్లోకంలో దయాదేవి చేత ముజ్జగాలకు త్రివిక్రమ చరణ పంకజాంకనం చెప్పబడింది. శ్రీనివాస భగవానుని చేత దయాదేవికి కుంకుమాంకనం ఈ శ్లోకంలో చెప్పబడుతున్నది. శ్రీనివాసుని దశావతారాలలో పరశురామావతారం ఆవేశావతారమని విజ్ఞుల మాట. భగవానుడు తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి ఒక వ్యక్తి యొక్క ఆత్మయందు ప్రవేశించడమే ఆవేశావతారం. మహర్షియైన జమదగ్ని వల్ల రేణుకాదేవి గర్భసంజాతుడైన పరశురాముడు బ్రాహ్మణుడు.

గాధిమహారాజు కూతురు సత్య ఋచీక మహర్షికి ధర్మపత్ని. సత్య మరియు ఆమె తల్లి ఇద్దఱు తమకు పురుష సంతానం కావాలని ఋచీక మహర్షిని ప్రార్థించారు. ఆ మహర్షి రెండు కలశాలలో తీర్థాన్ని వేర్వేరుగా అభిమంత్రించాడు. మీరు శుచిర్భూతలై వచ్చి, గుర్తు పెట్టి ఉంచిన ఎవరి కలశతీర్థాన్ని వారు స్వీకరించండని చెప్పి, ధ్యాన మగ్నుడయ్యాడు. ఆ తల్లి బిడ్డలు చెప్పిన రీతిగానే వచ్చినారు కాని ఆతురతతో కలశాలను గుర్తించక, ఒకరి కలశతీర్థాన్ని మరొకరు పుచ్చుకొన్నారు. సమాధి యోగం నుంచి తేరుకొన్న మహర్షి తన పత్నిని జూచి

నీకు క్షత్రియ లక్షణాలు గల పుత్రుడు జన్మిస్తాడు. నీ తల్లికి విప్ర లక్షణాలు గల కుమారుడు జన్మిస్తాడని నొక్కి చెప్పాడు. సత్య తన పతిపాదాల మీద పడి స్వామి! ఆ క్షత్రియ లక్షణాలు నా పుత్రునికి పట్టకుండా కృపజేయండి అని ప్రార్థించింది. ఆ మహర్షి సరే! నీ పుత్రునికి పట్టవు కాని నీ పుత్రుని పుత్రునికైనా (పౌత్రునికైనా) ఆ లక్షణాలు కలుగక మానవని చెప్పినాడు. నిర్లిప్తంగా ఉండే తపోధనుల మాట తప్పదు కదా! "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోనుధావతి" అన్నాడు కదాభవభూతి.

సత్యకు జమదగ్ని పుట్టినాడు. సత్యతల్లికి విశ్వామిత్రుడు (గాథేయుడు) జన్మించాడు) జమదగ్ని మహర్షి పుత్రుడు జామదగ్న్యుడు (పరశురాముడు) మాత్రం క్షత్రియ లక్షణ లక్షితుడైన విప్రుడని ఆయన జన్మచరిత్ర. పరశురాముని యందలి భగవదావేశం తర్వాత అవతరించిన శ్రీరామునితో పరశురాముడు ఎదుర్కొనప్పుడు సమాప్తమయింది. హనుమంతుడు, అశ్వత్థామ మొదలైన చిరంజీవులలో ఒకడుగా పరశురాముడు నేటికీ జీవించి యున్నట్లు పురాణ కథ.

పరశ్వథ తపోధన ప్రథన సత్రకృతూపాకృతక్షితీశ్వర పశుక్షరత్ క్షతజకుంకుమ స్థాసకః:- గొడ్డలి కలిగియున్న తపస్వి పరశురాముడు. గొడ్డలి పట్టక ముందే ఆయన గొప్ప తపస్సంపన్నుడు. భుజబలమూ, బుద్ధి బలమూ కల మహానుభావుడు ఆయన.

హైహయరాజ వంశ్యుడైన కార్తవీర్యార్జునుడు రావణాసురుణ్ని జయించిన పరాక్రమవంతుడు. ఈ క్షత్రియ రాజు జమదగ్నిని చంపివేశాడు. క్షత్రియరాజులను, ఒక్కడు కూడా మిగులకుండా నఱికి వేస్తానని ప్రతిజ్ఞ చేసి, తాను పట్టిన గండ్ర గొడ్డలి చేత కార్తవీర్యార్జునుణ్ని వేయి బాహువులను నఱికి వేసి, చిత్రవధ చేశాడు.

భగవచ్ఛక్తి లేని వ్యక్తి ఏ కార్యాన్నీ సాధించలేడు కదా!

పరశురాముడు ఇరవై యొక్క (21) సార్లు (త్రిస్సప్తకృత్వః క్షితిం) నేలపైన తిరిగి 21 సార్లు క్షత్రియ భూపతులను వధించాడు.

యజ్ఞం కోసం చెట్లనూ, చెట్లకొమ్మలను నఱికే సాధనమైన గొడ్డలితోనే క్షత్రియులైన వసుధేశులను వధించాడు పరశురాముడు. "రామప్రవ్రాజనం

హ్యేతచ్ఛుభో దర్కం భవిష్యతి" – శ్రీరాముణ్ని వనవాసం కోసం పంపడం వల్లనే లోకానికి క్షేమం కలుగగలదు – అని భరద్వాజముని కైకేయిని దూషించే భరతునితో పల్కిన మాట ఇది. క్రూరమైన, ఘోరమైన కర్మకు కూడా హితత్వం సంభవించడం వాస్తవమే. క్షత్రియులను పరశువుచే వధించగా వారి శరీరాల నుంచి కారిన రక్త పుటేరులతో తండ్రికి తర్పణం చేసిన పరశురాముని శత్రు హనన కార్యం హితమైన హవనకార్యమే అవడం దయాదేవి మూలకమే. భగవానుడు చేసే జగత్సంహార రూపమైన ప్రళయమే దయా కృత్యమైనప్పుడు, ఆయన చేసే ధరణీశుల సంహారం దయాకృత్యం కాకపోవునా? కాబట్టి క్షత్రప్రళయం దయా మూలత్వమే అని సాధింపబడింది.

సర్వం యాగతుల్యంగా నిరూపించబడింది. పదాలను పోహళించిన రీతిని బట్టి ఇది సత్రమనే తెలుస్తుంది.

"పరశ్వథ తపోధన" పదాలు "ప్రథన సత్క్రతువు' లను క్రమంగా తెల్పుతున్నాయి. పరశ్వథశబ్దం ప్రథనానికి – గొడ్డలి రణం కోసం; తపోధన శబ్దం సత్క్రతువుకు – ముని యజ్ఞం కోసం; అనే క్రమం సూచింపబడింది. పశువును యూపదారువుకు కట్టి వేసి సంస్కరించే క్రియ 'ఉపాకృతం'

ఉపాకృత క్షితీశ్వర పశు:– రణయజ్ఞమందు బలిచేయబడిన రాజులే యాగపశువులు. లోక కల్యాణం కోసం యజ్ఞమందు వధింపబడిన పశువులకు స్వర్గమే లభిస్తుంది. లోక కంటకులైన రాజులు మరణదండనచే పరిశుద్ధులై సద్గతిని పొందుతారు.

"రాజభిర్ధృత దండాస్తు కృత్వాపాపానిమానవాః ।
విమలాః స్వర్గమాయాంతి సంతః సుకృతినోయథా ॥"

సత్పురుషులు సత్కర్మలనాచరించి స్వర్గానికి పోతారు. అట్లే, పాపాత్ములైన మానవులు రాజుల చేత మరణమనే శిక్షను పొందినవారై పాప విముక్తులై – పరిశుద్ధాత్ములై – స్వర్గలోకానికి పోతారు; అన్న మనుస్మృతి వాక్యాన్ని శ్రీరాముడు కిష్కింధాకాండలో ఉదాహరించాడు.

"చత్వారో వయ మృత్విజః స భగవాన్ కర్మోపదేష్టా హరిః
సంగ్రామాధ్వర దీక్షితో నరపతిః పత్నీగృహీతవ్రతా ।
కౌరవ్యాః పశవః ప్రియాపరిభవక్లేశో పశాన్తిః ఫలం
రాజన్యో పనిమంత్రణాయ రసతి స్ఫీతం యశోదుందుభిః ॥"

శ్రీకృష్ణుడు యజ్ఞ కర్మ విధానాన్ని బోధించేవాడు. నలుగురమైన మేము ఋత్విక్కులం. పత్నీ సహితుడైన ధర్మరాజు రణయజ్ఞ దీక్షితుడు.

ద్రౌపది యొక్క అవమానమనే దుఃఖం శమించడమే ఫలంగా గల ఈ సంగ్రామ యజ్ఞమందు సంహరింప బడడానికి అర్హులైన కౌరవులే యాగపశువులు. అని వేణీ సంహార కావ్యమందు భీముడు ప్రకటించాడు.

యాగ పశువులు వధింపబడినప్పటికీ, ఆ వధ వధ కాదు; వాటికి రక్షణ రూపమైన హితంగానే పరిగణింపబడుతుంది.

దయే! నిహత రక్షితానాం హితం హృదయే నిధాయ:- పరశురామునిచే దుష్ట క్షత్రియ సంహారమనే సత్రక్రతువులో రాజులు యాగపశువులుగా వధింపబడినారు. వధింపబడిన రాజులు ఊర్ధ్వలోక సౌఖ్యాన్నే పొందినారు. కాబట్టి, దుష్ట సంహారం దుష్టులను రక్షించ డానికి చేసిన హితమైన ప్రక్రియయే కదా!

దయాదేవి ఇట్టి హితమనే అభిప్రాయాన్ని మనస్సులోనే గూఢంగా ఉంచుకొని, పరశురాముని ద్వారా రణయజ్ఞమాచరింప జేసింది. శ్రీనివాసుడే పరశురాముడుగా అవతరించాడు. వాస్తవంగా, దయాదేవి హృదయంలో క్రౌర్యానికి స్థానమే లేదు. ఆ క్రూరకృత్యం చేసిన వ్యక్తినే నిర్దయుడు అని లోకం గర్హిస్తుంది. కాబట్టి, సంహారక్రియను కూడా రక్షణమనే హితంగా కోరి చేయించడం దయా స్వభావమని దేశికుల ఆశయం.

వృషాచలదయాళునా:- దయాదేవికి పరశురాముని కృత్యంతో సంబంధం కలదనడానికి దేశికులు ఇష్టపడరు. వృషగిరి పతియే క్షత్రియ సంహార కృత్యానికి బాధ్యుడన్నారు. గిరిజనులే గొడ్డలి చేత నఱకడానికి దక్షులు. గొడ్డలిని కూడా ఆయుధంగా ధరించేవారు గిరిజనులు. కాబట్టి, గిరిరాజైన శ్రీనివాసుడే పరశువు

కలిగియున్నవాడుగా అవతరించినాడనడం గమనీయం. ఈ శతకంలో దయాదేవియే శ్రీనివాసుడు చేసే కృత్యాలకు ఉపకరించిన శ్లోకాలే ఉన్నాయి. ఇక్కడ మాత్రం భిన్నంగా ఉంది.

వృషాచల దయాళునా నను విహర్తు మాలిప్యథాః:- యాగ పశువులుగా వధింప బడిన రాజుల రక్తాన్ని దయాదేవికి అంగరాగంగా దయాళువైన శ్రీనివాసుడే పూశాడు. శ్రీనివాసుడు దయాదేవికి విలాసంగా చేసిన కృత్యాన్ని సుశ్లోకిస్తున్నది. ప్రియుడు ప్రేయసికి విలాసంగా పరిమళ ద్రవ్యాలతో అనులేపనం చేయడం శృంగార ప్రక్రియ.

కుంకుమస్థాసకైః :- కుంకుమ పువ్వు రక్త వర్ణంతో శోభించే పరిమళ ద్రవ్యం. శ్రీనివాస భగవానుడు క్షత్రియులనే యాగ పశువుల రక్తాన్ని సువాసన గల కుంకుమ ద్రవంగా దయాదేవికి పూసి విహరించడం అత్యంత హితంగా పర్యవసిస్తున్నది కదా!

ఓ దయాదేవీ! దుష్ట క్షత్రియుల రక్తం కుంకుమ పూతలుగా నీవు శ్రీనివాసునితో విహరించడానికే పూయించుకొన్నావని భావిస్తున్నాను అన్నారు దేశికులు.

రూపకాను ప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకార సజ్జితం.

మందాక్రాంత॥

రోషాత్ముండై ద్రుతగతి నృపద్రోహులన్ క్షత్రవంశ
ద్వేషుండమ్మె దెగ నటక తద్దేహరక్తోరుధారల్
దోషోన్ముక్తిన్ ద్రుటితులు గనన్ దోచె సంలేపనంబై
శేషాద్రీశున్ జెలువుగ దయా! చేరి క్రీడించు నీకున్ ॥

87. కృపే! కృతజగద్ధితే! కృపణజన్తు చిన్తామణే!
రమా సహచరం తదా రఘుధురీణయంత్యా త్వయా।
వ్యభజ్యత సరిత్పతిః సకృదవేక్షణాత్తత్‌క్షణాత్
ప్రకృష్ట బహుపాతక ప్రశమ హేతునా సేతునా॥

అర్థం:- కృతజగత్+హితే = ఆచరించిన లోకోపకారం కలదానా! కృపణ జన్తు చింతామణే = దీనజనులకు కోరిన ఫలాలను ఇచ్చుదానా! కృపే = ఓ దయాదేవీ! రమాసహచరం = లక్ష్మీతో కూడి చరించే శ్రీనివాసుణ్ని; తదా = అప్పుడు (క్షితౌ = భూమియందు); రఘుధురీణ యంత్యా = రఘుశ్రేష్ఠునిగా (అవతరింప) జేసే; త్వయా = నీచేత; సకృత్ = ఒక్కసారి; అవేక్షణాత్ = చూడడం వల్ల; తత్క్షణాత్ = ఆలస్యం లేకుండా; ప్రకృష్ట బహుపాతక ప్రశమ హేతునా = ప్రబలమైన అనేక విధాలైన పాపాలను పోగొట్టడానికి మూలమైన; సేతునా = సేతువు చేత; సరిత్, పతిః = నదులకు భర్తయైన సముద్రుడు; వి+అభజ్యత = రెండుగా జేయబడినాడు.

తా: లోకోపకారమాచరించునట్టి, గతిలేని ప్రాణుల కోరికలను దీర్చునట్టి ఓ దయాదేవీ! లక్ష్మీ సహచరుడైన శ్రీనివాసుణ్ని నీవు రఘువంశ నిర్వాహకుడైన శ్రీరామునిగా అవతరింపజేశావు. ఒక్కసారి చూచినంత మాత్రాన వివిధమైన ఘోర పాతకాలను హరించే సేతువు చేత సముద్రం రెండుగా విభజింప బడింది.

వ్యాఖ్య:- రామావతార లోకోపకృతి దయాకృత్యమని స్తుతి.

పరశురామావతారం భగవానుని ఆవేశా వతారమై నందు వల్ల, పూర్ణావ తారపురుషుడైన శ్రీరాముడు పరశురాముని యందున్న భగవదావేశాన్ని భద్రంగా గ్రహించి, ఆతపోధనుణ్ని చిరంజీవునిగా స్థిరపరచాడు.

శ్రీరాముడు గురుశుశ్రూష చేసి, విశ్వామిత్రుని యాగ సంరక్షణ జేసి, గుర్వనుగ్రహం చేత సీతమ్మను పరిణయమాడిన తర్వాతనే అప్రమేయ తేజస్వియైనాడు. "అక్షయ్యం మధుహన్తారం" అని వైష్ణవ ధనుస్సును అందించిన పరశుతపోధనునిచే ప్రప్రథమంగా ప్రశంసితుడయ్యాడు.

(1) కృతజగద్ధితే- ప్రపంచానికి పలు రకాలుగా మేలు కలిగించేది దయాదేవి. 'కృప' అనే నిఘంటువులో 'కీడు' అనే పదమే లేదు. ఎల్లప్పుడు లోకహితాన్నే ఆచరించింది, ఆచరిస్తుండడమే ఆమె స్వభావం.

(2) కృపణజన్తుచింతామణే:- చింతామణి కల్పవృక్షం లాగా కోరిన వరాలను ఇస్తుంది. దయాదేవి చింతామణియే అని తెలిసిన వ్యక్తులు వేరే దిక్కూ చక్కీలేని

అకించనులు. ఆకించన్యం గల ప్రాణులు ఒక్కమారు ప్రపత్తి చేస్తే దయా దేవి వారి కోరికలను సిద్ధింపజేస్తుందని తెలిపే పదమిది. ఈ రెండు విశేషణ పదాలు 'కృపే' అన్న సంబోధన పదాన్ని వర్ణిస్తున్నాయి. 'పరహిత ప్రావణ్యమూ, ప్రపన్న జనసంరక్షణ దీక్షా' కలది 'కృపాదేవి'

రమాసహచరం తదా రఘుధురీణ యంత్యాత్వయా:- లక్ష్మీదేవితో కూడి చరించే వాడు శ్రీనివాసుడే కదా! దయాదేవి శ్రీనివాసుణ్ని తన స్వభావం గల, రఘువంశ నిర్వాహకుడైన శ్రీరామునిగా అవతరింపజేసింది. ఏ ప్రబల శక్తి కూడా అడ్డుకోలేని రావణాసురుని ఉపద్రవాలచే లోకం పీడింప బడుతున్న సమయాన రామావతారమని (తదా = అప్పుడు) తెల్పబడింది. ('తదా' అనే చోట 'క్షితౌ' (భూమియందు) అని పాఠాంతరమున్నది. అవతరించడమంటే భూమియందే కాబట్టి, 'క్షితౌ' అనే పదం కంటే, అవతరించే సమయాన్ని తెలిపే 'తదా' అనే పదమే యుక్తమైనది) రమా సహచరుడు శ్రీనివాసుడు. సీతా సహచరుడు శ్రీరాముడు. భగవంతుని కంటె లక్ష్మీ దేవికి దయ అధికం. రామాయణాన్ని 'సీతా యాశ్చరితం మహత్' సీతా చరిత్ర గొప్పది అని వాల్మీకి పేర్కొన్నాడు. సీతాదేవి అధికమైన దయ కలది కాబట్టి.

"అగ్రతస్తే గమిష్యామి" - నీకు ముందే నేను నడువ గలనుఅన్నది (దుష్టులను సంస్కరించడానికి లోకమాత సీతమ్మయే మొదట లంకకు పోగలనని సూచించింది) శ్రీరాముడు సీతమ్మ మార్గాన్నే అనుసరించాడు కదా! అంతేకాదు; 'సర్వభూతేషు కో హితః - సకల ప్రాణుల విషయమై హిత మాచరించే వాడెవడు? అని వాల్మీకి నారదమునిని అడిగినాడు కదా! "రామో రామో రామ ఇతి" ప్రజలందరు రాముణ్ని కీర్తించారు. శరణాగతుడైన విభీషణుడు మహాత్ముడైన రాఘవునికి నా గురించి తెల్పండి' అని భాగవతోత్తముల పురుషకారాన్ని కోరినప్పుడు, రాఘవ శబ్దమే ప్రయుక్తమైనది. ఆశ్రయించిన వారిని రక్షించడం కన్నా తనను ద్వేషించే వారిని కూడా రక్షించి "లఘుతరా రామస్య గోష్ఠీకృతా" - రాముని కన్న సీతాదేవి మిక్కిలి దయకలది, అని పేరు పొందింది. ప్రపన్న జనసంరక్షణార్థమైన ధర్మ మాచరించే భగవానునికి లక్ష్మీదేవి తోడ్పడడం అత్యంతావశ్యకం.

శరణాగత ధర్మాన్ని స్థాపించిన వాడు శ్రీరాముడు. విభీషణుడు శ్రీరాముణ్ని ఆశ్రయించడానికి అనుకూలమైన స్థితిని సీతమ్మ కల్పించిందనడం సత్యదూరమైన మాట కాదు. పైన చెప్పబడిన రెండు లక్షణాలు గల భగవత్కృపయే – కరుణయే మూర్తీభవించి వచ్చినందువల్ల శ్రీరాముడు 'కరుణాకాకుత్స్థ' (దశావతార స్తోత్రం) అని స్తుతింపబడినాడు.

'రఘు ధురంధరుడు' అంటే రఘువంశ నిర్వాహకుడు, రఘువంశంలో ముఖ్యుడు అని అర్థం.

సూర్యవంశంలో రఘుమహారాజు ఆశ్రిత రక్షణ ధర్మమందు పేరు పొందినవాడు. (కౌత్సవ ముని వృత్తాంతం ప్రసిద్ధం)

"విశ్వామిత్ర కపోత వానర రఘు వ్యోమా ధ్వగప్రేయసీ" అని దేశికులు 'అభయ ప్రదానసార' మందు రఘువును శరణ్యుల పట్టిక (చిట్టా)లో పేర్కొన్నాడు.

ఇట్టి రఘు వంశానికి వన్నె తెచ్చినవాడు శ్రీరాముడు.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే ।
అభయం సర్వ భూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ ॥"

'స్వామీ! నేను నీ సొత్తును, తొత్తును' అని ఒక్కమాఱు మాత్రమే మహా విశ్వాసంతో ప్రార్థిస్తే చాలు. అలా ప్రార్థించే సకల ప్రాణులకు అభయాన్ని ఇస్తున్నాను. ఈ శరణాగత సంరక్షణ దీక్షను నేను వహిస్తున్నానని ప్రతిజ్ఞచేశాడు. ఇట్టి రఘుకుల రమణీయుడవతరించడానికి బాధ్యురాలు దయాదేవియే.

ఇంతకుముందటి అవతారాల కన్న దేవతిర్యఙ్మనుష్య స్థావరాలతో కలిసి మెలసి తిరుగుతూ, లోకహిత కార్యాలనెన్నిటినో ఆచరించిన అవతార పురుషుడు శ్రీరాముడు.

వ్యభజ్యత సరిత్పతిః సకృద వేక్షణాత్త త్క్షణాత్:– చారిత్రక పురుషుడైన సీతాపతి ఒక్కసారి చూచినంత మాత్రాన, ఆ క్షణాననే సముద్రం రెండుగా విభజింప బడింది. శ్రీరాముడు చేసిన ఘనకార్యాలన్నీ ఆయన సమకాలీనులకే ఉపయోగపడినాయి. శ్రీరాముడు సైన్య సమేతంగా లంకకు పోవడానికి ఉపయోగపడునట్లు నిర్మింప

బడిన సేతువు అనంతరీయులకు - తర్వాతి తరాల వారికి కూడా ఉత్తమ ఫలమీయ దగిన అద్భుత కార్యంగా పేర్కొనబడినది.

"కపయః కర్మ కుర్వంతి" - రామాజ్ఞచేత చపలమతులైన కోతులు పర్వతాలను తెచ్చి పడవేస్తుంటే, నలుడనే వానర శిల్పి వారధిని కట్టినాడు. నదులకు ఆనకట్టను వేయడం సుకరం కాని, అలలచేత విజృంభించే అగాధమైన సముద్రాన్ని రెండు వ్రయ్యలుగా చేసే సేతువును నిర్మించి బంధించడం దుష్కరం కదా! సముద్రుణ్ని శ్రీరాముడు ఒక్కసారి కటాక్షించిన వెంటనే, కల్పాంతం వరకు చరిత్రాత్మకమై చిరస్థాయిగా నిర్మింపబడింది సేతు బంధనం.

ప్రకృష్ట బహుపాతక ప్రశమ హేతునా సేతునా- రామ నిర్మితమైన సేతువును ఒక్కసారి చూచిన జనులకు ఘోరమైన పంచ మహాపాతకాలు తొలగిపోతాయి.

"యత్పురా పాప దశకచ్ఛేద సాధనతాం గతః ।
స సేతు ర్న కథంశక్తః పాప పంచక భంజనే ॥"

పాపిష్ఠుడైన దశకంఠుని వధ కోసం పూర్వం నిర్మింపబడిన సేతువును దర్శించినంతనే ఆ సేతువు పంచపాతకాలను మాత్రం పంచబంగాళం చేయక ఉంటుందా? అవశ్యంగా పంచపాతకాలను నశింప జేస్తుందని శ్లోకార్థం.

"సేతుందృష్ట్వా సముద్రస్య బ్రహ్మహత్యాం వ్యపోహతి"

ఒక్క మాఱు సముద్ర సేతువును చూస్తే, బ్రహ్మహత్య లాంటి క్రూర పాపాలు ధ్వంసమవుతాయి.

"తం వీక్ష్యసేతు మధునాఽపి శరీర వంతః
సర్వే షడూర్మి బహుళం జలధింతరంతి ॥" (వరదరాజ పంచాశత్)

గర్భమందు ఉండడం, పుట్టడం, పెరగడం, తిరుగడం, తరుగడం, నశించడం అనే ఆరు రకాల అలలచేత అల్లకల్లోలంగా ఉండేది ఈ సంసార మనే సముద్రం. శ్రీరామభద్రుని సముద్ర తరణానికి కారణమైన సేతువును ఇప్పుడు కూడా దర్శించిన దేహధారులందరు సంసారమనే సముద్రాన్ని తరించడానికి కారణమవుతున్నది.

రామావతారమందు భగవత్కృపచే నిర్మింపబడిన సేతువు, చేతనులు దర్శించి నంత మాత్రాన సంసారమనే సముద్రాన్ని దాటడానికే కాదు (51 శ్లోకం) భగవత్పాద పట్టణాన్ని చేరడానికి కూడా ఉపయోగపడుతున్నది. ప్రాకృత భాషలో రచింపబడిన "సేతుబంధ" మనే మహాకావ్యం 'సేతుబంధ' మాహాత్మ్యాన్ని తెల్పుతుంది.

మందాక్రాంత॥

శ్రీమంతుండాశ్రిత హితుడు నీచే గృపాప్రేరితుండై
రాముండై యు ర్వరనునవతారంబుగావింపగా వీ
క్షామాత్రన్ దత్క్షణమ పటు దోషఘ్న మౌసేతు చేతన్
భూమిన్ రెండై పొలువుగనె నంభోనిధా నుండు దేవీ! ॥

88. కృపే! పరవతస్త్వయా వృషగిరీశితుః క్రీడితం
జగద్ధిత మశేషత స్తదిద మిత్థ మర్థాప్యతే।
మదచ్ఛల పరిచ్యుత ప్రణత దుష్కృత ప్రేక్షితై
ర్హత ప్రబల దానవైర్హల ధరస్య హేలాశతైః ॥

అర్థం:- హే కృపే = ఓ దయాదేవీ! త్వయా = నీచేత; పరవతః = విధేయుడైన; వృషగిరీశితుః = బలరాముడై అవతరించిన శ్రీనివాస భగవానుని యొక్క; క్రీడితం = (ఆట) లీల; అశేషతః = సంపూర్ణంగా; జగత్+హితం = లోకాల మేలుకోసమే; (భవతి=అవుతున్నది). తత్, ఇదం = ఆయీ క్రీడితం; మద-ప్రేక్షితైః। మద = (త్రాగిన) మదమనే; ఛల = నెపం చేత; పరిచ్యుత = విడువబడిన; ప్రణత = నమ్రుల యొక్క; దుష్కృత = పాపాల; ప్రేక్షితైః = దర్శనం గలవైన; హత ప్రబలదానవైః = చంపబడిన అతి పరాక్రమ శాలురైన రాక్షసులు కలవియైన; హలధరస్య = నాగేటిని ఆయుధంగా ధరించిన బలరాముని యొక్క; హేలాశతైః = అనేక లీలల చేత; ఇత్థం = ఇట్లు (లోకహితంగా) అర్థాప్యతే = నిరూపింప బడుతున్నది.

తా: ఓ దయాదేవీ! నీకు వశుడైన శ్రీనివాసుడే బలరామునిగా అవతరించిన వాని యొక్క లీలా వ్యాపారమంతా జగద్ధితంగా అవుతున్నది. త్రాగిన మదమనే

సాకు చేత తన నాశ్రయించిన వారి దోషాలను ఆయన గమనించడం లేదు; హలధరుడైన బలరాముడు ప్రలంబాది ప్రబల రాక్షసులనూ వధించాడు. ఆయన లీలా విహారాలన్నీ లోకోపకారార్థమే అని స్పష్టంగా కనబడుతున్నవి.

వ్యాఖ్య:- దయాప్రేరితుడైన శ్రీనివాసుడు బలరాముడై క్రీడించినవన్నీ లోకహితంగా వ్యవహరింపబడుతున్నవని సుశ్లోకితం.

రామావతారం తర్వాత బలరామావతారం వర్ణింపబడుతున్నది. రామునికి తమ్ముడైన లక్ష్మణుడు శేషాంశ సంభూతుడు. ఆతడే శ్రీకృష్ణునికి అన్నయై ద్వాపర యుగాన అవతరించాడు. లక్ష్మీనారాయణులకు సెజ్జగా నున్న ఆదిశేషుడే భగవత్కృప చేత బలరాముడుగా అవతరించాడు. బలరాముని లీలా విహారాలు జగద్ధితంగా పరిగణింపబడుతున్నవి. పరశురామావతారానికి దయా ప్రాచుర్యం వర్ణితం. బలభద్రావతారమందు ఆయన లీల దయామయిగా నిరూపింపబడుతున్నది.

కృపే! త్వయా పరవతః వృషగిరీశితుః క్రీడితమ్:- దయా పరాధీనుడైన వృషగిరి పతిదే హలధరుని క్రీడ. హలధరుడు క్షేమంకరుడైన కృషీవలుడు. వృష్టి అయితే హలం ఉపయోగపడుతుంది. హలధరుడు గిరివాసియే కాబట్టి వృష గిరీశుడు హలధరునిగా అవతరించడం ఉచితమే కదా! దయకు వశుడైన హలధరుని విహారం దయామయంగానే ఉంటుంది.

జగద్ధిత మశేషతః తదిద మిత్థమర్థాప్యతే:- దయాదేవి పరహిత ప్రావణ్యం కలది. దయా పరతంత్రుని లీల చరాచర ప్రపంచానికంతటికీ హితకరమైనదని బలరామావతార మందు స్పష్టంగా గోచరిస్తుంది.

"క్షీరంశర్కర యేవ యాభిర పృథ గ్భూతాః" - (దశావతారస్తోత్రం) రామలక్ష్మణులు కలిసి యున్నట్లు, బలరామకృష్ణులు స్వాభావికంగా కలసిమెలసి యున్నారు. హలధరుని లీల శర్కర కాగా శ్రీకృష్ణుని లీల పాలవంటిది. పంచదార పాలకు మాధుర్యాన్ని కలిగించినట్లు, హలధరుని లీల శ్రీకృష్ణ లీలను మధురంగా చేసింది.

మదచ్ఛల పరిచ్యుత ప్రణత దుష్కృత ప్రేక్షితైః :- బలభద్రునికి మద్యపానం ప్రియమైన అలవాటు. మద్యాన్ని ప్రియమైనదని ఎక్కువగా పానం చేస్తే, మనస్సు

ఉద్విగ్నమవు (కృంగిపో)తుంది. స్మృతి భ్రష్టమవుతుంది. రసన నీరసిస్తుంది. దృష్టి మాంద్యమేర్పడుతుంది. చూపు లోపించడం వల్ల ఎదుట నున్న వస్తువు కనబడిననూ కనబడనట్లే ఉంటుంది. మదం-మత్తు-బాగా పెరుగుతుంది. సుకృత దుష్కృతాలు గమనింపబడవు.

బలదేవునికి మదబలం వల్ల తనను ఆశ్రయించిన వారి దోషాలు కనబడవు. సుయోధనుడు దుశ్చరితుడైనందువల్ల లోకం ఆయనను దుర్యోధనుడని పేర్కొన్నది. ఆ దుర్యోధనుడు హలమే ఆయుధంగా గల బలరాముని శిష్యుడు. ఆ దుర్యోధనుని దోషాలు హలధరుని చూపుల కానకుండా జారిపోయినాయి.

నీళాదేవి యొక్క విభ్రమవిలాసాది భోగాలచేత (8 శ్లో) శ్రీనివాసునికి భక్తుల దోషాలు కనబడలేవన్నారు కదా శ్రీ మద్దేశికులు. ఇక్కడ త్రాగిన మదం వల్ల, దుర్యోధనుని వంటి ఆశ్రితుల దోషాలు బలరామునికి కనబడలేవంటున్నారు. అక్కడ నీళాదేవియే శ్రీనివాసునిచే భక్తుల దోషాలు కనబడనీయక, కటాక్షింప చేసింది. ఇక్కడ త్రాగిన మదమనడం ఒకసాకే కాని వాస్తవం కాదు. హలధరునికి ఆశ్రితుల దోషాలను కనబడకుండా చేసి, ఆశ్రిత పక్షపాతాన్ని కలిగించడానికి దయాదేవియే మూలకారణం.

హతప్రబలదానవైః, హలధరస్య హేలాశతైః జగద్ధిత మర్థాప్యతే:- బలరాముడు బాల్యంలోనే కంసుని ప్రేరణ చేత హింసించ డానికి మాయోపాయాలతో వచ్చిన ప్రలంబాది రాక్షసులను కూడా వధించాడు. అదివధయే కాని అతని చేత వధింపబడిన వాడెల్ల ముక్తిని పొందడం వల్ల, అటు హతునికీ, ఇటు లోకానికీ హితమే అయింది. 'హేల' అంటే లీల. ఆశ్రితుల పట్లనూ, అనాశ్రితుల పట్లనూ హలధరుడు ప్రవర్తించిన రీతులన్నీ లోకహితం కోసమే అని నిరూపింప బడినాయి.

ఒకప్పుడు యమునానది యొడ్డున ఉన్న హస్తినపురాన్ని గంగలో కలుపుతానని బలరాముడు తన ఆయుధమైన హలంతో పెకిలించి దొల్లించగా (ఆ పట్టణం ఢిల్లీ అయ్యి) యమునానది నిగ్రహింపబడి, మరు భూమిలో ప్రవహించేటట్లు చేసిన లీల వంటి వెన్నో జగద్ధితార్థమే అని ఋజువైనాయి. దయావిధేయుడైన వాని లీలలు హితకరమైనవని స్పష్టీకృతం.

మందాక్రాంత॥

కాళిందీ నిగ్రహుడయి వృషక్ష్మాధరా ధీశుడుర్విన్
లీలన్ దైత్యాళిని దునిమి విక్లేశుడై పాన మోహా
వ్యాలోలా త్ముండయి మెలగుటల్ యాశ్రితాఘానవేక్షన్
బాలింపన్ ద్వత్పరత జగముల్, స్పష్టమీ యర్థమంబా॥

89. ప్రభూత విబుధద్విషద్భరణ ఖిన్న విశ్వంభరా
భరాపనయన చ్ఛలాత్త్వ మవతార్య లక్ష్మీధరమ్।
నిరాకృత వతీ దయే! నిగమసౌధ దీపశ్రియా
విపశ్చిదవిగీతయా జగతి గీతయాఽ ంధం తమః॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వం = నీవు; ప్రభూత = ఛలాత్। ప్రభూత = ఎక్కువైన; విబుధ = దేవతలకు; ద్విషత్ = శత్రువులైన అసురులను; భరణ = భరించడం చేత; ఖిన్న = దుఃఖితయైన; విశ్వంభరా = సమస్తాన్ని భరించే భూదేవి యొక్క; భర = భారాన్ని; అపనయన = తొలగించడమనే; ఛలాత్ = నెపం వల్ల; లక్ష్మీధరం = శ్రీనివాసుణ్ని; అవతార్య = శ్రీకృష్ణునిగా అవతరింపజేసి; నిగమసౌధ దీపశ్రియా = వేదాంత భవనానికి దీపకాంతి వంటి; విపశ్చిత్ + అవిగీతయా = పండితులచే ప్రశంసింపబడిన; గీతయా = భగవద్గీత చేత; జగతి = ప్రపంచమందలి; అంధం తమః = గాఢమైన అజ్ఞాన మనే అంధకారాన్ని; నిరాకృతవతీ = పోగొట్టిన దానవు.

తా: ఓ దయాదేవీ! భగవానుని ఆశ్రయించిన వారికి విరోధులైన రాక్షసాంశ మందు జన్మించిన క్షత్రియరాజులను భరించడం చేత విషణ్ణయైన విశ్వంభరా దేవి యొక్క బరువును పోగొట్టడమనే మిషవల్ల నీవు లక్ష్మీధరుణ్ని శ్రీకృష్ణునిగా అవతరింప జేసి, విద్వాంసుల చేత వినుతింపబడిన వేదాంతసారమైన భగవద్గీత చేత లోకం లోని అజ్ఞానమనే గాఢాంధకారాన్ని శాశ్వతంగా తొలగించావమ్మా!

వ్యాఖ్య:- దయాదేవి శ్రీకృష్ణుని ద్వారా గీతాజ్యోతిని ప్రకాశింప జేసిందని సుశ్లోకితం.

శ్రీకృష్ణుడు పరిపూర్ణావతార పురుషుడు. చతుర్భుజుడుగా అవతరించి కూడా, వెంటనే తల్లిదండ్రుల మాటను పాటించిన పరమ పురుషుడు. శ్రీరాముడు కరుణా కాకుత్స్థుడైతే, శ్రీకృష్ణుడు క్రీడా వల్లభుడు. లీలయే ఆయనకు ప్రియమైనది. మదచ్ఛలంతో ఆశ్రిత పక్షపాతి బలరాముడు.

భూభారహరణమనే ఛలంతో అంతేవాసికి జ్ఞానోపదేశం చేసే ఆచార్యుడుగా చేరినవాడు శ్రీకృష్ణుడు.

"ఉన్నాలల్లాల్ యావరాలు మొన్టుమ్ కురైవేండేన్" - నీతో తప్ప నాకు వేరొకరితో కావలసినదేమీ లేదు అని, "ఆరెనక్కు నిన్ పాతమే శరణాకత్తం దొషుందాయ్" - నాకు నీ శ్రీ పాదాలను రక్షకంగా ఇచ్చావు అని లోకం చేత యావత్కాలం కీర్తింపదగిన వాడు శ్రీకృష్ణ భగవానుడు. ఇది దయా కృతోపకారమే.

ప్రభూత విబుధ ద్విషద్భరణ ఖిన్న విశ్వంభరా భరాపనయన చ్ఛలాత్:- 'విబుధ' శబ్దానికి దేవతలు, వేదవిదులని అర్థం. పరబ్రహ్మ చేత వేదాలు జగద్రక్షణం కోసం ప్రకాశింపబడినాయి. వేదాల చేత ప్రతిపాదితుడు భగవానుడు. వేదాలను ద్వేషించే వారు పాపిష్ఠులు. సురలను భూసురులను ఎక్కువ పీడించే శత్రువులు అసురులు. అసురుల అంశ చేత నరపతులుగా జన్మించిన కంసుడు, శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన మహాపాపిష్ఠులైన ఎందరినో భరించడం చేత శోకతప్త యైనది భూదేవి. విశ్వంభరకు, గుట్టలనేకాక సర్వం సహించే దైనప్పటికీ, సాధువులను ద్వేషించే వారి బరువును సహించలేక ఖేదం కలిగింది.

"గౌర్భూత్వాఽ శ్రుముఖీఖిన్నా క్రందంతీ కరుణం విభోః" (భాగ) కాబట్టి, భూదేవి గో రూపాన్ని ధరించి బ్రహ్మ వద్దకు పోయి, విషణ్ణవదనయై తనకు దేవశత్రువు లైన పాపాత్ములచే కలుగుతున్న సహించరాని భారాన్ని తొలగింప సహాయ పడవలసినదిగా మొరపెట్టుకొన్నది అని శ్రీ శుకమహర్షి సూక్తి. సాధువులను ద్వేషించే పాపిష్ఠులను హతమార్చి భూభారాన్ని తొలగించడం జరిగింది. "కృత్వా భారావతరణం పృథివ్యాః పృథులోచనః" - వాస్తవంగా, భగవానునికి శత్రువులు లేరు, మిత్రులు లేరు. భగవానుణ్ని రక్షించుమని ఆశ్రయించే వారి శత్రువులే తనకు శత్రువులని భగవానుడే స్వయంగా ప్రకటించాడు ఒక చోట.

"ద్విషదన్నం నభోక్తవ్యం ద్విషంతం నైవ భోజయేత్ ।

పాండవాన్ ద్విషసేరాజన్! మమప్రాణాహిపాండవాః ॥" (భారతం)

ఓ దుర్యోధన మహారాజా! శత్రువులు పెట్టిన అన్నం తినకూడదు. అలాగే శత్రువులకు భోజనం పెట్టకూడదు. నీవు పాండవులను ద్వేషిస్తున్నావు. పాండవులు నా ప్రాణాలే సుమా! అని కృష్ణుడు తనను విందు భోజనానికి ఆహ్వానించిన దుర్యోధనునితో అన్నాడు కదా!

త్వమవతార్య లక్ష్మీధరమ్:- దయాదేవి లక్ష్మీధరుణ్ని అవతరింప జేసింది. ఇంతకుముందే 'వృషభశిఖరి నాథస్త్వన్ని దేశేన నూనం భజతి - జన్మభేదాన్" (35). దయాదేవి యొక్క ఆజ్ఞచేత శ్రీనివాస భగవానుడు ఆయా జన్మలను పొందుతున్నాడు - అన్న విషయం స్మరణీయం. 'లక్ష్మీధరుడు' అంటే "తిరుమార్వర్" లక్ష్మిని వక్షః స్థలమందు ధరించినవాడు; "మలరాళ్ మైన్దనై" కమల వాసినియైన శ్రీదేవికి నాథుడు; "తిరుమకళార్ తనక్కేళ్వన్' - లక్ష్మీ వల్లభుడు; 'తిరువిన్ మణాళన్" - శ్రియఃపతి అని అర్థం.

తిరుమలలో శ్రీనివాసుని వక్షఃస్థల లక్ష్మిదర్శనం స్పష్టంగా కలుగుతుంది కదా!

"శ్రియఃపతిః శ్రీమతి శాసితుంజగ జ్జగన్నివాసో వసుదేవసద్మని" (మాఘకవి మాట) శ్రియఃపతి జగత్తును శాసించడానికి జగన్నివాసుడయ్యాడు. ఆ జగత్తులో ఒక మూలలో నున్న వసుదేవునింట ఆవిర్భవించాడు. లక్ష్మీధరుడే తన కృప చేత దేవకీ వసుదేవులను "పితా పితృమాన్ యోనియోనౌ" అని శ్రుతిరీత్యా, తల్లిదండ్రులుగా శోభింపజేస్తూ, చతుర్భుజుడై లక్ష్మీధరుడుగానే శ్రీకృష్ణుడుగా ఆవిర్భవించాడు కదా!

"రుక్మిణీ కృష్ణజన్మని" (వి.పు). శ్రీనివాసుడు కృష్ణుడై, శ్రీదేవి రుక్మిణియై అవతరించారని శ్రీ పరాశర సూక్తి. రుక్మిణీ పతి కృష్ణుడు. దయాదేవి లక్ష్మీదేవి తోడనే శ్రీకృష్ణుణ్ని అవతరింప జేసింది. లక్ష్మీ విశిష్టుడే దయాఘనుడు. లక్ష్మీ రూపభారాన్ని వహిస్తూ, భూభారాన్ని తొలగించడానికి లక్ష్మీధరుణ్ని - శ్రీకృష్ణుణ్ని అవతరింపజేసింది.

సాధువులను రక్షించడానికి దుష్టులను నాశనం చేయడమే అవశ్యకం. ధర్మ సంస్థాపనకై సాధుపరిత్రాణమే ముఖ్యమైన ప్రయోజనం. దుర్జనులను అణచివేయడం

ఆనుషంగికమే. కాబట్టి, మహా పాపిష్ఠులను మట్టుపెట్టి, భూమి భారాన్ని తొలగించడం ఒక నెపమే – ఛలమే – కాని ముఖ్య ప్రయోజనం కాదని దేశికుల ఆశయం.

శ్రీకృష్ణుణ్ని అవతరింప జేయడానికి దయాదేవికి గల ముఖ్యోద్దేశం ఉత్తరార్ధంలో – అందులో ఆద్యంత పదాలచే ప్రకటింపబడుతున్నది. "నిరాకృతవతీ అంధంతమః" చీకటిని పోగొట్టడమే. గీతా జ్యోతిచేతనే అది సాధ్యమవుతుంది.

నిగమసౌధ దీపశ్రియా విపశ్చిదవిగీతయా జగతి గీతయా:– వేదాంతం అనేది నిగమసౌధం. 'నిగమం' అంటే వేదం. 'సౌధం' అంటే అనేక భూమికలు – అంతస్థులు – కల్గిన అత్యున్నతమైన ప్రాసాదం – మేడ. 'దీపశ్రీ' అంటే వెలుతురు చేత కలిగే శోభ. ప్రాసాదంలోపటా, బయటా, మీద, దీపాల కాంతి ఉండడం వల్లనే నిరపాయంగా మెట్లనెక్కడం దిగడం జరుగుతుంది. అస్ఖలితంగా అంతస్థులలో సంచరించడం సంభవమే. వేదంలో ఉన్నతమైనది ఉపనిషద్విద్య. దీన్నే వేదాన్త మంటారు.

"బిభేత్యల్పశ్రుతా ద్వేదః" – స్వల్పంగా విద్యను అభ్యసించిన వ్యక్తి వల్ల వేదం శబ్దాలకు పెడార్థాలు చెబుతాడని భయపడుతుందట. ఇక బ్రహ్మ విద్యయైన వేదాన్తం చాలా గహనమైనది కదా! వేదాన్త విద్య గొప్ప రాజభవనమైతే దాన్ని ప్రకాశింపజేసే దీపశ్రీ – భగవద్గీతయే.

దీప శోభలేని భవనం వనమే అవుతుంది. గీతాజ్ఞానం లేని వేదాన్తం దాన్త మవుతుంది.

దీపాలకాంతిచేత ప్రాసాదరామణీయకత వైభవంగా గోచరించే రీతిగా, భగవద్గీతలోని అధ్యాయాల విజ్ఞానం చేత వేదాంత రహస్యాలు రమణీయంగా గోచరిస్తాయి. గీతాశాస్త్రం లేనిది వేదాంతశాస్త్రార్థం యథార్థంగా తెలియ శక్యం కాదనడం అక్షరాలా సత్యమైన మాట.

లోకంలో పండితులందరు గీతాశాస్త్రాన్ని ఉత్తమ ప్రమాణంగా అంగీకరించారు. 'గీతా సుగీతా' అనడంలో విప్రతిపత్తి లేదు. గీత విగీత కాదు. 'విగీత' అంటె

విప్రతిపత్తి. విప్రతి పత్తి లేనిది అవిగీత. అందరిచే ప్రశంసింప బడినదే. 'జగతి' అంటే లోకమే కాక, కాలానికీ ఉపలక్షణం. ఏ దేశంలోకానీ, ఏ కాలంలో కానీ, ఏ మతస్థుడే కానీ, 'భగవద్గీత'ను ప్రామాణిక గ్రంథం కాదనలేదు.

కృష్ణలీలలన్నీ ఆయన కాలాన ఉన్న ప్రాణులకే ప్రశస్తంగా ఉపయోగపడి నాయి. భగవద్గీత మాత్రం సర్వదేశకాలాల్లోనూ సకలజనులకు శాశ్వతంగా యథార్థ జ్ఞానాన్ని కలిగించి, హృదయంలోని అజ్ఞానమనే గాఢాంధకారాన్ని తొలగిస్తున్నది. (ద.శ. 18వ శ్లోకం స్మరణీయం) ప్రపంచంలోని అన్ని భాషలలోకి అనువదింప బడిన ప్రామాణిక గ్రంథరాజమైన భగవద్గీత వల్ల ప్రపంచం లోని అజ్ఞానాంధ తమస్సు తొలగింపబడుతున్నది.

"తేషామేవానుకంపార్థ మహమజ్ఞానజంతమః।
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞాన దీపేన భాస్వతా ॥" (భ.గీ. 10-11)

మానవుల అంతఃకరణమందున్న నేను వారిని అనుగ్రహించడం కోసం తేజోమయమైన తత్త్వజ్ఞాన రూప దీపాన్ని వెలిగించి, వారి అజ్ఞానమనే కటిక చీకటిని పారద్రోసి వేస్తాను అని శ్రీకృష్ణ భగవానుడు గీతోపదేశం చేశాడు.

హృదయగుహలో ఉన్న చీకటి గీతారూపశబ్ద దీపం లేకుండా తొలగింప బడదనే భావంతోనే దయాదేవి లక్ష్మీధరుణ్ని అవతరింపజేసి ఆయన చేత గీతాశాస్త్రావతరణం కావించింది.

మందాక్రాంత॥ హీనుల్ దేవాహితులవనిపుల్ హింసగావింప బృథ్వీ
దీనావస్థన్ దెలిసి భరమున్ దీర్పశ్రీశున్ యశోదా
సూనుం జేయన్ సొరిదివిబుధ స్తుత్యగీతోప దిష్ట
జ్ఞాన శ్రీచే జగములు తమస్త్యక్తమై వెల్గు దేవీ! ॥

90. వృషాద్రి హయసాదినః ప్రబల దోర్మరుత్ప్రేంఖిత
స్విషా స్ఫుటతటిద్గుణ స్త్వదవసేక సంస్కారవాన్।
కరిష్యతి దయే! కలి ప్రబల ఘర్మ నిర్మూలనః
పునః కృతయుగాం కురం భువి కృపాణధారాధరః ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! వృషాద్రి హయసాదినః = వృష గిరి యందున్న శ్రీనివాసుడనే గుఱ్ఱపు రౌతు యొక్క; ప్రబలదోః + మరుత్ ప్రేంఖితః = బలం గల చేతిగాలిచే చలింపబడినట్టి; త్విషా = (తన) కాంతిచే; స్ఫుటతటిత్ గుణః = ప్రకాశించే మెఱపుతీగను కలిగియున్న; త్వత్+అవసేక సంస్కారవాన్ = నీచే తడుపబడడమనే సంస్కారం కలిగినట్టి; కృపాణ ధారాధరః = ఖడ్గమనే మేఘం; కలి ప్రబల ఘర్మ నిర్మూలనః = కలిచేత ఏర్పడే ప్రబలమైన గ్రీష్మతాపాన్ని నివారించునట్టిదై; భువి = భూలోకమందు; పునః = మళ్ళీ; కృత యుగ+అంకురం = కృతయుగమనే మొలకను; కరిష్యతి = చేయగలదు - కృతయుగాన్ని అంకురింప జేయగలదు.

తా: ఓ దయాదేవీ! వృషాద్రి పైనున్న శ్రీనివాసుడనే అశ్వారూఢుడైన కల్కి అనే రాబోవు అవతార పురుషుని యొక్క ఖడ్గమనే మేఘం, బలం గల ఆయన చేయి వీచడం చేత, కలిగే గాలిచే కదిలి, ఆయన కాంతిచే మెఱపుదీగల్లాగా ప్రకాశిస్తూ, నీచేత (నూనెలాగా) పూయడమనే సంస్కారం కలిగి, కలిచే ఏర్పడే తీవ్ర తాపాన్ని తొలగించే వర్షం కురియగలదు. కృతయుగారంభానికి కారణం కాగలదు.

వ్యాఖ్య:- రాబోయే కల్క్యవతారమందు దయచేత ఏర్పడే ఉపకారం వర్ణింప బడుతున్నది.

కల్కి భగవానుడుగా శ్రీనివాసుడు కలియుగాంత కాలాన అవతరించగలడు. కల్కి భగవానుడు తెల్లని గుఱ్ఱం మీద స్వారీ చేస్తుంటాడు. ఆయన చేతిలో పదునైన ఖడ్గం ఉండగలదు. శ్రీనివాస భగవానుడు వృషగిరియందు వేంచేసి యున్నాడు. పర్వత నివాసులు అశ్వారోహకులుగానూ ఉంటారు. కలికాలుష్యాన్ని తిరుమలేశుడు తొలగించి, ధర్మ వర్షాన్ని కురిపిస్తాడు. కల్కి భగవానుని హస్తోద్ధృత కృపాణం భగవత్కృప చేత కృపావర్షం కురిపించగలదు. ఆ కృపాణం మేఘంగా రూపింప బడుతున్నది.

వృషాద్రి హయసాదినః :- కల్కి భగవానుడని ఈ శ్లోకమందు వాచ్యంగా పేర్కొనబడలేదు. వృషాద్రియందున్న శ్రీనివాసుడే 'హయసాది' - గుఱ్ఱపు రౌతుగా

చెప్పబడినాడు. కాబట్టి శ్రీ వేంకటేశ్వర స్వామియే అశ్వసాదియైన యోధునిగా అవతరించగలడని విశదమవుతున్నది. ముఖ్యంగా, కల్కిని వర్ణించలేదు ఈ శ్లోకం. కల్కి యొక్క ఖడ్గాన్ని వర్ణిస్తున్నది.

కృపాణధారాధరః:- ధారాధరమంటే మేఘం. "ధారాధరో జలధరః" (అమరం) కృపాణమంటే ఖడ్గం (కరవాలం). కరవాలమే మేఘంగా తాద్రూప్య రంజనం చేయబడింది. కృపాణానికి మేఘలక్షణాలన్నీ ఆరోపింపబడి; కృపాణానికీ, ధారాధరానికీ అభేదాన్ని వర్ణిస్తున్న శ్లోకమిది.

దశావతార స్తోత్రమందు 'నిస్త్రింశ ధారాధరః" అని కల్కీ భగవానుడు వర్ణింప బడినాడు. 'నిస్త్రింశం' అంటే మూడు ప్రక్కలు (రెండు ప్రక్కలు, ముందు వైపు) పదునుగల ఖడ్గమని అర్థం. "ఉల్లాస్య కాల కరవాల మహాం బువాహమ్" అని కావ్య ప్రకాశకారుడు ఖడ్గాన్ని మేఘంతో పోల్చాడు.

దయే! త్వదవసేక సంస్కారవాన్:- మేఘం సముద్రంలో నుంచి జలాన్ని స్వీకరించి, నీల వర్ణంగా భాసిస్తుంది. ఉదకాన్ని స్వీకరించకుంటే వర్షించదు. కృపాణం భగవద్దయలో తడువడమే సంస్కారం. తైలంతో కృపాణాన్ని పూయడమే సంస్కారం. నూనె పూయకపోతే ఖడ్గం బాగా పనిచేయదు. అగ్గి యందు బాగా కాల్చబడిన ఆయుధాలను నీళ్ళల్లో తడిపితే నీటిగుణం - పదును - వాటికి ఏర్పడడమే సంస్కారమని భావం. భగవత్కృప - దయాదేవి, ఆ కృపాణమందు ఆవహించడమని సారాంశం.

ప్రబలదోర్మరుత్ప్రేంఖితః:- మేఘం జలాన్ని గ్రహించి పైకి పోయేసరికి పెద్ద గాలివీచడం వల్ల అటు - ఇటు కదులుతుంది.

కృపాణం కల్కిచేత ధరింపబడినందు వల్ల ఆయన బలమైన చేతిని అటు - ఇటు విసరే ఆటోపం చేత ఆందోళన చెందుతుంది.

త్విషాస్ఫుటతటిద్గుణః:- మేఘం తనలోని మెఱుపుదీగలతో తాను ప్రకాశిస్తుంది. కృపాణం బాహాటంతో కదలినప్పుడు దాని ధారలు - అంచులు భగవద్రూప కాంతి చేత తళుక్కు మనడం వల్ల మెరుస్తుంటుంది.

కలిప్రబలఘర్మ నిర్మూలనః:- మేఘం గ్రీష్మ కాలమందు కలిగిన గొప్ప తాపం - వేడి చేత బీటలు బాటిన భూమిని తన వర్షం చేత తడిపి తాపాన్ని చల్లార్చుతుంది. కృపాణం కలిపురుషుని కింకరులనబడే మహాపాపులచే కలిగే జగత్పీడను నివారిస్తుంది. ఈ కృపాణం కృపను వర్షిస్తుంది. అంటే దుర్జనులను, దౌష్ట్యం చేయనీయక, ఖడ్గం చేత సంహరించి వారందరికి కృపతో సద్గతిని కలిగిస్తుంది.

కరిష్యతి పునఃకృత యుగాంకురం భువి:- మేఘం భూమి తాపాన్ని చల్లార్చి అంటే వర్షించిన తర్వాత, మళ్ళీ ధాన్యపు విత్తులను మొలకింప జేసి, ప్రపంచానికి క్షామం కలుగకుండా, క్షేమాన్ని కల్పిస్తుంది. కృపాణం కలిదౌష్ట్యాన్ని తొలగించిన తర్వాత మళ్ళీ ధర్మోత్తరమైన కృతయుగాన్ని ఆరంభింపజేస్తుంది. దయాదేవి జన్తువులకు యోగక్షేమాలను కల్పిస్తుంది. కల్కి యొక్క కృపాణం దయా వసేక సంస్కారాన్ని పొంది - దయాదేవిలో అవగాహించింది. కాబట్టి కలియుగాన్ని కృతయుగంగా పరివర్తన చేయగలిగే - మార్చే - సామర్థ్యం కృపాణానికి దయా సాంగత్యం చేతనే కలుగ గలదని దేశికులు దయను స్తుతించారు.

ఈ దశకంలో మొదటి శ్లోకమందు కాలమేఘం వర్ణింపబడింది. ఈ చివరి శ్లోకంలో ధారాధరం వర్ణితం. భగవదవతారాలను దేశికులు స్వార్థరహిత మేఘంతో పోల్చి వర్ణించారు. కరుణాపయోనిధిలో అవగాహించిన మేఘం భగవానుని దివ్య మంగళ విగ్రహవర్ణాన్ని పొందడం వల్లనే ఔదార్య గుణంతో ప్రకాశిస్తున్నది కదా! రూపకాలంకార సజ్జితం.

మందాక్రాంత॥ **రౌతౌ యాసర్వగిరి విభు దోర్వాత సంచాలితంబై**
హేతిన్ విద్యుత్కృతరుచియుద్వ ద్దృష్టిసిక్తంబు నౌచున్,
మాతా! పృథ్విన్ మలినకలిసంబంధతాపంబు దీరన్
ఖ్యాతిన్ ధర్మక్రమ మెదుగ దత్ఖడ్గమేఘంబు సేయున్ ॥

నవమదశకం సమాప్తం

దశమ దశకం

91. విశ్వోపకారమితినామ సదా దుహానా
మద్యాపిదేవి! భవతీ మవధీరయంతమ్ ।
నాథే నివేశయ వృషాద్రి పతేర్దయే! త్వం
న్యస్త స్వరక్షణభరం త్వయి మాంత్వమేవ ॥

అర్థం: హే వృషాద్రి పతేఃదేవి! దయే = ఓ వేంకటేశ్వరుని దయా దేవీ! ఇతినామ = ఇట్లు; విశ్వ+ఉపకారం = ప్రపంచానికి సర్వవిధాలైన ఉపకారాన్ని; సదా = ఎల్లప్పుడు; దుహానాం = పిండుతున్న; భవతీం = నిన్ను; అద్య అపి = ఇప్పుడు కూడా; అవధీరయంతం = తిరస్కరిస్తున్నట్టి; త్వయా = నీ చేత; త్వయి = నీయందు; న్యస్త స్వరక్షణభరం = సమర్పించబడిన స్వీయ రక్షణ భారాన్ని కలిగినట్టి; మాం = నన్ను; త్వమేవ = నీవే; నాథే = జగన్నాథుని యందు; నివేశయ = ప్రవేశింపజేయుము.

తా: ఓ వృషాద్రిపతి యొక్క దయాదేవీ! ఇట్లు తొంబై శ్లోకాలలో చెప్పబడిన విధంగా జగత్తుకు సకల విధాలా ఉపకారాన్ని సర్వదా చేస్తున్న నిన్ను ఇప్పుడు కూడా తిరస్కరిస్తున్నాను. దేవీ! నీ చేతనే నీయందే భరన్యాసం చేసిన నన్ను నీవే నీ నాథుడైన లోకనాథునితో చేర్చుమమ్మా!

వ్యాఖ్య: విశ్వోపకారిణియై, తన రక్షణ భారాన్ని స్వీకరించిన దయాదేవియే, తనను శ్రీనివాసుని చరణారవిందాల యందు చేర్చాలని కవి కేసరి ప్రార్థన.

గత దశకాంతంలో సకల దుష్కృతాన్ని అణచివేసే కల్కి రూపుడైన శ్రీనివాసుడు కృతయుగ ధర్మాన్ని పునఃస్థాపించనున్నాడని తెల్పబడింది. ఆ శ్రీనివాస భగవానుడే ప్రపత్త్యనుష్ఠానం తర్వాత కూడా ప్రకృతి సంబంధం వల్ల కలిగిన తన పాపాలను క్షమించి, తనకు సాయుజ్య మోక్షాన్ని ప్రసాదించే విధంగా చేయాలని తన రక్షణ

భారాన్ని స్వీకరించిన దయాదేవిని దేశికులు స్వరూపాను గుణంగా చేస్తున్న ప్రార్థన ఇందు సుశ్లోకితం.

ఈ దశకంలో ఉద్ధర్షిణీ, సింహోన్నతా' అనే నామాంతరాలున్న 'వసంత తిలక' అనే వృత్తం చేత శ్లోకాలు రచింపబడినాయి. దయనీయమైన ఆత్మస్థితి ప్రభావితమై తగిన ఫలాన్ని పొందగలదనే విశ్వాసంతో దేశికులు 'గోదాస్తుతి, వరదరాజ పంచాశత్, దేవనాయకపంచాశత్" అనే స్తోత్రాలను వసంత తిలకావృత్తంలో రచించినట్లే, ఈ ప్రబంధంలోని దశమ దశకమందు అదే వృత్తాన్ని స్వీకరించారు.

ఈ దశకంలో "సత్పదవ్యాం సహాయః" - దివ్యమైన వేద మార్గానుగుణమైన సహాయమనేది ముఖ్య విషయం.

విశ్వోపకారమితినామ:- సకల విధాలైన ఉపకారాలను ఈ శతకంలోని నవదశ కాలలో దయాదేవి ఎలా చేసిందో అలాగే చెప్పబడిందని అర్థం. 'విశ్వ' శబ్దానికి సమస్తం, సకల మనేదే కాక ప్రపంచమనే అర్థమూ ఉంది. ప్రపంచానికి అంటే స్త్రీలకు, పురుషులకు - మానవులకు అన్ని విధాలా దయాదేవి చేసిన సహాయం వర్ణింపబడింది.

దుహానాం:- సర్వోపకారదోగ్ధ్రీ, దయాదేవి. పిండుతున్నదనే పద ప్రయోగం చేత దయాదేవి కామధేనువుగా అభివ్యక్తమవుతున్నది. కామధేనువు కోరికలనన్నీ నెరవేర్చుతుంది. ధేనువు తన లేదూడకు పాలను ఇస్తుంది. వాత్సల్యం అధికమైనప్పుడు తన దూడ తనదగ్గఱ లేకున్నా, పాలచేపులు రావడం వల్ల పాలను నేలమీద కార్చుతుంది.

"కన్ఱుక్కిరంగి నినైత్తు ములైవషియే నిన్ఱుపాల్‌శోర" (తిరుప్పావై 12)

తన లేదూడను తలచుకొని ధేనువు వాత్సల్యంతో పొదుగునిండా పాలచేపులు వచ్చి ప్రవహింప జేస్తుందని గోదాదేవి వర్ణించిన విధం, దూడల వంటి మనలను రక్షించడానికి పాలను పిండుతున్న దయాదేవికీ వర్తిస్తుంది కదా!

తల్లిని మనం ఎప్పుడు తలచుకోకున్నా, ఒకప్పుడు మనం తల్లిని దూషించినా, ఆమెకు రోషమూరాదు, సరికదా! దయతో పాలను - స్తన్యం - ఇచ్చి మనలను

కాపాడుతుంది. చంటి పంటితో గంటు వేసినా, తల్లి చనుపాలను ఇస్తునే ఉంటుందని గోదాస్తుతి.

విశ్వోపకార మితినామ సదా దుహానాం:- 'దుహానా' అంటే దోగ్ధ్రీ. పితుకుతున్నది దయాదేవి. శ్రీనివాసుడు కామధేనువు. ఆ గోవునుంచి సర్వోపకారాలు అనే పాలను పిండుతున్నది.

"సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనందనః ।
పార్థోవత్సః సుధీ ర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥"

ఉపనిషత్తులన్నీ ఆవులు. అర్జునుడు లేదూడ. పిండిన వాడు గోపాల కృష్ణుడు. గీతామృతం అనే దివ్యమైన క్షీరం పిండబడినది. ఆ క్షీరాన్ని అనుభవించేవాడు సుధీమణి, అనే ప్రసిద్ధమైన శ్లోకం స్మరణీయం. అయితే ఇక్కడ, కృష్ణుడనబడే శ్రీనివాసుడే కామధేనువు. ఆ ధేనువు నుంచి బహు విధాలైన ఉపకారాలనబడే పాలను దయాదేవి పిండి, తల్లి తన పిల్లలకు ఇచ్చి పోషించే రీతిగా, చేతనులకు అనేక ఉపకారాలను చేస్తున్నదని తొమ్మిది దశకాలలో విశదీకరింపబడినది.

అద్యాపిదేవి భవతీ మవధీరయంతమ్:- ఇంతవరకు ఓ దయాదేవీ! నీవు ప్రపంచానికి సర్వదా సకలోపకారాలు చేస్తున్న (భవతీమపి అద్య) దానవని నిన్ను స్తుతించినప్పటికీ, ఇప్పుడు నిన్ను గౌరవించడానికి నా మనస్సు సమ్మతించనందు వల్ల తిరస్కరిస్తున్నాను అంటున్నారు దేశికులు.

నేను తల్లికి దుష్టపుత్రుని వంటి వాడను అన్నారు.

శ్రీమద్యామున మునులు 'చకాసతం జ్యాకిణకర్కశైశ్శుభైశ్చతుర్భి రాజానువిలంబి భిర్భుజైః" అని బహువిధాలా భగవానుణ్ని స్తుతించారు. అయినా "ధిగశుచిమ వినీతం నిర్దయం మామలజ్జం" ఛీ, నేను అపవిత్రుడను, వినయం లేనివాడను, దయ-సిగ్గు లేనివాడను అని తమను తాము నిరసించుకొన్నారు. భగవానుణ్ని స్తుతించడమూ, తనను తాను నీచునిగా అనుసంధించడమూ విశిష్టాద్వైత సిద్ధాంతావలంబులకు శిష్టాచార సంప్రదాయమైనది. దీన్ని 'నైచ్యాను సంధానం' అంటారు.

భగవన్! నీవెంత మహిమ కలవాడవో నాకు తెలుసు. కాని నిన్ను నేను తగినట్లుగా ఆరాధించడం లేదు. మహాపాపిష్ఠుడను, అని నైచ్యాన్ని అనుసంధించడం వంటిదే ఈ మాట.

"జానామిధర్మం నచమేప్రవృత్తిః, జానామ్యధర్మం నచమేనివృత్తిః" - నాకు ధర్మం తెలుసు. కాని ధర్మాన్ని అవలంబించే స్వభావం నాకు లేదు. అధర్మమంటేమిటో బాగా తెలుసు. కాని అధర్మాన్ని పాటించకుండా నేనుండలేను అన్నాడట దుర్యోధనుడు.

"అద్యాపి" అనడం వల్ల ఈనాడు కూడా ఇలాంటి మనుష్యులున్నారని అనురణిస్తున్న పదమిది. భగవానుని ప్రాభవ వైభవాలు మనకు తెలిసినా, మనం త్రికరణశుద్ధిగా ప్రార్థించి ఆయన అనుగ్రహాన్ని పొందలేకపోతున్నాం, దయాదేవిని తిరస్కరించడమంటే వర్ణాశ్రమాచారాలను పాటించక, శాస్త్ర విహితమైన విధి నిషేధాలను ఉల్లంఘించి, భగవద్దయ మనమీద కలుగునట్లు ప్రవర్తించక పోవడమని అర్థం. ప్రపత్తి చేసినప్పటికీ తర్వాత ప్రకృతి బద్ధుడై పాపాలను చేస్తూ ఉండడమే భగవద్దయను తిరస్కరించడమని భావం.

త్వంన్యస్త స్వరక్షణ భరం త్వయి మాంత్వయైవ:- దేవీ! అని విధేయతను ప్రకటిస్తూనే, ప్రపన్నుడు ప్రపత్తిని చేసిన తర్వాత కలిగే పాపాలకు ప్రాయశ్చిత్తంగా పునః ప్రపత్తి నాచరించడానికి మారుగా దుర్బుద్ధితో తిరస్కరిస్తున్నాడేమిటని దయాదేవి భావించవచ్చు. అందుకోసం నమ్రతతో ఉత్తరార్ధంలో ఈ క్రమభావాన్ని దేశికులు తెల్పుతున్నారు.

"స్వదత్త స్వధియాస్వార్థం స్వస్మిన్ న్యస్యసిమాంస్వయమ్" నీ వొసగిన నీ బుద్ధితో నీ కోసమే నా రక్షణ భారాన్ని నీయందు స్వయంగా సమర్పింప జేసుకొన్నావు అన్నట్లు తన భావాన్ని వెల్లడించారు దేశికులు. ఇందులో నా కర్తృత్వమేముంది? "నాహం కర్తా" - నేనే ప్రపత్తి జేశాను. న్యస్తభరుడనయ్యాను' అని నేను నీల్గడం లేదు. నీవే భావయిత్రివి, కారయిత్రివి కదా! నా పాపాలను క్షమించిన దానవు నీవే. 'ఏవ' అనే పదాన్ని మూడు చోట్ల ఘటింపజేసి "త్వయైవ, త్వయి ఏవ, త్వమేవ"

అని నీచేతనే రక్షణభారాన్ని నీ యందే అప్పగించ గలిగిన వానిగా నన్ను చేసినది నీవే. అని దయాదేవి యే అన్నిటికి కారణమన్నారు. లోకోపకారిణియైన దేవి, లోకంలో ఒకడైన తనకూ సర్వదా సర్వవిధాలా ఉపకారం చేస్తున్నదనే తన శేషత్వ భావాన్ని ప్రకటించారు ఆచార్యులు.

నాథే నివేశయ వృషాద్రిపతౌ దయే! త్వం:- ఓ దయాదేవీ! శ్రీనివాసుని చేత బహు విధాలా ప్రపంచానికీ, నాకు కూడా యోగక్షేమాలు కలుగజేస్తూ, నా రక్షణ భారాన్నీ స్వీకరించిన నీవే నన్ను వృషాద్రిపతియైన లోకనాథుని యందు ప్రవేశపెట్టుము అని వేడుకొంటున్నారు. ఇది ఆత్మానుగుణమైన ప్రార్థన. జీవాత్మ పరమాత్మలకు గల నవ (9) విధ సంబంధాలలో భార్యా భర్తల సంబంధమూ ఉంది. సర్వభారాన్ని స్వీకరించినందుకు తగినట్లు దయాదేవియే, శ్రీనివాసుడు తనను నవోఢ యైన వధువుగా స్వీకరించేటట్లు చేయాలని ప్రార్థించారు దేశికులు. (పతౌ అనే పాఠమూ ఉంది). వృషాద్రిపతియైన శ్రీనివాసుడు దయాదేవికీ నాథుడు. లోకానికీ నాథుడు. దేశికులకు కూడా నాథుడే అగునట్లు చేయగల సామర్థ్యం దయాదేవికే ఉంది. కాబట్టి, మోక్షానందాన్ని పొందజేయగలదనే దృఢాధ్యవసాయంతో దయాదేవిని, స్వాభీష్టాన్ని వెల్లడిస్తు, ప్రార్థించారు.

మాలిని॥ జగదుపకృతులిమ్మై సర్వదా చేయునిన్నున్
దెగడు జడుని నన్నున్ దేవి! దీనున్ బ్రపన్నున్
దగ నిలుపుము నీ వే ధన్యునిం జేయగా శే
షగిరి రసికుడౌ మత్స్వామి సాన్నిధ్య మందున్ ॥

92. నైసర్గికేణ తరసా కరుణే! నియుక్తా
నిమ్నేతరేఽపి మయితే వితతిర్యది స్యాత్ ।
విస్మాపయే దృషగిరీశ్వర మప్యవార్యా
వేలాతిలంఘున దశేవ మహాంబురాశేః ॥

అర్థం:- హే కరుణే = ఓ దయాదేవీ! నైసర్గికేణ = స్వాభావికమైన; తరసా = వేగం చేత; నియుక్తా, (అత ఏవ) = ప్రేరేపింపబడింది కనుకనే; మహా +

అంబురాశేః = మహా సముద్రం యొక్క; వేలా+అతిలంఘన దశా+ఇవ = చెలియలి కట్టను అతిక్రమించే స్థితివలె; అవార్యా = అడ్డగించడానికి వీలుకానట్టి; తే = నీయొక్క; వితతిః = విస్తారమైన ప్రవాహం; నిమ్న+ఇతరే = పల్లానికంటే వేరైన మిట్టలాగా ఉన్న – నమ్రతలేని ఉన్నతుడనైన; మయి, అపి = నాయందు కూడా; స్యాత్, యది = ప్రసరించేటట్లయితే; వృషగిరీశ్వరమపి = శ్రీనివాస భగవంతుణ్ణి కూడా; విస్మాపయేత్ = ఆశ్చర్యపరుస్తుంది.

తా: ఓ కరుణాదేవీ! నీ స్వభావ సిద్ధమైన వేగం గల ప్రవాహం మిట్టనేలను కూడా ముంచి, మించి ప్రవహిస్తుంది, నీ ప్రవాహం ప్రపత్తి చేసి కూడా గర్వోన్నతుడనైన నన్నూ ముంచి ప్రవహించగలదు. చెలియలి కట్టను మించి పొంగి పోయే సముద్రం ఆపరానిది కదా! అట్లే, ప్రపన్నులను భరించే నీవేగాతిశయంతో వినయ మెరుగని గొప్ప అహంకారినైన నన్ను కూడా నీవు కరుణిస్తుంటే చూచే శ్రీనివాసుడు కూడా ఆశ్చర్యపడుతాడు.

వ్యాఖ్య:– దురభిమానులైన ప్రపన్నులు కూడా దయాపాత్రులవుతారని కవికేసరి ఆశయం.

మహాపరాధియైన తనను శ్రీనివాసుని పాద పద్మాలయందు చేర్చాలని గత శ్లోకంలో దేశికులు దయాదేవిని ప్రార్థించారు. దీన జనులను సంరక్షించే సంభ్రమం భగవద్దయా దేవికి స్వాభావికం అని ఈ శ్లోకం ప్రశంసిస్తున్నది.

నైసర్గికేణ తరసా కరుణే! నియుక్తా నిమ్నేతరేఽపి మయితే వితతిర్యదిస్యాత్:– మేలి గుణాలరాశియైన శ్రీనివాస దయావారాశి యొక్క స్వభావాన్ని తెల్పుతున్నది ఈ పూర్వార్ధం. నీరు వంతకే ప్రవహిస్తుంది. పల్లపు భూములు తడిసి పోతాయి. ఒకప్పుడు నీరు వేగంగా ప్రవహించడం నైసర్గికం. వేగంగల ప్రవాహం, మిట్టనేలను కూడా ముంచి వేసి విస్తారంగా ప్రవహిస్తుంది. అప్పుడు ఉన్నత స్థలం కూడా నీటి చేత తడుపబడుతుంది. దయాదేవిని ఒక్కసారి ప్రపత్తి చేసిన వ్యక్తి, వినయ విధేయతలు లేకుండా గర్వంతో విఱ్ఱవీగుతూ మహోన్నతుడనని భావిస్తున్నప్పటికీ, అతణ్ణి తన అనుగ్రహానికి పాత్రుని చేస్తుంది దయాదేవి.

(13వ శ్లోకంలో) మహోన్నతుడైన, వృషగిరినాథుడైన శ్రీనివాసుడు దయా ప్రవాహంలో మునిగిపోతుంటాడని వర్ణితం. దేశికులు ఇక్కడ, శ్రీనివాసుని కంటెను ఉన్నత స్థలంలో తాను ఉన్నట్లు భావిస్తున్నాడు. వాస్తవంగా తాను అకించనుడే. నమ్రుడే, శక్తిలేనివాడే. అయినా, సద్గుణసంపత్తి లేని గర్వంతో తనను తాను మహోన్నతుడనను కొంటున్నాడు. ఒకప్పుడు భగవానుడు దయతో 'త్వంమే' - నీవు నావాడవని అన్నాడు. కాని నేను తలబిరుసుతో 'అహంమే' - నాకు నేనే, నీవాడను కాను అన్నాను. (దేవజీవ సంవాదమిది)

'జితంతే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన"

ఓ పుండరీకాక్షా! నీచేత ఓడిపోయాను. ఓ విశ్వభావనా! నీకు ప్రణమిల్లు తున్నాను - అనవలసి యున్నవాడను. కాని, "ననమేయంతుకస్యచిత్" నేను మాత్రం ఎవ్వనికీ తలవంచను - అని అఖర్వగర్వంతో భగవంతుని కంటే ఉన్నతుడనని అహంకరించి యున్నానని దేశికులు భావిస్తున్నారు.

విస్మాపయేత్ వృషగిరీశ్వర మప్యవార్యా వేలా తిలంఘున దశేవ మహాంబురాశేః :- దయాదేవి స్వరూపం భగవంతుని కన్న చాలా గొప్పదని (శ్లోకం 61) వర్ణింప బడింది. ప్రళయ కాలమందు (చెలియలి కట్టదాటి) ఉద్ధృతంగా పొంగి గట్లను త్రెంచి తనలో కలుపుకొంటున్న సముద్ర వేగాన్ని అడ్డుకొన శక్యం కానట్లే దయా ప్రవాహవేగాన్ని ఆపే వీలుండదు. నీరు వంతకు పారుతుంది. కాని మిట్టకు పారి పర్వతశిఖరాలనే ముంచి వేస్తుంటే ఆపశక్యమా? అట్టి ప్రవాహవేగాన్ని చూచి ఆశ్చర్య పడని వారుంటారా?

అట్టి వేగంతో దయాదేవి ప్రవహించి మహోన్నతుడనైన నన్ను కూడా మించి తనలో ముంచి వేస్తుంది. అప్పుడు శ్రీనివాస భగవానుడు చాలా ఆశ్చర్యపడుతాడు అని దేశికుల ఆశయం.

'నాకు నేనే, నీవాడనుకాను' అన్నట్టి జీవుణ్ని సాధించదానికి ప్రయత్నించి విఫలుడైన భగవానుడు, ప్రపత్తిచేసిననూ, తర్వాత శమదమాది గుణసంపదలేని అహంకారంతో ఉన్నతుడైన వ్యక్తిని కూడా వాత్సల్యంతో వశపరచుకొన్న దయాదేవి

పట్ల తాను సాధించలేని దాన్ని సాధించింది కదా! అని అబ్బుర పడుతాడు, అన్నారు ఆచార్యులు. తన రక్షణ భారాన్ని స్వీకరించిన దయాదేవి తన దురభిమానాన్ని లెక్కించక అనుగ్రహిస్తుందనే దృఢా ధ్యవసాయం దేశికుల వారికి కలదని ప్రకటిస్తున్న శ్లోకమిది.

మాలిని॥ ఎడపక కరుణా నిమ్నేతరుండైన నాపై
గడలి పొరలి హద్దుల్ గ్రమ్ము చందంబుదోపన్
గడుకొని యడరంగా గాద్రి వేయాద్రి వర్యే
శుడు వెఱగున నిన్నున్ జూచి తామెచ్చు నాత్మన్ ॥

93. విజ్ఞాత శాసన గతిర్విపరీత వృత్త్యా
వృత్రాదిభిః పరిచితాం పదవీం భజామి ।
ఏవం విధే వృషగిరీశ దయే! మయిత్వం
దీనే విభోశ్శమయ దండధరత్వ లీలామ్ ॥

అర్థం:- వృషగిరీశ దయే = వృషాచలపతి యొక్క దయాదేవీ! విజ్ఞాత శాసనగతిః = తెలిసిన శాస్త్రగతి - దండన విధానం గల నేను; విపరీత వృత్త్యా = శాస్త్ర విరుద్ధమైన ప్రవర్తన చేత; వృత్ర+ఆదిభిః = వృత్రాసురుడు మొదలైన వారి చేత; పరిచితాం = నడువబడిన; పదవీం = మార్గాన్ని; భజామి = పొందుతున్నాను. ఏవం విధే = ఇట్టి దుష్ప్రవర్తనుడనైన; దీనే = దీనుడనైన; మయి = నాయందు; విభోః = ప్రభువైన శ్రీనివాసుని యొక్క; దండధరత్వలీలాం = దండించడమనే లీలను; త్వం = నీవు; శమయ = పోగొట్టుము.

తా: ఓ శ్రీనివాసుని దయాదేవీ! శాస్త్రార్థం తెలిసినవాడను, దండనీతి నెరిగినవాడను. అయినా, శాస్త్రవిరుద్ధంగా వృత్రాసురాదులు నడచిన దారిలోనే నడుస్తున్నాను. ఇట్టి పాపకృత్యాలచే దండనార్హుడనైన ఈ దీనుణ్ని శ్రీనివాస ప్రభువు దండించకుండా కాపాడుము.

వ్యాఖ్య:- అపరాధియైన తనను ప్రభువు దండించే ప్రవృత్తిని తొలగించుమని కవి కేసరి దయాదేవిని ప్రార్థిస్తున్న శ్లోకమిది.

ప్రపన్నుల మీద భగవత్కృపకు గల స్వభావం తెల్పబడింది. ప్రపన్నులైన దేశికులు తమ స్వభావాన్ని ఈ శ్లోకమందు వివరిస్తున్నారు. ఈ దశకంలో సత్పదవి యందు సహాయపడే దయాదేవి ప్రవృత్తి ప్రదర్శింప బడుతుంది. ఈ శ్లోకం విపరీత పదవిని తెల్పుతూ, దానికి తగిన దుష్ఫలితాన్నీ వివరిస్తున్నది.

విజ్ఞాతశాసనగతిః:– 'శాసన' శబ్దం శాస్త్రాన్నీ, దండననూ బోధిస్తుంది. "శాసనాత్, శాస్త్రం". శాస్త్రం విధి నిషేధాలనూ శాస్త్రం చేత బోధింపబడే ధర్మ ప్రవర్తనకు తగిన సత్ఫలాన్నీ, అధర్మ ప్రవర్తనచే అనుభవింపదగిన దుష్ఫలితాన్నీ తెల్పుతుంది. ధర్మాధర్మ వివేకం కలిగిన వాడను. సర్వశాస్త్రార్థ తాత్పర్యం తెలిసిన వాడను అంటున్నారు దేశికులు.

విపరీత వృత్త్యా వృత్రాదిభిః పరిచితాం పదవీంభజామి:– కార్యాకార్య వివేకం కల్గియున్నప్పటికీ, వాసనా రేణుకుంఠితుడనై పాపాలనే ఆచరిస్తున్నాను. ప్రపన్నుడ నైననూ నేను "నిందితాచార కరణం నివృత్తం కృత్యకర్మణః" చేయవలసిన పనులను చేయక, చేయరాని పనులనే మళ్ళీ మళ్ళీ చేస్తున్నాను. "మహాజనో యేన గతః సపంథాః" – అన్నట్లు పెద్దలు నడిచిన త్రోవలో నడువడం మంచిదని నాకు తెలుసు. తెలిసికూడా విధివశాన, పాపాచార పరాయణులైన వృత్రాసురుడు, హిరణ్య కశిపుడు, రావణుడు, శిశుపాలుడు నడచిన చెడ్డ దారిలోనే నడుస్తున్నాను. వారు భగవద్ద్రోహులనీ, లోక కంటకులనీ తెలిసినా, వారు అవలంబించిన మార్గమందు నడిచే రుచి అధికమైన స్వభావం కల్గినవాడనయ్యాను.

వృత్రాసురుడు:– విశ్వరూపుని సంహరించిన ఇంద్రుణ్ని చంపడానికి త్వష్టృ ప్రజా పతిచే హోమకుండం నుంచి ఉద్భవించిన వాడు వృత్రాసురుడు, పెక్కేండ్లు తపస్సు చేసి బ్రహ్మదేవుని చేత యుద్ధమందు తరుగని శక్తిని ఆర్జించాడు. యుద్ధంలో వజ్రాయుధపు దెబ్బకు కూడా చలించక నిల్చాడు. సనత్కుమారుని చేత విష్ణు మాహాత్మ్యాన్ని తెలుసుకొన్న వాడే అయినా, ధర్మాన్ని తప్పి లోకకంటకుడై ప్రవర్తించి నందువల్ల భగవద్దయ ఇంద్రుని ద్వారా వృత్రాసురుణ్ని హతమార్చింది.

హిరణ్యకశిపుడు:– సనకసనందనులచే శపింపబడి క్రూరుడైన రాక్షసాధిపతిగా జన్మించిన వాడు హిరణ్యకశిపుడు. కఠోర తపస్సు చేసి బ్రహ్మ చేత పంచభూతాలు

కానీ, ప్రకృతిలోని చరాచర వస్తువులలో ఏ ఒక్క శక్తిగానీ తనను చంపకుండా వరాలను పొంది విష్ణుద్వేషి అయ్యాడు. శ్రీహరి నీలోన, నాలోన అంతట ఉన్నాడని కన్నకుమారుడైన ప్రహ్లాదుడు చెప్పినా వినకుండా, ఆ బాలుణ్ని క్రూరంగా హింసించాడు. భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదుని మాటను సత్యం చేయడానికి, బ్రహ్మ వరాలనూ కాపాడుతూనే, స్తంభంలో నుంచి ఉద్భవించిన నరసింహమూర్తిచే హిరణ్యకశిపుడు హతుడయ్యాడు.

రావణుడు:- శాపగ్రస్తుడై విశ్రవసునికి పుత్రునిగా జన్మించాడు రావణుడు. అపార విద్యాపారంగతుడు. శివభక్తుడు. లంకాధిపతి. మహాగర్వోన్మత్తుడు. సీతమ్మను శ్రీరామలక్ష్మణులు దగ్గరలేని సమయాన అపహరించి తెచ్చి తన అశోకవనంలో బంధించి యుంచాడు. పాపాత్ముడవైన నీవు శ్రీరామునితో స్నేహం చేస్తే బతికి పోతావు. లేకుంటే ఘోరమైన వధను కోరి పొందినవాడవవుతావు. ఇక్కడ నీకు బుద్ధి చెప్పే వారున్నారో లేదో!

"ఇహ సంతోనవాసంతి సతోవా నా నువర్తసే ।
తథాహి విపరీతా తే బుద్ధిరాచార వర్జితా ॥"

సత్పురుషులున్నా, వారి మాటను నీవు పాటించడం లేదు. సత్ప్రవర్తన లేని నీ బుద్ధి విపరీతమైనదే కదా! అని సీతమ్మ బుద్ధి చెప్పినా విననందువల్ల చివరకు రామరావణ యుద్ధంలో దశకంఠుని కంఠదశకంలుంఠితమయింది.

శిశుపాలుడు:- శ్రీకృష్ణుని విరోధియైన బంధువు. తన చావు కృష్ణుని వల్లనే కలుగుననీ, ఒక వంద తప్పులను మాత్రమే క్షమిస్తాడనీ శిశుపాలునికి తెలుసు.

శిశుపాలుడు శివునిలాగా మూడుకన్నులతో, విష్ణువు లాగా నాలుగు చేతులతో పుట్టిన బలశాలి. శ్రీకృష్ణుడు శిశువుగా ఉన్న శిశుపాలుణ్ని స్పృశించిన వెంటనే ఎక్కువగా ఉన్న కన్ను, రెండు చేతులు కనబడకుండా పోయాయి. పెరిగిన కొలది శిశుపాలుడు శ్రీకృష్ణునిపై వైరాన్ని పెంచుకొని, కన్నుమిన్ను గానక నూటికి మించి దూషించగా, శ్రీకృష్ణ భగవానుడు దయతో చక్రం చేత శిశుపాలుని శిరస్సుని ఛేదించి తరింపజేశాడు.

ఏవం విధే మయి త్వం దీనే విభోః దండధరత్వలీలాంశమయ:- వృత్రాసురా దులలాగా మహాపరాధిని నేను. ఇంత గొప్ప అపరాధాలకు తగిన దండన ఎట్లుండునో అది కూడా నాకు తెలుసు. తెలిసి కూడా శాసనోల్లంఘన చేసిన పాపాత్ముడను. కాబట్టి, ఓ దయాదేవీ! నిన్ను శరణువేడుకొంటున్న దీనుడను. నీకు తప్ప దీనులను రక్షించే శక్తి ఎవరికీ లేదమ్మా! తల్లీ! పండిన నా పాపాలకు ప్రభువు తగిన దండన విధింపనున్నాడు. నేరాలకు తగినట్లు శిక్షించడానికి సాధనమైన దండాన్ని ప్రభువు ధరించడం ఆయనకు లీలయే కదా! దండధరత్వ లీల జగద్వ్యాపారమే. తెలిసిచేసిన దోషాలకు కఠినశిక్ష విధింపబడునని శాస్త్రాలు చెబుతున్నాయి. మహాపరాధియైన నా మీద ప్రభువుకు కోపం ఎక్కువగా ఉంటుంది. అధికదండనను నాకు విధించబోయే శ్రీనివాస ప్రభువు యొక్క దండధరత్వ లీలను తొలగించుమని ప్రార్థిస్తున్నాను. భగవంతుడు అపరాధులను దండింపకుండా చేయడం దయాదేవికే సాధ్యం అని, పాపిష్ఠులమైన మనకు హితాన్ని సూచిస్తూ, మనం కూడా అపరాధాలు చేసిన దీనులను కాపాడే భగవానుని దయకు పాత్రులం కావాలని మనకోసం తామే ప్రార్థన చేసి చూపించారు. ఇది ఉత్తములైన ఆచార్యుల లక్షణం.

మాలిని॥ అనయనయవిదుండై యర్థి వృత్రాదులట్లే
యనయము విపరీతంబైన మార్గంబె కొందున్ ।
జనని! వృషభ భూభృత్స్వామి దండంపు లీలల్
నను దనుకని భంగిన్ నర్మిలిన్ బ్రోవరాదే ॥

94. మాసాహసోక్తి ఘనకంచుక వంచితాన్యః
పశ్యత్సు తేషు విదధా మ్యతిసాహసాని ।
పద్మాసహాయ కరుణే! నరుణత్సికిం త్వం
ఘోరం కుళింగశకు నేరివ చేష్టితం మే ॥

అర్థం- హే పద్మా సహాయకరుణే = శ్రీనివాసుని దయాదేవీ! మా సాహసోక్తి ఘన కంచుక వంచితాన్యః; మాసాహస = సాహసం చేయకుము; ఉక్తి = (అని, ఉపదేశించే) మాట అనే; ఘన = దృఢమైన; కంచుక = కవచం (ధరించడం)

చేత; వంచిత = మోసగించబడిన; అన్యః = పరులు గల్గిన నేను; తేషు = ఆవంచిత జనులు; పశ్యత్సు = చూస్తుండగనే; అతిసాహసాని = మిక్కిలి సాహసమైన అకృత్యాలను; విదధామి = చేస్తున్నాను. కులింగ శకునేః, ఇవ = కళింగ పక్షియొక్క వలె; ఘోరం = దారుణమైన; మే = నా యొక్క; చేష్టితం = కృత్యాన్ని; త్వం = నీవు; కిం న రుణత్సి = ఎందుకు అడ్డగించక ఉన్నావు.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! నేను 'సాహసమైన పనులు చేయకండి' అని ఇతరులకు ఉపదేశించే ఆచార్యుడను. ఆ ఉపదేశవాక్యమే ఒక దృఢమైన కవచం. దాన్ని ధరించడం వల్ల ఉత్తమ ఆచార్యుడనని జనులు నమ్ముతున్నారు. ఉపదేశాన్ని పొందిన జనులు చూస్తుండగానే నేను ఉపదేశించిన మాటకు విరుద్ధంగా, అనేక సాహస కృత్యాలను చేస్తూ ఇతరులను వంచిస్తున్నాను. ఇలాగా నేను చేసే పని కుళింగ పక్షి చేసే పనివలె ఉన్నది కదా! ఇట్టి దారుణమైన నా కృత్యాన్ని నీవు ఎందుకు మార్పించలేదు? అని కవి ఆర్తితో ప్రశ్నిస్తున్నాడు.

వ్యాఖ్య: పాపాచరణ ప్రవృత్తిని కలిగించక రక్షింపుమని దయను వేడుకొంటున్న శ్లోకం.

గత శ్లోకంలో కన్న తన స్వభావ ప్రకటనతో ఒక అడుగు ముందుకు వేశాడు కవి. ప్రపత్తి చేసిన తర్వాతనూ బుద్ధిపూర్వక అపరాధాలను చేస్తున్నాను. ఆ యపరాధాలకు విధించే ప్రభువు యొక్క దండనోద్యోగాన్ని శమింప జేయుమని పూర్వ శ్లోకంలో ప్రార్థించారు. తనను నమ్మిన వారిని కూడా ఆచార్య వేషాన్ని ధరించి వంచిస్తున్న వంచకుడను. 'మంచి దారిలో నడవండి' అని ఉపదేశిస్తున్న నేను మాత్రం ఉపదిష్టజనుల యెదుటనే పెడదారిలో నడుస్తున్నాను అన్నారు. నిజంగా ఉల్లిగడ్డను తినగూడదని చెప్పిన గురువే తన యింట్లో భోజనం చేస్తున్నప్పుడు పులుసులో ఉల్లిపాయలు లేవని అర్ధాంగిని గద్దించినట్లున్న లోకంలోని ఆచార్యుల ప్రవృత్తిలా ఉందని పశ్చాత్తాపపడుతున్నారు దేశికులు. కాబట్టి, ఇట్టి అపరాధాలకు కారణమైన ఘోర పాప ప్రవృత్తిని తల్లియైన దయాదేవియే మాన్పించి, రక్షించాలని సుశ్లోకితం.

మాసాహసోక్తి ఘనకంచుక వంచితాన్యః:- 'మాసాహసోక్తి' అంటే 'శాస్త్రోల్లంఘనం చేసి అపరాధాలను చేయకండి' అనే ఉపదేశ వాక్యం. ఇట్టి నీతిని బోధించడానికే క్రూరమృగమైన పులి, సాధువైన ఆవు తోలును కప్పుకొని లోకాన్ని మోసపుచ్చే రీతిగా, తాము ఘనకంచుకాన్ని - ఆచార్య వేషాన్ని ధరించి ఇతరులను వంచిస్తున్న దుశ్శీలుడనని విన్నవించుకొంటున్నారు దేశికులు.

పశ్యత్సు తేషు విదధామ్యతి సాహసాని:- ఉపదిష్టులైన వారు సాక్షులుగా అతి క్రూరమైన పాపాలను చేస్తున్నానన్నారు. సాహసం అంటే శాస్త్ర విధిని మీరి ప్రవర్తించడమందే రుచి ఎక్కువగా ఉంది. ఉపదేశించేది ఒకటైతే దానికి విరుద్ధంగా మరొకటి చేయడమవుతున్నది. మాటకు చేష్టకు పొంతన లేని ప్రమాదకరమైన సాహసం చేస్తున్నానని అంగీకరిస్తున్నారు దేశికులు.

ఘోరం కుళింగశకునేరివ చేష్టితంమే :- తాను చేస్తున్న సాహస కృత్యం కుళింగమనే పక్షి చేసే సాహస కార్యంలాగా ఉందని, తనను కుళింగ పక్షితో పోల్చు కొన్నారు దేశికులు. కుళింగ పక్షి కూతలో 'సాహసం చేయకండి. ఆపదలో పడకండి' అనే ఉపదేశం ధ్వనిస్తుంది. ఈ హితవాక్యాన్ని గ్రహించిన జనులు ఇది ఎంత శ్రేయస్కరమైన పక్షి! దాని ధర్మనిరతని, వివేకాన్ని, సాధుశీలతను స్వీకరించి అవశ్యంగా ఆచరించాలి' అని భ్రమించి, తన మీద వారు గురుత్వాన్ని పెంచుకొనే విధంగా చేస్తుంది. కాని ఆ పక్షి, సింహం నిద్రిస్తున్నప్పుడు ఆవలించగానే హఠాత్తుగా దాని నోటిలోకి దూరి దాని దంతాల నడుమ చిక్కుకొన్న మాంసపు ముక్కలను ముక్కుతో పొడిచి, అది నోరు మూసుకొనే లోపలనే, బయటకు తీసుకొని వచ్చి తినే స్వభావం కలది. వాస్తవంగా కుళింగ పక్షిదిఎంత సాహసం! ఇంత గొప్ప సాహసం చేసే పక్షి పరులకు 'సాహసం చేయకండి' అని సర్వదా ఉపదేశం చేస్తుండడం విడ్డూరం కదా! ఆ పక్షి కూతకూ, దాని చేతకూ ఏ మాత్రం పోలిక, పొంతనలేనే లేదు కదా! అట్టి కుళింగ పక్షి యొక్క ప్రవర్తన లాంటి ప్రవర్తన తమకున్నదని దేశికులు తమ స్వభావాన్ని ప్రకటించారు.

"కుళింగ శకుని ర్నామ పార్శ్వే హిమవతః పరే।
భీష్మ! తస్యసదావాచః శ్రూయంతేఽర్థవిగర్హితాః॥

మా సాహస మితీదం స సతతం వాశతే కిల ।
నగాధాగాధినం శాస్తి బహు చేదపిగాయతి ।
ప్రకృతిం యాంతి భూతాని కుళింగ శకుని ర్యథా ॥
కుళింగ శకుని ర్నామ హరే ర్దారిత దంతినః ।
ముఖాదామిష మాదత్తే వదన్ మా సాహసం కురు॥" (మహా భారతం)

కుళింగ పక్షి హిమవన్నగ ప్రాంతమందు ఉంటుంది. ఓ భీష్ముడా! దాని కూతలు అర్థరహితంగా ఉంటాయి. సాహసం చేయకు మని ఎల్లప్పుడూ కూస్తుంటుంది. సాహసం చేయవద్దని హితాన్ని చెబుతూనే, నిద్రించినప్పుడు ఆవలించే సింహం నోటిలోకి తాను చొచ్చి దాని కోరల మధ్య ఇరుక్కొన్న మాంసఖండాలను ముక్కుతో పొడిచి తెచ్చుకొనే స్వభావం కలది. తాను చెప్పే హితమైన మాటను తానే చేయలేని పక్షి అది. అట్టి కుళింగ పక్షిలాంటి స్వభావం కలవారు లోకంలో ఎందరో ఉన్నారు" అని శిశుపాలుడు రాజసూయ యాగంలో భీష్మాచార్యులను కుళింగ పక్షితో పోల్చి నిందించాడు.

పద్మాసహాయ కరుణే! నరుణత్సికిం త్వమ్:- ఓ శ్రీనివాస దయాదేవీ! అని సంబోధన పదమిది. ఓ దయాదేవీ! నీవు అసహాయురాలవు కాదమ్మా! పద్మాదేవి నీకు సహాయురాలే కదా! తల్లీ!

"ధర్మోపదేశ సమయే జనాస్సర్వేఽపి పండితాః ।
తదనుష్ఠాన సమయే మున యోఽపి న పండితాః ॥"

"నీతిని బోధించే వేళలో జనులందఱు మహాజ్ఞాన వంతులుగా బోధిస్తుంటారు. తాము బోధించిన రీతిగ ఆచరించడం మునులకు కూడా సాధ్యం కాదు" అన్నట్లే, తల్లీ! నేను చేయరాని పనులనే చేస్తున్నాను.

అకృత్యాన్ని ఆచరించే నా ప్రవృత్తిని నీవెందుకు మాన్పక ఉపేక్షిస్తున్నావు? తల్లి కొడుకు యొక్క దుష్ప్రవృత్తిని దూరం చేయాలి కదా! "ఒక బాలుడు బాల్యం లోనే తోటకూరను దొంగిలించి తేస్తే, ఎక్కడి నుంచి, ఎలా తెచ్చావు? అని అడుగ కుండా, తల్లి కూర వండి కమ్మగా తినిపించిందట. బాలునికి వయస్సుతో పాటు

దొంగబుద్ధి కూడా పెరిగింది. ఆ యువకుడు నగల దుకాణంలో బంగారు నగను దొంగిలించి రాజభటులకు దొరికిపోయాడు. భటులు కాలు సేతులకు సంకెళ్ళు వేసి తీసుకొని పోతున్న కొడుకును చూచి, తల్లి తన తలనూ, రొమ్మునూ బాదుకొంటూ ఏడ్వసాగింది. అమ్మా! నేను తోటకూరను దొంగిలించి తెచ్చిన నాడే నన్ను నీవు దండించి ఉన్నట్లైతే నీకు దుఃఖం కలిగించిన వాడను కాకపోయే వాణ్ని కదా! చేసిన నేరానికి శిక్షను అనుభవించక తప్పదు. కాబట్టి, నీవు ఏడ్వకు తల్లీ! అంటూ, పోయి చెరసాలలో చేరాడట!" అని లోకం చెప్పుకొంటున్న కథను నాకు వర్తించే లాగా చేయకమ్మా!

ప్రపత్తిని అనుష్ఠించిన తర్వాత శాస్త్రానికి ప్రతికూలంగా ప్రవర్తించరాదు. ప్రాతికూల్య వర్జనమే ప్రధానమైనది. పరులకు ఉపదేశం చేసి ఉత్తమ దేశికులు అని నమ్మించి, వారు చూస్తుండగనే శాస్త్రాతిలంఘన క్రియలను కుళింగ పక్షి లాగా సాహసించి నేను చేస్తుంటే, నన్ను నీవు వారింపక చూస్తున్నావు కదా తల్లీ! దీనుడను. ఇట్టి సాహస ప్రవృత్తి నుంచి నాకు నివృత్తిని కలిగించడం తల్లివైన నీకే తగునమ్మా! నా దుష్ప్రవృత్తులను మాన్పి నన్ను సత్పథాచారనిరతునిగా చేసి కాపాడుమని దేశికులు దయాదేవిని వేడుకొంటున్నారీ శ్లోకంలో. "కుళింగ శకుని విరుత్తాంత వైదేశికన్ ఆచార్యన్" కుళింగ పక్షి యొక్క ప్రవర్తనకు చాలా దూరంగా ఉండేవాడు ఆచార్యుడు - అన్నారొకచోట దేశికులు.

ఈ విషయం ఆచార్య పీఠస్థులందఱికీ అనువర్తిస్తుంది కదా!

మాలిని॥ జనులకు ననుకంపా! సాహసం బొప్పదంచున్
దనర బల్కి నే నత్యంత ఘోరంపు చేష్టల్
జనులు గనుగొనంగా సల్పుదున్ నన్ కుళింగం
బును నెనయు దురాత్మున్ బోలవారింపవేలా? ॥

95. విక్షేప మర్హసిదయే! విపలాయితేఽపి
వ్యాజం విభావ్య వృషశైలపతే ర్విహారమ్ ।
స్వాధీన సత్త్వ సరణిః స్వయ మత్ర జంతౌ
ద్రాఘీయసీ దృఢతరా గుణవాగురా త్వమ్ ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! స్వాధీన సత్వ సరణిః = తనకు అధీనమైన సత్త్వగుణం యొక్క / జింక మొదలైన జంతువుల యొక్క మార్గం కలిగినట్టి; ద్రాఘీయసీ = చాలా దీర్ఘమైనట్టి; దృఢతరా = మిక్కిలి గట్టిదైన; గుణ వాగురా = కల్యాణ గుణ రూపమై/దారాలచే నిర్మితమై, వల లాగా ఉన్న; త్వం = నీవు; వి పలా యితే, అపి = కడు దూరం పరుగెత్తి పోయినప్పటికీ; అత్ర జంతౌ = ఈ జంతువునందు/నాయందు; వృషశైలపతేః = శ్రీనివాసుని యొక్క విహారం = లీల/వేటను; వ్యాజం = నెపంగా; విభావ్య = కల్పించుకొని; స్వయం = స్వయంగానే, విక్షేపం = వ్యాపించడానికి / ఎగిరి పట్టుకోవడానికి; అర్హసి = తగియున్నావు.

తా: ఓ దయాదేవీ! స్వాధీనమైన జంతువుల ప్రవర్తన కలిగినట్టి, గట్టిగా నిర్మింపబడినట్టి, దూర జంతువులను పట్టగల వలలాగా ఉన్న నీవు, దూరంగా పరుగెత్తే జంతువును బోలిన నన్ను, సంసరజ్జంతు సముదాయాన్ని పట్టడానికి వేంకటాద్రి మీద, వేంచేసిన శ్రీనివాసునికి అప్పగించడానికి నా మీద ప్రసరించి పట్టుకోవడానికి యోగ్యురాలవు.

వ్యాఖ్య:- గుణవాగురయైన దయాదేవి జంతువైన తనను పట్టుకొని శ్రీనివాసుడనే వేటగానికి అప్పగించుమని ప్రార్థిస్తున్న శ్లోకం.

సాహస కృత్యాన్ని నిరోధించుమని స్తుతించిన తర్వాత అలా నిరోధించడానికి ఉపాయం గుణవాగురయే అని సుశ్లోకిస్తున్నది.

స్వాధీన సత్వసరణిః:- దయాదేవి తనకు ఆధీనమైన సత్వగుణ ప్రవృత్తి కలది.

"సాత్త్వికఃసతు విజ్ఞేయః సవైమోక్షార్థ చింతకః" భగవద్దయ వల్ల జీవులకు సత్త్వోన్మేషం కలుగుతుంది.

ప్రపత్తించనివృత్తించ కార్యాకార్యే భయాభయే ।
బంధం మోక్షం చయా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికే॥ (భ.గీ. 18-30)

ప్రవృత్తి, నివృత్తి మార్గాలను, కర్తవ్యా కర్తవ్యాలను; భయాన్నీ, అభయాన్నీ; బంధ మోక్షాలను యథార్థంగా తెలుసుకొనే బుద్ధిని సాత్త్విక బుద్ధి అంటారు. అట్టి

బుద్ధి, ప్రత్యేకంగా దయాదేవి అనుగ్రహం, కలవానికే సాత్త్వికుడని పేరు. ఇట్టి సత్త్వ గుణ ప్రవర్తన తన ఆధీనంలో కలది దయాదేవి అని స్పష్టం.

సత్త్వమంటే జంతువు; 'సరణిః' అంటే దారి, త్రోవ అని అర్థం. వాగురాపక్షమైన అర్థమిది. అడవిలో జింకలు-మృగాలు తిరిగే త్రోవలోనే గమనించేది - పయనించేది 'వాగుర-వల' అని అర్థం. విషయమనే అరణ్యంలో సత్త్వగుణమే మాత్రంలేని సత్త్వం-మృగం లాంటి తాను ఎక్కడెక్కడ సంచరించునో దయాదేవికి బాగుగా తెలుస్తుందని దేశికులు నైచ్యానుసంధానం చేస్తున్నారు.

ద్రాఘీయసీ:- మిక్కిలి దీర్ఘమైనది దయాదేవి. ఎంత దూరమైనా వ్యాపించే గుణం కలది దయాదేవి.

వాగురాపక్షమైన అర్థం:- మృగాలెంత దూరం పరుగెత్తినా వాటిని పట్టుకో దగినంత పొడవైనది వల.

పాపాత్ముడై భగవద్దయకు పాత్రుడు కాక దూరంగా పరుగెత్తు తున్నప్పటికీ, దయాదేవి అతని పై దీర్ఘంగా వ్యాపింప జేసే కటాక్షం కలదని భావం.

దృఢతరా:- చాలా గట్టిది. దయాదేవి ఒక్కసారి గ్రహించిన ప్రాణిని ఎప్పుడు విడిపోకుండా ఉంచుకొనేటంత దృఢమైనది.

చిక్కిన వస్తువును - జంతువును తన నుంచి జారి - పారిపోకుండా ఉండేటంత గట్టిది వల.

గుణవాగురా:- తనకు లోబడిన ప్రాణులను త్యజించ కుండా ఉండే వల లాంటిది దయ. దయాదేవి పరహిత ప్రావణ్యమనే గుణం రూపంగా కలది.

గుణం అంటే దారం లేదా త్రాడు. త్రాళ్ళచే నిర్మింపబడినది వాగురా అంటే వల. దయాగుణమే వల.

దయే:- పిల్లలకు ఎట్టి ఆపద కల్గకుండా వాత్సల్యంతో కాపాడుకొనే తల్లిలాంటి ఓ దయాదేవీ! అని సంబోధన.

త్వం విపలాయితే ఉ ప్యత్ర జంతౌ:- ఇక్కడ దేశికులు తనను ఒక మృగంగా (నైచ్యాను సంధానంతో) భావించు కొన్నారు. తాను ఆనుకూల్యాన్ని ఏ మాత్రం పాటించకుండా, ప్రాతికూల్యాన్నే అధికంగా పాటిస్తున్న కారణంగా భగవత్కృపకు తగని వాడై దూరంగా పరుగెత్తి పోతున్న జంతువే; అయినప్పటికీ పలాయనం చేస్తున్న జంతువును కూడా బంధించేది వల. కాబట్టి వలకు 'మృగబంధిని' అని పేరున్నది.

వృషశైలపతే ర్విహారం వ్యాజం విభావ్య స్వయం విక్షేప మర్హసి:- శ్రియః పతి వైకుంఠం నుంచి చేతనులను ఆకర్షించడానికి వృషాద్రి మీద వెలసి యుండడాన్ని ఆయన లీలగానే భావిస్తాం. భావించాలి కూడా. ఈ లీల ఒక వ్యాజమే.

శైలవాసులు సాధారణంగా వేటగాండ్రే అయి ఉంటారు. శైలాధిపతి యైన రాజుగారికి వేటాడడమందు రుచి, రాసిక్య మధికంగా ఉంటుంది.

"మిథ్యా హి వ్యసనం వదంతి మృగయా మీ దృగ్వినోదః కుతః" వేటను వ్యసన మంటారు. కాని, వేట శ్రేష్ఠమైన వినోదమని కవిసార్వభౌముని సూక్తి.

శ్రీనివాసుడే కొండలరాయడు. గొప్పవేటకాడు. ఆయన మహిషి యైన దయాదేవి మృగయావిహార వ్యాజాన్ని కల్పించింది. ఆయన చేతిలోని వలగా ఉన్నది దయాదేవి.

"లోక వత్తు లీలా కైవల్యమ్" అని బ్రహ్మసూత్రాలలో ఒక సూత్రమున్నది. దయతో కూడుకొన్న భగవానుని క్రీడా పరమైన వైచిత్రి ఈ శ్లోకంలో కల్పింపబడింది. విషయారణ్యంలో మృగాలను పట్టుకోవడం వేటగానికి వినోదక్రీడగా ఉంటుంది. మృగాలకు ప్రాణసంకటమే కదా! కాబట్టి మృగాలు దూరంగా పరుగెత్తు తుంటాయి.

విక్షేపం అంటే బాణం వేయడం, వల విసరడమనే అర్థం. పరార్థం అంటే జంతువుల హితం కోసమే భగవల్లీల - వేట - దయాదేవి చేత కల్పించబడింది. దయాదేవి కాబట్టి, ఈ వేటలో జంతువుల మీద శర విక్షేపం-బాణం వేయడం ఉండదు. కేవలం దయా విక్షేపమే. మృగాలు ఎంత దూరం పరుగెత్తినా, అంత దూరం కంటెనూ ఎంతో పొడవైన వలను వేటగాడు విసరివేసి బంధిస్తాడు. చిక్కిన జంతువులు ఆ బంధాన్ని వాడియైన గోళ్ళతోనో, దంతాలతోనో తెంచుకొని, తప్పించు

కొని పోజాలనంత గట్టి త్రాళ్ళతో నిర్మింపబడిన వల చాలా దృఢమైనది. అట్టి వలలో చిక్కిన జంతువు(ల)ను తెచ్చి, తన భవనమందుంచుకొని, ప్రియమైన, హితమైన కార్యాలను చేసి, ఆ ప్రాణుల చేత కలిగే ఆనందాన్ని తన వల్లభునితో కూడా కలిసి అనుభవించాలనే దీర్ఘమైన వాంఛ కలది దయాదేవి. కాబట్టి,

స్వయం విక్షేప మర్హసి:- జంతువు చేసిన అపరాధాలను లెక్కించక నీవే స్వయంగా, వేటగాని చేతి వలను పరుగెత్తే మృగాన్ని పట్టుకోవడానికి విసరివేయ దగిన అర్హత కల దానవు అని దయాదేవిని వినుతించారు దేశికులు.

ఈ వేటలో జంతువులకు చావులేదని, దయాదేవియే స్వాధీనం చేసుకొన్నందు వల్ల మళ్ళీ పాప కర్మలను చేసే ప్రసక్తి యుండదని, సత్వగుణం, సాత్విక జ్ఞానం కలుగుననే ఉపాయాన్ని విన్నవించుకొన్నారు దేశికులు.

దయాదేవియే వల కాబట్టి, ఓ దయాదేవీ! నీవు స్వాధీనం చేసుకొన్న నన్ను నీ వల్లభుని పాదారవిందాల యందు "నాథేనివేశయ వృషాద్రిఫతేర్దయే! త్వమ్" అన్నట్లు (శ్లోకం 91) సమర్పించుమని ప్రార్థించారు.

సత్పదవిని పొందదానికి సహాయపడవలసినదనే కదా ఈ దశమ దశకంలో దేశికులు స్వాభీష్టాన్ని ప్రకటించి యున్నారు.

మాలిని॥ కరము దృఢము దీర్ఘగ్రాహియున్ వశ్య సత్వ
స్థిర సరణియునై విక్షేప మొప్పన్ వృషాద్రీ
శ్వర మృగయునకియ్యన్ వాగురన్ బోలునీకున్
పరుగిడు నను జంతున్ బట్టగారాదె దేవీ ॥

96. సంతన్యమాన మపరాధగణం విచింత్య
త్రస్యామి హంత భవతీం చ విభావయామి ।
అహ్నాయ మే వృషగిరీశ దయే । జహీమా
మాశీవిషగ్రహణ కేళి నిభా మవస్థాం ॥

అర్థం:- హే వృష గిరీశదయే = ఓ శ్రీనివాస దయాదేవీ! సంతన్యమానం = ఎడతెగకుండా చేయబడుతున్న; అపరాధ గణం = అపరాధాల సమూహాన్ని;

విచింత్య = తలచి; త్రస్యామి = భయపడుతున్నాను. భవతీం, చ = నిన్ను కూడా; అహ్నాయ = శీఘ్రంగా; వెంటనే; విభావయామి = స్మరిస్తున్నాను. హంత = ఆశ్చర్యం! ఆశీవిష గ్రహణకేళి నిభాం = సర్పాన్ని బట్టి ఆటాడడంతో సమానమైన; మే = నాయొక్క; ఇమాం = ఈ; అవస్థాం = దశను; అహ్నాయ = త్వరగా; జహి = నశింపజేయుము.

తా: ఓ వేంకటేశ్వరుని దయాదేవీ! అవిచ్ఛిన్నంగా అపరాధాలను చేస్తూ, దండన విషయాన్ని తలచి, నేను భయపడుతున్నాను. వెంటనే నిన్ను స్మరించి భయ నివృత్తిని పొంది తేరుకొంటున్నాను. ఇలాగా భయం, అభయం రెండు కూడా వరుసగా మారుతుండడం ఆశ్చర్యమే. పాముతో ఆటలాడే రీతిగా ఉన్న నా ఈ దురవస్థను శీఘ్రంగా పోగొట్టుము.

వ్యాఖ్య:- ప్రపత్త్యుత్తరకాల మందు అపరాధాలను చేసే దుర్దశను తొలగించు మని ప్రార్థించే శ్లోకమిది.

దయాదేవియే జీవులను పట్టుకొని తన అధీనం చేసుకొంటే ఇక పాపాలను చేసే ప్రసక్తి ఉండదన్నారు. స్వయంగా పాపాలను చేసి దండన నుంచి తప్పించు కోవడం సాధ్యపడదు. పాపాలను చేసే రుచిని - ప్రవృత్తినే దయాదేవి నిరోధించాలని ప్రార్థిస్తున్నారు.

సంతన్యమాన మపరాధగణం విచింత్య త్రస్యామి:- ప్రపత్తిని అనుష్ఠించిన తర్వాత కూడా చేసే అపరాధాలకు లెక్కలేదు. ఆ యపరాధాలకు తగిన దండన క్రూరంగానే ఉంటుంది. ఈ విధంగా నిత్యం మనోవాక్కాయాలచే ఎడతెరపి లేకుండా చేయబడే అపరాధాల సమూహాలను తలచుకొన్నంతనే గజగజ వణకుతున్నాను. భయపడుతున్నాను అన్నారు.

అహ్నాయ భవతీం చ విభావయామి:- అపరాధాలనన్నిటినీ సహించే స్వభావమున్న నిన్ను వెంటనే తలచుకొంటున్నాను కూడ. భయపడిన తోడనే నిన్ను స్మరించి నంత మాత్రాన సంతోషం కలుగుతుంది. భయం తొలగిపోతుంది. భయం నుంచి తేరుకొని హర్షిస్తున్నాను అన్నారు. పాప నివర్తకంగా పునఃప్రపత్తి చేసినందు వల్ల భయం తొలగి సంతోషిస్తున్నానని భావం.

హంత:- ఆశ్చర్యం. నేను చేసిన దాన్ని తలచుకొంటే భయమూ, ఖేదమూ కలుగుతున్నది. దయాదేవీ! నిన్ను స్మరించిన వెంటనే అభయమూ, హర్షమూ కలుగుతున్నది. క్షణకాలంలో పర్యాయంగా భయాభయాలు, ఖేద హర్షాలు కలుగడం ఆశ్చర్యమే. అడుసు త్రొక్కడ మెందుకు? కాలు కడగడమెందుకు?

తప్పుచేయడమూ, వెంటనే చెంపలేసుకోవడమూ ఆశ్చర్యంగా ఉంది కదా!

వృషగిరీశదయే! జహీమాం ఆశీ విషగ్రహణకేళినిభాం మే అవస్థాం:- దయాదేవీ! పాములాటతో సమానమైన నా ఈ అవస్థను నశింపజేయుము. పాపాలను పాములతో పోల్చబడింది. "దురిత మూర్ఛనాజుష్టం సం జీవయతు" (12) పాపాల చేత విషం లాగా మూర్ఛావస్థను పొందినవాణ్ని ఉజ్జీవింప జేయాలని స్తుతింపబడింది కదా! పాములాటగాని లాంటి వానిగా తనను పోల్చుకొన్నారు దేశికులు.

గరుడ మంత్ర సిద్ధిని పొందినవాడు విషసర్పాలను పట్టుకొన్నప్పుడు వాటి క్రౌర్యాన్ని తలచి భయపడడమూ, గరుడ మంత్ర ప్రభావాన్ని తలచి నప్పుడు ధైర్యం కలిగి భయపడకపోవడమూ ఎట్లు ఉండునో అట్లే తన అవస్థ ఉన్నదన్నారు దేశికులు.

పాపాచరణ స్మృతి వల్ల భయాన్ని పొందేటట్లు చేయడం, దయా ప్రభావాన్ని స్మరించడం వల్ల భయనివృత్తిని కలిగించడం దురవస్థయే. సర్పాలతో ఆడడం నాకు ఇష్టం. పాపాలను మళ్ళీ మళ్ళీ చేస్తున్నాను. ఆశీవిషాలను పట్టడం నా క్రీడ. దయాదేవీ! నా క్రీడను నీ క్రీడ విరమింప జేయాలి అని ప్రార్థన.

'జహి' - అంటే చంపుమని అర్థం. పామును చంపుమనడం లేదు. నేను పట్టుకొన్న పాము నన్ను కరచి చంపడానికి ముందే ఆ పాముతో ఆటలాడాలి అనే నా కోరికను చంపుమని వేడుకొన్నారు. "న ప్రవర్తీయ పాపాని ప్రవృత్తాని నివర్తయ (న్యాస దశకం 8) అన్నట్లు, ఒక్కసారి ప్రపత్తి చేసిన తర్వాత మళ్ళీ పాపాలను చేసే ప్రవృత్తిని - దుష్టబుద్ధిని నశింపజేసి, సన్మార్గమందు ప్రవర్తింప జేయుమని దయాదేవి ప్రార్థింపబడింది.

మాలిని॥ భయమొదవెడు నస్మత్పాపకృత్యంబు లెంచన్
దయ! నినుదలతున్ జిత్తంబునన్ దోడ నాకీ
క్రియను విషధరంబున్ కేళిమై బట్టు మంత్రా
శ్రయునకగు నవస్థన్ జయ్యునన్ మాన్పరాదే॥

97. ఔత్సుక్యపూర్వముపహృత్య మహాపరాధాన్
మాతః ప్రసాదయితు మిచ్ఛతి మే మన స్త్వామ్।
ఆలిహ్య తాన్నిరవశేష మలబ్ధ తృప్తి
స్తామ్యస్య హో! వృషగిరీశధృతా దయే! త్వమ్॥

అర్థం: హే మాతః = ఓ జననీ! మే = నా యొక్క; మనః = మనస్సు; మహాపరాధాన్ = గొప్ప అపరాధాలను; ఔత్సుక్యపూర్వం = శ్రద్ధాపూర్వకంగా; ఉపహృత్య = కానుకగా ఇచ్చి; త్వాం = నిన్ను; ప్రసాదయితుం = తృప్తి పరచడానికి; ఇచ్ఛతి = కోరుతున్నది. దయే = ఓ దయాదేవీ! వృషగిరీశధృతా = శ్రీ వేంకటాచలపతియైన శ్రీనివాసుని చేత ధరింపబడిన; త్వం = నీవు; తాన్ = అపరాధాలను; నిరవశేషం = నిశ్శేషంగా; ఆలిహ్య = (నాలుకతో) నాకి; అలబ్ధ తృప్తిః = తృప్తిని పొందనిదానవై; తామ్యసి = క్షోభపడుతున్నావు. అహో = ఆశ్చర్యం.

తా: ఓ తల్లీ! నేను చేసిన అపరాధాలను ఉత్సాహంతో నీకు ఉపహారంగా సమర్పించి నిన్ను ప్రసన్నురాలనుగా చేయడానికి నా మనస్సు కోరుతున్నది. ఓ దయాదేవీ! నిన్ను ఆ శ్రీనివాసుడు ధరించియున్నాడు. అట్టి నీవు నాచే సమర్పింపబడిన మహానైవేద్యాలను ఒక బొట్టు కూడా మిగులకుండా తేనెను నాకినట్లు ఆరగించి, తృప్తి పడనిదానివై తహతహ లాడుతున్నావు. ఇది ఆశ్చర్యంగా ఉంది.

వ్యాఖ్య:- ప్రపన్న జనుల మహాపరాధాలను క్షమించి, తాను వారికేమి మేలి చేయలేక పోతినని తహతహలాడడం దయాస్వభావమని సుశ్లోకితం.

సంసార సర్పదష్టుడను కాకముందే, ఆ సర్పాన్ని పట్టుకొని దానితో ఆటాడే ఆశను నశింపజేయుమని ఇంతకు ముందటి శ్లోకంలో ప్రార్థింప బడింది. దయాదేవి అన్ని విధాలా పోషించేతల్లి. తల్లిని గౌరవించడం, ఆరాధించడం తనయుని ధర్మం.

గురుజనులలో ప్రథమస్థానం మాతృదేవిది. ఆమె దయాసింధువు. ఆమెకు తనయుడెంత గొప్ప సేవ చేసిననూ అది సింధువులో బిందువు లాంటిదే. మాతృణం తీర్చుకొనరానిది. తనను చేబట్టిన పతిని మెప్పించి, ఒప్పించి, తనయుణ్ని శాశ్వతంగా సుఖవంతుణ్ని చేసేంత దాకా తల్లి తహతహ తీరదుకదా! అందుకే శ్రీనివాసుని దయను దేశికులు 'మాతః' అని మనసార సంబోధించడం గమనార్హం.

ఔత్సుక్యపూర్వముపహృత్య మహాపరాధాన్ మాతః । ప్రసాదయితు మిచ్ఛతి మే మనస్త్వామ్:- 'మాతృదేవోభవ' అని శ్రుతి పలుకుతుంది. తల్లిని దైవంగా నీవు పూజించే వాడవు కావాలి అని శ్రుతి వాక్యార్థం. ఇష్ట దేవతను షోడశోపచారాలతో పూజిస్తున్నప్పుడు ఆ దేవతకు ఇష్టమైన ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించడమే ఆ పూజలో ప్రధానమైనది.

దానద్రవ్యాలలో అన్నమనే ద్రవ్యం సమర్పిస్తే, అది భుజించిన వ్యక్తికి తృప్తినిస్తుంది. ఏ ద్రవ్యమిచ్చినా, గ్రహించినవానికి తృప్తి కలుగదు. అన్నం పెడితే, దాన్ని తిన్నవాడు 'తృప్తోఽస్మి' - ఇక చాలు, కడుపు నిండింది అంటాడు. ఆకలిని దీర్చిన అన్నదాతకు 'కలి' (దోషం-పాపం) నశిస్తుంది. సుఖవంతుడవుతాడు అన్నదాత. దయాదేవికి ఇష్టమైన ఆహారం అపరాధమే. జీవుడు సంపాదించిన ధనరాశులు మహాపరాధాలే. తాను ఆర్జించిన గొప్పగొప్ప పాపరాశులను మూటలు మూటలుగా కట్టి, దయాదేవికి కానుకగా, అంటే శ్రద్ధతో మహా నైవేద్యంగా సమర్పించి ఆమెను తృప్తి పరచాలని అభిలషిస్తాడు. అపరాధాలను ఆహారంగా స్వీకరించినందువల్ల దయాదేవికి ఆకలి తీరుతుంది. పాపాలను నైవేద్యంగా సమర్పించిన జీవునికి పాపాల ఫలం పొందకుండా చేస్తుంది దయాదేవి. చేసిన పాపాలకు ఫలాన్ని (దండనను - శిక్షను) భగవానుడు తనకు ఇయ్యకుండా చేయుమని మహా విశ్వాసంతో జీవుడు దయాదేవిని ప్రార్థించడమే ప్రపత్తి అని భావం.

ఒక్కసారి మాత్రమే ప్రపత్తి చేయాలి. అప్పుడు అపరాధాలను దయాదేవి క్షమించి, మోక్షం పొందడానికి యోగ్యునిగా చేస్తుంది. ఈ ప్రపత్తిని 'మోక్షార్థ శరణాగతి' అంటారు. ప్రపత్తి చేసిన తర్వాత కాలాన తెలిసో, తెల్యకయో చేసిన

పాపాలను పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తంగా చేసిన ప్రపత్తిని 'పునఃశరణాగతి' అంటారు. జీవించినంత కాలం చేసే కర్మలు మంచివో, చెడ్డవో తెల్యకుండా మోహింప జేసేది ప్రకృతి. ఆ ప్రాకృతిక బలం వల్ల పాపకర్మలను చేయడానికి ప్రేరేపించే పాపాలను ప్రధ్వంసం చేయడానికి చేసే ప్రపత్తిని 'పాపారంభక పాప నివర్తక శరణాగతి' అంటారు.

పాముతో ఆటాడే ఆశను నశింపజేయుమని గత శ్లోకంలో ప్రార్థింపబడింది. 'పాపారంభక పాపనివర్తక ప్రపత్తి'యే అని స్మరింపదగినది. అపరాధుల అపరాధాలను క్షమించి అనుగ్రహించడమే దయాదేవి యొక్క ఉదార స్వభావమని సుస్పష్టం.

ఆలిహ్యతాన్ నిరవశేషమలబ్ధ తృప్తిస్త్వామ్యస్యహో! వృషగిరీశధృతా దయే! త్వమ్:- దయాదేవికి తృప్తిని గలిగించేటన్ని పాపాలను చేసే సమర్థులున్నారా? పాపాలను చేసినవారున్నా వారి బుద్ధి, దృష్టి భగవత్కృప వైపు ప్రసరిస్తున్నదా? లేదనేదే సమాధానం. భగవద్దయను భక్తితో స్మరిస్తే చాలు, వాని పాపాలన్నీ పంచబంగాళ మవుతాయి. మేరు, మందర నగతుల్యంగా ఉండే పాపరాశులను మహానైవేద్యంగా సమర్పిస్తే, అవి దయాదేవికి చేతివేళ్ళ సందున ఇమిడి యుండే మాంగాయ పచ్చడిని నాలుకతో నాకి చప్పరిచ్చి నట్లుంటుంది. ఆమెకు ఆకలి తీరదు. కడుపు నిండదు. దయాదేవికి తృప్తిని కలిగించలేరు. దయాదేవి అపరాధుల అపరాధాలను క్షమించి మహోపకారం చేస్తుంది. కాని ప్రత్యుపకారాన్ని కోరదు సుమా! జనని చేసిన ఉపకారానికి మనం ప్రత్యుపకారాన్ని చేయగలమా? "అరియేన్ ఒరుకైమ్మారే" - ప్రత్యుపకార చింతనకు కూడా యోగ్యుడను కానన్నారు ఆళ్వార్లు.

చరాచర ప్రపంచానికి శాశ్వతంగా విశ్రాంతి కలిగించడానికి పరమాత్ముడు ప్రళయాన్ని కల్పిస్తాడు. ఈ విషయాన్నే "ఉణ్డదు ఉలగేడుమ్ ఉళ్ళొడుంగ" సప్తలోకాలను మ్రింగి బొజ్జలో ఇముడ్చుకొన్నాడు శ్రియఃపతి, అన్నారాళ్వార్లు. విశ్వమంతా పరమాత్ముని సొత్తు కదా! "ఉలగముణ్డపెరువాయా" "ప్రపంచాన్ని మ్రింగిన పెద్ద నోరుకల వాడా! నిరుపమాన కీర్తి కలవాడవు స్వామీ!" అని నమ్మాళ్వార్ల శ్రీసూక్తి. విశ్వాన్ని మ్రింగిన ఆ పొట్టలో ఇంక ఎంతో స్థలం - చోటు శూన్యంగా వెలితిగా ఉందట. అదెంత పెద్ద కడుపోకదా! ఊహించతరమా!

"కింను సమర్పయామితే" - నేను, నాది సకలం నీ సొమ్మే కదా! మాధవా! ఇక నీకు నేను సమర్పించేదేముంది? అన్నారు ఆలవందార్. అలాగే, శ్రీనివాసునిచే ధరింపబడిన దయాదేవి మహాపరాధాలనే మహానైవేద్యాలను తేనెను నాకినట్లు నాకుతుందంటే ఘోర పాపాలను వాసనకుకూడా మిగులకుండా సంపూర్ణంగా నశింపజేస్తున్నదని సారాంశం.

ఆహా! ఇట్టి దయాదేవి యొక్క ఔదార్యం ఆశ్చర్యకరమైనది. కడుపునిండక క్షోభపడుతున్నది - 'అలబ్ధతృప్తిః' - తృప్తి పొందనిది - అంటే, ప్రపన్నుని పాపాలను ప్రధ్వంసం చేశానేకాని తనకు ఆశ్రయంగా ఉన్న వృషగిరీశుని పాదారవిందాల యందు చేర్చలేకపోతిని కదా! అని దయాదేవి తృప్తి పొందలేనిదవుతున్నది. ఇలా తహతహలాడుతున్న దయాదేవిని - లోకమాతను, జగత్పితయైన శ్రీనివాస భగవానుడు అవశ్యంగా ఓదారుస్తాడు. దయాదేవి మహిమ అవాఙ్మానసగోచరమని తాత్పర్యం.

మాలిని॥ ఘనమగుదురితంబుల్ గానుకల్ సేసి యెమ్మె
జనని ముదము నీకున్ సల్పగాంక్షింతు, నా నె
మ్మనమున, నవి నీక్షు ద్బాధ పెంపంగ వాడొం
దిన నిను వృషశైలాధీశుడోదార్చు గాదే॥

98. జహ్యాద్వృషాచలపతిః ప్రతిఘే౽పి నత్వాం
ఘర్మోపతప్త ఇవ శీతలతా ముదన్వాన్।
సా మా మరుంతుద భర న్యసనానువృత్తి
స్త ద్వీక్షణైః స్పృశదయే! తవకేళి పద్మైః॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! వృషాచలపతిః = శ్రీనివాసుడు; ప్రతిఘే, అపి = కోపమందైనను; ఘర్మ+ఉపతప్తః = గ్రీష్మం యొక్క వేడిమి చేత తపింపబడిన; ఉదన్వాన్ = సముద్రం; శీతలతాం, ఇవ = చల్ల దనాన్ని వలె; త్వాం = నిన్ను; న, జహ్యాత్ = విడువడు. సా = అట్టి; అరుంతుద భరన్యసన+అనువృత్తిః = మనస్సుకు బాధకలిగించే పునఃశరణాగతియనే భరన్యాసం యొక్క అనువృత్తిని

కల్గియున్నట్టి; త్వం = నీవు; మాం = నన్ను; తవ = నీయొక్క; కేళి పద్మైః = లీలారవింద రూపాలైన; తత్+వీక్షణైః = ఆ శ్రీనివాసుని కటాక్షాల చేత; స్పృశ = తాకుము.

తా: ఓ దయాదేవీ! గ్రీష్మకాలమందు ఎండచేత సముద్రుడు పై భాగాన ఎంత వేడిమిని పొందియున్నను లోపలి శీతలత్వాన్ని వదలక ఉండే విధంగా, భగవానుడు కోపాన్ని పొందినప్పటికీ నిన్ను వీడడు. శ్రీనివాసుని అంతరంగమందు నీవుంటావు. ఒక్కసారి ప్రపత్తి చేసిన వారికి సర్వఫలాలను ఇవ్వడం చేత, తర్వాత మాటి మాటికి ప్రపత్తి చేస్తే సహింపని నీవు, నీ చేతి లీలాంబుజాల లాంటి శ్రీనివాసుని కటాక్షాల చేత నన్ను స్పృశింపుము.

వ్యాఖ్య:- శ్రీనివాసుణ్ని క్షణమైనా వీడియుండని దయాదేవి, ప్రపన్నులను తన నాథుని కటాక్షాలకు పాత్రులను చేయాలి అని ప్రార్థన.

దయాదేవి పాపరాశులను క్షమిస్తుందన్నారు. నిజమే కాని కర్మఫలప్రదుడైన శ్రీనివాసుడు పాపాత్ముల పట్ల చాలా కోపంతో ఉంటాడు. అప్పుడు దయాదేవికి భగవంత్సంబంధం లేనందువల్ల పాపాలను క్షమింపజేయడమూ, ఆమె భగవచ్చరణారవిందాలను పరిచరించే రీతిగా వారిని చేర్చడమూ ఎలా సంభవిస్తుంది? అనే సంశయాన్ని నివారించే శ్లోకమిది.

జహ్యాద్వృషాచలపతిః ప్రతిఘేఽపి నత్వాం ఘర్మోపతప్త ఇవ శీతలతాము దన్వాన్:- మితిమీరిన దుష్కర్మల నాచరించిన వారి పట్ల శ్రీనివాసునికి కోపం కలుగడం వింతకాదు. ఆ స్పందన సహజమే కదా! వృషాచలపతి కోపమెట్టిదో ఇదువరకే చెప్పబడింది.

"కలమే యవసాపచాయ నీత్యా కరుణే! కింకరతాంతవోపయాతి" (శ్లో. 24)

వరిపైరులోని కలుపును రైతు ఆజ్ఞ చేత సమూలంగా తొలగించే కూలీ వలె, వృషా చలపతి కోపం దయాదేవికి సేవకభావాన్ని పొందియుంటుంది.

"జలధేరివ శీతతా దయే! త్వం వృషశైలాధి పతేః స్వభావభూతా!" (శ్లో. 23)

సముద్రానికి చల్లదనం లాగా శ్రీనివాసునికి దయ స్వభావ సిద్ధమైనది. 'ఉదన్వాన్, ఉదధిః, సింధుః' సముద్రానికి పర్యాయపదాలు. 'ప్రతిఘః' అంటే కోపం,

విఘ్నమని అర్థం. ప్రభువు కోపం శ్రేయస్సుకు విఘ్నమంటారు. 'అపి' అనడం వల్ల "అరోషణోహ్యసౌదేవః" అన్నట్లు భగవానునికి కోపం కల్గదనియే భావం. గ్రీష్మ కాలంలో అంటే, మండుటెండకు సముద్రం యొక్క ఉపరితలం ఎంత వేడిమిని కల్గియున్నప్పటికీ, లోపలి భాగంలో శైత్య గుణాన్ని సముద్రం విడువకుండా ఉంటుంది. అలాగే, జీవులు చేసే అపరాధాల చేత భగవానునికి కోపమేర్పడినప్పటికీ, ఆయన స్వాభావికమైన దయను విడనాడడు. భగవానుని అంతరంగంలోనే దయాదేవి ఉంటుంది. కాబట్టి, దయాదేవి క్షణమైనా శ్రీనివాసుణ్ని వదలియుండనందు వల్ల, ఒకవేళ ఆయన కోపంతో దండన చేయదలచుకొన్నప్పుడు, ఆ దండనను కూడా హితంగా మలచి దయాదేవి కాపాడుతుంది.

అరుంతుద భరన్యసనానువృత్తిః :- "సకృదేవ ప్రపన్నాయ" అన్నట్లు, మొదట ఒక్కసారి శరణాగతిచేస్తే, ప్రార్థించిన ఫలాన్ని ఇవ్వడానికి సిద్ధమై యుంటుంది. 'అనువృత్తి' అంటే మాటి మాటికి ప్రపత్తిని - పునః పునః శరణాగతియనే భరన్యాసాన్ని - ఆచరిస్తే దయాదేవి సహించదు. భరన్యాసానువృత్తి గుండెను గాయపరచినట్లు దయాదేవిని బాధిస్తుంది. అపరాధాలనెన్నైనా క్షమిస్తుంది. ప్రపత్తి యొక్క అనువృత్తి దయాదేవికి పుండు మీద కారం చల్లినట్లు వేదన కల్గిస్తుంది. పునః ప్రపత్తిని అనుష్ఠిస్తే, భగవంతునికి మనోవేదన కలుగుతుందని సారాంశం.

సామాం తదీక్షణైః స్పృశదయే! తవకేళి పద్మైః:- అట్టి మృదు స్వభావం గల దయాదేవి తన చేతుల్లో విలాసంగా పట్టుకొని, స్వేచ్ఛగా వినియోగించుకోదగిన తామర పువ్వులను బోలియున్న శ్రీనివాసుని కటాక్షాలను తన మీద ప్రసరింపజేయాలని దేశికులు అమోఘమైన ప్రార్థన చేశారు.

శ్రీనివాసుని నయనాలు దయాదేవి యొక్క కేళి పద్మాలు అనడం వల్ల, భగవత్కటాక్షాల ప్రవర్తన, నివర్తనాలు రెండూ దయాదేవికి విధేయాలని సూచింపబడింది. తదీక్ష సుధాభిషిక్తుడైన వ్యక్తి సంసారబంధం నుంచి విముక్తుడై, భగవత్పాదపద్మ పరిచారకుడై విరాజిల్లుతాడని ధ్వని.

మాలిని॥ అరయుసు పరితృప్తుండయ్యు శైత్యంబు వారా
కరుడెడలడు, నిన్ శ్రీకాంతుడున్ గ్రుద్ధుడైనన్

దొరగడు కరుణా! త్వత్తుంగ కేళ్యంబుజంబై
పరగు వరుని కంటన్ భాసిలన్‌జూడు నన్నున్ ॥

99. దృష్టేఽ పి దుర్బలధియం దమనేఽ పి దృప్తం
స్నాత్వాఽ పి ధూళిరసికం భజనేఽ పి భీమమ్ ।
బద్ధ్వా గృహాణ వృషశైలపతేర్దయే! మాం
త్వద్వారణం స్వయమనుగ్రహ శృంఖలాభిః ॥

అర్థం:- హే వృషశైలపతేః దయే = ఓ శ్రీనివాసుని దయాదేవీ! దృష్టే, అపి = చూడబడినను; దుర్బలధియం = కలతను జెందిన బుద్ధి కల్గినట్టి; దమనే, అపి = శిక్షింపబడినను; దృప్తం = దర్పం కలిగినట్టి; స్నాత్వా, అపి = స్నానం చేసినప్పటికీ; ధూళిరసికం = దుమ్మునందు ప్రీతికల్గినట్టి; భజనే, అపి = సేవచేసి నప్పటికీ; భీమం = భయంకరంగా ఉండే; త్వత్+వారణం = నీ ఏనుగైన । నిన్ను అడ్డగిస్తున్నట్టి; మాం = నన్ను; స్వయం = నీయంతట నీవే; అనుగ్రహ శృంఖలాభిః = అనుగ్రహమనే సంకెళ్ళ చేత/వెనుక నుంచి వచ్చి పట్టుకోదగిన నిగళాలచేత; బద్ధ్వా = కట్టి; గృహాణ = పట్టుకొనుము.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! కటాక్షింపబడినప్పటికీ దుర్బలమైన బుద్ధి కలిగినట్టి; శిక్షింపబడిననూ అణకువలేనట్టి; స్నానం చేసి నప్పటికీ దుమ్మునే ఇష్టపడునట్టి; ఉపచరించి లాలించి ననూ భీతిని గొల్పే నీ ఏనుగైన / నిన్ను తిరస్కరించే నన్ను నీవే స్వయంగా అనుగ్రహమనబడే / వెనుక నుంచి వచ్చి పట్టుకొన డానికి అనుకూలమైన సంకెళ్ళ చేత కట్టివేసి, పట్టుకోవమ్మా!

వ్యాఖ్య: ఏనుగును బోలియున్న తనను స్వయంగా బంధించి పట్టుకోవాలని దయాదేవిని ఆచార్యులు ప్రార్థిస్తున్నారు.

“అరుం తుద భరన్యసనా నువృత్తిః” - అని చెప్పబడింది కదా! వెంటనే ఆచార్యుల వారికి “అరుంతుదమిహాలాన మనిర్వాణ స్యదంతినః” - ‘మదగజానికి బాధాకరమైనది కట్టుకొయ్య, అనే వాక్యం, అంటే గజబంధనం స్ఫురితిపథంలో మెదిలింది. గజానికి తనకు చాలా సామ్యమున్నదన్నారు. గత శ్లోకంలో

భగవత్కటాక్షాన్ని తనపైన ప్రసరింప జేయుమన్నారు. భగవానుడు కటాక్షించినప్పటికీ, తన మనస్సు విషయారణ్యంలోనే విహరిస్తున్నదని ఆచార్యులు స్వీయ అపరాధాలను (నైచ్యంగా) అనుసంధించి, తనను విధేయునిగా స్వీకరింపుమని సుశ్లోకిస్తున్నారు.

1) దృష్టేఽపి దుర్బలధియమ్:- ఒక మానవుడు భగవత్కటాక్షం చేత సదాచార్యుల ద్వారా శాస్త్ర దర్శనాదులను చక్కగా గ్రహిస్తాడు. సద సద్వివేకాన్ని పొందియుంటాడు. అయినప్పటికీ శాస్త్ర ప్రకారంగా సన్మార్గంలో నడవడానికి మనోబలం లేక విషయసంగుడై దుర్మార్గమందే నడుస్తుంటాడు.

ఏనుగు మావటీని చూపుల చేతనే సాధారణంగా భయపడుతుంది. మావటీనిచే పోవలసిదారిచూపబడినప్పటికీ, ఏనుగు మదంబట్టి, కన్నుగానక ప్రమాదం కలిగే పెడదారిలోనే పరుగెత్తుతుంది.

(2) దమనేఽపి దృప్తమ్:- మానవుడు, తనను కని, పెంచి, పెద్ద చేసిన వారు 'పాపకృత్యాలు చేయకూడదు' అని నిగ్రహించి శిక్షించిననూ, స్నేహితులు కూడా తనను నేరాలు చేయకుండా పలుసార్లు చెప్పి గద్దించిననూ, అఖర్వ గర్వంతో పశ్చాత్తప్తుడు గాక, 'వారందరు మూర్ఖులే' అని భావిస్తూ దుశ్చరితుడవుతాడు.

మదగజం పెడదారిలో పోకుండా మావటీడు ప్రయత్నించినా, అది వాని అదుపాజ్ఞలలో ఉండక ముందుకు సాగుతుంటుంది. మావటీడు అంకుశంతో మృదువైన కుంభస్థలమందు గట్టిగా పొడిచినప్పటికీ, అది లక్ష్యపెట్టక, మావటీడు క్రింద పడునట్లుగా నియంత్రించ రానిదై పరుగెత్తుతుంటుంది.

(3) స్నాత్వాఽపి ధూళిరసికమ్:- మానవుడు చేయరాని పనులు చేసినందు వల్ల అతనిని మురికి వానిగా భావించి, సదాచారులైన పెద్దలు పరిశుద్ధికి హేతువైన ప్రాయశ్చిత్త కర్మలను చేసి, కలశ మంత్రోదకం చేత మార్జన చేసి పరిశుద్ధుణ్ని చేస్తారు. ఆ క్రియ స్నాన తుల్యమైనది కదా! ఆ వ్యక్తి సుస్నాతుడైనప్పటికీ అభ్యాస బలం వల్ల మళ్ళీ మలినమైన పనులను చేస్తూ, ధూళిదూ సరితుడవడమందే రుచి కలిగి ఉంటాడు. ఎంత దుమ్ము దులిపి సంస్కరించినా, దురాలోచన చేయడం, దుర్భాషలాడడం, దుష్ప్రవర్తనకు దూగడంలోనే ఎక్కువ మక్కువ కలిగియుంటాడు.

ఏనుగుకు జలకాలాడడం చాలా ఇష్టం. మావటీడు ఏనుగు శరీరాన్ని బాగాగీకి, రాసి, కడిగి శుభ్రపరుస్తాడు. కాని ఏమి ప్రయోజనం? మావటీడు చేసిన శుభ్రత అంతా వృథా అవుతుంది. ఏనుగు నీటిలో నుంచి బయటకు రాగానే తొండంతో దుమ్మును, ధూళిని, బురదను, చెత్తా చెదారమంతా ఎత్తి నెత్తి మీద, దేహం మీద పోసుకొంటుంది. ఏనుగు నీటిలో ఆడుకోవడం ఎంత ఇష్టమో, నీటిలో నుంచి గట్టుకు చేరగానే మీద దుమ్ము పోసుకొని దేహాన్ని మురికి చేసుకోవడంలో అంతకంటె అధికమైన ప్రీతి ఉంటుంది. 'గజస్నానం' అనే నానుడి ఏర్పడింది కదా!

(4) భజనేఽ పి భీమమ్:- ఒకానొకడు ఎంత లాలన, పాలన చేసినా, ఎంత పొగడినా, ఎన్ని ఉపచారాలు చేసినా, భయంకరుడుగా ఉంటాడు. వానినెంత కీర్తించి నప్పటికీ వాని చెవికెక్కదు. పైగా వాని కన్నులు నిప్పులు చెరగుతుంటాయి. భగ్గుమని మండిపడుతాడు. విశ్వసనీయుడు కాడు. "భూషితోఽ పి భయంకరః" అన్నాడు వాల్మీకి రావణాసురుణ్ని. తొండరడిప్పొడి యాళ్వార్లు తిరుమాలై - "శినత్తినాల్ శెత్తం నోక్కి తీవిళి విళివన్ వాళా --- ఎనక్కిని గతియెన్ శొల్లాయ్" (30) నాకు వాఙ్మనః శుద్ధిలేదు. పైగా, క్రోధావిష్టుడనై క్రూరబుద్ధితో ఇతరులను నిప్పులు కురిపించునట్లు దూషిస్తుంటాను. ఈ స్థితిలో శ్రీరంగనాథా! నాకు బాగుపడే మార్గం చెప్పుమన్నారు. రాజభవనంలో ఏనుగును మావటీడు ఆహారంపెట్టి, లాలించి పాలించి, దానికి నచ్చిన మాటల సవ్వడితో బుజ్జగిస్తూ, దాని ధీరతను కీర్తిస్తాడు. అయినా, ఒక్కొక్కప్పుడు మావటీని ఉపచారాలను లెక్కపెట్టక చెలరేగి, అడవిలోకి పోవ నుంకించే దాని కోపం చూడశక్యం కానిదిగా ఉంటుంది. గజగాంభీర్యం నమ్మరానిదని స్పష్టమవుతుంది. "గంభీరవేదిని గజే" అని మాఘకవి గజస్వభావాన్ని విచిత్రంగా వర్ణించాడు.

త్వద్వారణమ్:- 'నీ గజాన్ని నేను' అన్నారు ఆచార్యులే. పైన చెప్పబడిన నాలుగు పదాలతో తనను ఏనుగుతో పోల్చుకొని నిర్వేద పడుతున్నారాచార్యులు.

వారణమ్:- ఏనుగు సులభంగా పట్టు బడదు. పట్టుకొనబోయే వ్యక్తులను అడ్డగిస్తుంది. ఎదిరించి తనను పట్టుకోకుండా వారిస్తుంది. తాను దయాదేవి గజం కాబట్టి, పట్టుకొనడానికి యత్నించే దయాదేవిని పట్టుకోవద్దని విషయారణ్యానికి

పారిపోదలచి, తనను పట్టుకోకుండా - వారిస్తున్న గజమట. దేశికుల రచనా సంవిధానం విచిత్రంగా ఉంటుంది.

"అద్యాపిదేవి! భవతీ మవధీరయంతమ్" (91 శ్లో) ఓ దయాదేవీ! నీవు విశ్వోపకారాలు చేస్తున్న దానవు. అయినా ఇప్పుడు కూడా నేను నీ మహిమకు తగినట్లు నిన్ను గౌరవించడం లేదు. నేను ఆరాధించడం లేదు. నిన్ను తిరస్కరిస్తున్నాను. ఏ మాత్రం మర్యాదను పాటించని పాపిష్ఠుడను - అని ఈ దశకారంభ శ్లోకంలో నైచ్యాను సంధానం చేసిన మాటవంటిదే ఈ 'త్వత్ వారణం' అనే మాట. 'పట్టుకొనబోతే వారించే గజస్వభావం లాంటి స్వభావం కలవాడను' అన్నారు.

మాం స్వయమనుగ్రహ శృంఖలాభిర్బద్ధ్వా గృహాణ:- ఓ దయాదేవీ! నిన్ను వారించే నన్ను, నావారణను - అడ్డగింపును లెక్కచేయక నీయంతట నీవే అనుగ్రహమనే పెద్ద సంకెళ్ళ చేత బంధించి పట్టుకో తల్లీ! ముందటి నుంచి సంకెళ్ళు వేసి పట్టుకోవడం సుకరం కాదు. నాకు తెలుస్తుంది కాబట్టి, సంకెళ్ళు వేయకుండా వారిస్తుంటాను. (అను, గ్రహ) వెనుకనుంచి వచ్చి నాకు తెలియకుండా దృఢమైన శృంఖలాలచే నన్ను కట్టివేసి నీ వశం చేసుకోవమ్మా! అని దయాదేవికి దేశికులు ఉపాయాన్ని సూచించారు.

"స్వం సంస్కృత ద్రావిడ వేదసూక్తైః భాంతంమదుక్తై ర్మలినీ కరోతి ।
శ్రీరంగకమ్రః కలభం క ఏవ స్నాత్వాఽపి ధూళిరసికం నిషేద్ధా"॥

శ్రీరంగమందలి కమనీయమైన గజం శ్రీరంగరాజు, సంస్కృత ద్రావిడ వేద సూక్తులచే ప్రతిపాదితమై ప్రకాశించే తనను, తాను స్వీకరించిననా స్తోత్ర వాక్యాల చేత మలినం చేసుకొంటున్నాడు. స్నానం చేసిన తర్వాత కూడా బురద, దుమ్ము చల్లుకోవడమందే అభిరుచిగల కలభాన్ని ఎవడు నిషేధిస్తాడు? అని శ్రీ పరాశరభట్టర్ శ్రీ రంగరాజస్తవం చేశారు.

"దృప్తా సేయం దృఢనియమితా రశ్మిభి ర్భూషణానామ్ ।
చింతా హస్తిన్యనుభవతి మే చిత్రమాలాన యంత్రమ్ ॥"

అధిక దర్పం గల నా మనస్సు అనే మదపుటేనుగు శ్రీరంగనాథుని హస్తద్వయ మనే కట్టుకొయ్యకు ఆయన ధరించిన రత్నాభరణాల కాంతి కిరణాలనే త్రాళ్ళచేత గట్టిగా కట్టబడినది అని దేశికులు 'భగవద్ధ్యానసోపానం' లో చిత్రంగా స్తుతించారు.

"అవిద్యారణ్యాని కుహర విహరన్మామక మనః ।
ప్రామాద్య న్మాతంగ ప్రథమనిగళం పాదయుగళమ్ ॥"

అవిద్య అనే మహారణ్యం మధ్యన మదం బట్టి విహరిస్తున్న నా మనోగజాన్ని బంధించే మొదటి సంకెళ్ళు భగవద్రామానుజుల పాదాలే అన్నారు దేశికులు 'యతిరాజ సప్తతి'లో (శ్లో.59), శ్రీ మద్రామానుజుల పాదయుగళం ప్రథమ నిగళమైతే ద్వితీయ నిగళం ఈ శ్లోకంలో అనుభవించే దయాదేవియే. ఒకసారి ఆచార్యులకు అధీనమైన ఆత్మ, తర్వాత దయాదేవికి వశమవుతున్నది. భగవత్కృపకు పాత్రమైన జీవాత్మ శాశ్వతానందాన్ని అనుభవిస్తుంది కదా!

మదగజ వృత్తాంతాన్ని వర్ణించిన ఈ శ్లోకంలో స్వభావోక్తి, రూపక, శ్లేషాలంకారాలు ఇమిడి యున్నాయి.

మాలిని॥ నను దయ యవివేకు న్మత్తునిన్ శిక్షితుండై
నను గుపథగశీలున్, స్నాతుడైనన్ రజస్స
క్తుని బరిజన సంక్రుద్ధున్ భవద్వారణంబున్
గనికర మనుత్రాటన్ గట్టి పాలింపు మీవే ॥

100. నాతఃపరం కిమపి మే త్వయి నాథనీయం
మాతర్దయే! మయి కురుష్వ తథా ప్రసాదమ్ ।
బద్ధాదరో వృషగిరి ప్రణయీ యథాఽ సౌ
ముక్తానుభూతి మిహ దాస్యతిమే ముకుందః ॥

అర్థం:- హే మాతః దయే = ఓ తల్లీ! దయాదేవీ! వృషగిరి ప్రణయీ = వేంకటాచలవాస మందు ప్రీతికలిగిన; అసౌ = ఈ; ముకుందః = మోక్షదాతయైన శ్రీనివాసుడు; బద్ధ+ఆదరః = బద్ధ చేతనులందు ఆదరం కలవాడై; ఇహ = ఈ తిరుమల యందే; ముక్త + అనుభూతిం = ముక్తాత్మల యొక్క అనుభవాన్ని; యథా

= ఎట్లు; దాస్యతి = ఇస్తాడో; తథా = అట్లు; మయి = నాయందు; ప్రసాదం = అనుగ్రహాన్ని; కురుష్వ = చేయుము. అతః = ఇంతకంటె; వరం = వేరొకటి; మే = నాకు; త్వయి = నీయందు; నాథనీయం = యాచింపదగినది; కిం, అపి, న = ఏమీ లేదు.

తా: ఓ తల్లీ! దయాదేవీ! శేషాచలవాసమందు అత్యంతాసక్తి గల్గిన మోక్ష దాతయైన ఈ శ్రీనివాసుడు బద్ధజీవులయందు ఆదరం కలవాడై నాకీ సంసారమందే ముక్తాత్మల కయ్యే నిత్య భగవత్సాన్ని ధ్యానుభవాలను నీయనుగ్రహం వల్ల కలుగజేయు గాక. ఇదే నేను నిన్ను కోరుతున్న వరం. ఇంతకంటె వేరొక కోరికయే లేదు.

వ్యాఖ్య: భగవత్ప్రాప్తి రూపమైన ఫలాన్ని ఈ సంసారమందే సమకూర్చుమని దేశికులు దయాదేవిని ప్రార్థిస్తున్న శ్లోకం.

ఇది నూరవ శ్లోకం. దీనితో శతకం పూర్తి అవుతున్నది. తర్వాత ఉన్న ఎనిమిది ముగింపు శ్లోకాలు. తొంబై తొమ్మిది శ్లోకాలతో దయాదేవిని స్తుతించారు ఆచార్యులు. 'విశ్వోపకారాలు చేయబడినాయి, ఇంక నీకు ప్రియమైనదేమి చేయాలి?' అని దయాదేవి అడిగింది.

మాతః; దయే:– తల్లీ! అని దయాదేవిని సంబోధించారు.

నాతః పరం కిమపి మే త్వయి నాథనీయమ్:– 'నీవు చాలా మేలు చేస్తున్నావు. నిజమే. అమ్మా! నా కో కోరిక ఉంది. ఇదే చివరి కోరిక. ఇపుడు కోరే దానికంటే మరొకటేమీ కోరను. నిన్ను కోరదగినదే కోరుతున్నాను. నా కోరిక నీ యనుగ్రహం వల్లనే నెరవేరుతుంది. నా కోరిక నీవు తీర్చకుంటే మరెవ్వరు తీర్చలేరమ్మా! అమ్మా! అనుగ్రహించు తల్లీ! అని బాలుడు తల్లి ఒడిలో ఒద్దికగా కూర్చొని ముద్దుగా, ముచ్చటగా వేడుకొంటున్నట్లు, ఆచార్యులు దయాదేవితో తన విజ్ఞాపనను అంగీకరించుమని ప్రార్థిస్తున్నారు.

వృషగిరి ప్రణయీ:– తిరుమలపైన నివసించడమంటే ఎక్కువ మక్కువ కలవాడు శ్రీనివాసుడు. ఆయనకు ధర్మమందే అభిరుచి.

"మాయావీ పరమానందం త్యక్త్వా వైకుంఠముత్తమమ్।
స్వామి పుష్కరిణీ తీరే రమయాసహమోదతే॥"

ఆశ్చర్య భూతుడైన శ్రీమన్నారాయణుడు ఆనందమయమైన వైకుంఠాన్ని వదలి, తిరుమల యందు స్వామి పుష్కరిణి - వరాహస్వామి ఆలయానికి ఎదుటనున్న కోనేటి యొక్క దక్షిణ తీరమందు లక్ష్మీదేవితో పాటు ఆనందంగా వెలసి యున్నాడు. "మామాయన్" - 'మహామాయి' అని గోదాదేవి (తిరుప్పావై) పేర్కొన్నది. 'తిరుపతి' - అంటే శ్రియఃపతి; తిరుమలై అంటే శ్రీగిరి అని అర్థం. ఈ తిరుమల రెండు వందల నలభై (240) మైళ్ళ పొడవు, ఇరవై నాలుగు (24) మైళ్ళ వెడల్పు, మూడువేల (3000) అడుగుల ఎత్తు కలిగియున్నది. ఈ వేంకటాద్రి యందు ధర్మరతిని, జ్ఞానాన్ని, భక్తివైరాగ్యాలను,ముక్తిని కలిగించే పుణ్యతీర్థాలు - మహర్షులచే సేవింపబడే పవిత్రమైన నిర్ఝరులు - ఎన్నో ఉన్నాయి. 'తెషి కురలరువిత్తిరువేంగడ' మని ఆళ్వార్లచే అద్భుతంగా కీర్తింపబడినద్రై, సేవించిన వారి సర్వపాపాలను ధ్వంసం చేస్తున్నందువల్ల 'వేంకటాద్రి' యని వ్యవహరింపబడుతున్నది. "విష్ణుః పర్వతానా మధిపతిః" అనే శ్రుతి వాక్యంచే పర్వత సామాన్యానికి ఆధిపత్యం వహించే శ్రీ మహావిష్ణువు, వేంకటాద్రియందు సకల పురుషార్థ ప్రదాన రసికుడుగా వెలసి, దానికి విశేషాధి పత్యాన్నీ పొంది శ్రీ వేంకటేశ్వర స్వామి అని, లక్ష్మి వక్షఃస్థల యందు ప్రకాశిస్తుండడం చేత 'శ్రీనివాసుడు' అని మహర్షులచే కీర్తింపబడుతున్నాడు. కోనేటి గట్టున పట్టుదలతో వెలసి భక్తులకు ఇష్టసిద్ధినీ, అనిష్ట నివారణనూ కలిగిస్తున్నందు వల్ల 'కోనేటిరాయుడు' అని గానం చేయబడుతున్నాడు. దేవతలు గుట్టకు దిగివచ్చి, మానవులు గుట్టనెక్కివచ్చి, ఉచ్చనీచ భావాలు లేకుండా భక్తితో గుంపులు గుంపులుగా కలిసి మెలిసి, 'గోవింద' నామం దశదిశల ధ్వనించే ఉచ్చ స్వరంతోనూ, మస్తకాన ధరించే ముకుళిత హస్తాలతోనూ, తన్న్ దివ్యమంగళ విగ్రహాన్ని 'మామేకం శరణం వ్రజ' అని చెప్పిన రీతిగా, ఆపాద మస్తకం సేవించి తరిస్తారనే వాత్సల్యంతో వెలసిన కొండలరాయుడాయన.

అసౌ ముకుందః:- ఈయన ముకుందుడు. 'ముకుం' అనేది అవ్యయం. ము = ముక్తినీ; కు = భూమినీ; ద = ఇచ్చేవాడు. ఇప్పుడు కానీ, కొంతకాలానికి

గానీ మోక్ష సామ్రాజ్యభోగాలను ప్రసాదించేవాడు. జీవించినంత కాలం ప్రాకృతిక భోగాలను అనుభవింపజేసేవాడు. ఈ ఉభయ విభూతుల భోగాలను అనుగ్రహించే వాడని, రెండు భోగాలను కలిపి – ఒకటిగా కూర్చదగిన 'ముకుంద' పదాన్ని ప్రయోగించి ప్రార్థిస్తున్నారు దేశికులు.

బద్ధాదరః:– తన నుంచి దూరంగా పోయిన సుతుని దలచే తండ్రివలె, నిత్య సూరులయందు, ముక్త పురుషుల యందు ఉన్నదానికంటె బద్ధజీవులయందు అధికమైన ఆదరం, అభిమానం ఉన్నవాడు 'కలౌ వేంకటనాయకః' అన్నట్లు, కలికాలాన శ్రీ వేంకటేశ్వర స్వామి తప్ప వేరొకడు లేడు.

"మాం బద్ధ్వా గృహాణ" (99) నన్ను కట్టివేసి పట్టుకొమ్మని మొరపెట్టు కొన్నాను కదా తల్లీ! నీచే బద్ధుడనైన నాయందు నీ నాథుడు ఆదరం కలవాడై నా బంధాన్ని విడగొడ్తాడనే నమ్మకముందమ్మా!

దయే! యథా ఽ సౌ ముక్తానుభూతిమిహవేదాస్యతి మయికురుష్వ తథాప్రసాదమ్:– ఓ దయాదేవీ! శ్రీనివాసుడు వైకుంఠమందు ముక్తాత్మలకు ఏ విధంగా బ్రహ్మానందానుభవాన్ని ప్రసాదిస్తాడో ఆ విధంగానే నాకు ఈ లోకంలోనే దాన్ని అనుగ్రహింపజేయుమమ్మా! అని ప్రార్థిస్తున్నారు దేశికులు.

"తద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే" అని శ్రుతి పలుకుతుంది.

"నిత్యాం జలిపుటా హృష్టా నమ ఇత్యేవ వాదినః" అని స్మృతి బోధిస్తుంది.

శ్రీ వైకుంఠమందు శ్రియః పతిని దర్శిస్తూ నిత్యసూరులు, ముక్తులైన వారందరు బద్ధాంజలులై నమోవాకాలను చేస్తూ, అవాఙ్మానసగోచరమైన ఆనందాన్ని అనుభవిస్తూ ప్రకాశిస్తుంటారు. ద్రావిడ శాఖాధ్యాయులైన 'శిరుమా మనిశర్ (చిన్న పెద్ద మనుష్యులు) కాంక్షించినట్లే, దేశికులు కూడా శ్రీ వైకుంఠనాథుడు తనను వైకుంఠానికి తీసుకొని పోకుండా, అక్కడున్న ముక్తాత్మలకు కలిగించే బ్రహ్మానందాన్ని ఇక్కడే – ఈ ప్రపంచంలోనే తనకు అనుభవింపజేయునట్లు అనుగ్రహించుమని దయాదేవిని వేడుకొంటున్నారీ శ్లోకంలో.

సీతాదేవి హనుమంతునితో "తథా కురు దయాం మయి" నాయందు దయ దలచి ఆ విధంగా చేయుమని విన్నవించింది. ఇక్కడ దేశికులు "మయికురుష్వ తథాప్రసాదమ్" అని వాల్మీకిని అనుగమించారు కదా!

"వయం త్రిదశ నిర్వృతిం భువి ముకుంద విందేమహి" (అభీతిస్తవం) ఓ ముకుందా! పరమపదమందలి ఆనందాన్ని మేము భూలోక మందే పొందుతా మన్నారు దేశికులు.

"త్వంచేత్ప్రసీదసి తవాస్మిసమీపతశ్చేత్
త్వయ్యస్తి భక్తి రనఘా యది హస్తినాథ ।
సం సృజ్యతే యదిచ దాసజనస్త్వ దీయః
సంసార ఏష భగవన్నప వర్గ ఏవ ॥" (వరదరాజ పంచాశత్)

భగవానుని అనుగ్రహం, భగవత్సన్నిధిలో ఉండడం, ఆయన యందే అవ్యాజమైన ప్రీతి, హరిదాస్య రసికులతో నిరంతర సాంగత్యం కలిగి ప్రవర్తించే నరుడు ఈ సంసారమండలమందున్నప్పటికీ, మోక్షానందానుభవాన్ని పొందుతున్నాడనే భావ పరిమళాన్ని గుబాళింపజేస్తూ దేశికులు కంచి వరదరాజస్వామిని స్తోత్రం చేశారు.

మే:- ఉభయవేదాన్త విద్వాంసులైన ప్రపన్నులు "వైకుంఠవాసేఽపి నమేఽభిలాషః" వైకుంఠానికి పోయి అక్కడ నివసించాలి అనే కోరిక కూడా నాకు లేదు, ఉండదు - అన్న దేశికుల ప్రార్థనతో ఏకీభవిస్తారు.

"వృషగిరి ప్రణయీ, బద్ధాదరః" - ఈ రెండు పదాలు వాస్తవంగా, భగవానుడు బద్ధజీవులయందు ఆదరం కలవాడై, ప్రకృతి మండలంలోని తిరుమల క్షేత్రమందు ప్రీతితో వెలసియున్నప్పుడు, ఇక్కడనే మోక్షానందాన్ని అనుభవింప జేస్తాడనే భావాన్ని ప్రకటిస్తున్నాయి. ముక్తానుభూతి పరమపదమందే కలుగుతుందని భావిస్తే, ఆ శ్రీనివాసుడు భువికి దిగి రావలసిన అవసరమే లేదు. వృషగిరియందు వేంకటేశ్వరుడుగా వెలసియుండే ప్రయోజన మంతకంటె లేదనవలసిందే కదా!

"అర్చావతారః సర్వేషాం బాంధవో భక్తవత్సలః" - అనే వాక్యం, బహుతర శక్తి యుక్తమైన స్వయం వ్యక్తార్చా స్వరూపాలలో అగ్రస్థానమలంకరించి బ్రహ్మాండంలో అద్వితీయంగా ప్రకాశిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి తరతమ భావం లేకుండా అందఱికి బంధువని ఆయన సౌశీల్యాన్ని తెల్పుతున్నది. బంధువత్సలుడు అంటే బంధువులయందు వాత్సల్యం కలవాడని స్వామి వాత్సల్యాన్ని తెల్పుతున్నది. భక్తులందఱు భగవద్బంధువులే.

"తదస్య ప్రియమభిపాథో అశ్యాం
నరో యత్ర దేవయవో మదన్తి ।
ఉరుక్రమస్య సహిబంధు రిత్థా
విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః ॥" (యజుర్వేద బ్రాహ్మణం 2-4-6-3 మంత్రం)

అర్థం:- అస్య = విష్ణుమూర్తికి, ప్రియం = ప్రియమైన; తత్‌పాథః = ఆ నివేదించిన తీర్థప్రసాదాన్ని, అభ్యశ్యాం = అనుభవింతును. దేవయవః = దేవుణ్ని ఆరాధించే; నరః = మనుష్యులు, యత్ర మదంతి = నివేదింపబడిన తీర్థ ప్రసాదాలను స్వీకరించడమందు సంతుష్టులవుతున్నారు. ఇత్థా = ఇట్లు అనుదిన మనుభవించేవాడు; ఉరుక్రమస్య = విష్ణుమూర్తి యొక్క; బంధుః = చుట్టం; స ఏవహి = అతడే కదా! పరమే = ఉత్కృష్టమైన; మధ్వే = తేనె లాగా భోగ్యమైన, విష్ణోః పదే = విష్ణు పాదాలయందు; ఉత్సః = ఉత్సుకుడు - ఆసక్తి కలవాడవు తున్నాడు.

భగవంతుణ్ని షోడశోపచారాల చే ఆరాధించి, భక్తితో భగవత్తీర్థ ప్రసాదాలను ప్రతిదినం స్వీకరిస్తూ, భగవత్పాద పద్మాలను ఆశ్రయించి ఉండేవాడు భగవంతునికి బంధువని వేదం బోధిస్తున్నది.

ఆశ్రయించడానికి వలసిన, ఆశ్రితులను అన్ని విధాలా పోషించడానికి వలసిన కల్యాణగుణాలన్నీ తిరుమలేశుని యందు ప్రకాశిస్తున్నాయి.

శ్రీనివాసుడెక్కడున్నా అదే వైకుంఠం. ఐరమ్మదీయం, అశ్వత్థం, హిరణ్మయభవనం, మణిమయ సహస్రస్థూణ మంటపం, అపరాజిత పురమిత్యాది

పరమానంద ప్రదేశాలతో ప్రకాశించే వైకుంఠాన్ని వదలి, దానితో సమాన ప్రదేశాలతో ప్రకాశించే తిరుమల యందు వేంచేసి ఉండడం వల్ల అది కలియుగ వైకుంఠమంటున్నారు విజ్ఞులు. "శ్రుతిశిరసివిదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే, భవతు మమపరస్మిన్ శేముషీభక్తిరూపా" - అని భగవద్రామానుజులు శ్రీభాష్యారంభంలో ఉపనిషత్ప్రతిపాదితుడైన పరబ్రహ్మయే శ్రీనివాసుడని, అతని యందు భక్తి రూపమైన జ్ఞానం తమకు నిరంతరం ఉండుగాక అని ప్రార్థిస్తూ మంగళశ్లోకాన్ని అనుగ్రహించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తృప్తి దీరని దర్శనం చేత జనించిన ఆనంద జలధి విలోల వీచికలలో ఓలలాడుతూ మైమరచిన భక్తులందఱు తాత్కాలిక ముక్తులు అనదగినవారే కదా!

జ్ఞానవైరాగ్య భూషణులైన వేదాన్త దేశికులవారు "వైకుంఠమందు ముక్తులు అనుభవించే బ్రహ్మానందానుభవాన్ని శ్రీనివాసుడు ఈ వేంకటాద్రి యందే నాకు స్థిరంగా కల్గించునట్లు అనుగ్రహించు"మని దయాదేవిని ప్రార్థిస్తూ ఈ దశకాన్ని ముగించారు.

మాలిని॥ వెలయగరుణనాకున్ వేరులే దెందు నీచే
నిల వలచెడు సర్థం బింతకంటెన్ ఫణీంద్రా
చల రసికుడు సర్వస్వామి బద్ధాదర శ్రీ
నిలయుడిడెడు నాకున్ నిత్యముక్తానుభూతిన్॥

దశమ దశకం సమాప్తం

ముగింపు శ్లోకాష్టకం

101. నిస్సీమ వైభవజుషాం మిషతాం గుణానాం
స్తోతు ర్దయే! వృషగిరీశ గుణేశ్వరీం త్వామ్।
తైరేవ నూనమవశై రభినందితం మే
సత్యా పితం తవ బలాదకుతో భయత్వమ్॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! నిస్సీమ వైభవ జుషాం = అమితమైన మహత్త్వం కలిగిన; గుణానాం = జ్ఞానబలైశ్వర్యాది గుణాలు; మిషతాం = చూస్తుండగా; వృషగిరీశ గుణేశ్వరీం = వేంకటాద్రీశుని గుణాలకు ప్రభ్వివైన; త్వాం = నిన్ను; స్తోతుః = స్తోత్రం చేస్తున్న; మే = నాకు (నా విషయంలో); అవశైః = పరవశమొందిన; తైః, ఏవ = ఆ గుణాల చేతనే; అభినందితం = అభినందింప బడింది. (అత ఏవ=కావుననే) తవ = నీ యొక్క; బలాత్ = బలం వల్ల; అకుతో భయత్వం = ఎవరి నుంచి, దేని నుంచి కూడా భయంలేని తనం; సత్యాపితం = సత్యమని నిరూపింపబడింది. నూనం = నిశ్చయం.

తా: ఓ దయాదేవీ! అనంత వైభవం గల జ్ఞానబలైశ్వర్యాది భగవద్గుణాలు చూస్తుండగా సర్వగుణాలకు సార్వభౌమివైన నిన్ను స్తోత్రం చేశాను. అందువల్ల, ఆ గుణాలు సంతోషాన పరవశించి నన్ను అభినందించాయి. నీ బలం వల్ల ఎవరికి గానీ, దేనికిగానీ భయపడని స్థితి నాకు కలిగిందన్న సత్యం నిరూపింపబడింది.

వ్యాఖ్య:- భగవద్గుణాలలో దయను మాత్రమే స్తోత్రం చేయడానికి గల ఔచిత్యం ప్రకటింపబడుతున్నది.

దశమ దశకమందు ఆచార్యులు తనకు ఆభీష్ట ఫలాలను ప్రార్థించి, అష్టోత్తర శతశ్లోకాలచే దయా స్తోత్ర ప్రబంధాన్ని పూర్తి చేయదలచి, నూరవ శ్లోకంలో తనకు ఈ ప్రపంచమందే ముక్తానుభూతిని కలిగించాలని ప్రార్థించారు. పరమ పదమందు ముక్తాత్మలకు కలిగే బ్రహ్మానందానుభవాన్ని ఈ లీలావిభూతిలో తనకు శ్రీనివాసుడు అనుగ్రహించడానికి హేతువు ఆయన దయయే కదా!

"ఆనందం బ్రహ్మణోవిద్వాన్, నబిభేతి కుతశ్చన" బ్రహ్మానందాన్ని పొందిన జీవుడు ఎవరి వల్లనూ, దేనివల్లనూ భయపడడని ఉపనిషత్తు నొక్కి చెబుతున్నది. వేదాంత దేశికులు సార్థక నామధేయులు కాబట్టి అధీతి బోధాచరణ ప్రచారాల యందు అత్యంతాదరమున్న భాగధేయులు. ముక్తానుభూతి కంటే కోరదగినది మరొకటేదీ ఉండదని దయాస్తుతిని ముగించారు. భగవానుని అనంతకల్యాణ గుణాలలో దయను మాత్రం స్తోత్రం చేయడంలో ఉండే వైలక్షణ్యాన్ని ఈ ఏకోత్తర శతశ్లోకంలో ప్రదర్శిస్తున్నారు. ఇదే ప్రబంధ విషయవైలక్షణ్యం.

నిస్సీమవైభవ జుషాం మిషతాం గుణానామ్:- భగవద్గుణాలు నిరవధికమైన మహిమ కలవి.

"పిణంగియమరర్ పిదత్తుమ్ కుణం గెషుకొళ్ గెయ్నాన్" (తి.వామొ. 1-8.9) పరమపదమందు నిత్యసూరులు, ముక్తాత్మలు భగవంతుని అసంఖ్యాకమైన గుణాలలో ఒక్కొక్కరు తాము ఎన్నుకొన్న ఒక్కొక్క గుణమే శ్రేష్ఠమైనదని పరస్పరం వివాదపడుతూ చేస్తున్న స్తోత్రానికి పాత్రుడయ్యే వాడు శ్రియః పతి అన్నారు శ్రీ పరాంకుశులు.

"యదేకైక గుణప్రాంతేశ్రాంతా నిగమవందినః" - నిత్యులు, ముక్తులు భగవదనంత గుణాలను స్తోత్రం చేయదలచినా ఎవరికి వారే ఒక్కొక్క గుణాన్ని, దాని మాహాత్మ్యాన్ని స్తుతించడమందే అలసిపోతున్నారట. మరొక గుణాన్ని స్మరించే అవకాశం కలుగనీయనంత వైభవం ఒక్కొక్క గుణానికి ఉన్నదని దేశికులు స్మరించారు.

భగవద్దయా గుణం తదితరమైన జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజః ప్రభృతి గుణాలు చూస్తుండగనే దేశికులచే స్తుతింపబడింది. దయాస్తుతిని జ్ఞానాది గుణాలన్నీ సావధానంగా వింటున్నాయి. రెప్పవాల్చకుండా కన్నులు తెరచి శ్రద్ధతో అవి చూస్తుంటే, ఆ గుణాలను లక్ష్యపెట్టకుండా దయాస్తుతి చేయబడింది.

"అనాదరే షష్ఠీ" - అనే శబ్దశాస్త్రరీత్యా, మిషతాం" అని షష్ఠీ విభక్తిని ప్రయోగించడం వల్ల ఆ గుణాలను ఆదరించలేదని తెలుస్తున్నది. "స్వర్గే లోకే మిషతి" అని భాగవతంలో 'మిషతి' అనే సప్తమా విభక్తి ప్రయుక్తం కదా! అంటే అది ఋషిప్రోక్తమని వ్యాఖ్యాతలంటారు.

స్తోతుర్దయే! వృషగిరీశ గుణేశ్వరీం త్వామ్:- దయా సంబంధం లేకుంటే తదితర గుణాలన్నీ దోషాలుగానే పరిగణింప బడుతాయనీ, అవి దయాదేవికి అనుచరులుగా ఉంటాయనీ, వృషగిరీశుని గుణాలన్నింటికి సార్వభౌమియైన దయాదేవి విషయంగా స్తోత ఒక శతకాన్నే రచించాడు. భగవానుడు కూడా, ఆయన దయను ఆయనకంటే అధికంగా - దయాధీనుడు శ్రీనివాసుడు అని - స్తుతించినా, దేశికులను తప్పు పట్ట లేదు. కాబట్టి, దయాదేవిని నూరు విధాలుగా స్తుతిస్తుంటే, దయేతర గుణాల కన్నులు టెప్పపాటునే మరచిపోయి, శ్రద్ధతో తిలకిస్తుండగా స్తోత్రం పూర్తి అయింది.

తైరేవ నూనమవశైరభినందితం:- దయేతర గుణాలన్నీ స్తోతపైన ఏ మాత్రం కినుక వహించలేదు. వృషగిరీశ గుణేశ్వరిని స్తుతించే విధానాన్ని చూచి జ్ఞానాది గుణాలే తమను తామే మరచిపోయాయి. అంత సంతోషంతో పరవశించిన ఆ గుణాలు ఆహా! అంటూ తలలూపుతూ స్తోతను మెచ్చుకొన్నాయి. సందేహమే లేదు.

మేతవబలాత్ అకుతో భయత్వం సత్యాపితమ్:- దయాదేవి యొక్క అనుగ్రహ పటిమవల్ల స్తోతకు నిర్భీతి యేర్పడింది. అంతేకాదు, ముక్తానుభూతి ఈ లోకంలోనే వేంకటాద్రి యందు తనకు కలుగునట్లు దయాదేవి అనుగ్రహించాలని కోరినందు వల్ల తదితర గుణ సమూహం కూడా దయా స్తుతివల్ల తమకు గుణమనే తత్త్వం బాగా స్థిరపడిందని స్తోత్రాన్ని ఆమోదించి, స్తోతను అభినందించి, 'ముక్తానుభూతి' అనే ఫలసిద్ధి వల్ల - అకుతో భయత్వాన్ని అంటే స్తోతకు ఎవరి వల్లగానీ, దేనివల్లగానీ భీతిలేని స్థితిని దృఢపరచుతున్నది.

ఉత్సాహ॥ జ్ఞానశక్తులాదిగా బ్రశస్త గుణగణంబులన్
మాని కరుణ! వృషగిరీశ మాన్య నిన్ గుణేశ్వరిన్
బూని పొగడజూచి యవియ పోలునంచు త్వత్పరుం
డైన నాకు నెందు నిర్భయత్వమార దెల్పెడున్ ॥

102. అద్యాపి తద్వృషగిరీశదయే! భవత్యా
మారంభ మాత్ర మనిదం ప్రథమస్తు తీనామ్ ।
సందర్శిత స్వపర నిర్వహణా సహేథాః
మందస్య సాహసమిదం త్వయి వందినో మే ॥

అర్థం:- హే వృషగిరీశదయే = ఓ శ్రీనివాస దయాదేవీ! భవత్యాం = నీయందు; అనిదం ప్రథమస్తుతీనాం = అనాదియైన వేద మనే స్తోత్రాలకు; అద్య+అపి = నేటికీ; ఆరంభమాత్రం = ఆరంభమే కలదు. తత్ = అందువల్ల; త్వయి = నీ విషయంలో; మందస్య = మందబుద్ధిగల; వందినః = స్తుతి పాఠకుడనైన; మే = నా యొక్క; ఇదం = ఈ; సాహసం = సాహసకార్యాన్ని; సందర్శిత స్వపర నిర్వహణా = ప్రదర్శింపబడిన నీ విషయంలోనూ, ఇతరుల విషయంలోనూ నిర్వాహకత్వం గల నీవు; సహేథాః = సహింతువు గాక.

తా: ఓ శ్రీనివాస దయాదేవీ! భగవద్గుణేశ్వరివైన నీ విషయంలో అనాదిగా చేస్తున్న ప్రాబల్కుల స్తోత్రాలు నేటివరకు కూడా ఆరంభదశలోనే ఉన్నాయి. అనంత ప్రభావం గల నిన్ను మందబుద్ధి గలవాడనై స్తుతిస్తున్న నా సాహస కార్యాన్ని స్వపర నిర్వహణను ప్రదర్శించే నీవు క్షమింతువు గాక.

వ్యాఖ్య: వేదాలు స్తుతించలేని భగవద్దయను అల్పబుద్ధితో స్తుతించిన తన అవినయ కృత్యాన్ని దయాదేవి క్షమించాలని ప్రార్థన.

దయాదేవిని స్తుతించినందువల్ల ఆమె అనుగ్రహ పటిమ వల్ల తదితర గుణాలకు గానీ, ఎవరికి గానీ భయపడని దశ తనకేర్పడిన దని కృతజ్ఞత నావిష్కరించారు. ఇక ఈ శ్లోకమందు వేదప్రతిపాదిత యైన దయాదేవి మహిమను తన మందబుద్ధితో స్తుతించి కించపరచే సాహసం చేసిన తనను దయాదేవి క్షమించాలని ప్రార్థింపబడింది.

అద్యాపి తద్వృషగిరీశదయే! భవత్యామారంభ మాత్రమనిదం ప్రథమ స్తుతీనామ్:- భగవద్గుణాలను వర్ణింపదలచిన వేదరూప స్తోత్రాలు కూడా ఇప్పటికీ ఆరంభదశలోనే ఉన్నాయని అర్థం.

వేదాలకు ప్రాబల్కులు (ప్రాచీనస్తోత్రాలు) అనీ, తొలిపల్కులనీ, మిన్ బల్కు (అపౌరుషేయా)లనీ పర్యాయ పదాలున్నాయి. అవి ఎప్పుడు వెలసినవో ఎవరికీ కాలనియమం తెల్యదు. కాబట్టి వేదాలు అనాది (అనిదం) స్తోత్రాలు అనబడు తున్నాయి. వేదాలకంటె ముందు ఏ స్తుతియూ లేనందువల్ల అవి ప్రథమ స్తుతు లనబడినాయి. వేదాలు అంతులేని మహిమగల భగవద్గుణాలను స్తుతింప నారంభించి ఎక్కడ మొదలు పెట్టాయో అక్కడనే ఉన్నాయి. ఎప్పుడో స్తుతింప నారంభించిన వేదాలు ఇప్పుడే స్తుతింప మొదలు పెట్టినట్లున్నాయి. ఒక్క పదం కూడా ముందుకు సాగే శక్తిలేనివయ్యాయి. వెనుకకు మళ్ళుతున్నాయనీ చెప్పబడింది. "యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసాసహ" అన్నది ఉపనిషత్తు. మనస్సు తలచిన తర్వాత దాన్ని వాక్కు ప్రకటిస్తుంది. "మనఃపూర్వో వాగుత్తరః". (శ్రుతి) వాక్కులు తమకంటె పెద్దదైన మనస్సుతో పాటు స్తుతించలేక - ముందుకు సాగలేక నివర్తిస్తున్నాయి అని ఉపనిషద్వాక్యార్థం.

"నిగమాన్తై రధునాఽపిమృగ్యమాణమ్" వేదాన్తాలు ఇప్పటికీ అనంతుని వైభవాన్ని తెలుసుకోవడానికి ఇంక యత్నిస్తూనే ఉన్నాయని భావం.

మందస్య సాహసమిదం త్వయి వందినో మే:- "మందః కవియశః ప్రార్థీ" రఘువంశం యొక్క అమిత వైభవాన్ని మందుడనైన నేను కవి అనే కీర్తి కాముడనై స్తుతింపదలచాను, అన్న కవి కులగురువైన కాళిదాస సూక్తిని ఈ శ్లోకంలోని 'మందస్య' అనే పదం స్మరింపజేస్తున్నది.

వేదరూప సోత్రాలు దయాదేవి యొక్క అపరిమిత ప్రభావాన్ని స్తోత్రం చేయడానికి శక్తి లేని వైనప్పుడు, మందబుద్ధుడనైన నేను రాజభవనంలో వందిమాగధుని లాగా, మితంగా స్తుతించి, దయాదేవి ప్రభావానికి కొఱత ఏర్పరచే సాహసం - అణకువ, వినయం లేని కార్యాన్ని - చేశానని దేశికులు వినయాన్ని ప్రకటించారు.

సందర్శిత స్వపర నిర్వహణా సహేథాః:- సర్వగుణ పరిచ్ఛేద రూపమైన నీ స్తుతిని వంద శ్లోకాలలో చేసిన నా గొప్ప దోషాన్ని, ఇతరులను ఓదార్చే నైపుణ్యం గల నీవు, నిన్ను నీవే ఓదార్చుకొనే సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ క్షమించాలి తల్లీ! అని ప్రార్థించారు.

భగవానుడు మొదలైన ఇతరుల పట్ల చేసిన అపరాధాలకు వారు క్రోధపరులై దండనను విధించకుండా దయాదేవి వారి అంతరంగమందు చేరి అపరాధాలను క్షమింపజేస్తున్నది. భగవద్విషయకమైన మహాపరాధాలు దయాదేవి ప్రభావంచేతనే భగవంతుని ద్వారా సహింప బడుతున్నాయి. దయాదేవి యొక్క పరక్షమానిర్వహణ మిది.

ఘంటాంశుడైనందున - తాను దయాదేవికి కులక్రమాగత స్తుతి పాఠకుడైనందు వల్ల - పారంపర్యంగా వచ్చిన ధర్మాన్ని నిర్వహించడంలో కలిగిన అవినయమనే గొప్ప దోషం భగవద్దయ చేతనే సహింపబడాలి. క్రోధపరులైన వారిని దయాళువు లనుగా మలచిన దయాదేవి, ఆమె విషయంలో సాహసం చేయబడినప్పుడు ఆమె కినుక వహించకుండా తనను తానే క్షమను నిర్వహించుకోవాలి అనడం 'స్వక్షమా నిర్వహణం'

ఇతరులకు అనుగ్రహం కలుగునట్లు చేయుమని దయాదేవి ప్రార్థింపబడుతుంది కాని, దయాదేవికి అనుగ్రహం కలుగజేయడానికి దయాదేవికంటే ఇతరులను ప్రార్థించడం 'అనవస్థ' అవుతుంది. దయాదేవి స్వపర నిర్వాహకురాలవడం వల్ల 'అనవస్థ' పరిహరింపబడింది.

"మాతః స్వరూపమివ రంగపతేర్నివిష్టం
వాచా మసీమని పదావని! వైభవంతే ।
మోహాదభిష్టుతవతో మమ మందబుద్ధేః
బాలస్యసాహసమిదం దయయాసహేథాః॥ (పా.స. 1002)

జననీ! శ్రీరంగనాథుని స్వరూపం వలె అపరిచ్ఛేద్య విషయ మందు చేరి వాక్కుల కందని నీ మహిమను అజ్ఞానం వల్ల స్తోత్రం చేసిన మందబుద్ధి గల ఈ బాలుని స్తుతిరూపమైన సాహసకృత్యాన్ని సహింపుమని పాదుకాదేవిని దేశికులు ప్రార్థించారు.

పాదుకాదేవి యొక్క సహనం దయాదేవి ద్వారా ప్రార్థింపబడింది. ఇక్కడ దయాదేవి విషయంలో అద్వారకమైన సహనం ప్రార్థింపబడుతున్నది. "క్షాంతిస్తుతే సవిషయామమ దుర్వచోభిః" నా దుర్వచనం నీ క్షమాగుణానికి విషయమవుతుంది. అంటే, బరువైన క్షమాగుణం దుర్వచనాన్ని అణచి వేస్తుందని శ్రీ వత్సాంక మిశ్రులు శ్రీ వైకుంఠస్తవం (10) చేశారు.

దేశికులు దయాదేవిని, స్వపరనిర్వహణం సందర్శనీయమని ఈ దయాశతక సమాప్తి యందు ప్రార్థించారు. ఇలా నైచ్యాన్ని అనుసంధించడం విద్వత్కవుల సంప్రదాయం.

'మందస్య త్వయి వందినోమే' అని తన అల్పత్వాన్ని తెలుపడం దయ నీయతకు హేతువైన సాభిప్రాయ విశేషణాలవడం వల్ల పరికరాలంకారం.

ఉత్సాహ॥ వేదజాలములకునైన విశ్రుత ప్రభావవౌ
నీదు మహిమ దెలుపు నుడులు నేటి కాదియైనచో

సాదరమున వంది భంగి సన్నుతింపబూను నా
పేద తనము సైచుటొప్పు పేర్మికీడుగా దయా ॥

103. ప్రాయోదయే! త్వదనుభావ మహాంబురాశౌ
ప్రాచేతస ప్రభృత యోఽ పి పరం తటస్థాః।
తత్రావతీర్ణ మతలస్పృశమాప్లుతం మాం
పద్మాపతేః ప్రహసనోచిత మాద్రియేథాః ॥

అర్థం:- హే దయే = ఓ దయాదేవీ! త్వత్ + అనుభావ, మహాం బురాశౌ = నీ మహిమ అనే పెద్ద సముద్రమందు; ప్రాచేతస ప్రభృతయః, అపి=వాల్మీకి మొదలైన మహర్షులు కూడా; ప్రాయః = తరచుగా; పరం = మిక్కిలి; తటస్థాః = గట్టుననే నిల్చినవారు. తత్ర = అక్కడ-ఆ సముద్రమందు; అవతీర్ణం = దిగినట్టి; అతల స్పృశం = అడుగును ముట్టనట్టి; ఆప్లుతం = తేలుతున్నట్టి వాడను (అతఏవ = కావుననే); పద్మాపతేః = శ్రీనివాసుని యొక్క; ప్రహసన+ఉచితం = హాసానికి ఆస్పదుడనైన; మాం = నన్ను; ఆద్రియేథాః = ఆదరింతువు గాక.

తా: ఓ దయాదేవీ! నీ వైభవాంభోధిలోకి వాల్మీక్యాది మహర్షులే దిగకుండా గట్టు మీదనే నిలిచిపోయారు. నేను ఆ సముద్రంలో దిగినాను. అయినా నీటి అడుగున నేలకు చేరలేదు. అగాధమైన ఆ సముద్రంలో మునుగుతూ, తేలుతూ కొట్టుమిట్టాడుతున్నందు వల్ల పద్మావతి, పద్మాపతి అనే దివ్యదంపతుల యొక్క నగుబాటుకు గురియైన నన్ను నీవే ఆదరించాలి తల్లీ!

వ్యాఖ్య:- శ్రీనివాసుని దయా మహిమను సాహసంతో స్తుతించి దివ్య దంపతులకు వినోదాన్ని కలిగించిన తనను దయాదేవి విశేషంగా ఆదరించాలని కవికేసరి ప్రార్థన.

గత శ్లోకమందు వేదాలు చేయలేని పనిని చేసిన తన సాహసాన్ని సహించాలని వినయంగా ప్రార్థిస్తూ, దయాదేవి వైభవం వేద ప్రతిపాద్యమని వర్ణింపబడింది.

ఇతిహాస పురాణాలను రచించిన వాల్మీకి వ్యాస పరాశరులు కూడా భగవానుని మహిమను, చరిత్రను వర్ణించారే కాని దురవగాహమైన భగవద్దయా మహిమను

స్పృశించ లేకపోయారు. మహర్షులు చేయజాలలేని దయా ప్రభావస్తుతిని తాను సాహసించి చేసినందువల్ల దివ్య దంపతులు ఆనందించారనీ, అల్పబుద్ధితో అపరిచ్ఛేద్యమైన దయాస్తుతిని చేసినందు వల్ల, దయాదేవి కినుక పూనక తనను ఆదరించాలని ప్రార్థిస్తూనే, దయా మహిమ వేదోప బృంహణమైన ఇతిహాస పురాణాలచే ప్రతిపాద్యమని ఈ శ్లోకమందు ఉగ్గడింప బడింది.

ప్రాయోదయే! త్వదనుభావ మహాంబురాశౌ

ప్రాచేత సప్రభృతయోఽపి పరం తటస్థాః:-

"మహతః శ్రీనివాసాంబురాశేః" (45 శ్లో) శ్రీనివాస భగవానుడు మహా సముద్రమని చెప్పబడింది. భగవానుడు 'కరుణా వరుణాలయం' (9 శ్లో) దయా సముద్రుడుగా స్తుతింపబడినాడు. దయాదేవి నిరవధి సింధువుగా (13 శ్లో) ప్రశంసింపబడింది. ఇక్కడ దయామహిమ మహాసముద్రంగా స్తుతింపబడుతున్నది.

తొమ్మిదవ శ్లోకమందు దయాసముద్రుడైన శ్రీనివాస భగవానుడు తటస్థులైన చేతనులున్న చోటికి ప్రార్థనాపేక్ష లేకయే వచ్చి స్వయం వ్యక్తిగా - తానే ప్రత్యక్షమై వెలిశాడు. దయా ప్రభావాన్ని వర్ణించే ఈ స్తోత్ర కావ్యమందు మార్గదర్శియైన మహర్షి - ప్రాచేతసుడు - వాల్మీకి స్మరింపబడుతున్నాడు.

ప్రాచేతస ప్రభృతులు - ప్రకృష్ట చేతస్కులు, సర్వజ్ఞులు భూతభవిష్యద్వ్యవహిత క్రాంతదర్శులైన కవులు, వశ్యవాక్కులు అంటే, ఉన్నచోటనే ఉండి జగత్తులో ఏమి జరిగిందో, జరుగగలదో ఉన్నదున్నట్లుగా చూచేవారు, చూచినవాటినే చెప్పేవారు. వాల్మీకి, వ్యాస, పరాశరులు వేదాలసారాంశాన్ని సరళమైన సంస్కృత భాషలో రామాయణ, భారతేతిహాసాలను, విష్ణుపురాణాదులను విస్తారంగా రచించారు. కాని ఆ మహర్షులు అగాధమైన భగవద్దయా మహిమ అనే మహాసముద్రంలోకి దిగ లేదు. అపరిచ్ఛేద్యమైన దయా ప్రభావాన్ని పరిచ్ఛేదించడానికి ప్రయత్నించ లేదు.

వాల్మీకి 'అప్రమేయం హి తత్తేజః' అని భగవంతుని పట్ల అప్రమేయత్వాన్ని ప్రకటించారు. దయాదేవి విషయంలో ఆ మాత్రం చెప్పడానికీ శక్తిలేని వారయ్యారు. కేవలం దయాదేవిని మాత్రం "కృపయా పర్యపాలయత్" దయతో బ్రతికించెను

అని పేర్కొన్నాడు. దయాదేవి మహిమ అనే సముద్రం అగాధమని తెలిసి, దూరంగానూ ఉండక, దగ్గరకు వచ్చి తీరమందే మహర్షులు నిల్చియున్నారు. తటమందే అంటే భగవానుని యందే నిల్చారు.

తత్రావతీర్ణ మతలస్పృశ మాప్లుతం:- తటమందున్న వారిని భగవానుడు అనుగ్రహించాడు కదా! తటమందున్న మహర్షులను కూడా అనుకరించక మందుడు కాబట్టి సాహసించి దయానుభావ మహాంబు రాశిలోకి దిగాడు.

"ఆంజనాద్రీశ్వర దయా మభిష్టౌమినిరంజనామ్" (10 శ్లో) అని ప్రతిజ్ఞ చేసి "అనుచర శక్త్యాది గుణాం - స్వయం ప్రభూతాం ప్రమాణయామిదయామ్" అని దయా ప్రభావాన్ని స్తుతింప నారంభించారు ఆచార్యులు.

క్రాంతదర్శిత్వం లేనందువల్ల ఏ మాత్రమనుమానించకుండా మహా సముద్రంలోకి దూకాడు. దూకగానే నీటిలో మునిగాడు. కాని నీరు అగాధమై ఉండడం వల్ల నేలభాగానికి చేరలేదు. దయాదేవి మహిమ తనకు అంతుబట్టలేదు. సంపూర్ణంగా దయా ప్రభావం తెలియని వాడై తిక మక పడుతున్నాడు. దిగిన వెంటనే మునుగడం, మునిగినా ఎక్కువలోతు ఉండడం వల్ల అడుగుభాగాన్ని తాక లేదు. అలల కల్లోలం వల్ల మునిగినవాడు పైకి తేలాడు. కెరటాల తాకిడికి నీటి ఉపరితలంపైన ఉండలేక మళ్ళీ మునుగుతూ, తేలుతూ, మహాసముద్రంలో పడి అతలాకుతలమవుతున్నాడు కవికేసరి.

పద్మాపతేః ప్రహసనోచితమ్మా మాద్రియేథాః:- మార్గదర్శకులైన మహర్షులే సముద్రంలోకి దిగక తటస్థులై యుండగా, దేశికులు సాహసించి దిగి అంతుముట్ట లేక - పట్టలేక, మజ్జనోత్ప్లవనరూపమైన బాధతో కొట్టుమిట్టాడుతున్న స్థితిని చూచి దివ్య దంపతులు నవ్వుకొంటున్నారు. వారి నగుబాటుకు గురియైనాడు.

ఫద్మాదేవీ, పద్మాపతియైన శ్రీనివాస దంపతులు తల్లిదండ్రులు కాబట్టి పుత్రుని సాహసానికి కోపగించుకొనే అవకాశం లేదు. బాలుడు వచ్చిరాని మాటల నాడుతుంటే, తప్పటడుగులు వేసి పడుతూ, లేస్తూ ఉంటే చూస్తున్న తల్లిదండ్రులకు ముద్దుముచ్చటగా నవ్వు మొలకెత్తుతుంది.

హాస్యగాడు మాటలచేతనూ, చేష్టల చేతనూ ప్రభువుకు వినోదాన్ని కలిగించడం కూడా లోక పరిపాటియేకదా!

"మందః కవియశః ప్రార్థీ" అన్న చోటనే "గమిష్యామ్యుపహాస్యతామ్" అని ఉన్నందు వల్ల నగుబాటు పాలవడమూ నైసర్గికమే.

'హసనం' అంటే తిరస్కార భావంతో నవ్వడం, హేళన చేయడమనే అర్థం. ప్ర, అనే ఉపసర్గ బలం వల్ల 'ప్రహసనం' అంటే ఆదరభావంతో సంతోషించడమనే అర్థమవుతుంది.

గత శ్లోకంలో స్వపర నిర్వహణ రూపమైన ఫలం వ్యంజితం. దీపం తనను తానే ప్రకాశపరచుకొంటూ ఇతర వస్తువులనూ ప్రకాశ పరచేరీతిగా దయాదేవి సాహసించి అపచారాలను చేసిన వ్యక్తి దోషాలను భగవానుని చేత క్షమింపజేస్తుంది. తన విషయంలో ఆచరించిన నేరాలను ఇతర పురుషకారం లేకుండా తానే క్షమిస్తుంది. ఈ స్వపర నిర్వహణమనే ఫలం సందర్శితమని శతకాంతంలో వర్ణింపబడింది.

'ప్రహసన' శబ్దం వల్ల దృశ్యకావ్యం సూచితం.

భాణమనే ఏకాంకం గల 'ప్రహసనం' ఒకే ఒక నటుని చేత నిర్వహింప బడుతుంది. నాటక భేదాలలో ప్రహసనమొకటి.

దయావైభవ మహాసముద్రంలో దిగి కూడా ఆ మహిమను పూర్తిగా వివరించ నందువల్ల ప్రహసనోచితుడైన - అగచాట్ల పాలైన తనను దయాదేవియైనా ఆదరించక పోతే తన గతియేమవుతుందో అని వేడుకొంటున్నారు.

ప్రాచేత సప్రభృతులైన మహర్షులు కూడా చేయక వదలివేసిన, పూర్తిగా తెలిసి చేయడానికి శక్యం కానిదైన దయాదేవి యొక్క మాహాత్మ్యాన్ని నూరు పద్యాలలో వర్ణించిన తనను దివ్యదంపతులు లోలోపల మెచ్చుకొంటూ, మందహాసం చేస్తున్నారనీ, దయాస్తుతి రూపకంగా శ్రీ, శ్రీనివాసుల హృదయాలకు ఆహ్లాదకరమైన, ఉత్తమ వాచిక కైంకర్యమాచరించిన తనను దయాదేవి అవశ్యంగా ఆదరించి పోషించాలనీ దేశికులు ప్రార్థిస్తున్నారు. ఈ శతకంలో దయాదేవిని సంబోధిస్తూ స్తుతిస్తున్న చివరి శ్లోకమిది.

ఉత్సాహ॥ నీ ప్రభావమును మహాబ్ధి నిన్ జొరంగలేక వ్యా
స ప్రముఖులు గట్టు నిల్వ సాహసించి లోనికిన్
గు ప్రయత్న మొప్పడిగ్గి క్రుంకి లోతు జూచు నన్
శ్రీ ప్రియునకు హాస్య పాత్రు జే కొనంగదేదయా ॥

104. "వేదాన్త దేశిక" పదే విని వేశ్య బాలం
దేవో "దయా శతక" మేతదవాదయన్మామ్ ।
వైహారికేణ విధినా సమయే గృహీతం
వీణా విశేషమివ వేంకటశైల నాథః ॥

అర్థం:- వేంకటశైలనాథః = వేంకటాచలపతియైన; దేవః = క్రీడాపరుడైన శ్రీనివాస భగవానుడు; బాలం = బాలుడనైన నన్ను; వేదాన్త దేశిక పదే = వేదాంతాచార్య పదమందు; వినివేశ్య = ఉంచి; వైహారికేణ = విహారార్థమైన; విధినా = రీతిచేత; సమయే = ఒక సమయాన; గృహీతం = గ్రహింపబడిన; వీణా విశేషం, ఇవ = ఒక వీణను వలె; మాం = నన్ను; ఏతత్ = ఈ; దయాశతకం = దయా శతకమనే స్తోత్రాన్ని; అవాదయత్ = నినదింప జేసెను.

తా: శ్రీ వేంకటాచలాధిపతియైన శ్రీనివాస భగవానుడు బాలుడనైన నన్ను వేదాన్తాచార్య పదమందు ఉంచడమేకాక, వినోదార్థమై వీణను వలెనన్ను చేపట్టి ఈ దయాశతక స్తోత్రాన్ని మనోజ్ఞంగా నినదింపజేశాడు.

వ్యాఖ్య: శ్రీ వేంకటాచలపతియైన శ్రీనివాసుడే తననొక ఉపకరణంగా గ్రహించి దయాశతకాన్ని రచించాడని సాత్త్విక త్యాగాన్ని దేశికులనుష్ఠించే శ్లోకమిది.

క్రింది రెండు శ్లోకాలలో సాహసం చేసిన తనను క్షమించి ఆదరించాలని ప్రార్థింపబడినది. ఈ శ్లోకమందు దయాశతకం భగవంతుని చేతనే రచింపబడిందని ఈ స్తోత్ర ప్రభావం ప్రకటింప బడుతున్నది.

వేదాన్త దేశిక పదే వినివేశ్యబాలమ్:- 'బాల' శబ్దానికి అజ్ఞాన దశలో ఉన్న చిన్న పిల్లవాడని అర్థం. పరిణత బుద్ధిలేనివాడు. దేశికులు తనను బాలునిగా చెప్పు కొనడం వినయానికి - నైచ్యాను సంధానానికి చిహ్నం. బృహదారణ్యకోపనిషత్తులో

"పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠా సేత్" - అనే వాక్యమున్నది (5 అధ్యా, 5 బ్రాహ్మణం) నేర్వవలసిన వేద శాస్త్రాలన్నిటినీ నేర్చిన వ్యక్తి తన పాండిత్య ప్రకర్షను ప్రకటించుకొనకుండా ఏమీ తెలియని బాలుని వలె మౌనంగా ఉండవలెను - అని ఆ ఉపనిషద్వాక్యానికి అర్థం. 'జ్ఞానే మౌనం' అన్న వాక్యం కూడా అవసరము న్నప్పుడు మాత్రమే జ్ఞానాన్ని ప్రకాశింపజేయాలి. ఎంత జ్ఞానం తనకు ఉన్నప్పటికీ తాను మౌనంగా ఉండడమే భూషణంగా ఉంటుంది అనే అర్థమిస్తుంది కదా!

ఆత్రేయ రామానుజుల సన్నిధిలో సకలవేదవేదాంగ వేదాంతాది శాస్త్రాలను చిన్నతనాననే దేశికులు అభ్యసించారని వారి చరిత్ర వల్ల తెలుస్తున్నది. సంకల్ప సూర్యోదయ నాటకమందు "వింశత్య బ్దే విశ్రుతనానావిద్యః" ఇరువై యేండ్ల వరకే విద్యలన్నిటినీ అభ్యసించినట్లును "త్రింశద్వారం శ్రావితశారీరక భాష్యః" ముప్పది సార్లు శ్రీ భాష్య ప్రవచనం పూర్తియైనట్లును అభిహితమై యున్నది.

దేశికులు ఐదేండ్ల బాలుడుగా ఉన్నప్పుడు, కంచి వరదరాజస్వామి దేవాలయ మందు శ్రీ వాత్స్య వరదాచార్యులు (నడాదూర్ అమ్మాళ్) వేదాంత కాలక్షేపం చేస్తుండగా, మేనమామగారైన ఆత్రేయ రామానుజాచార్యులు వెంటగొని పోయారు.

ఆచార్యులు ప్రవచనమాపివేసి రామానుజులతో కుశల ప్రశ్నాదిగా సంభాషించారు. తర్వాత ఆచార్యులు తాము ఆపివేసిన సందర్భం జ్ఞప్తికి రాక ఆలోచిస్తుండగా, ఈ బాలుడే 'తానాగోష్ఠిలో ప్రవేశించేసరికి 'శాస్త్రయోనిత్వాత్' అనే వాక్యం వినబడింది స్వామీ' అని ఎంతో వినయంగా వెల్లడించాడు. ఈ బాలుని అద్భుతశక్తిని చూచిన వాత్స్య వరదాచార్యుల వారు.

"ప్రతిష్ఠాపిత వేదాన్తః ప్రతిక్షిప్త బహిర్మతః ।

భూయా స్త్రైవిద్య మాన్యస్త్వం భూరికల్యాణ భాజనమ్॥"

'వేదాన్తాలకు చక్కని అర్థాన్ని జగత్తులో స్థాపించి, ఇతర మత సిద్ధాన్తాలను సమూలంగా నిరసించి, త్రైవిద్యమాన్యుడవై నీవు అపరిమిత మంగళాస్పదుడవగుదువు గాక' అని ఆశీర్వదించారు. ఈ విషయం 'అధికరణసారావళి' యందలి ద్వితీయ శ్లోకంలో కృతజ్ఞతగా విశదీకరింపబడింది.

పరమాచార్యులు ఈ బాలుణ్ని ఆశీర్వదించిన విషయాన్ని వేంకట శైలనాథుడైన శ్రీనివాస భగవానుడు 'సత్యం విధాతుం నిజభృత్య భాషితమ్" తన భక్తుడు పల్కిన మాటను సత్యం చేశాడు - అన్నట్లు అనుగ్రహించి, వేదాన్త దేశిక స్థానమందు నివిష్టుణిగా చేశాడు కదా!

'వేదాన్త దేశిక' పదం శ్రీనివాస భగవానునికే చెల్లుతుంది.

"కన్యాశ్రవణ సంజాతం కృపావాత్సల్య సాగరమ్ ।

సర్వేషాం ప్రథమాచార్యం శ్రీనివాస మహంభజే ॥"

అని నిత్యం అనుసంధింపబడుతుండే శ్లోకమిది.

'వేదాన్త దేశిక' పదం వాస్తవంగా బిరుదు కాదు. అదొక సంజ్ఞ. భగవంతుడొక్కడే ఆ పదంచే వ్యవహృతుడు. 'దేశిక' పదం 'ఆచార్య' పదానికి పర్యాయం కదా!

"వేదాన్త కృద్వేదవిదేవ చాహమ్" (భ.గీ. 15-15)

వేదాన్తకర్తను, వేదజ్ఞుడను నేను - అని శ్రీకృష్ణుడే స్పష్టపరచాడు. భగవానుడు తన దేశిక పదమందే నన్ను ఉంచాడని దేశికుల భావం. స్తోత్ర రత్న భాష్యంలో "స్వకమితి హరిదత్తం - నిగమాన్తాచార్యకమ్" - వేదాన్తాచార్య అనే తనదైన నామధేయాన్ని నాకు భగవానుడు అనుగ్రహించాడు - అని దేశికులు కృతజ్ఞతను ప్రకటించుకొన్నారు. దేశికుల భాగధేయమెంత గొప్పదో ఊహింపశక్యం కాదు కదా!

1268 ఏ.డి.లో ఆవిర్భవించిన ఈ ఆచార్యులకు కన్నవారు 'వేంకటనాథుడు' అని నామకరణం చేశారు. తిరువహీంద్ర పురంలోనే కొన్నాళ్ళు నివసించి, ఆచార్యోపదిష్టుడై గరుడమంత్రాన్ని జపించి, హయగ్రీవానుగ్రహాన్ని కూడా పొంది, అధీత సకల విద్యుడై, భారతదేశంలోని దివ్య తీర్థక్షేత్రాలన్ని సందర్శించి, బదరి నుంచి కన్యాకుమారి వరకు - యాత్ర చేసి తిరిగి వచ్చి కాంచీపురంలో అశేష ప్రజ్ఞాధురీణుడైన వైష్ణవాచార్యుడుగా లబ్ధప్రతిష్ఠుడై జీవితం గడుపుతున్న సందర్భమది.

"శ్రీమచ్ఛ్రీ రంగనాథస్య విష్వక్సేనస్యశాసనమ్" అని వ్రాసియున్న ఆహ్వాన పత్రం వచ్చినందువల్ల వేంకటనాథాచార్యుల వారు శ్రీ రంగక్షేత్రానికి వెళ్ళారు.

శ్రీరంగంలో తిరుమంగైయాళ్వార్లు ఆరంభించిన ఆళ్వార్ల దివ్య ప్రబంధా ధ్యయనోత్సవం ప్రతి సంవత్సరం వైభవంగా జరుపబడుతున్నది. ఈసారి అద్వైత విద్వాంసులు దివ్యప్రబంధాధ్యయనోత్సవాన్ని జరుపకుండా ఆటంక పరచినందువల్ల దేవరవారు ఎప్పటిరీతిగా అధ్యయనోత్సవాన్ని నిర్వహింప జేయాలని అక్కడి అర్చకులు, ఆచార్యులందరు ప్రార్థించారు.

వేంకటనాథ స్వామివారు శ్రీ రంగనాధస్వామిని ప్రార్థించి, అద్వైత విద్వాంసులతో రేయింబవళ్ళు వాదించి, వాదనలో వారిని నిరుత్తరుల చేశారు. 'సారస్సారస్వతానాం – "సంహితా సార్వభౌమీ" అని ప్రత్యేకంగా నమ్మాళ్వార్ల దివ్య ప్రబంధం – తిరువాయ్‌మొషి – యొక్క ప్రాశస్త్యం ప్రకటింపబడింది. మళ్ళీ అధ్యయనోత్సవం పూర్వం కంటె అతివైభవంగా జరుపబడింది. నేటికీ జరుపబడు తున్నది.

శ్రీరంగనాథ ప్రభువు మెచ్చి వివిధ శాస్త్ర వాద నైపుణ్యం చేత అద్వైత పండితుల వాదనను ఖండించి, పునః దివ్యప్రబందాధ్యయనోత్సవాన్ని ఇతోఽధిక వైభవంగా నిర్వహింప జేసిన సామర్థ్యానికి చిహ్నంగా వేంకట నాథాచార్యులకు "వేదాన్తా చార్య" బిరుదును అనుగ్రహించాడు.

ఈ విషయాన్ని అధికరణ సారావళిలో ప్రథమ శ్లోకమందలి ఉత్తరార్థంగా "విశ్వస్మిన్నామ రూపాణ్యను విహితవతా తేన దేవేనదత్తాం, వేదాన్తాచార్య సంజ్ఞా మవహిత బహువిత్సార్థ మన్వర్థయామి" విశ్వంలో అన్ని పదార్థాలకు నామరూపాల నేర్పరచిన దేవతా సార్వభౌముడిచ్చిన, 'వేదాన్తాచార్య'త్వాన్ని సంజ్ఞగా (బిరుదని గర్వపడక) నమ్రతతో స్వీకరించినట్లు దేశికులు వెల్లడించారు.

శ్రీరంగనాథుడిచ్చిన 'వేదాంతాచార్య' పదాన్ని తిరుమల శ్రీనివాసుడిచ్చినట్లు 'వేంకటశైలనాథః' అని పేర్కొనబడినదేమి? అన్ని దివ్య దేశాల యందు నామరూప భేదాలతో వెలసియున్న ఆ దేవదేవుడు – శ్రియః పతి – ఒక్కడే అనడం సర్వశాస్త్ర సమ్మతం.

తిరుప్పాణాళ్వార్లు 'అమలనాది పిరాన్' ప్రబంధమందు మూడవ పాశురంలో శ్రీరంగనాథునికీ, శ్రీ వేంకటేశ్వరునికీ గల ప్రత్యేక చిహ్నాలను సందర్శించిన అనుభూతిని ప్రకటించారు.

"వడ వేంగడమామలై వానవర్‌గళ్ శన్దిశెయ్యనిన్ఱాన్ అరంగత్తరవినణైయాణ్ అన్దిపోల్ నిఱత్తాడైయు మదన్మేల్ అయనై పడైత్తదోరెషిల్ ఉన్దిమేల్" ఉత్తర దిక్కున వేంకటాద్రి యందు నిత్య సూరులు వచ్చి, ఆరాధింపదగినట్లు నిల్చియున్న వాడు వేంకటేశ్వరుడు. శ్రీరంగమందు శేషశాయిపై సంజకెంజాయ వంటి పీతాంబరమూ, బ్రహ్మకు జన్మస్థానమైన నాభి కమలం కలవాడు శ్రీ రంగనాథుడు. శ్రీ వైకుంఠనాథుడు శ్రీరంగక్షేత్రానికి పోయే ముందు శ్రీ వేంకటాద్రిపైన మొదట దిగి, కొంతకాలం విశ్రమించాడట. కాబట్టి వేంకట శైలనాథుడే 'వేదాన్త దేశిక' పదమందు నివేశింప జేశాడనడం సముచితంగా ఉన్నది.

"కృష్ణాఖ్య విప్రవేదాన్త దేశికత్వ ప్రదాయచ" (శ్రీ వేంకటేశాష్టోత్తర శతనామావళి) కృష్ణుడనే బ్రాహ్మణునికి 'వేదాన్త దేశిక' బిరుదును శ్రీనివాసుడు అనుగ్రహించినట్లున్నది. కాబట్టి పూర్వ జన్మలో దేశికులకు కృష్ణుడని పేరు ఉండవచ్చు. ఆయనకు మొదట శ్రీనివాసుడొసగిన బిరుదునే శ్రీ రంగనాథుడు దేశికులకు ఈ జన్మలో స్థిరపరచాడని విజ్ఞుల మాట.

వైహారికేణ విధినా సమయేగృహీతం వీణావిశేషమివ వేంకటశైలనాథః:- శ్రీనివాసుడు ఒక సమయాన వినోదం కోసం గ్రహించిన వీణావాద్యం లాగా దయాశతక స్తోత్రాన్ని గానం చేశాడని అర్థం. ఇక్కడ వైణికుడు వేంకటేశ్వరుడు. వీణ మాత్రం దేశికులే. వీణాగానం దయాశతక స్తోత్రం అని గమనీయం.

వీణ తనంత తాను పలుకదు. ప్రవీణుడే పలికించాలి. వీణ అచేతనం కదా! దేశికులు తనను అచేతన తుల్యంగా భావించుకొన్నారు. స్వామి పలికిస్తే దేశికులు పలికారు. ఆ శ్రీనివాసుడే దేశికులను నిమిత్త మాత్రునిగా ఉంచి దయాస్తుతి చేశాడని సారాంశం. 'సమయే గృహీతం' – అంటె వైణికుడు వినోదం కోసం వీణావాదనం చేయాలని కోరుకొన్న సమయాన వీణను గ్రహిస్తాడు. దయాస్తోత్రం చేయాలని

శ్రీనివాసుడు సంకల్పించుకొన్న సమయాన దేశికులను వైణికుడు వీణను గ్రహించునట్లే, ఒక ఉపకరణంగా వినియోగించుకొన్నాడు. ఇది దేశికుల వారి సుకృతమే.

వీణతో సంతోషంగా గానంచేస్తూ, ఇతరులను సంతోషింపజేస్తున్నప్పుడు గౌరవమంతా వైణికునికే చెందే రీతిగా, ఈ దయాశతక స్తోత్ర గ్రంథ గౌరవం కూడా శ్రీనివాసునికే చెందుతుంది. కాబట్టి దేశికులీ విధంగా సాత్త్విక త్యాగాన్ని అనుష్ఠిస్తున్నారు.

"నాహంకర్తా' - నాహంకారయితా" - నేను చేసేవాణ్ని కాను, చేయించే వాణ్ని కూడా కాను - అని ప్రపన్నులు భావిస్తారు. స్వరూప త్యాగం, కర్తృత్వ త్యాగం, ఫలత్యాగం అని త్రివిధ త్యాగం చేయడం వైష్ణవులకు ఆవశ్యకం.

జీవాత్మ యొక్క కర్తృత్వం అంతర్యామియైన పరమాత్మ యొక్క అనుమతిచే సాగుతుండగా, తనను కర్తగా భావించేవాడు దుర్మతి అనబడినాడు (భ.గీ. 18-16)

"యస్యనాహంకృతో భావో, బుద్ధిర్యస్య నలిప్యతే ।
హత్వాఽపి సఇమాన్ లోకాన్ నహంతి ననిబధ్యతే॥" (భ.గీ. 18-17)

'పరమపురుషుడే కర్త' అనే అధ్య వసాయంతో కర్మలను 'నేనే చేస్తున్నాను' అనే అభిమానం - అహంకారం - లేక పోవడం కర్తృత్వ త్యాగమనబడుతుంది. 'ఈ కర్మయందు నాకు కర్తృత్వం లేనందువల్ల దీని ఫలం నన్ను అంటుకోదు; ఇది నా కర్మ కాదు, అనే బుద్ధి జనించడం 'ఫలత్యాగ' మనబడుతుంది. జీవాత్మ యొక్క కర్తృత్వం పరమాత్మకు లోనైనదని "పరాత్తు తచ్ఛ్రుతేః" (2-3-40) అనే బ్రహ్మ సూత్రం ఉపపాదిస్తున్నది. ఇట్టి మనోవృత్తి సత్త్వ గుణ వృద్ధి వల్లనే కలుగుతుంది. కాబట్టి, ఇలాంటి భావం కల వ్యక్తి భీష్మద్రోణాదులనే కాదు లోకులందఱిని యుద్ధమందు చంపివేసినా, చంపనివాడే అవుతాడు. ఆ యుద్ధకర్మతో సంబంధింప నందువల్ల దాని వలన కలిగే ఫలాన్ని కూడా అతడనుభవింపలేడు - అని శ్రీకృష్ణ భగవానుడు బోధించి, పార్థుణ్ని కర్తవ్యోన్ముఖునిగా చేశాడు కదా! జ్ఞాన వైరాగ్య భూషణులైన వేదాంత దేశికులు శ్రీనివాసుడే దయా శతక స్తోత్ర కర్త యని సాత్త్విక త్యాగనిరతితో స్తోత్ర ప్రభావాన్ని ఇనుమడింపజేశారు.

దేవో 'దయాశతక' మేత దవాదయన్మామ్:- శ్రీనివాస దేవుడు నన్ను ఈ దయా శతకాన్ని పాడించాడు. ద్వికర్మక ప్రయోగవాక్యమిది. నాచే పాడించాడని భావం. "ఏషహ్యేవ సాధుకర్మకారయతి" - శ్రుతివాక్యం 'ఈ దేవుడే ఉత్తమ కార్యాన్ని చేయిస్తాడు' అనే అర్థాన్ని తెల్పుతుంది. ప్రయోజక కర్తృత్వం దేవునికే కలదు. ప్రయోజ్య కర్తృత్వం అచేతనమైన వీణకూ, వేదాన్త దేశికులకూ సమానమే. "వేంకటేశావతారోఽయమ్" అని కుమార వరద దేశిక ప్రభృతులు శ్రీ వేంకటేశ్వరుడే (వేదాంత దేశికులు) వేంకటనాథుడుగా అవతరించాడని సుశ్లోకించినందువల్ల ప్రయోజక, ప్రయోజ్య కర్తృత్వాలు రెండూ శ్రీనివాస దేవునికే కలవని చెప్పిన నట్లైనది. 'దేవః' - అనే పదం ('దివ్' ధాతువు కాంతి, క్రీడ అనే అర్థాలను బోధిస్తుంది) దేవుడు అనే కాక విహార - క్రీడా - రసికుడు అనే అర్థాన్ని కూడా తెల్పుతుంది. జగత్తు శ్రీనివాసుని లీలా విభూతియే కాబట్టి, దేవుడు వేదాన్త దేశికులు అనే వీణ మీదనే దయా శతకాన్ని సర్వశ్రుతి మనోహరంగా పలికించాడు. వీణా విశేష మనడం వల్ల ఈ స్తోత్రానికి రామాయణం వలె తంత్రీలయ సమన్వితత్వమూ ద్యోతకమవుతున్నది. వైదిక మంతా దైవికమే కాబట్టి 'దేవ' శబ్దం "దైవంచైవాత్ర పంచమమ్" అనే భగవద్గీతా వాక్యాన్ని (18-14) స్మరింపజేస్తున్నది. మనో వాక్కాయాలచే చేయబడే సమస్త కర్మల ఉత్పత్తికి (శాస్త్ర విధి నిషేధ కర్మలకైననూ) అయిదు కారణాలు చెప్పబడినాయి.

"అధిష్ఠానం తథాకర్తా కరణంచ పృథగ్విధమ్ ।
వివిధాచ పృథక్ చేష్టా దైవంచైవాత్ర పంచమమ్॥"

(1) అధిష్ఠానం - జీవాత్మ చేత అధిష్ఠింపబడుతున్న మహాభూత సంఘాత రూపమైన 'శరీరం'

(2) కర్త - 'జ్ఞోఽత ఏవ' (2-3-19) బ్ర.సూత్రం వల్ల జ్ఞాతృత్వం, 'కర్తాశాస్త్రార్థ వత్త్వాత్' (2-3-33) బ్ర. సూత్రం చేత కర్తృత్వం ఉపపాదింప బడిన 'జీవాత్మ'

(3) కరణం - వేర్వేరు వ్యాపారాలు గల వాక్పాణి పాదపాయూపస్థలు అనే "పంచకర్మేంద్రియాలు, మనస్సు".

(4) చేష్ట – ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే పంచ వాయువుల వృత్తులు అనబడే 'వివిధ చేష్టలు'.

(5) దైవం – 'అంతర్యామియైన పరమాత్మ'

కర్మహేతువుల సమూహమందు ఐదవదైన 'దైవం' ప్రధాన హేతువుగా గీతాచార్యునిచే ఉపదిష్టమైనది.

దయాశతకమవాదయత్:– దయాశతకాన్ని వీణపై గానం చేశాడు అని అర్థం.

"య ఇమే వీణాయాంగాయంతి, ఏతం తేగాయంతి, తస్మాత్తే ధన సనయః" (ఛాందోగ్యోపనిషత్ ప్రథమ ప్రపాఠకమందు 7ఖం, 6) 'సనిః' అంటే లాభం. ధనలాభం కలవారు అంటే ఫలప్రదుడైన భగవానునిచే వీణాగాన కళా సమ్మానాన్ని పొందుతారు వైణికులు.

సామగాన చతరులు వీణయందు ఏదైతే గానంచేస్తారో అదంతా పరబ్రహ్మ యొక్క గుణగానమే అని, గానఫలాన్ని పొందేవారు ధన సనయులు అని ఈ ఉపనిషద్వాక్యార్థం. పరబ్రహ్మ యొక్క ప్రధాన గుణం 'దయ' యే కాబట్టి, దయా దేవియే గానం చేయబడినది.

వేదాన్త దేశికపదే వినివేశ్య దేవః దయాశతకమవాదయత్:– వేదాంత దేశిక స్థానమందు ఉంచి శ్రీనివాసుడు దయాశతక స్తోత్రాన్ని నినదింపజేశాడు – అనడం వల్ల దయాశతకంలో ఉభయ వేదాన్త రస్య రహస్యాలన్ని గర్భీకృతమైనవని అర్థమవుతున్నది.

'అధికరణసారావళి' అనే గ్రంథం బ్రహ్మసూత్రాలను నిర్ద్వంద్వంగా ఆవిష్కరించిన శ్రీ భాష్యమనే వేదాన్త శాస్త్రాన్ని సంస్కృత శ్లోకాలలో వివరణాత్మకంగా దేశికులచేత రచింపబడినదే. ఆ గ్రంథంలోనూ దయా శతకం లాగా సాత్త్విక త్యాగమే అనుష్ఠింపబడింది.

"--- పాంచ జన్యక్రమేణ, స్వాధ్మాతం రంగనాథః స్వయమితి ముఖరీకృత్య సమ్మో దతే స్మ" అని ఉపాంత-శ్లోకమందు శ్రీరంగనాథుడు దేశికులనే శంఖాన్ని

స్వయంగా పూరించి ఆమోదించాడట. అక్కడ దేశికులను శంఖంగా వినియోగించు కొన్నాడు శ్రీ రంగనాథుడన్నది స్పష్టమే కదా!

పరహృదయ విదారకమైనది శంఖధ్మానమని భగవద్గీత ద్వారా బోధపడు తుంది. సంస్కృత వేదాన్తం - శ్రీభాష్యం - స్వేతరమత సిద్ధాంతాలను ఖండిస్తూ, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని స్థాపించింది కదా!

అధికరణసారావళి - సంస్కృత వేదాన్తం - శంఖధ్మానమైతే, దయా శతకం - ద్రావిడ వేదాన్తం - వీణా వాదన మని సుశ్లోకితం. ఆళ్వార్ల దివ్య ప్రబంధ గానం మృదుమధురమై, మనస్సున కెంతో ఇంపైనది కదా!

"సద్యః పరమాత్మని చిత్తరంజకతమైః - స్వాదుసువ్యాహృతాని" వాస్తవంగా, ఆళ్వార్లకు ఉభయ విభూతి నాయకుడైన శ్రియః పతి వీణానిక్వాణం లాగా మధుర రసభూతుడు "యాష్నిశై" "మున్నల్ యాష్ పయిల్ సూల్ నరంబిన్ ముదిర్ శువైయే" (తి.వామొ. 2-3-7) తిరువాయ్ మొషి వీణాగానం లాంటిది. అనాదియై విలక్షణమై వీణాతంత్రుల యందు జనించి అభ్యసింపదగిన, గానశాస్త్ర లక్షణం కలిగి పక్వమైన రసం వలె భోగ్యభూతుడు సర్వేశ్వరుడని, సర్వేంద్రియాల వల్ల కలిగే అపార సుఖాలను తన భక్తులకు ఇచ్చే పరమ భోగ్యుడు శ్రీనివాసుడని నమ్మాళ్వార్ల శ్రీ సూక్తి. వేయేల? సంస్కృత వేదాంతం గంగానది లాగా గంభీరమైనది. కాలుష్యం కలది. ప్రచండ వేగం కలది. ద్రావిడ వేదాన్తం యమునా నది వలె నల్లనిది, చల్లనిది, మనోజ్ఞమైనది. ఈ రెండు నదులు ఒకే ప్రవాహం లాగా కలిసే దాకా వేర్వేఋగా ప్రవహించాయి. ఈ ఉభయ వేదాంత సరణిలో దేశికుల వారి సరస్వతి మేళవించినందువల్ల అది త్రివేణీ సంగమమయింది. విశిష్టాద్వైత సిద్ధాంతానికి తాను సహకరించిన ఔదార్యంవల్ల వేదాంత దేశికులు, శతాబ్దాల తరబడి పేరు, ప్రతిష్ఠలను పొందుతూనే ఉన్నారు.

నమ్మాళ్వార్ల అడుగుజాడలననుసరించి ఈ శ్లోకంలో సాత్త్విక త్యాగం దేశికులచే అనుష్ఠింపబడిందని స్ఫురిస్తుంది.

"ఎన్ శొల్లాల్ యాన్ శొన్న విన్ కవి యెన్బిత్తు తన్‌శొల్లాల్ తాన్ తన్నై క్కీర్తిత్త మాయన్ ఎన్‌మున్ శొల్లుమ్ మూవురువా ముదల్వనే" (తి.వా.మొ. 7-9-2)

బ్రహ్మాదులకు అంతర్యామియై సృష్ట్యాది వ్యాపారాలను తానే చేసి అవి, వారు చేసినారని ప్రసిద్ధి చేయించినట్లు, నాకు ముందు సంత చెప్పించి తానే చేసిన ఈ తిరువాయ్ మొషిని నేను చేసినట్లు లోకానికి చాటిన మహోపకారుడు. అట్టి శ్రియః పతికి "ఎన్‌శొల్లినిల్బన్" ఏమి ప్రత్యుపకారం చేయగలను? నేనేమీ చేయజాలనన్నారు వకుళాభరణులు. వేంకటశైలనాథుడే వేదాంత దేశికుల ద్వారా దయా శకత స్తోత్రాన్ని చేశాడు. అది శ్రీనివాస శతకం మాత్రం కాదు. తన స్తోత్రం తాను చేసుకొంటే ఆత్మ శ్లాఘన మనే దోషంగా పరిగణింప బడుతుంది. కాబట్టి, దయాదేవిని స్వేచ్ఛగా శ్రీనివాసుడే స్తుతించి ఆమె ప్రభావాన్ని ప్రపంచమందు ప్రకటించాడని కొందఱు వ్యాఖ్యాతల అభిప్రాయం.

అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన వేంకట శైలనాథుడు తన ప్రియ పత్నియైన దయాదేవిని స్తోత్రం చేయడానికి బహుశః సంకోచపడి, తాను తూప్పుల్ వేంకటనాథకవి (వేదాన్త దేశికులు)గా ఈ లోకంలో అవతరించాడు. ఈ అవతార ప్రయోజనాలలో ముఖ్యమైనది దయాదేవిని సంపూర్ణంగా స్తోత్రగానం చేయడమే, అని మరికొందఱి ఆశయం.

ఈ విధంగా వేంకటనాథుడు దయాశతకాన్ని రచించి, తన గొప్పతనానికి తానే ఋణపడి యున్నాడు. తాను సాధించిన నైపుణ్యం కారణంగా (వేంకటనాథుడు) "విశుద్ధానాం వాచాంస్తుతిపదమ్" (68) విమలమైన శ్రుతివాక్యాలచే స్తుతి పాత్రుడవుతున్నాడు.

ఈ శ్లోకం దేశికుల అవతార రహస్యాన్ని సదస్యం చేస్తున్నది.

ఉత్సాహ॥ విహరణార్థియగు వృషాద్రి విభుడు నన్ను బాలునిన్
మహితులైన నాథయామున ప్రభృతుల పాదస
న్నిహితు జేసి వీణగా గణించి సమయ మెరిగితా
రహి దయాశతకము బుధులు రాగిలంగబల్కెగా ॥

105. అనవధి మధికృత్య శ్రీనివాసానుకంపా
మవితథ విషయత్వా ద్విశ్వమవ్రీడయంతీ ।

వివిధ కుశల నీవీ వేంకటేశ ప్రసూతా
స్తుతిరియ మనవద్యా శోభతే సత్త్వభాజామ్ ॥

అర్థం:- అనవధిం = అంతంలేని; శ్రీనివాస+అనుకంపాం = శ్రీనివాసుని దయను; అధికృత్య = విషయీకరించి; వేంకటేశ ప్రసూతా = వేంకటేశునిచే ఉదయించినట్టి; అవితథ విషయత్వాత్ = సత్యమైన ప్రియమైన విషయమే కలిగియున్నందు వల్ల; విశ్వం = ప్రపంచాన్ని; అవ్రీడయంతీ = సిగ్గు పడునట్లు చేయనట్టి; వివిధ కుశల నీవీ = సకల విధ క్షేమాలకు మూలధనమైనట్టి; అనవద్యా = ఏ దోషం లేనట్టి; ఇయం = ఈ; స్తుతిః = స్తోత్రం; సత్త్వభాజాం = సత్త్వ గుణోపేతులకు; శోభతే = శోభిస్తుంది.

తా: శ్రీనివాసుని దయను స్తోత్ర విషయంగా గ్రహించి, అసత్యమేమీ లేనందు వల్ల విశ్వమందు ఏ ఒక్కడూ సిగ్గు పడే అవకాశం లేనట్టి, సకల క్షేమాలకు మూలధనమై, వేంకటనాథ దేశికులచే జనితమై, నిర్దుష్టమైన ఈ దయాస్తుతి సాత్త్వికులకు ఆనందదాయకంగా ఉంటుంది.

వ్యాఖ్య:- భగవత్పరతంత్రులై తాము వ్రాసిన దయాస్తుతి నిర్దుష్టమై, సకల శుభప్రదమై, శిష్టజన పరిగ్రహయోగ్య మైనదని తెల్పబడుతున్నది.

సాత్త్విక త్యాగం చేసిన తర్వాత స్తుతి విషయ వైలక్షణ్యమిందు నిరూపింప బడుతున్నది.

అనవధి మధికృత్య శ్రీనివాసానుకంపాం:- శ్రీనివాస భగవానుని దయకు ఎల్లలు లేవు. అపారమైన, అనంతమైన ఆ దయాదేవిని అధికరించి స్తుతింపబడింది. దయాస్తుతి యైనందున ఇది అతి విలక్షణమైనది.

అవితథ విషయత్వాత్ విశ్వమవ్రీడయంతీ:- వితథ విషయాలు అంటే అబద్ధ ప్రలాపాలు లేనందువల్ల ఎవ్వరు కూడా సిగ్గుపడుటకు హేతువు కానట్టిది ఈ స్తుతి. సాధారణంగా స్తోత్రం చేసేవారు లేని గుణాలను ఆరోపించి, అబద్ధాలను అధిక ప్రియంగా చెబుతుంటారు. పుట్టుగ్రుడ్డివాణ్ని పుండరీకాక్షుడని వర్ణిస్తే, స్తుతింప బడిన వాడు తనకు లేని గుణం చెప్పబడిందని సిగ్గు చెందుతాడు. విన్న వారు కూడా

సిగ్గుపడుతారు. స్తోతయైన విద్వాంసుడు కూడా అసత్య మాడితినని సిగ్గు పడకమానడు కదా!

వేంకటేశ ప్రసూతయైన ఈ సుకుమారి – స్తుతి (స్త్రీ లింగం కాబట్టి) సత్యార్థ ప్రకాశికయే కాబట్టి, విశ్వంలో ఎవ్వరికినీ లజ్జను కలిగించేది కాదని చెప్పబడింది.

వివిధకుశలనీవీ:– 'నీవీ' అనేది శ్లిష్ట పదం. స్త్రీల కోక ముడికీ, మూలనిధికీ పేరు. దయాస్తోత్రాన్ని పఠించే వారికి సకల విధ శుభాలను సమకూర్చుతుంది. ఈ స్తుతియే వివిధ క్షేమాలకు నిధి. "సూతి మపవర్గ త్రివర్గయోః" – ప్రథమ దశకాంతమందు చెప్పబడినట్లు, ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలనే కాక, నాల్గవదైన మోక్ష ఫల పురుషార్థాన్ని కూడా ప్రసాదించే సత్తా కలది దయాస్తుతి.

వేంకటేశప్రసూతా స్తుతిరియమన వద్యా శోభతే సత్త్వభాజామ్:– 'వేంకటేశ' నామం పరమ పురుషునికీ, ఆచార్యులకూ పేరు. 'ప్రసూత' అనడం వల్ల నిర్మింపబడినది కాదు అని అర్థం వస్తుంది. శిశువుకు గర్భం నుంచి బహిర్నిస్సారణ మెట్లో, అట్లే పరమపురుషుని సంకల్పం వల్ల జనితమైన ఈ స్తుతి అందరికీ అభిమాన పాత్రమైనది. ఈ స్తోత్ర రూపమైన సాధుకర్మను పరమపురుషుడే (వేంకటేశ నామం ఉభయులకు సాధారణమైనందు వల్ల) తన చేత చేయించినందున ఈ స్తుతి నిర్దుష్టమైనది. రూపగుణాలలోనూ సర్వశ్రుతి మనోహరమైనది.

సాత్త్విక గుణశోభితులైన వ్యక్తులే భగవద్గుణ కీర్తనలను ఓర్పుతో సర్వదా అనుసంధానం చేస్తారు, వారే సద్గతిని పొందుతారు. "నైవాసురప్రకృతయః ప్రభవంతి బోద్ధుమ్" – అన్నట్లు అసుర స్వభావులకు రాక్షసాంతకుని రూపగుణాలే గిట్టవు. కాబట్టి సత్త్వగుణం ఉద్బుద్ధమైన మహానుభావులకు ఈ దయాస్తుతి సమ్మతమై మహానందాన్ని సమకూర్చుతుంది. మాలినీ వృత్త శ్లోకమిది.

పృథ్వీవృత్తం॥ **విశేష ఫలహేతువై విషయసౌష్ఠవం బొప్పగా**
నశేష జన సమ్మతం బగుచు వేంకటేశార్య స
ద్వశోనిధి సు జాతమై తనరు కావ్యమున్ దీని శే
ష శైల విభు సద్దయాస్తవము సాత్త్వికుల్ మెచ్చరే॥

106. శతక మిద ముదారం సమ్యగభ్య స్యమానాన్
వృషగిరి మధిరుహ్య వ్యక్తమాలోకయంతీ।
అనితరశరణానా మాధిరాజ్యేఽ భిషించేత్
శమిత విమత పక్షా శార్ఙ్గ ధన్వాఽ నుకంపా॥

అర్థం:- ఉదారం = ఉదారమైన; ఇదం = ఈ; శతకం = దయా శతకాన్ని; సమ్యక్ = బాగుగా; అభ్యస్యమానాన్ = మళ్ళీ మళ్ళీ నేర్చుకొనే వారిని; వృషగిరిం = వేంకటాద్రిని; అధిరుహ్య = ఎక్కి; వ్యక్తం = స్పష్టంగా; ఆలోకయంతీ = చూస్తున్న; శార్ఙ్గ ధన్వా + అనుకంపా = శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీనివాసుని యొక్క దయాదేవి; శమిత విమతపక్షా (సతీ) = శమింప జేయబడిన శత్రుపక్షాలను కలిగినదై; అనితర శరణానాం = దయైక శరణులైన ప్రపన్నుల; ఆధిరాజ్యే = మోక్షసామ్రాజ్య మందు; అభ్యషించేత్ = అభిషేకిస్తుంది.

తా: ఉదారమైన ఈ దయాశతకాన్ని పునః పునః ఆవర్తి చెప్పే వారిని వృషగిరి యందు అధివసించి యున్న శ్రీనివాసుని దయ పరిపూర్ణంగా కటాక్షిస్తున్నది. విరోధి పక్షాలను అణచివేస్తుంది. అకించనులైన శరణాగతుల మోక్ష సామ్రాజ్య పదవి యందు అభిషేకం చేస్తుంది.

వ్యాఖ్య: దయాశతకాన్ని చక్కగా అభ్యసించిన వారికి కలిగే ఫలం తెల్పబడుతున్నది.

శతకమిదముదారం:- దయాశతక ముదారమైనది. దయ అనేది నిరుపాధిక మైన ముఖ్యగుణం. "గుణ్యతే ఇతిగుణః" గుణింపబడేది. వేదం లాగా అభ్యసింప బడేది అని అర్థం. ఆమ్నాయమభ్యసింప బడినట్లే దయా స్తుతి మళ్ళీ మళ్ళీ ఆవృత్తి చేయదగినది. అందువల్ల సకల శుభఫలాలను ఈ శతకం ప్రసాదిస్తుంది.

సమ్యగభ్యస్యమానాన్ వృషగిరి మధిరుహ్య వ్యక్తమాలోకయంతీ:- శ్రద్ధతో మళ్ళీ మళ్ళీ చదివేవారికి ఉత్తరోత్తరంగా రసజ్ఞత వృద్ధిచెందుతుంది. నిత్యప్రత్యగ్రమైన భావాలు పెల్లుబుకుతుంటాయి. కాబట్టి, పదే పదే దయాస్తుతిని అనుసంధానం చేయడం వల్ల సమ్యక్త్వం అధికమవుతుంది. దయాదేవి యొక్క అనుగ్రహం సంపూర్ణంగా పరితలపైన కలుగుతుంది.

వృషగిరియందు - ఉన్నత ప్రదేశమందు అధిష్ఠించియున్న దయాదేవి యొక్క నిండు కటాక్షావలోకనం దిగువ స్థలాల యందున్న పాఠకుల మీద సులభంగా ప్రసరిస్తుంది.

శమిత విమత పక్షా శార్ఙ్గధన్వాఽనుకంపా:- "కవచాయితయా త్వయైవశార్ఙ్గీ విజయస్థానముపాశ్రితో వృషాద్రిమ్" (28) అన్న విషయమిక్కడ స్మరింప దగినది. దయాస్తుతిని జనులందరు పఠిస్తుంటే, వృషగిరియందు ఆశ్రయించియున్న శ్రీనివాసునికి విజయం సంపాదింపబడుతుంది. ఆ శ్రీనివాసుని దయా పూర్ణ దృష్టి చేత దండింపదగిన పాపాలన్నీ నశిస్తాయి.

అనితర శరణానా మాధిరాజ్యేఽభిషించేత్:- గత్యంతరం లేని ప్రపన్నులు భగవానుని సన్నిధిలో శరణాగతి చేస్తారు. దయాశతకాన్ని బాగా పఠించే భక్తుల మూర్ధాభిషేకంతో దేశికులు సమాప్తి చేస్తున్నారు. శార్ఙ్గ మనే ధనువును ధరించిన శ్రీనివాసుని యొక్క దయాదేవి వృషగిరి యందలి సెలయేర్ల రూపంలో ఉన్న తీర్థాల చేత దయా శతక పాఠకులను శరణాగతులకేర్పడిన మోక్ష సామ్రాజ్య పదవి యందు పట్టాభిషిక్తులను చేస్తుందని 'ఫలశ్రుతి' చెప్పబడింది.

'శార్ఙ్గధన్వాఽనుకంపా' - అనడం వల్ల శత్రు నిరసన సాధనమనే విశేషణం సాభిప్రాయమే. కాబట్టి పరికరాలంకారం. మాలినీవృత్తం.

పృథ్వీవృత్తం॥ దయైక శరణుల్ బుధోత్తములు శాస్త్రసారంబు నీ
దయాశతకమున్ బ్రయత్నమున జూడ శేషాద్రి రా
ద్దయా విషయభూతులై తనరి మోక్షసా మ్రాజ్య మ
వ్యయం బుగ భజింతురిందఖిల పాప నిర్ముక్తులై ॥

107. విశ్వానుగ్రహ మాతరం వ్యతిషజత్స్వర్గాపవర్గాం సుధా
సధ్రీచీ మితి వేంకటేశ్వర కవిర్భక్త్యా దయా మస్తుత ।
పద్యానా మిహ యద్విధేయ భగవత్సంకల్ప కల్పద్రుమాత్
ఝుంఝూ మారుత ధూత చూత నయతః సాంపాతి కోఽయంక్రమః॥

అర్థం:- విశ్వ+అనుగ్రహ మాతరం = అందరికీ సమస్త మనుగ్రహించే తల్లి యైనట్టి; వ్యతిషజత్ స్వర్గ + అపవర్గాం = కలిగిస్తున్న స్వర్గఫలం, మోక్షఫలం కల్గినట్టి; సుధా సధ్రీచీం = అమృతంతో సమానమైనట్టి; దయాం = భగవద్దయను; ఇతి = ఈ విధంగా; వేంకటేశ్వర కవిః = వేంకటనాథులనబడే కవి; భక్త్యా = భక్తిచే; అస్తుత = స్తుతించెను. ఇహ = ఈ శతకమందు; పద్యానాం = పద్యాల (శ్లోకాల) యొక్క; అయం = ఈ; క్రమః = క్రమం (విధానం); యత్+విధేయ, భగవత్, సంకల్ప కల్పద్రుమాత్ = ఏ దయకు వశుడైన శ్రీనివాసుని యొక్క, సంకల్పమనే కల్పతరువు నుంచి; ఝంఝా మారుత ధూత చూతనయతః = పెనుగాలిచే రాల్చబడిన మామిడిపండ్ల న్యాయంగా; సాంపాతికః = ఆపతితమయింది.

తా: అందటినీ అన్ని విధాలా అనుగ్రహించే తల్లియైన, స్వర్గం, మోక్షం అనే ఫలద్వయాన్ని ఇచ్చునట్టి; అమృత తుల్యమైన దయా దేవిని వేంకటేశ్వర కవి ఇట్లు భక్తి చేత స్తుతించాడు. ఈ శతకమందలి పద్యాల క్రమం దయాధీనమైన శ్రీనివాసుని సంకల్పమనే కల్పతరువు నుంచి పెనుగాలికి రాలిపడిన తీయని మామిడిపండ్ల వలె దైవికంగా కలిగినది.

వ్యాఖ్య: దయాధీనమైన భగవత్సంకల్ప ఫలమే దయాశతకం.

శ్రీనివాస భగవానుణ్ని స్తుతించక ఆయన దయను స్తుతించడానికి కారణం దయా దేవి యొక్క ప్రభావమని తెల్పబడుతున్నది.

(1) విశ్వానుగ్రహమాతరం:- విశ్వోపకారాన్ని చేసే తల్లి దయాదేవి. ఎవరికి ఏదీ అవసరమో వాటన్నిటినీ ఒకే సమయాన దయతో సమకూర్చే స్వభావం కల్గిన తల్లి వంటిది. విశ్వాన్ని అనుగ్రహించేది నిగ్రహమే ఎరుగని తల్లి. కార్యాకారణ రూపుడైన విశ్వాత్మనుకూడా అనుగ్రహించే శీలం కలది దయాదేవి. అందరిని ఒకే రీతిగా అనుగ్రహించే పరమచైతన్యం గల మాతృమూర్తి దయాదేవి.

(2) వ్యతిషజత్ స్వర్గాపవర్గామ్:- 'స్వర్గ' శబ్దం చతుర్ముఖ బ్రహ్మ పర్యంతమైన ఐశ్వర్యమనే అర్థమిస్తుంది. ధర్మం, అర్థం, కామం అనే త్రివర్గ ఫలమనే అర్థమూ బోధింపబడుతుంది. అపవర్గ మంటే మోక్షఫలమని అర్థం. ఈ శతకం యొక్క

ఉపక్రమ మందు "సూతిమపవర్గత్రివర్గయోః" అని చెప్పబడినట్లే, ఉపసంహారంలోనూ స్వర్గాపవర్గ ఫలాలను ప్రసాదించే శక్తి కలది దయాదేవి.

(3) సుధాసధ్రీచీమ్:- మాతృశబ్దం ఎంతో మధురమైనది. అమ్మ అంటే అమృత తుల్యమైనది. ప్రాణులను పోషించేది. అమృతం లాగా మృతసంజీవని కదా దయాదేవి.

ఇతి వేంకటేశ్వర కవిర్భక్త్యా దయామస్తుత:- అనుగ్రహ శీలత్వం, ఫలప్రదాన శక్తిమత్వమే కాక, దయాదేవి స్వస్వరూపం చేతనూ అమృత సదృశమైనందు వల్ల వేంకటనాథ కవి దయాదేవిని పరమభక్తిచేత స్తుతించాడు. కవిపేరు సూచింపబడి నందువల్ల ముద్రాలంకృత శ్లోకమిది.

పద్యానామిహ అయంక్రమః:- ఈ శతకమందు దయాస్తుతి చేయబడిన విధానమే ఒక నూతనమైన ప్రక్రియగా ఉంది. పాదుకా స్తుతివలె దయాస్తుతి కూడా కొత్త పద్ధతియే కదా! పద్యశతకాన్ని దశకాలుగా విభజించడమూ, ఒక్కొక్క దశకంలోనూ ఒక్కొక్క ఛందోవృత్త రచన చేత ఏర్పడిన సరసాలంకార శోభితమైన కవితాశైలి స్వబుద్ధిచేత ఏర్పడినది కాదని విశదీకరింపబడినది.

యద్విధేయ భగవత్సంకల్ప కల్పద్రుమాత్ ఝంఝామారుత ధూత చూతన యతః సాంపాతికః:- ఈ స్తోత్ర రచన భగవత్సంకల్పం చేత ఏర్పడినది. భగవానుని ఇచ్ఛ - సంకల్పం కూడా దయాధీనమైనదే. పెద్ద సుడిగాలి వీచినప్పుడు మామిడి చెట్టు మీద మాగిన పండ్లు నేల మీద రాలి పడడం దైవికంగానే భావింప బడుతుంది. అట్లే, దయా విధేయమైన భగవత్సంకల్పమనే కల్పతరువు నుంచి పెనుగాలి వీచడం వల్ల ఒకేసారి అనేక ఆమ్రఫలాలు నేలరాలినట్లు ఈ శతక పద్యాలు దైవికంగా వచ్చిపడినవే అని విశదపరచారు దేశికులు.

భగవత్సంకల్పమనే కల్పద్రుమాన్ని ఊగిపోయేరీతిగా కదిలించిందెవరు? దయాదేవియే ఝంఝామారుతమై భగవత్సంకల్పమనే కల్పతరువును ఒక్క ఊపు ఊపింది. మధురమైన రసాల ఫలాలు ఒకేసారి క్రమంగా రాలినట్లు శ్లోకాలు శతకమందు వచ్చి చేరినాయి.

భగవత్సంకల్ప కల్పతరువు నందు ఈ పద్యాలు గాలి వీచకముందే సిద్ధమై యున్నవని తెలుస్తున్నది. దయాదేవి ప్రేరణచేత సంకల్ప తరువు నుంచి రసవత్తరమైన శతక పద్య ఫలాలు ఆపాతతః చేరినందువల్ల దేశికులు వాటిని సంగ్రహించి లోకానికి అనుగ్రహించినట్లు తెల్పబడినది. దయా శతకం భగవత్సంకల్పాయత్తమని స్పష్టపరచబడినది. శార్దూల విక్రీడిత వృత్తమిది.

సీసం॥ కరుణా పరుండైన సురసార్వభౌముని
సంకల్ప కల్ప వృక్షంబు నుండి
పెనుగాలి దూలుచు తనయంత రాలిన
తియ్యమామిడి పండ్ల తీరుదోప
పద్యక్రమం బతి హృద్యమై యమరంగ
వేంకట నాథకవి ప్రవరుడు
ఘన గుణేశ్వరి జగజ్జనని త్రివర్గమో
క్ష ప్రదాయిని సుధా సదృశదయను
ఆ॥ సన్నుతించె భక్తి సంసర చ్చేతన
తతి హితంబు గోరి తచ్ఛతకము
హరి కృపార్థియగుచు నరసింహ కవియును
బరగ జెప్పెనాంధ్ర పద్యములుగ ॥

108. కామంసన్తు మిథః కరమ్బిత గుణా వద్యాని పద్యాని నః
కస్యాస్మిన్ శతకే సదమ్బుకతకే దోష శ్రుతిం క్షామ్యతి ।
నిష్ప్రత్యూహ వృషాద్రినిర్ఝర ఝరత్కారచ్ఛలే నోచ్ఛలన్
దీనాలంబన దివ్యదమ్పతి దయాకల్లోల కోలాహలః ॥

అర్థం:- నః = మాయొక్క; పద్యాని = పద్యాలు; మిథః కరంబిత గుణ+ అవద్యాని = పరస్పరం కలిసి యున్న గుణాలను, దోషాలను కలిగినవిగా; కామం, సంతు = ఉంటే ఉండనీ. నిష్ప్రత్యూహ వృషాద్రి నిర్ఝర ఝరత్కార చ్ఛలేన = నిరాటంకంగా వృషగిరి యందు ప్రవహించే గొప్ప సెలయేళ్ళ మ్రోత అనే వ్యాజం

చేత; ఉచ్ఛలన్ = విజృంభిస్తున్న; దీన+ఆలంబన దివ్యదంపతి దయా కల్లోల కోలాహలః = దీనులకు ఆశ్రయమైన దివ్యదంపతుల - పద్మాదేవి వేంకటేశ్వరుల - దయాంతరంగాల కోలాహల ధ్వని - గొప్ప అలల రవళి; సత్+అంబు కతకే = సాధువుల మనస్సు అనే జలాన్ని చిల్లగింజ లాగా తేట పరచునట్టి; అస్మిన్ = ఈ; శతకే = దయాశతకమందు; కస్య = ఎవని యొక్క; దోష శ్రుతిం = దోష ప్రకటనలను వినడాన్ని; క్షామ్యతి = సహిస్తుంది? ఎవరిదోషోద్ఘాటనాన్ని సహించదు - క్షమించదు; అణచివేస్తుందని భావం.

తా: ఈ దయాశతక మందలి పద్యాలు గుణదోషాలు కలిగియున్నవిగా ఉంటే ఉండుగాక. ఈ శతకం సదంబు కతకమే. అంటే సాత్త్వికుల చిత్తప్రసాదకమే. ఈ పద్యాలను ఎవ్వరైనను తప్పులు పట్టి దూషించినా, ఆ దూషణను విని సహిస్తుంది. దోషాలను ప్రకటించిన వారిని కూడా దండింపదు. దయాదేవి స్వరూప సౌశీల్యాలు ఎంతో ప్రశంసనీయమైనవి కదా! దోషోద్ఘాటకుల వాక్యాలను ఇతరులకెవ్వరికీ విన రాకుండా దీనుల కాలంబనగా ఉన్న దివ్యదంపతుల దయాంతరంగ ధ్వనులు వేంకటాద్రి మీద ప్రవహించే నిర్ఝరుల నుంచి పెల్లుబికే ఝుర ఝురమనే ధ్వనుల నెపం చేత అణచి వేస్తుంటాయి.

వ్యాఖ్య:- దయా శతకం శిష్టజనులచే పరిగ్రహింప యోగ్యమైనది.

తామసులు శతకంలో దోషాలున్నాయని ప్రకటిస్తే వారి మాటలను భగవద్దయా ప్రవాహ రూప నిర్ఝరుల మ్రోత చేత వినరాకుండా అణచివేసే మహోపకారకురాలు అని దయాదేవి ప్రభావాన్ని ప్రకటిస్తూ దేశికులీ ప్రబంధాన్ని ముగించారు.

కామం సంతు మిథః కరమ్బిత గుణావద్యాని పద్యాని నః:- దేశికులు మమత లేకుండా, పాఠకులలో నొకనిగా తమను భావించి 'నః' మా పద్యాలు అంటున్నారు. పద్యాలు గుణాలను దోషాలను రెండింటిని కలిగి ఉన్నాయి. గుణదోషాలు అన్యోన్యంగా సంమిశ్రితాలై ఉంటే ఉండుగాక. ఆ దోషాలు ఈ స్తోత్రాన్ని మహాజనులు పరిగ్రహించడానికి ప్రతిబంధకాలు కావు.

'స్తుతిరియమనవద్యా' - ఈ స్తోత్రం దయాధీనమైన భగవత్సంకల్పం చేత జనితమైనందున దోష రహితమైనదని (105) స్పష్టీకృతం. "యస్మిన్ ప్రతి శ్లోక మబద్ధవత్యపి" అన్న శ్రీ శుకసూక్తి స్మారితం.

భక్తితో రచించిన ఈ శతకమెలా ఉందని భక్తుణ్ని ఎవరైనా ప్రశ్నిస్తే, అంత మధురంగా ఉండకపోవచ్చు, బహుశః దోషపూర్ణమై యుండవచ్చు అని సులభంగా ఒప్పుకొంటాడు. దైవస్తుతి చేసినందువల్ల ఈ స్తోత్రం దేవునికి మాత్రం మధురంగానే ఉంటుందని భక్తుడు దృఢ విశ్వాసంతో తృప్తి పడుతాడు.

"తొండరడిప్పొడిశొల్, ఇళైయ పున్ కవితైయేలుమెంబిరార్కిని యవాతే" చిన్న పదాలతో దోషాలు గల రచనయే అయినా, మా రంగనాథునికి భోగ్యంగానే యున్నది. అని తొండర డిప్పొడి యాళ్వార్లు తమ 'తిరుమాలై' (45) అనే ప్రబంధాన్ని బాలుని మాటలను విన్న తల్లిదండ్రులు ఆనందించే విధంగా, భగవానుడు విని సంతోషించగలడనీ, ప్రపన్నునికి కావలసిన ప్రయోజన మంతకంటె వేరేమీ ఉండదని అభిప్రాయపడినారు.

దేశికుల వారు కూడా 'రహస్య త్రయసార'మనే తమ ప్రబంధంలో చివర ఇలాగే తమ ఆశయాన్ని ప్రకటించారు.

"కూనుళ నెంజు కళాఱ్కుత్త మెణ్ణియిక షిన్దిడినుమ్
తేనుళ పాదమలర్ తిరుమాలుక్కుత్తిత్తిక్కుమే ॥" (55)

వక్రబుద్ధి గల తామసులు గుణాలయందు దోషాలను ఆరోపించి ఉద్ఘాటించిన ప్పటికీ, ఈ ప్రబంధం మకరందం జాలువారే చరణారవిందాలు గల శ్రియః పతికి మాత్రం అత్యంత భోగ్యమయినది - అన్నారు. అలాగే, ఈ దయాస్తుతి విషయంలోనూ గుణదోషాలు ఉంటే ఉండుగాక "కామంసంతు" అని దేశికులు ఉద్ఘాటించారు.

సదంబుకతకేఽస్మిన్ శతకే:- దయా శతకం కతకమే. కతకమంటే చిల్లగింజ. చిల్లగింజ బురద నీటినితేట పరుస్తుంది. "తం సంతః శ్రోతుమిచ్ఛంతి సదసద్వ్యక్తి హేతవః" అని మహాకవి చెప్పినట్లు సజ్జనులు శతకంలోని మంచి చెడులను -

గుణదోషాలను వినగోరుతున్నారు కదా! విన్న వారి మనసులో ఏదైనా కల్మష మేర్పడితే, ఆ కల్మషాన్ని వేరు చేసి, వారి మనస్సును పరిశుద్ధం చేస్తుంది ఈ శతక కతకం. ఈ శతకం దోషశూన్యమైనది మాత్రమే కాదు. విమర్శకుల మనస్సును శోధించి స్వచ్ఛ పరచేది ఈ శతకం. సత్పురుషుల మనస్సు రమణీయమైన స్వచ్ఛ జలమే. రసరూపమైన సాత్త్వికుల చిత్తానికి చిల్లగింజ లాంటిది ఈ దయాశతకం.

"తీర్థీకుర్వంతి తీర్థాని" - సత్పురుషులు తమ నాశ్రయించిన వారిని తీర్థాల లాగా శుద్ధి చేస్తారు కాబట్టి సత్పురుషులు తీర్థంగా - సదంబుగా - చెప్పబడుతుంటారు. అట్టి సత్పురుషుల హృదయాలను కూడా ఈ స్తోత్ర శతకం ప్రసన్నం చేస్తుందని భావం.

సత్పురుషులు ప్రసన్న చిత్తులు కదా! వారి దర్శనమే పరమపావనమని చెబుతుంటారు కదా! మళ్ళీ వారికీ శతకం చిత్త ప్రసాదకమెట్లవుతుంది? అంటే, ఎంతటి మహాత్ములకైనా తాపత్రయాల చేత క్లేశ పంచకం - చిత్త మాలిన్యం - కలుగక మానదు. అటువంటి సమయాన ఈ శతకాన్ని అనుసంధానం చేస్తే చిత్త మాలిన్యం తొలగిపోతుంది. మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. ఈ స్తోత్ర శతకం సజ్జనులకు ప్రపత్తి విషయంలో కలిగే అనేక సంశయాలను ఛేదించే రీతిగా సూక్ష్మమైన శాస్త్రార్థాలతో నిండియున్నది. దయాదేవి యొక్క ప్రభావం బాగా బోధింప బడియుండడం వల్లనూ, సాత్త్వికుల హృదయాలను కూడా ఉత్తేజ పరుస్తుంది, ఉల్లసింపజేస్తుంది. కాబట్టి సదంబుకతక మీ శతకం.

'అసదంబుకతకే' అని పదవిభాగం చేస్తే, అసత్తులనే కలుషిత జలానికి కతకం లాంటిదని అర్థం చెప్పబడుతుంది. అసత్తులకు అంటే సాధుజనులు కాని వారు కూడా ఈ శతకాన్ని అనుసంధానం చేసినట్లైతే, వారికీ సద్గతిని కలిగిస్తుందని అర్థం.

కస్యదోషశ్రుతింక్షామ్యతి:- ఎవడైన నొకడు దోషాలను ప్రకటిస్తే దయాదేవి ఆ దోషాలను విని సహిస్తుంది. ఈ ప్రబంధంలో క్షమ ముఖ్యంగా వర్ణింప బడి యున్నదే కదా! దూషకుడు కదా అని భావించి దయాదేవి అతనిని దండింపదు. దయాదేవి యొక్క స్వభావం ఒకరిని నొప్పించక, తానొవ్వక యుండునట్టిదని

చిత్రంగా తెల్పబడుతున్నది. దోషాలను ప్రకటించే వ్యక్తి యొక్క ప్రయత్నాన్ని వ్యర్థం చేసే యుక్తి శక్తి కలది దయాదేవి.

నిష్ప్రత్యూహ వృషాద్రి నిర్ఝర ఝరత్కారచ్ఛలేనోచ్చలన్

దీనాలంబన దివ్యదంపతి దయా కల్లోల కోలాహలః:-

వేంకటాద్రి యందు నిరర్గళంగా ప్రవహించే సెలయేళ్ళ రూపంలో ఉన్నది శ్రీనివాసుని దయాదేవియే.

దుందుభి అంటే భేరీవాద్య ధ్వని ఎవనిమాటను చెవిని బడనీయదనే సూక్తి బృహదారణ్యకంలో ఉంది. కొండల్లో జలపాతాల సవ్వడికి ఎవడెంత గొంతెత్తి అరచినా ఇతరులకు వినరాకుండా ఉంటుందనడం నైసర్గికం. దయాశతకంలో దోషాలను కీర్తించే వాని ప్రయత్నాన్ని దయాదేవి క్షమిస్తుందా? దివ్యదంపతులు కూడా క్షమించలేరు కదా!

దోషోద్ఘాటకులను కరుణామయియైన దయాదేవి హింసించకుండా, వారి మాటలను ఇతరులకు వినరాకుండా అణచివేస్తుంది. దిక్కూ చక్కీ లేని వారికి ఆశ్రయంగా ఉండేది, సహాయ పడేది దివ్యదంపతి దయ. శ్రీశ్రియః పతుల దాంపత్య యోగం నిత్యమైనది కాబట్టి, శ్రీ దేవీసాన్నిధ్యం వల్లనే శ్రీనివాసుని యొక్క దయ చెంగలిస్తుంటుంది. వేగంగా ప్రవహించే కొండవాగుల గొప్ప సవ్వడుల నెపంతో దివ్యదంపతి దయాంతరంగ ఘోషలు విజృంభించి దయాశతక దూషకుల దూషణలను ఇతరులకు వినరాకుండా అణచివేయడం వల్ల, దయాశతకం, సర్వజన సేవ్యమై, సకల శుభప్రదమై విరాజిల్లుతున్నదని సారాంశం.

'సదంబు కతక' మన్న చోట రూపకాలంకారం

ఉ॥ దోషములున్ గుణంబులును దోచిన నేమిట పద్యముల్ సుహృ
త్తోషకరంబు లజ్ఞతను దూటిన శ్రీశదయా ప్రవాహని
ర్ఘోషము దూషకోక్తులను గ్రుంగగ జేయు వినంగ రాక, యా
శేషగిరీంద్ర నిర్ఝర విశేషరవంబుల కైతవంబునన్ ॥

కవితార్కిక సింహాయ కల్యాణ గుణశాలినే ।
శ్రీమతే వేంకటేశాయ వేదాన్త గురవే నమః ॥

కం॥ కవివాది కలభసింహుని
స్వవశీకృత సకలతంత్రు సజ్జన నుత వై
భవు వేదాన్తాచార్య
ప్రవరుని శ్రీ వేంకటేశు భజియింతు మదిన్ ॥

శ్రీమతే నిగమాన్త మహాదేశికాయ నమః

దయాశతకం సమాప్తం


ఇది శ్రీమాలోల నృసింహస్వామి కటాక్షపాత్ర, హరితసగోత్ర,
శ్రీమాన్ కారంచేటి తిరుమల మనోహరాచార్య
ప్రథమ పుత్ర, వేంకట రాఘవాచార్య విరచిత
ప్రతిపదార్థ, తాత్పర్య, అమృతా స్వాదినీ వ్యాఖ్యా
సమేత, శ్రీమద్వేదాన్త దేశికాను గ్రహీత దయా శతకమ్.

శ్రీ కె.వి. రాఘవాచార్యుల రచనలు



మాఘకావ్యవైభవమ్
గోదాస్తుతి - పరిమళవ్యాఖ్య

భగద్విషయం	-	అవతారక - ఆంధ్రానువాదం
భగవద్ధ్యానసోపానమ్	-	మనోరమావ్యాఖ్యానమ్
శ్రీమద్రామానుజులు	-	వర్ణాశ్రమ ధర్మాలు
శ్రీ రంగనాథపాదుకా సహస్రమ్	-	5 సంపుటాలు రమణీయాంధ్రటీకాతాత్పర్య వ్యాఖ్యాన సహితమ్
గరుడ దండకమ్	-	సుషమాంధ్రటీకాతాత్పర్య వ్యాఖ్య
ఆళ్వార్లు	-	భక్తి ప్రపత్తి మార్గాలు
శ్రీ నారాయణ శతకమ్	-	రాఘవీయ వ్యాఖ్య
దివ్యప్రబంధత్రయి	-	ఆంధ్రటీకాతాత్పర్య వివరణమ్
ద్రవిడోపనిషత్తా, త్పర్యరత్నావళి	-	ప్రకాశికా వ్యాఖ్య
శ్రీ సుదర్శనాష్టకమ్	-	జ్వాలా వ్యాఖ్య
శ్రీ రుక్మిణీ కళ్యాణమ్	-	వైష్ణవీ వ్యాఖ్య
చతుః శ్లోకి	-	దీపికా వ్యాఖ్య
యతిరాజసప్తతి	-	చంద్రికా వ్యాఖ్య
అభీతిస్తవమ్	-	సంజీవనీ వ్యాఖ్య
శ్రీస్తుతి	-	హిరణ్మయీ వ్యాఖ్య
దయాశతకమ్	-	అమృతాస్వాదినీ వ్యాఖ్య
శ్రీ వేదాన్తదేశిక దర్శనమ్		
యాదవాభ్యుదయమ్	-	సుబోధినీ వ్యాఖ్య (రచన సాగుతున్నది.)



శ్రీ మదహోబిల మఠం 45వ పీఠాధిపతులు

శ్రీ లక్ష్మీనృసింహ దివ్యపాదుకా సేవా

శ్రీవణ్ శఠకోప శ్రీ నారాయణ యతీన్ద్ర మహాదేశికన్

46వ పీఠాధిపతులు

శ్రీవణ్ శఠకోప శ్రీ రంగనాథ యతీన్ద్ర మహాదేశికన్